# సాంఘిక శాస్త్రం

## పదవ తరగతి

### సంపాదకులు


**శ్రీ అరవింద్ సర్దాన**
ఏకలవ్య,
మధ్యప్రదేశ్

**డా॥ కె. నారాయణ రెడ్డి,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, భూగోళశాస్త్రం విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

**ప్రొ॥ ఐ. లక్ష్మి,**
చరిత్ర విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

**ప్రొ॥ భూపేంద్ర యాదవ్**
అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీ,
బెంగుళూరు

**డా॥ కె. కైలాష్**
అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజనీతి శాస్త్ర విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్

**డా॥ చంద్రశేఖర్ బాలచంద్రన్**
కల్చరల్ జియోగ్రాఫర్, బెంగుళూరు

**డా॥ ఎన్. చంద్రాయుడు**
అసిస్టెంట్ ప్రొఫెసర్, భూగోళశాస్త్రం విభాగం,
ఎస్.వి. యూనివర్సిటీ, తిరుపతి

**ప్రొ॥ జి. ఓంకార్‌నాథ్,**
అర్థశాస్త్ర విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్

**శ్రీ సి.ఎన్. సుబ్రహ్మణ్యం,**
ఏకలవ్య,
మధ్యప్రదేశ్

**ప్రొ॥ కె. విజయబాబు**
చరిత్ర విభాగం,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్

**డా॥ ఎం.వి. శ్రీనివాసన్,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, డి.ఇ.యస్.యస్.హెచ్,
ఎన్.సి.ఇ.ఆర్.టి, న్యూఢిల్లీ

**శ్రీ కె. సురేష్,**
మంచిపుస్తకం,
హైదరాబాద్

**డా॥ సుకన్య బోస్**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఎన్.ఐ.పి.ఎఫ్.పి, న్యూ ఢిల్లీ

**శ్రీ అలెక్స్ ఎం. జార్జ్,**
ఏకలవ్య,
మధ్యప్రదేశ్


### పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి


**శ్రీ జి. గోపాల్ రెడ్డి**
సంచాలకులు,
యస్.సి.ఇ.ఆర్.టి.,
ఆం.ప్ర., హైదరాబాద్.

**డా॥ఎన్. ఉపేందర్ రెడ్డి**
ప్రొఫెసర్,
విద్యాప్రణాళిక – పాఠ్యపుస్తక విభాగం,
యస్.సి.ఇ.ఆర్.టి., ఆం.ప్ర., హైదరాబాద్.

**శ్రీ బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం,
ఆం.ప్ర., హైదరాబాద్.



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు**


విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

© Government of Andhra Pradesh, Hyderabad.

*New Edition*

*First Published 2014*

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Andhra Pradesh. We have used some photographs which are under creative common licence. They are acknowledged at later (page viii).

This Book has been printed on 70 G.S.M. S.S. Maplitho,
Title Page 200 G.S.M. White Art Card

Free Distribution by Government of Andhra Pradesh

*Printed in India*
at the Andhra Pradesh Govt. Text Book Press,
Mint Compound, Hyderabad,
Andhra Pradesh.

## రచయితలు

**శ్రీమతి యం. సత్యవతి రావు,** రిటైర్డ్, పి.జి.టి, రాజనీతి శాస్త్రం, ఆక్స్‌ఫర్డ్ ఎస్.ఎస్ స్కూల్, వికాసపురి, న్యూఢిల్లీ

**జి. ఆనంద్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి), భూగోళశాస్త్ర విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

**డా॥ ఎస్. వెంకటరత్నం,** అసిస్టెంట్ ప్రొఫెసర్, (పి.టి), చరిత్ర విభాగం, నిజాం కాలేజ్ (ఓయూ), హైదరాబాద్

**డా॥ టి. వెంకటేశ్వరరావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, చరిత్ర విభాగం, పి.జి. కాలేజ్ (ఓయూ), సికింద్రాబాద్

**శ్రీ మడితాటి నరసింహారెడ్డి,** జి.హెచ్.ఎం., జి.ప.ఉ. పాఠశాల, పెద్దజంగంపల్లి, వైఎస్ఆర్ కడప

**శ్రీ కె. లక్ష్మీనారాయణ,** లెక్చరర్, డైట్, అంగళూరు, కృష్ణా

**శ్రీ మల్యాల పాపయ్య,** లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్

**శ్రీ అయాచితుల లక్ష్మణరావు,** స్కూల్ అసిస్టెంట్, ప్ర.ఉ.పాఠశాల, ధనగర్‌వాడి, కరీంనగర్

**డా॥ రాచర్ల గణపతి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, లాదెల్ల, వరంగల్

**శ్రీ ఉండేటి ఆనంద కుమార్,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, సుజాతనగర్, ఖమ్మం

**శ్రీ పి. జగన్ మోహన్ రెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, పిడిచేడు, గజ్వేల్, మెదక్

**పి. రథంగపాణి రెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, పోల్కంపల్లి, మహబూబ్‌నగర్

**శ్రీ కొరివి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, యం.పి.యు.పి.ఎస్. టెక్కలి, శ్రీకాకుళం

**శ్రీ కాసం కుమారస్వామి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, దాదేపల్లి, ఆదిలాబాద్

**శ్రీ ఎన్.సి. జగన్నాథ్,** జి.హెచ్.ఎస్, కుల్సుంపుర, హైదరాబాద్

**శ్రీమతి బండి మరియారాణి,** స్కూల్ అసిస్టెంట్, ఎం.పి.యు.పి.ఎస్. చిలుకానగర్, రంగారెడ్డి

## సమన్వయం

**శ్రీ మల్యాల పాపయ్య,** లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్

**శ్రీమతి దుగ్గిరెడ్డి విజయలక్ష్మి,** లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్

## చిత్రకారులు

**శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్,** జి.హెచ్.ఎం., జి.ప.ఉ. పాఠశాల, కురిమేడు, నల్లగొండ

**శ్రీ కరేన్ హేడాక్,** ప్రొఫెసర్, హెచ్.బి.ఎస్.సి, ముంబయి

## గ్రాఫిక్ డిజైనింగ్

**శ్రీమతి యడ్లపల్లి వకుళా దేవి,** ఎస్.కె.వి. కలర్ స్ట్రీమ్, హైదరాబాద్

**శ్రీ కన్నయ్య దార,** ఎస్.సి.ఇ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్

# విద్యార్థులకు ఉత్తరం

ప్రియమైన యువ మిత్రులారా,

మీరు 21వ శతాబ్దంలో పెరుగు తున్నారు. త్వరలోనే మీరు పెద్దవాళ్లు అయ్యి, ఉద్యోగం చేస్తారు. ఎన్నికలలో ఓటు వెయ్యటం వంటి ప్రజా వ్యవహారాలలో పాల్గొంటారు. మన కాలంలో జీవితాలను నిర్దేశించే భావనలను, ప్రక్రియలు, వ్యవస్థలను అర్థం చేసుకోవలసిన సమయం ఇది. ప్రజల తీవ్ర పోరాటాలు, ఎన్నోత్యాగాలు కలసి పని చేయటం ద్వారా ఇవి రూపొందాయి. రాబోయే శతాబ్దాన్ని రూపు దిద్దటంలో మీరు కూడ ఇటువంటి పాత్రను పోషించాల్సి ఉంటుంది. గత శతాబ్ద ప్రజలు విభిన్న భావనలు, ప్రక్రియలు, వ్యవస్థలను ఎలా రూపొందించారో వివరించటం ద్వారా ఈ పుస్తకం మీకు కొంతైనా సహాయ పడుతుందని ఆశిద్దాం.

మీ తల్లి దండ్రులు, టీచర్లు ఈ పరిణామాల్లో పాలు పంచుకున్నారు. వాటికి ప్రేక్షకులుగా ఉన్నారు. ఆ కారణంగా ఇక్కడ పేర్కొన్న అనేక అంశాలపై వాళ్లకి విభిన్న, బలమైన అభిప్రాయాలు ఉండవచ్చు. గత శతాబ్దం గురించి తెలుసుకునే క్రమంలో ప్రజలకు భిన్నమైన దృక్పథాలు ఎందుకు ఉంటాయో కూడ అర్థం చేసుకుని మీ సొంత నిర్ణయాలకు రావాలి.

ఈ పుస్తకం రెండు భాగములలో ఉంది. మొదటి భాగం వనరుల అభివృద్ధి, సమానత గురించి, రెండవ భాగం సమకాలీన ప్రపంచం, భారతదేశానికి సంబంధించినది. " వనరుల అభివృద్ధి, సమానత" అన్న అంశము కింద మనము నివసిస్తున్న భూమిని ఎలా ఉపయోగించుకుంటున్నాం, ఎటువంటి ఉత్పాదక కార్యక్రమాలు చేపట్టాం అన్నవి ఉంటాయి. భూమి, దాని వనరులను మనము సరిగా ఉపయోగించుకున్నామా? ఉత్పాదక పని, వివిధ ప్రజల మద్య వాటి ఫలాల పంపిణీ వంటి అంశాలలో మనం సమాన న్యాయాన్ని, సుస్థిరతని సాధించామా?

"సమకాలీన ప్రపంచం, భారతదేశం" అన్న అంశం కింద గత శతాబ్దంలోని ప్రధాన ఘట్టాల ప్రభావాన్ని పరిశీలిస్తాం. మొత్తం ప్రపంచంలోనే కాక మన దేశంలో కూడ ఇటీవల కాలంలో జరిగిన వాటి గురించి చూస్తాం. విభిన్న ప్రయోజనాలతోనే కాకుండా ప్రజలు విభిన్న భావాలతో ప్రభావితమై కార్యాచరణకు పూనుకుంటారు. గత శతాబ్దంలో సోషలిజం, ఫాసిజం, జాతీయతావాదం, ఉదారవాదం వంటివి ప్రజల ఆలోచనలను, ఉమ్మడి కార్యాచరణను తీవ్రంగా ప్రభావితం చేసాయి. వీటిల్లో కొన్నింటి గురించి చదువుతాం.

పాఠశాల స్థాయిలోని పాఠ్య పుస్తకాలు సమకాలీన ఘటనలు, విధానాలు, రాజకీయాలను సాధారణంగా చర్చించవు. దీనికి కారణం వీటిని అర్థం చేసుకోవటం కష్టమని కాదు, వీటి పట్ల అభిప్రాయ బేధాలు తీవ్రంగా ఉంటాయి, ఫలితంగా అవి వైరుద్యాలకు దారితీయవచ్చని భావిస్తారు. అయితే ప్రజాస్వామిక ప్రపంచంలో జీవించటానికి మన తేడాలను, వైరుధ్యాలను పేర్కొనకపోవటం కాకుండా వాటితో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలి. మన నవ యువతకు రాజకీయ చర్చలు, విభేదాలను పరిచయం చేసే ప్రయత్నం ఈ పాఠ్య పుస్తకం చేస్తోంది. ఉపాధ్యాయుల, విద్యార్థుల, రాజకీయ సమూహాలు దీనిని సరైన స్ఫూర్తితో తీసుకున్నప్పుడు ఓరిమిని పాటించి భిన్న అభిప్రాయాలను సహనంతో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించినప్పుడు ఇది విజయవంతం అవుతుంది. ఈ పాఠ్యపుస్తకం ఒక దృష్టికోణాన్ని అనుసరించి మరొక దృష్టికోణాన్ని చాలినంతగా చూపలేదని అనిపించవచ్చు. పాఠ్యపుస్తకాల రచయితలు కూడ మనుషులే కాబట్టి, వాళ్లకి కూడ వాళ్లదైన ఒక అవగాహన ఉంటుంది. కాబట్టి ఇది అని వార్యమౌతుంది. అలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు పుస్తకంలో ఉన్నదే సరైనది అన్న భావం కల్గించకుండా అందుకు భిన్న మైన దృష్టికోణాన్ని కూడ విద్యార్థులకు టీచర్లు పరిచయం చెయ్యాలి. ఈ విషయాలపై మరింత అవగాహన ఏర్పడటానికి విద్యార్థులను దినపత్రికలు, వార పత్రికలు వంటివి చదవమని, బహిరంగ సభలకు హాజరు కమ్మని ప్రోత్సహించాలి.

ఈ దృష్ట్యా తెలుసుకోవాలన్న అన్వేషణకు ఈ పుస్తకం ఆరంభంగా ఉండాలి తప్పించి, ముగింపుగా కాదు.

పుస్తకాలు ఇతరులు ఏం ఆలోచించారో, చేశారో మాత్రమే చెబుతాయి. అంతిమంగా మీ అవగాహన, అభిప్రాయాలకు మీరే రావాలి. మీరు చదివే సామాజిక సమస్యల గురించి మీరు ఏం చెయ్యాలో నిర్ణయించుకోవాలి. ఈ సమాజాన్ని అర్థం చేసుకోవాల్సిన బాధ్యత దానిని మెరుగ్గా తీర్చి దిద్దే బాధ్యత కూడా మీమీదే ఉంది. దీంట్లో ఈ పుస్తకం మీకు సహాయ పడుతుందని మా ఆశ.

**– సంపాదకులు**

## ఈ పుస్తకం గురించి....

మీ చుట్టూ ఉన్న సమాజాన్ని అధ్యయనం చేసే ప్రక్రియలో భాగంగా, సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళికలో భాగంగా ఈ పుస్తకం రూపొందింది. ఇది ఆ విద్యా ప్రణాళికలో ఒక చిన్న భాగం మాత్రమే. సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళిక మీకు తెలిసిన అంశాలను తరగతి గదిలో నలుగురితో పంచుకోవడానికి, విశ్లేషించుకోవడానికి దోహదపడుతుంది. సమాజంలోని వివిధ అంశాలను అలా ఎందుకు ఉన్నాయని ప్రశ్నించడానికి, సమస్యలు ఇలా ఎందుకున్నాయి అని ఆలోచించడానికి సాంఘికశాస్త్రం ఉపయోగపడుతుంది. మీరు మీ స్నేహితులు తరగతి గది నుండి బాహ్య ప్రపంచంలోని బజారు, పంచాయితీ, మున్సిపాలిటీ, పల్లె సీమలోని పొలాలు, దేవాలయాలు, మసీదులు, వస్తు ప్రదర్శనశాలలు (మ్యూజియం), ఇంకా ఎన్నో అంశాలను తెలుసుకోవటానికి పురి కొల్పుతుంది. రైతులు, దుకాణదారులు, ఉద్యోగులు, దైవ కార్య నిర్వాహకులు మొదలైన వారందరితో కలిసి చర్చించే అవకాశాన్ని ఈ పుస్తకం కల్పిస్తుంది.

ఈ పుస్తకం మీముందు ఎన్నో సమస్యలను ఉంచి వాటిని అధ్యయనం చేసి అర్థం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఈ పుస్తకంలో అన్ని ప్రశ్నలకు జవాబులు ఉండవు. మీరు ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనాలి. నిజానికి ఇది సంపూర్ణమైన గ్రంథం కాదు. మీ స్నేహితుల, ఉపాధ్యాయుల అనుభవాలు, సందేహాలను విడమర్చి చర్చించి జోడించినప్పుడు పరిపూర్ణత్వం కలుగుతుంది. పుస్తకంలోని చాలా అంశాలతో మీరు విభేదించవచ్చు, సంకోచం లేకుండా కారణాలను తెలపవచ్చు, చివరగా స్వయంగా పరిష్కారాన్ని పొందవచ్చు. అలా పొందిన సమాధానాన్ని తరచి చూడాలనిపిస్తే ప్రశ్నలన్నింటిని జాగ్రత్తగా ఒక పట్టికగా తయారు చేసి స్నేహితుల, ఉపాధ్యాయుల, పెద్దవాళ్ళ సహాయాన్ని ఆర్థించి స్థిరమైన నిర్ణయాన్ని తీసుకొనండి.

ఈ తరగతిలో మనం ప్రధానంగా సమకాలీన ప్రపంచ నేపథ్యంలో భారత దేశం గురించి అధ్యయనం చేస్తాము. రెండు ప్రపంచ యుద్ధాలు, అనేక దేశాలు స్వతంత్రం పొందటం, న్యాయమైన, సమ సమాజ, ప్రజాస్వామిక ప్రపంచాన్ని నిర్మించటంలో అనేక గొప్ప ప్రయోగాలు చోటు చేసుకున్న గత వంద సంవత్సరాలు ఎన్నో మార్పులను చూశాయి.

స్వాతంత్ర్యం పొందిన తరువాత భారతదేశం పేదరికాన్ని తొలగించే ఉద్దేశ్యంతో ఆర్థికాభివృద్ధి సాధించటం, ఆహార ధాన్యాలు, పారిశ్రామిక వస్తువుల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవటం, దేశంలో అర్థవంతమైన ఉపాధిని కల్పించటం వంటి లక్షాలతో ప్రకృతి వనరులను వినియోగించుకునే విధానాలను అనుసరించింది. వ్యక్తిగత స్వాతంత్ర్యం, స్వేచ్ఛలకు హామీ ఇస్తూ, అతి పెద్ద ప్రజాస్వామ్యంగా రూపొందాలన్న ఉదాత్త ఆశయం కూడా ఎంతో ముఖ్యమైనది. భారతదేశ అభివృద్ధికి సంబంధించిన ఆర్థిక విధానాన్ని, రాజ్య తంత్రాన్ని అధ్యయనం చేస్తాం. ఈ అంశాలు మన జీవితాలలో కాకుండా సమాజంలోని విభిన్న వర్గాలకు విభిన్న రకాలుగా ప్రభావితం చేస్తాయి కాబట్టి వీటిపై భిన్న దృక్పథాలు ఉండటం సహజం. ఈ భిన్న దృక్పథాలను ఎదుర్కోవటం, సున్నితత్వంతో వాటిని అర్థం చేసుకోటానికి ప్రయత్నించటం మనం తరగతి గదిలో నేర్చుకోవాలి. మన ప్రజాస్వామిక సమాజాన్ని బలోపేతం చెయ్యటానికి ఇది ఎంతైనా అవసరం.

ఈ పుస్తకంలోని పాఠాలను త్వరితంగా పూర్తి చేయడం కంటే ఇచ్చిన ప్రశ్నలు, కృత్యాలను సమర్థవంతంగా నిర్వహించడం అవసరం. ఈ పాఠ్య పుస్తకాన్ని చదువుతున్నప్పుడు మీకు ఎన్నో ప్రశ్నలు, కృత్యాలు ఎదురవుతుంటాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలకోసం ప్రయత్నించాలి. ఇచ్చిన కృత్యాలను, ప్రాజెక్టులను చేసిన తరవాతనే తదుపరి పాఠ్యాంశంలోకి వెళ్ళాలి.

చాలా పాఠాలలో ప్రాజెక్టు పనులు ఉన్నాయి. వాటిని నిర్వహించడానికి కొన్ని రోజులు పడుతుంది. ఇవి సాంఘిక శాస్త్రంలో విషయ సేకరణకు, విశ్లేషణకు, ప్రదర్శనకు కావలసిన నైపుణ్యాలను పెంపొందిస్తాయి.

పాఠంలో ఉన్న దానిని బట్టీపట్టడం కాకుండా వాటిని గురించి ఆలోచించి స్వీయ అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవాలి.

ఇట్లు

**సంచాలకులు,**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆం. ప్ర.

హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

## ఈ పుస్తకాన్ని ఉపయోగించటంలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచనలు

ఈ పుస్తకం జాతీయ, రాష్ట్ర పాఠ్య ప్రణాళికా చట్రానికి అనుగుణంగా ఉంది, పదో తరగతి తరవాతే విషయవారీ విభజన చేయాలని ఇవి చెబుతున్నాయి. భౌగోళికశాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం అని వివిధ విభాగాల కింద ఇంతవరకు బోధిస్తూ వచ్చారు. అయితే, వీటిల్లో చర్చించే అంశాలు ఒకదానితో ఒకటి మిళితమై ఉండేవి.

- ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠ్యపుస్తకాన్ని తరగతికి తెచ్చి దాని ఆధారంగా నేర్చుకునేలా దీనిని తీర్చిదిద్దాం. పాఠ్యపుస్తకాన్ని తరగతి గదిలో చదివి, చర్చించటం చాలా ముఖ్యం.
- **పాఠాలలో భాష:** పిల్లలకు తేలికగా అర్థమయ్యేలా పాఠాలు రాసే ప్రయత్నం చేశాం. అయితే వివరణ, స్పష్టత ఇవ్వాల్సిన కొన్ని పదాలు ఉన్నాయి. చర్చిస్తున్న భావనకు సంబంధించి ఉదాహరణలు ఇవ్వటానికి ప్రయత్నించాం. ప్రతి అధ్యాయంలో కొన్ని కీలక భావనలు ఉన్నాయి. వీటిని సాధారణంగా ఉపశీర్షికలుగా ఇచ్చాం. ఒక కాలాంశములో దాదాపు 2-3 ఉపశీర్షికలు బోధించటానికి వీలవుతుంది.
- ఈ పాఠ్య పుస్తకంలో భిన్న రచనా శైలులు ఉపయోగించారు. నరసింహ, రాజేశ్వరి వంటి కల్పిత కథనాలు 3వ పాఠంలో ఇచ్చారు. దీని ద్వారా విద్యార్థులు వారి జీవన పరిస్థితులు - పని పరిస్థితుల మధ్యగల తేడాను అర్థం చేసికొంటారు. సమాజంలోని వాస్తవాలను ప్రతిబింబిస్తాయి. 9వ పాఠంలో రాంపురం గ్రామ ఆర్థిక వ్యవస్థను చదివి, ఆ గ్రామ పరిస్థితులను తమ గ్రామ ఆర్థిక పరిస్థితితో పోల్చి అవగాహన చేసికొంటారు. 6,8,9,11,12 పాఠాలలో పట్టికలు, పై చార్టులు, బార్ గ్రాఫ్‌లు ఇవ్వడమైనది. వీటిని విద్యార్థులచే విశ్లేషింపజేసి చర్చ నిర్వహించడం ద్వారా వివిధ అంశాలపై ఒక నిర్ణయానికి రావాలి.

  దిగువ తరగతుల్లో ప్రకృతి విపత్తులు, మహిళా రక్షణ చట్టాలు, సమాచార హక్కు, చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి కొంతవరకు చర్చించారు. ఈ సంవత్సరం 22వ పాఠంలో సమాచారహక్కు చట్టం గురించి చదివి ప్రభుత్వం యొక్క వివిధ శాఖలు, పౌరుల పాత్ర మరియు బాధ్యత ఏమిటి అనే విషయం అర్థం చేసి కొంటారు.
- **పాఠం మధ్య, పాఠం చివరి ప్రశ్నలను ఉపయోగించటం:** పాఠం మధ్యలో ప్రశ్నలు ఉండటం మీరు గమనించి ఉంటారు. ఈ ప్రశ్నలను వదిలిపెట్టవద్దు. బోధన - అభ్యసన ప్రక్రియలో ఇవి అంతర్భాగం. ఇవి భిన్నమైన ప్రశ్నలు. మీరు చదివిన అంశాలను క్రోడీకరించటానికి, అంచనా వేయటానికి కొన్ని ప్రశ్నలు ఉపయోగపడతాయి లేదా అంతకు ముందు ఉపశీర్షికలో చదివిన దానికి సంబంధించి మరికొంత సమాచారం సేకరించటానికి మరికొన్ని ప్రశ్నలు ఉపయోగపడతాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు మీరు చెప్పవద్దు. తమంతట తాము సమాధానాలు కనుక్కోవటానికి విద్యార్థులకు అవకాశం ఇవ్వండి. ఈ ప్రశ్నలను అర్థం చేసుకోవటానికి, సమాధానాల గురించి ఒకరితో ఒకరు చర్చించుకోవటానికి విద్యార్థులను అనుమతించండి.
- **ఈ పుస్తకంలో వివిధ రకాల ప్రశ్నలు ఉన్నాయి:**

  1) విద్యార్థులను తమ అనుభవాలను రాయమనటం.
  2) పాఠంలో ఇచ్చిన ఉదాహరణలతో తమ అనుభవాలను పోల్చమనటం.
  3) పాఠ్యపుస్తకంలో ఇచ్చిన రెండు-మూడు పరిస్థితులను పోల్చమనటం.
  4) ఒక కేస్ స్టడీ లేదా పరిస్థితిపై తమ అభిప్రాయం తెలియచేయమనే ప్రశ్నలు (విద్యార్థుల అభిప్రాయాలు అడిగినప్పుడు అవి అందరివీ ఒకే రకంగా ఉండాలని లేదు, అందరినీ తమతమ అభిప్రాయాలను వ్యక్తపరచనివ్వండి.
  5) పాఠంలో వివరించిన పరిస్థితిని మూల్యాంకనం చేసే ప్రశ్నలు.

- తరగతి గదిలో ఈ ప్రశ్నలను ఉపాధ్యాయులు భిన్న రీతులలో ఉపయోగించుకోవచ్చు. కొన్ని ప్రశ్నల సమాధానాలు నోటు పుస్తకంలో రాయించవచ్చు. కొన్నింటిని చిన్న బృందంలో చర్చింపచేయవచ్చు. కొన్నింటిని వ్యక్తిగత కృత్యాలుగా మలచవచ్చు. అన్ని సందర్భాలలోనూ విద్యార్థులను తమ సొంత మాటలలో రాసేలా ప్రోత్సహించండి. అందరు విద్యార్థులు మూసపోతలాగా ఒకే సమాధానం రాసేలా సూచనలు ఇవ్వవద్దు.
- **ప్రతి పాఠంలో చుట్టూ గీతలతో కొంత సమాచారం ఉంది:** పాఠంలో చర్చించిన భావనలకు అదనపు సమాచారాన్ని ఇవి తరచూ ఇస్తాయి. వీటిని తరగతిలో చర్చించటం చాలా ముఖ్యం వాటి చుట్టూ కృత్యాలను కూడా రూపొందించండి. అయితే వీటిని మూల్యాంకనంలో భాగం చేయవద్దు.
- **పాఠ్యపుస్తకంలో ఉపయోగించిన చిత్రాలు:** సంప్రదాయ పాఠ్యపుస్తకాలలో చిత్రాలు పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దటానికి ఉపయోగపడతాయి. అయితే ఈ పుస్తకంలో పాఠానికి ఉన్నంత ప్రాముఖ్యత చిత్రాలకు కూడా ఉంది. కథనానికి చిత్ర రూపం ఇవ్వటానికి "రాంపురం: గ్రామ ఆర్థిక వ్యవస్థ" పాఠంలో మాదిరి కొన్ని చిత్రాలు ఉండవచ్చు. వివిధ రాజకీయ ఉద్యమాలలోని నేతల చిత్రాలు ఇచ్చి ఉండవచ్చు. మిగిలిన అన్ని సందర్భాలలో పాఠం ఎంత ముఖ్యమో, చిత్రాలు కూడా అంతే ముఖ్యం. ఇవి భావనలను వివరించటానికి ఉపయోగపడతాయి, లేదా పాఠ్యాంశంలోని భావానికి చిత్రరూపం ఇస్తాయి. అనేక రకాల చిత్రాలను ఉపయోగించటానికి ప్రయత్నించాం: ఫోటోలు, రేఖా చిత్రాలు, వ్యంగ్య చిత్రాలు, గోడ పత్రికలు మొదలైనవి. ఇవి వివిధ చారిత్రక కాలాలకు సంబంధించినవి. భాషలోని శైలి, వైవిధ్యత మాదిరిగానే చిత్రాలలో సైతం వైవిధ్యత ఉంది.
- **పటాలు, పట్టికలు, రేఖా చిత్ర పటాలు:** ఈ పుస్తకంలోని పటాలు మనకు భౌగోళిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక అంశాలను తెలియచేస్తాయి. విషయాన్ని ఆసక్తిగొలిపే రీతిలో తెలియచేయటానికి వీటిని ఉపయోగించాం. పట్టికలు, రేఖా చిత్ర పటాలు కూడా మీకు కనపడతాయి. పట్టికలను, రేఖా చిత్ర పటాలను చదవటం సామాజిక శాస్త్రాలలో తప్పనిసరి. భావనలను వివరించటంలో ఇవి తరచు మరింత స్పష్టతను ఇస్తాయి.
- **ప్రాజెక్టు పనులు:** పుస్తకంలో వివిధ ప్రాజెక్టు పనులను సూచించాం. అన్ని ప్రాజెక్టులను చేపట్టటం సాధ్యం కాకపోవచ్చు. పాఠ్యపుస్తకం చదవటం ద్వారా అంశాల యొక్క అన్ని భావనలను బోధించలేం. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులకు సమాజంలోని వ్యక్తులతో వ్యవహరించటం తెలుస్తుంది, కొత్త సమాచారం సేకరించి తమదైన పద్ధతిలో అమర్చి ప్రదర్శిస్తారు. ముఖాముఖికి ప్రశ్నలు తయారుచేయటం, బ్యాంకు సందర్శనకు ఏర్పాట్లు చేయటం, తాము సేకరించిన సమాచారాన్ని చిత్రాలు, పట్టికలు లేదా రేఖాచిత్ర పటాలతో గణాంకాలు ఉపయోగించి అందరికీ తెలియచేయటానికి సిద్ధం కావటం వంటివి సామాజిక శాస్త్రాల నైపుణ్యాలలో ముఖ్యమైనవి. ఇవి బృందాలలో పని చేయటానికి, ఒకరి వివరాలు, అభిప్రాయాలు మరొకరితో పంచుకోవటాన్ని ప్రోత్సహిస్తాయి.


## కృతజ్ఞతలు

పూనేలోని SOPPECOM సభ్యులైన శ్రీ కె.జె.జాయ్ గారికి, భోపాల్‌లో వైద్యవృత్తిలో ఉన్న డా॥ హోమెన్ థాన్‌గ్యాం గారికి, హైద్రాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయమునకు చెందిన డా॥ అజయ్ నిమామై గారికి, శ్రీరంజన్‌రావు ఎర్దూర్ బెంగళూరు గారికి, శ్రీమతి కె. భాగ్యలక్ష్మి మంచి పుస్తకం హైదరాబాదు గారికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయ సంచాలకులు, పరిశోధనా విభాగ సిబ్బందితో పాటు మేము నిర్వహించిన కార్యశాలల్లో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పాల్గొని ఈ పాఠ్య పుస్తకంలోని పాఠాలను మెరుగు పరచటంలో దోహదపడిన వారందరికి కృతజ్ఞతలు. అదే విధంగా డా॥ కరేన్ హేడాక్ గారి వివరణాత్మక చిత్రాలు, NCERT పాఠ్యపుస్తకాలలోని సమాచారం ఈ పుస్తకంలో వినియోగించాం, వారికి ధన్యవాదాలు. ఈ పుస్తకంలో ఉపయోగించిన కొన్ని చిత్రాలు ఫ్లికర్, వికీపీడియా, ఇతర అంతర్జాల వనరుల నుండి సృజనాత్మక ఉమ్మడి లైసెన్సుకు లోబడి తీసుకున్నాం.

# విద్యా ప్రమాణాలు

పాఠంలోని అంశాలు విద్యార్థులకు అర్థమయ్యేందుకు తగినంత సమయం వెచ్చించాలి. మధ్య, మధ్యలో ఉన్న ప్రశ్నలు ఇందుకు ఉపయోగపడతాయి. ఇవి భిన్నమైన ప్రశ్నలు: హేతువు, కారణ-కార్యం, సమర్థన, మేథోపటం/ భావనల పటం, పరిశీలన, విశ్లేషణ, ఆలోచన, ఊహ, సమాలోచన, వ్యాఖ్యానం వంటి వాటికి సంబంధించినవి. ముఖ్యమైన భావనలను ప్రతి అధ్యాయంలోనూ ఉదాహరణలతో చర్చించారు, కీలక పదాలుగా కూడా ఇచ్చారు.

**1) విషయావగాహన:** విచారణ, చర్చ, సమాలోచనలు, కేస్ స్టడీల ద్వారా ఉదాహరణలు, వ్యాఖ్యానం, పరిశీలనవంటి వాటి ద్వారా మౌలిక భావనల అధ్యయనాన్ని ప్రోత్సహించటం.

**2) పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం:** అప్పుడప్పుడూ నేరుగా భావనలను తెలియచేయని రైతుల, కార్మికుల కేస్ స్టడీలు, కొన్ని చిత్రాలు ఉంటాయి. వీటిని అర్థం చేసుకోవటానికి, చిత్రాలను వ్యాఖ్యానించటానికి విద్యార్థులకు తగినంత సమయం ఇవ్వాలి.

**3) సమాచార నైపుణ్యాలు:** సామాజిక శాస్త్రాల విధానాలన్నింటినీ కేవలం పాఠ్యపుస్తకాలు చర్చించలేవు. ఉదాహరణకు పట్టణ ప్రాంతంలో ఉన్న పిల్లలు తమ ఎన్నికైన ప్రజా ప్రతినిధుల గురించి, పల్లెప్రాంతాలలో ఉండే పిల్లలు తమ ప్రాంతంలోని చెరువు/ సాగునీటి సౌకర్యాల గురించి సమాచారం సేకరించవచ్చు. ఈ సమాచారమూ, పాఠ్యపుస్తకాలలో ఇచ్చినదీ ఒకటిగా ఉండకపోవచ్చు. దీనిని వివరించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని తెలియ చెప్పటం కూడా ముఖ్యమైన సామర్థ్యం అవుతుంది. ఉదాహరణకు చెరువుకు సంబంధించి సమాచారం సేకరిస్తే లిఖిత నివేదికతోపాటు చిత్రం లేదా పటం జోడించవచ్చు. సేకరించిన సమాచారాన్నే చిత్రాలు, గోడ పత్రికల రూపంలో ప్రదర్శించవచ్చు. సమాచార సేకరణ, క్రోడీకరణ, విశ్లేషణ వంటివి కూడా సమాచార నైపుణ్యాలు అవుతాయి.

**4) సమకాలీన (సామాజిక/ సాంఘిక) అంశాలపై ప్రతిస్పందన - ప్రశ్నించటం:** తమ జీవన ప్రమాణాలను వివిధ ప్రాంతాల, వివిధ కాలాల ప్రజల జీవన ప్రమాణాలతో పోల్చేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఈ పోలికల సందర్భంలో తలెత్తే ప్రశ్నలకు ఒకే సమాధానం ఉండకపోవచ్చు.

**5) పటనైపుణ్యాలు:** ఈ పాఠ్యపుస్తకంలో వివిధ రకాల పటాలు, చిత్రాలు ఉన్నాయి. ప్రదేశాలకు సంబంధించి పటాలు నైరూప్య చిత్రణలు అని అర్థం చేసుకుని దానికి సంబంధించి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. దీంట్లో వివిధ దశలు ఉన్నాయి. గత తరగతుల్లో ఎత్తు, దూరాలను పటంలో ఎలా చూపించాలో తెలుసుకున్నాం. సమతల ఎత్తుల గురించి ఈ తరగతిలో తెలుసుకుంటాం. పాఠ్యపుస్తకంలో వివిధ చిత్రాలు, ఫోటోలు, గోడ పత్రికలు ఉన్నాయి. ఇవి కేవలం అందం కోసం పొందుపరచినవి కావు, పాఠానికి సంబంధించినవి. చిత్రాలకు సంబంధించి కూడా కొన్ని కృత్యాలు ఉన్నాయి.

**6) ప్రశంస/ అభినందన - సున్నితత్వం:** భాష, సంస్కృతి, కులం, మతం, స్త్రీ-పురుషుల విషయాలలో మన దేశంలో ఎంతో వైవిధ్యత ఉంది. సామాజిక శాస్త్రం ఈ వైవిధ్యతలను పరిగణనలోకి తీసుకుంటుంది, వీటి పట్ల సున్నితత్వం ప్రదర్శించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

## విషయసూచిక


| క్ర.సంఖ్య | విషయము | పేజీ నెం. | పీరియడ్లు | నెల |
|---|---|---|---|---|
| | **భాగం-I : వనరుల అభివృద్ధి, సమానత** | | | |
| 1 | భారతదేశం : భౌగోళిక స్వరూపాలు | 1-13 | 8 | జూన్ |
| 2 | అభివృద్ధి భావనలు | 14-27 | 8 | జూన్/జులై |
| 3. | ఉత్పత్తి, ఉపాధి | 28-43 | 6 | జులై |
| 4 | భారతదేశ శీతోష్ణస్థితి | 44-57 | 10 | ఆగష్టు |
| 5 | భారతదేశ నదులు, నీటి వనరులు | 58-70 | 10 | ఆగష్టు |
| 6 | ప్రజలు | 71-86 | 6 | అక్టోబరు |
| 7 | ప్రజలు – నివాసప్రాంతాలు | 87-100 | 6 | అక్టోబరు |
| 8 | ప్రజలు – వలసలు | 101-114 | 7 | అక్టో/నవ |
| 9 | రాంపురం : గ్రామ ఆర్థిక వ్యవస్థ | 115-129 | 6 | డిసెం/జన |
| 10 | ప్రపంచీకరణ | 130-144 | 4 | జనవరి |
| 11 | ఆహార భద్రత | 145-158 | 4 | జనవరి |
| 12 | సమానత – సుస్థిర అభివృద్ధి | 159-175 | 5 | ఫిబ్రవరి |
| | **భాగం-II : సమకాలీన ప్రపంచం, భారతదేశం** | | | |
| 13 | ప్రపంచ యుద్ధాల మధ్య ప్రపంచం1900-1950 : భాగం-I | 176-186 | 12 | జులై |
| 14 | ప్రపంచ యుద్ధాల మధ్య ప్రపంచం1900-1950 : భాగం-II | 187-201 | 12 | జులై/ఆగ |
| 15 | వలస పాలిత ప్రాంతాలలో జాతి విముక్తి ఉద్యమాలు | 202-217 | 12 | సెప్టెంబర్ |
| 16 | భారతదేశ జాతీయోద్యమం-దేశ విభజన, స్వాతంత్ర్యం : 1939-1947 | 218-231 | 8 | సెప్టె/అక్టో |
| 17 | స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం | 232-247 | 8 | నవంబరు |
| 18 | స్వతంత్ర భారతదేశం(మొదటి ముప్పై సంవత్సరాలు-1947-1977) | 248-263 | 8 | నవంబరు |
| 19 | రాజకీయ ధోరణుల ఆవిర్భావం : 1977-2000 | 264-281 | 10 | డిసెంబరు |
| 20 | ప్రపంచ యుద్ధాల తరువాత ప్రపంచం, భారతదేశం | 282-297 | 9 | డిసెంబరు |
| 21 | సమకాలీన సామాజిక ఉద్యమాలు | 298-313 | 6 | ఫిబ్రవరి |
| 22 | పౌరులు, ప్రభుత్వాలు | 314-324 | 5 | ఫిబ్రవరి |


గమనిక : పైన సూచించిన పీరియడ్‌లు, నెలలు తాత్కాలిక ప్రాతిపదికపై రూపొందించబడినవి. కావున ఉపాధ్యాయులు వీనిని అటుఇటుగా మార్చుకోవచ్చు.

# జాతీయ గీతం

*– రవీంద్రనాథ్ ఠాగూర్*

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధ్, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగ!
వింధ్య, హిమాచల, యమునా, గంగ!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.

ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## భారత రాజ్యాంగ పీఠిక

**భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి; ఈ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని; ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని; అంతస్తుల్లోను, అవకాశాల్లోను సమానత్వాన్ని; చేకూర్చుటకు; వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని; పెంపొందించడానికి; 1949 నవంబర్, 26న మన రాజ్యాంగ పరిషత్తులో ఎంపిక చేసికొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకున్నాం.**

# భారతదేశం : భౌగోళిక స్వరూపాలు

## పాఠం 1

ఈ అధ్యాయంలో మనం భారతదేశ భౌగోళిక స్వరూపాల గురించి తెలుసుకుంటాం. తరవాత రాబోయే అధ్యాయాలలో భారతదేశ శీతోష్ణస్థితులు, నదులు, నీటివనరులు, ప్రజలు మొదలైన అంశాలు దేశ భౌతిక పరిసరాలతో ఏవిధంగా అనుబంధాన్ని కలిగి ఉంటాయో అధ్యయనం చేస్తాం. దేశంలో మీకు చూడాలని ఉన్న రెండు ప్రాంతాలు, కారణాలు చెప్పండి. ఇంతకు ముందు తరగతులలో మీరు ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్వరూపాల గురించి ఏమి తెలుసుకున్నారు? గోడ పటం, లేదా అట్లాసు సహాయంతో వీటిని వివరించండి. మీరు ఇంకా తెలుసుకునే క్రమంలో పాఠశాలలోని అట్లాసు, గోడ పటాలు, ఉబ్బెత్తు నిమ్నోన్నత పటాలను (Raised relief maps) ఉపయోగించండి.




*పటం 1 : ప్రపంచ పటంలో భారతదేశం*

### ఉనికి

- పైన ఇచ్చిన ప్రపంచ పటాన్ని పరిశీలించి భారతదేశ ఉనికిని గురించి కొన్ని వాక్యాలు రాయండి.
- ఒక ప్రదేశాన్ని లేదా ప్రాంతాన్ని ఖచ్చితంగా సూచించటానికి అక్షాంశ, రేఖాంశాలను ఉపయోగిస్తారు. అట్లాసు ఉపయోగించి కింది వాక్యాన్ని సరిచేయండి.

"భారతదేశం చాలా విశాలమైన దేశం, ఇది పూర్తిగా దక్షిణార్ధ గోళంలో ఉంది. దేశం $8^0$–$50^0$ ఉత్తర రేఖాంశాల మధ్య $68^0$–$9^0$ తూర్పు అక్షాంశాల మధ్య ఉంది."

- "భారతదేశ ద్వీపకల్పం" అన్న పదాన్ని తరచుగా ఎందుకు ఉపయోగిస్తాం?
- పై పటం చూసి ఆర్కిటిక్ వృత్తంలో భారతదేశం ఉందని ఊహించుకోండి. అప్పుడు మీ జీవితంలో ఏ ఏ తేడాలు ఉంటాయి?
- అట్లాసులో 'ఇందిరా పాయింట్'ని గుర్తించండి. దీని ప్రత్యేకత ఏమిటి?
- ఆంధ్రప్రదేశ్ .......... ఉత్తర అక్షాంశాల మధ్య .......... తూర్పు రేఖాంశాల మధ్య ఉంది.
- మీ అట్లాసులో ఇచ్చిన స్కేలు ఆధారంగా ఆంధ్రప్రదేశ్ తీర పొడవును కనుక్కోండి.

భౌగోళికంగా భారతదేశం ఉన్న స్థితి శీతోష్ణస్థితులలో ఎన్నో వైవిధ్యతలకు కారణమవుతోంది. దీని వల్ల అనేక రకాల వృక్ష, జీవజాతులు ఏర్పడి, వివిధ రకాల పంటలు పండించడానికి అనువైన పరిస్థితులు కల్పించబడ్డాయి. పొడవైన దీని తీరప్రాంతం, హిందూ మహాసముద్రంలోని దీని స్థానంవల్ల చేపలు పట్టడానికే కాకుండా అనేక వ్యాపార మార్గాలకు దోహదం చేసింది.

తొమ్మిదవ తరగతిలో మీరు రేఖాంశాల గురించి, 'కాలం, స్థలం' అనే అంశాల గురించి చదివారు కదా! మీ అట్లాసు సహాయంతో భారతదేశ రేఖాంశ విస్తరణ ఎంతో తెలుసుకోండి. భారతదేశానికి $82^0 30'$ తూర్పు రేఖాంశాన్ని ప్రామాణిక రేఖాంశంగా పరిగణిస్తారు, ఇది అలహాబాదుగుండా పోతుంది. భారతదేశ ప్రామాణిక కాలమానానికి (IST- Indian Standard Time) దీనినే ఆధారంగా తీసుకుంటారు, గ్రీన్‌విచ్ ప్రామాణిక కాలానికి (GMT- Greenwich Mean Time) ఇది 5½ గంటలు ముందు ఉంది.

పటం 2 ను పరిశీలించండి.

- భారతదేశ సరిహద్దును గుర్తించండి. రంగులతో నింపండి.

పటంలో ఉన్న స్కేలు ఆధారంగా బంగ్లాదేశ్‌తో భారతదేశ సరిహద్దు పొడవును అంచనా వేయండి.

పక్కన ఇచ్చిన పరిశీలనలలో అహ్మదాబాద్, ఇంఫాల్‌ల సూర్యోదయ, సూర్యాస్తమయాలను తెలిపేవి ఏవి? కారణాలను వివరించండి.

| తేదీ | ప్రదేశం: | | ప్రదేశం: | |
|---|---|---|---|---|
| | సూర్యోదయం | సూర్యాస్తమయం | సూర్యోదయం | సూర్యాస్తమయం |
| 5 జనవరి | 05:59 | 16:37 | 07:20 | 18:05 |



*చిత్రం 1.1 : టిబెట్ పీఠభూమి నుండి హిమాలయాల దృశ్యం– వృక్షాలు లేకపోవడాన్ని గమనించండి.*




*పటం 2 : భారతదేశం–ఉత్తర దక్షిణ, తూర్పు–పడమరల విస్తీర్ణం, ప్రామాణిక రేఖాంశం*

## భూగర్భ నేపథ్యం

తొమ్మిదవ తరగతిలోని భూపటల చలనాల గురించి మరొకసారి చదవండి. గోండ్వానా భూమిలో భాగంగా భూగర్భ నిర్మాణాలు, శిలా శైథిల్యం, క్రమక్షయం, నిక్షేపణం వంటి ప్రక్రియల వల్ల భారతదేశ భూభాగం, నేలలు ఏర్పడ్డాయి. లక్షల సంవత్సరాల నుండి ఈ అంశాలు నేడు మనం చూస్తున్న భౌతిక స్వరూపాన్ని ఏర్పరిచి, మారుస్తూ వచ్చాయి.

ప్రపంచ భూ భాగమంతా రెండు ప్రధాన భూ ఖండాల నుంచి ఏర్పడ్డాయి. ఇవి అంగారా భూమి (లారేసియా), గోండ్వానా భూమి. భారతదేశ ద్వీపకల్పం గోండ్వానా భూ భాగంలోనిది. 20 కోట్ల సంవత్సరాల క్రితం గోండ్వానా భూ భాగం ముక్కలుగా విడిపోయి, భారతదేశ ద్వీపకల్ప ఫలకం ఈశాన్య దిశగా పయనించి చాలా పెద్దదైన యూరేసియా ఫలకం (అంగారా భాగం)తో ఢీకొంది. ఇలా ఢీకొనడం వల్ల, తీవ్ర ఒత్తిడి వల్ల లక్షల సంవత్సరాల క్రమంలో ముడతపడే ప్రక్రియ వల్ల పర్వతాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు మనం చూస్తున్న హిమాలయాలు ఈ ప్రక్రియ వలన ఏర్పడినవే.

ద్వీపకల్ప పీఠభూమిలో ఉత్తర అంచులు పగిలిపోవటం వల్ల ఒక పెద్ద లోయ ఏర్పడింది. కాలక్రమంలో ఈ లోయ ఉత్తరాది నుంచి హిమాలయ నదులు, దక్షిణాది నుంచి ద్వీపకల్ప నదులు తెచ్చిన ఒండ్రుతో మేటవేసింది. దీని ఫలితంగా భారతదేశంలో విస్తారమైన ఉత్తర సమతల మైదాన ప్రాంతాలు ఏర్పడ్డాయి. భారతదేశ భూ భాగంలో ఎంతో వైవిధ్యం ఉంది. భూ ఉపరితలంపైన ద్వీపకల్ప పీఠభూమి ఎంతో పురాతనమైనది.

- భారతదేశ ఉత్తర మైదానాలు ఏర్పాటుకు దోహదపడిన హిమాలయ, ద్వీపకల్ప నదులను పేర్కొనండి.
- హిమాలయాలు ............. కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడగా, వేట–సేకరణపై ఆధారపడిన తొలి మానవులు ................ లక్షల సంవత్సరాల క్రితం భూమి మీద ఆవిర్భవించారు.



*చిత్రం 1.2 : ఉపగ్రహ చిత్రంలో హిమాలయాలు, ఉత్తర మైదానం, థార్ ఎడారి*

## ముఖ్యమైన భౌగోళిక స్వరూపాలు

భారతదేశ భూ భాగాన్ని కింద పేర్కొన్న భౌగోళిక స్వరూపాలుగా వర్గీకరించవచ్చు:

1. హిమాలయాలు
2. గంగా-సింధూనది మైదానం
3. ద్వీపకల్ప పీఠభూమి
4. తీరప్రాంత మైదానాలు
5. ఎడారి ప్రాంతం
6. దీవులు

పటం 2ను, మీ పాఠశాలలోని ఉబ్బెత్తు నిమ్నోన్నత పటాన్ని చూడండి. మీ వేలితో కింద పేర్కొన్న వాటిని గుర్తించండి:

- దక్కను పీఠభూమి వాలు ఎటు ఉందో తెలుసుకోటానికి గోదావరి, కృష్ణా నదుల ప్రవాహం వెంట మీ వేలు పోనివ్వండి.
- భూస్వరూపాలు, ఎత్తులు, దేశాలను పేర్కొంటూ బ్రహ్మపుత్ర నదీమార్గం మొత్తాన్ని వర్ణించండి.

## హిమాలయాలు

హిమాలయ పర్వతాలు ఒక చాపం వలె పడమర నుంచి తూర్పుకి 2400 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి. పశ్చిమ ప్రాంతంలో ఇవి 500 కిలోమీటర్ల వెడల్పు ఉండగా, మధ్య, తూర్పు ప్రాంతాలలో 200 కిలోమీటర్ల వెడల్పుతో ఉంటాయి. అంటే పశ్చిమ ప్రాంతంలో వెడల్పు ఎక్కువ. విభిన్న ప్రాంతాల్లో పర్వత ఎత్తుల్లో కూడా వ్యత్యాసాలున్నాయి. హిమాలయాల్లో సమాంతరంగా ఉండే మూడు పర్వతశ్రేణులు ఉన్నాయి. లోతైన లోయలు, విశాలమైన పీఠభూములతో ఈ పర్వతశ్రేణులు వేరు చేయబడి ఉన్నాయి.

అన్నిటికంటే ఉత్తరాన ఉన్న పర్వత శ్రేణిని 'ఉన్నత హిమాలయాలు' లేదా 'హిమాద్రి' అంటారు. ఈ శ్రేణి అవిచ్ఛిన్నంగా ఉంటూ పర్వతాల సగటు ఎత్తు సముద్రమట్టం నుండి 6100 మీటర్లు ఉంటుంది.

హిమాద్రి శ్రేణి మంచుతో కప్పి ఉంటుంది. ఇక్కడ మీకు హిమానీనదాలు కూడా కనపడతాయి. మంచు పేరుకోవటం, హిమానీనదాలు కరుగుతూ కదలడం వంటి వార్షిక చక్రం ద్వారా జీవనదులకు నీటిని అందిస్తుంటాయి. హిమాద్రికి దక్షిణాన ఉన్న పర్వతశ్రేణిని 'నిమ్న హిమాలయాలు' అంటారు. ఈ శ్రేణి బాగా ఎగుడుదిగుడులతో ఉంటుంది. ఇక్కడ బాగా ఒత్తిడికి గురైన రాళ్లు ఉంటాయి. పర్వతాల ఎత్తు 3,700-4,500 మీటర్ల మధ్య ఉంటుంది. ఈ శ్రేణిలో పిర్‌పంజాల్, మహాభారత పర్వతశ్రేణులు ముఖ్యమైనవి.

నిమ్న హిమాలయ శ్రేణిలో ప్రఖ్యాతిగాంచిన కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లోని కంగ్ర, కులు లోయలు ఉన్నాయి. సిమ్లా, ముస్సోరి, నైనితాల్, రాణిఖేత్ వంటి వేసవి విడిది ప్రాంతాలకు, సతతహరిత అరణ్యాలకు ఈ శ్రేణి ప్రఖ్యాతిగాంచింది.

- మీ అట్లాసులో ఈ మూడు పర్వతశ్రేణులను గుర్తించండి.
- ఉబ్బెత్తు పటంలో అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలను కొన్నింటిని గుర్తించండి.

- ప్రక్కన పేర్కొన్న ప్రాంతాలపైన గోడ పటంలోనూ, ఉబ్బెత్తు నిమ్నోన్నత పటంలోనూ మీ వేలిని పోనివ్వండి.
- మీ అట్లాసులోని భారతదేశ భౌతిక పటంలో కింద పేర్కొన్న ప్రాంతాలను గుర్తించండి: సిమ్లా, ముస్సోరి, నైనితాల్, రాణిఖేత్.

*చిత్రాలు 1.3 – 1.6: దక్షిణ (భారతదేశం) వైపు నుంచి హిమాలయ దృశ్యాలు– చిత్రం 1.1లోని టిబెటన్ వైపు నుంచి హిమాలయ దృశ్యాలతో వీటిని పోల్చండి.*


1.3

*ఈ చిత్రాలు హిమాలయాలలో ఉండే విభిన్న వృక్షజాలాన్ని సూచిస్తాయి.*

*కింద పర్వతాలు 5 వివిధ స్థాయిల ఎత్తులతో విభజింపబడ్డాయి. కొన్ని ప్రధాన వృక్షజాతులు చూపబడ్డాయి.*


1.4



1.5

1.3 సిక్కింలోని లోతైన, ఏటవాలు లోయలు.

1.4 హిమాలయాలలో సోపాన వ్యవసాయాన్నీ, నదీ మార్గంలో గులకరాళ్లను గుర్తించండి.

1.5 హిమాలయాల్లో వివిధ ఎత్తులలో వృక్ష జాతులను చూపించే చిత్రం.

1.6 మేఘాలయలోని మాక్‌డోక్ డింపెప్ లోయ దృశ్యం.


1.6

హిమాలయాల్లో అన్నిటికంటే దక్షిణాన ఉన్న శ్రేణిని శివాలిక్ శ్రేణి అంటారు. శివాలిక్ శ్రేణి 10–50 కిలోమీటర్ల వెడల్పులో ఉంటుంది, దీంట్లోని పర్వతాల ఎత్తు 900–1100 మీటర్ల మధ్య ఉంటుంది. ఈ శ్రేణిని వేరువేరు ప్రాంతాలలో వేరువేరు పేర్లతో పిలుస్తారు: జమ్ము ప్రాంతంలో జమ్ము కొండలు అనీ, అరుణాచల్‌ప్రదేశ్‌లో మిష్మి కొండలు అనీ, అస్సాంలో కచార్ అనీ రకరకాల పేర్లతో పిలుస్తారు. ఈ ప్రాంతంలో పెద్దపెద్ద రాళ్ళు, ఒండ్రుమట్టి ఉంటుంది. నిమ్న హిమాలయ, శివాలిక్ శ్రేణుల మధ్య ఉండే లోయలను స్థానికంగా 'డూన్' అంటారు. వీటిలో కొన్ని ప్రసిద్ధిగాంచిన డూన్‌లు: డెహ్రాడూన్, కోట్లిడూన్, పాట్లిడూన్ మొదలైనవి.

హిమాలయాలకు తూర్పువైపున సరిహద్దుగా బ్రహ్మపుత్ర లోయ ఉంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో దిహాంగ్ లోయ తరువాత హిమాలయాలు జడపిన్ను వంపు (Hair Pin bend) తీసుకుని దక్షిణానికి తిరిగి ఈశాన్య రాష్ట్రాలన్నింటిలో విస్తరించి ఉన్నాయి. భారతదేశానికి ఇక్కడ తూర్పు సరిహద్దుగా కూడా హిమాలయాలు ఉన్నాయి. ఈ పర్వతాలను 'పూర్వాంచల్' అంటారు. ఇవి అవక్షేప శిలలతోను, ఇసుకతోను ఏర్పడినవి. ప్రాంతీయంగా పూర్వాంచల్ పర్వతాలను పాట్‌కాయ్ కొండలు, నాగా కొండలు, మణిపురి కొండలు, ఖాసి కొండలు, మిజో కొండలు అంటారు.

- మీ అట్లాసులోని భారతదేశ భౌతిక పటంలో ఈ కిందివాటిని గుర్తించండి.

| కొండలు | రాష్ట్రం/ రాష్ట్రాలు |
|---|---|
| పూర్వాంచల్ | |
| పాట్‌కాయ్ | |
| నాగా కొండలు | |
| మణిపురి కొండలు | |

హిమాలయాల వల్ల శీతోష్ణస్థితి అనేక విధాలుగా ప్రభావితం అవుతుంది. ఇవి భారతదేశ ఉత్తర సరిహద్దులో రక్షణ కవచాలుగా ఉండి తీవ్ర చలికాలంలో మధ్య ఆసియా నుండి వచ్చే చల్లటి గాలులను అడ్డుకుంటాయి. వేసవిలో వర్షాలకు, పశ్చిమ కనుమలు దాటిన తరువాత ప్రాంతంలో రుతుపవన తరహా శీతోష్ణస్థితికి హిమాలయాలే కారణం. అవే లేకపోతే ఉత్తర ప్రాంతం పొడిగా ఉండేది. హిమానీనదాల నుంచి నీళ్లు అందటంతో హిమాలయ నదులు సంవత్సరం పొడవునా నీళ్లు కలిగి ఉంటాయి. ఈ నదులు కొండలనుంచి కిందకి తెచ్చే ఒండ్రుమట్టి వల్ల మైదాన ప్రాంతాలు చాలా సారవంతంగా మారాయి.

## గంగా–సింధూ నది మైదానం

మూడు హిమాలయ నదులైన గంగా, సింధు, బ్రహ్మపుత్రలు, వాటి ఉపనదుల వల్ల విశాల ఉత్తర మైదానం ఏర్పడింది. మొదట్లో (2 కోట్ల సంవత్సరాల క్రితం) అది తక్కువ లోతు ఉన్న పళ్లెం మాదిరి ఉండేది. హిమాలయాలనుంచి వచ్చే నదులు తెచ్చిన రకరకాల ఒండ్రుమట్టి వల్ల ఇది క్రమేపీ పూడుకుంటూ వచ్చింది.

భారతదేశంలోని గంగా–సింధూ నదీ మైదానాన్ని ప్రధానంగా మూడు భాగాలుగా విభజించవచ్చు. 1) పశ్చిమ భాగం 2) మధ్య భాగం 3) తూర్పు భాగం.



చిత్రం 1.7 : మధ్య ఉన్నత భూములు, గంగా మైదానం, హిమాలయాల అడ్డుకోత

1) పశ్చిమ భాగం హిమాలయాల నుంచి ప్రవహించే సింధూనది, దాని ఉపనదులైన జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్‌లతో ఏర్పడింది. సింధూ నది పరీవాహక ప్రాంతం అధిక భాగం పాకిస్తాన్‌లో ఉంది, కొంత భాగం మాత్రమే భారతదేశంలో ఉన్న పంజాబ్, హర్యానా మైదానాలలో ఉంది. ఈ ప్రాంతంలో సారవంతమైన అంతర్వేదులు (Doab) అత్యధికంగా ఉన్నాయి. రెండు నదుల మధ్య ప్రాంతాన్నే 'అంతర్వేది' అంటారు.
2) మధ్య భాగం గంగా మైదానంగా ప్రఖ్యాతి పొందింది. ఇది గగ్గర నదినుంచి తీస్తా నది వరకు విస్తరించి ఉంది. ఈ భాగం ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలోను, కొంత హర్యానా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోనూ ఉంది. ఇక్కడ గంగా, యమునా నదులు వాటి ఉపనదులైన సోన్, కోసి వంటివి ప్రవహిస్తాయి.
3) తూర్పుభాగం ప్రధానంగా అసోంలోని బ్రహ్మపుత్రలోయలో ఉంది, ఇది ప్రధానంగా బ్రహ్మపుత్ర నది వల్ల ఏర్పడింది.

హిమాలయ నదులు కిందకి ప్రవహించే క్రమంలో రాళ్లు, గులకరాళ్లువంటి వాటిని శివాలిక్ పర్వతాల పాద భాగంలో 8-16 కిలోమీటర్ల సన్నటి మేఖలగా నిక్షేపణ చేస్తాయి. ఈ భూస్వరూపాన్ని 'భాబర్' అంటారు. ఇది బాగా సచ్ఛిద్రంగా (Porus) ఉండి చిన్న నదులు, వాగులు దీని కిందినుండి ప్రవహించి కింది ప్రాంతంలో మళ్లీ బయటకు ప్రవహిస్తాయి. దీనివల్ల చిత్తడి నేలలు ఏర్పడతాయి. దీనినే ఇక్కడ 'టేరాయి' ప్రాంతం అంటారు. ఒకప్పుడు తరాయి ప్రాంతంలో దట్టమైన అడవులు,


చిత్రం 1.8 : అసోంలోని బ్రహ్మపుత్ర లోయలో ఒక గ్రామం.

వైవిధ్యభరితమైన వన్యప్రాణులు ఉండేవి. అయితే భారతదేశ విభజన సమయంలో వలసవచ్చిన వాళ్లకోసం తరాయి ప్రాంతంలోని చాలావరకు అడవులను తొలగించి వ్యవసాయ భూములకింద మార్చారు. తరాయి ప్రాంతానికి దక్షిణ భాగంలో మెత్తటి ఒండ్రుమట్టితో కూడిన ప్రాంతాలు ఏర్పడ్డాయి.

## ద్వీపకల్ప పీఠభూమి

భారతదేశ పీఠభూమిని, దానికి మూడువైపులా సముద్రాలు ఉన్నాయి కాబట్టి ద్వీపకల్ప పీఠభూమి అని కూడా అంటారు. ఇక్కడ ప్రధానంగా పురాతన స్ఫటికాకార, కఠినమైన అగ్నిశిలలు, రూపాంతర శిలలు ఉంటాయి. భారత పీఠభూమిలో లోహ, అలోహ ఖనిజాల వనరులు కూడా పెద్ద మొత్తంలో ఉన్నాయి. చుట్టూ గుండ్రటి కొండలతో తక్కువ లోతు ఉండే వెడల్పైన లోయలు ఉన్నాయి. ఈ పీఠభూమి తూర్పువైపుకి కొద్దిగా వాలు కలిగి ఉంది. దీనికి పడమర అంచుగా పడమటి కనుమలు, తూర్పు అంచుగా తూర్పు కనుమలు ఉన్నాయి. ఈ పీఠభూమి దక్షిణ అంచుగా కన్యాకుమారి ఉంది.

ద్వీపకల్ప పీఠభూమిని ప్రధానంగా రెండుగా విభజిస్తారు. ఇవి మధ్య ఉన్నత భూములు (మాల్వా పీఠభూమి), దక్కన్ పీఠభూమి. భారతదేశ భౌతిక పటంలో గంగా మైదానానికి దక్షిణాన, నర్మదా నదికి ఉత్తరాన ఉన్న మధ్య ఉన్నత భూములను గుర్తించండి. ఇక్కడ పశ్చిమంవైపున ఉండే మాల్వా పీఠభూమి, తూర్పువైపున ఛోటానాగ్‌పూర్ పీఠభూమి ముఖ్యమైన పీఠభూములు. గంగా మైదానంతో పోలిస్తే పీఠభూమి ప్రాంతం పొడిగా ఉంటుంది. ఇక్కడి నదులు జీవనదులు కావు. రెండవ పంటకు సాగునీటి కోసం చెరువులు, బోరుబావులపై ఆధారపడవలసి ఉంటుంది. మధ్య ఉన్నత భూములలో ఉత్తరంవైపుగా ప్రవహించే నదులను గుర్తించండి. ఛోటానాగ్‌పూర్ పీఠభూమిలో ఖనిజ వనరులు సమృద్ధిగా ఉన్నాయి.

- మీ అట్లాసులోని, భారతదేశ భౌతిక పటంలోనూ, ఉబ్బెత్తు నిమ్నోన్నత పటంలోనూ ఈ కిందివాటిని గుర్తించండి: మాల్వా పీఠభూమి, బుందేల్‌ఖండ్, భాగేల్‌ఖండ్, రాజమహల్ కొండలు, ఛోటానాగ్‌పూర్ పీఠభూమి
- అట్లాసు సహాయంతో టిబెట్ పీఠభూమితో పోలిస్తే పైన పేర్కొన్న పీఠభూములు ఎంత ఎత్తులో ఉన్నాయో పేర్కొనండి.

నర్మదానది దక్షిణాన ఉన్న త్రిభుజాకార ప్రాంతాన్ని దక్కన్ పీఠభూమి అంటారు. సాత్పురా పర్వతాలు దక్కన్ పీఠభూమికి ఉత్తర సరిహద్దుగా ఉన్నాయి. మహదేవ్ కైమూర్, మైకాల్ శ్రేణిలో కొంతభాగం తూర్పు అంచుగా ఉన్నాయి. దక్కన్ పీఠభూమికి పశ్చిమ కనుమలు పశ్చిమ సరిహద్దుగా,




*చిత్రం 1.9 : దక్కన్ పీఠభూమి.*

తూర్పు కనుమలు తూర్పు సరిహద్దుగా, నీలగిరి పర్వతాలు దక్షిణ సరిహద్దుగా ఉన్నాయి.

పడమటి కనుమలు పడమటి తీరానికి సమాంతరంగా ఉన్నాయి. పడమటి కనుమలు అవిచ్ఛిన్న శ్రేణులుగా ఉండి మధ్యలో కొన్ని కనుమలు తీరప్రాంత మైదానాలకు ప్రవేశద్వారంగా ఉంటాయి. తూర్పుకనుమల కంటే పడమటి కనుమల ఎత్తు ఎక్కువ. ఈ కారణంగా దక్కన్ పీఠభూమి పడమటి నుంచి తూర్పుకి వాలి ఉంది (చిత్రం 1.9). పడమటి కనుమలు 1600 కిలోమీటర్ల పొడవున ఉన్నాయి. గూడలూరు వద్ద నీలగిరి పర్వతాలు పడమటి కనుమలను కలుస్తాయి, ఇవి 2000 మీటర్ల ఎత్తు వరకు ఉన్నాయి. ప్రఖ్యాతి గాంచిన వేసవి విడిది అయిన ఉదగమండలం నీలగిరి పర్వతాలలో ఉంది. దీనినే ఊటీ అంటారు. ఈ నీలగిరి పర్వతాలలో ఎత్తైన శిఖరం దొడబెట్ట (2637 మీటర్లు). అనైముడి, పళని (తమిళనాడు), కార్డమం (కేరళ) కొండలు పడమటి కనుమలలోనివే. దక్షిణ భారతదేశంలో అన్నామలై కొండలలోని అనైముడి (2695 మీటర్లు) ఎత్తైన శిఖరం.




పటం 3 : ద్వీపకల్ప పీఠభూమి, కనుమలు కొండలు

ఉత్తరాన మహానది లోయనుంచి దక్షిణాన నీలగిరి పర్వతాల వరకు తూర్పు కనుమలు విస్తరించి ఉన్నాయి. అయితే తూర్పు కనుమలు విచ్ఛిన్న శ్రేణులు. పశ్చిమ కనుమలలో పుట్టిన గోదావరి, కృష్ణ వంటి నదులు పీఠభూమిగుండా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తాయి. తూర్పు కనుమల సగటు ఎత్తు 900 మీటర్లను మించదు. తూర్పు కనుమలలో ఎత్తైన పర్వతం అరోమ కొండ చింతపల్లి (ఆంధ్రప్రదేశ్) దగ్గర ఉంది, దీని ఎత్తు 1680 మీటర్లు. నల్లమల, వెలికొండ, పాలకొండ, శేషాచలం వంటివి తూర్పు కనుమలలోని భాగాలు. అగ్నిపర్వత ప్రక్రియల వల్ల ఏర్పడిన నల్లరేగడి నేలలు ద్వీపకల్ప పీఠభూమిలో చెప్పుకోదగిన అంశం.

- భారతదేశ ఉబ్బెత్తు నిమ్నోన్నత పటంలో తూర్పు, పశ్చిమ కనుమల ఎత్తులను టిబెటన్ పీఠభూమి, హిమాలయ శిఖరాలతో పోల్చండి.



చిత్రం 1.10: పశ్చిమ కనుమలలోని అన్నామలై కొండలు.

## థార్ ఎడారి

ఆరావళి పర్వతాల వర్షచ్ఛాయా ప్రాంతంలో థార్ ఎడారి ఉంది. కాబట్టి ఇక్కడ వర్షపాతం తక్కువ, సంవత్సర వర్షపాతం 100–150 మి.మీ మధ్య ఉంటుంది. ఎడారిలో ఎత్తు, పల్లాలతో ఉండే ఇసుక మైదానం ఉండి అక్కడక్కడా శిలామయమైన బోడిగుట్టలు ఉంటాయి. రాజస్థాన్‌లోని అధిక భాగం ఈ ఎడారి విస్తరించి ఉంది. ఇక్కడ శుష్క వాతావరణం ఉంటుంది, చెట్లు తక్కువ. వర్షాకాలంలో వాగులు ఏర్పడి, ఆ కాలం అయిపోవటంతోనే కనుమరుగవుతాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక్క నది 'లూని'. ఈ ఎడారులలో ప్రవహించే నది, కాలువలలోని నీరు సముద్రాన్ని చేరకుండా సరస్సులలోనికే (అంతస్థలీయ ప్రవాహం) ప్రవహిస్తాయి.



చిత్రం 1.11 : థార్ ఎడారిలో ఒక ఆవాస ప్రాంతం

దేశంలో అత్యంత పొడవైన ఇందిరాగాంధీ కాలువ (650 కిలో మీటర్లు) థార్ ఎడారికి నీళ్ళు అందిస్తోంది. దీని కారణంగా ఎడారి ప్రాంతంలో ఎన్నో హెక్టార్ల భూమి సాగులోకి వచ్చింది.

## తీర మైదానాలు

ద్వీపకల్ప పీఠభూమి దక్షిణ భాగంలో పశ్చిమాన అరేబియా మహాసముద్రం వెంట, తూర్పున బంగాళాఖాతం వెంట సన్నటి తీరప్రాంత మైదానాలు ఉన్నాయి. పడమటి తీర మైదానం రాణ్ ఆఫ్ కచ్ వద్ద మొదలయ్యి కన్యాకుమారి వరకు ఉంటుంది. తూర్పు తీర మైదానం కంటే పడమటి తీర మైదానం వెడల్పు తక్కువ. ఈ తీరప్రాంత మైదానం ఎత్తుపల్లాలుగా ఉండి కొండలతో వేరు చేయబడి ఉంటుంది. దీనిని మూడు భాగాలుగా విభజించవచ్చు:

1) కొంకణ్ తీరప్రాంతం – ఇది ఉత్తర భాగం. మహారాష్ట్ర, గోవాలలో విస్తరించి ఉంది.

2) కెనరా తీరప్రాంతం – ఇది మధ్య భాగం. కర్నాటకలోని తీరం దీనికిందకు వస్తుంది.



చిత్రం 1.12 : సుందర్‌బన్ మడ అడవులు

3) మలబార్ తీర ప్రాంతం – ఇది దక్షిణ భాగం, ప్రధానంగా కేరళ రాష్ట్రంలో ఉంది.

బంగాళాఖాత తీరప్రాంత మైదానాలు వెడల్పుగా ఉండి అధిక ఉపరితలం కలిగి ఉంటాయి. ఇది ఒడిశాలోని మహానది నుంచి మొదలయ్యి తమిళనాడులోని కావేరి డెల్టా వరకు విస్తరించి ఉంది. మహానది, గోదావరి, కృష్ణా, కావేరి నదులతో ఏర్పడిన ఈ మైదాన ప్రాంతాలు చాలా సారవంతమైనవి. ఈ తీరప్రాంత మైదానాలను స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు. అవి: ఉత్కల్ తీరం (ఒడిశా), సర్కార్ తీరం (ఆంధ్రప్రదేశ్), కోరమండల్ తీరం (తమిళనాడు). గంగా–సింధూ మైదానాలలో మాదిరి ఈడెల్టా ప్రాంతాలు కూడా వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందాయి.

కోస్తా ప్రాంతంలో చేపల వనరులు కూడా సమృద్ధిగా ఉన్నాయి. ఒడిశాలోని చిల్కాసరస్సు, ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు, పులికాట్ చెరువులు తీరప్రాంత మైదానంలో ముఖ్యమైన భౌగోళిక అంశాలు.

- భారతదేశ భౌతిక పటంలో డెల్టాప్రాంతాలను గుర్తించండి. వాటి ఎత్తులలో తేడాలు ఏమిటి? గంగా – సింధూ మైదానాలతో వీటిని పోల్చండి.

## దీవులు

భారతదేశంలో రెండు ద్వీప సమూహాలు ఉన్నాయి – బంగాళాఖాతంలోని అండమాన్, నికోబార్ దీవులు, అరేబియా సముద్రంలోని లక్షద్వీప దీవులు. మయన్మార్ కొండలు అర్కన్‌యోమా నుంచి మొదలుకొని సముద్రంలో మునిగిన పర్వతాలలో సముద్రం నుంచి పైకివచ్చిన శిఖర ప్రాంతాలే అండమాన్, నికోబార్ దీవులు. ఈ దీవులలోని నార్కొండాం, బారెన్ దీవులు అగ్నిపర్వతాల వల్ల ఏర్పడ్డాయి. భారతదేశ దక్షిణాది అంచు నికోబార్ దీవిలోని ఇందిరాపాయింట్ దగ్గర ఉంది. 2004లో సంభవించిన సునామీలో ఇది ముంపునకు గురి అయ్యింది. లక్షద్వీప దీవులు ప్రవాళ భిత్తికల (కోరల్) నుండి ఏర్పడ్డాయి. వీటి మొత్తం భౌగోళిక విస్తీర్ణం 32 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ ఉండే రకరకాల వృక్ష, జీవ జాతులకు ఈ ద్వీప సమూహం ప్రఖ్యాతిగాంచింది.



*నికోబార్‌లో నివసించే ఒక పక్షి*

భారతీయులు నివసించే భూ భాగంలో భౌగోళిక స్వరూపాలలో ఎంతో వైవిధ్యత ఉంది. కొన్ని ప్రాంతాలు హిమాలయాల నుంచి ప్రవహించే ఉత్తుంగ నదులతో సాగు చెయ్యబడగా, మరికొన్ని పశ్చిమ కనుమలు, అక్కడి అడవులలో పుట్టిన వర్షాధార నదులతో సాగు చెయ్యబడుతున్నాయి. అనేక ప్రాంతాలు నదీలోయ మైదానాలలో ఉండగా మరికొన్ని కొండలలో ఉన్నాయి.



*చిత్రం 1.13 : నీటిలోని పగడపు గట్టు (కోరల్ రీఫ్)*

## కీలక పదాలు

| | | | | |
|---|---|---|---|---|
| జీవనది | ద్వీపకల్పం | కోరల్ | డూన్ | అంగారా భూమి |
| గోండ్వానా భూమి | శివాలిక్ | పూర్వాంచల్ | లారేసియా | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. పశ్చిమాన ఉన్న గుజరాత్‌లో కంటే అరుణాచల్‌ప్రదేశ్‌లో సూర్యోదయం రెండు గంటల ముందు అవుతుంది. కానీ, గడియారాలు ఒకే సమయం చూపిస్తాయి. ఎందుకని?
2. హిమాలయాలు ప్రస్తుతం ఉన్నస్థానంలో లేకపోతే భారత ఉపఖండ శీతోష్ణస్థితులు ఎలా ఉండేవి?
3. ఇక్కడ పేర్కొన్న వాటిల్లో ఏ ఏ రాష్ట్రాలలోనికి హిమాలయాలు విస్తరించి లేవు: మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, సిక్కిం, హర్యానా, పంజాబ్, ఉత్తరాంచల్
4. భారతదేశ ప్రధాన భౌగోళిక విభజనలు ఏవి? హిమాలయ ప్రాంత భౌగోళిక పరిస్థితులతో ద్వీపకల్ప పీఠభూమిని పోల్చండి.
5. భారతీయ వ్యవసాయాన్ని హిమాలయాలు ఏ రకంగా ప్రభావితం చేస్తున్నాయి?
6. గంగా-సింధూ నది మైదానంలో జనసాంద్రత ఎక్కువ. కారణాలను తెలుపండి.
7. భారతదేశ సరిహద్దులను చూపించే పటంలో కింది వాటిని గుర్తించండి:
   (i) కొండలు, పర్వతశ్రేణులు – కారకోరం, జస్కర్, పాట్‌కాయ్, జైంతియా, వింధ్య పర్వతాలు, ఆరావళి, కార్డమం కొండలు.
   (ii) శిఖరాలు – కె2, కాంచనగంగ, నంగ పర్వతం, అనైముడి.
   (iii) పీఠభూములు – ఛోటానాగ్‌పూర్, మాల్వా.
   (iv) భారత ఎడారి, పశ్చిమ కనుమలు, లక్షద్వీప దీవులు.
8. అట్లాసు ఉపయోగించి కింది వాటిని గుర్తించండి:
   (i) అగ్నిపర్వతాల విస్ఫోటనం వల్ల ఏర్పడిన దీవులు
   (ii) భారత ఉపఖండంలోని దేశాలు
   (iii) కర్కటరేఖ పోయే రాష్ట్రాలు
   (iv) భారత భూభాగంలో అన్నిటి కంటే ఉత్తరాన ఉన్న అక్షాంశం, డిగ్రీలలో
   (v) భారత భూ భాగంలో అన్నిటికంటే దక్షిణాన ఉన్న అక్షాంశం, డిగ్రీలలో
   (vi) అన్నిటి కంటే తూర్పున, పడమరన ఉన్న రేఖాంశాలు, డిగ్రీలలో
   (vii) మూడు సముద్రాలు ఉన్న ప్రదేశం
   (viii) భారతదేశం నుండి శ్రీలంకను వేరుచేస్తున్న జలసంధి
   (ix) భారతదేశ కేంద్రపాలిత రాష్ట్రాలు
9. తూర్పు మైదాన ప్రాంతాలు, పడమటి మైదాన ప్రాంతాల మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
10. భారతదేశంలోని మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు – దీనికి కారణాలు ఏమిటి?

## ప్రాజెక్టు

మీ అట్లాసులోని భౌతిక, భౌగోళిక అంశాల ఉబ్బెత్తు, ఇతర పటాలను ఉపయోగించి నేల మీద మట్టితో భారతదేశ నమూనాని తయారు చెయ్యండి. వివిధ భౌగోళిక అంశాలను చూపించటానికి రకరకాల మట్టి లేదా ఇసుకను ఉపయోగించండి. శిఖరాల ఎత్తులలో తేడాలను చూపించండి, నదులను గుర్తించండి. మీ అట్లాసులో అడవుల పటం ఆధారంగా దానిని గడ్డి, ఆకులతో అలంకరించండి. తరువాత, కాలం గడిచేకొద్దీ ఇతర అంశాలను దాంట్లో జోడించవచ్చు.

పాఠం 2

# అభివృద్ధి భావనలు

అభివృద్ధి, ప్రగతికి సంబంధించిన భావనలు మనతో అనాదిగా ఉన్నాయి. ఎలా జీవించాలి, మనం ఏం చెయ్యాలి అనేవాటికి సంబంధించి మనకు కొన్ని కోరికలు, ఆకాంక్షలు ఉన్నాయి. అదేవిధంగా, దేశం ఎలా ఉండాలి అనేదాని గురించి కూడా మనకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. మనకు గల తప్పనిసరి అవసరాలు ఏమిటి? జీవితం అందరికీ మరింత బాగా ఉండగలదా?మరింత సమానత్వం సాధించవచ్చా? అభివృద్ధి అంటే ఇటువంటి ప్రశ్నల గురించి, ఈ లక్ష్యాలను చేరుకునే మార్గాల గురించి ఆలోచించటం. ఇది చాలా సంక్లిష్టమైన పని. ఈ అధ్యాయంలో అభివృద్ధి అంటే ఏమిటో అర్థం చేసుకొనే ప్రయత్నం చేద్దాం.



*చిత్రం 2.1 : నేను లేనిదే వారు అభివృద్ధి చెందలేరు ఈ విధానంలో నేను అభివృద్ధి చెందను.*

## వివిధ వర్గాల ప్రజల ఆకాంక్షలు

పట్టిక 1 లో పేర్కొన్న వివిధ వర్గాల ప్రజల అభివృద్ధి అంటే ఏమిటో ఊహించటానికి ప్రయత్నిద్దాం. వాళ్ల ఆకాంక్షలు ఏమిటి? పట్టికలోని కొన్ని గడులు నింపి ఉన్నాయి. పట్టికను పూర్తి చేయటానికి ప్రయత్నించండి. కావాలంటే ఇతర వర్గాల ప్రజలను జోడించండి.

*పట్టిక 1 : వివిధ వర్గాల ప్రజలు, అభివృద్ధి లక్ష్యాలు*

| వివిధ వర్గాల ప్రజలు | అభివృద్ధి లక్ష్యాలు/ఆకాంక్షలు |
|---|---|
| భూమిలేని గ్రామీణ కార్మికులు | మరిన్ని రోజుల పని, మెరుగైన కూలీ; స్థానిక పాఠశాల తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించగలగటం; సామాజిక వివక్షత లేకపోవటం, వాళ్లు కూడా గ్రామంలో నాయకులు కాగలగటం. |
| ధనిక రైతులు | తమ పంటలకు అధిక మద్దతు ధరల ద్వారా, తక్కువ కూలీకి బాగా కష్టపడే కూలీల ద్వారా అధిక ఆదాయాన్ని ఖచ్చితంగా పొందగలగటం; తమ పిల్లలు విదేశాలలో స్థిరపడగలగటం. |

| | |
|---|---|
| వర్షాధార రైతులు | |
| భూమి ఉన్న కుటుంబంలోని గ్రామీణ మహిళ | |
| పట్టణ ప్రాంతంలోని నిరుద్యోగ యువత | |
| పట్టణ ప్రాంతంలోని ధనిక అబ్బాయి | |
| పట్టణ ప్రాంతంలోని ధనిక కుటుంబానికి చెందిన అమ్మాయి | తన సోదరుడికి లభించే స్వేచ్ఛ తనకీ కావాలి, తన జీవితంలో ఏం చేయాలో తాను నిర్ణయించుకోగలగాలి. విదేశాలలో పై చదువులు చదువుకోవాలి. |
| గనుల తవ్వకం ప్రాంతంలోని ఆదివాసి | |
| తీరప్రాంతంలో చేపలు పట్టే వ్యక్తి | |
| | |

పట్టిక 1 నింపిన తరువాత దానిని పరిశీలిద్దాం. అభివృద్ధి లేదా ప్రగతి పట్ల అందరికీ ఒకే భావన ఉందా? బహుశ ఉండక పోవచ్చు. ప్రతి ఒక్కరి కోరికలు వేరువేరుగా ఉన్నాయి. వాళ్లకు ముఖ్యమైనవి అంటే వాళ్ల ఆకాంక్షలు, కోరికలను పూర్తిచేసేవాటిని వాళ్లు ఆశిస్తున్నారు. వాస్తవానికి ఒక్కొక్కసారి ఇద్దరు వ్యక్తులకు, లేదా బృందాలకు పరస్పర విరుద్ధమైన కోరికలు ఉండవచ్చు. ఒక అమ్మాయి తన సోదరుడికి లభించే స్వేచ్ఛ తనకూ కావాలని, ఇంటిపనిలో అతడూ పాలుపంచుకోవాలని ఆశించవచ్చు. కానీ అతనికి ఇది నచ్చకపోవచ్చు. అదేవిధంగా మరింత విద్యుత్తు కోసం పారిశ్రామిక వేత్తలు మరిన్ని ఆనకట్టలు కోరుకోవచ్చు. కానీ వీటివల్ల భూములు ముంపునకు గురై, గిరిజనుల వంటి నిర్వాసిత ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేయవచ్చు. వాళ్లు పెద్ద ఆనకట్టలను నిరసించి తమ భూములకు సాగునీటిని అందించేలా చిన్న చెక్‌డ్యాములు లేదా కుంటలను కోరుకోవచ్చు.




*చిత్రం 2.2 : ఈ చిత్రంలోని మానవాభివృద్ధి చరిత్ర పరిణామ క్రమ కాలసూచి (timeline) ని పరిశీలిస్తే వేట, సేకరణ 2,00,000 సంవత్సరాలని, వ్యవసాయం ప్రారంభించి 12,000 సంవత్సరాలని, పారిశ్రామికీకరణ మొదలై 400 సంవత్సరాలని అర్థమవుతుంది.*

## ఎవరి అభివృద్ధి?

అభివృద్ధి అంటే విభిన్న అభిప్రాయాలున్నప్పుడు అభివృద్ధి యొక్క విధానాలలో వ్యత్యాసాలుండడం సహజమే. తమిళనాడు రాష్ట్రం, తిరుణవెల్లి జిల్లాలోని కుడంకుళం అణు విద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ఉద్యమం అలాంటిదే. మత్స్యకారుల ఆవాస ప్రాంతాలున్న ప్రశాంత సముద్ర తీరంలో భారత ప్రభుత్వం అణు విద్యుత్ కేంద్రాన్ని స్థాపించింది. దీని ప్రధాన ఉద్దేశము నిరంతరం పెరుగుతున్న దేశ విద్యుచ్ఛక్తి అవసరాలు తీర్చడం. ఈ ప్రాంత ప్రజలు వారి భద్రత, రక్షణ, జీవనోపాధుల పరిరక్షణ కోసం ఉద్యమించారు. దీర్ఘకాల పోరాటంగా పరిణమించే పరిస్థితి ఏర్పడింది. శాస్త్రజ్ఞులు, పర్యావరణవేత్తలు, సామాజిక ఉద్యమకారులు ప్రజల పక్షాన నిలబడి దీన్ని వ్యతిరేకించారు.



*చిత్రం 2.3 : కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం వద్ద నిరసన.*

'మేము అణు విద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని మీరు భావించడం వల్లనే మీరు మా ఉద్యమాన్ని ప్రశంసించలేకపోతున్నారు. కానీ దాని వల్ల జరిగే వినాశనానికి వ్యతిరేకంగానే మా పోరాటం' అనే అభిప్రాయాలు ప్రభుత్వానికి ఉత్తరాల రూపంలో చేరుతున్నాయి.

మన తీర ప్రాంతం, దేశం రేడియోధార్మిక వినాశక ప్రమాదం నుండి రక్షించబడాలని కోరుకుంటున్నాం. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపి ప్రత్యామ్నాయ ఇంధనవనరుల గురించి ఆలోచించండి. కానీ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తగిన భద్రతాచర్యలన్నీ తీసుకుంటున్నామని ప్రకటించి, ఉద్యమాలకు అతీతంగా నిర్మాణం కొనసాగిస్తోంది.

కాబట్టి, రెండు విషయాలు స్పష్టంగా ఉన్నాయి:

1. వేరువేరు వ్యక్తులకు వేరువేరు అభివృద్ధి లక్ష్యాలు ఉండవచ్చు.
2. ఒకరికి అభివృద్ధి అయినది మరొకరికి అభివృద్ధి కాకపోవచ్చు. అది మరొకరికి విధ్వంసం కూడా కావచ్చు.

- *ఈ వార్తాపత్రిక కథనం చూడండి...*

*"ఒక ఓడ 500 టన్నుల విషపూరిత వ్యర్థ ద్రవ పదార్థాలను చెత్త పడవేసే బహిరంగ ప్రదేశంలోనూ, పక్కన ఉన్న సముద్రంలోనూ పారబోసింది. ఆఫ్రికాలోని ఐవరీకోస్ట్ దేశంలోని అబిద్‌జాన్ అనే పట్టణంలో ఇది జరిగింది. అత్యంత విష పూరితమైన ఈ వ్యర్థ పదార్థాల నుండి వెలువడిన వాయువుల వల్ల తల తిప్పటం, చర్మంపై దద్దురులు, స్పృహతప్పి పడిపోవటం, విరోచనాలు వంటి సమస్యలు ఏర్పడ్డాయి. ఒక నెల రోజులలో ఏడుగురు చనిపోయారు, ఇరవై మంది ఆసుపత్రిలో ఉన్నారు, విష ప్రభావానికి గురైన లక్షణాలకు 26,000 మంది చికిత్స పొందారు. లోహాల, ముడి చమురలలో వ్యాపారం చేసే ఒక బహుళజాతి కంపెనీ తన ఓడలోని వ్యర్థ పదార్థాలను పడవెయ్యటానికి ఐవరీకోస్ట్‌కు చెందిన ఒక స్థానిక కంపెనీతో కాంట్రాక్టు కుదుర్చుకుంది." (ది హిందూ పత్రికలో 2006 సెప్టెంబరు 16న వైజు నరవనె రాసిన వార్త ఆధారంగా.)*

ఇప్పుడు కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి :

- దీనివల్ల ప్రయోజనం పొందిన వాళ్లు ఎవరు, పొందనివాళ్లు ఎవరు?
- ఈ దేశానికి అభివృద్ధి లక్ష్యాలు ఎలా ఉండాలి?
- మీ గ్రామానికి, పట్టణానికి, లేదా ప్రాంతానికి కొన్ని అభివృద్ధి లక్ష్యాలను పేర్కొనండి.
- ప్రభుత్వానికి, అణు విద్యుత్ కేంద్ర ప్రాంతాలలో నివసించే ప్రజలకు మధ్యగల వివాదాలేవి?
- ఇటువంటి అభివృద్ధి విధానాలకు చెందిన వివాదాలు మీకేమైనా తెలుసా? ఇరుపక్షాల వాదనలు పేర్కొనండి.

## ఆదాయం, ఇతర లక్ష్యాలు

పట్టిక 1 మరోసారి చూస్తే ఒక విషయం మాత్రం సర్వసాధారణమనిపిస్తుంది. ప్రజలు క్రమం తప్పకుండా పని, మెరుగైన కూలీ, తమ పంటలు, ఇతర ఉత్పత్తులకు మంచి ధర వంటివి కోరుకుంటున్నారు. మరోవిధంగా చెప్పాలంటే వాళ్లు మెరుగైన ఆదాయాలు కోరుకుంటున్నారు.

ఏదో ఒక రకంగా మరింత ఆదాయాన్ని పొందడమే కాకుండా ప్రజలు సమానత, స్వేచ్ఛ, భద్రత, ఇతరుల నుంచి గౌరవం పొందడం వంటి అంశాలను కోరుకుంటున్నారు. వాళ్లు వివక్షతను వ్యతిరేకిస్తున్నారు. ఇవన్నీ ముఖ్యమైన లక్ష్యాలే. వాస్తవానికి ఒక్కొక్కసారి మెరుగైన ఆదాయం లేదా మరింత వస్తు వినిమయం కంటే ఇవి ముఖ్యమౌతాయి, ఎంతైనా జీవించటానికి భౌతిక వస్తువులు మాత్రమే సరిపోవు. డబ్బు, లేదా అది కొనగలిగిన వస్తువులు మన జీవితంలో ఒక అంశం మాత్రమే. పైన పేర్కొన్న భౌతికం కాని అంశాల పైన జీవన నాణ్యత ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మీకు స్పష్టత లేకపోతే మీ జీవితంలో మీ మిత్రుల పాత్ర గురించి ఆలోచించండి. మీరు వాళ్ల స్నేహాన్ని కోరుకుంటారు. అదేవిధంగా అంత తేలికగా కొలవలేని అనేక అంశాలు మన జీవితాలకు ఎంతో ముఖ్యమైనవి. వీటిని తరుచుగా పట్టించుకోరు. అయితే కొలవలేని అంశాలు ముఖ్యం కాదు అనే నిర్ణయానికి రావటం సరైంది కాదు.




మరొక ఉదాహరణ తీసుకుందాం. మీకు దూర ప్రదేశంలో ఉద్యోగం వస్తే జీతమే కాకుండా ఇంకా అనేక అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు: మీ కుటుంబానికి ఉండే సదుపాయాలు, పని పరిస్థితులు, నేర్చుకోటానికి గల అవకాశాలు. ఒక్కొక్కసారి తక్కువ జీతమైనా క్రమం తప్పకుండా పని దొరికి అది భద్రతాభావాన్ని కలిగించవచ్చు.

మరొక ఉద్యోగంలో ఎక్కువ జీతం ఉండవచ్చు కానీ అందులో ఉద్యోగ భద్రత ఉండక పోవచ్చు, కుటుంబంతో గడపటానికి సమయం మిగలకపోవచ్చు. దీనివల్ల స్వేచ్ఛలేదన్న భావన, అభద్రతా భావం కలుగుతాయి.

అదేవిధంగా అభివృద్ధికి ప్రజలు మిశ్రమ లక్ష్యాలను పరిగణనలోకి తీసుకుంటారు. మహిళలు వేతనంతో కూడిన పనిచేస్తుంటే కుటుంబంలోనూ, సమాజంలోనూ వాళ్ల హోదా పెరుగుతుందన్నది నిజమే. అయితే, మహిళలపట్ల గౌరవం ఉంటే ఇంటిపనిని మరింత పంచుకుంటారు, మహిళలు బయట పని చెయ్యటానికి మరింత ఆమోదం లభిస్తుంది అన్నది కూడా నిజమే. భద్రతతో కూడిన సురక్షితమైన వాతావరణం ఉంటే మహిళలు అనేక రకాల ఉద్యోగాలు చేపట్టటానికి, వ్యాపారాలు నిర్వహించటానికి అవకాశం కలుగుతుంది.

- విభిన్న వ్యక్తులకు అభివృద్ధి పట్ల విభిన్న భావనలు ఎందుకుంటాయి? కింద ఇచ్చిన వివరణల్లో ఏది ముఖ్యమైనది, ఎందుకు?
  - అ. వ్యక్తులు వేరు కాబట్టి
  - ఆ. వ్యక్తుల జీవన పరిస్థితులు వేరు కాబట్టి
- కింది రెండు వాక్యాల అర్థం ఒకటేనా? మీ సమాధానాన్ని ఎలా సమర్థించుకుంటారు?
  - అ. ప్రజల అభివృద్ధి లక్ష్యాలు వేరువేరుగా ఉంటాయి.
  - ఆ. ప్రజల అభివృద్ధి లక్ష్యాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి.
- మన జీవితంలో ఆదాయంకంటే ముఖ్యమైన ఇతర అంశాలకు కొన్ని ఉదాహరణలు ఇవ్వండి.
- పై భాగంలోని ముఖ్యమైన అంశాలను మీ సొంత మాటలలో వివరించండి.

కాబట్టి ప్రజలకు ఉండే అభివృద్ధి లక్ష్యాలు మెరుగైన ఆదాయాల గురించే కాకుండా జీవితంలో ముఖ్యమైన ఇతర అంశాలు కూడా ఉంటాయి.

## వేరువేరు దేశాలను లేదా రాష్ట్రాలను ఎలా పోల్చుతాం?

వేరువేరు వస్తువులను పోల్చినప్పుడు వాటిల్లో పోలికలు ఉండవచ్చు, లేదా తేడాలు ఉండవచ్చు. ఏ అంశాల ఆధారంగా వాటిని పోలుస్తాం? తరగతిలోని విద్యార్థులనే తీసుకుందాం. వేరు వేరు విద్యార్థులను ఎలా పోలుస్తాం? ఎత్తు, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఆసక్తులలో వాళ్లలో తేడాలుంటాయి. బాగా ఆరోగ్యంగా ఉన్న విద్యార్థి బాగా చదివే విద్యార్థి కాకపోవచ్చు. బాగా తెలివైన విద్యార్థి స్నేహపూర్వకంగా ఉండకపోవచ్చు. మరి విద్యార్థులను ఎలా పోలుస్తాం? ఎందుకు పోలుస్తున్నాం అనేదాన్ని బట్టి ఎంచుకునే ప్రామాణికాలు ఆధారపడి ఉంటాయి. ఆటల జట్టుకు, వక్తృత్వ పోటీకి, సంగీత బృందానికి, లేదా విహారయాత్రా నిర్వహణకు బృందాన్ని ఎంపిక చెయ్యటానికి వేరు వేరు ప్రామాణికాలను తీసుకుంటాం. కానీ తరగతిలో పిల్లల సమగ్ర అభివృద్ధిని అంచనా వేయాలనుకుందాం, అప్పుడు ఏం చేస్తాం?

ఇలాంటప్పుడు మనం సాధారణంగా ముఖ్యమైన లక్షణాలను తీసుకుని వీటి ఆధారంగా వ్యక్తులను పోల్చుతాం. పోల్చటానికి తీసుకోవలసిన ముఖ్యమైన లక్షణాలు ఏమిటన్నదానిపై అభిప్రాయ భేదాలు

ఉండవచ్చు: స్నేహశీలత, సహకార స్ఫూర్తి లేదా సృజనాత్మకతా లేదా సాధించిన మార్కులా?

దేశాలను పోల్చటానికి ముఖ్యమైన ప్రామాణికాల్లో వాటి ఆదాయం ఒకటిగా పరిగణిస్తారు. ఎక్కువ ఆదాయం ఉన్న దేశాలు తక్కువ ఆదాయం ఉన్న దేశాలకంటే అభివృద్ధి చెందాయి. ఎక్కువ ఆదాయం ఉంటే, వారికి అవసరమైనవి ఎక్కువ ఉంటాయన్న అభిప్రాయంతో ఇలా భావిస్తారు. ప్రజలు తమకు ఇష్టమైనవి, అవసరమైనవి ఎక్కువ ఆదాయాలతో సమకూర్చుకోగలుగుతారు. కాబట్టి అధిక ఆదాయం ఉండటం ఒక ముఖ్యమైన ప్రామాణికంగా పరిగణిస్తారు.

దేశ ఆదాయం (జాతీయ ఆదాయం) అంటే ఏమిటి? దేశవాసులందరి ఆదాయమూ కలిపి దేశ ఆదాయం అవుతుందని వెంటనే చెబుతాం. ఇది దేశం మొత్తం ఆదాయాన్ని సూచిస్తుంది.

అయితే, దేశాలను పోల్చటానికి దేశ మొత్తం ఆదాయం అంతగా ఉపయోగపడదు. వివిధ దేశాల జనాభాలో తేడా ఉంటుంది కాబట్టి మొత్తం ఆదాయాలను పోలిస్తే సగటు వ్యక్తి ఆదాయం ఎంత ఉంటుందో తెలియదు. ఒక దేశంలోని ప్రజలు మరో దేశ ప్రజలకంటే మెరుగ్గా ఉన్నారా లేదా అనే విషయం తెలిసికోవడానికి మనం సగటు ఆదాయాన్ని పోలుస్తాం. దేశం మొత్తం ఆదాయాన్ని దేశ జనాభాతో భాగిస్తే ఇది వస్తుంది. సగటు ఆదాయాన్ని తలసరి ఆదాయం అని కూడా అంటారు.

దేశాలను వర్గీకరించటానికి ప్రపంచ బ్యాంకు తన ప్రపంచ అభివృద్ధి నివేదికలో ఈ ప్రామాణికాన్ని ఉపయోగించింది. 2012 సంవత్సరానికి 12,600 అమెరికన్ డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశాలను అధిక ఆదాయ దేశాలు లేక ధనిక దేశాలు అంటారు. అదే విధంగా 2012లో 1,035 అమెరికన్ డాలర్ల కంటే తక్కువ తలసరి ఆదాయం ఉండే దేశాలను తక్కువ ఆదాయ దేశాలు అంటారు. అయితే ఒక దశాబ్దం క్రితం భారతదేశం తక్కువ ఆదాయ దేశాల జాబితాలో ఉండేది. చాలా ఇతర దేశాలకంటే భారతదేశ తలసరి ఆదాయం వేగంగా పెరగటంతో దాని స్థానం మెరుగుపడింది. భారతదేశ ప్రజల ఆదాయం పెరుగుదల గురించి తరువాత అధ్యాయంలో చదువుతాం.

పశ్చిమ ఆసియా దేశాలు, మరికొన్ని చిన్న దేశాలు మినహా ధనిక దేశాలను సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాలని అంటారు.

పోలికకు 'సగటు' ఉపయోగకరంగా ఉన్నా అది ప్రజల మధ్య అంతరాలను వెల్లడి చేయదు.

ఉదాహరణకు క, గ అనే రెండు దేశాలను తీసుకుందాం. సంక్లిష్టంగా లేకుండా ఉండటానికి రెండు దేశాలలోనూ అయిదుగురే ప్రజలు ఉన్నారనుకుందాం. పట్టిక 2.2లో ఇచ్చిన వివరాల ఆధారంగా రెండు దేశాల సగటు ఆదాయాన్ని లెక్కగట్టండి.

*పట్టిక 2 : రెండు దేశాలను పోల్చటం*

| దేశం | 2001లో పౌరుల నెలసరి ఆదాయం (రూపాయలలో) | | | | | |
|---|---|---|---|---|---|---|
| | I | II | III | IV | V | సగటు |
| దేశం 'క' | 9500 | 10500 | 9800 | 10000 | 10200 | |
| దేశం 'గ' | 500 | 500 | 500 | 500 | 48000 | |

పై రెండు దేశాలలో, ఏ దేశంలో ఉన్నా మీరు సంతోషంగా ఉంటారా? రెండు దేశాల అభివృద్ధి స్థాయి ఒకటేనా? 'గ' దేశంలో అయిదవ పౌరునిగా ఉండటం మనలో కొంతమంది ఇష్టపడవచ్చు, కానీ మనం ఏ పౌరునిగా ఉంటామన్నది లాటరీ మీద ఆధారపడి ఉంటే మనలో చాలా మందిమి 'క' దేశంలో ఉండటానికి ఇష్టపడతాం. రెండు దేశాల సగటు ఆదాయం ఒకటే అయినా 'క' దేశంలో పంపిణీ సమానంగా ఉంది. ఈ దేశంలో మరీ ధనవంతులు లేరు, మరీ పేదవాళ్లు లేరు, అదే 'గ' దేశంలో నలుగురు పౌరులు అత్యంత పేదలు కాగా, ఒక వ్యక్తి అత్యంత ధనవంతుడు. కాబట్టి, సగటు ఆదాయం పోలికకు ఉపయోగపడినా, ప్రజల మధ్య ఈ ఆదాయం ఎలా పంపిణీ అయిందో తెలియదు.

మేము కుర్చీలు చేశాం, మేమే ఉపయోగిస్తాం

*ధనికులుగానీ, పేదలుగానీ లేని దేశం*



*ధనికులు, పేదలు ఉన్న దేశం*



- ఇక్కడ ఇచ్చిన ఉదాహరణ కాకుండా పోలికకు సగటును ఉపయోగించే మరో మూడు ఉదాహరణలు ఇవ్వండి.
- అభివృద్ధికి సగటు ఆదాయం ముఖ్యమైన ప్రామాణికమని ఎందుకంటున్నారు? వివరించండి.
- కొంత కాలంగా ఒక దేశ సగటు ఆదాయం పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయని అనుకుందాం. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల జీవితం మెరుగయ్యిందని దీని ఆధారంగా చెప్పగలమా? మీ జవాబుకు ఒక ఉదాహరణ ఇవ్వండి.
- ప్రపంచ అభివృద్ధి నివేదిక 2012 ప్రకారం మధ్య ఆదాయ దేశాల తలసరి ఆదాయం ఎంతో పైన ఉన్న భాగం చదివి చెప్పండి.
- అభివృద్ధి చెందిన దేశంగా మారటానికి మీకుగల ఆలోచన ప్రకారం భారతదేశం ఏం చెయ్యాలో, లేదా ఏం సాధించాలో ఒక పేరా రాయండి.

## ఆదాయం, ఇతర ప్రామాణికాలు

వ్యక్తులను, ఆకాంక్షలను, లక్ష్యాలను చూసినప్పుడు మెరుగైన ఆదాయమే కాకుండా భద్రత, ఇతరులతో గౌరవింపబడటం, సమానంగా చూడబడటం, స్వేచ్ఛ వంటి లక్ష్యాలు కూడా ఉన్నాయని తెలిసింది. అదేవిధంగా, ఒక దేశం లేదా ఒక ప్రాంతం గురించి ఆలోచించినప్పుడు సగటు ఆదాయమే కాకుండా ఇతర ముఖ్యమైన ప్రామాణికాలు కూడా ఉన్నాయని తెలుస్తుంది.

*పట్టిక 3 : కొన్ని రాష్ట్రాల తలసరి ఆదాయం*

| రాష్ట్రం | 2012 సం॥లో తలసరి ఆదాయం (రూ..లో) |
|---|---|
| పంజాబ్ | 78,000 |
| హిమాచల్‌ప్రదేశ్ | 74,000 |
| బీహార్ | 25,000 |

ఈ ప్రామాణికాలు ఏమై ఉండవచ్చు? ఒక ఉదాహరణ తీసుకుని దీనిని పరిశీలిద్దాం. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, బీహార్‌ల తలసరి ఆదాయాలు పట్టిక 2.3లో ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాలలో తలసరి ఆదాయం అత్యధికంగా పంజాబ్‌లో ఉంది, బీహార్ అట్టడుగున ఉంది. ఈ పట్టిక ప్రకారం సగటున ఒక సంవత్సరంలో ఒక వ్యక్తి ఆదాయం పంజాబ్‌లో 78,000 రూపాయలు కాగా, బీహార్‌లో 25,000 రూపాయలు. అంటే, తలసరి ఆదాయాన్ని అభివృద్ధికి కొలబద్దగా తీసుకుంటే ఈ మూడింటిలో పంజాబ్ అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగానూ, బీహార్ అతి తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రంగానూ పరిగణిస్తారు. ఇప్పుడు ఈ రాష్ట్రాలకు సంబంధించి పట్టిక 4లో ఇచ్చిన మరికొన్ని వివరాలను చూద్దాం.

*పట్టిక 4 : కొన్ని రాష్ట్రాలకు సంబంధించి కొన్ని తులనాత్మక గణాంకాలు*

| రాష్ట్రం | శిశుమరణాలు వెయ్యికి (2006) | అక్షరాస్యత శాతం (2011) | నికర హాజరు శాతం (2006) |
|---|---|---|---|
| పంజాబ్ | 42 | 77 | 76 |
| హిమాచల్‌ప్రదేశ్ | 36 | 84 | 90 |
| బీహార్ | 62 | 64 | 56 |

***పట్టిక 4లో పేర్కొన్న అంశాలకు వివరణలు: శిశుమరణాలు:***సజీవంగా పుట్టిన ప్రతి వెయ్యిమంది పిల్లల్లో సంవత్సరం పూర్తి అయ్యేసరికి ఎంతమంది చనిపోతున్నారో తెలియచేసే సంఖ్య.

**అక్షరాస్యత శాతం:** ఏడు సంవత్సరాలు, అంతకు మించిన వయస్సు వాళ్లల్లో అక్షరాస్యతను తెలియచేస్తుంది.

**నికర హాజరు శాతం:** 6-17 సంవత్సరాల వయస్సు పిల్లల్లో బడికి హాజరవుతున్న పిల్లల శాతం.

హిమాచల్ ప్రదేశ్‌లో పుట్టిన ప్రతి 1000 మంది పిల్లల్లో 36 మంది ఒక సంవత్సరం వయస్సు పూర్తికాకుండానే చనిపోతున్నారని పై పట్టిక ద్వారా తెలుస్తుంది. పంజాబ్‌లో వీరి సంఖ్య 42గా ఉంది. నికర హాజరుకూడ ఇదే మాదిరిగా కనిపిస్తుంది. బీహార్‌లో సగం మంది పిల్లలు కూడా బడికి వెళ్ళటం లేదు.

## ప్రజా సదుపాయాలు

పంజాబులోని సగటు వ్యక్తి ఆదాయం హిమాచల్‌ప్రదేశ్‌లోని సగటు వ్యక్తి ఆదాయం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ కొన్ని కీలక రంగాలలో వాళ్లు ఎందుకు వెనకబడి ఉన్నారు? మీ జేబులో డబ్బు ఉన్నప్పటికీ మీరు బాగా జీవించటానికి అవసరమైన వస్తువులు, సేవలు అన్నింటినీ మీరు కొనుక్కోలేకపోవచ్చు. అంటే పౌరులు ఉపయోగించుకోగల భౌతిక వస్తువులు, సేవలను కేవలం ఆదాయం సూచించలేదు. ఉదాహరణకు మీ డబ్బు కాలుష్యంలేని వాతావరణాన్ని కొనివ్వలేదు, లేదా కల్తీలేని మందులు దొరుకుతాయన్న హామీ ఇవ్వలేదు. మహాఅయితే మీరు ఇవి ఉండే ప్రాంతానికి మారగలరంతే. మీ ప్రాంతంలోని ప్రజలందరూ నివారణ చర్యలు చేపడితే తప్పించి డబ్బు మిమ్మల్ని అంటురోగాల నుంచి రక్షించలేకపోవచ్చు.

వాస్తవానికి జీవితంలో ఎన్నో ముఖ్యమైన వాటిని అందించటానికి, తక్కువ ఖర్చుతో చెయ్యాలంటే ఇటువంటి వస్తువులను, సేవలను సామూహికంగా అందించాలి. ఒక్కసారి ఆలోచించండి: ఒక ప్రాంతమంతటికి భద్రత కల్పించటానికి తక్కువ ఖర్చు అవుతుందా, లేక ప్రతి ఇంటికీ వేరు వేరుగా ఒక భద్రతా సిబ్బంది ఉంటే తక్కువ ఖర్చు అవుతుందా? మీ ఊళ్లో, లేదా మీ ప్రాంతంలో మీ ఒక్కరు తప్పించి ఇంకెవ్వరికీ చదువుపట్ల ఆసక్తి లేదనుకోండి. అప్పుడు మీరు చదువుకోగలుగుతారా? దూరంగా గల ప్రైవేటు పాఠశాలకు మీ తల్లిదండ్రులు పంపించగలిగితే తప్ప మీరు చదువుకోలేరు. అంటే ఇంకా చాలామంది పిల్లలు చదువుకోవాలనుకుంటున్నందువల్ల, పిల్లలందరికీ చదువుకోటానికి అవకాశం ఉండేలా ప్రభుత్వం పాఠశాలలు తెరిచి, ఇతర సౌకర్యాలు కల్పించాలని చాలామంది భావించటం వల్ల మీరు చదువుకోగలుగుతున్నారు. ఇప్పటికి కూడా చాలా ప్రాంతాలలో ప్రభుత్వం/ సమాజం అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవటం పిల్లలు, ప్రత్యేకించి ఆడపిల్లలు ప్రాథమికోన్నత చదువు కొనసాగించలేకపోతున్నారు.

కొన్ని రాష్ట్రాలలో మౌలిక ఆరోగ్య సదుపాయాలు, విద్యా సౌకర్యాలు తగినంతగా ఉన్నందువల్ల అక్కడ శిశు మరణాలు తక్కువగా ఉన్నాయి. అదే విధంగా కొన్ని రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ బాగా పని చేస్తోంది. అటువంటి రాష్ట్రాలలో ఏదైనా పౌర సరఫరాల దుకాణం సరిగా పనిచేయకపోతే అక్కడి ప్రజలు దానిని సరిచేయించుకోగలుగుతున్నారు. ఇటువంటి రాష్ట్రాలలో ప్రజల ఆరోగ్యం, పోషకాహార స్థాయి మెరుగ్గా ఉండే అవకాశాలు ఉన్నాయి.

- పట్టికలు 3, 4 లలోని వివరాలు చూడండి. తలసరి ఆదాయాలలో బీహార్ కంటే పంజాబు ముందున్నట్లుగా అక్షరాస్యత వంటి వాటిల్లో కూడా ఉందా?
- వ్యక్తులుగా సమకూర్చుకోవటం కంటే సామూహికంగా వస్తువులు, సేవలు సమకూర్చుకోవటానికి తక్కువ ఖర్చు అయ్యే మరికొన్ని ఉదాహరణలు పేర్కొనండి.
- ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వం ఖర్చుపెట్టే డబ్బుపైనే మెరుగైన సేవలు అందుబాటులో ఉండటం ఆధారపడిఉందా? ఇంకా ఏయే అంశాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి?
- తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలోని గ్రామీణ ప్రాంతంలోని కుటుంబం 2009-10లో చౌకధరల దుకాణాల నుంచి తమకు అవసరమైన దాంట్లో 53 శాతం, 33 శాతం కొనుక్కున్నాయి. మిగిలిన బియ్యం బజారు నుంచి కొనుక్కుంటారు. పశ్చిమ బెంగాల్, అస్సాంలలో 11 శాతం, 6 శాతం బియ్యం మాత్రమే పౌరసరఫరా దుకాణాలనుంచి కొనుక్కుంటున్నాయి. ఏ రాష్ట్రాల ప్రజలు మెరుగ్గా ఉన్నారు? ఎందుకు?

### మానవ అభివృద్ధి నివేదిక

ఆదాయ స్థాయి ముఖ్యమైనప్పటికీ అభివృద్ధిని సూచించటానికి అదొక్కటే సరిపోదని గుర్తించిన తరువాత ఇతర ప్రామాణికాల గురించి ఆలోచించటం మొదలుపెడతాం. ఇటువంటి ప్రామాణికాల జాబితా చాలా పెద్దగా ఉంటే అప్పుడది అంతగా ఉపయోగపడదు. చాలా ముఖ్యమైన అంశాల చిన్న జాబితా కావాలి. కేరళ, పంజాబులను పోల్చటానికి ఉపయోగించిన ఆరోగ్యం, విద్యా సూచికలు ఎంతో ముఖ్యమైనవి. గత దశాబ్ద కాలంనుంచి అభివృద్ధికి కొలమానంగా ఆదాయంతోపాటు ఆరోగ్యం, విద్యా సూచికలను కూడా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) ప్రచురించిన మానవ అభివృద్ధి నివేదిక దేశాలను ఆ ప్రజల విద్యాస్థాయి, ఆరోగ్య స్థితి, తలసరి ఆదాయాలను బట్టి పోలుస్తుంది.

మానవ అభివృద్ధి నివేదిక 2013లో భారతదేశం, దాని పొరుగు దేశాలకు సంబంధించి కొన్ని గణాంకాలను పరిశీలిస్తే ఆసక్తికరంగా ఉంటుంది.

*పట్టిక 5 : 2013 లో భారతదేశం, దాని పొరుగు దేశాలకు సంబంధించిన కొన్ని వివరాలు*

| దేశం | తలసరి ఆదాయం, డాలర్లలో | ఆయు: ప్రమాణం సంవత్సరాలలో | సగటున బడిలో గడిపిన సంవత్సరాలు | పాఠశాల విద్యలో ఉండే సంవత్సరాలు | ప్రపంచ మానవ అభివృద్ధి సూచికలో స్థానం |
|---|---|---|---|---|---|
| శ్రీలంక | 5170 | 75.1 | 9.3 | 12.7 | 92 |
| భారతదేశం | 3285 | 65.8 | 4.4 | 10.7 | 136 |
| పాకిస్తాన్ | 2566 | 65.7 | 4.9 | 7.3 | 146 |
| మయన్మార్ | 1817 | 65.7 | 3.9 | 9.4 | 149 |
| బంగ్లాదేశ్ | 1785 | 69.2 | 4.8 | 8.1 | 146 |
| నేపాల్ | 1137 | 69.1 | 3.2 | 8.9 | 157 |

**పట్టిక 5 కు సంబంధించిన వివరాలు:**

1. మానవ అభివృద్ధి సూచికలో మొత్తం 177 దేశాలలో ఆయా దేశాల స్థానాన్ని ఇస్తుంది.
2. వ్యక్తి జీవించే సగటు కాలం: జన్మించిననాటి నుండి ఒక వ్యక్తి యొక్క సగటు జీవిత కాలాన్ని సూచిస్తుంది.
3. సగటున బడిలో గడిపిన కాలం : 25 సంవత్సరాల వయసు దాటిన వాళ్ళు సగటున బడిలో గడిపిన సంవత్సరాలు.
4. పాఠశాల విద్యలో ఉండే సంవత్సరాలు : ప్రస్తుతం బడిలో పిల్లలు చేరుతున్నదాన్నిబట్టి బడి ఈడు పిల్లలు బడిలో ఎన్ని సంవత్సరాలు ఉంటారన్న అంచనా.
5. తలసరి ఆదాయం : పోల్చటానికి వీలుగా అన్నిదేశాల తలసరి ఆదాయాన్ని అమెరికన్ డాలర్లలో లెక్కిస్తారు. ప్రతి దేశంలోనూ ప్రతి డాలరు అంతే మొత్తంలో సరుకులు, సేవలు కొనగలిగేలా దీనిని లెక్కిస్తారు.




*పటం 1 : మానవాభివృద్ధిని సూచించు ప్రపంచ పటం. వివిధ ఖండాలలో మానవాభివృద్ధి తీరుతెన్నులను గమనించండి*

మన పొరుగున ఉన్న శ్రీలంక వంటి చిన్నదేశం ప్రతి అంశంలోనూ మన కంటే ఎంతో ముందు ఉండటం, మన దేశం వంటి పెద్ద దేశం ప్రపంచ దేశాలలో చాలా అడుగున ఉండటం ఆశ్చర్యకరంగా లేదూ? నేపాల్‌ను భారతదేశంతో పోలిస్తే తలసరి ఆదాయంలో సగమే ఉన్నప్పటికీ విద్యా స్థాయిలో భారతదేశం కంటే ఎంతో వెనకబడిలేదని ఈ పట్టిక చూస్తే తెలుస్తుంది. సగటు ఆయు: ప్రమాణం విషయంలో భారతదేశం కంటే నేపాల్ ముందు ఉంది.

మానవ అభివృద్ధి సూచికను లెక్కించటంలో ఎన్నో మెరుగులను సూచించారు. మానవ అభివృద్ధి నివేదికకు ఎన్నో కొత్త అంశాలను చేర్చారు. అయితే 'అభివృద్ధి'కి ముందు 'మానవ' అని చేర్చటంతో ఒక దేశంలోని పౌరులకు ఏమవుతోందన్నది అభివృద్ధిలో చాలా ముఖ్యమనే విషయాన్ని ఇది స్పష్టపరుస్తోంది. ప్రజలు, వాళ్ల ఆరోగ్యం, వాళ్ల సంక్షేమం చాలా ముఖ్యమైనవి.

## పురోగతిగా అభివృద్ధి

మానవ అభివృద్ధి సూచికలలో కొన్ని దేశాలు మరికొన్ని దేశాలకంటే ముందున్నాయన్నది చూశాం. అదేవిధంగా రాష్ట్రంలోపల తేడాలు ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్రాలు మానవ అభివృద్ధి సూచికలలో ముందున్నాయి. కొన్ని జిల్లాలు మిగిలిన జిల్లాలకంటే ముందు ఉండవచ్చు. పోలికలు, స్థానాలకు వాటంతట వాటికి ఎటువంటి ఉపయోగమూ లేదన్నది గుర్తుంచుకోండి. కొన్ని ప్రాంతాలు మిగిలిన ప్రాంతాల కంటే ఎందుకు వెనకబడి ఉన్నాయని అర్థవంతంగా ఆలోచించగలిగితేనే ఇవి ఉపయోగపడతాయి. మానవ అభివృద్ధి సూచికలలో దిగువన ఉండటం ప్రజల జీవితాలలోని కొన్ని అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్న సంకేతాన్ని ఇస్తోంది. లేకపోతే, కొన్ని రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల కంటే ముందు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించుకోవచ్చు. ఉదాహరణకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ప్రజలు సగటున మిగిలిన రాష్ట్రాలకంటే ఎక్కువ చదువుకోవటానికి కారణం ఏమిటి? (పట్టిక 4 చూడండి.)

'హిమాచల్‌ప్రదేశ్‌లో పాఠశాల విద్యా విప్లవం'గా పరిగణింపబడుతున్న దానిని మరింత లోతుగా చూద్దాం. దీనినుంచి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. మార్పు తీసుకురావటానికి ఎన్ని అంశాలు కలిసి రావాలో ఇది తెలియచేస్తుంది. అభివృద్ధి అన్నది నిజంగానే చాలా సంక్లిష్టమైన విషయం.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశంలోని అనేక ఇతర రాష్ట్రాలలో మాదిరిగానే హిమాచల్‌ప్రదేశ్‌లోనూ విద్యాస్థాయి చాలా తక్కువగా ఉంది. కొండ ప్రాంతం కావటంతో చాలా గ్రామాలలో జనసాంద్రత చాలా తక్కువ. పాఠశాలల విస్తరణ, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలోకి విస్తరించటం పెద్ద సవాలుగా ఉండింది. అయితే హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వమూ, అక్కడి ప్రజలు విద్యపై ఎంతో ఆసక్తి చూపారు. ఈ ఆకాంక్షను సాకారం చెయ్యటం ఎలా?




పాఠశాలలు తెరిచి చాలా వరకు విద్య ఉచితంగా ఉండేలా లేదా తల్లిదండ్రులకు నామమాత్రపు ఖర్చు అయ్యేలా ప్రభుత్వం

చూసింది. అంతేకాకుండా ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస సదుపాయాలు ఉండేలా చూసింది. కాలం గడుస్తున్న కొద్దీ ఈ సదుపాయాలను మెరుగుపరిచారు, విస్తృతం చేశారు. ఇంకా ఎక్కువ మంది పిల్లలు తేలికగా చదువుకోవటానికి మరిన్ని పాఠశాలలను తెరిచి, ఉపాధ్యాయులను నియమించారు. పాఠశాలలు తెరిచి, వాటిని బాగా నిర్వహించటానికి ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టాలి. భారతదేశ రాష్ట్రాలలో ప్రభుత్వ బడ్జెటులో ప్రతి విద్యార్థి చదువుపై ఎక్కువ మొత్తం ఖర్చు పెడుతున్న రాష్ట్రాలలో హిమాచల్‌ప్రదేశ్ ఒకటి. 2005 సంవత్సరంలో భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై సగటున ప్రతి విద్యార్థిపై 1,049 రూపాయలు ఖర్చు పెడుతుంటే హిమాచల్‌ప్రదేశ్ 2,005 రూపాయలు ఖర్చు పెడుతోంది!

విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వటంవల్ల మంచి ఫలితాలు వచ్చాయి. పాఠశాల విద్యపై 1996 లోనూ, తిరిగి 2006లోనూ క్షుణ్ణంగా సర్వేచేసి ఇలా పేర్కొన్నారు:

*హిమాచల్‌ప్రదేశ్‌లో పిల్లలు చాలా ఉత్సాహంతో బడికి వస్తారు. అధికశాతం మంది పిల్లలకు వాళ్ల పాఠశాల అనుభవం ఎంతో సంతోషదాయకంగా ఉంది. చంబా గ్రామంలో 4వ తరగతి చదువుతున్న నేహా, "టీచరు మమ్మల్ని ప్రేమతోచూస్తారు, పాఠాలు బాగా చెబుతారు", అని పేర్కొంది. ఇంకా పై తరగతులు చదవాలని, పోలీసు, శాస్త్రజ్ఞులు, టీచర్లు కావాలని పిల్లలు కోరుకుంటున్నారు. ప్రాథమిక తరగతులలో హాజరు శాతం చాలా ఎక్కువగా ఉంది, పై తరగతులలో కూడా హాజరు బాగానే ఉంది.*

పాఠశాల విద్యలో పది సంవత్సరాలు గడపటం అనేది హిమాచల్‌ప్రదేశ్ పిల్లలకు నియమంగా మారిపోయింది.

దేశంలో అనేక ప్రాంతాలలో మగపిల్లల చదువుతో పోలిస్తే ఆడపిల్లల చదువుకు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆడపిల్లలు కొన్ని తరగతులు చదువుతారు కానీ పాఠశాల విద్య పూర్తి చెయ్యరు. ఆడపిల్లల పట్ల అంతగా వివక్షత లేకపోవటం అనేది హిమాచల్‌ప్రదేశ్‌లో చెప్పుకోదగిన విషయం. కొడుకుల లాగానే కూతుళ్లు కూడా చదువుకోవాలని అక్కడి తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. అందుకనే 13–18 వయస్సు ఆడపిల్లల్లో అత్యధిక శాతం ఎనిమిదవ తరగతి పూర్తి చేసి ఇంకా పై తరగతులలో కొనసాగిస్తున్నారు. దీని అర్థం స్త్రీ, పురుషుల హోదాలలో తేడాలు లేవని కాదు, ఇతర ప్రాంతాలతో, ప్రత్యేకించి ఉత్తర భారత రాష్ట్రాలతో పోలిస్తే తేడాలు తక్కువ.

లింగ వివక్షత తక్కువగా ఉండటం ఆశ్చర్యం కలిగించవచ్చు. విద్యలోనే కాకుండా దీనిని ఇతర రంగాలలోనూ చూస్తాం. ఇతర రాష్ట్రాలలో పరిస్థితికి విరుద్ధంగా హిమాచల్‌ప్రదేశ్‌లో పుట్టిన కొన్ని నెలల్లో చనిపోయే పిల్లల్లో మగపిల్లల కంటే ఆడపిల్లల సంఖ్య తక్కువ. దీనికి ఒక కారణం హిమాచల్‌ప్రదేశ్ మహిళలు ఇంటి బయట ఉద్యోగాలు చేస్తున్నారు. బయట ఉద్యోగాలు చేసే మహిళలు స్వతంత్రంగా ఉంటారు, ఆత్మవిశ్వాసం కనబరుస్తారు. ఇంటిలో తీసుకునే నిర్ణయాలలో అంటే పిల్లల చదువు, ఆరోగ్యం, పిల్లల సంఖ్య, గృహ నిర్వహణ వంటి వాటిల్లో ఆడవాళ్ల మాటకు ప్రాధాన్యత ఉంటుంది. వాళ్లు ఉద్యోగాల్లో ఉండటం వల్ల పెళ్లి అయిన తరువాత తమ కూతుళ్లు ఉద్యోగాలు చెయ్యాలని తల్లులు కోరుకుంటారు. కాబట్టి చదువుకు ప్రాధాన్యతను ఇవ్వటం సహజ విషయంగానూ, సామాజిక నియమంగానూ మారిపోయింది.

సామాజిక జీవితంలోనూ, గ్రామ రాజకీయాలలోనూ హిమాచల్‌ప్రదేశ్ మహిళల పాత్ర ఇతర రాష్ట్రాలలో కంటే ఎక్కువే. పలు గ్రామాలలో చురుకుగా పనిచేస్తున్న మహిళా మండలులు కనపడతాయి.

భారతదేశంలోని రాష్ట్రాల సగటుతో పోలిస్తే హిమాచల్‌ప్రదేశ్‌లో పాఠశాల విద్యలోని ప్రగతిని ఈ పట్టిక తెలియచేస్తోంది.

*పట్టిక 6: హిమాచల్ ప్రదేశ్‌లో ప్రగతి*

| | హిమాచల్ ప్రదేశ్ | | భారత దేశం | |
|---|---|---|---|---|
| | 1993 | 2006 | 1993 | 2006 |
| (6 సంవత్సరాలు మించిన) ఆడపిల్లల్లో 5 సం॥ల కంటే ఎక్కువ కాలం బడికి వెళ్ళిన వారి శాతం | 39 | 60 | 28 | 40 |
| (6 సంవత్సరాలు మించిన) మగపిల్లల్లో 5 సం॥ల కంటే ఎక్కువ కాలం బడికి వెళ్ళిన వారి శాతం | 57 | 75 | 51 | 57 |

ఈ వివరాలు రెండు వేరు వేరు సమయాల్లో సాధించిన అభివృద్ధిని తెలియచేస్తున్నాయి. భారతదేశం మొత్తంగా కంటే హిమాచల్‌ప్రదేశ్‌లో పాఠశాల విద్య విస్తరణ, అభివృద్ధి గణనీయంగా ఉన్నాయి. మగపిల్లలు, ఆడపిల్లల సగటు విద్యా స్థాయిలో తేడా ఉన్నప్పటికీ ఇటీవలి సంవత్సరాలలో ఈ అంతరాలు తగ్గుతున్నాయి.

## సారాంశం

అభివృద్ధి లక్ష్యాలలో వైవిధ్యం ఉన్నా వాటి సాధనా మార్గాలు వేరే అయినా అవి అభివృద్ధిలో భాగమే అవుతాయి. అభివృద్ధి ప్రస్తావన వచ్చినప్పుడు ఎవరి అభివృద్ధి ముఖ్యం అన్నదే ప్రశ్న.

ఆదాయం, తలసరి ఆదాయాలను అభివృద్ధి గణనలో తరచుగా పేర్కొన్నా అవి కొంతమేరకే తప్ప సమగ్ర అభివృద్ధిని సూచించవు. జాతీయ ఆదాయంలో పెరుగుదల కన్పించినప్పటికీ పంపిణీలో చాలా అసమానతలు ఉన్నాయి.

ఆరోగ్య, విద్య, సామాజిక సూచికలను పరిగణనలోకి తీసుకోవడంతో మానవాభివృద్ధి భావన విస్తృతమైంది. అందరికీ మెరుగైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. సరైన రీతిలో ప్రజా సౌకర్యాలు కల్పించినప్పుడే అసమానతలు తగ్గి సమాజాలు సమానత్వ దిశలో వేగంగా పురోగమిస్తాయి.

### కీలక పదాలు

తలసరి ఆదాయం    మానవాభివృద్ధి    ప్రజా సదుపాయాలు    విద్య, ఆరోగ్య సూచికలు

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. వివిధ దేశాలను వర్గీకరించటంలో ప్రపంచ బ్యాంకు ఉపయోగించే ముఖ్యమైన ప్రామాణికాలు ఏమిటి? పై ప్రామాణికాలలో ఏమైనా పరిమితులు ఉంటే వాటిని పేర్కొనండి.
2. ప్రతి సామాజిక అంశం వెనక ఒకటి కాక అనేక కారణాలు ఉంటాయి. ఇక్కడ కూడా అది వర్తిస్తుంది. మీ అభిప్రాయంలో హిమాచల్‌ప్రదేశ్‌లో ఏ ఏ అంశాలు పాఠశాల విద్యకు దోహదం చేశాయి?

3. అభివృద్ధిని కొలవటానికి ప్రపంచ బ్యాంకు ఉపయోగించే ప్రామాణికాలకూ ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ఉపయోగించే వాటికీ తేడా ఏమిటి?

4. మానవ అభివృద్ధిని కొలవటానికి మీ దృష్టిలో ఇంకా ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి?

5. 'సగటు' ఎందుకు ఉపయోగిస్తాం? దీనిని ఉపయోగించటంలో ఏమైనా పరిమితులు ఉన్నాయా? అభివృద్ధికి సంబంధించి మీ సొంత ఉదాహరణను తీసుకుని దీనిని వివరించండి.

6. హిమాచల్‌ప్రదేశ్‌లో తలసరి ఆదాయం తక్కువ ఉన్నప్పటికీ పంజాబ్ కంటే మానవ అభివృద్ధి సూచికలో ముందుండటం అన్న వాస్తవం నేపథ్యంలో ఆదాయం యొక్క ప్రాముఖ్యత గురించి ఎటువంటి నిర్ధారణలు చేయవచ్చు?

7. పట్టిక 2.6 లో ఉన్న వివరాల ఆధారంగా కింది వాటిని పూరించండి:

   ఆరు సంవత్సరాలు పైబడిన ప్రతి 100 మంది ఆడపిల్లల్లో హిమాచల్‌ప్రదేశ్‌లో 1993లో ....... ఆడపిల్లలు ప్రాథమిక స్థాయి దాటి చదివారు. 2006 నాటికి ఇది వందలో ....... మందికి చేరుకుంది. భారతదేశం మొత్తం మీద 2006లో ప్రాథమిక స్థాయి దాటి చదివిన మగపిల్లల సంఖ్య వందలో ...... మాత్రమే.

8. హిమాచల్‌ప్రదేశ్‌లో తలసరి ఆదాయం ఎంత? అధిక ఆదాయం ఉన్నప్పుడు పిల్లల్ని బడికి పంపటం తల్లిదండ్రులకు తేలిక అవుతుందా? చర్చించండి. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వం పాఠశాలలు నడపటం ఎందుకు అవసరమయ్యింది?

9. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల చదువుకు తల్లిదండ్రులు తక్కువ ప్రాధాన్యత ఎందుకు ఇస్తారు? తరగతిలో చర్చించండి.

10. ఆడవాళ్లు ఇంటి బయట పని చెయ్యటానికీ, లింగ వివక్షతకూ మధ్యగల సంబంధం ఏమిటి?

11. ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకంలో మీరు విద్యాహక్కు చట్టం (విహచ) గురించి చదివారు. 6–14 సంవత్సరాల బాలలకు ఉచిత విద్యకు హక్కు ఉందని ఈ చట్టం పేర్కొంటోంది. పరిసర ప్రాంతాలలో తగినన్ని పాఠశాలలు నిర్మించేలా, అర్హులైన టీచర్లను నియమించేలా, అవసరమైన సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చూడాలి. మీరు ఈ అధ్యాయంలో చదివినది, మీకు తెలిసిన దాన్నిబట్టి (i) బాలలకు (ii) మానవ అభివృద్ధికి ఈ చట్టం ఎలాంటి ప్రాధాన్యత కలిగి ఉందో చర్చించండి, గోష్ఠి నిర్వహించండి.

## ప్రాజెక్టు



జీవనోపాధికి సంబంధించిన వివిధ వనరులు ఈ చిత్రంలో చూపబడ్డాయి. అభివృద్ధి పట్ల వారికి గల భావనను ఇలాంటి ఒక చిత్రంతో చూపి, దానికి సరైన వ్యాఖ్యను రాయండి.

పాఠం 3

# ఉత్పత్తి, ఉపాధి

2013-14 సంవత్సరం ఏప్రిల్-జూన్ మొదటి త్రైమాసికంలో భారత దేశ ఆర్థిక స్థితి గత నాలుగేళ్లలో అతి తక్కువగా, అంటే 4.4 శాతం చొప్పున పెరిగింది. అంతకు ముందు త్రైమాసికం జనవరి-మార్చిలో ఈ వృద్ధి 4.8 శాతంగా ఉంది. మొదటి త్రైమాసికంలో వ్యవసాయం 2.7% వృద్ధి చెందగా, తయారీ పరిశ్రమలో ఇది 1.2% మాత్రమే. ఆర్థిక రంగం తిరిగి కోలుకుంటుందన్న ఆశలను ఇవి వమ్ము చేస్తున్నాయి.

ఇటువంటి వార్తా పత్రిక కథనాలను మీరు చదివి ఉంటారు. ఇవి దేనిగురించి మాట్లాడుతున్నాయి? ఎందుకు అంత నిరాశ కనపడుతోంది?

మీ ఉపాధ్యాయుని సహాయంతో ఇటువంటి వార్తా కథనాలను సేకరించి వాటిలోని అంశాలను గురించి చర్చించండి.

## ఆర్థిక వ్యవస్థలోని రంగాలు

ప్రజలు తమ జీవనోపాధికోసం రకరకాల పనులను చేపట్టడం గురించి ఎనిమిది, తొమ్మిది తరగతులలోని కొన్ని అధ్యాయాల్లో చర్చించాం. ఈ పనులను ప్రధానంగా మూడు రంగాలుగా విభజిస్తారు – 1) ఉత్పత్తి ప్రక్రియలో ప్రకృతి ప్రధాన పాత్ర వహించే వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, అటవీ, గనులకు సంబంధించిన పనులు; 2) యంత్రాలు, పరికరాలు ఉపయోగించి వస్తువులు ఉత్పత్తి చేయడం, ఇతర పరిశ్రమలు; 3) వస్తువులను నేరుగా తయారు చేయకుండా వస్తువుల ఉత్పత్తికి, ప్రజలకు అవసరమైన సేవలు అందించే కార్యకలాపాలు.

### వీటిల్లో తేడాలను మరొకసారి గుర్తు చేసుకుందాం:

- దిగువ తెలిపిన వివిధ వృత్తుల వారిని వ్యవసాయం, పరిశ్రమ, సేవా రంగాల కింద వర్గీకరించండి. మీ వర్గీకరణకు కారణాలు ఇవ్వండి.

| వృత్తి | వర్గీకరణ |
|---|---|
| బట్టలు కుట్టేవారు | |
| బుట్టలు అల్లేవారు | |
| పూల సాగు చేసేవారు | |
| పాలు అమ్మేవారు | |
| చేపలు పట్టేవారు | |
| మత బోధకులు / పూజారులు | |
| ఉత్తరాలు బట్వాడా చేసే కొరియర్ | |

| | |
|---|---|
| అగ్గిపెట్టెల కర్మాగారంలో పనిచేసేవారు | |
| వడ్డీవ్యాపారి | |
| తోటమాలి | |
| కుండలు చేసేవారు | |
| తేనెటీగలను పెంచేవారు | |
| వ్యోమగామి | |
| కాల్ సెంటర్ ఉద్యోగులు | |

- కింది పట్టిక భారత దేశంలో 1972-73లోనూ, తిరిగి 2009-10 అంటే 37 ఏళ్ల తర్వాత ఏ రంగంలో ఎంత మంది ఉపాధి పొందుతున్నారో తెలియచేస్తుంది.

| సంవత్సరం | వ్యవసాయం | పరిశ్రమ | సేవలు |
|---|---|---|---|
| 1972-73 | 74% | 11% | 15% |
| 2009-10 | 53% | 22% | 25% |

(అ) పై పట్టిక ద్వారా మీరు గమనించిన ప్రధాన మార్పులు ఏమిటి?

(ఆ) ఇంతకు ముందు మీరు చదివిన దాని ఆధారంగా ఈ మార్పులకు కారణాలు ఏమిటో చర్చించండి.

ఈ దిగువ చిత్రాలను పరిశీలించి అవి ఏ ఏ రంగాలకు చెందినవో పేర్కొనండి.




1........................ 2........................ 3........................4......................

## స్థూల జాతీయోత్పత్తి

రెండు కుటుంబాలు ఉన్నాయనుకుందాం- ఒకటి ధనిక కుటుంబం, రెండవది పేద కుటుంబం. కుటుంబ సభ్యులు వేసుకునే దుస్తులు, ప్రయాణాలకు వాడే వాహనాలు, తినే ఆహారం, ఉండే ఇల్లు, వాళ్లకున్న వస్తువులు, వైద్యం కోసం వాళ్లు వెళ్లే ఆసుపత్రులు వంటి వాటిని బట్టి మనం 'ధనిక', 'పేద' అని అంచనా వేయవచ్చు. అయితే, ఈ కుటుంబాల ఆదాయం అన్నిటికంటే ముఖ్యమైన సూచిక అవుతుంది. దేశ ఆదాయాన్ని లెక్కగట్టటానికి దేశంలో ఉత్పత్తి అయిన మొత్తం వస్తువులు, సేవల విలువను తీసుకుంటాం. ఈ విలువకు ఉపయోగించే సాంకేతిక పదం స్థూల జాతీయోత్పత్తి (GDP).

ఈ కింది చార్టు రెండు వేరు వేరు సంవత్సరాలు, 1972-73, 2009-10లకు భారతదేశ స్థూల జాతీయోత్పత్తి విలువను చూపిస్తుంది. 37 సంవత్సరాలలో మొత్తం ఉత్పత్తి పెరిగిన తీరును మీరు చూడవచ్చు.




*గ్రాఫ్ 1 : వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల వారీగా స్థూల జాతీయోత్పత్తి*

చార్టు చూసి ఈ ప్రశ్నలకు జవాబులివ్వండి :

- 1972-73లో అధిక ఉత్పత్తి ఉన్న రంగం ఏది?
- 2009-10లో అధిక ఉత్పత్తి ఉన్న రంగం ఏది?
- ఖాళీని పూరించండి :

1972-73, 2009-10 సంవత్సరాల మధ్య భారతదేశంలో మొత్తం వస్తువులు, సేవల ఉత్పత్తి సుమారుగా .......... రెట్లు పెరిగింది.

## స్థూల జాతీయోత్పత్తిని ఎలా అంచనా వేస్తాం?

పై రంగాలలో ఆర్థిక కార్యకలాపాలు చేపట్టే ప్రజలు చాలా పెద్ద మొత్తంలో వస్తువులు, సేవలను ఉత్పత్తి చేస్తారు. ప్రతి రంగంలోనూ ఎంత మంది ఉపాధి పొందుతున్నారు, ఎంత మొత్తం వస్తువులు, సేవలు ఉత్పత్తి అవుతున్నాయన్నది మనం తెలుసుకోవాలి.

కొన్ని వేలాది వస్తువులు, సేవలను అంచనావేయడం అసాధ్యమైన పని అని మీకు అనిపించవచ్చు. ఈ పని చాలా పెద్దదే కాకుండా, కార్లు, కంప్యూటర్లు, మొబైల్ ఫోను సేవలు, బుట్టలు, కుండలను జోడించటం ఎలా వీలవుతుందని మీరు ఆశ్చర్యపడవచ్చు. ఇదంతా అర్థం పర్థం లేనిదిగా ఉంటుంది!

మీ ఆలోచన సరైనదే. ఈ సమస్యను అధిగమించటానికి ఆర్థికవేత్తలు ఉత్పత్తి అయిన వాటి సంఖ్యను కాకుండా ఆయా వస్తువులు, సేవల విలువను జోడించాలని సూచిస్తారు. ఉదాహరణకు 10,000 కిలోల వడ్లను కిలో 25 రూపాయలకు అమ్మితే ఆ వడ్ల విలువ మొత్తం 2,50,000 రూపాయలు. కొబ్బరికాయకు 10 రూపాయల చొప్పున 5000 కొబ్బరికాయల విలువ 50,000 రూపాయలు అవుతుంది. ఉత్పత్తి అయిన, అమ్మిన ప్రతి వస్తువును, సేవను లెక్కించటం అవసరమా? వస్తువులు, సేవల మొత్తం విలువను ఎలా అంచనా వేస్తాం?

ఉదాహరణకు ఒక రైతు ఒక రైస్ మిల్లరుకు కిలో 25 రూపాయల చొప్పున వడ్లు అమ్మిందని అనుకుందాం. ఆమె మొత్తం 100 కిలోలు అమ్మింది. ఆమె విత్తనాలు ఏవీ కొనాల్సి రాలేదని అనుకుందాం. ఆమె ఉత్పత్తి చేసిన మొత్తం వడ్ల విలువ 2500 రూపాయలు.రైస్ మిల్లరు (i) హోటలుకు కిలో 40 రూపాయల చొప్పున 80 కిలోల బియ్యం, (ii) కిలో 20 రూపాయల చొప్పున 20 కిలోల ఊక అమ్ముతాడు. రైస్ మిల్లరు ఉత్పత్తి చేసిన మొత్తం వస్తువుల విలువ: (80X40) + (20X20) = 3600.

ఈ మొత్తాన్ని హోటలు యజమాని రైస్ మిల్లరుకు చెల్లిస్తాడు. హోటలు యజమాని ఊకను పొయ్యి మండించడానికి ఉపయోగిస్తాడు, బియ్యంతో ఇడ్లీ, దోశలు చేస్తాడు. మొత్తం ఇడ్లీలు, దోశలు అమ్మగా హోటలు యజమానికి 5000 రూపాయలు వస్తాయి.

**ప్రతి దశలో మొత్తం వస్తువుల విలువ :**

| | |
|---|---|
| మొదటి దశ (రైస్ మిల్లర్‌కు రైతు వడ్లు అమ్మడం) | రూ. 2500 |
| రెండవ దశ (హోటలు యజమానికి ఊక, బియ్యం అమ్మడం) | రూ. 3600 |
| మూడవ దశ (ఇడ్లీ, దోశలు అమ్మడం) | రూ. 5000 |

- చర్చించండి : ఉత్పత్తి అయిన మొత్తం వస్తువుల విలువను తెలుసుకోటానికి వీటన్నిటి మొత్తాన్ని జోడించాలా?

ఈ ఉదాహరణలో వడ్లు, ఊక, బియ్యం వంటివి మాధ్యమిక వస్తువులు. వీటిని అంతిమ వినియోగదారు వాడటం లేదుకాని, అంత్య వస్తువులైన ఇడ్లీ, దోశలు తయారు చేయటానికి వీటిని ఉత్పాదకాలుగా వాడుకున్నారు. మాధ్యమిక ఉత్పాదకాలు, అంతిమ వస్తువుల విలువలను కూడితే పలుమార్లు లెక్కించినట్లు అవుతుంది. అంతిమ వస్తువుల విలువలో దానిని తయారు చేయటానికి ఉపయోగించిన మాధ్యమిక వస్తువులన్నింటి విలువ ఉంది. ప్రతి దశలో ఉత్పత్తిదారులు ఉత్పాదకాలు తయారుచేసిన వారికి మొత్తం విలువ చెల్లించారు. అంటే హోటలు యజమాని అమ్మిన (అంతిమ) వస్తువుల విలువ అయిన 5000 రూపాయలలో బియ్యం, ఊకల విలువైన 3600 రూపాయలు ఉత్పాదకాలుగా ఉన్నాయి. వడ్లు మరపట్టించటంలో హోటలు యజమాని పాత్ర ఏమీ లేదు. అదేవిధంగా వడ్ల మర ఉత్పత్తి చేసిన బియ్యం, ఊకల 3600 రూపాయల విలువలో అతను కొన్న వడ్ల విలువ 2500 రూపాయలు ఉన్నాయి. అతడు వడ్లను ఉత్పత్తి చెయ్యలేదు. వీటిని మొదటి దశలో రైతు ఉత్పత్తి చేసింది. కాబట్టి వడ్లు, బియ్యం విలువను వేర్వేరుగా కూడటం సరికాదు. కొనుగోలు చేసిన భౌతిక ఉత్పాదకాల విలువను పరిగణనలోకి తీసుకోవాలి. ఆ తరువాతి ఉత్పత్తిదారు శ్రమ, ఇతర ఉత్పాదకాలను ఉపయోగించి తరువాతి దశ వస్తువును తయారుచేశారు, ఇది ఇప్పటికే ఉన్న విలువకు అదనంగా జోడించినట్లు ఉన్నాయి.

*నేను ఉత్పత్తి చేసిన గోధుమల పూర్తి విలువ నాకు రావాలి !*



- *పై ఉదాహరణలో వడ్లు, బియ్యం మధ్యదశలోని ఉత్పాదకాలు కాగా, ఇడ్లీ , దోశ వంటివి తుది ఉత్పాదకాలు. మనం నిత్య జీవితంలో ఉపయోగించే కొన్ని వస్తువులను దిగువ సూచించ్చనైనది. వాటికి ఎదురుగా ఆయా వస్తువుల మధ్య దశ ఉత్పాదకాలను రాయండి.*

| తుది ఉత్పాదకాలు | మధ్యదశ ఉత్పాదకాలు |
|---|---|
| నోటు పుస్తకం | |
| కారు | |
| కంప్యూటర్ | |

ఇతర వస్తువుల తయారీకి ఉపయోగించనట్లయితే అది అంతిమ వస్తువు అవుతుంది. పై ఉదాహరణలో రైతు కుటుంబ వినియోగానికి బియ్యం తీసుకుని ఉన్నట్లయితే అది అంతిమ వస్తువు అవుతుంది. ఇడ్లీ, దోశలను కుటుంబం తమ వినియోగానికి తయారుచేసుకుంటుంది, ఇవి అమ్మే వస్తువులు కావు.

ప్రతి దశలోనూ జోడించబడిన అదనపు విలువను మాత్రమే తీసుకోవటం మరొక పద్ధతి. దీనికి వస్తువుల అమ్మకం విలువలో అంతకు ముందు వేరే వ్యక్తి ఉత్పత్తి చేసిన భౌతిక ఉత్పాదకాల విలువను తీసెయ్యాలి. పై ఉదాహరణ ద్వారా ఉత్పత్తిదారులు జోడించిన అదనపు విలువ ఎంతో తెలుసుకుందాం:

మొదటి దశ (రైస్ మిల్లర్‌కు రైతు వడ్లు అమ్మటం) = రూ. 2500 లోంచి కొనుగోలు చేసిన ఉత్పాదకాల విలువ '0' రూపాయలు తీసేస్తే, జోడించిన విలువ 2500 రూపాయలు

రెండవ దశ (హోటల్ యజమానికి ఊక, బియ్యం అమ్మటం) = రూ. 3600 లోంచి కొనుగోలు చేసిన ఉత్పాదకాల విలువ 2500 తీసేస్తే, జోడించిన విలువ 1100 రూపాయలు

మూడవ దశ (ఇడ్లీ, దోశల అమ్మకం) = రూ. 5000 లోంచి కొనుగోలు చేసిన విలువ 3600 తీసేస్తే, జోడించిన విలువ 1400 రూపాయలు

ప్రతి దశలోనూ జోడించిన విలువ = 2500 + 1100 + 1400 = 5000

- చర్చించండి: రెండు పద్ధతులలోనూ ఒకే సమాధానం ఎందుకు వచ్చింది?

కాబట్టి ప్రతి దశలోనూ జోడించిన అదనపు విలువను కానీ, లేదా అంతిమ వస్తువుల/ సేవల విలువ కానీ తీసుకోవాలి. ఒక సంవత్సరంలో ఒక రంగంలో ఉత్పత్తి చేసిన అంతిమ వస్తువుల/ సేవల విలువ ఆ సంవత్సరానికి, ఆ రంగంలోని మొత్తం ఉత్పత్తిని సూచిస్తుంది. మూడు రంగాల ఉత్పత్తిని కలిపితే దేశ స్థూల జాతీయోత్పత్తి వస్తుంది. ఒక దేశంలో, ఒక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన అన్ని అంతిమ వస్తువులు, సేవల విలువను ఇది తెలియచేస్తుంది.

2009–10 సంవత్సరానికి స్థూల జాతీయోత్పత్తి (GDP) విలువను ఇచ్చిన సంగతి గమనించి ఉంటారు. అంటే ఏప్రిల్ 2009 నుంచి మార్చి 2010 వరకు ఉత్పత్తి చేసిన వివరాలు. దీనినే ఆర్థిక సంవత్సరం అని కూడా అంటారు.

ఉత్పత్తి అయిన అంత్య వస్తువుల సేవల మార్కెటు విలువను GDP నమోదు చేస్తుంది. కానీ మార్కెటులో కొనుగోలు/అమ్మకాలు చేయని అంశాలు ఎన్నో ఉన్నాయి. వంట చేయటం, ఇల్లు తుడవటం, ఇల్లు సర్దటం, పిల్లల్ని పెంచటం, మొక్కలను, పశువులను పోషించడంవంటి గృహ సంబంధ పనులను దీనికి ఉదాహరణగా చూడవచ్చు. స్థూల జాతీయోత్పత్తిని గణించడంలో ద్రవ్యపరమైన లావాదేవీలు లేని ఇలాంటి వాటిని పరిగణనలోకి తీసికోవడం లేదు. ఇవి ఆర్థిక వ్యవస్థలో చాలా ముఖ్యమైనవి. భారతదేశంలోనే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేసే ఈ పనులకు నేటికీ ద్రవ్యపరమైన చెల్లింపులు చేయడం లేదు.

- కింది పట్టికలో స్థూల జాతీయోత్పత్తి విలువ ఇవ్వబడింది. 2010 –2011 సంవత్సరానికి లెక్కించిన విధంగా స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రేటును మిగతా సంవత్సరాలకు గణించండి.

| ఆర్థిక సంవత్సరం | స్థూలజాతీయోత్పత్తి రూపాయలు(కోట్లలో) | గత సంవత్సరం కంటే స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల. | స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రేటు |
|---|---|---|---|
| 2009-10 | 45,16,000 | ———————— | ———————— |
| 2010-11 | 49,37,000 | [(49,37,000 – 45,16,000)/ 45,16,000] *100 | = 9.32 % |
| 2011-12 | 52,44,000 | | |
| 2012-13 | 55,05,000 | | |

## రంగాల ప్రాముఖ్యతలో మార్పు - ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవల విలువ - ఉపాధి

ప్రతి సంవత్సరం వస్తువుల, సేవల ఉత్పత్తి పెరుగుతుండటంతో స్థూల జాతీయోత్పత్తి ఎలా పెరుగుతుందో మనకు తెలుసు. ఈ పెరుగుదల ఎలా జరిగింది, దేని వల్ల స్థూల జాతీయోత్పత్తిలో ఎక్కువగా వృద్ధి కనపడింది అనేది తెలుసుకోవటం ముఖ్యం. ప్రస్తుతం అభివృద్ధి చెందినవిగా పరిగణింప బడుతున్న దేశాల అభివృద్ధి తొలి దశల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు వాటి స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలకు అధికంగా దోహదం చేశాయి.

సాగు పద్ధతులు మారుతూ వ్యవసాయం వృద్ధి చెందటంతో మునుపటికంటే ఎక్కువ ఆహారం ఉత్పత్తి అవుతోంది. అవసరమైన ఆహారాన్ని కొంతమంది రైతులు ఉత్పత్తి చేయటంతో చాలామంది ఇతర పనులు చేపట్టసాగారు. వృత్తి పనులవాళ్లు, వ్యాపారులు పెరగసాగారు. కొనుగోలు, అమ్మకాలు ఎన్నో రెట్లు పెరగటంతో వస్తువులు, సేవలకు డిమాండ్ మరింత పెరగసాగింది. అంతేకాకుండా పాలకులు పరిపాలనకు, సైన్యానికి చాలామందిని నియమించసాగారు. అయితే ఈ దశలో మొత్తం మీద ఉత్పత్తి అయిన వస్తువులలో ఎక్కువగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు చెందినవే. చాలా మందికి ఈ రంగాలలోనే ఉపాధి లభించేది.

ఇంతకు ముందు తరగతులలో పారిశ్రామిక విప్లవం గురించి మీరు చదివినది మరొకసారి గుర్తు చేసుకోండి. కొత్త ఉత్పత్తి విధానాలు రావటంతో కర్మాగారాలు ఏర్పడి, విస్తరించసాగాయి. ఇంతకు ముందు వ్యవసాయ క్షేత్రాలలో పని చేసిన వాళ్లు ఇప్పుడు పెద్ద సంఖ్యలో కర్మాగారాలలో పనిచేస్తున్నారు. ప్రజలు ఎక్కువ వస్తువులను వినియోగిస్తున్నారు. కర్మాగారాలలో చవక ధరలకు పెద్ద ఎత్తున వస్తువులు ఉత్పత్తి కావటంతో ఇవి ప్రపంచవ్యాప్తంగా అన్ని మార్కెట్లకు చేరాయి. ఈ దేశాలలో మొత్తం ఉత్పత్తి చేసే వస్తువులు, సేవలుదృష్ట్యా, కల్పించిన ఉపాధి దృష్ట్యా పారిశ్రామిక ఉత్పత్తి ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ విధంగా కాలక్రమేణా పరిస్థితులు మారాయి. అంటే రంగాల ప్రాముఖ్యత మారింది. పారిశ్రామిక రంగం ప్రధాన రంగం అయ్యింది. ఉత్పత్తి, ఉపాధుల దృష్ట్యా వ్యవసాయ రంగం క్షీణించింది.

గత 50 సంవత్సరాలలో అభివృద్ధి చెందిన దేశాలలో పారిశ్రామిక రంగంనుంచి సేవల రంగానికి ప్రాధాన్యత మారుతోంది. మొత్తం ఉత్పత్తిలో సేవా రంగం ప్రముఖ స్థానంలో ఉంది. పనిచేసేవాళ్లల్లో కూడా ఇప్పుడు ఎక్కువమంది సేవల రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఉత్పాదక కార్యకలాపాలలో అధిక భాగం ఇప్పుడు వస్తువుల ఉత్పత్తి కాకుండా సేవలు అందించటంలో ఉన్నాయి. అన్ని అభివృద్ధి చెందిన దేశాలలో ఇదే తీరు కనబడుతోంది. భారతదేశంలో కూడా ఇలాగే జరుగుతోందా లేక భిన్నంగా ఉందా?

గ్రాఫ్ 2 లోని 'పై' చార్టులు చూడండి. 1972-73, 2009-10 ఆర్థిక సంవత్సరాలలో స్థూల జాతీయోత్పత్తిలో వివిధ రంగాల వాటాను ఇవి తెలియచేస్తాయి. ఇంతకు ముందు పట్టికలో ఉన్న గణాంకాలే ఈ చిత్రాలలో శాతాలుగా ఉన్నాయి. మొత్తం వృత్తం ఆ సంవత్సరంలోని స్థూల జాతీయోత్పత్తిని సూచిస్తుంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు అనే మూడు రంగాల ఉత్పత్తి కలిపితే స్థూల జాతీయోత్పత్తి వస్తుంది. సేవలలో తిరిగి మూడు రకాలు ఉన్నాయి, అవి

| సేవలలో రకాలు | |
|---|---|
| ప్రజా, సామాజిక, వ్యక్తిగత సేవలు | ప్రభుత్వ పాలనాయంత్రాంగం, దేశ రక్షణ, విద్య, వైద్యం, పశువైద్య కార్యకలాపాలు, ప్రసార మాధ్యమాలు, గ్రంథాలయాలు, పురాతన దస్తావేజులనిర్వహణ, మ్యూజియం, ఇతర సాంస్కృతిక కార్యకలాపాలు వంటివి |
| ఆర్థిక, బీమా, స్థిరాస్తి సేవలు | బ్యాంకులు, పోస్టాఫీసు పొదుపు ఖాతాలు, బ్యాంకులు కాని ఆర్థిక కంపెనీ, జీవిత బీమా, సాధారణబీమా సంస్థలు, భవన విక్రయ కంపెనీలు, దళారుల సేవలు వంటివి |
| వ్యాపారం, హెూటళ్లు, రవాణా, ప్రసారాలు | |

- అభ్యాసం : వ్యాపారం, హెూటళ్లు, రవాణా, ప్రసారాలకు కొన్ని ఉదాహరణలు పేర్కొనండి.

*గ్రాఫ్ 2 : స్థూల జాతీయోత్పత్తిలో వివిధ రంగాల వాటా*




37 సంవత్సరాల కాలంలో వ్యవసాయ రంగం వాటా గణనీయంగా క్షీణించింది. స్థూల జాతీయోత్పత్తిలో పారిశ్రామిక రంగం ఉత్పత్తి వాటా కొంచెం పెరిగింది. ఇందుకు విరుద్ధంగా సేవా కార్యకలాపాలలోని మూడింట రెండు రంగాలలో గణనీయమైన వృద్ధి ఉంది.

## ఉపాధి – భారతదేశంలోని పని పరిస్థితులు

ఒక దేశంలో పని చేస్తున్న వాళ్ల మొత్తం సంఖ్యకు, ఆ దేశ స్థూల జాతీయోత్పత్తికి మధ్య దగ్గర సంబంధం ఉంది. ప్రతి దేశంలోనూ జనాభా పెరుగుతున్న కొద్దీ పని కోరుకుంటున్న వాళ్లకు పని చూపించాల్సిన అవసరం ఉంది. సంపాదనకై ప్రజలకు ఉద్యోగాలు దొరకకపోతే వాళ్ల ఆహార, ఇతర అవసరాలు ఎలా తీరతాయి?

2011 జనాభా లెక్కల ప్రకారం 120 కోట్ల జనాభాలో 46 కోట్లమంది పని చేస్తున్నవారు. అంటే ఉత్పాదక కార్యకలాపాలలో భాగస్వాములైన ప్రజలు. పట్టిక 1 భారతదేశంలోని వివిధ కార్యకలాపాలలో ఉన్న వారి మౌలిక గణాంకాలను తెలియచేస్తోంది.

*పట్టిక 1 : భారతదేశంలో పరిశ్రమలవారీగా కార్మికుల వివరాలు, 2009-2010 (%)*

| రంగం | నివాస స్థానం | | స్త్రీ, పురుషులు | | మొత్తం |
|---|---|---|---|---|---|
| | గ్రామీణ | పట్టణ | పురుషులు | స్త్రీలు | కార్మికులు |
| వ్యవసాయ రంగం | 68 | 8 | 47 | 69 | 53 |
| పారిశ్రామిక రంగం | 17 | 34 | 34 | 16 | 22 |
| సేవల రంగం | 15 | 58 | 19 | 15 | 25 |
| మొత్తం | 100 | 100 | 100 | 100 | 100 |

భారతదేశంలో జరిగిన మార్పులలో చెప్పుకోవలసింది ఒకటి ఉంది. స్థూల జాతీయోత్పత్తిలోని వివిధ రంగాల వాటాలో మార్పు వచ్చినంతగా ఉపాధిలో మార్పు రాలేదు. 1972-73, 2009-10లలో మూడు రంగాలలో ఉపాధి వాటాలను గ్రాఫ్ 3లో చూపిస్తోంది. ఇప్పటికీ వ్యవసాయమే ప్రధాన ఉపాధి రంగంగా ఉంది. అయితే వ్యవసాయంలో ఉపాధి వాటా ఎందుకు తగ్గలేదు? పారిశ్రామిక, సేవా రంగాలలో తగినంత ఉపాధి కల్పించబడకపోవటమే దీనికి కారణం. ఈ కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి తొమ్మిది రెట్లు పెరిగింది, కానీ పారిశ్రామిక ఉపాధి మూడు రెట్లు మాత్రమే పెరిగింది. సేవల రంగంలోనూ ఇదే పరిస్థితి. సేవా రంగంలో ఉత్పత్తి 14 రెట్లు పెరిగింది కానీ ఉపాధి మాత్రం 5 రెట్లు పెరిగింది.

దీని ఫలితంగా దేశంలోని కార్మికులలో సగం కంటే ఎక్కువ మంది వ్యవసాయరంగంలో ఉండి ఆరింట ఒక వంతు ఉత్పత్తికి మాత్రమే దోహదం చేస్తున్నారు. దీనికి విరుద్ధంగా స్థూల జాతీయోత్పత్తిలో 75 శాతం వాటా ఉన్న పారిశ్రామిక, సేవా రంగాలు మొత్తం కార్మికులలో దాదాపు సగానికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నాయి. వ్యవసాయంలో ఉన్న కార్మికులు వాళ్లు ఉత్పత్తి చెయ్యగలిగినంతగా చెయ్యటం లేదని అనుకోవాలా?

పట్టిక 1ని జాగ్రత్తగా అధ్యయనం చేసి కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి:

- వ్యవసాయ రంగంలోని అత్యధిక మంది కార్మికులు ..................లో నివసిస్తున్నారు.
- చాలామంది ...................పనివారు వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్నారు.
- 90% కంటే అధికంగా పట్టణ ప్రాంత పనివారు ....................., .............. రంగాలలో ఉపాధి పొందుతున్నారు.
- స్త్రీ పురుషుల నిష్పత్తి పోలిస్తే స్త్రీలు ............ ................ రంగాలలో కొద్ది శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు.

దీనితో వ్యవసాయంలో అవసరమైన దానికంటే ఎక్కువమంది ఉన్నారని అర్థమవుతోంది. వ్యవసాయం నుంచి కొంతమంది తరలిపోయినా ఉత్పత్తి ప్రభావితం కాదు. ఇంకొక మాటలో చెప్పాలంటే వ్యవసాయ రంగంలో కార్మికులు అల్ప ఉపాధినే కలిగి ఉన్నారు.

ఉదాహరణకు గాయత్రి అనే చిన్న రైతును తీసుకుందాం. ఆమెకు 5 ఎకరాల వర్షాధార భూమి ఉంది. ఆమె జొన్న, కందులు వంటి పంటలు పండిస్తుంది. కుటుంబంలోని అయిదుగురు సభ్యులూ సంవత్సరమంతా అందులోనే పనిచేస్తారు. కారణం? వాళ్లకు చెయ్యటానికి వేరే పని లేదు. వారి శ్రమ విభజింపబడుతోంది. అందరూ ఏదో ఒక పని చేస్తున్నారు కానీ ఎవరికీ పూర్తి పనిలేదు. అల్ప ఉపాధి అంటే ఇదే, అందరూ పని చేస్తున్నట్టు ఉంటుంది కానీ ఎవ్వరికీ తమ పూర్తి, సామర్థ్యానికి తగినట్టుగా పని ఉండటం లేదు. పనిలేక నిరుద్యోగిగా ఉంటే అది కనపడుతుంది, కానీ ఈ రకమైన అల్ప ఉపాధి ఎవరికీ కనపడదు. అందుకే దీనిని 'ప్రచ్ఛన్న నిరుద్యోగం' అని కూడా అంటారు.

ఒక భూస్వామి ఈ కుటుంబంలోని ఒకరిద్దరిని తన భూమిలో పనిచెయ్యటానికి పెట్టుకున్నాడని అనుకుందాం. దీనివల్ల గాయత్రి కుటుంబానికి కూలి ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. వాళ్లకున్న తక్కువ భూమిలో అయిదారుగురు పని చెయ్యవలసిన అవసరంలేదు కాబట్టి ఇద్దరు వేరే పనికి వెళ్లటంవల్ల ఉత్పత్తి దెబ్బతినదు. పై ఉదాహరణలో ఇద్దరు పరిశ్రమలలో పనిచెయ్యటానికి కూడా వెళ్లి ఉండవచ్చు. దీనివల్ల కూడా వ్యవసాయ ఉత్పత్తి తగ్గకుండా గాయత్రి కుటుంబం అదనపు ఆదాయం పొందవచ్చు.

భారతదేశంలో గాయత్రి లాంటి రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారు. దీని అర్థం వ్యవసాయ రంగంనుంచి చాలామంది వెళ్లిపోయి వేరే రంగాలలో పని చేసినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తి తగ్గదు. ఇతర పని చేపట్టే సభ్యుల ద్వారా కుటుంబ మొత్తం ఆదాయం పెరుగుతుంది.

ఈ రకమైన అల్ప ఉపాధి ఇతర రంగాలలో కూడా ఉండవచ్చు. ఉదాహరణకు పట్టణ ప్రాంతాలలో సేవా రంగంలో రోజుకూలీ కోసం వెతుక్కునే వాళ్లు వేలాదిగా ఉన్నారు. వీళ్లు రంగులు వెయ్యటం, నీటి పైపుల పని, మరమ్మతులు చెయ్యటం వంటి పనులు చేస్తారు. వీళ్లల్లో చాలామందికి ప్రతిరోజూ పని దొరకదు. అదేవిధంగా సేవారంగంలో బజారులో బళ్లమీద సరుకులు అమ్ముకునే వాళ్లను చూస్తూ ఉంటాం. వీళ్లు రోజంతా కష్టపడినా సంపాదన చాలా తక్కువగా ఉంటుంది. దీనికంటే మంచి అవకాశాలు లేనందున వీళ్లు ఈ పనులు చేస్తున్నారు.

*గ్రాఫ్ 3 : మూడు రంగాలలో ఉపాధి వాటా*

*1972-73లో ఉపాధి*




*2009-10లో ఉపాధి*



*గ్రాఫ్ 4 : మూడు రంగాలలో స్థూల జాతీయోత్పత్తి (GDP) వాటా*




● ఇచ్చిన 'పై' చార్టులు చూసి కింది పట్టిక నింపండి.

| రంగం | ఉపాధి (%) | | స్థూల జాతీయోత్పత్తి (%) | |
|---|---|---|---|---|
| | 1972-73 | 2009-10 | 1972-73 | 2009-10 |
| వ్యవసాయం | | | | |
| పరిశ్రమలు | | | | |
| సేవలు | | | | |

సేవా రంగం అభివృద్ధి చెందినా ఆ రంగంలో అన్ని కార్యకలాపాలు సమానంగా పెరగటం లేదు. భారతదేశంలో సేవా రంగంలో అనేక రకాల వ్యక్తులు ఉపాధి పొందుతున్నారు. ఒకవైపున బాగా చదువుకున్న, నైపుణ్యాలున్న వ్యక్తులకు ఉపాధి ఇచ్చే కొద్దిపాటి సేవలు ఉన్నాయి. ఇంకోవైపున చిన్న చిన్న దుకాణాలు నడిపేవాళ్లు, మరమ్మతులు చేసేవాళ్లు, రవాణా సేవలు అందించే వాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వాళ్ల జీవనం అతి కష్టంమీద సాగుతుంది, అయినా మరో దారిలేక ఈ సేవలలో కొనసాగుతున్నారు. అంటే సేవారంగంలో ఒక భాగానికి మాత్రమే ప్రాధాన్యత పెరుగుతోంది.

## భారతదేశంలో వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాలలో ఉపాధి

భారతదేశంలో స్థూలజాతీయోత్పత్తికి విభిన్న రంగాలు ఎలా దోహదం చేస్తున్నాయో, ఈ మూడు రంగాలలో దేని ప్రాముఖ్యత ఎంత ఉందో చూశాం. ఉత్పత్తి, ఉపాధులలో చోటుచేసుకుంటున్న మార్పులు విశ్లేషించటానికి ఇది ఉపయోగపడుతుంది.

మన దేశంలో ఉపాధి తీరుల్లో చెప్పుకోదగినంత మార్పు జరగటం లేదు. దీనిని పరిశీలించటానికి ఉపాధికి సంబంధించి మరొక వర్గీకరణను చూద్దాం. కింద చర్చించిన వర్గీకరణ ఉపాధికి సంబంధించిన పని పరిస్థితులను, సమస్యలను స్పష్టంగా వెల్లడి చేస్తుంది.

**నరసింహ**



నరసింహ ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తాడు. అతని పని వేళలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు. ఇంటినుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్యాలయానికి అతడు మోటారుసైకిలు మీద వెళతాడు. ప్రతి నెల చివరలో అతడికి క్రమం తప్పకుండా జీతం లభిస్తుంది. అది నేరుగా అతడి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. జీతం కాకుండా ప్రభుత్వ నియమాల ప్రకారం అతడికి భవిష్యనిధి (PF) లభిస్తుంది. వైద్య, ఇతర భత్యాలు కూడా లభిస్తాయి. నరసింహ ఆదివారంనాడు కార్యాలయానికి వెళ్లడు. ఇది అతనికి వేతనంతో కూడిన సెలవు. అతడు పనిలో చేరినప్పుడు పని షరతులు, నిబంధనలు పేర్కొంటూ అతడికి నియామక పత్రం ఇచ్చారు.



**రాజేశ్వరి**

రాజేశ్వరి భవన నిర్మాణ కార్మికురాలిగా పని చేస్తోంది. ఆమె ఉదయం 7 గంటలకు పనికి వెళ్లి, రాత్రి 7 గంటలకు తిరిగి వస్తుంది. 8–10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పని ప్రదేశానికి ఆమె రోజూ బస్సులో వెళ్లి వస్తుంది. భవన నిర్మాణ కార్మికులకు మధ్యాహ్నం 1–2 గంటల మధ్య భోజన విరామం లభిస్తుంది. ఆమెకు నెలలో 10–12 రోజులు మాత్రమే పని దొరుకుతుంది. పనిలేని మిగిలిన రోజుల్లో ఆమెకు కూలీ రాదు. ఆమెకు రోజు కూలీగా 150 రూపాయలు లభిస్తాయి. సాధారణంగా సాయంత్రం ఆమెకు రోజుకూలీ లభిస్తుంది. ఒకేచోట మూడు, నాలుగు రోజులు పనిచేస్తే ఆ పని అయిన తరువాత మొత్తం కూలీ లభిస్తుంది. ఫిబ్రవరి–జూన్ నెలల్లో ఎక్కువ పని దొరుకుతుంది. జులైనుంచి జనవరి వరకు అంతగా పని ఉండదు. స్థానిక స్వయం సహాయక బృందంలో రాజేశ్వరి సభ్యురాలు. పని సమయంలో పెద్ద ప్రమాదం సంభవించినా, చనిపోయినా ప్రభుత్వం కొంత నష్టపరిహారం చెల్లిస్తుంది. అయితే చిన్న చిన్న ప్రమాదాలకు ఎటువంటి నష్టపరిహారం ఉండదు. ఒక మేస్త్రి కింద పనిచేసే బృందంలో ఆమె సభ్యురాలు. ప్రతి మేస్త్రి కింద 6–10 మంది పనిచేస్తుంటారు.

వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు ఉదాహరణగా నరసింహ, రాజేశ్వరి ఉన్నారు. వాళ్ల పని పరిస్థితులలో ఎటువంటి తేడాలు గమనించారు? వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల మధ్య తేడాలు గుర్తించటం ద్వారా దేశంలో అత్యధిక శాతం కార్మికుల పని పరిస్థితులు, వేతనాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 92% కార్మికులు అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తుండగా కేవలం 8% మంది మాత్రమే వ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్నారు.

ఉపాధి షరతులు ఉండి నమ్మకంగా పని ఉండే ప్రదేశాలు లేదా వ్యాపారాలను వ్యవస్థీకృత రంగంగా వ్యవహరిస్తారు. ఇవి ప్రభుత్వం వద్ద నమోదు చేసుకుని ఉంటాయి. కాబట్టి కర్మాగారాల చట్టం, కనీస వేతన చట్టం, దుకాణాలు, సంస్థల చట్టం వంటి వాటిల్లో ఉన్న ప్రభుత్వ నియమ నిబంధనలను ఇవి అనుసరిస్తాయి. కొన్ని క్రమబద్ధ ప్రక్రియలు, విధానాలు ఉండటం వల్ల కూడా వీటిని వ్యవస్థీకృత రంగం అంటారు. వ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుంది. వాళ్లు రోజులో నిర్ధారిత గంటలు మాత్రమే పని చేయాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ పనిచేస్తే యజమాని అదనపు వేతనం చెల్లించాలి. అంతేకాకుండా జీతంతోకూడిన సెలవు, సెలవులలో వేతనం, భవిష్యనిధి వంటి అనేక ఇతర ప్రయోజనాలు వాళ్లకు ఉంటాయి. వాళ్లకు వైద్య ప్రయోజనాలు కూడా అందించాలి. చట్టం ప్రకారం యజమానులు భద్రతతో కూడిన పని వాతావరణం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలి. ప్రభుత్వం, కంపెనీలు, పెద్ద సంస్థలలో పనిచేసే వాళ్లు వ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్నారు.

అవ్యవస్థీకృత రంగంలో చిన్న చిన్న సంస్థలు అక్కడక్కడా ఉంటాయి. ఇవి సాధారణంగా ప్రభుత్వ నియంత్రణలో ఉండవు. నియమ, నిబంధనలు ఉంటాయి కానీ వీటిని అనుసరించరు, అనుసరించేలా చూసేవాళ్లు ఉండరు. ఉద్యోగులకు జీతం తక్కువ, భద్రత కూడా ఉండదు. ఎక్కువ పనికి ఎక్కువ వేతనం, ఆర్జిత సెలవు, సెలవులు, అనారోగ్యమప్పుడు సెలవులు వంటివి కూడా ఉండవు. ఏ కారణం లేకుండా ఉద్యోగస్తులను మానుకోమనవచ్చు. పని తక్కువగా ఉండే కొన్ని కాలాల్లో కొంతమందిని పని మానిపించవచ్చు. మారుతున్న మార్కెటు పరిస్థితి, ఉపాధి కల్పిస్తున్న వాళ్ల మానసిక స్థాయిపై చాలా ఆధారపడి ఉంటుంది.

పైన పేర్కొన్నవే కాకుండా సేవా రంగంలో స్వయం ఉపాధి పొందుతున్నవాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కార్మికులలో సగం శాతం స్వయం ఉపాధి పొందుతున్నవారే. బజారులలో వస్తువులు అమ్ముతూ, చిన్న చిన్న మరమ్మతులు చేస్తూ, వీధులు తిరిగి అమ్ముతూ వీళ్లు మీకు అంతటా కనిపిస్తారు. అదే విధంగా రైతులు కూడా ఎక్కువగా స్వయం ఉపాధి పొందుతూ కావలసినప్పుడు కూలీలను పిలుస్తారు.

వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగాలను అందరూ కోరుకుంటారు. కానీ ఈ రంగంలోని ఉపాధి అవకాశాలు చాలా నిదానంగా పెరుగుతున్నాయి. ఫలితంగా, అధిక శాతం కార్మికులకు చాలా తక్కువ వేతనానికి అవ్యవస్థీకృత ఉద్యోగాలు తప్పించి మరో దారిలేదు. వీళ్లు తరచు దోపిడీకి గురవుతుంటారు, వీళ్లకు న్యాయమైన వేతనం చెల్లింపబడదు. వీళ్ల సంపాదన చాలా తక్కువ, అది కూడా క్రమం తప్పకుండా ఉండదు. వ్యవస్థీకృత రంగంలోని కార్మికుల ఉద్యోగాలు పోవటం కూడా సాధారణంగా చూస్తూ ఉంటాం. ఫలితంగా వీళ్లు కూడా తక్కువ వేతనానికి అవ్యవస్థీకృత రంగంలో పనిచేయాల్సి వస్తుంది. అంటే మరింత పని అవసరంతోపాటు అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు రక్షణ, మద్దతు అవసరం.

రక్షణ అవసరమైన ఈ అవ్యవస్థీకృత కార్మికులు ఎవరు? గ్రామీణ ప్రాంతాలలో వీళ్లు భూమిలేని వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులు, కౌలుదారులు, చేనేత, కమ్మరం, వడ్రంగం, కంసాలి వంటి చేతివృత్తుల వాళ్లు. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతంలోని 80 శాతం కుటుంబాలు సన్న, చిన్నకారు రైతుల కిందకు వస్తాయి. ఇటువంటి రైతులకు సకాలంలో విత్తనాలు, వ్యవసాయ ఉత్పాదకాలు, రుణసదుపాయాలు, నిల్వ సౌకర్యాలు, విక్రయ కేంద్రాలు వంటి వాటి ద్వారా మద్దతు అందించాలి. వ్యవసాయ కూలీలకు కనీస కూలీ, తగినంత పని అందాలి.

పట్టణ ప్రాంతాలలో చిన్నతరహా పరిశ్రమలు, భవన నిర్మాణ, వ్యాపారం, రవాణా వంటి వాటిలో రోజువారీ కూలీలు, బజారులో అమ్మకాలు చేసే వాళ్లు, బరువులు మోసేవాళ్లు, చిత్తుకాగితాలు

ఏరేవాళ్లు, బట్టలు కుట్టేవాళ్లు అవ్యవస్థీకృత రంగ కార్మికులు అవుతారు. ముడి సరుకుల కొనుగోలుకు, ఉత్పత్తులు అమ్ముకోటానికి చిన్నతరహా పరిశ్రమలకు కూడా ప్రభుత్వ మద్దతు కావాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని రోజువారీ కూలీలకు రక్షణ కావాలి.

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనకబడిన తరగతులకు చెందిన అధిక శాతం కార్మికులు అవ్యవస్థీకృత రంగంలో ఉన్నారు. ఈ వర్గాలకు చెందిన మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పని సరిగా దొరకకపోవటం, తక్కువ వేతనం ఉండటమే కాకుండా ఈ కార్మికులు సామాజిక వివక్షతకు కూడా లోనౌతారు. కాబట్టి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవ్యవస్థీకృత రంగ కార్మికులకు రక్షణ, మద్దతు అవసరం.

ఈ రంగాలలో వస్తువుల, సేవల ఉత్పత్తి, ఉపాధులను పరిశీలిద్దాం. అవ్యవస్థీకృత రంగం కూడా ఉత్పత్తికి దోహదం చేస్తుంది. 2004-05 సంవత్సరంలో మొత్తం కార్మికులలో 92 శాతం మంది అవ్యవస్థీకృత రంగంలో ఉండగా మొత్తం ఉత్పత్తిలో సగానికి దోహదం చేశారు. అంటే దీని అర్థం కేవలం 8 శాతం కార్మికులు భద్రతతో కూడిన మంచి ఉద్యోగం ఉండి మొత్తం వస్తువులు, సేవలలో 50 శాతానికి దోహదం చేశారు. ఇటువంటి కంపెనీల ఉత్పత్తులు, సేవలకు మంచి మార్కెటు ఉంది కానీ చాలా కొద్దిమందికే మంచి జీతంతో కూడిన ఉపాధి కల్పిస్తున్నాయి. ఇది తీవ్ర అసమానతలతో ఉన్న పరిస్థితి. మిగిలినవాళ్లు తక్కువ వేతనంతో భద్రతలేని ఉద్యోగాలు చేస్తున్నారు, లేదా స్వయం ఉపాధిలో ఉన్నారు, లేదా నిరుద్యోగులుగా ఉన్నారు.

**పట్టిక 2 : వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల పాత్ర**

| రంగం | వాటా (మొత్తంలో శాతం) | |
|---|---|---|
| | ఉపాధి | స్థూలజాతీయ ఉత్పత్తి |
| వ్యవస్థీకృత | 8 | 50 |
| అవ్యవస్థీకృత | 92 | 50 |
| మొత్తం | 100 | 100 |

## ఉపాధి అవకాశాలు, పరిస్థితులు మెరుగుపరచడం ఎలా ?

పై పేర్కొన్న వారిలో చాలామంది పరిశ్రమలు, సేవారంగంలో మంచి ఉద్యోగం పొంది ఉండాల్సింది, కానీ ఇలా జరగలేదు. పరిశ్రమలు, సేవల్లో ఉత్పత్తి పెరిగింది కానీ దానికి తగినట్టుగా ఉపాధి పెరగలేదు. అధికశాతం మంది అవ్యవస్థీకృత రంగంలో పని దొరకని స్థితిలో ఉన్నారు. ఉత్పత్తిలో పెరుగుదల వల్ల కార్మికులలో 8% మంది మాత్రమే ప్రయోజనం పొందుతున్నారు. మరి ప్రజలందరికీ ఉపాధి అవకాశాలు పెంచటం ఎలా? కొన్ని మార్గాలను చూద్దాం.

అయిదెకరాల వర్షాధార భూమి ఉన్న గాయత్రి ఉదాహరణ తీసుకుందాం. ప్రభుత్వం ఖర్చు పెట్టడం ద్వారా కానీ లేక బ్యాంకులు రుణాలు ఇవ్వడం ద్వారా కానీ గాయత్రి తన భూమికి సాగునీరు అందించటానికి బావి తవ్వుకోగలదు. ఈ సాగునీటి ద్వారా గాయత్రి తన భూమిలో రెండవ పంటగా గోధుమ సాగు చెయ్యగలుగుతుంది. 2.5 ఎకరాల గోధుమ పంటలో (విత్తటం, నీళ్లు పెట్టటం, ఎరువులు చల్లటం, కోత కోయటం వంటి అన్ని పనులు కలిపి) ఇద్దరు వ్యక్తులకు 50 రోజులపాటు పని

దొరుకుతుంది. అంటే ఆమెకున్న భూమిలో మరో ఇద్దరికి ఉపాధి దొరుకుతుంది. ఒక ఆనకట్ట కట్టి, ఇటువంటి అనేక రైతుల భూములకు సాగునీరు అందించటానికి కాలవలు తవ్వారనుకుందాం. దీనిద్వారా వ్యవసాయ రంగంలోనే ఉపాధి అవకాశాలు లభించి అల్ప ఉపాధి వంటి సమస్యలు కొంతవరకు తగ్గుతాయి.

గాయత్రి, ఇంకా ఇతర రైతులు మునుపటికంటే ఎక్కువ పంట పండిస్తున్నారని అనుకుందాం. దీంట్లో కొంత వాళ్లు బజారులో అమ్మవలసి ఉంటుంది. ఇందుకు దగ్గరలోని పట్టణానికి తమ ఉత్పత్తులు చేరవేయటానికి రవాణా అవసరం అవుతుంది. పంటల నిల్వచేయటానికి, రవాణాకు ప్రభుత్వం కొంత పెట్టుబడులు పెడితే లేదా చిన్న లారీలు అన్ని ప్రాంతాలకు చేరేలా మెరుగైన రోడ్లు నిర్మిస్తే గాయత్రి వంటి రైతులకు సాగునీరు అందుబాటులో ఉండి, అధిక పంటలు పండించి, వాటిని మార్కెట్టులో అమ్ముతారు. ఇటువంటి కార్యకలాపాల ద్వారా రైతులకే కాకుండా, రవాణా, వ్యాపారం వంటి సేవలలో ఉన్నవాళ్లకు కూడా ఉత్పాదక ఉపాధి దొరుకుతుంది.

గాయత్రి అవసరాలలో నీళ్లు ఒక అంశం మాత్రమే. భూమిని సాగు చెయ్యటానికి ఆమెకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, పంపుసెట్లు వంటివి కావాలి. పేదరైతు కావటంవల్ల ఆమె వీటిల్లో చాలావరకు కొనుక్కోలేదు. కాబట్టి ఆమె అధిక వడ్డీకి వడ్డీ వ్యాపారస్తుని వద్దనుంచి అప్పుచేయాల్సి ఉంటుంది. స్థానిక బ్యాంకు తక్కువ వడ్డీకి సకాలంలో అప్పు అందించగలిగితే వీటన్నింటినీ ఆమె సకాలంలో కొనుక్కుని భూమి సాగుచెయ్యగలుగుతుంది. అంటే వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే సాగునీటితోపాటు రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు అందించాల్సి ఉంటుంది.

ఈ సమస్యను పరిష్కరించటానికి మరొక మార్గం కొంచెం పెద్ద పెద్ద గ్రామ ప్రాంతాలలో చాలా మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు, సేవలను గుర్తించి, ప్రోత్సహించి, అక్కడ స్థాపించేలా చూడటం. ఉదాహరణకు చాలామంది రైతులు తృణధాన్యాలు, చిరుధాన్యాలు పండించాలని అనుకోవచ్చు. వీటిని కొనుగోలు చేసి పిండి పట్టించి పట్టణ ప్రాంతాలలో అమ్మటానికి పిండి మర స్థాపించటం ఒక ఉదాహరణ. కోల్డ్ స్టోరేజి సదుపాయం కల్పిస్తే మిరప, ఉల్లి వంటి ఉత్పత్తులను రైతులు నిల్వచేసుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోగలుగుతారు. అటవీప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాలలో తేనె సేకరణ కేంద్రాలు ప్రారంభిస్తే అడవులలో సేకరించిన తేనె అక్కడ అమ్ముతారు. టమాట, మిరప, మామిడి, వడ్లు, కందులు, పళ్లు వంటి వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయల ప్రాసెసింగ్‌కు పరిశ్రమలు స్థాపించవచ్చు. దీనిద్వారా పెద్ద పట్టణాలలోనే కాకుండా ఓమాదిరి ఊళ్లల్లో కూడా ఉండే పరిశ్రమలలో ఉపాధి లభిస్తుంది.

ప్రస్తుతం కొత్త ఉపాధి అవకాశాలను కల్పించటమే కాదు యంత్రాలతో, సమర్థంగా పనిచేయటంలో ప్రజలకు శిక్షణ కూడా ఇవ్వాలి. మరిన్ని వస్తువులు, సేవలు ఉత్పత్తి చెయ్యటానికి పెద్ద గ్రామాలు, చిన్న పట్టణాలలో అనేక పరిశ్రమలను స్థాపించాలి.

**కీలక పదాలు**

స్థూల జాతీయోత్పత్తి   అంత్య వస్తువులు   ఉపాధి బదిలీ   వ్యవస్థీకృత రంగం   అవ్యవస్థీకృత రంగం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. బ్రాకెట్టులో ఇచ్చిన వాటినుంచి సరైన వాటితో ఖాళీలు పూరించండి.

   (i) ఉత్పత్తితో సమానంగా సేవారంగంలో ఉపాధి ............ (పెరిగింది/ పెరగలేదు)

   (ii) .............. రంగంలోని కార్మికులు వస్తువులను ఉత్పత్తి చెయ్యరు. (సేవా/ వ్యవసాయం)

   (iii) ............ రంగంలోని అధిక శాతం కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంది. (వ్యవస్థీకృత / అవ్యవస్థీకృత)

   (iv) భారతదేశంలోని కార్మికులలో ..... శాతం అవ్యవస్థీకృత రంగంలో పని చేస్తున్నారు. (ఎక్కువ/తక్కువ)

   (v) పత్తి .......... ఉత్పత్తి, గుడ్డ ............ ఉత్పత్తి (సహజ / పారిశ్రామిక)

2. సరైన సమాధానాన్ని ఎంచుకోండి.

   (అ) ఎక్కువగా సహజ ప్రక్రియలను ఉపయోగించుకుని ............. రంగంలో వస్తువులు ఉత్పత్తి చేస్తారు.

   (i) ప్రాథమిక (ii) ద్వితీయ

   (iii) తృతీయ (iv) సమాచార సాంకేతిక

   (ఆ) స్థూల జాతీయ ఉత్పత్తి అనేది ఒక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన ................ మొత్తం విలువ.

   (i) అన్ని వస్తువులు, సేవల (ii) అన్ని అంతిమ వస్తువులు, సేవల

   (iii) అన్ని మాధ్యమిక వస్తువులు, సేవల (iv) అన్ని అంతిమ, మాధ్యమిక వస్తువులు, సేవల

   (ఇ) 2009-10 స్థూల జాతీయోత్పత్తిలో సేవా రంగం వాటా ................

   (i) 20-30 శాతం మధ్య (ii) 30-40 శాతం మధ్య

   (iii) 50-60 శాతం మధ్య (iv) 70 శాతం.

3. వేరుగా ఉన్నదానిని గుర్తించండి, కారణం చెప్పండి.

   (i) టీచరు, డాక్టరు, కూరగాయలు అమ్మే వ్యక్తి, న్యాయవాది.

   (ii) పోస్టుమాన్, చెప్పులుకుట్టే వ్యక్తి, సైనికుడు, పోలీసు కానిస్టేబులు.

4. ఆర్థిక కార్యకలాపాలను ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలుగా విభజించటం ఉపయోగకరమేనా? ఎందుకో వివరించండి.

5. ఈ అధ్యాయంలో మనం చూసిన ప్రతి రంగంలో స్థూల జాతీయోత్పత్తిలోనూ, ఉపాధిలోనూ దృష్టి ఎందుకు కేంద్రీకరించాలి? ఇంకా పరిశీలించాల్సిన ఇతర అంశాలు ఏమైనా ఉన్నాయా? చర్చించండి.

6. సేవా రంగం ఇతర రంగాలకంటే ఎలా భిన్నమైనది? కొన్ని ఉదాహరణలతో వివరించండి.

7. అల్ప ఉపాధి అంటే ఏమి అర్థం చేసుకున్నారు? పట్టణ, గ్రామీణ ప్రాంతాలనుంచి ఒక్కొక్క ఉదాహరణతో వివరించండి.

8. అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు ఈ కింది అంశాలలో రక్షణ కావాలి.

కూలీ, భద్రత, వైద్యం : ఉదాహరణలతో వివరించండి.

9. అహ్మదాబాదు నగరంలో జరిపిన అధ్యయనంలో 15 లక్షల కార్మికులు ఉండగా అందులో 11 లక్షల మంది అవ్యవస్థీకృత రంగంలో పని చేస్తున్నారని తెలిసింది. ఆ సంవత్సరం (1997-98) లో నగరం మొత్తం ఆదాయం 6000 కోట్ల రూపాయలు. అందులో వ్యవస్థీకృత రంగం వాటా 3200 కోట్ల రూపాయలు. ఈ గణాంకాలను ఒక పట్టిక రూపంలో ఇవ్వండి. పట్టణంలో మరింత ఉపాధి కల్పించే మార్గాలు ఏమిటి?

పాఠం

4

# భారతదేశ శీతోష్ణస్థితి

**వాతావరణ మార్పువల్ల అసాధారణ పరిస్థితులు : నిపుణులు**

*హైదరాబాదులో తరచు కురుస్తున్న అకాల వర్షాల వల్ల వాతావరణ శాఖ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. దేశంలోని వాతావరణాన్ని ముందుగానే అంచనా వేయగలగటం రానురాను మరింత కష్టతరం అవుతోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా వాతావరణ వ్యవస్థలో అసాధారణ మార్పులను గమనిస్తున్నాం, ఫలితంగా ఊహించని విధంగా వాతావరణం ఉంటోంది.*

*దేశంలోని తీవ్ర వేసవి, రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఉన్నట్టుండి వడగళ్లు పడటం, ఉత్తరాఖండ్‌లో కుండపోత, నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించటం, ఆలస్యంగా వెనక్కి మరలటం వంటి ముందుగానే ఊహించలేని పరిస్థితులను గమనించిన తరువాత వాతావరణం వింతగా ప్రవర్తిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.*

*ఒంగోలులో 341 మి.మీ వర్షపాతం పడింది. ఇది మొత్తం వార్షిక వర్షపాతంలో మూడొంతుల కంటే ఎక్కువ. రాష్ట్రమంతా కురిసిన పెద్ద వానల వల్ల అనేక పంటలు, ప్రత్యేకించి పత్తి నష్టపోయాయి. అయితే ఒక మంచి వార్త ఏమిటంటే ఆంధ్రప్రదేశ్‌లోని 80,000 చెరువులలో 75 శాతం నీటితో నిండాయి.*

***(టైమ్స్ ఆఫ్ ఇండియాలో 2013 అక్టోబరు 25 వార్తా కథనం, కొద్దిపాటి మార్పులతో.)***

- *ఇటువంటివే మరికొన్ని వార్తాకథనాలను సేకరించండి.*
  *ఇవి అరుదుగా జరిగే సంఘటనలా, లేక మార్పునకు సంకేతాలా? దీనిని చర్చించటానికి వాతావరణ శాఖ అధికారులను కానీ, కళాశాల అధ్యాపకులను కానీ మీ తరగతికి ఆహ్వానించండి.*

## శీతోష్ణస్థితి, వాతావరణం

ఒక ప్రాంతంలో, ఒక నిర్దిష్ట సమయంలోని వాతావరణ పరిస్థితులను 'వాతావరణం' (వెదర్) అంటారు. ఈ వాతావరణ పరిస్థితులు తక్కువ సమయంలో కూడా చాలా తీవ్రంగా మారుతుంటాయి. ఒక విశాల ప్రాంతంలో కొన్ని సంవత్సరాలపాటు ఒక క్రమాన్ని కనపరిచే వాతావరణ పరిస్థితులను 'శీతోష్ణస్థితి' (క్లైమేట్) అంటారు. ప్రతి సంవత్సరం ఒక ముప్పై సంవత్సరాల పాటు కనపడిన పరిస్థితులను ఆ ప్రాంత శీతోష్ణస్థితి అంటారు. ఒక సంవత్సరానికి, ఇంకొక సంవత్సరానికి వాతావరణంలో కొద్దిగా మార్పులు చోటుచేసుకున్నా మొత్తంమీద శీతోష్ణస్థితిలో ఏర్పడే క్రమం మారదు. ఈ సాధారణ పరిస్థితుల ఆధారంగా సంవత్సరాన్ని కాలాలుగా విభజిస్తారు. శీతోష్ణస్థితిలో ముఖ్యమైన ఉష్ణోగ్రత (అత్యధిక, అత్యల్ప), వర్షపాతాలను 'క్లైమాటోగ్రాఫ్'ల ద్వారా చూపించవచ్చు. వాతావరణంలోని అంశాలు : ఉష్ణోగ్రత, వాతావరణ పీడనం, గాలి వేగం, గాలిలో తేమ, వర్షపాతం.

## భారతదేశంలోని కొన్ని ప్రాంతాల క్లైమోగ్రాఫ్‌లు

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉష్ణోగ్రత, వర్షపాతాలలో తేడా ఉందని కింది క్లైమోగ్రాఫ్‌లు తెలియచేస్తున్నాయి. మీ అట్లాసు చూసి కింది ప్రాంతాలు ఏ భౌగోళిక ప్రదేశంలో ఉన్నాయో తెలుసుకోండి. కింది పటాలను చదివి, తరువాత పేజీలోని పట్టిక నింపండి.

*గ్రాఫ్ 1 – 4 : క్లైమోగ్రాఫ్‌లు*



| పట్టణం | భౌగోళిక ప్రాంతం | సంవత్సరంలో అత్యధిక ఉష్ణోగ్రత పరిధి | సంవత్సరంలో అత్యల్ప ఉష్ణోగ్రత పరిధి | అత్యధిక వర్షపాతం పడే నెల ఆ నెల వర్షపాతం (మి.మీ) | అత్యల్ప వర్షపాతం పడే నెల ఆ నెల వర్షపాతం (మి.మీ) |
|---|---|---|---|---|---|
| జైపూర్ | | | | | |
| లెహ్ | | | | | |
| న్యూ ఢిల్లీ | | | | | |
| చెన్నై | | | | | |
| ఉష్ణోగ్రతా వ్యాప్తి అత్యధికం నుండి అత్యల్పం | | | | | |

- లెహ్‌లో బాగా వేడిగా, బాగా చలిగా ఉండే నెలలు ఏవి?
- పై పట్టికలోని ఉష్ణోగ్రతల పరిధి ఆధారంగా లెహ్ కంటే జైపూర్ వేడిగా ఉంటుందని చెప్పవచ్చా? మీ సమాధానానికి వివరణ ఇవ్వండి.
- ఢిల్లీ, చెన్నైల శీతోష్ణ స్థితులను పోల్చండి. వాటిల్లో తేడాలు ఏమిటి?
- లెహ్‌లో వర్షపాత తీరును జాగ్రత్తగా పరిశీలించండి. మిగిలిన ప్రాంతాలకు దీనికీ మధ్య తేడా ఏమిటి? మీ అట్లాసు సహాయంతో ఇదే వర్షపాత తీరును కనపరిచే ప్రపంచంలోని ఇతర ప్రాంతాలను గుర్తించండి.
- చెన్నైలో వర్షాకాల నెలలను గుర్తించండి. దీనిని జైపూర్‌తో పోలిస్తే ఏవిధంగా భిన్నమైనది?

## శీతోష్ణస్థితి, వాతావరణాలను ప్రభావితం చేసే అంశాలు

కొన్ని ప్రదేశాలలో (ఉదా. చెన్నై) వివిధ నెలల్లోని ఉష్ణోగ్రతలలో అంతగా తేడా లేదని గమనించాం. అదే కొన్ని ప్రదేశాలలో (ఉదా. ఢిల్లీ) వివిధ నెలల్లోని ఉష్ణోగ్రతలలో ఎంతో తేడా ఉంది. ఉత్తరాన హిమాలయాలు ఉండగా, దక్షిణ ద్వీపకల్పం సముద్రాలతో చుట్టుముట్టి ఉంది. కొన్ని ప్రదేశాలు తీరానికి చాలా దూరాన ఉన్నాయి. కొన్ని చాలా ఎత్తైన ప్రదేశాలు కాగా, కొన్ని మైదాన ప్రదేశాలు. శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే శీతోష్ణస్థితి కారకాలు అంటారు.

1. అక్షాంశం 2. భూమికి-నీటికి గల సంబంధం 3. భౌగోళిక స్వరూపం 4. ఉపరితల గాలి ప్రసరణ

## 1. అక్షాంశం లేదా భూమధ్యరేఖ నుంచి దూరం

భూమధ్య రేఖనుంచి దూరం పెరుగుతున్న కొద్దీ వార్షిక సగటు ఉష్ణోగ్రతలు తగ్గుతూ ఉంటాయి. ఈ దృష్ట్యా భూమిని మూడు ప్రాంతాలుగా విభజిస్తాం.

- ఉష్ణ ప్రాంతాలు, భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్నవి
- ధృవ ప్రాంతాలు, ధృవాలకు దగ్గరగా ఉన్నవి
- సమశీతోష్ణ ప్రాంతాలు, ఈ రెండింటికీ మధ్యలో ఉన్నవి

- గ్లోబుని ఉపయోగించి ఇంతకు ముందు చదివింది మళ్లీ మననం చేసుకోండి. వివిధ రేఖాంశాల వద్ద సూర్య కిరణాల కోణాలలో ఏ తేడా ఉంటుంది? దీని ప్రభావం ఎలా ఉంటుంది?



చిత్రం 4.1 : శీతోష్ణస్థితిపై అక్షాంశాల ప్రభావం.

ఉదాహరణకు మనం ఇండోనేసియా, జపాన్‌ల శీతోష్ణస్థితులు పోలిస్తే మనకు ఈ తేడాలు అర్థమవుతాయి. ఈ తేడాలకు కారణం భూమి మీద విభిన్న ప్రాంతాలు వేడెక్కడంలో తేడా ఉండటమని ఇంతకు ముందు తరగతులలో చదివారు. అక్షాంశాన్ని బట్టి ఉష్ణోగ్రతా తీవ్రత ఆధారపడి ఉంటుంది. భూమి ఉపరితలం పైన ఉష్ణోగ్రత ఆ ప్రాంతంలో సూర్యకిరణాల నుంచి వచ్చే వేడిమి (సూర్యపుటము) మీద ఆధారపడి ఉంటుంది. భూమధ్య రేఖకి దూరంగా ఉన్న రేఖాంశాల కంటే దగ్గరగా ఉన్న రేఖాంశాల వద్ద ఈ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. భూమధ్య రేఖనుంచి ధృవాలవైపు వెళుతున్నకొద్దీ సగటు వార్షిక ఉష్ణోగ్రతలు తగ్గుతూ ఉంటాయి.

భారతదేశంలో దక్షిణాది ప్రాంతం భూమధ్యరేఖకి దగ్గరగా ఉష్ణమండలంలో ఉంది. ఈ కారణంగా ఈ ప్రాంతంలో సగటు ఉష్ణోగ్రతలు ఉత్తర ప్రాంతం కంటే ఎక్కువగా ఉంటాయి. కన్యాకుమారిలోని శీతోష్ణస్థితి భోపాల్ లేదా ఢిల్లీ శీతోష్ణస్థితికంటే భిన్నంగా ఉండటానికి ఇది ఒక కారణం. భారతదేశం సుమారుగా $8^0$ ఉ $-37^0$ఉ రేఖాంశాల మధ్య ఉంది. భారతదేశాన్ని కర్కట రేఖ ఇంచుమించు రెండు సమభాగాలుగా చేస్తుంది. కర్కట రేఖకు దక్షిణ ప్రాంతం ఉష్ణమండలంలో ఉంది. కర్కటరేఖకు ఉత్తర ప్రాంతం సమశీతోష్ణ మండలంలో ఉంది.



చిత్రం 4.2 : ఈ అంశాలు ఒక ప్రాంత ఉష్ణోగ్రతలలో ఎక్కువ తేడా లేకుండా ఎలా ప్రభావితం చేస్తాయి?

## 2. భూమికి, నీటికి గల సంబంధం

భారతదేశంలో భూమి, నీటి ప్రదేశాలను చూపించే పటం చూస్తే మీకు శీతోష్ణస్థితులను ప్రభావితంచేసే మరొక ముఖ్యమైన సంబంధం కనపడుతుంది : ఇది భూమికి, నీటికి మధ్య సంబంధం. ఉపరితలం తీరుని బట్టి సూర్యరశ్మి ఎంత గ్రహింపబడుతుంది, తిరిగి ఎంత ప్రసరింపబడుతుంది లేదా ఎంత వేడిమి తిరిగి విడుదల చేయబడుతుంది అనే అంశాలు ఆధారపడి ఉంటాయి. బాగా పచ్చదనం, చెట్లు ఉండే ప్రాంతాలు సూర్యరశ్మిని బాగా గ్రహిస్తాయి. మంచుతో కప్పబడి ఉన్న ప్రాంతాలు సూర్యరశ్మిని తిరిగి వాతావరణంలోకి ప్రసరిస్తాయి. భూమితో పోలిస్తే సముద్రం చాలా నిదానంగా వేడెక్కుతుంది, నిదానంగా చల్లబడుతుంది. దీనివల్ల శీతోష్ణస్థితులు అనేక రకాలుగా ప్రభావితం అవుతాయి.

నేలమీద నుంచి, సముద్రం మీదనుంచి వీచేగాలులు ఏర్పడటం వీటిల్లో ఒకటి. చిత్రం 4.6 చూసి ఇది ఎలా జరుగుతుందో వివరించండి. 9వ తరగతిలో మీరు చదివిన పీడనం, పవన దిశలకు మధ్యగల సంబంధాన్ని ఒకసారి గుర్తుకుతెచ్చుకోండి.

దక్షిణ ప్రాంతంలోని అధిక భాగం సుదీర్ఘ కోస్తా తీరం వల్ల సముద్రపు ప్రభావానికి గురవుతుంది. దీనివల్ల పగలు, రాత్రుల ఉష్ణోగ్రతలలో, అదేవిధంగా వేసవి, శీతాకాలాల ఉష్ణోగ్రతలలో అంతగా తేడా ఉండదు. దీనిని సమ శీతోష్ణస్థితి అంటారు. ఒకే అక్షాంశం మీద సముద్రం నుంచి దూరంగా ఒకే ఎత్తులో ఉన్న ప్రదేశాలను పోలిస్తే సముద్ర ప్రభావం ఏమిటో బాగా తెలుస్తుంది.

- మీ అట్లాసు ఉపయోగించి ముంబయి, నాగపూర్‌లలో శీతాకాలం, వేసవికాలాల ఉష్ణోగ్రతలను పోల్చండి. వాటిల్లో పోలికలు ఏమిటి, తేడాలు ఏమిటి? సముద్రం నుంచి దూరాన్ని ఇది ఎలా తెలియచేస్తుంది?
- క్లైమోగ్రాఫ్‌లను ఉపయోగించి జైపూర్, చెన్నైల మధ్య ఉష్ణోగ్రతలలో తేడాలను వివరించండి.

- సిమ్లా, ఢిల్లీలు వేరు వేరు అక్షాంశాల మీద ఉన్నాయా? మీ అట్లాసు చూసి చెప్పండి. వేసవిలో ఢిల్లీ కంటే సిమ్లాలోచల్లగా ఉంటుందా?
- వేసవి కాలంలో కోల్‌కతాతో పోలిస్తే డార్జిలింగ్‌లో వాతావరణం ఆహ్లాదకరంగా ఎందుకు ఉంటుంది?

### 3. భౌగోళిక స్వరూపం

సముద్రమట్టం నుంచి ఎత్తుకి వెళుతున్నకొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుందని మీరు తెలుసుకున్నారు. కాబట్టి మైదాన ప్రాంతాలకంటే కొండలు, పర్వతాల మీద ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. కాబట్టి ఒక ప్రదేశపు యొక్క శీతోష్ణస్థితిని ఆ ప్రదేశం, ఎత్తు కూడా ప్రభావితం చేస్తుంది. వేసవి తీవ్రంగా ఉండే నెలల్లో కూడా హిమాలయ ప్రాంతాలలోని సిమ్లా, గుల్మార్గ్, నైనితాల్, డార్జిలింగ్ వంటి వేసవి విడిదిలలో చాలా చల్లగా ఉంటుందని మీరు విని ఉంటారు. అదేవిధంగా పశ్చిమ కనుమలలోని కొడైకెనాల్, ఉదగమండలం (ఊటీ) వంటి ప్రాంతాలలో తీర ప్రాంతాలతో పోలిస్తే ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

### 4. వాతావరణంలో ఉపరితల గాలి ప్రసరణ

ఉత్తరార్ధ గోళంలో ఉప అయనరేఖా అధిక పీడనం వల్ల శాశ్వత పవనాలు ఏర్పడతాయి. ఇవి భూమధ్యరేఖ వద్ద ఉండే అల్ప పీడన ప్రాంతం వైపు పశ్చిమంగా పయనిస్తాయి. వీటిని వ్యాపార పవనాలు (ఇంగ్లీషులో 'ట్రేడ్ విండ్స్') అంటారు. ట్రేడ్ అన్న జర్మన్ పదానికి 'ట్రాక్' అని అర్థం, అంటే ఒకే దిశలో స్థిరంగా పయనించే గాలులని అర్థం. శుష్క ఈశాన్య పవనాల మేఖలలో భారతదేశం ఉంది.

భారతదేశ శీతోష్ణస్థితి ఉపరితల వాయు ప్రవాహాల వల్ల కూడా ప్రభావితం అవుతుంది, ఈ ప్రవాహాలను 'జెట్ ప్రవాహం' అంటారు. నేలనుంచి 12,000 మీటర్ల ఎత్తులో సన్నటి మేఖలలో వేగంగా ప్రవహించేగాలులు ఇవి. ఈ గాలుల వేగం గంటకి వేసవిలో 110 కిలోమీటర్లు, శీతాకాలంలో 184 కిలోమీటర్లు మధ్య ఉంటుంది. $25^0$ ఉత్తర అక్షాంశం వద్ద తూర్పు జెట్ ప్రవాహం ఏర్పడుతుంది. ఇటువంటి జెట్ ప్రవాహం వల్ల చుట్టూ ఉన్న ఉష్ణోగ్రత చల్లబడుతుంది. తూర్పు జెట్‌స్ట్రీం యొక్క చల్లబరిచే ప్రక్రియ వల్ల అక్కడ ఉన్న మేఘాలు వర్షిస్తాయి.

## భారతదేశ కాలాలు

### శీతాకాలం

భారతదేశ భూభాగంపై ఉష్ణోగ్రతలు నవంబరు మధ్యనుంచి గణనీయంగా తగ్గుతాయి, ఈ చలికాలం ఫిబ్రవరి మధ్యవరకు కొనసాగుతుంది. జనవరి సాధారణంగా అత్యంత చలిగా ఉంటుంది, దేశంలో పలు ప్రాంతాలలో ఉష్ణోగ్రత $10^0$ సెం. కంటే తక్కువ ఉంటుంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. దక్షిణ భారతదేశం, ప్రత్యేకించి కోస్తా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు మధ్యస్తంగా అంటే $20^0$ సెం. కంటే ఎక్కువ ఉండి, ఆహ్లాదకరంగా ఉంటుంది.

- ఆంధ్రప్రదేశ్‌లో జనవరిలో సగటు ఉష్ణోగ్రతల పరిధి ఏమిటి?
- మీ అట్లాసు ఉపయోగించి $15^0$ సెం ఉష్ణోగ్రత ఉండే కొన్ని ప్రదేశాలను గుర్తించండి.
- సగటు ఉష్ణోగ్రతలు $25^0$ సెం ఉండే ప్రాంతాలకు దగ్గరగా $20^0$ సెం ఉష్ణోగ్రత ఉండే చిన్న వృత్తాకార ప్రాంతం ఉంది. ఇది ఎలా సాధ్యం?

కింది పటంలోని రేఖలు జనవరిలో ఒకే సగటు ఉష్ణోగ్రత ఉండే ప్రదేశాలను చూపిస్తున్నాయి.

శీతాకాలంలో నిర్మలమైన ఆకాశం, గాలిలో తక్కువ తేమశాతం, చల్లటి గాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యధరా సముద్రం నుంచి వచ్చే తుఫాను వాయుగుండాలు (వీటిని పశ్చిమ విక్షోభాలు అంటారు) ఉత్తర భారతదేశంలో ఓ మోస్తరు వర్షపాతానికి కారణమౌతాయి. సాధారణంగా రబీ కాలంలో సాగుచేసే గోధుమ పంటకు ఈ వర్షం ఎంతో ఉ పయోగకరంగా ఉంటుంది.




పటం 1 : జనవరి నెలలో భారతదేశ సగటు ఉష్ణోగ్రత (సెం.గ్రే. డిగ్రీలలో)

ఉత్తరార్ధ భూగోళంలోని వ్యాపార పవనాల మేఖలలో భారతదేశం ఉంది. భూభాగం నుంచి సముద్రం మీదకి వీచే ఈశాన్య గాలులు పొడిగా ఉంటాయి. అయితే ఇవి బంగాళాఖాతాన్ని దాటే క్రమంలో కొంత తేమను గ్రహించటం వల్ల తమిళనాడులోని కోరమండల్ తీర ప్రాంతంలో కొంత వర్షం కురుస్తుంది.

## వేసవి కాలం

వేసవి కాలంలో దేశ దక్షిణ ప్రాంతం నుంచి ఉత్తరప్రాంతం వైపుకి వెళుతుంటే సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ఉత్తర భారతదేశ మైదానాలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ $37^0$ సెం. దాటుతాయి. మే నెల మధ్యాహ్నానికి భారతదేశంలోని అనేక ప్రాంతాలలో, ప్రత్యేకించి వాయవ్య మైదానంలోనూ, మధ్య భారతంలోనూ పగటి ఉష్ణోగ్రతలు $41^0$-$42^0$ సెం.లు నమోదవుతాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా $20^0$ సెంటిగ్రేడ్‌కు తక్కువ ఉండవు. ఉత్తరాది మైదానాలలో పొడిగా, వేడిగా ఉండే స్థానిక పవనాలు వీస్తాయి, వీటిని 'లూ పవనాలు' అంటారు.

సాధారణంగా వేసవి ముగిసే సమయంలో దక్కన్ పీఠభూమిలో 'తొలకరి జల్లులు' పడతాయి. భారతదేశ ద్వీపకల్ప ప్రాంతంలో మామిడి, ఇతర పండ్లు త్వరగా పండటానికి ఈ వానలు దోహదం చేస్తాయి. కాబట్టి వీటిని ఆంధ్రప్రదేశ్‌లో స్థానికంగా మామిడి జల్లులు అని అంటారు.

*పటం 2 : $^0$ సెం.లో సగటు ఉష్ణోగ్రత (మే నెల)*




- ఇంతకు ముందు ఇచ్చిన క్లైమోగ్రాఫ్‌ల (4.1-4.4) ఆధారంగా నాలుగు పట్టణాలలో మే నెలలో సగటు ఉష్ణోగ్రతలు తెలుసుకుని వాటిని పై పటంలో గుర్తించండి.

## ఋతుపవనాల ప్రవేశం

భారతదేశంలోని శీతోష్ణస్థితి ఋతుపవనాల వల్ల గణనీయంగా ప్రభావితమౌతుంది. గతంలో భారతదేశానికి వచ్చిన నావికులు గాలులు వీచే దిశ క్రమం తప్పకుండా మారుతుండటాన్ని గమనించారు. ఈ గాలుల సహాయంతో వాళ్లు భారతదేశ తీరం వైపుకి ప్రయాణించేవాళ్లు. ఇలా కాలానుగుణంగా గాలుల దిశ మారడాన్ని అరబ్ వర్తకులు 'మాన్‌సూన్' అని పేరు పెట్టారు. వీటిని మనం ఋతుపవనాలు అని పిలుస్తాం.

ఉష్ణ ప్రాంతంలో సుమారుగా $20^0$ ఉ. - $20^0$ ద. అక్షాంశాల మధ్య ఋతుపవనాలు ఏర్పడతాయి. ఆగ్నేయ ఋతుపవనాలు దక్షిణార్ధగోళంలో హిందూమహా సముద్రం మీదుగా భూమధ్యరేఖకు అల్పపీడన ప్రాంతంవైపు పయనించే సమయంలో నీటి ఆవిరిని తీసుకెళతాయి. భూమధ్య రేఖను దాటిన తరువాత ఈ పవనాలు భారత ఉపఖండం మీద ఏర్పడిన అల్ప పీడనం ప్రాంతంవైపు పయనిస్తాయి. భూమి వేడెక్కటం వల్ల భారత ఉపఖండంలోని భూభాగం మీద, ప్రత్యేకించి మధ్య భారతం, గంగానదీ మైదానప్రాంతం మీద అల్ప పీడన ప్రాంతం ఏర్పడి ఉంటుంది. దీంతోపాటు టిబెట్ పీఠభూమి కూడా బాగా వేడెక్కి బలమైన ఊర్ధ్వ వాయు ప్రవాహాలు ఏర్పడతాయి. పీఠభూమిలో 9 కిలోమీటర్ల ఎత్తులో అల్ప పీడన ప్రాంతం ఏర్పడుతుంది.

తరువాత ఈ పవనాలు నైరుతి ఋతుపవనాలుగా ప్రయాణం మొదలుపెడతాయి. భారత ద్వీపకల్పం ఈ పవనాలను రెండు శాఖలుగా విభజిస్తుంది. అవి: అరేబియా సముద్ర శాఖ, బంగాళాఖాతం శాఖ. అరేబియా సముద్ర శాఖ భారత పడమటి తీరాన్ని చేరి ఉత్తర దిశగా కదులుతుంది. బంగాళాఖాతం శాఖ బెంగాల్ తీరాన్ని, షిల్లాంగ్ పీఠభూమి దక్షిణ ముఖాన్ని తాకుతుంది.

తరువాత ఇది పశ్చిమంగా గంగాలోయవైపు మళ్లింపబడుతుంది. ఈ రెండు శాఖలు భారతదేశానికి జూన్ మొదట్లో చేరుకుంటాయి. దీనినే 'ఋతుపవనాల ఆరంభం'గా పేర్కొంటారు. నాలుగు నుంచి అయిదు వారాలలో ఈ ఋతుపవనాలు క్రమేపీ దేశమంతా వ్యాపిస్తాయి. భారతదేశంలో అత్యధిక వర్షపాతం నైరుతి ఋతుపవన కాలంలో సంభవిస్తుంది. పశ్చిమతీరం వెంట పశ్చిమ కనుమల వల్ల ఈశాన్య ప్రాంతంలో ఎత్తైన కొండల వల్ల ఆ ప్రాంతాలలో వర్షపాతం ఎక్కువగా ఉంటుంది. అరేబియా సముద్ర శాఖకి వర్షచ్ఛాయా ప్రాంతంలోనూ, బంగాళాఖాతం శాఖకి సమాంతరంగానూ ఉండటం వల్ల ఈ కాలంలో తమిళనాడులోని కోరమండల్ తీరంలో అంతగా వర్షం కురవదు.



చిత్రం 4.3 : పీడనం, ఋతుపవనాలు

## తిరోగమన ఋతుపవనాలు

వేడిమి పెరుగుతున్న నెలల నుండి పొడిగా ఉండే చలి పరిస్థితుల మధ్య అక్టోబరు, నవంబరు నెలలు సంధి కాలంగా ఉంటాయి. తిరోగమన ఋతుపవనాల సమయంలో ఆకాశం నిర్మలంగా ఉండడమే కాక ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. నేల ఇంకా తేమగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత, గాలిలో అధిక తేమ కారణంగా వాతావరణం చాలా ఉక్కపోతగా ఉంటుంది. దీనిని సాధారణంగా "అక్టోబరు వేడిమి" అంటారు.

ఇంతకుముందు వాయవ్య భారతంలో ఉండిన అల్ప పీడన పరిస్థితులు నవంబరు ఆరంభం నాటికి బంగాళాఖాతంలో ఏర్పడతాయి. అల్ప పీడన ప్రాంతం బాగా దక్షిణానికి మారుతుంది. ఈ కాలంలో అండమాన్ ప్రాంతంలో తుఫానులు, వాయుగుండాలు ఏర్పడతాయి. ఇవి అరేబియా సముద్రంలో పుడతాయి. ఈ ఉష్ణప్రాంత తుఫానులు చాలా విధ్వంసకరంగా ఉంటాయి. గోదావరి, కృష్ణా, కావేరీనదుల డెల్టాప్రాంతాలు వీటి ప్రతాపానికి గురవుతాయి. ఎటువంటి వైపరీత్యాలు లేకుండా ఒక్క సంవత్సరం కూడా ఉండదు. అప్పుడప్పుడూ ఈ తుఫానులు సుందరవనాలను, బంగ్లాదేశ్‌ను కూడా తాకుతాయి. కోరమండల్ ప్రాంతంలో అధిక శాతం వర్షం తుఫానులు, వాయుగుండాల వల్ల సంభవిస్తుంది.




పటం 3 : భారతదేశం – నైరుతి ఋతుపవనాల ప్రవేశం




పటం 4 : భారతదేశం – నైరుతి ఋతుపవనాల నిష్క్రమణం.

భారతదేశ సాంప్రదాయం ప్రకారం రెండేసి నెలలు ఉండే ఆరు ఋతువులుగా సంవత్సరం విభజింపబడుతుంది. ఉత్తర, మధ్య భారతదేశ ప్రజలు అనుభవించే సాధారణ శీతోష్ణస్థితుల ఆధారంగా ఈ ఋతువుల విభజన జరిగింది. ఉత్తర భారతదేశానికి, దక్షిణ భారతదేశానికి ఈ ఋతువుల విభజనలో కొంత తేడా ఉంది.

**సాంప్రదాయ భారతీయ కాలాలు**

| ఋతువులు | తెలుగు నెలలు (చాంద్రమాన సంవత్సరం) | ఇంగ్లీషు నెలలు (సూర్యమాన సంవత్సరం) |
|---|---|---|
| వసంతం | చైత్రం – వైశాఖం | మార్చి – ఏప్రిల్ |
| గ్రీష్మం | జ్యేష్ఠ – ఆషాఢం | మే – జూన్ |
| వర్ష | శ్రావణం – భాద్రపదం | జులై – ఆగస్టు |
| శరత్ | ఆశ్వయుజం – కార్తీకం | సెప్టెంబరు – అక్టోబరు |
| హేమంతం | మార్గశిరం – పుష్యం | నవంబరు – డిసెంబరు |
| శిశిరం | మాఘం – ఫాల్గుణం | జనవరి – ఫిబ్రవరి |

## భూగోళం వేడెక్కటం, శీతోష్ణస్థితిలో మార్పు

మండుతున్న బంతినుంచి భూగోళం ఏర్పడిన క్రమంలో ఎన్నో వాయువులు వెలువడ్డాయి. భూమి గురుత్వాకర్షణ శక్తి వల్ల ఈ వాయువులు రోదసిలోకి తప్పించుకోలేదు. భూమ్యాకర్షణ శక్తి ఈ వాయువులను ఇంకా పట్టి ఉంచుతోంది. ఫలితంగా భూమి చుట్టూ వాయువుల పొర ఒకటి ఏర్పడింది. దీనివల్ల ఎన్నో ముఖ్యమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఉదాహరణకు మనం పీల్చుకునే ప్రాణవాయువు (ఆక్సిజన్), సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి కాపాడే ఓజోను పొర, మనకు అవసరమైన మాంసకృత్తులు తయారు చేయటానికి మొక్కలు వినియోగించుకునే నత్రజని మొదలైనవి. అంతేకాకుండా ఈ వాతావరణం మనలను వెచ్చగా ఉంచుతుంది, నీటి చక్రం కూడా దీనిగుండా ఏర్పడుతుంది. (తొమ్మిదవ తరగతిలోని 4వ అధ్యాయంలోని చిత్రం చూడండి.)

వాతావరణం చేసే ముఖ్యమైన పనులలో మనల్ని వెచ్చగా ఉంచటం ఒకటి. ఇది భూమిని కప్పి ఉంచే తేలికపాటి, బాగా పనిచేసే దుప్పటిలాంటిది. భూమిని చేరుకునే సౌరశక్తి అంతా తిరిగి రోదసిలోకి వికిరణం చెందకుండా వాతావరణం కొంత శక్తిని పట్టి ఉంచుతుందని 9వ తరగతిలో తెలుసుకున్నాం. దీనిని హరిత గృహ ప్రభావం అంటాం. భూమి మీద ప్రాణం మనుగడకు ఇది ఎంతో ముఖ్యం. భూమిపైన వాతావరణమే లేకపోతే ఇది చాలా చల్లగా ఉండేది.

అయితే 19వ శతాబ్దం నుంచి భూగోళం చాలా వేగంగా వేడెక్కుతోంది. దీనిపట్ల అందరిలోనూ ఆందోళన పెరుగుతోంది. ఎందుకు? భౌమ్య చరిత్రలో భూమి పలుమార్లు ఎంతో వేడెక్కింది, ఎన్నిసార్లో మంచు ముద్దగా మారింది. ఇప్పుడు భూమి వేడెక్కటం వెనుక ప్రత్యేకత ఏమిటి?

ఇంతకుముందు భూమి వేడెక్కటానికి లేదా చల్లబడటానికి చాలా సమయం పట్టింది. దీనివల్ల భూమి మీద ప్రాణులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారటానికి సమయం దొరికింది. ఇప్పుడు భూమి చాలా తొందరగా వేడెక్కుతోంది, ఇది వినాశకర మార్పులకు దారి తీయవచ్చు. పారిశ్రామిక విప్లవం తరువాత భూమి వేడెక్కటానికి కారణం మానవ చర్యలే. కాబట్టి ప్రస్తుతం భూమి వేడెక్కటాన్ని మానవ కారణంగా భూగోళం వేడెక్కటం (AGW- Anthropogenic Global Warming) అంటారు.

ఇటీవల కాలంలో శాస్త్రజ్ఞులు ఉత్తర అక్షాంశాల వద్ద గల గడ్డ కట్టిన టండ్రాల కింద (ప్రధానంగా ఉత్తర రష్యా విశాల భూభాగం కింద) పెద్ద మొత్తంలో మిథేన్ వాయువు ఉందని కనుక్కున్నారు. భూగోళ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నకొద్దీ టండ్రాలలో గడ్డకట్టిన మంచు మరింతగా కరుగుతుంది. ఫలితంగా మంచు కింద ఉన్న మిథేన్ వాతావరణంలోకి విడుదల అవుతుంది. దానివలన భూమి మరింత వేడెక్కుతుంది, మంచు మరింత కరుగుతుంది, మరింత మిథేన్ విడుదలవుతుంది. ఇది ఒక విషవలయంగా మారుతుంది. హరితగృహ వాయువుగా (Green house gas) కార్బన్ డై ఆక్సైడ్ కంటే మిథేన్ మరింత శక్తిమంతంగా పని చేస్తుంది.

### మానవజనిత కారణాల వల్ల భూగోళం వేడెక్కడం (AGW), శీతోష్ణస్థితిలో మార్పులు

ఈ మానవజనిత కారణాల వల్ల భూమి వేడెక్కడం, భౌమ్యవ్యవస్థ యొక్క ఉష్ణ ప్రసరణలో అనేక మార్పులకు కారణమవుతోంది. వాతావరణం వల్ల, సముద్ర ప్రవాహాల వల్ల భూగోళం మీద ఉష్ణ పునఃప్రసరణ ఎలా జరుగుతుందో గుర్తుకు తెచ్చుకోండి. భూగోళం వేడెక్కటం వల్ల ఈ వ్యవస్థ అస్తవ్యస్తమవుతోంది. అయితే జరుగుతున్న మార్పులకంటే, వాటి వేగం ఆందోళన కలిగిస్తోంది.

ఉష్ణ పునః ప్రసరణ గందరగోళం కావటంతో వాతావరణ, శీతోష్ణస్థితుల సరళిలో మార్పులు వస్తాయి. స్వల్పకాలిక (వాతావరణ) మార్పులు ఒకదానికొకటి తోడై దీర్ఘకాలికంగా (శీతోష్ణస్థితిలో) మారతాయి.

హరితగృహ వాయువుల ఉద్గారాలను అన్ని దేశాలలో తగ్గించటానికి ఒప్పందం కుదుర్చుకోటానికి జరుగుతున్న అంతర్జాతీయ ప్రయత్నాలు ఇంకా ఫలించలేదు. ఈ సమస్యను ఎదుర్కోటానికి శీతోష్ణస్థితి మార్పుపై ప్రపంచ దేశాల మధ్య అంతర ప్రభుత్వ సంఘం (IPCC– Inter-governmental Panel on Climate Change) ఒకటి ఏర్పడింది. మానవ కారణంగా భూగోళం వేడెక్కటాన్ని తగ్గించటానికి, వాతావరణ మార్పు వేగాన్ని తగ్గించటానికి ఒక ఒడంబడిక ఏర్పరుచుకునేలా అన్ని దేశాలతో అనేక సమావేశాలను ఈ సంఘం నిర్వహించింది. వీటిల్లో ఏదీ విజయవంతం కాలేదు. 2013లో పోలాండ్‌లోని వార్సాలో జరిగిన సమావేశం కూడా ఎటువంటి ఒడంబడికను సాధించలేకపోయింది.

ముఖ్యంగా 'అభివృద్ధి చెందిన' (ప్రధానంగా పాశ్చాత్య పారిశ్రామిక, ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన) దేశాలు 'అభివృద్ధి చెందుతున్న' (అంతగా పారిశ్రామికీకరణ చెందని) దేశాల మధ్య విభేదాలు తల ఎత్తాయి. వాతావరణంలోని హరితగృహ వాయువులను పెంచే బొగ్గు వినియోగం, ఇతర కార్యకలాపాలను అభివృద్ధి చెందుతున్న దేశాలు తగ్గించుకోవాలని అభివృద్ధి చెందిన దేశాలు అంటున్నాయి. శిలాజ ఇంధనాల వినియోగం ద్వారానే ఆ దేశాలు అభివృద్ధి చెందాయన్నది ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. శిలాజ ఇంధనాలు (ప్రధానంగా బొగ్గు) వినియోగించకపోతే తమ ఆర్థిక ప్రగతి తీవ్రంగా కుంటుపడుతుందని అభివృద్ధి చెందుతున్న దేశాలు అంటున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రగతిని సాధించటానికి ప్రత్యామ్నాయాలను చూపడంలో అభివృద్ధి చెందిన దేశాలు తమ వంతు పాత్ర పోషించాలని ఇవి కోరుతున్నాయి.

- అడవుల నిర్మూలన అంటే ఏమిటి?
- ఇది కేవలం అటవీ ప్రాంతాలలోనే జరుగుతుందా? మీ ప్రాంతంలో అడవి లేకపోయినా సరే ఏం జరుగుతోంది?
- భూగోళం వేడెక్కటాన్ని అడవులు అంతరించి పోవటం ఏ విధంగా ప్రభావితం చేస్తుంది? (విజ్ఞాన శాస్త్రం తరగతిలో కిరణజన్య సంయోగక్రియ గురించి చదివింది గుర్తుకు తెచ్చుకోండి.)
- భూగోళం వేడెక్కటాన్ని ప్రభావితం చేసే ఇతర మానవ కార్యకలాపాలు ఏమిటి?

ప్రపంచ వ్యాప్తంగా అనేక శాస్త్రజ్ఞులు ఒక విషయంపై ఏకీభవిస్తున్నారు: మానవ కారణంగా భూగోళం వేడెక్కుతోంది అన్నది వాస్తవం. ఇది తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది. రాబోయే సంవత్సరాలలో వాతావరణంలో తీవ్ర పరిణామాలు సంభవించవచ్చని, జీవ మనుగడకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

భూగోళం వేడెక్కటానికి దోహదం చేసే మానవ కారణ అంశాలలో అడవిని నరికివెయ్యటం ఒకటి. మీ ఉపాధ్యాయునితో, మీ తోటి విద్యార్థులతో చర్చించి పైన ఇచ్చిన ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు రాయండి.

## భారతదేశంపై శీతోష్ణస్థితి మార్పుల ప్రభావం

సగటు ఉష్ణోగ్రతలు $2^0$ సెంటీగ్రేడులు పెరగటం చాలా తక్కువ అనిపించవచ్చు కానీ వచ్చే శతాబ్దం ఆరంభం నాటికి దీని కారణంగా సముద్ర మట్టం ఒక మీటరు పెరుగుతుంది. మన తీర ప్రాంతాలలో చాలావరకు దీని వల్ల ప్రభావితం అవుతాయి, కోట్లాది మందిని ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. వీళ్లు తమ జీవనోపాధిని కోల్పోతారు.

తూర్పు కోల్‌కతాలోని నోనడంగా ప్రాంతంలో గత కొద్ది సంవత్సరాలుగా ఉంటున్న 200 గ్రామీణ కుటుంబాలను ఖాళీ చేయించటానికి కోల్‌కతా నగరపాలక అభివృద్ధి సంస్థ ప్రయత్నిస్తోంది. ఐలా పెనుతుఫాను కారణంగా 2009లో సుందర్‌బన్ ప్రాంతం అతలాకుతలం కావటంతో పని వెతుక్కుంటూ వచ్చిన కుటుంబాలవారు ఇక్కడ నివసిస్తున్నారు.

భారీ పోలీసు బందోబస్తు మధ్య మార్చి 30న బుల్‌డోజర్లు ఉపయోగించి ఈ మురికివాడల్లోని ఇళ్లను కూల్చేశారు, కొన్ని ఇళ్లకు నిప్పు పెట్టారు. ఇల్లు లేకుండాపోయిన 700 మంది గత కొద్ది రోజులుగా కురుస్తున్న వానల వల్ల బురదలో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. వీళ్లు ఎక్కువగా ఇళ్లల్లో పని చేస్తారు, రిక్షా లాగుతారు, భవన నిర్మాణంలో పనిచేస్తారు.

- లక్షలాదిమంది ప్రభావితమైతే అప్పుడు ఆ పరిస్థితులను ఎట్లా ఎదుర్కోగలమో ఊహించండి. పునరావాసానికి వీళ్లకు భూమి ఎక్కడ దొరుకుతుంది?

ఇంకొక ప్రభావం వర్షపాతం మీద ఉంటుంది. వర్షపాతం రీతిలో చాలా మార్పులు రావచ్చు: కొన్ని ప్రాంతాలలో వర్షపాతం చాలా ఎక్కువగా ఉంటే, కొన్ని ప్రాంతాలు వర్షాభావానికి గురి కావచ్చు. అంటే వరదలు, కరువులు ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. దీని వల్ల వ్యవసాయమూ, ప్రజల జీవనోపాధులు ప్రభావితమౌతాయి.



*'ఐలా' ప్రభావం: తెగిన కట్ట*

హిమాలయాల్లోని హిమపర్వతాలు వేగంగా కరగటం వల్ల చేపల ఆవాసప్రాంతం ప్రభావితమయ్యి మంచినీటి చేపలు పట్టేవాళ్ల జీవనోపాధులు ప్రభావితమౌతాయి. అదే విధంగా పైన చదివినటువంటి అసాధారణ వాతావరణ పరిస్థితులు పెరిగే అవకాశం ఉంది. వాతావరణ మార్పు అన్నది ప్రపంచస్థాయిలో జరుగుతుంది. కాబట్టిదానివల్ల మనమందరం ప్రభావితమౌతాం.



*'కట్ట మరమ్మతు' దృశ్యం*

## కీలక పదాలు

క్లైమోగ్రాఫ్ | వాతావరణం | ఋతుపవనాలు | సూర్యపుటము
పీడన మండలాలు | భూగోళం వేడెక్కటం | జెట్ ప్రవాహం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది వాక్యాలు చదివి అవి వాతావరణానికి లేదా శీతోష్ణస్థితికి, ఏ అంశానికి ఉదాహరణో చెప్పండి.
   అ) హిమాలయాల్లోని అనేక మంచుపర్వతాలు గత కొద్ది సంవత్సరాలలో కరిగిపోయాయి.
   ఆ) గత కొన్ని దశాబ్దాలలో విదర్భ ప్రాంతంలో కరువులు ఎక్కువగా సంభవించాయి.
2. కింది వాటిని జతపరచండి. అవసరమైతే పటాలను చూడండి. (ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉండవచ్చు.)

| | |
|---|---|
| అ) తిరువనంతపురం | భూమధ్యరేఖకు దూరంగా ఉండి శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. |
| ఆ) గ్యాంగ్‌టాక్ | భూమధ్య రేఖకు దగ్గరగా ఉంది, కాని సముద్రానికి దగ్గరగా లేదు, వర్షపాతం తక్కువ. |
| ఇ) అనంతపురం | సముద్రానికి దగ్గరగా ఉంది, శీతోష్ణస్థితిపై సముద్ర ప్రభావం ఎక్కువ. |

3. భారతదేశ శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలను వివరించండి.
4. కొండ ప్రాంతాలలోని, ఎడారులలోని శీతోష్ణస్థితులను ప్రభావితం చేసే అంశాలను వివరించండి.
5. భూగోళం వేడెక్కడంలో మానవుని పాత్రను తెలపండి.
6. AGW విషయంలో అభివృద్ధి చెందిన అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలేమిటి?
7. భూగోళం వేడెక్కడంలో శీతోష్ణస్థితిలో మార్పులు ఏవిధంగా కారణమవుతాయి? భూగోళం వేడెక్కడాన్ని తగ్గించడానికి కొన్ని చర్యలను సూచించండి.
8. భారతదేశ భౌగోళిక పటంలో కింది వానిని గుర్తించండి:
   (i) $40^0$ సెం.గ్రే. కన్నా ఎక్కువ సంవత్సర సగటు ఉష్ణోగ్రతను నమోదు చేసిన ప్రాంతాలు.
   (ii) $10^0$ సెం.గ్రే. కన్నా తక్కువ సంవత్సర సగటు ఉష్ణోగ్రతను నమోదు చేసిన ప్రాంతాలు.
   (iii) భారతదేశంపై వీచే నైరుతి ఋతుపవనాల దిశామార్గం.
9. కింది క్లైమోగ్రాఫ్‌లను పరిశీలించి ప్రశ్నలకు జవాబులు రాయండి:
   (i) ఏ నెలలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది?
   (ii) ఏ నెలలలో అత్యల్ప, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి?
   (iii) జూన్, అక్టోబర్‌ల మధ్య గరిష్ఠ వర్షపాతం ఎందుకు సంభవిస్తుంది?
   (iv) మార్చి, మే నెలల మధ్య అత్యధిక ఉష్ణోగ్రత ఎందుకు ఉంటుంది?
   (v) ఉష్ణోగ్రత, వర్షపాతాలలో మార్పులకు కారణమయ్యే భౌగోళిక అంశాలను పేర్కొనండి.




## ప్రాజెక్టు

మీ ప్రాంతానికి సంబంధించిన శీతోష్ణస్థితి, వాతావరణంలపై సామెతలను, నానుడిలను సేకరించండి.

- ఉదయం పూట ఇంద్రధనస్సు నావికులకు హెచ్చరిక.
- రాత్రి పూట ఇంద్రధనస్సు నావికులకు ఆహ్లాదకరం.
- పచ్చికమీద పొగమంచు ఉంటే ఇక వానరాదు.

పాఠం

# 5 భారతదేశ నదులు, నీటి వనరులు

- భారతదేశ పటంలో హిమాలయాలను, పశ్చిమ కనుమలను గుర్తించండి.
- పటంలోని రంగుల సూచికను బట్టి నదులు పుట్టిన పర్వతాలు ఎంత ఎత్తులో ఉన్నాయో తెలుసుకోండి. అట్లాస్, ఉబ్బెత్తు భౌగోళిక పటం సహాయంతో నదీ గమనాన్ని అనుసరిస్తూ వాటి ప్రవాహ దిశను గుర్తించండి.
- గృహ అవసరాలకు 5% నీటిని ఉపయోగిస్తున్నారు. అయినాకానీ జనాభాలో ఎక్కువ మందికి నీళ్లు అందటం లేదు. దీని గురించి చర్చించండి.
- భారతదేశంలో 10 కోట్ల ఎకరాల భూమి వరదకు గురయ్యే ప్రమాదం ఉంది, అంతే విస్తీర్ణం కరువుకి గురయ్యే అవకాశం ఉంది. దీనికి కారణాలు ఏమిటి?
- ఉపరితల నీటి వనరులలో 70% కలుషితం అయ్యాయి. కారణాలు ఏమిటి?




*పటం 1 : భారతదేశ భౌగోళిక స్వరూపం, నదీ జల వ్యవస్థ*

భారతదేశ నదీ జల వ్యవస్థ మూడు భౌతిక అంశాలకు అనుగుణంగా రూపొందింది. ఇవి: 1) హిమాలయాలు, 2) ద్వీపకల్ప పీఠభూమి, 3) సింధూ–గంగా మైదానం. పుట్టుక ఆధారంగా భారతదేశ నదీ జల వ్యవస్థను రెండుగా విభజించవచ్చు: i) హిమాలయ నదులు, ii) ద్వీపకల్ప నదులు.

## హిమాలయ నదులు

**హిమాలయ నదులు మూడు ముఖ్యమైన వ్యవస్థల కిందకు వస్తాయి:** అవి గంగ, సింధు, బ్రహ్మపుత్ర నదులు. ఈ నదులు దాదాపు ఒకే ప్రాంతంలో కొన్ని కిలోమీటర్ల వ్యత్యాసంతో పుట్టి పర్వతశ్రేణుల వల్ల వేరుచేయబడతాయి. అవి మొదట పర్వతాల ప్రధాన అక్షానికి సమాంతరంగా ప్రవహిస్తాయి. తరువాత ఒక్కసారిగా అవి దక్షిణానికి మలుపు తిరిగి ఎత్తైన పర్వత శృంఖలాలను కోసుకుంటూ ఉత్తర భారత మైదానాలను చేరుకుంటాయి. ఈ క్రమంలో ఇవి లోతైన 'V' ఆకారపు లోయలను ఏర్పరిచాయి. ఇది సింధూ, బ్రహ్మపుత్ర నదులలో బాగా కనపడుతుంది.

హిమాలయ నదులు జీవనదులు, అంటే సంవత్సరమంతా వీటిల్లో నీళ్లు ఉంటాయి. వర్షపాతం, కరుగుతున్న మంచుతో నీళ్లు అందటం వల్ల జీవనదులుగా పిలుస్తున్నారు.

### సింధూ నదీ వ్యవస్థ

టిబెట్‌లోని మానససరోవరం దగ్గర కైలాస పర్వతాలలోని ఉత్తర వాలుల వద్ద సింధూనది మొదలవుతుంది. ఇది టిబెట్‌గుండా వాయవ్య దిశగా పయనిస్తుంది. భారతదేశంలోకి జమ్ము–కాశ్మీర్‌లో ప్రవేశిస్తుంది. సింధూనదికి భారతదేశంలో జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్‌లు ప్రధానమైన ఉపనదులు. భారతదేశంలో జమ్మూ & కాశ్మీర్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో ఇది ప్రవహిస్తుంది.

- అట్లాస్ సహాయంతో భారతదేశం, పాకిస్తాన్‌లలో సింధూనది ప్రవాహ మార్గాన్ని గుర్తించండి.

### గంగా నదీ వ్యవస్థ

గంగానది రెండు నదుల కలయిక. ఒకటి గంగోత్రి హిమానీనదం దగ్గర పుట్టే భగీరథి. రెండవది బదరీనాథ్‌కి వాయవ్య దిశలో సతప్‌నాథ్ దగ్గర పుట్టే అలకనంద. ఈ రెండూ దేవప్రయాగ వద్ద కలిసి గంగానదిగా మారుతుంది. ఇది హరిద్వార్ వద్ద పర్వతాలను వదలి మైదానాలలోనికి ప్రవహిస్తుంది. గంగానదిలో అనేక ఉపనదులు వచ్చి చేరతాయి. వీటిల్లో అనేకం హిమాలయ పర్వతాల్లో పుడతాయి; కొన్ని ద్వీపకల్ప పీఠభూమిలో పుట్టేవి కూడా ఉన్నాయి.

- గంగానది పటాన్ని (5.2) చూసి అది ఏఏ రాష్ట్రాలగుండా ప్రవహిస్తుందో చెప్పండి.
- పై పటం చూసి గంగానది ఉపనదులలో ఉత్తర దిశగా ప్రవహించేవి ఏవో, దక్షిణ దిశగా ప్రవహించేవి ఏవో చెప్పండి.

### బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థ

బ్రహ్మపుత్ర (టిబెట్‌లో దీనిని సాంగ్‌పో అంటారు) మానససరోవరం దగ్గర కైలాశ పర్వతాలలోని చెమయుంగ్‌డంగ్ హిమానీనదం నుండి పుడుతుంది. దక్షిణ టిబెట్‌గుండా ఇది తూర్పునకు ప్రవహిస్తుంది. లోట్సే త్సాంగ్ దగ్గర జల ప్రయాణానికి అనువుగా ఉండే వెడల్పైన నదిగా మారి 640 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఆ తరవాత అనేక జలపాతాల ద్వారా అది పాయలుగా మారుతుంది. భారతదేశంలోని

అరుణాచల్ ప్రదేశ్‌లో నైరుతి దిశగా పెద్ద మలుపు తిరుగుతుంది. ఇక్కడ దీనిని సియాంగ్ అనీ, దిహాంగ్ అనీ అంటారు. అస్సాం లోయలోకి వచ్చి నప్పుడు దిబంగ్, లోహిత్ అనే రెండు ఉపనదులు దీంట్లో కలుస్తాయి. ఇక్కడి నుంచి దీనిని బ్రహ్మపుత్ర గా పిలుస్తారు.



*పటం 2 : గంగా, బ్రహ్మపుత్రల సంగమం*

## ద్వీపకల్ప నదులు

బంగాళాఖాతంలో కలిసే ద్వీపకల్ప నదులకు, అరేబియా సముద్రంలో కలిసే చిన్న నదులకు మధ్య జల విభాజక క్షేత్రంగా పశ్చిమకనుమలు కలవు. నర్మదా, తపతి నదులు కాకుండ, ద్వీపకల్ప నదులన్నీ పడమర నుంచి తూర్పువైపుకు ప్రవహిస్తాయి. ద్వీపకల్ప పీఠభూమిలోని ఉత్తర భాగంలో పుట్టే చంబల్, సింద్, బేత్వా, కేన్, సోన్ నదులు గంగా నదీ వ్యవస్థకు చెందుతాయి. ద్వీపకల్పంలోని ఇతర ముఖ్యమైన నదులు మహానది, గోదావరి, కృష్ణా, కావేరి. ద్వీపకల్ప నదుల ప్రవాహమార్గం మారదు, వక్రతలు (meanders) ఉండవు. వీటిల్లో సంవత్సరమంతా నీళ్లు ఉండవు.

ద్వీపకల్ప నదులలో గోదావరి నది పెద్దది. మహారాష్ట్రలోని నాసిక్ వద్దగల త్రయంబకం పీఠభూమిలో ఇది పుడుతుంది, బంగాళాఖాతంలో కలుస్తుంది.

- ఇక్కడ ఇచ్చిన పటం, అట్లాస్‌ల సహాయంతో ఈ కిందివి వివరించండి.
- గోదావరి ............................. వద్ద పుడుతుంది.
- తూర్పుకి ప్రవహించే ద్వీపకల్ప నదులలో కృష్ణానదిది రెండవ స్థానం. ఇది ........... వద్ద పుడుతుంది.
- మహానది చత్తీస్‌గఢ్ లోని సిహావా దగ్గర పుట్టి .............. గుండా ప్రవహిస్తుంది.
- నర్మదానది మధ్యప్రదేశ్‌లోని .......... వద్ద పుడుతుంది.
- తపతీనది ......... వద్ద పుట్టి .............. దిశగా పయనిస్తుంది.

## నీటి వినియోగం

నీటి వనరు మనకు సంవత్సరమంతా లభ్యమవుతుంది. అంటే సంవత్సరంలో మనకు ఎంత నీరు అందుబాటులో ఉంటుందో అంచనా వేస్తాం. దీనికి 'జల చక్రాన్ని' మరొకసారి గుర్తుకు చేసుకుని సంవత్సరంలో అంతర్గత, బాహ్య ప్రవాహాల నీటిని అంచనా వేయాలి. ఈ అంచనాలను వివిధ స్థాయిలలో – చిన్న పరీవాహక ప్రాంతానికి, లేదా మొత్తం నదికి చేయవచ్చు.



చిత్రం 5.1 : జలచక్రం

ఇప్పుడు మనం ఒక ఊరికి లేదా జిల్లాకి 'నీటి బడ్జెట్' ఎలా వర్తిస్తుందో చూద్దాం.

- వాటర్‌షెడ్ అన్న పదాన్ని చర్చించండి.

## అంతర్గత ప్రవాహాలు

ఏ ప్రాంతానికైనా అంతర్గత ప్రవాహాలు = అవపాతం + ఉపరితల ప్రవాహం + భూగర్భ ప్రవాహం. ఉపరితల ప్రవాహం అంటే భూమి మీద వాగులు, కాలువలు, నదులు వంటి వాటిల్లోని నీటి ప్రవాహం. భూగర్భ జల ప్రవాహాన్ని అంచనా వేయవచ్చు కానీ అది కొంచెం కష్టమైన పని. అవపాతం అంటే వాన ఒక్కటే కాకుండా వడగళ్ళు, హిమము, పొగమంచు కూడా ఉంటాయి. అవపాతం అన్ని సంవత్సరాలు ఒకేలాగా కాకుండా ప్రతీ సంవత్సరం మారుతూ ఉంటుంది. అందువలన అవపాతాన్ని లెక్కించడానికి కొన్ని సంవత్సరాల అవపాతం యొక్క సగటును పరిగణలోనికి తీసుకుంటారు.

**ఉపరితల, భూగర్భ నీటి ప్రవాహాలు:** మీ ప్రాంతానికి, అది చిన్న గ్రామమైనా, పట్టణమైనా నదులు, సాగునీటి పథకాల కాలవలు వంటి వాటి ద్వారా దిగువకు వచ్చే నీటి ప్రవాహాల జాబితా తయారు చేయండి.

- మీ సమీప మండల కార్యాలయం నుంచి గత 5 సంవత్సరాలకు మొత్తం వార్షిక వర్షపాతం ఎంతో తెలుసుకోండి.

ఒక గ్రామంలాంటి ఒక చిన్న ప్రాంతానికి కాలవలు, పైపులు వంటి వాటి ద్వారా నీళ్లు రావచ్చు – ఇటువంటి బయటి వనరులన్నింటినీ పేర్కొనండి. అవపాతానికి దీనిని జోడిస్తే ఆ ప్రాంతం లోపలికి మొత్తం ఎంత నీళ్లు వస్తాయో తెలుసుకోవచ్చు. భూగర్భం ద్వారా లోపలికి వచ్చే నీటిని అంచనా వేయటం కొంచెం కష్టం. అయితే నేల వాలుని బట్టి భూగర్భ జలం ఎటు ప్రవహిస్తుందో కొంత ఊహించవచ్చు.

## బాహ్య ప్రవాహాలు

**భాష్పోత్సేకం:** అన్ని నీటి మడుగుల నుంచి నీరు ఆవిరిగా మారుతుంటుంది. చెరువులు, నదులు, సముద్రాలు వంటి అన్ని ఉపరితల నీటి వనరుల నుంచి నీరు ఆవిరి అవుతుంది. అన్ని జీవులు శ్వాస ప్రక్రియ ద్వారా గాలిలోకి నీటిని విడుదల చేస్తాయి.

- మొక్కలు వేళ్లనుంచి తీసుకున్న నీరు ఏమవుతుందో విజ్ఞాన శాస్త్ర పాఠాలలో తెలుసుకుని ఉంటారు. అది మరొకసారి గుర్తుకు తెచ్చుకోండి.

**ఉపరితల ప్రవాహాల ద్వారా, భూగర్భ ప్రవాహాల ద్వారా బయటకు పోయేనీళ్లు :** ఒక గ్రామంలాంటి ప్రాంతాన్ని ఊహించుకోండి. కొంత నీళ్లు వాగులగుండా ఉపరితల ప్రవాహం ద్వారా బయటకు ప్రవహిస్తాయి. వానాకాలంలో ఈ ఉపరితల ప్రవాహం గణనీయంగా పెరుగుతుంది. వర్షపాతంలో కొంత నేలలోకి, భూమి లోపలి పొరల్లోకి ఇంకి భూగర్భ జలాలను తిరిగి నింపుతాయి. దీంట్లో కొంత బావులు, బోరు బావులలోకి ప్రవహించి తిరిగి వినియోగానికి వస్తుంది, కొంత చాలా లోతైన నీటి ఊటలను చేరి మళ్లీ అందుబాటులోకి రాదు. భూగర్భ జలంలో కొంత భూగర్భ ప్రవాహాలను చేరి తిరిగి బయటకు వచ్చి వాగులు, నదులలో కలుస్తుంది.

**వ్యవసాయానికి నీళ్లు:** పంటల వేళ్లు ఉండే ప్రాంతంలోకి నీళ్లు వర్షపాతం ద్వారాగానీ, సాగునీటి ద్వారాగానీ చేరుతుంది. నేలకి తేమని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది. వరద వంటి పరిస్థితుల్లో ఎక్కువ నీళ్లు ఉండి, అది నేల లోపలి పొరల్లోకి ఇంకకపోతే మొక్కల వేళ్లు దెబ్బతింటాయి. ఇంకొకవైపు కరువు పరిస్థితులలో వేళ్ల ప్రాంతంలో తగినంత తేమ లేకపోతే పంటలు వడిలిపోతాయి.

**గృహ అవసరాలకు, పశువులకు నీటి వినియోగం :** తాగునీటికి, వంటకి, స్నానానికి, శుభ్రపరచడానికి, పశువులకు ఉపయోగించే నీరు చాలా ముఖ్యమైనది. ఆదాయాలతో సంబంధం లేకుండా అందరికీ ఈ అవసరాల కోసం తగినంత నీళ్లు అందేలా చూడటానికి ప్రణాళికలు తయారుచేయాలి.

**పారిశ్రామిక అవసరాలకు నీటి వినియోగం :** ఉత్పత్తి ప్రక్రియలకు కూడా నీళ్లు అవసరమవుతాయి. అయితే దీనికీ వ్యవసాయ, గృహ వసతి అవసరాలకూ మధ్య వైరుధ్యం ఉంది. ఈ వైరుధ్యం పెరుగుతోంది, కాబట్టి దీనిని పరిగణనలోకి తీసుకోవాలి. పారిశ్రామిక అవసరాల కోసం నీటి వినియోగంలో కాలుష్య నివారణ, నీటిని తిరిగి వినియోగించుకోవడం అన్నవి ముఖ్యమైన సవాళ్లు.

ఒక ప్రాంతంలో లేదా ఒక గ్రామంలో అందుబాటులో ఉండే నీళ్లు లోపలికి ప్రవహించే నీటి మీదే కాకుండా, మనం వాడుకుంటున్న 'నిల్వల' మీద కూడా ఆధారపడి ఉంటుంది. మన విశ్లేషణలో ఈ ప్రవాహం, నిల్వల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాలి. ఉదాహరణకు ఒక ట్యాంకును ఊహించుకోండి. దాంట్లోకి నీళ్లు ప్రవహించటానికి ఒక పైపు, వాడుకోటానికి నీళ్లు బయటకు ప్రవహించటానికి ఒక పైపు ఉన్నాయి. లోపలికి ప్రవహించే నీటిని నిమిషానికి లీటర్లలో కొలవవచ్చు. అలాగే బయటకు ప్రవహించే నీటిని కూడా నిమిషానికి లీటర్లలో కొలుస్తారు. ట్యాంకులో ఉండే నీళ్లు నిరంతరం మారుతూ ఉంటాయి. కాని ఒక నిర్దిష్ట సమయంలో, ఉదాహరణకు ఉదయం 8.30 గంటలకు ఎన్ని లీటర్ల నీళ్లు ఉన్నాయో లెక్క కట్టవచ్చు. ఇది ఆ సమయంలో ఉన్న నీటి నిల్వ.

ఒక ఊరిలో చెరువులు, కుంటలు, మడుగుల వంటివి ఉండవచ్చు. ఇవన్నీ ఉపరితల నిల్వలు. భారతదేశంలో చాలా గ్రామాలలో బావులు, బోరు బావులనుంచి నీటిని పొందుతారు. అంటే వీళ్లు అంతర్భాజల నిల్వల మీద ఆధారపడి ఉన్నారు. అంతర్గతంగా ప్రవహించే నీటికీ, నిల్వలకీ మధ్య సంబంధం ఉంది. అంతర్గతంగా ప్రవహించే నీటిలో కొంత నేరుగా వాడుకుంటారు, కొంత నీటి నిల్వలను పునరుద్ధరించటానికి ఉపయోగపడుతుంది. అదేవిధంగా బావులనుంచి నీటిని తోడటంవల్ల వాటిల్లోని నీటిమట్టం తగ్గుతుంది. అంతర్గతంగా ప్రవహించే నీళ్లు, బయటకు తోడే నీటిని బట్టి కాలక్రమంలో నిల్వల పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు. ప్రస్తుతం మనం భూగర్భ నిల్వలు తగ్గుతున్న పరిణామాలను ఎదుర్కొంటున్నాం. భవిష్యత్తు తరాలకు భూగర్భ జలాలు అందుబాటులో ఉంటాయో, లేదో కూడా మనం పట్టించుకోవటం లేదు.

వార్షిక ప్రవాహాలు, బావులు, బోరు బావులలో నీటిని పునరుద్ధరించే నిల్వల బట్టి మనకి అందుబాటులో ఉన్న నీరు ఆధారపడి ఉంటుంది. మన అవసరాలను కూడా ఈ పరిమితిలో ఉంచుకోవాలి. మనం చాలా లోతుల నుంచి నీళ్లను బయటకు తోడినప్పుడు అది వేల సంవత్సరాల కాలంలో నిల్వ అయిన నీళ్లని అర్థం చేసుకోవాలి. తీవ్ర కరువు పరిస్థితులలోనే ఈ నీటిని ఉపయోగించి, వర్షాలు బాగా పడిన సంవత్సరంలో తిరిగి పునరుద్ధరింపబడేలా చూడాలి. 'సుస్థిరత' అన్న ఈ అంశాన్ని తరువాత చూద్దాం.

## తుంగభద్ర నదీ ప్రాంతంలో నీటి వినియోగం

కృష్ణానదికి ఉపనది అయిన తుంగభద్ర నదీ జలాలను దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు పంచుకుంటాయి. ఇది పశ్చిమ కనుమలలో పుడుతుంది. దీని మొత్తం పరీవాహక ప్రాంతం 71,417 చదరపు కిలోమీటర్లు, ఇందులో 57,671 చదరపు కిలోమీటర్లు కర్ణాటకలో ఉంది. తుంగభద్రా నదీ పరీవాహక ప్రాంతాన్ని రెండుగా విభజిస్తారు: 1) కర్ణాటకలోని ఎగువ, మధ్య పరీవాహక ప్రాంతాలు, 2) ఆంధ్రప్రదేశ్‌లోని దిగువ పరీవాహక ప్రాంతం.

- భారతదేశ పటంలో తుంగభద్ర నది ప్రవాహ మార్గాన్ని గుర్తించండి.

అధికారిక గణాంకాల ప్రకారం రెండు రాష్ట్రాలలోనూ వ్యవసాయ భూమి ఎక్కువగా ఉంది. మిగిలిన విస్తీర్ణంలో చెట్లు, తోపులు, తాత్కాలిక బీడు, సాగుకు అనువైన బంజరు, శాశ్వత పచ్చిక భూములు, అడవులు, సహజ వృక్షజాలం ఉన్నాయి. కొంత ప్రాంతంలో నీటి నిల్వకి ఉపయోగపడే చెరువులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న దిగువ పరీవాహక ప్రాంతంలో వర్షపాతం తక్కువ, కరువు పరిస్థితులు ఎక్కువ. కొన్ని ప్రాంతాలు వర్షపాతం మీద, భూగర్భ జలాల (బావులు, బోరు బావులు) మీద ఆధారపడి ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలు తుంగభద్ర ఆనకట్ట కింద నిర్మించిన కాలువల ద్వారా వచ్చే ఉపరితల నీటిపై ఆధారపడి ఉన్నాయి. ఈ రెండు రకాల ప్రాంతాలలో నీటి లభ్యతలో చాలా తేడా ఉంది.


చిత్రం 5.2: తుంగభద్ర ఆనకట్ట నిర్మాణం – 1952

ప్రభుత్వ భూములను సాగుకోసం ఆక్రమించుకోవటం ఎక్కువ. దీని ఫలితంగా అటవీ విస్తీర్ణం తగ్గి సాగు భూమి పెరుగుతుంది. చెట్లను విస్తృతంగా నరికివెయ్యటం, గనులు తవ్వడం వంటి వాటి వల్ల అడవులు క్షీణిస్తున్నాయి, అంతేకాకుండా అమూల్యమైన వృక్ష సంపద, జంతు సంపద అంతరించిపోతోంది. భూగర్భ జలాల్లోకి ప్రవహించే నీటి మోతాదు పరీవాహక ప్రాంతంలో ఉండే చెట్లపైన ఆధారపడి ఉంటుంది. చెట్లు లేనప్పుడు వర్షపునీరు నేలలోకి ఇంకే అవకాశం లేక ఉపరితలం ప్రవాహంగా ప్రవహిస్తుంది. దీనివల్ల భూగర్భ జలాలు

పునరుద్ధరింపబడే అవకాశం లేకపోవడమే కాకుండా ఒక్కొక్కసారి అకస్మాత్తుగా వరదలకు కారణం అవుతుంది. వర్షాధార, కాలవల ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు రెండింటికీ మేలు జరగాలంటే నీటి సంరక్షణకి, నీరు పంచుకోటానికి భిన్నమైన విధానాలను అవలంబించాలి.

గత కొద్ది దశాబ్దాల నుండి తుంగభద్ర ఆనకట్ట నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. 50 సంవత్సరాల క్రితం ఆనకట్ట సామర్థ్యం 376.6 కోట్ల ఘనపు మీటర్లు కాగా గనుల తవ్వకం, దుమ్ము, నేలకోత, వ్యర్థ పదార్థాల వంటి వాటివల్ల రిజర్వాయరు మేటవేసి నీటినిల్వ సామర్థ్యం 84.9 కోట్ల ఘనపు మీటర్లమేర తగ్గిపోయింది. "ఇనప ఖనిజ తవ్వకంలో సరైన ప్రామాణికాలు పాటించడం లేదు. కుద్రేముఖ్‌లో ఇనప ఖనిజం, శాండూర్ వద్ద మాంగనీసు తవ్వకాల వల్ల పరీవాహక ప్రాంతంలో నేల కోత ఎక్కువయ్యి సాంప్రదాయ చెరువులు, చిన్న జలాశయాలు, తుంగభద్ర జలాశయం పూడికకు గురవుతున్నాయి," అని ఒక అధ్యయనం పేర్కొంది.

ఎంత నీళ్లు అందుబాటులో ఉన్నాయన్న దానిమీద కర్ణాక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య తేడాలు ఉన్నాయి. నీళ్లు ప్రవహించే వనరు – ఎగువన నిల్వచేసినప్పుడు అది దిగువన ఉన్నవాళ్లకి అందే నీటిని ప్రభావితం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం ప్రకారం నీటిని పంచుకుంటారు.

వ్యవసాయం జీవనోపాధిగా 80% జనాభా ఆధారపడిన ఈ రాష్ట్రాలలో నీళ్లు ఎంతో ముఖ్యమైనవి. సాగునీటిని కాల్వల ద్వారా అందచేస్తారు. వర్షాధార ప్రాంతంలో భూగర్భ జలాలను బోరుబావుల ద్వారా వెలికి తీస్తారు. వరి, జొన్న, చెరకు, పత్తి, రాగులు వంటివి ప్రధాన పంటలు.

ఈ ప్రాంతం ఆరుతడి పంటలకు అనువైనది అయినప్పటికీ ప్రధానంగా పండించే పంటలకు (వరి, చెరుకు) ఎక్కువ నీళ్లు కావాలి. నదీ పరీవాహక ప్రాంతమంతటా ఈ పంటలను సాగు చేయటం వల్ల నీటిని పంచుకోవడంలో సమతుల్యతలో గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ పంటలకు అన్ని ప్రాంతాలలో నీళ్లు అవసరం కావటంతో వైరుధ్యాలు తప్పనిసరి. భూమి, సాగునీరు అందుబాటులో ఉన్న రైతులకూ, అవి లేనివాళ్లకూ మధ్య తీవ్ర అంతరాలు ఉన్నాయి. అందరికీ నీళ్లు అంది, నీటిని సద్వినియోగం చేయాలంటే ఈ ప్రాంతమంతటా పంటల సరళిలో మార్పులు తీసుకురావాలి.

గత రెండు దశాబ్దాలలో చిన్న పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాలు బాగా పెరిగాయి. దీంతో నీటికి పరస్పర విరుద్ధ అవసరాలు మరింత సంక్లిష్ట రూపం దాల్చాయి. పారిశ్రామికీకరణ, పట్టణ ప్రాంతాల పెరుగుదల వల్ల కొంతమంది జీవన ప్రమాణాలు పెరిగాయి. కానీ వీటివల్ల, ప్రత్యేకించి పారిశ్రామిక సంస్థల వల్ల కాలుష్యం పెరిగింది. నదీ పరీవాహక ప్రాంతంలో పని చేస్తున్న 27 భారీ, 2543 చిన్న పారిశ్రామిక సంస్థలు ఉన్నాయి. ఇవి రోజుకు పెద్ద మొత్తంలో నీటిని ఉపయోగిస్తాయి. నదిలోకి కలుషిత జలాలను వదలటానికి పరిశ్రమలను అనుమతించారు. అయితే 1984లో నదిలోకి వదిలిన బెల్లపు మడ్డి వల్ల పెద్ద ఎత్తున చేపలు చనిపోవటంతో ప్రజలు ఆందోళన చేశారు. అప్పటినుంచి పరిశ్రమలు శుద్ధిచేసిన జలాలను మాత్రమే నదిలోకి వదలాలి. అయితే ఈ చట్టాలను సమర్థంగా అమలు చేయటం లేదు. దాంతో నదీ వ్యవస్థ తీవ్ర కాలుష్యానికి గురి అవుతూనే ఉంది.

వివిధ రంగాలలో అభివృద్ధికీ, చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో అన్ని వర్గాల వారికి పారిశుద్ధ్యం, తాగునీటిని అందించడానికి మధ్య పొంతన లేకుండా పోయింది. తాగునీళ్లు, పారిశుద్ధ్యం కనీస అవసరాలని, డబ్బు చెల్లించలేకపోయినప్పటికీ అందరికీ వీటిని కనీసంగా అందించాలని కొంతమంది

- నీటి వినియోగ ప్రణాళికల కోసం ప్రభుత్వ నదీ పరీవాహక ప్రాధికార సంస్థ ఉంటే ఎలా ఉపయోగకరంగా ఉంటుంది?
- తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో నీటికి పరస్పర విరుద్ధ వినియోగాలు ఏమిటి?

అంటారు. మీటరు పెట్టి నీళ్లు సరఫరా చేసినప్పుడు సమాజంలోని ఒక వర్గం దీనికి డబ్బులు చెల్లించలేక పోయినప్పటికీ వాళ్ల మౌలిక అవసరాలకు కొంత నీళ్లు అందేలా చూడాలి. నదీ పరీవాహక ప్రాంతం పైన ఒక నివేదిక ఇలా పేర్కొంటోంది, "... పట్టణాలకు తాగునీటిని అందించడానికి సరైన ప్రణాళికలు రూపొందించలేదు, ప్రత్యేకించి చిన్న పట్టణాలలో నీటి అందుబాటు, సమ పంపిణీలో సమస్యలు ఉన్నాయి, ఈ సమస్యలు వేసవిలో మరింత తీవ్రమౌతాయి."

కాబట్టి నీటి వినియోగ యాజమాన్యంలో సామాజిక-ఆర్థిక అంశాలు ఎంతో ముఖ్యమైనవి. ఒక ప్రాంతంలోని వివిధ వర్గాల మధ్య, వ్యవసాయం, పరిశ్రమలు, తాగునీరు వంటి రంగాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. అంతే కాకుండా ఈ నది రెండు రాష్ట్రాలలో ప్రవహిస్తూ ఉండడం వల్ల కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కూడా వివాదాలు ఉన్నాయి.

## నీటి హేతుబద్ధ, సమ వినియోగం – ఒక ఉదాహరణ

నీటి వినియోగాల గురించి, నీటిని సమర్థంగా, న్యాయంగా వినియోగించటానికి అంతర్గత, బాహ్య ప్రవాహాలను లెక్కించవలసిన అవసరం గురించి తెలుసుకున్నాం. ఇది ఒక గ్రామానికి కావచ్చు, నదీ పరీవాహక ప్రాంతానికి కావచ్చు. ఇటువంటి ప్రణాళికలు తయారుచేయటం, వాటి అమలు సాధ్యమే. హివారే బజారు ఇందుకు ఒక ఉదాహరణ.

*గ్రామ పరీవాహక, సమగ్రాభివృద్ధికి 'ఆదర్శ గ్రామ పథకం' కింద హివారే బజారుని మహారాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో హివారే బజార్ ఉంది. మహారాష్ట్ర నుంచి కోస్తా కొంకణ తీర ప్రాంతాన్ని వేరు చేస్తూ ఉత్తర-దక్షిణంగా ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణికి (వర్షచ్ఛాయ ప్రాంతంలో) తూర్పువైపున గల వర్షచ్ఛాయా ప్రాంతంలో ఈ జిల్లా ఉంది. అందుకే అహ్మద్‌నగర్ జిల్లా 400 మి.మీ వర్షపాతంతో కరువు పీడిత ప్రాంతంగా ఉంది.*

*హివారే బజారులోని ఉమ్మడి భూములు, వ్యక్తిగత పచ్చిక భూములలో నేల, నీటి సంరక్షణ పనులను అమలు చేశారు. కొండవాలుల్లో వరస సమతల కందకాలు తవ్వి నేలకోతకు గురి కాకుండా చేశారు, ఇవి వాన నీటిని నిల్వచేస్తాయి, ఫలితంగా పచ్చగడ్డి బాగా పెరుగుతుంది. నీటిని నిల్వచేసే అనేక నిర్మాణాలను ఊరిలో అమలు చేశారు – చెక్ డ్యాములు, ఊట కుంటలు, రాతి కట్టడాలు. కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన, అటవీ భూములలో చెట్లు నాటారు.*

*మహారాష్ట్రలో ఆదర్శ గ్రామ పథకాన్ని మొదలుపెట్టినప్పుడు గ్రామాల ఎంపికకు కొన్ని షరతులు పెట్టారు. దీంట్లో ముఖ్యమైన నాలుగు నిషేధాలు ఉన్నాయి. రాలేగావ్ సిద్ధి సాధించిన విజయంతో అవి చాలా ప్రఖ్యాతిగాంచాయి. ఈ నాలుగు నిషేధాలు: చెట్లను నరకడం నిషేధం, పశువులను స్వేచ్ఛగా మేయడానికి వదలడం నిషేధం, మత్తు పానీయాల నిషేధం, అధిక సంతానం నిషేధం. అంతేకాకుండా ప్రజలు కొంత శ్రమదానం కూడా చెయ్యాలి, భూమిలేని పేదలకు దీనినుంచి మినహాయింపు ఉంది.*

*1980ల చివరి నాటి పరిస్థితుల నేపథ్యంలో ఈ ఆదర్శాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి. పేద వాళ్లు, ధనికులు కూడా యదేచ్ఛగా చెట్లను కొట్టివేసేవాళ్లు, అంతటా తమ పశువులను యథేచ్ఛగా మేపేవాళ్లు. చుట్టుపక్కల ఉన్న గుట్టలన్నీ బోడిగా ఉండేవని చాలామంది స్థానిక ప్రజలు చెబుతారు.*

అప్పుడు నేలకోత తీవ్రంగా ఉండేది, భూగర్భ జలాలు చాలా లోతుకి ఉండేవి. అంతేకాకుండా వంటకి కట్టెపుల్లలు, పశువులకు పచ్చగడ్డి కొరత చాలా తీవ్రంగా ఉండేది. పశువులను మేపటంపై నిషేధం విధించినప్పుడు గడ్డి కోసుకుని, పశువులకు మేపటాన్ని అనుమతించారు.

ఆ తరువాత గ్రామంలో మరికొన్ని నిషేధాలు విధించారు. వాటిల్లో చెప్పుకోదగినవి: సాగునీటికి బోరు బావులు తవ్వటం, చెరకు, అరటి సాగు చేయటం, బయటివాళ్లకు భూమి అమ్మటం. నీటి వినియోగంలో దీర్ఘకాలిక సుస్థిరత సాధించే అంశాలు ఈ విధానంలో ముఖ్యమని మనకు అర్థమౌతుంది. ఈ నిషేధాలు కేవలం ప్రకటనలు కాదు, ప్రజలు ఉమ్మడి ప్రయోజనాలను సాధించటానికి దోహదపడే ప్రజా నిర్మాణం. అయితే ఏదీ అంత తేలికగా జరగలేదు.

వేసవిలో నీళ్లు అందే భూమి 7 హెక్టార్ల నుంచి 72 హెక్టార్లకు పెరిగింది. సగటు వర్షపాతం కురిసిన సంవత్సరంలో ఖరీఫ్‌లో సజ్జ పంట, రబీలో జొన్న పంటకే కాకుండా జయాద్‌లో కొంత కూరగాయల సాగుకి కూడా నీళ్లు లభిస్తాయి. సాగునీటి సదుపాయంలేని భూములలో కూడా నేలలో తేమ శాతం పెరిగినందువల్ల ఉత్పాదకత పెరిగింది. గతంలో కంటే ఇప్పుడు పంటల వైవిధ్యత పెరిగింది. ఇప్పుడు బంగాళాదుంప, ఉల్లి, పళ్లు (ద్రాక్ష, దానిమ్మ), పూలు వంటి వాణిజ్యపంటలు, గోధుమ కూడా సాగుచేస్తున్నారు. అన్నిటికంటే చెప్పుకోదగ్గ పరిణామం ఏమిటంటే నీటి అందుబాటు పెరిగి, రెండవ పంటకూడా సాధ్యం కావటం వల్ల ఇతర ప్రాంతాలకు వలస వెళ్లటం తగ్గింది. చిన్న, సన్నకారు రైతులు తమ భూముల ద్వారా పూర్తి జీవనోపాధి పొందలేక పోతున్నప్పటికీ వాళ్ల భూముల ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. కూలిరేట్లు ఇంకా తక్కువగానే ఉన్నప్పటికి అవి కొంతైనా పెరిగినందువల్ల కూలి చేసుకునే వాళ్ల పరిస్థితి కూడా మెరుగుపడింది.




చిత్రం 5.3: హివారే బజారు– నేలకోత, నీటి సంరక్షణలకు ముందు మరియు తరువాతి చిత్రాలు.

*భూగర్భజలాల వెలికితీత, వినియోగంపై సామాజిక నియంత్రణ అన్నది ముఖ్యమైన విషయం – సాగునీటికి బోరుబావులు తవ్వకూడదు (మంచినీళ్లకు తవ్వవచ్చు), నీటిని అధికంగా తీసుకునే చెరకు వంటి పంటలు పండించకూడదు. సాగునీటిని మామూలు బావులనుంచే తీసుకోవాలి. అంతేకాకుండా కొన్ని కఠిన నియమాలు కూడా రూపొందించారు. ఉదాహరణకు వర్షపాతం బాగుంటే చలికాలంలో మొత్తం విస్తీర్ణం సాగు చెయ్యవచ్చు, అదే వర్షపాతం తక్కువ ఉంటే చలికాలంలో సాగు విస్తీర్ణం తగ్గించాలి. వర్షపాత వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి పంటల ప్రణాళిక తయారుచేస్తారు, నీటి ప్రాధమ్యాలను నిర్ణయిస్తారు. ఈ కారణాల వల్ల కొన్ని సంవత్సరాలు వరసగా తక్కువ వర్షపాతం ఉన్నా తాగునీటికి కొరత ఏర్పడలేదు. ఉన్న నీటి ఆధారంగా ప్రణాళికలు తయారు చేసుకున్న కారణంగా ఇది సాధ్యమయ్యింది.*

*పశుపోషణ రంగం వృద్ధి చెందటం వల్ల సన్న, చిన్నకారు రైతులు గణనీయంగా ప్రయోజనం పొందారు. అందరి జీవనోపాధులను మెరుగుపరిచే ఉద్దేశంతో హివారే బజారులో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. అనేక చిన్న రైతులకు రుణాలు అందించారు. ఫలితంగా గ్రామంలో పాడి పశువుల సంఖ్య పెరిగింది. మెరుగైన ఉత్పాదకత కారణంగా పశుగ్రాసం లభ్యత పెరగటం కూడా ఈ పరిణామాలకు దోహదం చేసింది. రోజుకి పాల ఉత్పత్తి 140 లీటర్ల నుంచి 3,000 లీటర్లకు పెరిగి 20 రెట్లకు పైగా ప్రగతిని సాధించింది.*

*అయితే గ్రామ సరిహద్దు వంటి చిన్న ప్రాంతంలో భూగర్భ జలాల వెలికి తీయటాన్ని నియంత్రించటం వల్ల ఫలితం ఉండదని అర్థమయ్యింది. పక్క గ్రామాలు లోతైన బోరుబావులు తవ్వి భూగర్భ జలాలను వినియోగించటం మొదలు పెట్టాయి. దీనిపై హివారే బజారుకు ఎటువంటి నియంత్రణా లేదు. కాబట్టి నదీ పరీవాహక ప్రాంతం లేదా ఉప ప్రాంత పరిధిలో వ్యవస్థాగత నియమాలు, అవగాహన అవసరం.*

- హివారే బజారులో నీటి సంరక్షణకు చేపట్టిన పనులను సూచించే వాక్యాల కింద గీత గీయండి.
- నీటి అందుబాటును బట్టి వ్యవసాయ ప్రణాళిక తయారు చేయటానికి ఎటువంటి ప్రయత్నం జరిగింది?
- మీకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే హివ్రే బజారుకు సంబంధించిన వీడియో చిత్రాన్ని ఈ లింకులో చూడండి : http://bit.ly/koth Ll

## ఉమ్మడి వనరుగా నీళ్లు

గత కొద్ది దశాబ్దాలుగా భూగర్భ జలాలు ప్రత్యేకించి గృహ అవసరాలకు, వ్యవసాయానికి ముఖ్యమైన వనరుగా మారాయి. భూగర్భ జలాల వినియోగం గణనీయంగా పెరిగి పోవటంతో మొత్తం అందుబాటులో ఉన్న నీరు, అవి ఎవరికి అందుతాయి అన్నవాటిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

అనేక రాష్ట్రాలలో భూగర్భ జలాలకు సంబంధించిన చట్టాలు కాలం చెల్లినవి, ప్రస్తుత పరిస్థితులకు అనువైనవి కావు. భూగర్భ జలాల వినియోగం నామ మాత్రంగా ఉన్న రోజులలో ఈ చట్టాలు రూపొందించబడ్డాయి. ఈనాడు బోరుబావులు వివిధ లోతులనుంచి పెద్ద మొత్తంలో నీటిని తోడేసే పరిస్థితిలో ఉన్నాయి. నీటిని సక్రమంగా వినియోగించుకోవటం ఎలా?

భూగర్భ జలాలకు సంబంధించి ప్రస్తుత చట్టాలు ఇప్పటి పరిస్థితులకు అనువైనవి కావు. భూమి హక్కుకీ, భూగర్భ జలాలపై హక్కుకీ సంబంధం కలపటం అన్నది ఈ నియమాలలో ఉన్న లోపం. భూమి పైనుంచి భూగర్భ జలాలను తోడుకోవాలి కాబట్టి ఈ నియమాలను రూపొందించారు. భూమి కిందనుంచి తీసిన భూగర్భజలాలపై ఆ భూ యజమానికి హక్కు ఉందని భావించారు. దీని అర్థం భూగర్భజలాలపై భూమి ఉన్న వాళ్లకే హక్కు ఉంటుంది. భూగర్భ జలాలనుంచి ఎంత నీటిని తోడుకుంటారన్న దానిపై ఎటువంటి పరిమితి విధించలేదు.

పై విధానంలోని లోపం ఏమిటి? భూమి మీద ఏర్పరచుకున్న యాజమాన్య సరిహద్దులను భూగర్భజలాలు పాటించవు. నీళ్లు ప్రవహిస్తున్న వనరు. ఒక బోరుబావిలోంచి తోడుకోగల నీరు భూగర్భంలో రాతిపొరల ఏర్పాటు, వర్షపాతం, ఉపరితల నీటినుంచి నేలలోపలికి ఇంకే నీళ్లు వంటివాటిపై ఆధారపడి ఉంటుంది. ఇవన్నీ ఒక విశాల ప్రాంతంలో జరుగుతున్నాయి. కాబట్టి ఆ ప్రాంతంలోని ఇతరుల చర్యలు ఈ బావిలోని నీటి మొత్తాన్ని ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు ఒక బోరుబావి నుంచి ఎక్కువ నీళ్లు తోడేస్తే దాని చుట్టుపక్కల ఉన్న అనేక బోరుబావులు ఎండిపోవచ్చు. పక్కవాళ్లకంటే లోతైన బోరుబావి వెయ్యాలని ప్రతి ఒక్కరూ పోటీ పడుతుంటారు. ఒక ప్రాంతంలోని బోరుబావులన్నీ భూగర్భ స్వరూపం ద్వారా ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి కాబట్టి ఒకే లోతున్న బావులన్నీ ఎండిపోయే అవకాశం ఉంది. కాబట్టి నీళ్లలాంటి ప్రవహించే వనరుపై 'యాజమాన్యం' గురించి ఆలోచించటం సరైనది కాదు. భూమిమీద వీచే గాలితో దీనిని పోల్చండి – ఇది ఎప్పుడూ ప్రవహిస్తూ ఉంటుంది, కాబట్టి దానికి సరిహద్దులు నిర్ణయించటం సాధ్యం కాదు. అదేవిధంగా భూగర్భంలో ప్రవహిస్తున్న నీటికి ఎటువంటి సరిహద్దులు ఉండవు.

ప్రస్తుతం భూగర్భ జలాలే ప్రజలకు ప్రధానమైన నీటి వనరుగా ఉన్నాయి. ఈ నీటిని అధికంగా తోడేస్తే దానితో సంబంధం ఉన్న ఇతర ప్రాంతాలు కూడా ప్రభావితం అవుతాయి. భవిష్యత్తు తరాలకు అందాల్సిన నీటి నిల్వలను కూడా ఇది ప్రభావితం చేస్తుంది. కాబట్టి భూమి యజమానులకు తమకు ఇష్టమొచ్చినంత నీటిని తోడుకునే హక్కును ఇవ్వలేం. దీనిపై కొన్ని పరిమితులు ఉండాలి. భూమి యాజమాన్యానికీ, భూమిమీద బోరుబావుల నుంచి భూగర్భ జలాలను తోడటానికి మధ్య సంబంధం లేకుండా చేస్తే ఈ పరిమితులు ఆమోదయోగ్యంగా ఉంటాయి.

భూమిమీద హక్కుకి, భూగర్భ జలాలమీద హక్కుకి సంబంధం ఉన్నప్పుడు నీటిని సక్రమంగా వినియోగించటంపై వ్యక్తిగత భూ యజమానులపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. అదే విధంగా పర్యావరణానికి, విస్తృత ప్రజానీకానికి ప్రయోజనం కలిగించేలా విధానాలను అమలు చేసే మార్గమేమీ లేదు. దాదాపుగా ఎటువంటి నియంత్రణలేని ఈ వ్యవస్థలో ఒక ప్రాంతంలో ఎన్ని చేతి పంపులు, బావులు, బోరుబావులు ఉండవచ్చో నిర్ణయించే అధికారం ఎవరికీ లేదు. కాబట్టి నీటిని ప్రజలందరికీ ఉద్దేశించిన ఉమ్మడి వనరుగా పరిగణించాలి. రోడ్లు, నదులు, ఉద్యానవనాలు, అంతర్భూజలం అందరికీ చెందే 'ప్రజా ఆస్తి'గా భావించాలి. దీనిని ప్రస్తుతం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తిస్తున్నాయి, కాని అంతగా విస్తృతం కాలేదు.

నియంత్రణ అనేది అంత తేలిక కాదు. విద్యుత్తు, చమురు, సహజవాయువు, నీళ్లు వంటి వనరుల్లో ఒకరు ఉపయోగించుకున్నది మిగిలిన వాళ్ల అందుబాటును ప్రభావితం చేస్తుంది. భూగర్భ జలాలు

పడిపోతున్న పరిస్థితికి రాష్ట్రాలు మూలాల్లోకి వెళ్లటంలేదు. ఇందుకు విరుద్ధంగా మరింత లోతులనుంచి భూగర్భ జలాలను తోడటానికి దోహదం చేసేలా విద్యుత్తు సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్నాయి. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించటానికి ప్రయత్నించకుండా వాటి వినియోగాన్ని ప్రోత్సహించే సబ్సిడీల వల్ల ఉపయోగంలేదని మనకు ఇప్పుడు స్పష్టంగా తెలుసు. నియంత్రణలు పనిచెయ్యటానికి రాజకీయ ఆలోచన మారాల్సి ఉంది. ఇతరుల కంటే ముందు తాను నీళ్లు వాడుకోవటానికి ప్రతి ఒక్కరూ పోటీపడటంతో ఈ ఉమ్మడి వనరు త్వరితంగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనముందున్న తీవ్ర సమస్య ఇదే.

నీళ్లు అన్నవి ప్రవహించే ఉమ్మడి వనరు అని గుర్తించే చట్టాలు, నియమాలు అవసరం. తాగునీళ్లకు మొదటి స్థానం ఇవ్వడంతోపాటు పొందడం అనేది మానవ హక్కు కూడా. భూగర్భ జలాల వినియోగంపై పంచాయతీరాజ్ సంస్థలకు నియంత్రణ ఉండాలి.

కేరళలోని పెరుమట్టి అన్న గ్రామంలో పంచాయతీకి, కోకా కోలా కంపెనీకి మధ్య తలెత్తిన వివాదాన్ని చూద్దాం. చుట్టుపక్కల ప్రాంతాలలో భూగర్భ జలమట్టం తగ్గిపోతుండటంతో భూగర్భ జలాల వినియోగానికి ఆ కంపెనీకి ఇచ్చిన లైసెన్సును పునరుద్ధరించగూడదని పంచాయతీ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా ఆ కంపెనీ వల్ల మంచినీటి నాణ్యత కూడా ప్రభావితం అవుతోంది. స్థానిక ప్రభుత్వం కింద నడుస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈ నీళ్లు తాగటానికి అనువైనవి కాదని నిర్ణయించింది. ఈ వివాదం కోర్టులకు వెళ్లింది. జనవరి 2014 నాటికి ఈ వివాదం దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణలో ఉంది. కేరళలో ఇద్దరు జడ్జీలు ఇచ్చిన తీర్పులు భూగర్భ జలాలకు సంబంధించి పరస్పర విరుద్ధ భావాలను వ్యక్తపరిచాయి. మొదటి జడ్జి భూగర్భజలాలను అందరికీ అవసరమైన ప్రజా వనరుగా పరిగణించి ఏ ఒక్కరూ వాటిని అధికంగా వాడుకోకుండా ప్రభుత్వం కట్టడి చెయ్యాలని భావించారు. రెండవ జడ్జి ఇందుకు పూర్తి విరుద్ధంగా భూ యజమానికి భూగర్భ జలాలపై పూర్తి హక్కు ఉంటుందని తీర్పు చెప్పారు. ఈ రెండు పరస్పర విరుద్ధ తీర్పులు మన చట్టాల మీద ప్రస్తుతం ఉన్న గందరగోళాన్ని తెలియచేస్తాయి.

- హివారే బజారులాగానే భూగర్భజలాల నియంత్రణ ప్రధానంగా ప్రజలే చేయాలా?
- 'భూగర్భజలాల చట్టాలు పాతబడిపోయాయి మరియు ప్రస్తుత కాలానికి తగవు'. వివరించండి.
- భూగర్భజలాలు అందరికీ చెందిన వనరులు– మీ అభిప్రాయాన్ని వివరించండి.

## ముగింపుగా

మొదటి భాగంలో భారతదేశంలో వివిధ భూ భౌతిక పరిస్థితుల గురించి, నదీ వ్యవస్థల గురించి తెలుసుకున్నాం. ఒక ప్రాంతంలో, అది చిన్న పరీవాహక ప్రాంతం కావచ్చు, లేదా నదీ పరీవాహక ప్రాంతం కావచ్చు, నీటి వినియోగానికి అంతర్గత, బాహ్య ప్రవాహాల నీటిని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ అవగాహనతో ప్రస్తుతం నీటిని అసమంజసంగా వినియోగిస్తున్న తీరు, దుర్వినియోగం అవుతున్న తీరు మనకు అర్థం అవుతుంది. తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంత అధ్యయనం ద్వారా నీటిని సక్రమంగా, సమంగా ఎలా వాడవచ్చో తెలుసుకున్నాం. ఇది సంక్లిష్టమైన విషయమే అయినప్పటికీ, సాధ్యమయ్యే విషయం కూడా. అదేవిధంగా చిన్న ప్రాంతంలో సామాజిక చొరవ, సరైన ప్రణాళిక ద్వారా అందరికీ నీటిని అందించటం సాధ్యమేనని తెలుసుకున్నాం. హివారే బజారు ప్రజల ప్రయత్నాలను చూశాం.

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమతమ పరిస్థితులకు అనుగుణంగా సృజనాత్మక కార్యాచరణకు పూనుకుంటారని ఆశిద్దాం. నీటి వనరులకు స్థానిక స్థాయిలో ఉమ్మడి కార్యాచరణ, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో అనువైన చట్టాలు, విధానాలు అవసరం. భూగర్భ జలాల ఉదాహరణ ద్వారా ప్రస్తుత ఆలోచనా విధానంలోని పరిమితులను అర్థం చేసుకున్నాం.

## కీలక పదాలు

| | | |
|---|---|---|
| ప్రవాహ వనరులు | అంతర్భూజలం | నీటి ప్రవాహ వ్యవస్థ |
| జల పంపిణీ చట్టం | భూగర్భ నీటి వనరు | పరీవాహక ప్రాంతం |
| కరువు | నీళ్లు నేలలోపలికి ఇంకటం | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. భారత దేశంలోని ప్రధాన నదీవ్యవస్థలను వివరించటానికి కింది అంశాల ఆధారంగా ఒక పట్టిక తయారుచేయండి: నది ప్రవహించే దిశ, అవి ఏ రాష్ట్రాలు లేదా దేశాలగుండా ప్రవహిస్తున్నాయి, ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు.
2. వ్యవసాయం, పరిశ్రమలు వంటి వివిధ సందర్భాలలో భూగర్భజలాల వినియోగాన్ని సమర్థించే, వ్యతిరేకించే వాదనలను పేర్కొనండి.
3. నీటి వనరుల విషయంలో అంతర్గత, బాహ్య ప్రవాహాల ప్రక్రియలను వివరించండి.
4. భూగర్భ జల వనరులను అంతర్గత, బాహ్య ప్రవాహాలలో ఏ ప్రక్రియ ఎక్కువగా ప్రభావితం చేస్తుంది?
5. తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో నీటి వనరులకు సంబంధించి ఎదుర్కొంటున్న సవాళ్ల జాబితా తయారుచేయండి. ఈ అధ్యాయంలో కానీ, లేదా ఇతర తరగతులలో కానీ ఈ సమస్యలకు సంబంధించి చర్చించిన పరిష్కారాలను పేర్కొనండి.
6. నీటి వనరులలో అనేక రకాల మార్పులు సంభవించాయి. ఈ అధ్యాయంలో చర్చించిన సానుకూల, ప్రతికూల మార్పులను వివరించండి.
7. నీటి సంరక్షణను మెరుగుపరచటానికి హివ్రే బజారులో వ్యవసాయంలో ఏ పద్ధతులపై నియంత్రణలు విధించారు?
8. నీటి వనరుల విషయంలో ప్రజల కార్యాచరణ, చట్టాల ప్రాముఖ్యత ఏమిటి? ఈ అధ్యాయంలోని చివరి రెండు భాగాలలో చర్చించిన అంశాలను క్లుప్తంగా రాయండి.
9. మీకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే www.aponline.gov.in కి వెళ్లి ఆంధ్రప్రదేశ్ నీళ్లు, భూమి, చెట్ల సంరక్షణ (Andhra Pradesh WALTA Act.) చట్టం గురించి మరింత తెలుసుకోండి.
10. మీ ప్రాంతంలో ఏ ఏ అవసరాలకు నీటి కొనుగోలు, అమ్మకం జరుగుతోంది? దీనిపై ఏమైనా నియంత్రణలు ఉండాలా? చర్చించండి.

## ప్రాజెక్టు

మీ గ్రామంలో లేదా మీ ప్రాంతంలో అమలు పరిస్తే అందరికీ మేలు చేసే ప్రణాళికల గురించి ఆలోచించి రాయండి.

పాఠం 6

# ప్రజలు




*పటం 1 : జనాభా ఆధారంగా మనం ప్రపంచ పటాన్ని తయారుచేస్తే అది ఇలా ఉంటుంది. దీనికీ మిగిలిన పటాలకూ తేడా ఏమిటి? చర్చించండి.*

సాంఘిక శాస్త్రంలో జనాభా చాలా కీలకమైన అంశం. 'అందరికీ అభివృద్ధి' అని మనం అన్నప్పుడు అభివృద్ధి ప్రక్రియలలో అంచులకు నెట్టివేయబడ్డ వాళ్ల గురించి మనం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాం. ప్రజలను దృష్టిలో ఉంచుకునే సమానత్వం అన్న భావనను ఉపయోగిస్తాం. ఇంకొకవైపున మనం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ 'జనాభా పెరుగుదలను' నిందిస్తూ ఉంటారు. చాలా ఎక్కువమందితో పంచుకోవలసి రావటం వల్లనే ఉద్యోగాలు, ఆహారం, వనరులు లేకుండా పోతున్నాయని అంటారు. భారతదేశంలోని శ్రామికులలో 92 శాతం మంది అవ్యవస్థీకృత రంగంలో ఉన్నారు. వాళ్లకు సరిగా పని దొరకదు. వాళ్ల కుటుంబాలు తప్పించి వాళ్లకి ఎటువంటి సామాజిక భద్రత లేదు. వాళ్ల పేదరికానికి వాళ్లనే నిందించటం చాలా అన్యాయం. ఈ విరుద్ధ భావనలను ఎలా అర్థం చేసుకోవాలి? దీనికి జనాభా గణాంకాలను, విస్తరణ, లక్షణాలను అర్థం చేసుకుంటే ఇతర అంశాలను కూడా అర్థం చేసుకోవచ్చు.

- మీ చుట్టుపక్కల వేరు వేరు జీవనోపాధులు, ఆదాయాలు ఉన్న వ్యక్తులతో మాట్లాడండి. ఎంతమంది పిల్లలు ఉండటం సరైనదో వాళ్లని అడగండి.
- మీ ప్రాంతంలో, ఊరిలో, దేశమంతటిలో ఉంటున్న ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని ఎలా సేకరిస్తారో, నమోదు చేస్తారో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? జనగణనలో తమ అనుభవాలను చెప్పమని మీ టీచరుని అడగండి.
- నమూనా సేకరణ, జనగణన ద్వారా సమాచారం సేకరించటంలో తేడాలు ఏమిటి? కొన్ని ఉదాహరణలతో చర్చించండి.

దేశంలోని జనాభాకి సంబంధించిన సమాచారాన్ని భారతదేశ జనగణన అందిస్తుంది. జనాభా అంతటికి సంబంధించిన సమాచారాన్ని పద్ధతి ప్రకారం సేకరించి, నమోదు చేయటాన్నే జనగణన అంటారు. పదేళ్లకు ఒకసారి భారతదేశంలోని ప్రజల సమాచారాన్ని సేకరిస్తారు. ఈ పనిచేసేవాళ్లు ప్రతి ఊరు, పట్టణం, నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంట్లో ఉంటున్న వాళ్ల వివరాలు సేకరిస్తారు. ప్రజల వయసు, వృత్తి, ఇంటి రకం, చదువు, మతం వంటి అనేక వివరాలను జనగణన అందిస్తుంది. సెన్సెస్ ఆఫ్ ఇండియా అన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈ సమాచార సేకరణ, నమోదులను నిర్వహిస్తుంది.

జనగణన గురించి మరింత తెలుసుకునే ముందు మన ప్రాంతాన్ని సర్వేచేసి జనగణనలో చేపట్టే పనిని పరిశీలిద్దాం.

### *భారతదేశంలో జనగణన*

భారతదేశంలో మొదటి జనగణన 1872లో జరిగింది. అయితే మొదటి సంపూర్ణ జనగణన 1881లో జరిగింది. అప్పటినుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి క్రమం తప్పకుండా జనగణన చేపడుతున్నారు. 2011లో భారతదేశ జనాభా 121,01,93,422. ఈ 121 కోట్ల జనాభాలో 62,37,24,248 మంది పురుషులు, 58,64,69,174 మంది స్త్రీలు.

### సర్వే నిర్వహణ

- ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు గల సర్వే నిర్వహణ బృందం తమ ప్రాంతంలోని 10 కుటుంబాల నుంచి సమాచారాన్ని సేకరించాలి. సర్వేకు ఉపయోగించాల్సిన పత్రం కింద ఉంది.
- ప్రతి బృందం కింద ఇచ్చిన పట్టికను పూరించాలి.
- అన్ని బృందాల పట్టికల ఆధారంగా ప్రశ్నలను తరగతి గదిలో చర్చించాలి.

| కుటుంబం 1 పేరు | పురుషులు | స్త్రీలు | వయస్సు | పాఠశాల విద్య | 15 సంవత్సరాలు దాటిన వాళ్ల వృత్తి |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| కుటుంబం 2 పేరు | | | | | |

**సర్వే చేయటానికి ముందు:**

- సర్వే ఫారంలో ఉపయోగించిన పదాలన్నిటిని అందరూ ఒకే రకంగా అర్థం చేసుకోటానికి తరగతి గదిలో చర్చించాలి. లేకపోతే సర్వే చేసేటప్పుడు గందరగోళం ఏర్పడి ఒక బృందం ఫలితాలను మరొక బృందంతో పోల్చటం కష్టమౌతుంది. మీ ఉపాధ్యాయుని సహాయంతో ఈ కింది పదాల గురించి చర్చించండి.

1. కుటుంబాన్ని ఎలా నిర్వచిస్తారు? ఎవరెవరిని కుటుంబం కింద పరిగణిస్తారు?
2. విద్యకు ఎటువంటి వర్గీకరణను ఉపయోగిస్తారు? ఉదాహరణకు: 6 సంవత్సరాలలోపు పిల్లలు, పాఠశాల/ కళాశాలలో చదువుతున్నారు, తరగతి...; బడిలో ఉండాలి కాని పేరు నమోదు కాలేదు. ..... తరగతి వరకు చదివారు; బడికి అసలు వెళ్లలేదు.
3. వృత్తికి ఎటువంటి వర్గీకరణను ఉపయోగిస్తారు?
ఉదాహరణలు: గృహిణి, విద్యార్థి, .......లో స్వయం ఉపాధి, ఉద్యోగం, నిరుద్యోగి, పదవీ విరమణ, వృద్ధులు.

**సర్వే తరువాత :**

(ఎ) సర్వే చేసిన కుటుంబాలలోని మనుషుల లెక్కను చూపించటానికి ప్రతి బృందమూ కింద చూపిన విధంగా పట్టిక తయారుచేయాలి :

| పురుషులు | స్త్రీలు | మొత్తం జనాభా |
|---|---|---|
| | | |

(బి) మీ బృందంలో స్త్రీ : పురుషుల నిష్పత్తి ఏమిటి? వివిధ బృందాలలో ఈ నిష్పత్తిలో తేడా ఉందా? చర్చించండి.

6-14 సంవత్సరాల పిల్లలకు:

| పిల్లలు | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|
| బడిలో | | | |
| బడి మానేశారు | | | |
| అసలు చేరలేదు | | | |

(సి) అన్ని బృందాలకు కలిపి మొత్తం పిల్లలో అసలు బడిలో చేరనివాళ్లు, బడి మానేసిన వాళ్ల శాతం ఎంత? దీనికి కారణాలు ఏమిటి?

(డి) 20 సంవత్సరాలు పైబడిన వాళ్లల్లో బడిలో గడిపిన సగటు సంవత్సరాలు ఎంత? వివరాలు తెలుసుకోండి. ఈ సమాచారం ఉపయోగకరంగా ఉందా?

(ఇ) 15-59 సంవత్సరాల వాళ్లకు :

| వృత్తి | సంఖ్య | శాతం |
|---|---|---|
| స్వయం ఉపాధి | | |
| గృహిణి | | |
| ఉద్యోగి | | |
| నిరుద్యోగి | | |
| విద్యార్థి | | |
| మొత్తం | | |

మీ నమూనా గణనలో 'పనిచేస్తున్న వారు', 'ఇతరులపై ఆధారపడేవారు' అనే అంశాలను ఏవిధంగా వర్గీకరిస్తారు?

## జనగణన ఏమి చెబుతుంది?

### వయసుల వివరణ

దేశంలో వివిధ వయసులలో స్త్రీలు, పురుషులు ఎందరు ఉన్నారో ఇది తెలియచేస్తుంది. జనాభాకు సంబంధించి ఇది అత్యంత మౌలికమైన లక్షణం. ఒకరి వయస్సు చాలావరకు వాళ్లకు ఏం కావాలో, వాళ్లు పని చెయ్యగలిగిన సామర్థ్యం, ఇతరులపై ఆధారపడి ఉన్నారా లేదా వంటి వాటిని ప్రభావితం చేస్తుంది. పిల్లలు, పనిచేసే వయస్సు, వృద్ధులు అన్నవి వయస్సు వర్గీకరణలు. జనాభా సామాజిక ఆర్థిక నిర్మాణాన్ని ఈ వర్గీకరణలలో ఉన్న ప్రజల సంఖ్య, శాతం ప్రధానంగా నిర్ణయిస్తాయి.

ఒక దేశ జనాభాను ప్రధానంగా మూడు వర్గాలుగా విభజిస్తారు :

**1) పిల్లలు (సాధారణంగా 15 సంవత్సరాలలోపు వాళ్లు)**

వీళ్ల సంరక్షణను కుటుంబం చేపడుతుంది. అందరిలాగే వాళ్లకి ఆహారం, బట్టలు, విద్య, వైద్య సదుపాయం, ఎదుగుదలకు అవకాశాలు కావాలి. అయితే వీళ్లు తమ అవసరాల కోసం సొంత ఆదాయం కలిగి ఉండరు.ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంతమంది పిల్లలు పని చెయ్యవలసి రావడం సరైనది కాదు.

**2) పనిచేసే వయస్సు (15-59 సంవత్సరాలు)**

సాధారణంగా సమాజంలో పనిచేసే జనాభా ఇది. వీళ్ళు పునరుత్పత్తి వయస్సులో కూడా ఉంటారు. ఈ బృందంలోని వాళ్లు గౌరవప్రదమైన ఆదాయం, ఉద్యోగ భద్రత కోరుకుంటారు. పిల్లలు, వృద్ధులు చాలా సందర్భాలలో వీళ్ల ఆదాయాలపై ఆధారపడి ఉంటారు.

**3) వృద్ధులు (59 సంవత్సరాలు పైబడినవాళ్లు)**

ఉద్యోగులో లేదా వ్యవస్థీకృత రంగంలో పనిచేసిన వాళ్లకు పదవీ విరమణ తరువాత పెన్షను లభించవచ్చు. అయితే అధిక సంఖ్యలో ఉన్న వ్యవసాయ కూలీలు, ఇళ్లల్లో పనిచేసే వాళ్లు, భవన నిర్మాణ కార్మికులు వంటి వాళ్లు చెయ్యగలిగినంత వరకు పని చేస్తూనే ఉంటారు. వృద్ధాప్యంలో మద్దతు కోసం ఈ వయసు వాళ్లు తమ కుటుంబాలపై ఆధారపడి ఉంటారు. ఇతర వయస్సుల వాళ్లకంటే వీళ్ల వైద్య ఖర్చులు చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.




వివిధ వయస్సుల బృందాలకు ప్రభుత్వం ఏఏ ప్రత్యేక పథకాలు అమలుచేయాలో చెప్పండి. కొన్ని ఉదా: మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కార్యక్రమం మొదలైనవి. ఇవి ఎందుకు అవసరం?

- పైన ఇచ్చిన జనాభా పిరమిడ్ ఆధారంగా జనాభాలో పిల్లల శాతం ఎంతో ఉజ్జాయింపుగా లెక్కగట్టండి.
- మీరు చేసిన సర్వే ఆధారంగా ప్రతి బృందం పట్టికలో కింది వివరాలను పొందుపరచాలి: వయస్సు, ప్రజల సంఖ్య, పిల్లలు, పనిచేస్తున్నవాళ్లు, వృద్ధులు.

## లింగ నిష్పత్తి

జనాభాలో ప్రతి వెయ్యిమంది పురుషులకు ఎంతమంది స్త్రీలు ఉన్నారో తెలియచేసేది లింగనిష్పత్తి. ఒక సమాజంలో, ఒక నిర్దిష్ట కాలంలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం ఎంత ఉందో తెలుసుకోటానికి ఉపయోగపడే ముఖ్యమైన సామాజిక సూచిక ఇది. మీరు సర్వే చేసిన కుటుంబాలకు దీనిని లెక్కించారు. దేశానికి సంబంధించి ఈ గణాంకాలను ఇప్పుడు పరిశీలిద్దాం.




భారతదేశంలో పురుషుల కంటే ఎప్పుడూ స్త్రీల సంఖ్య తక్కువగానే ఉంది. ఈ స్త్రీ : పురుష నిష్పత్తి లేదా లింగ నిష్పత్తి ఆందోళన కలిగించే విషయం: ఎందుకంటే ఇది స్త్రీలపట్ల ఉన్న వివక్షతను వెల్లడి చేస్తుంది. మహిళలకు, ప్రత్యేకించి బాలికలకు విద్య, అభివృద్ధిలో సమాన అవకాశాలు లభించటం లేదు. అత్యంత మౌలికమైన పోషకాహారం, శిశు సంరక్షణ, వైద్యం వంటి వాటిల్లో కూడా వీళ్లు వివక్షతకు గురవుతున్నారు – అంటే మగపిల్లలకు ఇవి అందించినంతగా ఆడపిల్లలకు అందించటం లేదు. ఒకే కుటుంబం లోపల ఇది జరుగుతుంది. ఇటువంటి వివక్షత అన్నిసార్లూ బయటకు కనపడదు. వివక్షత ఉందని ఎవరూ ఒప్పుకోరు. అయితే మొత్తం జనాభాలో ఇది జరుగుతోందని మనం ఎలా చెప్పగలం?

ఒకే పరిస్థితులు ఉంటే మగపిల్లల కంటే ఆడపిల్లలు ఎక్కువ మనగలుగుతారని వైద్య పరిశోధనలు చెపుతున్నాయి. అంటే, వివక్షత లేకపోతే మగపిల్లలల కంటే ఆడపిల్లల సంఖ్య ఎక్కువగా లేదా సమానంగా ఉండాలి. సెన్సెస్ సర్వేనుంచి మనకు మరో విషయం కూడా తెలుస్తోంది. భారతదేశంలో ప్రతి వందమంది మగపిల్లలకు 103 మంది ఆడపిల్లలు పుడుతున్నారు. కానీ మగపిల్లల కంటే ఎక్కువ సంఖ్యలో ఆడపిల్లలు చనిపోతున్నారు. 0–5 వయస్సులో బతికి బట్టకట్టిన మగపిల్లల సంఖ్య కంటే ఆడపిల్లల సంఖ్య చాలా తక్కువగా ఉందని సెన్సెస్ చెపుతోంది. ఆడపిల్లలు బతకటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ ఇలా జరుగుతోందంటే వారి పోషణ, సంరక్షణలలో ఏదో వివక్షత ఉండి ఉండాలి.

గణాంకాలను పోల్చటం ద్వారా మనకు మరొక రుజువు దొరుకుతుంది. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలను కల్పించిన సమాజాలను లేదా ప్రాంతాలను చూసినట్లయితే వాటి లింగ నిష్పత్తి వేరేగా ఉంటుంది. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు ఉండి, పురుషులకు అనుకూలంగా స్త్రీల పట్ల వివక్షతతో వ్యవహరించే ప్రాంతాలలో లింగ నిష్పత్తి అసమానంగా ఉంటుంది. ఆ ప్రాంతాలలో అధిక ఆదాయాలు ఉన్నా ఇలా జరగవచ్చు. ఉదాహరణకు ఈ కింద ఇచ్చిన గణాంకాలను చూడండి:

| ప్రాంతం | హర్యానా | పంజాబ్ | ఆంధ్రప్రదేశ్ | కేరళ | అమెరికా |
|---|---|---|---|---|---|
| లింగ నిష్పత్తి | 870 | 880 | 970 | 1040 | 1050 |

*పట్టిక 1 : ప్రతి వేయి మంది పురుషులకు స్త్రీలు*

భారతదేశంలోని కేరళ వంటి కొన్ని ప్రాంతాలలో లింగ నిష్పత్తి మెరుగ్గా ఉంది. అదే మరికొన్ని ప్రాంతాలలో ఈ నిష్పత్తి తక్కువగా ఉంది. ఆడపిల్ల కంటే మగపిల్లవాడు పుట్టాలని కోరుకునే లింగ వివక్షత భారతదేశంలో ఇప్పట్లో పోయే సూచనలు కనపడటం లేదు. మగపిల్లలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం వల్ల మగప్లిలల్లో కంటే ఆడపిల్లల్లో మరణాల శాతం ఎక్కువగా ఉంది. మగపిల్లలకు ఇచ్చే సంరక్షణ, శ్రద్ధలతో పోలిస్తే ఆడప్లిలల ఆరోగ్యం గురించి, జబ్బుల గురించి పట్టించుకోకపోవటం అన్న నిశ్శబ్ద హింస వల్ల ఇలా జరుగుతోంది. ఇక్కడ ఆడ శిశువుల భ్రూణ హత్య అన్న అంశం కూడా ఉంది. మగపిల్లవాడు కావాలనుకోవటం వల్ల గర్భంలో ఉంది ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యకు పాల్పడవచ్చు. అనేక కుటుంబాలు ఆడపిల్లలను భారంగా భావిస్తాయి. వైద్య విషయంలో ఉన్న ఈ వివక్షత పెద్దయిన తరువాత కూడా కొనసాగుతుందని, అందుకే పురుషులలో కంటే స్త్రీలలో మరణాల శాతం ఎక్కువగా ఉందని అధ్యయనాలు వెల్లడి చేస్తున్నాయి.



చిత్రం 6.1

మహిళలపట్ల వివక్షతను తగ్గించటానికి బలమైన శక్తిగా మహిళల చదువు ఉపయోగపడుతుంది. మహిళల అక్షరాస్యత, విద్య వల్ల బాలికలలో మరణాల శాతం తక్కువగా ఉంటుందనేందుకు, ఆడపిల్లల ఆరోగ్యం పట్ల చూపే వివక్షత తగ్గుతుంది అనేందుకు బలమైన ఆధారాలు ఉన్నాయి. ఈ పరిస్థితిని అర్థం చేసుకోటానికి పక్కన ఉన్న ప్రశ్నలను చర్చించండి. ఇవి లింగ నిష్పత్తిని ప్రభావితం చేస్తాయా?

- పై చదువులకు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలకు అవకాశాలు లభిస్తున్నాయా?
- పెళ్లైన మహిళలకు ఇంటి బయట పని చేయటానికి, ప్రయాణాలు చేయటానికి అవకాశాలు ఉన్నాయా?
- మహిళలు వారి పుట్టింటితో సంబంధాలు పెట్టుకోకూడదా? వాళ్లకు ఆస్తులపై హక్కు ఉండకూడదా? భద్రత ఉండకూడదా?
- మీ ప్రాంతంలో మగ పిల్లలను ఎక్కువగా కోరుకుంటారా?

**అక్షరాస్యతా శాతాలు**

ఏడేళ్లు పైన ఉండి ఏ భాషలోనైనా అర్థవంతంగా చదవగలిగితే, రాయగలిగితే అతడు/ ఆమెను అక్షరాస్యులుగా పరిగణిస్తారు. సామాజిక, ఆర్థిక ప్రగతికి అక్షరాస్యత కీలకమైనది.

- మీ ఊళ్లో, పట్టణంలో నిరక్షరాస్యులు ఉన్నారేమో తెలుసుకోండి. మీ సర్వే ఏం చెపుతోంది?
- అభివృద్ధిని అక్షరాస్యత ఎలా ప్రభావితం చేస్తుంది? చర్చించండి.

భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు జనాభాలో 12 శాతమే అక్షరాస్యులు. 2001లో అది 64.84 శాతం. 2011 నాటికి అది 74.04 శాతానికి పెరిగింది. అయితే 2011 జనాభా గణన ప్రకారం అక్షరాస్యతలో పురుషులకు (82.14%), స్త్రీలకు (65.46%) చాలా వ్యత్యాసం ఉందని వెల్లడవుతోంది.

*పట్టిక 2 : జనగణన-2011 ప్రకారం వివిధ పనులు చేసేవారి వివరాలు*

| పనిచేసేవారు | పనిచేసే వారి శాతం |
|---|---|
| రైతులు | 25 |
| వ్యవసాయకూలీలు | 30 |
| పరిశ్రమలలో పనిచేసే కార్మికులు | 04 |
| ఇతర పనులు చేసేవారు | 41 |

- వ్యవసాయ భూమిని సాగుచేసే వ్యక్తికి, వ్యవసాయ కూలీకి మధ్యగల తేడాలేమిటి?
- మీ సర్వేలో కనుగొన్న శ్రామికులను, జనాభా గణనలో నమోదైన వివిధ పనుల వారితో పోల్చండి.

### శ్రామిక జనాభా

15 నుండి 59 సంవత్సరాల వయస్సు సమూహాన్ని శ్రామిక జనాభా అంటారు. వారు పూర్తి సంవత్సరం లేదా సంవత్సరంలో కొంతభాగం పనిచేస్తారు. ఇది పని అందుబాటుపై ఆధారపడుతుంది. గృహిణులు చేసే ఇంటిపని దీంట్లో భాగం అవదు. (పట్టిక-6.2ను చూడండి.) భారత జనాభా గణన వీరిని నాలుగు భాగాలుగా వర్గీకరిస్తుంది: (1) సొంత భూమిని లేదా కౌలుకు తీసుకున్న భూమిని సాగుచేస్తున్న రైతులు, (2) ఇతరుల వ్యవసాయ భూములలో కూలికి పనిచేసే వ్యవసాయ కూలీలు, (3) గృహ సంబంధ పరిశ్రమలలోను, రైస్ మిల్లులలోను, బీడీలు చుట్టేవారిగాను, కుండలు తయారు చేయడం, బుట్టలు, బట్టలు అల్లడం, పాదరక్షలు తయారు చేయడం, అగ్గిపుల్లలు, బొమ్మల తయారీ మొదలైన చిన్న చిన్న పరిశ్రమలలో పనిచేసేవారు, (4) ఫ్యాక్టరీలు, వ్యాపార వాణిజ్య సంస్థలు, రోజు కూలీలు, ఇతర వృత్తుల వారు.

## జనాభా మార్పు

జనాభా నిరంతరం మారుతూ ఉంటుంది. సంఖ్య, విస్తరణ, అంశాలు వంటివి నిరంతరం మారుతూ ఉంటాయి. (1) జననాలు, (2) మరణాలు, (3) వలసలు అన్న మూడు ప్రక్రియల ప్రభావం వల్ల జనాభా అంశాలు మారుతూ ఉంటాయి.

ఒక దేశంలో లేదా ప్రాంతంలో ఒక నిర్దిష్ట కాలంలో ఉదాహరణకు పది సంవత్సరాలలో ప్రజల సంఖ్యలో మార్పుని జనాభాలో మార్పు అంటారు. ఈ మార్పుని అంకెలలోనూ, శాతంలోనూ వ్యక్తపరచవచ్చు.

ప్రతి దశాబ్దానికి చేరిన అదనపు మనుషుల సంఖ్య జనాభా పెరుగుదలను సూచిస్తుంది. ఉదాహరణకు 2001 జనాభానుంచి 1991 జనాభాని తీసేస్తే జనాభాలో వచ్చిన మార్పు తెలుస్తుంది. తీసివేయగా వచ్చిన సంఖ్య ధనాత్మకమయితే జనాభా పెరిగిందంటారు. ఋణాత్మకమైతే తగ్గిందంటారు.

జనాభా మార్పు (అంకెలో) = (తరువాతి కాలంనాటి జనాభా) – (ముందు కాలంనాటి జనాభా)

1901 నుంచి 2011 వరకు భారతదేశంలో ప్రతి దశాబ్దకాలం నాటికి జనాభా ఎంత పెరుగుతోందో పరిశీలించండి.




పక్కన ఇచ్చిన గ్రాఫ్‌ని పరిశీలించి ఏ దశాబ్ద కాలంలో జనాభా తగ్గిందో చెప్పండి.

- ఏ సంవత్సరం నుంచి జనాభా నిరంతరంగా పెరుగుతోంది?
- భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత జనాభా వేగంగా పెరగటానికి కారణాలు ఏమై ఉండవచ్చు?

జనాభా ఎందుకు పెరుగుతుంది? దీనిని అర్థం చేసుకోటానికి జనన, మరణాలు అన్న మౌలిక విషయాలను మరొకసారి చూద్దాం. ఒక ప్రాంత జనాభాలో ఉదాహరణకు ఒక సంవత్సర కాలంలో మరణాల కంటే జననాలు ఎక్కువ ఉంటే జనాభా పెరుగుతుంది. ఒక ప్రాంతంలో జనాభాలో మార్పు = (జననాల సంఖ్య + ప్రాంతంలోకి వలస వచ్చినవాళ్ల సంఖ్య) – (మరణాల సంఖ్య + ప్రాంతం నుంచి బయటకు వలస వెళ్లిన వాళ్ల సంఖ్య).

కొంతసేపు వలసలను పక్కన పెడదాం. జనాభాలో మార్పును తెలుసుకోటానికి జననాల, మరణాల రేటును పరిశీలిద్దాం. ఒక సంవత్సరంలో వెయ్యిమంది జనాభాకి ఎంత మంది సజీవ పిల్లలు పుట్టారో అది జననాల రేటు. ఉదాహరణకు 1992లో భారతదేశంలో జననాల రేటు 29. అంటే ఆ సంవత్సరంలో, దేశంలో ప్రతి వెయ్యిమంది జనాభాకి 29 జననాలు ఉన్నాయని అర్థం. మరణాల రేటు అన్నది ఒక సంవత్సరంలో ప్రతి వెయ్యిమందికి చనిపోయిన వాళ్ల సంఖ్య. 1992 సంవత్సరానికి అప్పటి జనాభాలో ప్రతి వెయ్యిమందికి 19 మంది చనిపోయారు. అంటే వీటినిబట్టి ఆ సంవత్సరంలో ప్రతి వెయ్యిమందికి అదనంగా 19 మంది చేరారని అర్థం. ఈ సంఖ్యను శాతంగా చెప్పాలంటే అది 1.9 శాతం. అంటే 1992లో జనాభా 1.9 శాతం పెరిగిందన్నమాట.

జనాభా వృద్ధి శాతం చాలా ముఖ్యమైన అంశం. దీనిని సంవత్సరానికి శాతంలో లెక్కగడతారు. ఉదాహరణకు సంవత్సరానికి 2 శాతం వృద్ధి అంటే అంతకు ముందు సంవత్సరంలో ఉన్న ప్రతి వంద మందికి ఇద్దరు చొప్పున జనాభా పెరిగిందన్నమాట. ఇది చక్ర వడ్డీలాగా ఉంటుంది. దీనిని వార్షిక వృద్ధి శాతం అంటారు. భారతదేశ జనాభా స్థిరంగా పెరుగుతూనే ఉంది.

పై రేఖాపటంలో చూపినట్టు భారతదేశ జనాభా పెరుగుతోంది. దీనికి కారణాలు తెలుసుకోవాలంటే జనన, మరణ శాతాలను పరిశీలించాలి. మరణాల శాతం గణనీయంగా తగ్గింది కానీ ఇటీవలి కాలందాకా జననాల శాతం అంతగా తగ్గలేదు. 1990ల నుంచి, ప్రత్యేకించి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కరువు సహాయం, ఆహార ధాన్యాల తరలింపు, చౌకధరల దుకాణాలు, ప్రజాస్వామ్యంలో ప్రజలు చురుకుగా పాల్గొనడం వంటి వాటి వల్ల కరువుల ప్రభావం తగ్గిపోయింది. అదేవిధంగా కలరా, ప్లేగు, కొంతవరకు మలేరియా వంటి అంటురోగాలను నియంత్రించగలిగారు. అనేక రోగాలకు కలుషిత నీరు, ఇరుకు ఇళ్లల్లో ఉండటం, పారిశుద్ధ్య లోపం వంటివి ప్రధాన కారణాలు. ఈ రోగాలను ఎదుర్కోవాలంటే మెరుగైన పారిశుద్ధ్యం, శుభ్రమైన నీళ్లు, పోషక

ఆహారం అందించాలని అందరూ గుర్తించసాగి ఆ దిశగా అనేక చర్యలు చేపట్టారు. ఆ తరువాత వైద్యరంగంలో పురోగమనం వల్ల ప్రత్యేకించి టీకాలు, యాంటిబయాటిక్స్ వల్ల మెరుగైన ఆరోగ్యం సాధ్యమయ్యింది. 1900తో పోలిస్తే మరణాల శాతం గణనీయంగా తగ్గింది. జననాల శాతం ఎక్కువగా ఉండటానికి తగ్గుతున్న మరణాల శాతం తోడై జనాభా వేగంగా పెరగసాగింది.

జననాల శాతం అంతకాలంపాటు ఎక్కువగా ఎందుకు ఉండిపోయింది? గతంలో ఏం జరిగిందన్నది ఒక కారణం. మొత్తం జనాభాలో చిన్నవాళ్లు అధిక సంఖ్యలో ఉంటే రానున్న సంవత్సరాలలో వాళ్లు ఎదిగి, పెళ్లి చేసుకుని పిల్లల్ని కంటారు. పెద్ద సంఖ్యలో యువతతో మొదలుపెట్టినప్పుడు పుట్టే పిల్లల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

దంపతులు ఎంతమంది పిల్లల్ని కావాలనుకుంటున్నారు అన్నది జనాభా పెరగటానికి మరొక కారణం. పుట్టిన పిల్లల్లో ఎంతమంది బతుకుతారు, ప్రజలకు ఉండే సామాజిక భద్రత, సమాజంలో మగ పిల్లవాడికి ఉన్న ప్రాధాన్యత వంటి అంశాల మీద ఇది ఆధారపడి ఉంటుది. ఉదాహరణకు, ఉమేద్ సింగ్ కుటుంబంలోని మూడు తరాలను చూద్దాం:

"ఉమేద్ సింగ్ తాతయ్య, నాయనమ్మ ప్లేగు, కలరా అంటువ్యాధులు ప్రబలటం వల్ల చనిపోయారు. 1900 ప్రాంతంలో జన్మించిన అతడి తండ్రిని వాళ్ల అన్నయ్య పెంచాడు. వాళ్లకి కొంత భూమి ఉంది. ఎప్పుడో ఒకసారి మంచి పంట పండేది తప్పించి పంట నష్టపోవటం, కరువు వంటి వాటివల్ల నిరంతరం సమస్యలలో ఉండేవాళ్లు. ఉమేద్ సింగ్ తండ్రికి తొమ్మిది మంది సంతానం, కానీ వాళ్లలో ఆరుగురు చాలా చిన్నప్పుడే చనిపోయారు. బతికిన ముగ్గురిలో ఒకరు ఉమేద్ సింగ్, 1935 ప్రాంతంలో జన్మించాడు. అతడికి ఇద్దరు అక్కలు. తండ్రిలాగా కాకుండా అతడికి పోలీసు ఉద్యోగం ద్వారా నెలనెలా జీతంతోపాటు భూమినుంచి కొంత ఆదాయం కూడా లభిస్తుంది. ఉమేద్‌కి మొదట ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. వాళ్లు బతికి బట్టకడతారో లేదోనన్న అనుమానం. అదీకాక అతడికి కొడుకు కావాలని ఉంది. ఆ తరువాత




*చిత్రం 6.2: కింద విదేశాలకు సంబంధించిన రెండు పోస్టర్లు ఇవ్వబడ్డాయి. వాటిలో ఇవ్వబడిన సందేశాన్ని ఊహించగలరా? ఇటువంటి పోస్టర్లను భారతదేశంలో ఎప్పుడైనా చూశారా? చర్చించండి.*



అతడికి నలుగురు పిల్లలు పుట్టారు. వాళ్లలో ముగ్గురు అబ్బాయిలు. ఉమేద్ పెద్ద కూతురు టీచరు శిక్షణ పొందింది. ముగ్గురు కంటే ఎక్కువ సంతానం వద్దని ఆమె అనుకుంటోంది.”

1981 నుంచి జననాల శాతం కూడా క్రమేపీ తగ్గుతోంది. ఫలితంగా జనాభా వృద్ధి శాతం మెల్లగా తగ్గుతోంది. కింది పట్టికలో 1951 నుంచి 2011 వరకు ప్రతి దశాబ్దానికి జనాభా మార్పు శాతం లెక్కగట్టి అది కూడా తగ్గుతోందేమో చూడండి.

*పట్టిక 3 : భారతదేశ జనాభా పెరుగుదల స్వరూపం, శాతం. ఖాళీలను పూరించండి.*

| సంవత్సరం | మొత్తం జనాభా (మిలియన్లలో) | జనాభా పెరుగుదల వృద్ధిశాతం | దశాబ్ద కాలంలో మార్పు శాతం |
|---|---|---|---|
| 1951 | 361 | | |
| 1961 | 439 | 78 | |
| 1971 | 548 | ? | |
| 1981 | 683 | ? | |
| 1991 | 846 | ? | |
| 2001 | 1029 | ? | |
| 2011 | 1210 | ? | |

ఈ ధోరణిని మనం ఎలా అర్థం చేసుకుంటాం? దీనికి ఫెర్టిలిటీ శాతం (ఒక మహిళకు పుట్టే మొత్తం పిల్లలు) అన్న దానిని ఉపయోగిస్తాం. ఒక మహిళ పునరుత్పత్తి వయస్సు చివరివరకు జీవించి ఉండి, ప్రస్తుత తీరు ప్రకారం పిల్లలను కంటే పుట్టే మొత్తం పిల్లలను ఫెర్టిలిటీ శాతం అంటారు. ఇది తగ్గితే దంపతులు తక్కువ మంది పిల్లలు కావాలనుకుంటున్నారని మనం అనుకోవచ్చు. కుటుంబంలోని, కుటుంబం బయటి అంశాలు ఈ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. కింద ఉన్న గ్రాఫ్ 6.4ను చూడండి.

1960లో భారతదేశంలో ఫెర్టిలిటీ శాతం 5.6 కంటే ఎక్కువ ఉంది, అంటే ప్రతి మహిళ సగటున అయిదు, ఆరుగురు పిల్లలకు జన్మనిస్తోంది. భద్రత, పిల్లలకు ఉన్న అవకాశాలు, సామాజిక ఒత్తిడి వంటి వాటి బట్టి ఎంతమంది పిల్లల్ని కనాలో కుటుంబం నిర్ణయించుకుంటుంది. ఈ దృక్పథంలో కొంత మార్పు వస్తోంది. భారతదేశ ప్రస్తుత ఫెర్టిలిటీ శాతం 2.7, ఆంధ్రప్రదేశ్‌లో ఇది 1.9 శాతం.

జనాభా పెరుగుదలలో మూడవ అంశం వలసలు. ప్రజలు ప్రాంతాలు దాటి వెళ్లటాన్ని వలసలు అంటారు. వలస అంతర్గతంగా (ఒక దేశంలో) ఉండవచ్చు, అంతర్జాతీయంగా (దేశాల మధ్య) ఉండవచ్చు. అంతర్గత వలసల వల్ల దేశ జనాభా మారదు కానీ దేశంలోని దాని విస్తరణను ప్రభావితం చేస్తుంది. జనాభా తీరు, విస్తరణలను వలస బాగా ప్రభావితం చేస్తుంది. వలసల గురించి తరవాత అధ్యాయంలో ఇంకా తెలుసుకుంటారు.

*గ్రాఫ్ 4: భారతదేశంలో ఫెర్టిలిటీ రేటు, 1961-2011*



- ఫెర్టిలిటీ శాతం 2కి దగ్గరగా ఉంటే ఏమిటి అర్థం? చర్చించండి.
- ఇటీవల పెళ్లి జరిగి ఇంకా పిల్లలు లేని దంపతులతో మాట్లాడండి. వాళ్లు ఎంతమంది పిల్లల్ని కనాలనుకుంటున్నారు? దానికి కారణాలు ఏమిటి?
- మీ కుటుంబంలో మూడు తరాల పాటు ప్రతి మహిళకు ఎంతమంది సంతానమో తెలుసుకోండి. మీకు ఎటువంటి మార్పులు కనపడ్డాయి?
- మీరు బృందాలలో చేసిన సర్వేలో 45 సంవత్సరాలు పైబడిన మొత్తం మహిళల సంఖ్య, వారి పిల్లల సంఖ్య తెలుసుకోండి. మీ సర్వేలో సగటున ప్రతి మహిళకు ఎంతమంది పిల్లలు ఉన్నారు?
- పిల్లల విషయంలో ఉమేద్ సింగ్‌ని ఏ అంశాలు ప్రభావితం చేశాయి? అతని కూతురు కూడా అలాగే ఆలోచిస్తోందా?

జనాభా పెరుగుదల గురించి కొంతమంది ఆందోళనతో మాట్లాడటం తరచూ వింటూ ఉంటాం. వీళ్లు సాధారణంగా అక్షరాస్యులై ఉంటారు. జనాభా ఎక్కువై, వనరులు తక్కువ అవ్వటం వల్ల ఇతరులు ప్రయోజనం పొందలేకపోతున్నారని వీళ్లు అంటారు. అయితే, తమకున్న వనరులు, వృద్ధాప్యంలో తమకు భద్రత వంటి అనేక అంశాల ఆధారంగా కుటుంబాలు ఎంత మంది పిల్లలు కావాలో నిర్ణయించుకుంటాయి. ఎక్కువ మంది పిల్లలు ఉన్న అనేక కుటుంబాలు మిగిలిన వాటికన్నా పేదరికంలో ఉంటాయి, అంతగా ఆస్తులు ఉండవు, వృద్ధాప్యంలో భద్రతకు తమ పిల్లలపై ఆధారపడి ఉంటాయి. ఈ భిన్న దృష్టికోణాలను ఎలా అర్థం చేసుకుంటాం?

## జన సాంద్రత

జనాభా విస్తరణను జన సాంద్రత బాగా తెలియజేస్తుంది. ఒక నిర్దిష్ట వైశాల్యంలో ఉండే ప్రజల సంఖ్య ఆధారంగా జన సాంద్రతను లెక్కగడతారు.

ప్రపంచంలో అత్యధిక జన సాంద్రత గల దేశాలలో భారతదేశం ఒకటి. 2011లో భారతదేశ జన సాంద్రత చదరపు కిలోమీటరుకి 382 వ్యక్తులు. ఈ సాంద్రతలో తేడాలు పశ్చిమ బెంగాల్‌లో 904 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో 13 వరకు ఉన్నాయి. అస్సాం, ద్వీపకల్ప ప్రాంత అనేక రాష్ట్రాలలో జన సాంద్రత ఒక మాదిరిగా ఉంది. భూభాగం కొండలు, రాళ్లతో ఉండడం, ఒక మోస్తరు నుంచి తక్కువ వర్షపాతం, లోతు తక్కువ, అంతగా సారవంతంకాని నేలలు ఈ ప్రాంతంలోని జన సాంద్రతను ప్రభావితం చేశాయి. ఉత్తర మైదానాలు, కేరళలో చదునైన మైదానాలు, సారవంతమైన నేలలు, అధిక వర్షపాతం ఫలితంగా అధిక నుంచి చాలా అధిక జన సాంద్రత ఉంది.

ఉత్తర మైదానాలలో అధిక జన సాంద్రత ఉన్న మూడు రాష్ట్రాలను గుర్తించండి. జన సాంద్రతలో ఇంత తేడా ఎందుకు ఉంది? దీనిని అర్థం చేసుకోటానికి మనం ఆ ప్రాంత చరిత్రను, భూ భాగాన్ని, వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, 9వ అధ్యాయంలో రామ్‌పూర్ గ్రామ కథలో 'భూమి, ఇతర సహజ వనరులు' అన్న భాగం చదవండి. సారవంతమైన భూమి, సాగునీటి వసతి ఇంతకు ముందు కంటే ఎక్కువ జనాభాని పోషించగలిగినప్పటికీ వేరువేరు బృందాలపై, ప్రత్యేకించి చిన్న రైతులు, భూమిలేని కూలీలపై ఈ ప్రభావం వేరువేరుగా ఉంది.

- ఏ సంవత్సరం నాటికి ఊరిలోని భూమి అంతా సాగులోకి వచ్చింది?
- పెరుగుతున్న కుటుంబ పరిమాణానికి భూమి ఉన్నవాళ్లు ఎలా స్పందించారు?
- కుటుంబ పరిమాణం పెరిగినప్పుడు గోవిందులాంటి చిన్న రైతులు ఎలా స్పందించారు? బోరుబావితో సాగునీరు ఎంతవరకు ఉపయోగపడింది?
- కింద ఉన్న భారతీయ పటాన్ని చూడండి. భారతదేశ భౌగోళిక స్వరూపానికి, జనాభా సాంద్రతకు మధ్య ఏమైనా సంబంధం ఉందేమో చూడండి. దేశంలోని ప్రధాన నగరాలను గుర్తించగలరా? నగరాలలోని అధిక జనాభా సాంద్రతను ఎలా వివరిస్తారు?



ఇక్కడ 2011కి ఆంధ్రప్రదేశ్ జన సాంద్రత గణాంకాలు ఉన్నాయి. జిల్లాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ పటంలో వివిధ జన సాంద్రత స్థాయిలను సూచించండి.

అధిక సాంద్రత ఉన్న ఒక జిల్లాను తక్కువ సాంద్రత ఉన్న మరొక జిల్లాతో కింది అంశాలలో పోల్చండి:

అ. భూ ఉపరితలం, వ్యవసాయ అభివృద్ధికి అవకాశాలు.

ఆ. ఆ ప్రాంతంలో వ్యవసాయ చరిత్ర – భూమి, నీరు, ఇతర సహజ వనరుల వినియోగం.

ఇ. ఆ ప్రాంతంనుంచి, ఆ ప్రాంతంలోకి వలసలు, దీనికి కారణాలు.

| స్థానం 2011 | జిల్లా | జనాభా 2011 |
|---|---|---|
| 1 | హైదరాబాద్ | 18480 |
| 2 | రంగారెడ్డి | 707 |
| 3 | కృష్ణా | 519 |
| 4 | పశ్చిమ గోదావరి | 508 |
| 5 | తూర్పు గోదావరి | 477 |
| 6 | శ్రీకాకుళం | 462 |
| 7 | గుంటూరు | 429 |
| 8 | విశాఖపట్నం | 384 |
| 9 | విజయనగరం | 358 |
| 10 | కరీంనగర్ | 322 |
| 11 | నిజామాబాద్ | 321 |
| 12 | మెదక్ | 313 |
| 13 | చిత్తూరు | 275 |
| 14 | వరంగల్ | 274 |
| 15 | నల్లగొండ | 245 |
| 16 | కర్నూలు | 229 |
| 17 | ఎస్.పి.ఎస్ నెల్లూరు | 227 |
| 18 | మహబూబ్‌నగర్ | 219 |
| 19 | అనంతపురం | 213 |
| 20 | ప్రకాశం | 192 |
| 21 | వై.ఎస్.ఆర్ కడప | 188 |
| 22 | ఖమ్మం | 175 |
| 23 | ఆదిలాబాద్ | 170 |



## కీలక పదాలు

జనాభా పెరుగుదల | జనసాంద్రత | లింగనిష్పత్తి | ఫెర్టిలిటీ శాతం

జనాభా విస్తరణ | అక్షరాస్యత శాతం | భ్రూణహత్య

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను గుర్తించి వాటిని సరిచేయండి:

   అ. ప్రతి పది సంవత్సరాలకు జనాభా గణన చేపడతారు.

   ఆ. జనాభాలోని పెద్దవాళ్లలో ఆడవాళ్ల సంఖ్యను లింగ నిష్పత్తి తెలియజేస్తుంది.

   ఇ. వయస్సును బట్టి జనాభా విస్తరణను వయస్సు సమూహం తెలియజేస్తుంది.

   ఈ. కొండ ప్రాంతాలలోని వాతావరణాన్ని ప్రజలు ఇష్టపడతారు కాబట్టి అక్కడ జనాభా సాంద్రత ఎక్కువ.

2. దిగువ పట్టిక ఆధారంగా కింద ఉన్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

**ప్రపంచ జనాభా – గతం, భవిష్యత్తు అంచనా (మిలియన్లలో)**

సంవత్సరం

| ప్రాంతం/సం॥ము | 1500 | 1600 | 1700 | 1800 | 1900 | 1950 | 1999 | 2012 | 2050 | 2150 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ప్రపంచం | 458 | 580 | 682 | 978 | 1,650 | 2,521 | 5,978 | 7,052 | 8,909 | 9,746 |
| ఆఫ్రికా | 86 | 114 | 106 | 107 | 133 | 221 | 767 | 1,052 | 1,766 | 2,308 |
| ఆసియా | 243 | 339 | 436 | 635 | 947 | 1,402 | 3,634 | 4,250 | 5,268 | 5,561 |
| యూరపు | 84 | 111 | 125 | 203 | 408 | 547 | 729 | 740 | 628 | 517 |
| లాటిన్ అమెరికా & కరేబియన్ | 39 | 10 | 10 | 24 | 74 | 167 | 511 | 603 | 809 | 912 |
| ఉత్తర అమెరికా | 3 | 3 | 2 | 7 | 82 | 172 | 307 | 351 | 392 | 398 |
| ఓషియానియా | 3 | 3 | 3 | 2 | 6 | 13 | 30 | 38 | 46 | 51 |

- ప్రపంచ జనాభా మొదటిసారి రెట్టింపు కావటానికి సుమారుగా ఎన్ని శతాబ్దాలు పట్టిందో తెలుసుకోండి.
- ఇంతకు ముందు తరగతులలో మీరు వలస పాలన గురించి చదివారు. పట్టిక చూసి 1800 నాటికి ఏ ఖండాలలో జనాభా తగ్గిందో తెలుసుకోండి.
- ఏ ఖండంలో ఎక్కువ కాలంపాటు అధిక జనాభా ఉంది?
- భవిష్యత్తులో జనాభా గణనీయంగా తగ్గనున్న ఖండం ఏదైనా ఉందా?

3. లింగ నిష్పత్తి చాలా ఎక్కువగాని, లేదా చాలా తక్కువగాని ఉంటే సమాజంపై పడే ప్రభావాలను పేర్కొనండి.

4. భారతదేశ అక్షరాస్యతను ఇతర దేశాలతో పోల్చండి:

   బ్రెజిల్, శ్రీలంక, దక్షిణ ఆఫ్రికా, నేపాల్, బంగ్లాదేశ్, నార్వే, చిలి, ఇండోనేసియా. ఎటువంటి సారూప్యాలు, తేడాలు మీరు గమనించారు?

5. ఆంధ్రప్రదేశ్‌లోని ఏ ప్రాంతాలలో జన సాంద్రత ఎక్కువగా ఉంది, దానికి కారణాలు ఏమిటి?

6. జనాభా పెరుగుదల, జనాభా మార్పు మధ్య తేడాలను పేర్కొనండి.

7. క్రింద ఇచ్చిన స్వీడన్, కెన్యా, మెక్సికో దేశాల వయస్సు సమూహాన్ని పోల్చండి.

● ఈ దేశాల్లో జనాభా పెరుగుదల ఎలా ఉంటుంది?

● ఏ దేశాల జనాభా ఇంకా తగ్గవచ్చు?

● అన్ని దేశాలలో లింగ నిష్పత్తి సమతుల్యంగా ఉందా?

● ఈ దేశాల కుటుంబ సంక్షేమ పథకాలు ఏమై ఉండవచ్చు?










8. పటం పని

అ. రాష్ట్రాలను సూచించే భారతదేశ పటంలో 2011 జనాభా గణాంకాల ఆధారంగా అయిదు స్థాయిలలో జనాభా సాంద్రతను సూచించండి.

ఆ. జిల్లాలను సూచించే ఆంధ్రప్రదేశ్ పటంలో చుక్కల పద్ధతిని ఉపయోగించి (ఒక చుక్క పదివేల జనాభాను సూచిస్తుంది) జనాభా విస్తరణను చూపించండి.

## ప్రాజెక్టు

జన సాంద్రతకు చెందిన కింది రెండు పటాలను, జనాభా పెరుగుదలకు సంబంధించిన రేఖా పటాన్ని చూడండి. ఈ అధ్యాయంలో మీరు జనాభాకి సంబంధించి తెలుసుకున్న వివిధ అంశాల ఆధారంగా వాటిని వివరించండి.







*1990 నుండి జనాభా పెరుగుదల, అటవీ నష్టం*



# ప్రజలు - నివాసప్రాంతాలు

## నివాసప్రాంతం అంటే ఏమిటి?

మీరు ఉంటున్న ఊరు, పట్టణం లేదా నగరాన్ని చూడండి. భవనాలు, రోడ్లు, మురుగు కాలవలు వంటివాటి అమరికకి ఒక పద్ధతి ఉందని మీరు గ్రహిస్తారు. ప్రపంచమంతటా ఈ పద్ధతిలో ఎన్నో తేడాలున్నాయని మీరు తెలుసుకుంటారు.

ఒక ప్రదేశంలో మన నివాస స్థలాన్ని, మన జీవితాలను ఏర్పరచుకున్న పద్ధతినే నివాసప్రాంతం అంటారు – ఇది మనం నివసించే, పని చేసే భౌగోళిక ప్రదేశం. నివాసప్రాంతంలో విద్య, మతపర, వాణిజ్యం వంటి విభిన్న కార్యకలాపాలు ఉంటాయి.

ఈ అధ్యాయంలో మనం మానవ నివాసప్రాంతాల గురించి, దానికి సంబంధించిన భౌగోళిక శాస్త్రం గురించి కొంత తెలుసుకుందాం.










*చిత్రం 7.1: అ, ఆ, ఇ ఇవన్నీ హిమాలయాలకు సంబంధించిన చిత్రాలు. ఈ బొమ్మలను చూసి వివిధ నివాసప్రాంతాలు, ఇళ్ల నిర్మాణంలో ఎదుర్కొనే ముప్పులు, భూ వినియోగం, నివాసప్రాంత రకం వంటి వాటిల్లో తేడాలను పోల్చండి.*

అ. 25,000 జనాభాకి ఉద్దేశించిన సిమ్లా పట్టణంలో ఇప్పుడు రెండు లక్షలమంది ఉంటున్నారు.

ఆ. హిమాలయాల్లో కొండచరియలు విరిగి పడటం

ఇ. హిమాలయాలు, లడఖ్‌లోని సుబ్రాలోయలో ఒక గ్రామం. మంచుకొండ కరగటంతో ఏర్పడిన వాగు పక్కన ఈ నివాసప్రాంతం ఏర్పడింది. ఈ వాగు వేసవిలోనే ప్రవహిస్తుంది, ఆ కాలంలోనే వ్యవసాయం సాధ్యమౌతుంది. ఈ ప్రాంతంలో వర్షం అస్సలు పడదు, కొండలన్నీ చెట్లు లేకుండా బోడి(Barren) గాఉంటాయి.

## *క్షేత్ర పని*

*మీ ఊరు, పట్టణం లేదా నగరాన్ని పరిశీలించండి. ఇంతకుముందు నేర్చుకున్న పద్ధతుల ఆధారంగా ఎంపిక చేసిన ఒక చిన్న ప్రాంతం పటం గీయండి. మీ పటంలో ఈ కింద సూచించినవి ఉండాలి:*

*రోడ్లు, ఇళ్లు, బజారు, దుకాణాలు, వాగులు, మురికి కాలవలు, ఆసుపత్రి, పాఠశాల, బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ వంటి కొన్ని ప్రదేశాలు*

- ★ ప్రజా సౌకర్య ప్రదేశాలు అధికశాతం ప్రజలకు వీలుగా ఉండే ప్రదేశంలో ఉన్నాయా?
- ★ స్థానిక బజారులను కనుగొనడంలో ఏమైనా పద్ధతి ఉందా?
- ★ ఇళ్లు గుంపులుగా ఉన్నాయా? వాటికి, ప్రధాన రహదారులకు మధ్య అనుసంధానం ఉందా?
- ★ ఎంపిక చేసిన ప్రాంతంలోని ప్రజలతో మాట్లాడి గత 20 సంవత్సరాలలో చోటు చేసుకున్న మార్పులు, వాటికిగల కారణాలు తెలుసుకోండి.
- ★ ఉండవలసిన సదుపాయాలు ఏవి లేవు?

## నివాస ప్రాంతాలు ఎలా ఏర్పడ్డాయి?

తొలి మానవులు వేట, సేకరణ ద్వారా ఆహారాన్ని సమకూర్చుకునే వాళ్లు. అందుకనే వాళ్లని సేకరించేవాళ్లు, వేటగాళ్లు అనేవాళ్లు. వాళ్లు సంచార జీవులు, అంటే ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి ప్రయాణం చేస్తూ ఉండే వాళ్లు. ఆహారాన్ని అన్వేషిస్తూ – అంటే చెట్లనుంచి పండ్లు సేకరిస్తూ, మాంసం, చర్మాలు, ఇతర అవసరాలకోసం జంతువులను వేటాడుతూ వాళ్లు సంచారజీవనం సాగించే వాళ్లు. మొదట రాళ్ళతో తయారుచేసిన పరికరాలను ఉపయోగించటం మొదలుపెట్టారు. ఈ పరికరాలతో వాళ్లు సమర్థతతో, నైపుణ్యంతో వేటాడగలిగే వాళ్ళు.

మానవులు సుమారు 1.8 లక్షల సంవత్సరాల పాటు సేకరణ– వేటగాళ్లుగా గుంపులలో జీవించారు. అప్పుడు వాళ్లు వ్యవసాయం చేసేవాళ్లు కాదు. ఆహార సరఫరాలో వచ్చిన మార్పుల వల్ల కొన్ని బృందాలు ఆహార ఉత్పత్తికి – వ్యవసాయానికి పూనుకున్నాయి. ఇది సుమారుగా 10,000 సంవత్సరాల క్రితం జరిగింది. దీనివల్ల మానవ జీవనశైలిలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆహారం సంపాదించుకోటానికి వాళ్లు చాలా దూరం తిరగాల్సినపని తప్పింది. ఇప్పుడు ఒకే ప్రదేశంలో ఎక్కువ కాలం ఉండటానికి వీలయ్యింది. సేకరణ – వేటగాళ్లుగా వాళ్లు సంచార జీవనం గడిపేవాళ్లు. కాని వ్యవసాయదారులుగా ఒకే ప్రదేశంలో స్థిరనివాసం ఉండటం పెరిగింది.



*చిత్రం 7.2: మధ్యప్రదేశ్‌లోని భీంబేట్కాలో ఆదిమానవులు నివసించిన రాతి గుహ. మరిన్ని వివరాలకు ఆరవ తరగతిలోని ఆహార సేకరణ – వేటగాళ్ల అధ్యాయం చదవండి.*

- పోలికలు, తేడాలు పేర్కొనండి: పై సమాచారం ఆధారంగా సంచార, స్థిర జీవనశైలులలోని పోలికలు, తేడాలు పేర్కొనండి. మీరు ఎన్ని అంశాలు గుర్తించగలిగారో చూడండి (ఇక్కడ పట్టిక సరిపోకపోతే మరొక పట్టిక తయారు చేయండి).

| సంచార జీవన విధానం | స్థిర జీవన విధానం |
|---|---|
| | |
| | |
| | |

## వ్యవసాయ వృద్ధి, పట్టణాల ఆవిర్భావం

వ్యవసాయం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రకృతిలోని రీతులను ప్రజలు బాగా అర్థం చేసుకోగలిగారు. ఉదాహరణకు రుతు చక్రాలు, వాతావరణ పరిస్థితులను ముందుగా ఊహించటం, సాగు పనులు (విత్తటం, కోయటం వంటివి) ఏవి ఎప్పుడు చేయాలో బాగా తెలిశాయి. ఆకాశంలో గ్రహాల కదలికలు వంటివి గమనించటానికి వాళ్లకి తీరిక సమయం చిక్కింది. జనాభా కూడా పెరిగింది.

జనాభా పెరగటంతో నేత, కుండల తయారీ, లోహాల తయారీ, ఇతర వృత్తుల వంటివి పెరిగాయి. ఉత్పత్తి చేసే వస్తువుల రకాలు, సంఖ్య పెరగడం వల్ల వర్తకం కూడా పెరిగింది. వృత్తి పనివాళ్లు పట్టణ ప్రాంతాలలో స్థిరపడటాన్ని పాలకులు ప్రోత్సహించారు. పట్టణ నివాస ప్రాంతాలు, అంటే వ్యవసాయం చెయ్యని ప్రజలు ఉండే ప్రాంతాలు విస్తరించసాగాయి.

నివాస ప్రాంతాలు పెద్దవిగా అవ్వటంతో అవి మరింత సంక్లిష్టంగా మారసాగాయి – ఆహార ఉత్పత్తి ఒక్కటే కాకుండా ఇతర ఎన్నో పనులు పుట్టుకొచ్చాయి. ప్రతి నివాస ప్రాంతంలో ప్రజలు కొన్ని నైపుణ్యాలలో ప్రత్యేకతను ప్రదర్శించేవాళ్ళు. అమ్మటం కోసం అనేక సరుకుల ఉత్పత్తి మొదలయ్యింది, వీటిని వర్తకులు దూర ప్రాంతాలకు తీసుకుని వెళ్లేవాళ్లు.

## నివాస ప్రాంతాలు ఎందుకు మారతాయి?

అనేక కారణాల వల్ల నివాస ప్రాంతాలు మారతాయి. ఢిల్లీకి సంబంధించిన వివరాలు ఇక్కడ చదవండి.

భారతదేశాన్ని పరిపాలించిన అనేక రాజ్యాలకు ఢిల్లీ కేంద్రంగా ఉందని చెప్పవచ్చు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అది దేశ రాజధానిగా కొనసాగింది. ఈ పుస్తకంలోనే కాకుండా ఇతర తరగతులలో దేశ విభజన సమయంలో పెద్ద ఎత్తున ప్రజలు భారతదేశంలోకి వచ్చారు, బయటకు వెళ్లారు అని తెలుసుకున్నారు. దాంతో వలస వచ్చిన ప్రజలకు కొత్త ప్రాంతాలలో నివాసం కల్పించటం ఈ నగరానికి ఒక సవాలుగా మారింది. దశాబ్దాలు గడుస్తున్న క్రమంలో ఉద్యోగాలు, ఉపాధి వెతుక్కుంటూ దేశం అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వలస రాసాగారు. దేశ రాజధాని కావటం, పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం వల్ల అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు.

ఈరోజు ఢిల్లీ రెండవ అతి పెద్ద నగరం, కోటి అరవై లక్షల మంది ఇక్కడ నివసిస్తున్నారు. 1951లో దీని జనాభా ఇరవై లక్షలు. గత 60 సంవత్సరాలలో దీని జనాభా 8 రెట్లు పెరిగింది. ఈ జనాభా పెరుగుదలకు ప్రధాన కారణం వలస వచ్చిన ప్రజలు. ఈ వలసల వల్ల జనాభా తీరు, నివాసప్రాంతాల తీరు మారింది.

ఢిల్లీలో ప్రజలు నివసించే ప్రాంతాల రకాలను ముందుగా పరిశీలిద్దాం. ఇక్కడి గణాంకాలు 2000 సంవత్సరం నాటివైనప్పటికీ, ఇప్పటికీ ఇదే ధోరణి కొనసాగుతోంది. నగరంలో అనేక రకాల మురికివాడలు, లేదా పేద ప్రజలు నివసించే ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అనధీకృత కాలనీలుగా మొదలయ్యాయి. తరువాత వీటిల్లో కొన్ని ప్రాంతాలను స్థానిక అధికారులు క్రమబద్ధీకరించారు, గుర్తించారు. వీటిని గుర్తించిన మురికివాడలు, పున:నివాస కాలనీలు లేదా క్రమబద్ధీకరించిన అనధీకృత కాలనీలు అంటారు. అయితే చట్టబద్ధమైన నివాసాలుగా గుర్తించని గుడిసెలు (జుగ్గి జోప్డి) ఉండే ప్రాంతాలు, అనధీకృత కాలనీలు ఉన్నాయి. నగరం లోపల కొన్ని గ్రామాలు కూడా ఉన్నాయి. కింది పట్టిక చూస్తే మొత్తం మీద జనాభాలో 24 శాతం మాత్రమే పూర్తి చట్ట బద్ధ కాలనీలలో నివసిస్తున్నారని తెలుస్తుంది.

*పట్టిక 1 : నివాస ప్రాంత రకం – జనాభా*

| నివాసప్రాంత రకం | 2000 సంవత్సరంలో జనాభా అంచనా (వేలలో) | నగర మొత్తం జనాభాలో శాతం |
|---|---|---|
| జుగ్గి జోప్డి ప్రాంతాలు | 20.72 | 14.8 |
| మురికివాడలుగా గుర్తించిన ప్రాంతాలు | 26.64 | 19.1 |
| అనధీకృత కాలనీలు | 7.40 | 5.3 |
| జుగ్గి జోప్డి పున:నివాస కాలనీలు | 17.76 | 12.7 |
| గ్రామాలు | 7.40 | 5.3 |
| క్రమబద్ధీకరించిన అనధీకృత కాలనీలు | 17.76 | 12.7 |
| పట్టణ గ్రామాలు | 8.88 | 6.4 |
| ప్రణాళికాబద్ధ కాలనీలు | 33.08 | 23.7 |
| మొత్తం | 139.64 | 100 |

ప్రతి నగరానికి వివిధ రకాల ప్రాంతాలు రూపొందించటానికి, కేటాయించటానికి సాధారణంగా ఒక మాస్టర్ ప్రణాళిక ఉంటుంది. ఏ నగరంలోనైనా నివాసప్రాంతాలు, మార్కెట్లు, పాఠశాలలు, పారిశ్రామిక ప్రాంతాలు, కార్యాలయ ప్రాంతాలు, ఉద్యాన వనాలు, వినోద స్థలాలు వంటివి ఉండాలి. దీని ఆధారంగా ఎలాంటి రోడ్లు ఉండాలి, ఎంత విద్యుత్తు లేదా నీళ్లు అవసరం అవుతాయి, వ్యర్థ పదార్థాలను ఎలా తొలగించాలి, పారిశుద్ధ్య పరిస్థితులు ఎలా కల్పించాలి వంటి అంశాలను ప్రణాళికలు తయారుచేసేవాళ్లు నిర్ణయిస్తారు. ఢిల్లీకి ఇటువంటి మాస్టర్ ప్రణాళికలు మూడుసార్లు తయారు చేశారు. అయితే ఇప్పటి పరిస్థితి చూస్తే ఈ ప్రణాళికలను అమలుపరిచినట్లు కనపడదు. వాస్తవానికి ఢిల్లీ ప్రణాళికాబద్ధంగా పెరగలేదు. ప్రణాళికాబద్ధమైన కాలనీకి అన్ని సదుపాయాలు ఉంటాయి. వివిధ ఉద్దేశాలకు గుర్తించిన ప్రాంతాన్ని ప్రభుత్వం ప్రకటించాలి. ఆ ప్రాంతంలోని నిర్మాణాలు ఈ ఆదేశాలను పాటించాలి. అయితే ఇటువంటి ప్రణాళికలు అమలు కాలేదని స్పష్టమవుతోంది.



చిత్రం 7.3 : మధ్య తరగతి ఇళ్ల కాలనీ

ఒక వైపున నగరాలలో జనాభా వేగంగా పెరుగుతోంది, ఇంకొక వైపున ప్రణాళికలు తయారు చేయటంలో, ఏ ప్రాంతాలను ఎందుకు ఉపయోగించాలో ప్రకటించటంలో ఆలస్యం జరుగుతోంది. పని కోసం వెదుక్కుంటూ నగరానికి వచ్చిన వాళ్లు భూమిని ఆక్రమించుకుని, ఎటువంటి అనుమతులు లేకుండా, ఎవరి సహాయం, ఏ సదుపాయాలు లేకుండ తమ శక్తిమేరకు ఇళ్లు కట్టుకుంటారు. ఇవి చాలాకాలంపాటు అనధికృత కాలనీలుగా ఉండిపోతాయి. అంతిమంగా ప్రణాళికను ప్రకటించిన నాటికి ఈ ప్రాంతాన్ని వేరే ఉపయోగం కోసం కేటాయించి ఉండవచ్చు.

ఇది క్లిష్టమైన వైరుధ్య పరిస్థితికి దారి తీస్తుంది. తమ ఇళ్ల నుంచి ఖాళీ చేయించుతారన్న నిరంతర భయంతో ప్రజలు రాజకీయ మద్దతుకోసం చూస్తారు. మాస్టర్ ప్రణాళిక ఈ కాలనీల అస్థిత్వాన్ని గుర్తించనందువల్ల వీటికి గుర్తింపు వచ్చే అవకాశం లేదు. ఫలితంగా ఈ ప్రాంతాలకు ఎటువంటి సదుపాయాలను స్థానిక ప్రభుత్వాలు కల్పించవు. వీటిల్లో నివసించే ప్రజలు పేదవాళ్లు, కానీ నగరానికి అవసరమైన సేవలను వీళ్లు అందిస్తున్నారు. ఈ పరిస్థితి అవినీతికి దారి తీస్తుంది.

ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలు గతంలో గ్రామాలుగా ఉండేవి. వీటిని పెద్ద రైతులు డబ్బులు పెట్టి కొని వ్యవసాయ క్షేత్రాలలో ఇళ్లు కట్టుకున్నారు, లేదా పెద్ద పెద్ద భవన నిర్మాణదారులు కొనుగోలు చేశారు. ఇది మాస్టరు ప్రణాళికకు అనుగుణంగా ఉండకపోవచ్చు. కొన్ని సందర్భాలలో పెద్ద సంఖ్యలో వలస వస్తున్న వాళ్లకు వసతి కల్పించటానికి గ్రామస్తులే తమ ఇళ్లల్లో మార్పులు చేశారు. కాలక్రమంలో ఇటువంటి కొన్ని కాలనీలకు ఆమోదం లభించింది. సాంప్రదాయ జీవనోపాధులైన పాలకోసం గేదెలను పెంచటం, మట్టికుండలు తయారుచేయటం వంటి సేవల అవసరం నగరాలకు ఉంది. కాబట్టి ఈనాటికీ నగరంలో కొంతమంది వీటిని కొనసాగిస్తున్నారు.

నగరంలో ఒకప్పుడు సాంప్రదాయంగా ఉమ్మడి భూములుగా ఉన్న ప్రాంతాలు బస్తీలుగా, మురికివాడలుగా ఆక్రమణకు గురయ్యాయి. ఇవి నదీ తీర భూములు కావచ్చు, లేదా అంతకు ముందు ఉండే పచ్చికబీళ్లు కావచ్చు. ఇవి స్థానిక సంస్థల కింద ఉండేవి. ఇక్కడ నివసించేవారు పేదవారుగా ఉంటారు. ఈ ప్రాంతాలలో సరైన బజారులు, మురుగునీటి వ్యవస్థ ఉండకపోవచ్చు. ఇక్కడ జనసాంద్రత కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో కొన్నింటిని చట్టపరంగా మురికివాడలుగా ప్రకటించారు, కొన్నింటిని ప్రకటించలేదు. అనేక సందర్భాలలో భూమి హక్కుకు సంబంధించి వివాదాలు తల ఎత్తేవి. ప్రజలు ఎంతో కాలంగా ఉంటున్న ప్రాంతంనుంచి పెద్ద పెద్ద భవన నిర్మాణదారులో లేదా స్వయంగా ఢిల్లీ అభివృద్ధి సంస్థో (డిడిఏ) ఖాళీ చేయించేవి. ఆ ప్రజలకు లభించే నష్టపరిహారం వాళ్లు తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్లటానికికానీ, లేదా నగరంలో అనుమతి ఉన్న ప్రాంతంలో నివాసం ఏర్పరచుకోటానికికానీ

సరిపోయేది కాదు. ఫలితంగా ప్రజలు ఒక ప్రాంతాన్ని ఖాళీచేసినప్పుడు గుర్తింపులేని మరొక ప్రాంతంలో భూమిని ఆక్రమించుకుంటారు. ప్రతిసారి ఇదే పరిస్థితి పునరావృతమౌతూ ఉంటుంది.

- మీరు నివసించే ప్రాంతాన్ని గత 10 సంవత్సరాల నుండి ఏ ఏ కారకాలు ప్రభావితం చేసాయో కనుక్కోండి.

## ఎటువంటి ప్రదేశాలు నివాస ప్రాంతాలుగా మారాయి?

దీనిని అర్థం చేసుకోటానికి మనం మూడు మౌలిక విషయాలను పరిశీలించాలి: (1) ప్రదేశం, (2) పరిస్థితి, (3) ఆ ప్రదేశం యొక్క చరిత్ర.

ప్రదేశం ఒక ప్రాంత లక్షణాలను తెలియచేస్తుంది – మిట్టపల్లాలు, సముద్రానికి ఎంత ఎత్తులో ఉంది, నీటి అంశాలు (చెరువులు, నదులు, భూగర్భజలాలు వంటివి ఉన్నాయా), నేల రకాలు, భద్రత, ప్రకృతి శక్తులనుంచి రక్షణ వంటివి.

ప్రాచీన కాలంలో నీటి సరఫరా బాగా ఉన్న ప్రదేశాలను, దండెత్తి వచ్చే శత్రువులనుంచి రక్షణనిచ్చే ప్రాంతాలను నివాసానికి ఎంపిక చేసేవాళ్ళు. ఉదాహరణకు ఛత్రపతి శివాజి మహారాష్ట్రలోని ప్రతాప్‌గఢ్ వద్ద కోట కట్టాడు. ఈ ప్రదేశం చాలా ఎత్తులో ఉండి చుట్టుపక్కల అన్ని ప్రాంతాలు కనిపిస్తాయి కాబట్టి దీనిని ఎంపిక చేశారు. దీనివల్ల దీనికి సైనికపరంగా భద్రత ఉంది.

ప్రాంతాలు ఒంటరిగా ఉండవు. ఏదో ఒక విధంగా వాటికి ఇతర ప్రదేశాలతో సంబంధం ఉంటుంది. 'పరిస్థితి' ఇతర ప్రదేశాలతో ఉన్న సంబంధాలను తెలియచేస్తుంది. ఉదాహరణకు,విశాఖపట్టణం తీరప్రాంతంలో ఉండి భారతదేశం లోపల, బయట అనేక ప్రదేశాలతో ఆంధ్రప్రదేశ్‌ని కలుపుతుంది.


చిత్రం 7.4: ప్రతాప్‌గఢ్‌లో కోట

విశాఖపట్టణానికి ఒక సుదీర్ఘ చరిత్ర ఉంది. వలస పాలకులకంటే ముందు అనేక వంశాలు దానిని పరిపాలించాయి. 19వ శతాబ్దంలో ఈ పట్టణంపై ఆధిపత్యం కోసం బ్రిటిషు, ఫ్రెంచ్ దేశాలు నావికా యుద్ధానికి దిగాయి. రేవులు నిర్మించే అవకాశం ఉండటం వల్ల వలస పాలకులు తీరప్రాంత ప్రదేశాలకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చారు. ఈ రేవుల ద్వారా కొల్లగొట్టిన ముడి సరుకును వలస పాలకులు తమ దేశాలకు తరలించవచ్చు.

ఆ విధంగానే ముంబయి, చెన్నై వంటి నగరాలను వలస పాలకులు భారతదేశ సహజ వనరులను కొల్లగొట్టటానికి మరింత అభివృద్ధి చేశారు. విశాఖపట్టణం కోసం పోరాటం కూడా ఈ కారణాల వల్లనే జరిగింది. అది బ్రిటిషువాళ్ల హస్తగతం అయిన తరువాత అది నిరంతరం పెరుగుతూ ఉండి, దాని సరిహద్దులు మారుతూ ఉన్నాయి.

*పట్టిక 2*

| విశాఖపట్టణం జనాభా | | |
|---|---|---|
| సంవత్సరం | జనాభా | మార్పు శాతంలో |
| 1901 | 40,892 | - |
| 1911 | 43,414 | +6.2% |
| 1921 | 44,711 | +3.0% |
| 1931 | 57,303 | +28.2% |
| 1941 | 70,243 | +22.6% |
| 1951 | 1,08,042 | +53.8% |
| 1961 | 2,11,190 | +95.5% |
| 1971 | 3,63,467` | +72.1% |
| 1981 | 6,03,630 | +66.1% |
| 1991 | 7,52,031 | +24.6% |
| 2001 | 13,45,938 | +123.0% |
| 2011 | 20,35,690 | +51.2% |



*చిత్రం 7.5 : విశాఖపట్టణం*

విశాఖపట్టణ జనాభా మార్పు

1. పక్కన ఇచ్చిన జనాభా వివరాలలో అన్ని దశకాల గణాంకాలు ఉన్నాయా? ఒకవేళ లేకపోతే ఏ దశకం గణాంకాలు ఇక్కడ లేవు?
2. ఏ దశకం నుంచి ఏ దశకానికి జనాభా పెరుగుదల (శాతంలో) అత్యధికంగా ఉంది?
3. ఏ దశకం నుంచి ఏ దశకానికి జనాభా పెరుగుదల (శాతంలో) అతి తక్కువగా ఉంది?
4. 1901-2011 విశాఖపట్టణం జనాభాకి లైన్ గ్రాఫ్ తయారుచేయండి. జనాభా సంఖ్యలో ఏ మార్పులను మీరు పరిశీలించారు?

శతాబ్దకాలంలో విశాఖపట్టణం జనాభా గణనీయంగా పెరిగింది (పట్టిక చూడండి). రేవు పట్టణంగా విశాఖపట్టణానికి ఉన్న ప్రాముఖ్యత వల్ల ఈ ప్రగతి సంభవించింది. ఈ జనాభా పెరుగుదల ఆర్థిక, సామాజిక అవకాశాలు పెరగటాన్ని కూడా సూచిస్తుంది.

పెద్ద పెద్ద రేవు పట్టణాలకు మాత్రమే ఇతర ప్రదేశాలతో సంబంధాలు ఉంటాయనుకోకూడదు. అన్ని ప్రదేశాలకు ఇతర ప్రదేశాలతో సంబంధాలు ఉంటాయి. ఈ సంబంధాలు ప్రత్యక్షమా, పరోక్షమా అన్నదాంట్లోనే తేడాలు ఉంటాయి.

గ్రామంలో వారం, వారం జరిగే సంత ఇతర ప్రదేశాలతో సంబంధానికి ముఖ్యమైన వేదికగా ఉంటుంది. ఈ వారపు సంత ఎంత పెద్దగా ఉంటే, ఆ ఊరు అంత పెద్దదన్నమాట. ఈ సంతలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తారు.

కొన్ని గ్రామాలలో వార్షిక సంత జరుగుతుంది. ఇక్కడ పెద్ద మార్కెటుతో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. నాటకాలు, సంగీతం, నాట్యం వంటి అనేక కార్యక్రమాలు ఇక్కడ జరుగుతాయి. వారపు, లేదా వార్షిక సంతలు ఆ ప్రాంత వృక్ష, పశు జన్యు సంపదకు చాలా కీలకమైనవి. ఇక్కడ స్థానిక విత్తనాలు, పశువుల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతాయి. ఈ సంతల వల్ల వేరువేరు గ్రామాల మధ్య వివాహ సంబంధాలు కూడా కుదురుతాయి.

ఇతర ప్రాంతాలతో మంచి అనుసంధానం ఉన్న (సాధారణంగా రోడ్డు రవాణా, నదుల ద్వారా, ఇతర సాధనాలు కూడా కొన్ని ప్రాంతాలలో ముఖ్యమైనవి) ప్రాంతాలలో మార్కెట్లు, సంతలు బాగా జరుగుతుంటాయి.

## ప్రదేశం, పరిస్థితుల పై సమీక్ష

నిలువ వరస 'అ'లో ఒక ప్రదేశం యొక్క అంశాలు ఉన్నాయి. 'ఆ' నిలువు వరసలో అది ప్రదేశానికి సంబంధించిన అంశమో, పరిస్థితికి సంబంధించిన అంశమో రాయండి. అది పరిస్థితికి సంబంధించిన అంశమైతే 'ఇ' నిలువు వరసలో దీని ప్రభావం ఎలా ఉంటుందో రాయండి.

| అ | ఆ | ఇ |
|---|---|---|
| 1. బంకమట్టి నేల | | |
| 2. వర్షపాతం చాలా ఎక్కువ | | |
| 3. దాని ప్రధానమైన మార్కెట్టు తీరానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉంది | | |
| 4. నేల చాలా తక్కువ వాలు కలిగి ఉంటుంది | | |
| 5. అది ప్రధాన రైలు మార్గంలో ఉంది | | |
| 6. ఆసుపత్రి లేదు | | |
| 7. వ్యవసాయ భూములు ఎక్కువ | | |
| 8. మొబైల్ టవర్లతో అన్ని ప్రదేశాలతో సంబంధం కలిగి ఉంది | | |
| 9. నది నుండి పదినిమిషాలు నడవాలి. | | |
| 10. ఒక వడ్ల మిల్లు ఉంది | | |

## క్షేత్ర పరిశీలన – మీ ప్రదేశంలోని నివాస ప్రాంతాన్ని అర్థం చేసుకోవటం

మీరు గీసిన పటంలో గుర్తించిన ఉత్పత్తి ప్రదేశాలలో (వ్యవసాయక్షేత్రాలు, కర్మాగారాలు, కార్యాలయాలు, దుకాణాలు, గనులు వంటివి) ఒకటి, రెండింటిని సందర్శించండి. వాళ్లకి కావలసిన ముడిసరుకులు/ ఉత్పాదకాలు ఎక్కడినుంచి వస్తాయో, ఉత్పత్తి చేసిన సరుకులు ఎక్కడ అమ్ముతారో తెలుసుకోండి. ఏ ముడిసరుకులు మీ నివాస ప్రాంతంనుంచి వస్తాయి? అదే విధంగా ఉత్పత్తి చేసిన సరుకులను మీ నివాస ప్రాంతంలోనే అమ్ముతున్నారో లేక ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారో (ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నట్లయితే, ఎక్కడికి పంపిస్తున్నారో) తెలుసుకోండి. ఇక్కడ ఉత్పత్తి ఎందుకు చేపట్టారు?

- ఈ ప్రాంతంలో ఉత్పత్తిని ప్రభావితం చేసిన ఆ ప్రదేశం అంశాలకు ఉదాహరణలు ఇవ్వండి.
- ఈ ప్రాంతంలో ఉత్పత్తిని ప్రభావితం చేసిన పరిస్థితి అంశాలకు ఉదాహరణలు ఇవ్వండి.
- ఉత్పత్తిని ఆ ప్రాంత చరిత్ర ఎలా ప్రభావితం చేసింది?

## నివాస ప్రాంతాలను ఎలా వ్యవస్థీకరిస్తారు?

నివాస ప్రాంతాల లక్షణాలలో వైవిధ్యత పెరుగుతున్నకొద్దీ వాటిల్లోని సంక్లిష్టత పెరుగుతుంది. కాలక్రమంలో వివిధ స్థాయిలలో ఉన్న (అంటే సంక్లిష్టతలో వివిధ స్థాయిలు) ప్రాంతాల మధ్య అనుసంధానం ఏర్పడింది.

అంటే మరింత సంక్లిష్ట అవసరాలకు పెద్ద ప్రాంతానికి వెళ్లాల్సి ఉంటుంది. ఉదాహరణకు పెద్దగ్రామం, లేదా చిన్న పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండవచ్చు. ఇక్కడ జలుబు, దగ్గు, ఫ్లూ, చిన్నగాయాల

వంటి చిన్న చిన్న సమస్యలకు చికిత్స లభిస్తుంది. అయితే చిన్న ఆపరేషను వంటి అవసరాలకు పెద్ద పట్టణానికి వెళ్లాల్సి రావచ్చు. అదే గుండె, లేదా మెదడు ఆపరేషనుకి, లేదా ఎంఆర్ఐ (శరీరంలోని అంతర్గత భాగాల చిత్రం తీసే విధానం) స్కాన్‌కి ఇటువంటి సాంకేతిక సదుపాయాలున్న పెద్ద నగరంలోని ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఉన్నత సాంకేతిక సదుపాయాలున్న ఆసుపత్రి సాధారణంగా మారుమూల గ్రామంలో ఉండదు.

- మీ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోండి...

ఒక ప్రాంతం ఎంత పెద్దగా ఉంటే అక్కడ అన్ని ఎక్కువ సేవలు లభ్యం అవుతాయి. ఉదాహరణకు విద్య సదుపాయాలను తీసుకోండి. దీని ద్వారా పెద్ద ప్రదేశాలలో (అంటే పై స్థాయిలో ఉన్న ప్రాంతాలలో) ప్రత్యేక సేవలు విరివిగా లభ్యమవడాన్ని గమనించవచ్చు.

1. మీ ప్రాంతంలో ఏ స్థాయివరకు విద్యా సదుపాయం ఉంది? ఉదా: ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్, కళాశాల విద్య (డిగ్రీ, పీజి).
2. మీ ఊరిలో ఉన్న సదుపాయానికి మించి మీరు చదువు కొనసాగించదలుచుకుంటే మీరు ఎక్కడికి వెళ్లవలసి వస్తుంది?
3. మీ ప్రాంతంలో ఎటువంటి వృత్తి విద్యాకోర్సులు ఉన్నాయి? ఉదా: ఇంజినీరింగ్, మెడిసిన్, కామర్స్, సాంకేతిక డిప్లొమా వంటివి.
4. మీకు వేరే వృతి విద్యలో ఆసక్తి ఉంటే మీరు ఎక్కడికి వెళ్లవలసి ఉంటుంది?

- అట్లాస్ పని...

మీ అట్లాస్‌లో భారతదేశ పటాన్ని చూడండి. వివిధ ప్రదేశాలను వివిధ ఆకృతులు, పరిమాణాలు ఉన్న గుర్తులతో సూచించటాన్ని గమనించండి. ఉదా: దేశ రాజధాని, రాష్ట్ర రాజధాని, ఇతర నగరాలు మొదలైనవి. వివిధ సంకేతాలను ఉపయోగించి ఎన్ని స్థాయిలను చూపించారు? చిన్న చిన్న గ్రామాలను అట్లాస్‌లో చూపించారా? మీరు సొంతంగా ఒక పట్టిక తయారుచేసి ప్రదేశాలను స్థాయిని బట్టి పైనుంచి కిందికి (అవరోహణ) క్రమంలో పేర్కొనండి. ఇక్కడ ఒక పట్టిక ఉదాహరణగా ఇచ్చాం. అందులో రెండు ప్రదేశాలు ఉన్నాయి. ఇతర ప్రదేశాలు ఇచ్చి వివరాలను నింపండి.

| స్థాయిలో స్థానం | ప్రదేశ రకం | పేరు | ఉపయోగించిన సంకేతం |
|---|---|---|---|
| 1 | దేశ రాజధాని | కొత్త ఢిల్లీ | నక్షత్రం |
| 2 | రాష్ట్ర రాజధాని | హైదరాబాదు | పెద్ద, నల్లటి చుక్క |
| 3 | | | |

- మీకు ఇష్టమైన ఒక దేశాన్ని ఎంచుకుని ఇదే రకమైన పట్టిక తయారు చెయ్యండి.

## భారతదేశంలో పట్టణీకరణ

భారతదేశంలో 35 కోట్లమంది ప్రజలు అంటే జనాభాలో మూడింట ఒక వంతు, నగరాలు, పట్టణాలలో నివసిస్తున్నారు. ప్రజలు ఎక్కువగా వ్యవసాయేతర పనులు చేపడుతూ నగరాలు, పట్టణాలలో నివాసం ఏర్పరచుకుంటున్నారు. దీనినే పట్టణీకరణ అంటారు. 1950లలో దేశంలోని అధిక శాతం జనాభా 5.6 లక్షల గ్రామాల్లో నివసిస్తుండేవాళ్లు. అప్పుడు 10 లక్షల జనాభా దాటిన నగరాలు అయిదే

ఉండేవి, లక్ష జనాభా దాటిన పట్టణాలు 40 ఉండేవి. ఈనాడు గ్రామాల సంఖ్య 6.4 లక్షలకు పెరిగింది, గ్రామీణ జనాభా 85 కోట్లుగా ఉంది. మూడు నగరాలలో– ముంబయి, ఢిల్లీ, కోల్‌కతాలలో ఒక్కొక్కదాని జనాభా కోటిని దాటింది. 10 లక్షల జనాభా దాటిన నగరాలు 50కి పైగా ఉన్నాయి.

పట్టణాలు, నగరాలలోని జనాభా పెరుగుదలలో అధిక భాగం సహజ వృద్ధి వల్ల జరిగింది. ఈ పట్టణాల జనాభా కాలక్రమంలో పెరిగింది. చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాలను కలుపుకోవటం వల్ల కొన్ని పట్టణాలు, నగరాలు విస్తరించాయి. జనాభా వృద్ధిలో అయిదింట ఒక వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణ ప్రాంతానికి వచ్చిన వలసల వల్ల సంభవించింది.

పట్టణీకరణ పెరుగుతున్నప్పటికీ ఇందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించబడటం లేదు. రోడ్లు, మురుగునీటిపారుదల, విద్యుత్తు, నీళ్లు, ఇతర ప్రజా సదుపాయాల అవసరం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలకు ప్రత్యేకించి రోడ్డు రవాణాను మెరుగుపరచటంలో ప్రభుత్వ జోక్యం కొంచెం ఫలితాలను సాధిస్తోంది. అయితే విద్యుత్తు, నీళ్లు, వైద్య సదుపాయాలు చాలినంతగా లేవు. పట్టణాలు, నగరాలలోని పేద ప్రజల పరిస్థితి ఈ విషయంలో మరీ దారుణంగా ఉంది.

భారతదేశ పట్టణ ప్రాంతాలు మనదేశ ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా దోహదం చేస్తున్నాయి? పారిశ్రామిక కార్యకలాపాల కంటే ఆర్థిక, బీమా, స్థిరాస్థి వంటి సేవా రంగం కార్యకలాపాలు, రవాణా, నిల్వ, సమాచార ప్రసారాల వంటి సేవల వాటా ఎక్కువగా ఉంది. గత కొన్ని దశాబ్దాలుగా పారిశ్రామిక ఉత్పత్తిలో చెప్పుకోదగ్గ ప్రగతి లేదు.

పట్టణాలు, నగరాలలో ఉండటం, అక్కడికి వలస పోవటం కొంతమందికే వరంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలో పేదరిక స్థాయి తక్కువగానే ఉన్నప్పటికీ అధిక ఆదాయం, తక్కువ ఆదాయం గల కుటుంబాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. ఈ వ్యత్యాసం పట్టణాలు, నగరాల్లో ఇంకా పెరుగుతోంది. పట్టణప్రాంతాలలో ఇతర కులాలవారితో పోలిస్తే షెడ్యూల్డు కులాలు/ జాతుల ప్రజల ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నాయి. 2009–10లో షెడ్యూల్డు కులాలు/ జాతులకు చెందని పట్టణప్రాంత ప్రజలలో పేదరికం ఆరింట ఒక వంతు ఉండగా, షెడ్యూల్డు కులాలు/ జాతుల ప్రజలలో అది అంతకు రెట్టింపుగా ఉంది. ఈ పేదలలో అధికశాతం మహానగరాలలో కాకుండా, వ్యవస్థీకృత రంగాలలో పని చేస్తున్నారు.

## భారతదేశ నివాస ప్రాంతాల స్థాయిలు

భారతదేశ జనాభా గణన కొన్ని ప్రామాణికాల ఆధారంగా నివాసప్రాంతాలను వర్గీకరిస్తుంది. జనాభా గణన శాఖ వివిధ నివాస ప్రాంతాలకు ఇచ్చిన నిర్వచనాలు పట్టిక 3లో ఉన్నాయి, వీటిని జాగ్రత్తగా చదివి ఈ అభ్యాసాన్ని పూర్తి చేయండి.

97వ పేజీలో ఒక పిరమిడ్ ఉంది. పిరమిడ్‌లోని కింది భాగం భారతదేశ జనాభా గణన ప్రకారం అతి చిన్న నివాస ప్రాంతాలను సూచిస్తుంది. పైభాగం అతిపెద్ద నివాస ప్రాంతాలను సూచిస్తుంది. కింద ఉన్న ఖాళీలను నింపండి:

1. ఒక ప్రత్యేక నివాస ప్రాంత స్థాయికి ఇచ్చిన పేరు (రెండు ఉదాహరణలు ఉన్నాయి).
2. వివిధ నివాస ప్రాంతాలకు ఒక ఉదాహరణను ఆంధ్రప్రదేశ్ నుంచి పేర్కొనండి (మహా నగరాలవి కాకుండా. ఎందుకు?)

*పట్టిక 3 : స్థాయీ క్రమంలో భారతదేశ నివాస ప్రాంతాలు*

| నివాస ప్రాంత రకం | ఉపయోగించిన ప్రామాణికాలు | ఉదాహరణలు |
|---|---|---|
| మహానగరాలు (Mega cities) | కోటి జనాభాకి మించి ఉన్న నగరాలు | ● ముంబయి మహానగర ప్రాంతం (1.84 కోట్లు)<br>● ఢిల్లీ మహా నగరం (1.63 కోట్లు)<br>● కోల్‌కతా మహా నగరం (1.41 కోట్లు) |
| మెట్రోపాలిటన్ నగరాలు/పదిలక్షలు దాటిన నగరాలు | పది లక్షలు – కోటి మధ్య జనాభా ఉన్న నగరాలు | ● చెన్నై (86 లక్షలు)<br>● హైదరాబాదు (78 లక్షలు)<br>● అహ్మదాబాదు (62 లక్షలు) |
| క్లాస్ 1 నగరాలు | ఒక లక్ష– పది లక్షల మధ్య ఉన్న పట్టణ ప్రాంతాలు | ● మీ టీచరు సహాయంతో ఈ కోవలో ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు నగరాలను గుర్తించి వాటి జనాభా ఇవ్వండి. |
| పట్టణాలు | 5000 నుంచి ఒక లక్ష మధ్య గల జనాభా ఉన్న పట్టణ ప్రాంతాలు | ● మీ టీచరు సహాయంతో మీ చుట్టుపక్కల ప్రాంతంలో ఇటువంటి 3 పట్టణాలను పేర్కొని వాటి జనాభా ఇవ్వండి. |
| రెవెన్యూ గ్రామాలు | నిర్దిష్ట సరిహద్దులు ఉన్న గ్రామం | ● మీ టీచరు సహాయంతో మీ చుట్టుపక్కల ప్రాంతంలో ఇటువంటి 3 గ్రామాలను పేర్కొని వాటి జనాభా ఇవ్వండి. |
| ఆవాస ప్రాంతాలు | రెవెన్యూ గ్రామం లోపల కొన్ని (హామ్లెట్) ఇళ్ల సముదాయం | ● మీ రెవెన్యూ గ్రామాలు లేదా చుట్టుపక్కల ఉన్న రెవెన్యూ గ్రామాలలో ఒకటి, రెండు హామ్లెట్లను మీ టీచరు సహాయంతో గుర్తించండి. |

3. మీరు నివసించే పట్టణం ఏ స్థాయిలో ఉందో సూచించండి (మీరు గ్రామంలో ఉంటుంటే మీరు చదివే పాఠశాల ఉన్న పట్టణాన్ని తీసుకోండి). కింద ఖాళీలు ఉన్నాయి. మీ నిర్ణయానికి ఒకటి లేదా రెండు కారణాలు పేర్కొనండి.

4. నివాస ప్రాంతాలను కేవలం జనాభా ఆధారంగానే వర్గీకరించాలా? ఆలోచించండి. ఇతర విధానాలు ఏవైనా ఉన్నాయా? మీ టీచరుతో చర్చించి అటువంటి వర్గీకరణకు ప్రామాణికాలను గుర్తించండి.

భారతదేశం 'ఆర్థికంగా అభివృద్ధిచెందిన' దేశాల పంథాను అనుసరించి భవిష్యత్తులో అధిక శాతం జనాభా పట్టణాల్లో ఉండవచ్చు.



## విమానాశ్రయ నగరాలు (ఏరోట్రొపొలిస్) – జెట్‌యుగపు నగరాలు

భారతదేశంతో సహా అనేక దేశాలలో కొత్త రకపు నివాసప్రాంతాలు ఏర్పడుతున్నాయి. ఈ నివాస ప్రాంతాలు పెద్ద పెద్ద విమానాశ్రయాల చుట్టూ ఏర్పడుతున్నాయి. అందుకనే వీటిని విమానాశ్రయ నగరాలు (లేదా ఏరోట్రొపొలిస్) అంటున్నారు.

విమానాశ్రయ నగరాలలో విమానాశ్రయమే ఒక నగరంగా పనిచేస్తుంది. అనేక సదుపాయాలు (హొటళ్లు, దుకాణాలు, వినోదం, ఆహారం, వ్యాపార సమావేశ సదుపాయాల వంటివి) అక్కడ కల్పిస్తారు. ఇతర ప్రాంతాలనుంచి ప్రజలు విమానాలలో వచ్చి తమకు అవసరమైన వాళ్లతో అక్కడే వ్యవహారాలు పూర్తి చేసుకుని తిరిగి విమానాల్లో వెళ్లిపోతారు. ట్రాఫిక్ వంటి సమస్యలు ఏమీ లేకుండా నగరంలోని సదుపాయాలన్నింటినీ పొందుతారు.

- విమానాశ్రయ నగర కేంద్రకం ఏమిటి?
- విమానాశ్రయ నగర కేంద్రంలో, లేదా దాని దగ్గర ఉండే రెండు సదుపాయాలను పేర్కొనండి.
- ప్రపంచ పటంలో పక్కన ఉదాహరణగా ఇచ్చిన నగరాలను గుర్తించండి. విమానాశ్రయాలు, దేశాల పేర్లను కూడా పటంలో వేరు వేరుగా రాయండి. దీనివల్ల ఏవి దేశాలో, ఏవి నగరాలో, ఏవి విమానాశ్రయాలో గుర్తించటం తేలిక అవుతుంది.
- ఈ అధ్యాయం కోసం మీరు అధ్యయనం చేసిన ప్రదేశానికి దగ్గరలో విమానాశ్రయ నగరం ఏర్పడిందని ఊహించుకోండి. అప్పుడు ఆ ప్రాంత స్థలంలో వచ్చే మూడు మార్పులను పేర్కొనండి. అదేవిధంగా ఆ ప్రాంత పరిస్థితులలో వచ్చే మూడు మార్పులను పేర్కొనండి.

భారతదేశంలో రూపుదిద్దుకుంటున్న విమానాశ్రయ నగరాలు కొన్ని: బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయం, ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఢిల్లీ), రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (హైదరాబాదు).

ఇతర దేశాలలో ఏర్పడుతున్న విమానాశ్రయ నగరాలకు ఉదాహరణలు: సువర్ణభూమి అంతర్జాతీయ విమానాశ్రయం (బ్యాంకాక్, థాయ్‌లాండ్), దుబాయి అంతర్జాతీయ విమానాశ్రయం (దుబాయి, యు.ఎ.ఇ.), కైరో అంతర్జాతీయ విమానాశ్రయం (కైరో, ఈజిప్టు), లండన్ హీత్రో విమానాశ్రయం (లండన్, యుకె).

## పట్టణీకరణ సమస్యలు

పట్టణీకరణ పెరగటమంటే ప్రజల అవకాశాలు పెరగటం, ఆర్థిక కార్యకలాపాలు పెరగటం వంటివి ఒక్కటే కాదు. దాని వల్ల ఎన్నో సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. పెరుగుతున్న పట్టణ జనాభాకు గృహవసతి కావాలి. వాళ్లకి నీటి సరఫరా ఉండాలి, మురుగునీరు, ఇతర వ్యర్థ పదార్థాలు తొలగించే విధానం ఉండాలి. వీటన్నిటివల్ల పర్యావరణంపై ఒత్తిడి పెరుగుతుంది.

*చిత్రం 7.6 ఢిల్లీలో తక్కువ ఆదాయ ప్రజల నివాసాలు*



వాహనాల వినియోగం పెరగటం వల్ల పట్టణాలలో వాయు కాలుష్యం పెరుగుతుంది. ఇది ఆరోగ్య సమస్యలకు, స్థానికంగా వాతావరణ మార్పులకు దారి తీస్తుంది. మురుగునీటి తొలగింపు సరిగా లేకపోతే అది ఎన్నో అంటువ్యాధులకు దారితీయవచ్చు.

పట్టణీకరణ పెరగటంలోని ఒక సమస్య భూమిలో కలిసిపోని, లేదా కుళ్లిపోవటానికి ఎక్కువ సమయం పట్టే పదార్థాల వినియోగం పెరగటం. దీనివల్ల ఎంతో చెత్తను తొలగించాల్సి ఉంటుంది. ఈ చెత్తని ఎక్కడ వెయ్యాలి? పట్టణ ప్రాంతాలు విస్తరిస్తూ ఉండటంతో వీటిని చెత్త శుద్ధి కర్మాగారాలకు తీసుకెళు తున్నారు లేదా గ్రామీణ ప్రాంతాలలో పడేస్తున్నారు. కింద ఉదాహరణను చూడండి.

### ఘన వ్యర్థ పదార్థాల శుద్ధి కర్మాగారాన్ని వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

స్టాఫ్ రిపోర్టర్, ది హిందూ, బరంపురం, డిసెంబరు 11, 2012

బరంపురం నగరపాలిక సంస్థ (బిఎంసి) ప్రతిపాదించిన ఘన వ్యర్థపదార్థ శుద్ధి కర్మాగారానికి మరొక అవాంతరం ఎదురయ్యింది.

తమ గ్రామం వద్ద ఈ చెత్త శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయటాన్ని మొహుదా ప్రాంత గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. మొహుదా వద్ద ఈ చెత్త శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలోని 30,000 ప్రజలే కాకుండా, పదివేల పశువులు కూడా ప్రభావితం అవుతాయని ఆందోళన కారులు పేర్కొంటున్నారు.

ఈ విషయంలో వాళ్లు ప్రభుత్వ అధికారులకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. బిఎంసి ప్రతిపాదిస్తున్న చెత్త శుద్ధి కర్మా గారంపై మొహుదా పంచాయితీ సర్పంచ్ అయిన సాధనా మొహంతితో పాటు ఈ ప్రాంతం లోని కొన్ని విద్యా సంస్థలు కూడా తమ ఆందోళనను వ్యక్తపరిచాయి.

అంతకు ముందు ఈ చెత్త శుద్ధి కర్మాగారాన్ని నగర శివార్లలోని చందానియా కొండ పైన ఏర్పాటు చెయ్యాలని ప్రతి పాదించారు. దీనికోసం 20 ఎకరాల స్థలం కూడా కేటాయించారు.

**సరిహద్దు గోడ:** బరంపురం నగరపాలిక సంస్థ ప్రకారం ఈ భూమిచుట్టూ 50 లక్షల రూపాయల ఖర్చుతో ప్రహరీ గోడ కూడా కట్టారు.

అయితే చందానియా కొండప్రాంతం అటవీ భూమి కిందకి వస్తుందని గుర్తించారు. ఈ భూమిని రెవెన్యూ శాఖకు బదిలీ చేసి, తరువాత బరంపురం నగరపాలిక సంస్థకు బదిలీ చేస్తే తప్పించి చెత్త శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పడానికి లేదు.

దాంతో నగరం బయట ప్రతిపాదిత చెత్త శుద్ధి కర్మాగారం కోసం భూమికోసం వెదకసాగారు. దీనికోసం మొహుదా గ్రామం దగ్గర ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు.

అయితే ఈ ప్రాంత రైతులు, ప్రజలు మొదటిరోజునుంచే ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు.

2009లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం బరంపురంలో ప్రతి రోజూ 150 టన్నుల ఘన వ్యర్థ పదార్థాలు ఉత్పన్నం అవుతున్నాయి.

గత మూడు సంవత్సరాలలో ఉత్పత్తి అవుతున్న చెత్త పెరిగి ఉండవచ్చని నగరపాలిక సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. నగర ప్రజల జీవనశైలి మారుతూ ఉండటంతో ఘన వ్యర్థ పదార్థాలలో కూడా తేడా వస్తుంది.

**సర్వే:** నగరంలో ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థపదార్థాలను అంచనా వేయడానికి ఫిబ్రవరిలో ఒక సర్వే నిర్వహించారు.

బరంపురం నగరపాలక సంస్థ ఏర్పాటు చెయ్యనున్న ఈ ఘన వ్యర్థ పదార్థ శుద్ధి కర్మాగారానికి అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐఎఫ్‌సి) సాంకేతిక, విధాన పర మద్దతు అందిస్తోంది.



చిత్రం 7.7: ముంబయిలో మురికివాడలు, 1940 నాటి ఫోటో. నగరంలో ఈనాటికీ పెద్ద పెద్ద మురికివాడలు ఉన్నాయి.

- మీ అట్లాసు ఉపయోగించి బరంపురాన్ని గుర్తించండి.
- మొహుదా గ్రామ ప్రజలు ఏ విషయం పట్ల ఆందోళన చెందుతున్నారు?
- చెత్త శుద్ధి కర్మాగారం వల్ల ఎంత మంది ప్రజలు, పశువులు ప్రభావితం కానున్నారు?
- చెత్త శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పటానికి గుర్తించిన ఇతర ప్రదేశం ఏది? దానిని ఎందుకు ఉపయోగించుకోలేదు?
- సర్వే నివేదిక ప్రకారం బరంపురం ఎంత ఘన వ్యర్థ పదార్థాలను ఉత్పత్తి చేసింది?
- బరంపురం నగరపాలక సంస్థ అధికారులు "గత మూడు సంవత్సరాలలో ఉత్పత్తి అవుతున్న చెత్త పెరిగి ఉండవచ్చని" అంటున్నారు. వీళ్ల అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తున్నారా, లేదా? మీ కారణాలు పేర్కొనండి.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| నివాస ప్రాంతం | స్థలం | పరిస్థితి | పట్టణ |
| గ్రామీణ | తరతమస్థాయి | మహానగరాలు | విమానాశ్రయనగరాలు |
| పట్టణీకరణ | మెట్రోపాలిటన్ నగరం | | సాంప్రదాయ జీవనోపాధులు |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. నివాస ప్రాంతం అంటే ఏమిటి?
2. స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవటంతో మానవ జీవనశైలి ఎలా మారింది?
3. ప్రదేశం, పరిస్థితి అంశాలను నిర్వచించండి. మీరు ఉంటున్న ప్రాంతంనుంచి ఒకొక్క ఉదాహరణ ఇవ్వండి.
4. వివిధ ప్రాంతాలను భారతదేశ జనాభా గణన విభాగం ఎలా నిర్వచిస్తోంది? పరిమాణం, ఇతర అంశాల రీత్యా వాటిని ఎలా వ్యవస్థీకరిస్తోంది?
5. విమానాశ్రయ నగరం అంటే ఏమిటి? దాని నిర్మాణ స్వరూపం ఏమిటి?

పాఠం 8

# ప్రజలు, వలసలు

## రామయ్య – హైదరాబాదుకి వలస వచ్చిన ఒక టీచరు

మా తల్లిదండ్రులు, తాత, నానమ్మ చాలా సంవత్సరాలు నల్గొండ జిల్లా చిట్యాల మండలంలో మొగిలిదోరి గ్రామంలో ఉండేవాళ్లు. వాళ్లు సాగునీటికి బోరు బావులపై ఆధారపడి ప్రధానంగా వరి, ప్రత్తి పంటలు పండించేవాళ్లు.

హైదరాబాదు నుంచి మొగిలిదోరి 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊళ్లో 700–800 జనాభాతో 150 ఇళ్లు ఉన్నాయి. ఇక్కడి అనేక కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. నా చిన్నతనంలో మొగిలిదోరి నుంచి హైదరాబాదు వెళ్లటానికి రోడ్లు, బస్సు సౌకర్యం ఉండేది కాదు. 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్గొండకి వెళ్లటానికి కూడా సరైన సదుపాయాలు ఉండేవి కావు.

1970లలో మా ఊరికి 1–3 తరగతులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వచ్చింది (ఇప్పుడు దీంట్లో అయిదవ తరగతి వరకు ఉంది). నేను 1 నుంచి 3వ తరగతి వరకు మొగిలిదోరిలో చదువుకున్నాను. తరువాత దగ్గర గ్రామమైన చిన్నకాపర్తిలో 4నుంచి 7వ తరగతి వరకు చదివాను.

8నుంచి 10వ తరగతి వరకు మొగిలిదోరికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దకాపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లాను. ఆ సమయంలో నేను ప్రభుత్వ వసతిగృహంలో ఉండి చదువుకున్నాను. ఆ తరువాత ఇంటర్మీడియట్, టీచరు ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులను హైదరాబాదులోని ప్రభుత్వ విద్యా సంస్థలలో పూర్తి చేశాను. ఈ కోర్సుకి దరఖాస్తు చేయడంలో ఒక మిత్రుడు సహాయం చేశాడు, అంతేకాదు హైదరాబాదులో ఎక్కడ ఉండాలో సలహా ఇచ్చాడు.

నాకు 1983లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. మొగిలిదోరికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంతంగి (ఇది కూడా నల్గొండ జిల్లాలోనే ఉంది) నా తొలి నియామకం. రెండు సంవత్సరాల తరువాత నన్ను మరో ఊరి పాఠశాలకు బదిలీ చేశారు. అక్కడ నేను 5½ సంవత్సరాలు పనిచేశాను. ఈ కాలంలో నా భార్య, పిల్లలతో నేను పంతంగి లేదా చౌటుప్పల్‌లో ఉండేవాడిని. నేను రోజూ నా పని చేసే ప్రదేశానికి వెళ్లి, వస్తుండేవాడిని. 2004 సంవత్సరంలో మా కాపురం హైదరాబాదుకి మార్చాం. గత 10 సంవత్సరాలుగా మేం వ్యవసాయం చెయ్యటం లేదు. అంతకు ముందు మేం ఉపయోగించిన బావి ఇప్పుడు ఎండిపోయింది. మొగిలిదోరిలో ఉంటున్న మరొక వ్యక్తికి భూమిని కౌలుకి ఇచ్చాం. అతడు మాకు కొంత డబ్బులు ఇచ్చి, పత్తి సాగు చేస్తాడు. నా బాల్యంలో భూమి ఉన్న చాలా కుటుంబాలు ప్రస్తుతం పట్టణాలకు వలస వచ్చాయి. అప్పుడు వ్యవసాయ కూలీలుగా ఉన్న కుటుంబాలు ఇప్పుడు భూమిని కౌలుకి తీసుకుని సాగు చేస్తున్నాయి.


*చిత్రం 8.1:*

- హైదరాబాదు నగరంతో పాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను చూపించే పటం గీయండి. ఈ ఉదాహరణలలోపేర్కొన్న గ్రామాలను కలుపుతూ బాణం గుర్తులు గీయండి.

ఈ టీచరే కాదు వందలాది, వేలాది ప్రజలు విద్య, ఉపాధి, మెరుగైన అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళుతున్నారు. వలస వెళ్లటానికి కొంత మద్దతు అవసరమవుతుంది. కాలక్రమంలో ప్రజలు కొత్త ప్రదేశాలకు వెళతారు, కొత్త వాళ్లతో సంబంధాలు ఏర్పరచుకుంటారు, భిన్న సంస్కృతులను అర్థం చేసుకుని అందులో జీవిస్తారు.

## వలస తీరులను వర్గీకరించడం, కొలవడం

వివిధ ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాల వల్ల వలసలు వెళుతుంటారు. ఒక వ్యక్తిని వలస వెళ్లిన వాళ్లుగా గుర్తించడానికి జనాభా గణన వాళ్లు రెండు ప్రామాణికాలను ఉపయోగిస్తున్నారు:

- "జన్మస్థానం" – ఒక వ్యక్తి పుట్టిన ప్రదేశం
- "ఇంతకుముందు నివాసం ఉన్న స్థలం" – ఒక వ్యక్తి ఆరు నెలలు లేదా అంతకు మించి ఎక్కువకాలం పాటు ఉన్న ప్రదేశం

- ఇక్కడ కొంతమంది జాబితా ఉంది. వాళ్లని వలస వెళ్లిన వాళ్లు, వెళ్లని వాళ్లుగా వర్గీకరించండి. వలస తీరుని పేర్కొని, వలసకు కారణం ఏమై ఉంటుందో చెప్పండి.

| పేరు | గత ఆరు నెలలుగా ఉంటున్న ప్రదేశం | పుట్టిన ఊరు | వలస వచ్చారా, లేదా | వలస తీరు: గ్రామీణ నుంచి పట్టణానికి, పట్టణం నుంచి గ్రామానికి, వగైరా, కారణం |
|---|---|---|---|---|
| సింధు | రాజమండ్రి | తూర్పుగోదావరి జిల్లాలో ఒక గ్రామం | | |
| గ్రేస్ ఓవియా | హైదరాబాదు | విజయవాడ | | |
| అలీ | కొత్త ఢిల్లీ | లండన్ | | |
| రామయ్య | హైదరాబాదు | మొగిలిదోరి | | |
| లక్ష్మి | తిమ్మాపురం (2 నెలలనుంచే) | నెల్లూరు జిల్లాలో కోదండరామపురం | | |
| స్వాతి | కరీంనగర్ జిల్లాలో గట్ల నర్సింగాపూర్ | విజయవాడ | | ఎపిపిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణత |

భారతదేశంలో 2001 జనాభా లెక్కల ప్రకారం 30.7 కోట్లమంది వలస వెళ్లారు. అనేక కారణాల వల్ల వలసలు జరగవచ్చు. ఆడవాళ్లలో వలస వెళ్లటానికి వివాహం ప్రధాన కారణం కాగా మగవాళ్లలో ఉపాధి లేదా ఉపాధికోసం అన్వేషణ ప్రధాన కారణం. ఉన్న ఊరిలోని ఉపాధి అవకాశాలపై అసంతృప్తి, విద్యకు మెరుగైన అవకాశాలు, వ్యాపారంలో నష్టాలు, కుటుంబ తగాదాలు వంటివి జనగణన సర్వేలో ప్రజలు వలసకు కారణాలుగా పేర్కొన్నారు.

వలస వెళ్లే వాళ్లలో అధిక శాతం తక్కువ దూరమే వెళతారు. 30.7 కోట్ల వలస వ్యక్తులలో 25.9 కోట్ల మంది (84.2%) రాష్ట్రంలోని ఒక భాగం నుంచి మరొక భాగానికి, అంటే ఒక పల్లె లేదా పట్టణం నుంచి మరొక పల్లె లేదా పట్టణానికే వెళ్లారు. వలస వెళ్లిన వాళ్లలో 13% ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లారు (కింది పట్టిక చూడండి).

*పట్టిక 1 : భారతదేశంలో వలస (2001 జనాభా లెక్కలు)*

| వర్గీకరణ | ప్రజల సంఖ్య | శాతం | శాతాన్ని లెక్కించే సూత్రం | వివరణలు |
|---|---|---|---|---|
| మొత్తం జనాభా | a.1,028,610,328 | | | |
| మొత్తం వలస | b.307,149,736 | 29.9 | (b÷a) × 100 | మొత్తం వలస శాతం, జన్మస్థలం నుంచి |
| రాష్ట్రంలోనే వలసపోయినవారు | c. 258,641,103 | 84.2 | (c÷b) × 100 | జన్మించిన రాష్ట్రంలోనే వలస వెళ్ళినవారు |
| రాష్ట్రం బయటినుంచి వలస వచ్చిన వారు | d.? | 13.8 | (d÷b) × 100 ? | |
| ఇతర దేశాల నుంచి వలస వచ్చిన వారు | e. 6,166,930 | 2.0 | (e÷b) × 100 ? | |
| | | | | |

- పై పట్టిక మరొకసారి చదివి ఖాళీలను పూరించండి.

ఇక్కడ మూడు పటాలు ఉన్నాయి. భారతదేశంలో ఉత్తర, తూర్పు, పడమర, దక్షిణ ప్రాంతాల మధ్య వలసలను ఈ పటాలు చూపిస్తాయి. గత దశాబ్దంలో (2001-2011) ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, జార్ఖండ్ ఒడిశా, ఉత్తరాఖండ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, పంజాబ్, కర్నాటక రాష్ట్రాలకు వలస వెళ్లారు. భారతదేశ రాజకీయ పటంలో ఇటీవల వలసలను గుర్తించండి. ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి వలస వెళ్లేవాళ్లలోని సారూప్యాలు, తేడాలను తరగతి గదిలో చర్చించండి.

పటం 1: పట్టణం నుంచి పట్టణానికి అంతర రాష్ట్ర నికర వలస అంచనా, పట్టణ అంతర రాష్ట్ర వలస 2001–2011




పటం 2: గ్రామీణం నుంచి పట్టణానికి అంతర రాష్ట్ర నికర వలస అంచనా, పట్టణ అంతర రాష్ట్ర వలస 2001–2011



- పటం 1లో ఉత్తరప్రదేశ్, బీహార్‌ల నుండి ఢిల్లీ నగరానికి వలసపోయిన వారి సంఖ్యని అంచనావేయండి.
- పటం 2లో కర్ణాటక నుండి ఆంధ్రప్రదేశ్‌కు గ్రామాల నుండి పట్టణాలకు వలసపోయిన వారి సంఖ్యను అంచనావేయండి.
- పటం 3ను పరిశీలించి తమిళనాడు రాష్ట్రంలో అంతర, బాహ్య వలసలకు కారణాలు కనుగొనండి.

*పటం 3: ప్రధాన అంతర రాష్ట్ర వలస మార్గాల అంచనా: 2001-2011*




*గమనిక: ఈ పటంలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాలు ఇవ్వబడలేదు.*

## గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస

గ్రామీణ ప్రాంతాలలో తగినన్ని ఉపాధి అవకాశాలు లేనందున, గ్రామీణ ఉపాధిలో తగినంత ఆదాయం లేనందున ప్రజలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళు తున్నారు. కుటుంబ సభ్యులకు మరిన్ని అవకాశాలు, అధిక ఆదాయాలు, మెరుగైన సేవలు ఉంటాయన్న ఆశతో ప్రజలు వలస వెళతారు. రామయ్యకు వ్యవస్థీకృత రంగంలో పని దొరికింది. కానీ, పట్టణాలకు వలస వెళ్లేవాళ్లల్లో చాలామంది కూలీలుగా పని చెయ్యాల్సి వస్తుంది, అదీ అవ్యవస్థీకృత రంగంలో ఉపాధిని వెదుక్కోవలసి ఉంటుంది. వాళ్లు బజారులో తిరుగుతూ సరుకులు అమ్ముతుండవచ్చు, పెయింటర్లు, మరమ్మతులు చేసేవాళ్లు, రిక్షా తోలేవాళ్లు, భవన నిర్మాణ కార్మికులు కావచ్చు.

- పట్టణంలో అసంఘటిత రంగంలో రోజుకూలీగా లేదా ఇంటిపనులు చేసే మహిళగా పట్టణానికి వలస వచ్చిన ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేసి ఆమె కథ రాయండి (పైన ఇచ్చిన రామయ్య కథనాన్ని చూడండి).
- మీరు గ్రామీణ ప్రాంతంలో ఉంటుంటే పట్టణంలో అసంఘటిత రంగంలో పని చేస్తూ పండగకు ఊరొచ్చిన ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేసి అతడి కథ రాయండి (పైన ఇచ్చిన రామయ్య కథనాన్ని చూడండి).
- ఈ రెండు పరిస్థితుల మధ్య పోలికలు, తేడాలు పేర్కొనండి.

ఆదాయం పెంచుకోటానికి, కుటుంబ అవకాశాలు మెరుగు పరుచుకోవటానికి గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలు, నగరాలలో పరిశ్రమలు, సేవా రంగాలలో పని చేయుటానికి వలస వెళ్లటం కొంతమందికి సహజ స్పందనగా పరిగణిస్తారు. ఈ ప్రక్రియలో వాళ్లకు చదువుకోటానికి, కొత్త ఉద్యోగాలు చెయ్యటానికి, కొత్త నైపుణ్యాలను నేర్చుకోటానికి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా లింగ, కుల ఆధారిత వివక్షత పట్టణ ప్రాంతాలలో తక్కువగా ఉండి వాళ్లకు అధిక స్వేచ్ఛను ఇస్తున్నట్లు ఉంటాయి. అయితే చాలామంది గ్రామీణ ప్రాంతాలలో చాలినంత ఉపాధి దొరకక తప్పనిసరి అయి పట్టణాలకు వలస వెళతారు. ఇటువంటి ప్రజలకు పట్టణాలు, నగరాలలోని మురికివాడలలో తగినంత చోటు లేక, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు లేక పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఇటువంటి వాళ్లకు 'వ్యవస్థీకృత రంగం'లో పని దొరకటం కష్టం. కాబట్టి వీళ్లు ఆశించిన ఉద్యోగ భద్రత ఉండదు, మెరుగైన ఆదాయం ఉండదు. వాళ్లు రోజుకూలీలుగా బతుకులు ఈడుస్తుంటారు.

చాలా మందికి తమ స్వగ్రామంలోనూ, వలస వెళ్లిన ప్రాంతంలోనూ ఇళ్లు ఉంటాయి. వివిధ కాలాల్లో పనిని బట్టి వాళ్లు ఈ రెండు ప్రదేశాల మధ్య తిరుగుతుంటారు. వలస వెళ్లారంటే మొత్తం కుటుంబం వలస వెళ్లాలని లేదు, సాధారణంగా భార్య గ్రామీణ ప్రాంతంలో ఉండిపోతుంది.

వలస వెళ్లిన వాళ్లు ఇంటికి పంపించే డబ్బు గ్రామీణ ప్రాంతంలో ఉండిపోయిన కుటుంబానికి అదనపు ఆదాయంగా ఎంతో ముఖ్యమైనది. గ్రామీణ కుటుంబ సభ్యుల అవసరాన్ని బట్టి ఇంటికి పంపించే డబ్బు ఆధారపడి ఉంటుంది, పట్టణ ప్రాంతంలో కొనసాగాలన్న ఒత్తిడి ఉంటుంది. వలస వచ్చిన వాళ్లు ఊళ్లోని తమ ఇల్లు, భూములపై హక్కులను కాపాడుకోటానికి గ్రామీణ ప్రాంతాలతో తమ ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తారు. గ్రామీణ ప్రాంతంలో ఉండిపోయిన కుటుంబ సభ్యులు పట్టణానికి వలస వచ్చిన వాళ్లకు చాలా ముఖ్యం. వాస్తవానికి కుటుంబ సభ్యులు వలస వెళ్లాలో, వద్దో కుటుంబమే నిర్ణయిస్తుంది.

తమ విద్యా, నైపుణ్యతలను బట్టి పట్టణాలకు వలస వచ్చిన వాళ్లు ఉపాధికి రక రకాల పద్ధతులు ఉపయోగిస్తారు. పట్టణాలలో ఉద్యోగాలు దొరకటానికి పరిచయాలు, సంబంధాలు చాలా కీలకమైనవి. ఒక్కొక్కసారి తమ పరిచయాలు, సంబంధాల ద్వారా ముందుగా ఉద్యోగం దొరకబుచ్చుకున్న తరువాతే గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వస్తారు. అనేక కారణాల వల్ల వాళ్లు తమ గ్రామీణ ప్రాంతాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుంటారు. వలస వెళ్లిన వాళ్లు పట్టణ అవకాశాలను గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేస్తుంటారు, దీని వల్ల వలస వెళ్లాలనుకుంటున్న వాళ్లు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉద్యోగాల కోసం అన్వేషించవచ్చు. అనేక సందర్భాలలో, అనేక కుటుంబాలకు వలస అనేది వాళ్ల మనుగడను ఎంచుకునే విధానం అవుతుంది.

భారతదేశంలో 1961–2011ల మధ్య అయిదు దశాబ్దాల కాలంలో పట్టణాలు, నగరాలలో పెరిగిన జనాభాని గ్రాఫ్ 1లోని బార్ చార్ట్ చూపిస్తుంది. 1961–71ల మధ్య పట్టణ ప్రాంతాల జనాభా 3 కోట్లు పెరిగింది. ఈ పెరుగుదలలో 60 లక్షలు లేదా అయిదింట ఒక వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణాలకు వచ్చే ప్రజల వలస వల్ల పెరిగింది. పట్టణాల్లో ఉంటున్న ప్రజల సహజ పెరుగుదల వల్ల పట్టణ జనాభాలో అధికశాతం వృద్ధి ఉంది. పట్టణ ప్రాంతాల జనాభా పెరగటానికి మూడవ కారణం విస్తరణ ప్రభావం, కొన్ని గ్రామీణ ప్రాంతాలు పెరిగి పట్టణ ప్రాంతాలవుతాయి.

- పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు దొరకటానికి పరిచయాలు, సంబంధాలు ఎందుకు అవసరం?




*గ్రాఫ్ 1 : 1961–2011ల మధ్య భారతదేశంలో పట్టణ జనాభా పెరుగుదల*

సహజ పెరుగుదల

గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా ప్రకటించటం వల్ల, పట్టణ ప్రాంతాల విస్తరణ వల్ల

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లటం వల్ల

ప్రతి దశాబ్ద కాలానికి పట్టణ జనాభాలో ఎంతమంది వచ్చి చేరారో, ప్రతి సమూహం యొక్క జనాభాశాతాన్ని లెక్క కట్టండి. ప్రతి బుల్లెట్ పాయింట్‌కి కొన్ని వాక్యాలను రాయండి. కింది ఉదాహరణను పరిశీలించండి.

- 2001–2011 మధ్యకాలంలో పట్టణ జనాభా 9.1 కోట్లు (40+29+22) పెరిగింది. శాతాలలో చూస్తే పెరుగుదలలో 44% సహజ పెరుగుదల వల్ల, 32% పట్టణ ప్రాంతాల విస్తరణ వల్ల, 24% వలస వల్ల జరిగింది.

- 1961-2011 మధ్యకాలంలో వలసల ప్రభావాన్ని చూపటానికి ఒక పట్టిక తయారు చేయండి.
- గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లినప్పుడు గ్రామీణ రంగంలోని ఏ ఆర్థిక రంగం ఎక్కువమందిని కోల్పోతుంది? ఎందుకని?
- గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వాళ్లు పట్టణ ప్రాంతంలో ఉపాధి పొందే ఆర్థిక రంగాలు ఏవి? దీనికి కొన్ని కారణాలను పేర్కొనండి.

## కాలానుగుణ, తాత్కాలిక వలస

జాతీయ జనాభా గణన ప్రకారం భారతదేశంలో ప్రతి నాల్గవ వ్యక్తి వలస వచ్చిన వాళ్లే. 2001-2011లో వలస పెరిగింది కానీ 1980ల కాలంలో పెరిగినంతగా కాదు. వలసలు రాష్ట్రంలోపల ఉండవచ్చు, మరొక రాష్ట్రానికి అయి ఉండవచ్చు. గ్రామీణ ప్రాంతంనుంచి పట్టణ ప్రాంతానికి వలస వెళ్లిన రామయ్య కథనాన్ని మీరు చదివారు. పట్టణానికి రోజుకూలీగా వచ్చిన వ్యక్తిని కూడా మీరు ఇంటర్వ్యూ చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి వలస గణాంకాలను, వలసకు గల కారణాలను చూశాం. అయితే గ్రామీణ ప్రాంతాలనుంచి గ్రామీణ ప్రాంతాలకు వలస కూడా పెరిగింది. ఇలా వెళ్లే వలసలు సాధారణంగా ఆరు నెలలలోపు ఉంటాయి. కాబట్టి దీనిని జనాభా గణన గణాంకాలు ప్రతిబింబించకపోవచ్చు. జాతీయ సర్వేలలో 'వలస వెళ్లిన వ్యక్తి' అన్న పదానికి ఉన్న నిర్వచన పరిమితి వల్ల తాత్కాలికంగా వలస వెళ్లే వాళ్ల సంఖ్య తక్కువగా చూపించబడుతోంది.

## మహారాష్ట్రలో చెరుకు నరికేవాళ్లు

దేశంలో పంచదారను ఉత్పత్తి చేసే ప్రముఖ రాష్ట్రాలలో మహారాష్ట్ర కూడా ఒకటి. ఇక్కడ మొత్తం 186 సహకార చక్కెర కర్మాగారాలు ఉన్నాయి. కొయినా ఆనకట్ట కట్టిన తరువాత 1970 దశాబ్ద ఆరంభం నుంచి ఇక్కడ పెద్ద ఎత్తున చెరుకు సాగు చెయ్యటం మొదలుపెట్టారు. ఒక అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం చెరుకు నరకటానికి మధ్య మహారాష్ట్ర నుంచి పశ్చిమ మహారాష్ట్రకు 6,50,000 కూలీలు వలస వెళతారు. దీంట్లో ప్రాథమికోన్నత పాఠశాల వయస్సు అయిన 6-14 సంవత్సరాల పిల్లలు 2,00,000 దాకా ఉంటారు. తమ కుటుంబాలతో పాటు వీళ్లు కూడా వలస వస్తారు.

చెరుకు నరికివేతకు రోజులకు వలస వచ్చినవాళ్లు ఫ్యాక్టరీలు కేటాయించిన ఖాళీ ప్రదేశాలలో నివసిస్తారు. ఇవి చేలకు దగ్గరగా ఉంటాయి. ప్రతి కుటుంబానికి కొన్ని బొంగులు, వెదురు తడిక ఇస్తారు. వీటితో వాళ్లు చిన్న గుడిసెవేసుకుంటారు (దీనిని అక్కడ 'కోపి' అంటారు). టైర్ కేంద్ర నివాస ప్రాంతాలలో 200-500 కోపీలు ఉంటాయి, గాడి కేంద్ర నివాస ప్రాంతాలలో 50-100 కోపీలు ఉంటాయి. ఈ కోపీలు ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉంటాయి, వాటి ముందు పశువులు కట్టేసి ఉంటాయి. పశువులు, మనుషులు ఇరుకిరుకు పరిస్థితులలో నివసిస్తుంటారు.

తెల్లవారక ముందే చేనుకి చేరుకుని రోజంతా చెరుకు నరుకుతారు, రోజుకి సగటున ఒక వ్యక్తి 1.5 టన్నులు నరుకుతాడు. టన్నుకి చెల్లించే మొత్తం 80 నుంచి 100 రూపాయల మధ్య ఉంటుంది. చేనుని భాగాలుగా చేసి ఒక్కొక్క భాగాన్నీ ఒక పని బృందానికి కేటాయిస్తారు. ఆడమనిషి, మగమనిషి చెరుకు నరికి, ఆకులు తొలగించి కింద పడేస్తారు, పిల్లలు వీటిని ఒక చోటకి కుప్పగా చేరుస్తారు. కుప్పగా ఉన్న చెరుకు గడలను కట్టలుగా కట్టి నెత్తిమీద మోసుకుంటూ బళ్ల దగ్గరకు ఆడ, మగ మనుషులు చేరుస్తారు.

- పశ్చిమ మహారాష్ట్రలో చెరుకు కొట్టేవాళ్ల కొరత ఎందుకుంది?
- తల్లిదండ్రులతో పాటు వలస వచ్చిన వాళ్ల పరిస్థితి ఏమిటి? వీళ్లను బడిలో చేర్పించవచ్చా? ఇటువంటి పిల్లలకు చదువు చెప్పటానికి ప్రభుత్వ చట్టాలలో ఏమైనా అంశాలు ఉన్నాయా?
- చెరుకు నరికే వాళ్లకు ఆ పనిలో ఆరునెలలు మాత్రమే ఎందుకు ఉపాధి లభిస్తుంది? మిగిలిన ఆరు నెలల్లో వాళ్లు ఏ పనులు చేస్తూ ఉంటారు?
- ఇటువంటి కూలీల జీవన పరిస్థితులను ఏ విధంగా మెరుగుపరచవచ్చు?
- పశ్చిమ మహారాష్ట్రలోని ఏడు జిల్లాలయిన నాసిక్, అహ్మద్‌నగర్, పూనా, సతారా, సాంగ్లి, కొల్హాపూర్, షోలాపూర్‌లు "పంచదార పట్టీ"గా పిలవబడతాయి. ఈ పట్టీ ఉత్తరాన సూరత్ (గుజరాత్)లోకి, దక్షిణాన బెల్గాం (కర్నాటక)లోకి విస్తరిస్తుంది. వర్షాధార మెట్ట భూములున్న మరట్వాడాలోని అయిదు జిల్లాలయిన బీడ్, జల్‌గావ్, అహ్మద్‌నగర్, నాసిక్, జల్నాలు చెరుకు నరకటానికి సంవత్సరంలో ఆరు నెలలపాటు వలస కార్మికులను పంపిస్తాయి.
- ఒక పటంలో వలస మొదలయిన జిల్లాలు, వలస చేరుకునే జిల్లాలను చూపిస్తూ బాణం గుర్తులు గీయండి.

మగవాళ్లు బళ్లను ఫ్యాక్టరీలకు తోలుకెళతారు. చెరుకు దిగుమతి కావటానికి అక్కడ వాళ్లు వరసలో కొన్ని గంటలపాటు వేచి ఉండాల్సిరావచ్చు. ఈలోగా ఆడవాళ్లు తమ నివాస ప్రాంతాలకు కొన్ని కిలోమీటర్లు నడుచుకుంటూ వెళతారు. వాళ్లు అలసిఉన్నా ఇంటి పనులు చేయాల్సి ఉంటుంది.

గ్రామీణ ప్రాంత కార్మికులలో అధిక శాతం తక్కువ కాలానికి ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలోని సంక్షోభ పరిస్థితుల వల్ల వలస వెళతారు. వీళ్లు ప్రధానంగా వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు, తక్కువ ఆదాయం గల వాళ్లు, దళితులు, ఆదివాసీలు.

మహారాష్ట్రలో చెరుకు కొట్టేవాళ్లు ఒక గ్రామీణ ప్రాంతం నుంచి మరొక గ్రామీణ ప్రాంతానికి వలస వెళ్లటాన్ని చూశాం. గ్రామీణ స్వల్పకాల వలస కార్మికులు వ్యవసాయం, తోటలు, ఇటుక బట్టీలు, గనుల తవ్వకం, భవన నిర్మాణం, చేపల ప్రాసెసింగ్ వంటి పనులు చేస్తారు. కొన్ని ఉదాహరణలను చూద్దాం.

1990ల చివరి దశకంలో పశ్చిమ బెంగాల్‌లో వరి పండించే ప్రాంత అధ్యయనంలో 5 లక్షల కంటే ఎక్కువ మంది వలస కూలీలు వరికోతల కాలంలో బర్ధమాన్ జిల్లాకి వెళతారని తెలిసింది. ఈ వలస కూలీలలో అధిక సంఖ్య గిరిజనులు, ఇతర తక్కువ కులాల వాళ్లు. ప్రతి సంవత్సరం ఈ వలస కూలీల సంఖ్య పెరుగుతోంది. సవర గిరిజన జాతికి చెందిన మగవాళ్లకు అస్సాంలోని తోటలపనికి వలస వెళ్లే సుదీర్ఘ చరిత్ర ఉంది. ముండ, సంతాల్ జాతి పురుషులు ఒడిశాలోని గనులలో పని చెయ్యటానికి వలస వెళతారు. మహారాష్ట్రలోని చేపల ప్రాసెసింగ్ కర్మాగారాలలో పని చెయ్యటానికి ఏటా కేరళనుంచి 50,000 మహిళలు వలస వెళతారు.

పట్టణ ప్రాంతాలలో భవన నిర్మాణానికి ప్రధానంగా వలస కార్మికులపై ఆధారపడతారు. వలస కార్మికులు సాధారణంగా రోజు కూలీలుగా పని చేస్తుంటారు, ప్లాస్టిక్ సామాను, కూరగాయలు అమ్ముతుంటారు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలు చేస్తుంటారు. ఇలా వలస వెళ్లేవాళ్లల్లో అధిక భాగం గిరిజన ప్రజలు, రాష్ట్రంలోని కరువు పీడిత ప్రాంతానికి చెందిన వాళ్లు అయి ఉంటారు. కాలానుగుణంగా వలస వెళ్లేవాళ్లు ఎక్కువగా పేదవాళ్లే, వాళ్లకి సొంత ఊరిలో భూమి కూడా ఉండదు, ఉన్నా కొద్దిగానే ఉంటుంది. చిత్రం 8.2 తక్కువ కాలానికి వలస వెళ్లేవాళ్ల వివరాలను ఇస్తుంది – సర్వే చేసిన దానికి ముందు సంవత్సరంలో సొంత ఊరినుంచి ఆరు నెలలలోపు వలస వెళ్లిన వాళ్లు ఈ కోవలోకి వస్తారు.

గ్రామీణ కార్మికులపై జాతీయ కమిషన్ 1990లలో ఇచ్చిన నివేదికలో అసమాన అభివృద్ధి, ప్రాంతాల మధ్య అసమానతలు కాలానుగుణ వలసలకు కారణమని పేర్కొంది. కొన్ని గిరిజన ప్రాంతాలలో బయటివాళ్లు రావటం వల్ల, ఆనకట్టలు కట్టటానికి, గనుల తవ్వకానికి ప్రజలు నిర్వాసితులు కావటం వల్ల తాత్కాలికంగా తప్పనిసరిగా వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చిత్రం 8.2 : 2007-08లో భారతదేశంలో కాలానుగుణ వలసదారుల నేపథ్యం




వ్యవసాయ రంగంలో వలస వెళ్లేవాళ్ల గ్రామాలకు రైతులు వెళ్లి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అదే కులానికి, వర్గానికి లేదా ప్రాంతానికి చెందిన గుత్తేదారులను (వీళ్లనే ఏజెంట్లని కూడా అంటారు), వ్యాపారస్తులను ఢిల్లీలోని గనుల యజమానులు, కర్నాటకలోని కాఫీ తోటల యజమానులు వలస కార్మికులతో ఒప్పందాలు కుదుర్చుకోటానికి ఉపయోగించుకుంటారు. పంజాబ్‌లో వలస వచ్చిన కూలీలద్వారా ఇతరులను కూడా పనులకు పిలిపించుకుంటారు. దీనికి యజమానుల నుంచి గుత్తేదారులకు కొంత ప్రతిఫలం అందటమే కాకుండా వలస కూలీలకు వచ్చేదాంట్లో నుంచి కూడా కొంత తీసుకుంటారు. కొన్ని సందర్భాలలో గుత్తేదారులు పర్యవేక్షకులుగా కూడా పని చేస్తారు.

- మీ ప్రాంతంలో కాలానుగుణ వలస వెళ్లే వాళ్ల పరిస్థితిని వివరించండి.

## ప్రజలు వలస వెళ్లినప్పుడు ఏమవుతుంది?

వలస వెళ్లిన ప్రదేశంలో ఆ కార్మికులకు చౌకధరల దుకాణాల నుంచి సరుకులు దొరకవు కాబట్టి వాళ్లు ఆహారధాన్యాలపై ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. చాలా తీవ్రమైన పరిస్థితులలోనూ, పారిశుద్ధ్యంలేని వాతావరణంలోనూ నివసించాల్సి రావటం వల్ల వాళ్లు అనేక అనారోగ్యాలకు, రోగాలకు గురౌతారు. గనులు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులలో పనివల్ల వాళ్లు ఒళ్లునొప్పులు, వడదెబ్బ, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులకు లోనవుతారు. యజమానులు సరైన భద్రతాచర్యలు తీసుకోకపోవటం వల్ల పారిశ్రామిక ప్రదేశాలు, భవన నిర్మాణ ప్రదేశాలలో ప్రమాదాలు తరచు సంభవిస్తూ ఉంటాయి. వలస కార్మికులు సంఘటిత రంగంలో లేనందువల్ల వాళ్లకి వివిధ ఆరోగ్య, కుటుంబ సంరక్షణ కార్యక్రమాలు అందటం లేదు. వలస వచ్చిన మహిళా కూలీలకు ప్రసూతి సెలవులు ఉండవు. అంటే ప్రసవించిన కొద్ది రోజులకే వాళ్లు తిరిగి పనికి వెళ్లవలసి ఉంటుంది.

కుటుంబాలు వలస వెళ్లినప్పుడు తల్లిదండ్రులతో పాటు వెళ్లే చిన్నపిల్లలకు శిశు సంరక్షణ కేంద్రాలు ఉండవు. పెద్దపిల్లలు కొత్త ప్రదేశంలో చదువు కొనసాగించే వీలు ఉండదు. వాళ్లు స్వగ్రామాలకు తిరిగి వెళ్లినప్పుడు అక్కడి పాఠశాలలు కూడా వాళ్లని మళ్లీ చేర్చుకోవు. చివరికి వాళ్లు బడికి వెళ్లటం మానేస్తారు. కుటుంబంలో కేవలం మగవాళ్లే వలసకి వెళ్లినప్పుడు కుటుంబ బాధ్యతలు, వృద్ధుల సంరక్షణ భారం

అంతా ఆడవాళ్ల మీద పడుతుంది. ఇటువంటి కుటుంబాలలోని ఆడపిల్లలమీద తమ్ముళ్లు, చెల్లెళ్లను చూసుకోవాల్సిన భారం ఉండి చివరికి చాలామంది బడి మానేస్తారు.

వలస వెళ్లిన వాళ్లమీద కూడా వలస ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. భిన్నమైన వాతావరణంలో ఉండాల్సి రావడం, దానివల్ల కలిగే ఒత్తిడి, ఆహార మార్పు, సామాజిక వాతావరణం వల్ల వలస వెళ్లిన వాళ్లు తీవ్రంగా ప్రభావితులవుతారు. వలస కాలం బట్టి ఈ ఒత్తిడి తీవ్రత ఉంటుంది. ఒక్కొక్కసారి కొత్త ఆలోచనలకు ప్రభావితులయ్యి పాత భావాలను ప్రశ్నిస్తారు.

వలస వెళ్లే వాళ్లలో చాలామంది, ప్రత్యేకించి దీర్ఘకాలం వలస వెళ్లేవాళ్లు ఊరిలో ఉన్న తమ కుటుంబాలకు డబ్బులు పంపిస్తారు. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో మూడింట ఒక వంతు కుటుంబాలు వలస సభ్యులు పంపించే డబ్బుపై ఆధారపడి ఉన్నాయి. కాలానుగుణంగా వలస వెళ్లే వాళ్లల్లో చాలామంది ఇంటికి డబ్బు పంపిస్తారు, లేదా మిగుల్చుకున్న డబ్బు తమతో తీసుకెళతారు. వలస వెళ్లటం వల్ల ఆస్తులు అమ్ముకోకుండా అప్పులు తీర్చటానికి, ఇతర కార్యక్రమాలకు డబ్బు సమకూరుతుంది. వలస వెళ్లిన కుటుంబాలు ఇల్లు, భూమి, వ్యవసాయ పరికరాలు,

- వలస వెళ్లిన వాళ్లకు ఆహారం, వైద్య, కుటుంబ సంరక్షణ కార్యక్రమాలు అందటానికి ఏం చెయ్యాలి?
- ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కొన్ని చర్యలు చేపట్టాయి. మీ ప్రాంతంలో ఇటువంటివి ఏమైనా ఉన్నాయేమో తెలుసుకోండి. అటువంటి సంస్థల నుంచి వ్యక్తులను మీ పాఠశాలకు పిలిచి మాట్లాడమనండి.










*చిత్రం 8.3 : వలస వ్యక్తులు రాకుండా జాతీయ సరిహద్దులను కాపాడుతుంటారు. ఇక్కడ కొన్ని ఉదాహరణలు చూద్దాం:*
*1) మెక్సికో సరిహద్దు వెంట అమెరికాలో,*
*2) ఉత్తర కొరియా సరిహద్దు వెంట దక్షిణ కొరియాలో*
*3) బంగ్లాదేశ్ సరిహద్దు వెంట భారతదేశంలో. ఇలా దేశ సరిహద్దులను దాటేవాళ్ల గురించి మీ అభిప్రాయం ఏమిటి?*

వినియోగ వస్తువులు కొనటం సాధారణంగా చూస్తూ ఉంటాం. వలస వెళ్లిన వాళ్లల్లో కొంతమంది వలస వెళ్లిన ప్రదేశంలో ఉద్యోగం పొందవచ్చు, అవసరమైన నైపుణ్యాలు అక్కడ పెంపొందించుకోవచ్చు, మంచి ఉద్యోగాల గురించి తెలుసుకుని క్రమం తప్పకుండా లేదా శాశ్వతంగా వలస వెళ్లవచ్చు.

## అంతర్జాతీయ వలసలు

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం ప్రకారం 20 కోట్ల అంతర్జాతీయ వలస వ్యక్తులలో 7 కోట్లకంటే తక్కువ మంది ఒక అభివృద్ధి చెందుతున్న దేశంనుంచి మరొక అభివృద్ధి చెందుతున్న దేశానికి వలస వెళుతున్నారు. భారతదేశం నుంచి అంతర్జాతీయ వలసలు రెండు రకాలు:

సాంకేతిక నైపుణ్యం, వృత్తి అనుభవం ఉన్న వ్యక్తులు అమెరికా, కెనడా, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వలస వెళుతున్నారు. ఐటి నిపుణులు, డాక్టర్లు, మేనేజ్‌మెంట్ నిపుణులు ఈ రకానికి ఉదాహరణ. 1950లు, 1960లలో కెనడా, ఇంగ్లాండునకు వలస వెళ్లిన భారతీయులలో ఎక్కువమంది ఏ నైపుణ్యమూ లేనివాళ్లు కాగా గత పది సంవత్సరాలలో ఎక్కువగా వృత్తి నిపుణులు ఈ దేశాలకు వెళుతున్నారు. ఇటీవల కాలంలో భారతదేశ వృత్తినిపుణులు జర్మనీ, నార్వే, జపాన్, మలేషియా వంటి దేశాలకు కూడా వలస వెళుతున్నారు. 1950లలో అభివృద్ధి చెందిన దేశాలకు సంవత్సరానికి 10,000 మంది వలస వెళ్లగా, 1990లలో ఈ సంఖ్య 60,000కి పెరిగింది.

రెండవ రకం వలసలు చమురు ఎగుమతి చేస్తున్న పశ్చిమ ఆసియా దేశాలకు తాత్కాలిక ఒప్పందాలపై వలస వెళుతున్న నైపుణ్యంలేని, కొంత నైపుణ్యం ఉన్న పనివాళ్లు. వలస వెళ్లిన దేశాలలోని పరిస్థితిని బట్టి కొంతకాలం తరువాత ఇలా వలస వెళ్లిన వాళ్లంతా తిరిగి వస్తారు. భారతదేశం నుంచి పశ్చిమ ఆసియాకి వెళుతున్న 30 లక్షల వలస వ్యక్తులలో ఎక్కువమంది సౌదీ అరేబియాకి, యు.ఏ.ఇ.(United Arab Emirates)కి వెళుతున్నారు. ప్రతి సంవత్సరం పశ్చిమ ఆసియాకి 3 లక్షల కార్మికులు వలస వెళుతున్నారు. పశ్చిమ ఆసియాకి వలస వెళుతున్న కార్మికులలో అయిదింట ముగ్గురు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు. ఈ వలస కార్మికులలో అధిక శాతం భవన నిర్మాణం, మరమ్మతుల నిర్వహణ, సేవలు, రవాణా, టెలికమ్యూనికేషన్ రంగాలలో పనిచేస్తున్నారు.

వలస వెళ్లిన వాళ్ల ప్రాంతంపై అంతర్జాతీయ వలస ప్రభావం చాలా ముఖ్యమైనది. వలస వెళ్లిన వాళ్ల కుటుంబాలు అప్పులు తీర్చగలగటం, ఆస్తులు కొనటం, జీవనశైలిలో మార్పు వంటి వాటిలో ఈ ప్రభావం బాగా కనపడుతుంది. కేరళ మొత్తం ఆదాయంలో అయిదింట ఒక వంతు పశ్చిమ ఆసియాలో పనిచేస్తున్న వాళ్లు పంపించే డబ్బు ద్వారా సమకూరుతోందని ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది. 1970లలో కేరళలో తలసరి సగటు వినియోగం దేశ సగటు కంటే తక్కువగా ఉండేది. కానీ 30 ఏళ్ల తరువాత ఇది దేశం సగటుకంటే 40 శాతం ఎక్కువగా ఉంది (బాక్సు చూడండి).

- పై పేరాలలో పేర్కొన్న భారతదేశం నుంచి ఇతర దేశాలకు వెళుతున్న వలసలను చూపిస్తూ ప్రపంచ పటంలో బాణం గుర్తులు గీయండి.

**రూపాయి బలహీన పడడంతో కేరళకి వస్తున్న డబ్బు 75,000 కోట్ల రూపాయల శిఖరానికి చేరిన వైనం**

బలహీన పడిన రూపాయి కారణంగా దేశమంతా సతమతమవుతుండగా ప్రవాస కేరళీయులు సంతోషంగా ఉన్నారు. ఒక సంవత్సరంలో సాధించాల్సిన 75,000 కోట్ల రూపాయల జమను 2013లో ఆరు నెలల కాలంలోనే సాధించారు.

దేశంలోకి వచ్చే డబ్బులో ప్రతి సంవత్సరం ఉండే వృద్ధిలో జూన్ చివరినాటికి ఏకంగా 36 శాతం పెరిగి 75,883 కోట్ల రూపాయలకు చేరుకుంది.

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రకారం (రాష్ట్రంలోని మొత్తం డిపాజిట్లలో 32.8 శాతం వీళ్ల దగ్గర ఉన్నాయి) జూన్ 2012 నాటి 55,663 కోట్ల రూపాయలతో పోలిస్తే ఇది 20,220 కోట్ల రూపాయలు అదనం.

25 లక్షల దాకా ఉన్న ప్రవాస కేరళీయులు రాష్ట్ర జిడిపిలో 35 శాతానికి దోహదం చేస్తున్నారు. కేరళలో ప్రధాన పండగైన ఓనం పండుగ కారణంగా ప్రస్తుతం లగ్జరీ కార్లు, ఇతర ఖరీదైన వస్తువుల అమ్మకాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రవాసులు అధికంగా ఉన్న పంజాబులో తప్పించి దేశంలోని మిగిలిన ప్రాంతాలలో అమ్మకాలు చప్పగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ప్రవాసులు పంపిన 60,000 కోట్ల రూపాయలు కేరళ జిడిపిలోని మూడవ వంతుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే తీరులో డబ్బులు వస్తుంటే అది రాష్ట్ర జిడిపిలో 40 శాతాన్ని మించవచ్చు.

అభివృద్ధి అధ్యయన కేంద్రంలోని వలస విభాగం ఇచ్చిన నివేదిక ప్రకారం రాష్ట్రానికి ప్రవాసుల ద్వారా వచ్చే డబ్బు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ఆదాయం కంటే 1.6 రెట్లు ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే దానికంటే 6.2 రెట్లు ఎక్కువ. అంతేకాదు ఒక సంవత్సరంలో ప్రభుత్వ ఖర్చుకు 2 రెట్లు కంటే ఎక్కువ.

**మూలం :** ది హిందూస్తాన్ టైమ్స్, సెప్టెంబరు 15, 2013, ముంబయి.

భారత దేశీయులు విదేశాలకు వలస వెళ్లి పనిచేయటాన్ని వలసల చట్టం, 1983 అన్న భారతదేశ చట్టం పర్యవేక్షిస్తుంది. పని నిమిత్తం వెళ్లే వాళ్ల ప్రయోజనాలను కాపాడటానికి ఇది కొన్ని షరతులు విధిస్తుంది. వివిధ దేశాలలో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన దౌత్య కార్యాలయాలు వలసల చట్టంలో పొందు పరిచిన విధంగా చట్టపర విధానాలను పాటించి అంతర్జాతీయ వలస కార్మికుల సంక్షేమాన్ని కాపాడాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాలలో వలస కార్మికులకు జీతాలు చెల్లించరు. కొన్నిసార్లు వలస వెళ్లాలనుకుంటున్న కార్మికులను ఏజెంట్లు మోసం చేస్తారు, లేదా విదేశాలలో పని చూపించటానికి సిఫారసు చేసినదానికంటే ఎక్కువ రుసుము వసూలు చేస్తారు. ఒక్కొక్కసారి యజమానుల ఒప్పంద కాలం ముగియకుండా ఒప్పందాన్ని రద్దు చేస్తారు, లేదా వలస కార్మికులు నష్టపోయేలా ఒప్పంద పత్రాన్ని మారుస్తారు, ఇస్తామన్న దానికంటే తక్కువ జీతం ఇస్తారు, ఇతర ప్రయోజనాలు, ప్రోత్సాహకాలను నిలిపివేస్తారు. వాళ్లు తరచు కార్మికులతో బలవంతంగా అదనపు గంటలు పని చేయించుకుని, అందుకు అదనపు వేతనం చెల్లించరు. కార్మికులను వాళ్ల పాస్‌పోర్టు వాళ్ల దగ్గర ఉంచుకోనివ్వరు. ఉద్యోగం పోతుందన్న భయంతో భారత వలస కార్మికులు అరుదుగా తప్పించి తమ విదేశీ యజమానులపై ఫిర్యాదులు నమోదు చెయ్యరు.

## కీలక పదాలు

వలస　విదేశాలకు వలస　అంతరరాష్ట్ర వలస　కాలానుగుణ వలస　దేశ సరిహద్దు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. కింది వాటితో ఒక పట్టిక తయారుచేసి వలస కార్మికుల వివిధ ఉదాహరణలను క్రోడీకరించండి : (1) వలస కార్మికులు; (2) వలసల కారణాలు; (3) వలస వెళ్లిన వాళ్ల జీవన ప్రమాణాలు; (4) వాళ్ల జీవితాల ఆర్థిక స్థితిపై ప్రభావం; (5) వాళ్లు వలస వచ్చిన ప్రాంత ప్రజల జీవితాల ఆర్థిక స్థితిపై ప్రభావం.
2. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వలసల మధ్య పోలికలు, తేడాలు రాయండి.
3. వీటిల్లో దేనిని కాలానుగుణ వలసగా పరిగణించవచ్చు? ఎందుకు?
   - అ. వివాహం కారణంగా తల్లిదండ్రుల ఇంటినుంచి భర్త ఇంటికి స్త్రీ వెళ్లటం.
   - ఆ. తమిళనాడులో పసుపుదుంప తీయటానికి ఒక జిల్లానుంచి మరొక జిల్లాకి మూడు నెలలపాటు వెళ్లటం.
   - ఇ. సంవత్సరంలో ఆరునెలల కోసం ఢిల్లీలో రిక్షా తోలటానికి బీహారు గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లటం.
   - ఈ. హైదరాబాదులో ఇళ్లల్లో పనిచెయ్యటానికి నల్గొండ జిల్లా నుంచి ఆడవాళ్లు రావటం.
4. వలస వెళ్లిన వాళ్లు ఆ ప్రాంతంలో సమస్యలు సృష్టిస్తారా/ సమస్యలకు కారణం అవుతారా? మీ సమాధానానికి కారణాలు ఇవ్వండి.
5. కింద వివిధ రకాల వలస ఉదాహరణలు ఉన్నాయి. వాటిని అంతర్గత, అంతర్జాతీయ వలసలుగా వర్గీకరించండి.
   - అ. సాంకేతిక పనివాళ్లుగా పనిచెయ్యటానికి భారతదేశం నుంచి సౌదీ అరేబియాకి వెళ్లటం.
   - ఆ. బీహారు నుంచి పంజాబుకి వెళ్లే వ్యవసాయ కూలీలు.
   - ఇ. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌కి ఇటుక బట్టీలలో పనిచెయ్యటానికి వెళ్లటం.
   - ఈ. భారతీయ పిల్లలకు చైనీస్ భాష నేర్పటానికి చైనా నుంచి వచ్చే టీచర్లు.
6. 'వలస కుటుంబాలలోని అధిక శాతం పిల్లలు బడి మధ్యలోనే మానేస్తారు.' దీనితో మీరు ఏకీభవిస్తారా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
7. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లటం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజల కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుంది?
8. వృత్తి నైపుణ్యం ఉన్నవాళ్లే అభివృద్ధి చెందిన దేశాలకు ఎందుకు వలస వెళ్లగలుగుతున్నారు? నైపుణ్యంలేని కార్మికులు ఈ దేశాలకు ఎందుకు వెళ్లలేరు?
9. పశ్చిమ ఆసియా దేశాలలో భారతదేశం నుంచి నైపుణ్యంలేని కార్మికులనే ఎందుకు కోరుకుంటున్నారు?
10. మూడు రాష్ట్రాల ప్రజలు చాలా దూరంలోని పశ్చిమ ఆసియాకు ఎలా వెళ్లగలుగుతున్నారు?
11. అంతర్గత, అంతర్జాతీయ వలసల ప్రభావాల మధ్య పోలికలను, తేడాలను పేర్కొనండి.

పాఠం
9

# రాంపురం : గ్రామ ఆర్థిక వ్యవస్థ

## రాంపురం గ్రామ కథ

ఈ కథ ఒక గ్రామంలోని వివిధ రకాల ఉత్పత్తి కార్యకలాపాలను పరిచయం చేస్తుంది. భారతదేశ గ్రామాలలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి కార్యకలాపం. ఇతర ఉత్పత్తి కార్యకలాపాలను వ్యవసాయేతర కార్యకలాపాలు అంటారు. వీటిలో చిన్న చిన్న వస్తువుల ఉత్పత్తి, రవాణా, దుకాణాల నిర్వహణ వంటివి ఉంటాయి. ఈ అధ్యాయంలో రెండు రకాల కార్యకలాపాలనూ చూద్దాం. ఉత్పాదక వ్యవస్థలను – అవి వ్యవసాయంలో కావచ్చు, కర్మాగారంలో కావచ్చు – ఉత్పత్తి ప్రక్రియలోని మౌలిక అంశాలను ఉపయోగించి విశ్లేషించవచ్చు. ఉత్పత్తి ఎలా వ్యవస్థీకరింపబడుతుందనేది ప్రజల జీవితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది.

పాఠం యొక్క రచయిత రాంపురం (పేరు మార్చాం) గ్రామం వెళ్ళి అక్కడి అన్ని అంశాలను లోతుగా పరిశీలించి ఈ గ్రామ కథను రూపొందించారు. ఆ అధ్యయనం తరువాత పలుమార్లు ఆ గ్రామాన్ని రచయిత సందర్శించారు. ఆ విధంగా కాలక్రమంలో వచ్చిన పలు మార్పులను గమనించగలిగారు. ఈ కథ చదువుతూ రాంపురంలో చూసిన అంశాలు మీ ప్రాంతానికి కూడా వర్తిస్తాయేమోనని మీరు కూడా ఆలోచించవచ్చు, పరిశీలించవచ్చు. లేదా మీ ఊరి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందా? అయితే అది ఏ విధంగా భిన్నంగా ఉందో ఆలోచించండి.

ఈ అధ్యాయంలో అప్పుడప్పుడు మీ ఊరి సందర్భమూ, భారతదేశ పరిస్థితుల ప్రస్తావన వస్తాయి. ఉదాహరణకు రాంపురంలో భూమి పంపిణి గురించి చర్చించేటప్పుడు దేశం మొత్తంలో ఇది ఎలా ఉందో పరిశీలిస్తాం. రాంపురంలో కొన్ని ప్రత్యేక అంశాలు ఉన్నప్పటికీ అందులోని అనేక అంశాలు కొద్దిపాటి మార్పులతో దేశం అంతటా ఉన్నాయి. వీటిని కూడా మీ ప్రాంతంతో పోల్చవచ్చు.

- వ్యవసాయం గురించి మీకు ఏం తెలుసు? వివిధ కాలాల్లో పంటలు ఎలా మారుతూ ఉంటాయి? వ్యవసాయం మీద ఆధారపడిన అధిక శాతం ప్రజలకు భూమి ఉందా, లేక వాళ్లు వ్యవసాయ కూలీలా?

## రాంపురంలో వ్యవసాయం

పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని సారవంతమైన గంగామైదానపు ఒండ్రు నేలల్లో రాంపురం ఉంది. పంజాబ్, హర్యానాలతో పాటు పశ్చిమ ఉత్తర ప్రదేశ్ వ్యవసాయపరంగా సంపన్నమైన ప్రాంతం. ఈ గ్రామానికి చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలతో చక్కటి రవాణాసదుపాయాలు ఉన్నాయి. రాయిగంజ్ అనే పెద్ద ఊరు రాంపురానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. అన్ని కాలాలకు వాహనాలు తిరిగే రోడ్డు రాయిగంజ్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న జహంగీరాబాదు వరకు ఉంది. ఈ రోడ్డుమీద ఎడ్లబళ్లతో మొదలుకొని జట్కాబళ్లు, బోగీలు (బర్రెలు, దున్నపోతులు లాగే చెక్క బళ్లు–బెల్లం, ఇతర సరుకులను రవాణా చేస్తాయి), మోటారుసైకిళ్లు, జీపులు, ట్రాక్టర్లు, లారీలు కనపడతాయి.



రాంపురంలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి కార్యకలాపం. శ్రమజీవులలో అధిక శాతం తమ జీవనోపాధికి వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. వాళ్లు రైతులు కావచ్చు, వ్యవసాయ కూలీలు కావచ్చు. వీళ్ల సంక్షేమం వ్యవసాయక్షేత్రాల ఉత్పత్తి మీద ఆధారపడి ఉంది.

## భూమి, ఇతర సహజ వనరులు

వ్యవసాయ ఉత్పత్తికి భూమి చాలా కీలకమైన అంశం. అయితే సాగులో ఉండే భూమి విస్తీర్ణం దాదాపు స్థిరంగా ఉంటుంది. రాంపురంలో 1921 నుంచి సాగు భూమి విస్తీర్ణం పెరగలేదు. అంతకుముందే చుట్టుపక్కల ఉన్న అడవులను, ఊళ్లోని బంజరు భూములను వ్యవసాయ భూములుగా మార్చేశారు. మరింత భూమిని కొత్తగా సాగులోకి తీసుకురావటం ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంచటానికి అవకాశం లేదు.

రాంపురంలో కొంచెం భూమి కూడా ఖాళీగా లేదు. వర్షాకాలం (ఖరీఫ్)లో రైతులు జొన్న, సజ్జలు సాగుచేస్తారు. ఆహారధాన్యంతోపాటు వీటి చొప్ప పశువులమేతగా ఉపయోగ పడుతుంది. ఆ తరువాత అక్టోబరు-డిసెంబరు నెలల మధ్య బంగాళాదుంప పంట సాగుచేస్తారు. చలికాలం (రబీ)లో గోధుమ పంటవేస్తారు. ఈ పంటలో కుటుంబ అవసరాలకు కావలసినది ఉంచుకుని మిగిలినది రాయిగంజ్‌లోని మార్కెట్ యార్డ్‌లో అమ్ముతారు. కొంత విస్తీర్ణంలో చెరుకు సాగు చేస్తారు. ఇది సంవత్సరకాలపు పంట. నేరుగా చెరకునుగానీ, లేదా బెల్లం తయారుచేసిగానీ సమీప పట్టణమైన జహంగీరాబాదులోని వ్యాపారస్తులకు అమ్ముతారు.

### *భూమిని కొలవటం*

*భూమిని కొలవటానికి హెక్టారును (రెండున్నర ఎకరాలు) ప్రామాణిక కొలమానంగా ఉపయోగిస్తారు. అయితే గ్రామాల్లో ఎకరాలు, సెంట్లు, గుంటలు వంటి స్థానిక కొలమానాలు ఉన్నాయి. ఒక హెక్టారు అంటే 10,000 చదరపు మీటర్లు. ఒక హెక్టారు క్షేత్రాన్ని మీ పాఠశాల మైదానంతో పోల్చండి. మీ టీచరుతో చర్చించండి.*

ఒకే విస్తీర్ణంలో సంవత్సరంలో ఒకటికంటే ఎక్కువ పంటలను సాగు చెయ్యటాన్ని 'బహుళ పంటల సాగు' అంటారు. భూమి నుంచి ఉత్పత్తిని పెంచటానికి ఇది అత్యంత సాధారణమైన పద్ధతి. రాంపురంలో రైతులందరూ కనీసం రెండు ప్రధాన పంటలు సాగు చేస్తారు, వాళ్లల్లో చాలామంది మూడవపంటగా బంగాళాదుంప సాగు చేస్తున్నారు.

రాంపురంలో బాగా అభివృద్ధి చెందిన నీటిపారుదల వ్యవస్థ ఉన్నందువల్ల రైతులు సంవత్సరంలో మూడు పంటలదాకా సాగు చేస్తున్నారు. రాంపురానికి ఎంతో ముందుగానే విద్యుత్తు వచ్చింది. దీంతో సాగునీటివ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. అప్పటివరకు రైతులు బావులనుంచి నీళ్లు పైకి తోడటానికి 'పర్షియన్ వీల్' అనే పరికరాన్ని ఉపయోగించి సాగునీటి కింద చాలా తక్కువ విస్తీర్ణాన్ని సాగు చేసేవాళ్లు. విద్యుత్తుతో నడిచే బోరుబావుల ద్వారా తేలికగా ఎక్కువ విస్తీర్ణానికి సాగునీటిని అందివ్వవచ్చని రైతులు గుర్తించారు. దాదాపు 50 సంవత్సరాల క్రితమే మొదటి బోరుబావులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తరువాత రైతులు సొంత ఖర్చుతో బోరుబావులు ఏర్పాటు చేసుకోసాగారు. ఫలితంగా 1970 దశాబ్ది మధ్యకాలం నాటికి 264 హెక్టార్ల వ్యవసాయ భూమి సాగునీటికిందికి వచ్చింది.

భారతదేశంలోని అన్ని గ్రామాలకు ఇంతటి సాగునీటి సదుపాయంలేదు. దేశంలోని నదీ మైదానాలు, కోస్తా ప్రాంతాలలో మాత్రమే సాగునీటి సదుపాయాలు బాగున్నాయి. ఇందుకు విరుద్ధంగా దక్కన్ పీఠభూమి వంటి పీఠభూమి ప్రాంతాలలో సాగునీటి సదుపాయాలు తక్కువ. ఈనాటికి కూడా దేశంలోని

- అట్లాసు చూసి బాగా సాగునీటి సదుపాయం ఉన్న ప్రాంతాలను గుర్తించండి. మీరు ఉంటున్న ప్రాంతం దీనికిందికి వస్తుందా?

సాగు విస్తీర్ణంలో 40 శాతానికంటే తక్కువ విస్తీర్ణానికి సాగునీటి సదుపాయం ఉంది. మిగిలిన ప్రాంతాలలో వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగా ఉంది. భారతదేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాల కోసం 1వ పాఠం చూడండి.

భూమి, నీరు వంటి సహజ వనరులను అధికంగా ఉపయోగించటం వల్ల దిగుబడులు, ఉత్పత్తి పెరిగాయి. అయితే ఈ సహజ వనరులను అన్ని సందర్భాలలో సక్రమంగా వినియోగించారని చెప్పలేం. రసాయనిక ఎరువులు, పురుగుమందులను అధికంగా, ఇష్టానుసారంగా వాడినందువల్ల భూసారం తగ్గుతోందని మన అనుభవం ద్వారా తెలుస్తోంది. నీటి పరిస్థితి కూడా అంతే ఆందోళన కలిగిస్తోంది. రాంపురం గ్రామం మాదిరిగానే భారతదేశం అంతటా సాగునీటికి ప్రధానంగా భూగర్భ జలాలమీదే ఆధారపడి ఉన్నారు. ఫలితంగా దేశవ్యాప్తంగా భూగర్భజలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. వర్షాలు బాగా ఉండి, వాననీళ్లు నేలలోకి ఇంకటానికి అనువుగా ఉండే ప్రాంతాలలో కూడా భూగర్భ జలాలు చాలా ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. భూగర్భజలమట్టం పడిపోతుంటే రైతులు మునుపటికంటే లోతైన బోరుబావులు తవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల సాగునీటికి డీజిలు/ విద్యుత్తు వినియోగం కూడా పెరుగుతుంది. ఈ అంశాలను సుస్థిరత, నీటి వనరుల అధ్యాయాల్లో మరింత వివరంగా తెలుసుకుంటాం.

- కింది పట్టిక భారతదేశంలో సాగుకింద ఉన్న భూమిని మిలియన్ హెక్టార్లలో చూపిస్తుంది. పక్కన ఉన్న గ్రాఫ్‌లో వీటిని పొందుపరచండి. గ్రాఫ్ ఏం తెలియచేస్తోంది? తరగతి గదిలో చర్చించండి.

| సంవత్సరం | సాగు విస్తీర్ణం (మిలియన్ హెక్టార్లలో) |
|---|---|
| 1950 | 120 |
| 1960 | 130 |
| 1970 | 140 |
| 1980 | 140 |
| 1990 | 140 |
| 2000 | 140 |
| 2010 | 140 |

*గ్రాఫ్ 1*




- రాంపురంలో పండించిన పంటల గురించి తెలుసుకున్నారు. మీ ప్రాంతంలో పండించే పంటల ఆధారంగా కింది పట్టికను నింపండి.

| పంటపేరు | విత్తనాలు వేసే నెల | పంట కోసే నెల | నీటి / సాగునీటి వనరు (వర్షం, చెరువులు, గొట్టపుబావులు, కాలవలు, మొదలైనవి) |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |

- గ్రామీణ ప్రాంతాలలో 'బహుళ పంటలు' సాగు చెయ్యటానికి దోహదపడే కారణాలు ఏమిటి?

## రాంపురంలో భూ పంపిణీ

వ్యవసాయానికి భూమి ఎంత ముఖ్యమైనదో మీరు గుర్తించి ఉంటారు. దురదృష్టమేమిటంటే వ్యవసాయంలో ఉన్నవాళ్లందరికీ సాగు చెయ్యటానికి సరిపడా భూమిలేదు. రాంపురం జనాభా 2660. అక్కడ వివిధ కూలాలకు చెందిన 450 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలోని అధిక భూమి ఉన్నత కులాల వారి చేతుల్లో ఉంది. వాళ్ల ఇళ్ళలో కొన్ని చాలా పెద్దవి: ఇటుకలు, సిమెంటుతో నిర్మించినవి. జనాభాలో మూడవ వంతు షెడ్యూల్డు కులాల వాళ్లు (దళితులు) ఉన్నారు. వీళ్ల ఇళ్లు ఊరికి దూరాన, ఒక మూలన ఉంటాయి. వీళ్లవి చాలా చిన్న ఇళ్లు, ఇంట్లో కొంతభాగం గుడిసెగా ఉంటుంది.

రాంపురంలో మూడింట ఒక వంతు అంటే 150 కుటుంబాలకు భూమి లేదు. భూమిలేని వాళ్లల్లో అధికశాతం దళితులు. రెండు హెక్టార్లకు మించి భూమి ఉన్న పెద్ద, మధ్యతరగతి కుటుంబాలు 60 దాకా ఉన్నాయి. పెద్ద రైతులలో కొంతమందికి 10 హెక్టార్లకు మించి సాగు భూమి ఉంది. రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని సాగుచేసే కుటుంబాలు 240 ఉన్నాయి. ఈ సన్నకారు రైతులకు వ్యవసాయం ద్వారా కుటుంబానికి సరిపోయే ఆదాయం రాదు.

*1960లో గోవిందు అనే రైతుకు 2.25 హెక్టార్ల భూమి ఉండేది. అప్పుడు దానికి సాగునీటి వసతి అంతగా లేదు. ముగ్గురు కొడుకుల సహాయంతో గోవిందు వ్యవసాయం చేసేవాడు. భోగభాగ్యాలు లేకపోయినా కుటుంబానికి ఉన్న ఒక బర్రెతో వచ్చే అదనపు ఆదాయంతో సరిపోయే ఆహారాన్ని పొందగలిగేవాళ్లు. కొన్ని సంవత్సరాలకు గోవిందు చనిపోవటంతో ముగ్గురు కొడుకులు భూమిని పంచుకున్నారు. ఇప్పుడు ఒక్కొక్కరికి 0.75 హెక్టార్ల భూమి మాత్రమే ఉంది. మెరుగైన సాగునీటి వసతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో కూడా గోవిందు కొడుకులకు భూమినుంచి కుటుంబ అవసరాలు పూర్తిగా తీరడం లేదు. సంవత్సరంలో కొన్ని నెలలపాటు వాళ్లు ఇతర పనులు వెతుక్కోవాల్సి వస్తోంది.*

పక్క పటంలో ఊరిచుట్టూ ఉన్న అనేక చిన్న భూకమతాలను మీరు చూడవచ్చు. వీటిని చిన్న రైతులు సాగు చేస్తారు. ఇంకోవైపున వ్యవసాయ విస్తీర్ణంలో సగంకంటే ఎక్కువ పెద్ద పెద్ద కమతాలను చూడవచ్చు. పుస్తకం చివరి కవర్‌పేజీపై పంటల స్కెచ్ పటం చూడవచ్చు.



*పటం 1 : ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గ్రామంలో సాగుభూమి పంపిణీ*

- పటం 1 లో చిన్నరైతులు సాగుచేసే భూమిని గుర్తించి రంగులు నింపండి.
- అనేక మంది రైతులు ఇంత చిన్న కమతాలను ఎందుకు సాగుచేస్తున్నారు?
- భారతదేశంలో రైతులు, వాళ్లు సాగుచేసే భూముల వివరాలు కింద ఇచ్చిన పట్టికలోనూ, 'పై' చార్టులోనూ ఉన్నాయి.

| రైతుల రకాలు | సాగు భూమి విస్తీర్ణం | రైతుల శాతం | సాగుభూమి శాతం |
|---|---|---|---|
| చిన్న రైతులు | 2 హెక్టార్ల కంటే తక్కువ | 87% | 48% |
| మధ్య తరగతి,పెద్ద రైతులు | 2 హెక్టార్ల కంటేఎక్కువ | 13% | 52% |

**గమనిక:** ఈ గణాంకాలు రైతులు సాగుచేస్తున్న భూమి వివరాలను తెలియజేస్తున్నాయి. ఈ భూమి సొంతం కావచ్చు లేదా కౌలుకు తీసుకున్నది కావచ్చు.

- బాణం గుర్తులు ఏమి సూచిస్తున్నాయి? భారతదేశంలో సాగుభూమి పంపిణీలో అసమానతలు ఉన్నాయని మీరు అంగీకరిస్తారా? మీ సమాధానానికి వివరణ ఇవ్వండి.

రైతుల రకాలు

గ్రాఫ్ 2

రైతులు సాగుచేస్తున్న భూమి పంపిణీ




## ఉత్పత్తి నిర్వహణ

రాంపురంలో ఉత్పత్తి ప్రక్రియను పూర్తిగా అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం.

ప్రజలకు అవసరమైన వస్తువులు, సేవలను అందించటమే ఉత్పత్తి ఉద్దేశం. వస్తువులు లేదా సేవలను ఉత్పత్తి చేయటానికి ఉత్పత్తిదారులకు అనేక వస్తువులు కావాలి. వీటిని ఈ కింది విధంగా వర్గీకరించవచ్చు.

మొదటిదిగా భూమి, నీళ్లు, అడవులు, ఖనిజ లవణాల వంటి సహజ వనరులు కావాలి. రాంపురంలో వ్యవసాయానికి భూమిని, నీటిని ఎలా ఉపయోగించుకుంటున్నారో పైన తెలుసుకున్నాం.

రెండవది శ్రామికులు, అంటే పనిచేసేవాళ్లు కావాలి. కొన్ని ఉత్పత్తి ప్రక్రియలకు అవసరమైన పనులు చెయ్యటానికి బాగా చదువుకున్న, నైపుణ్యాలు ఉన్న కార్మికులు కావాలి. మిగిలిన పనులకు శారీరక శ్రమ చేసే కార్మికులు కావాలి. ప్రతి శ్రామికుడు ఉత్పత్తికి అవసరమైన శ్రమను అందిస్తున్నాడు. సాధారణ వాడుకలో కంటే భిన్నంగా శ్రమ అంటే కేవలం శారీరక శ్రమే కాకుండా ఉత్పత్తికి అవసరమైన మానవ ప్రయత్నాలన్నింటినీ అది సూచిస్తుంది. ఉదాహరణకు ఒకరు ఇంజినీరు, ఒకరు మేనేజరు, ఒకరు అక్కౌంటెంటు, ఒకరు సూపర్‌వైజరు, ఒకరు యంత్ర ఆపరేటరు, ఒకరు సేల్స్ రిప్రజెంటేటివ్, ఒకరు రోజువారీకూలీ కావచ్చు – వీళ్లందరూ ఒక వస్తువును తయారుచేసి, అమ్మటంలో కర్మాగారానికి శ్రమను అందజేస్తున్నారు.

మూడవది పెట్టుబడి, అంటే ఉత్పత్తి యొక్క అన్ని దశలలో అవసరమైన రకరకాల వస్తువులు. పెట్టుబడి కిందకు ఏమేమి వస్తాయి?

**(అ) పనిముట్లు, యంత్రాలు, భవనాలు:** రైతు ఉపయోగించే నాగలిలాంటి పనిముట్ల నుంచి మొదలుకొని జనరేటర్లు, టర్బైన్లు, కంప్యూటర్‌తో నడిచే యంత్రాల వంటి అత్యంత సంక్లిష్టమైన యంత్రాలు ఉండవచ్చు. ఇవి ఉత్పత్తి ప్రక్రియతో అయిపోవు. అనేక సంవత్సరాలపాటు ఇవి వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగపడతాయి. ఇలా సంవత్సరాల తరబడి ఉపయోగపడటానికి వాటికి కొంత మరమ్మతు, నిర్వహణ అవసరం అవుతాయి. వీటిని స్థిర పెట్టుబడి లేదా భౌతిక పెట్టుబడి అంటారు. అయితే అనేక సంవత్సరాలు ఉపయోగించిన తరువాత అన్ని యంత్రాలను తీసేసి కొత్త వాటిని తీసుకురావాల్సి ఉంటుంది. అలా మార్చిన ప్రతిసారి మెరుగైన కొత్త  పనిముట్లు, యంత్రాలు వస్తున్నాయి.

**(ఆ) అవసరమైన ముడిసరుకు, డబ్బు:** ఉత్పత్తి ప్రక్రియలో నేతపనిలో ఉపయోగించే దారం, కుండలతయారీలో ఉపయోగించే మట్టివంటి వాటిని ముడి సరుకులు అంటారు. అదే విధంగా అవసరమైన కొన్ని సరుకులను కొనటానికి, ఉత్పత్తి పూర్తి చేయటానికి కావలసిన చెల్లింపులకు డబ్బు అవసరం అవుతుంది. ఉత్పత్తి పూర్తి చెయ్యటానికి, ఆ వస్తువులు, సేవలను మార్కెట్లో అమ్మటానికి కొంతసమయం పడుతుంది. ఆ తరువాతే ఉత్పత్తి ప్రక్రియకు డబ్బు తిరిగి అందుతుంది. ముడిసరుకు, డబ్బుల ఈ అవసరాన్ని నిర్వాహక పెట్టుబడి అంటారు. యంత్రాలు, పరికరాలు, భవనాలవంటి భౌతిక పెట్టుబడికి ఇది భిన్నమైనది. ఉత్పత్తి ప్రక్రియలో ఇవి పూర్తిగా వినియోగింప బడి చివరకు మిగలవు.

నాల్గవది జ్ఞానం, వ్యాపారదక్షత: భూమి, శ్రమ, భౌతిక పెట్టుబడిని ఉపయోగించుకుని సరుకులు లేదా సేవలు ఉత్పత్తి చెయ్యటానికి ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన జ్ఞానమూ, ఆత్మవిశ్వాసమూ తప్పనిసరి. భౌతిక పెట్టుబడులు ఉన్నవాళ్లు, లేదా నియమించుకున్న మేనేజర్లు ఈ ప్రక్రియలో దోహదపడతారు. యజమానులు మార్కెటు రిస్కును కూడా తీసుకోవాలి, అంటే ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవలకు సరిపడా కొనుగోలుదార్లు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. మన సమాజంలో చాలావరకు వస్తువులు, సేవలను మార్కెట్లో అమ్మకం కోసం ఉత్పత్తి చేస్తారు.  కాబట్టి మార్కెటుకోసం ఉత్పత్తిచేసే వ్యాపారవేత్తలు ప్రణాళికలు రూపొందించుకుని, అన్నింటిని ఏర్పాటు చేసుకుని, వాటిని నిర్వహించాలి. వీళ్లు రైతులు, దుకాణదారులు, చిన్నస్థాయి ఉత్పత్తిదారులు, డాక్టర్లు, లాయర్లు వంటి సేవలు అందించేవాళ్లు, లేదా పెద్ద కంపెనీలు కావచ్చు. వాళ్ల వస్తువులను, సేవలను ప్రజలు కొంటారు. వాళ్లు లాభాలు పొందవచ్చు లేదా నష్టపోవచ్చు.

భూమి, శ్రమ, భౌతిక పెట్టుబడులను కలుపుకుని వ్యక్తులు లేదా వ్యాపారవేత్తలు ఉత్పత్తి చేస్తారు. వీటిని ఉత్పత్తి కారకాలు అంటారు.




*చిత్రం 9.1 : చిన్న రైతు, పెద్ద రైతు : పాఠం లోని తరువాత భాగం చదివి, ఉత్పత్తి కారకాలతో వారికి గల సంబంధాన్ని తెలిపే విధంగా వ్యాఖ్య రాయండి.*

## వ్యవసాయానికి అవసరమైన శ్రమ

భూమి తరువాత ఉత్పత్తికి అవసరమైన అంశాలలో శ్రమ ఒకటి. వ్యవసాయానికి ఎంతో శారీరకశ్రమ అవసరం అవుతుంది. చిన్న రైతులు కుటుంబ సభ్యులతో కలిసి దాదాపుగా తమకు అవసరమైన పనులు తామే చేసుకుంటారు. మధ్యతరగతి రైతులు, పెద్ద రైతులు తమ పొలాల్లో పనిచేయటానికి వ్యవసాయ కూలీలను నియమించుకుంటారు.

భూమిలేని కుటుంబాలనుంచి లేదా చిన్న రైతు కుటుంబాలనుంచి వ్యవసాయ కార్మికులు వస్తారు. తమ సొంతపొలాల్లో పనిచేసే రైతుల మాదిరి కాకుండా వ్యవసాయ కూలీలకు భూమిలో పండించే పంటలపై ఎటువంటి హక్కు ఉండదు. దానికి బదులుగావాళ్లు చేసిన పనికి రైతు కూలీ చెల్లిస్తాడు. ఆ పని చెయ్యటానికి వీళ్లను నియమించుకుంటారు.


*చిత్రం 9.2 : హిమాలయాల్లో బంగాళా దుంపల పంట తీయడం*

డబ్బు రూపేణా కానీ, వస్తు (పంట) రూపేణా కానీ కూలీ ఉండవచ్చు. కొన్ని సమయాల్లో కూలీలకు అన్నం కూడా పెడతారు. ప్రాంతాన్ని బట్టి, పంటను బట్టి, పనిని బట్టి (ఉదాహరణకు విత్తడం, పంటకోత) కూలిరేట్లలో చాలా తేడా ఉంది. పని దొరికే రోజులలో కూడా చాలా తేడా ఉంది. వ్యవసాయ కూలీని రోజువారీ కూలీగా పెట్టుకోవచ్చు, లేదా ఒక ప్రత్యేక పనికి గుత్త పద్ధతిలో పెట్టుకోవచ్చు, లేదా సంవత్సరమంతా జీతానికిపెట్టుకోవచ్చు.

*రాంపురంలో రోజువారీ కూలిపని చేసే భూమిలేని ఒక వ్యవసాయ కూలీ పేరు దళ. అంటే అతడు ప్రతిరోజూ పనికోసం వెతుక్కోవాలి. వ్యవసాయ కూలీలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం కంటే తక్కువ కూలీ దళకు దొరుకుతుంది. రాంపురంలో పనికోసం వ్యవసాయ కూలీల మధ్య తీవ్ర పోటీ ఉంది, కాబట్టి తక్కువ కూలీకైనా పనిచెయ్యటానికి ప్రజలు సిద్ధపడతారు. పెద్దరైతులు ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, పంటకోత యంత్రాలపై ఆధారపడటం పెరగటంతో గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు లభించే పని దినాలు తగ్గిపోతున్నాయి. గత సంవత్సరం మొత్తంలో దళకు వ్యవసాయంలో అయిదు నెలలలోపు పని మాత్రమే దొరికింది. పని దొరకని రోజులలో దళ, అతనిలాంటి వాళ్లు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని ఇప్పించమని పంచాయితీలో దరఖాస్తు చేసుకున్నారు.*

- దళ లాంటి వ్యవసాయ కూలీలు పేదవారుగా ఎందుకు ఉన్నారు?
- తమ కోసం వ్యవసాయ కూలీలు పనిచెయ్యటానికి రాంపురంలోని మధ్యతరగతి, పెద్దరైతులు ఏం చేస్తారు? మీ ప్రాంతంలోని పరిస్థితిని దీనితో పోల్చండి.
- కింది పట్టికను నింపండి:

| ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ | ఒక్కొక్కదానికి మూడు భిన్నమైన ఉదాహరణలు ఇవ్వండి |
|---|---|
| యజమాని/ కుటుంబం కూడా అవసరమైన పని చేస్తారు | |
| పనిచెయ్యటానికి యజమాని కూలీలను నియమిస్తాడు | |

- మీ ప్రాంతంలో వస్తువుల, సేవల ఉత్పత్తిలో ఏ ఏ రకాలుగా శ్రమను పొందుతారు?

*పట్టిక 1 : డిసెంబరు 2011లో వివిధ వ్యవసాయ పనులకు ఆంధ్రప్రదేశ్‌లో రోజువారీ కూలి రేట్లు (రూపాయలలో)*

| కార్మికులు | దున్నటం | విత్తటం | కలుపు తీయటం | నాట్లు వేయటం | కోత | పోత | నూర్పిడి | పత్తి ఏరడం |
|---|---|---|---|---|---|---|---|---|
| పురుషులు | 214 | 197 | 215 | - | 164 | 168 | 152 | - |
| స్త్రీలు | - | 152 | 130 | 143 | 126 | 124 | 118 | 136 |

పై పట్టికలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పనులకు లభిస్తున్న సగటు కూలి రేట్లు ఉన్నాయి. అయితే ప్రాంతాన్ని బట్టి దీనిలో చాలా తేడా ఉంది.

ఒక రోజంతా పత్తి ఏరినందుకు ఒక మహిళకు 136 రూపాయలు లభిస్తాయి. దున్నడం వంటి కొన్ని పనులు ప్రధానంగా పురుషులు చేస్తారు కాబట్టి దాని కింద మహిళలకు కూలీ పేర్కొనలేదు. వరినాట్లు వేయడం, ప్రత్తి ఏరడం వంటి పనులను ప్రధానంగా మహిళలు చేస్తారు. కొన్ని ఉత్పత్తి కార్యకలాపాలలో మహిళలు, పురుషులు కూడా పాల్గొంటారు. ఒకేపని చేస్తున్నప్పటికీ ఆడవాళ్లకంటే మగవాళ్లకు ఎక్కువ కూలీ లభిస్తోంది. రాష్ట్రంలోని యజమానులందరూ (ప్రభుత్వ, ప్రైవేటు) చెల్లించవలసిన కనీస కూలీరేట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది.

- పైన ఇచ్చిన కూలిరేట్లతో మీ ప్రాంతంలో ఏదైనా పనికి అమలులో ఉన్న కూలిరేట్లను పోల్చండి.
- కనీస కూలీరేట్ల గురించి తెలుసుకుని వాటితో పోల్చండి.
- ఒక పనికి ఆడవాళ్ల కంటే మగవాళ్లకు ఎక్కువ కూలీ ఎందుకు లభిస్తోంది? చర్చించండి.

## పెట్టుబడి: భౌతిక పెట్టుబడి, నిర్వహణ పెట్టుబడిని ఏర్పాటు చేసుకోవటం

ఆధునిక వ్యవసాయ పద్ధతులలో అధిక దిగుబడిని ఇచ్చే రకాలు, ఆధారపడదగిన సాగునీరు, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం గురించి మీరు గత తరగతులలో చదివారు. దీని అర్థం ఉత్పత్తి చేయటానికి రైతులకు తగినంత పెట్టుబడి, అంటే డబ్బు కావాలి. రైతులు వ్యవసాయానికి అవసరమైన భౌతిక పెట్టుబడి, నిర్వహణ పెట్టుబడిని ఎలా సమకూర్చుకుంటారో చూద్దాం.

నిర్వహణ పెట్టుబడికోసం చాలామంది చిన్నరైతులు అప్పు చేయాల్సి ఉంటుంది. వాళ్లు పెద్ద రైతులనుంచి కానీ, వడ్డీ వ్యాపారస్తులనుంచి కానీ, సాగుకు అవసరమయ్యే వివిధ ఉత్పాదకాలను సరఫరాచేసే వ్యాపారస్తులనుంచి కానీ అప్పు తీసుకుంటారు. ఇటువంటి అప్పుల మీద వడ్డీ చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ అప్పులు తిరిగి చెల్లించటం వాళ్లకు చాలా భారంగా ఉంటుంది.

*సవిత ఒక చిన్న రైతు. తనకున్న ఒక హెక్టారు భూమిలో ఆమె గోధుమ పండించాలని అనుకుంటోంది. విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులకే కాక నీళ్లు కొనటానికి, తన వ్యవసాయ పరికరాల మరమ్మతుకు కూడా డబ్బులు కావాలి. నిర్వహణ పెట్టుబడి కింద కనీసం 6000 రూపాయలు అవసరమని ఆమె అంచనా. ఆమె దగ్గర డబ్బు లేకపోవటంతో తేజ్‌పాల్ అనే పెద్ద రైతు దగ్గర అప్పు తీసుకోవాలనుకుంది. నాలుగు నెలల్లో తిరిగి ఇవ్వాలన్న షరతుమీద చాలా ఎక్కువ వడ్డీ అయిన 36% వడ్డీకి ఆమెకు అప్పు ఇవ్వటానికి తేజ్‌పాల్ అంగీకరించాడు. కోత సమయంలో రోజుకు వంద రూపాయల కూలీకి తేజ్‌పాల్ పొలంలో పనిచెయ్యటానికి సవిత అంగీకరించాల్సి వచ్చింది. ఇది చాలా తక్కువ కూలి అని తెలుస్తూనే ఉంది. తన పొలంలో కోత పూర్తిచేసి తేజ్‌పాల్ పొలంలో కోతకు వెళ్లటానికి చాలా కష్టపడాల్సి*

*ఉంటుందని సవితకు తెలుసు. కోతల సమయంలో పని ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. ముగ్గురు పిల్లల తల్లిగా ఆమెపై ఇంటిపని భారం కూడా ఎక్కువే. చిన్న రైతుకు అప్పు దొరకటం కష్టం అని తెలుసు కాబట్టి ఆ షరతులన్నింటికీ సవిత ఒప్పుకుంది.*

చిన్న రైతుల మాదిరి కాకుండా మధ్య తరగతి, పెద్ద రైతులకు సాధారణంగా వ్యవసాయ ఆదాయంలోని మిగుళ్లు అందుబాటులో ఉంటాయి. ఆ విధంగా వాళ్లు విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కూలీలకు చెల్లింపులు వంటి వాటికి అవసరమైన నిర్వహణ పెట్టుబడిని సమకూర్చుకోగలుగుతున్నారు. ఈ రైతులకు సొంత మిగుళ్లు ఎలా ఏర్పడుతున్నాయి? దీనికి సమాధానం తరువాతి భాగంలో తెలుస్తుంది.

ఈ గ్రామంలోని పెద్ద రైతులందరికీ ట్రాక్టర్లు ఉన్నాయి. తమ పొలాలను దున్నటానికి, విత్తటానికి ఉపయోగించటమే కాకుండా వీటిని ఇతర చిన్న రైతులకు అద్దెకు ఇస్తారు. వీళ్లల్లో చాలామందికి నూర్పిడి యంత్రాలు ఉన్నాయి, కొంతమందికి పంటకోత యంత్రాలు కూడా ఉన్నాయి. ఈ పెద్ద రైతులందరికీ తమ పొలాలకు సాగునీళ్లు అందించటానికి అనేక బోరుబావులు ఉన్నాయి. ఈ పరికరాలు, యంత్రాలు అన్నీ వ్యవసాయానికి అవసరమైన భౌతిక పెట్టుబడిలో భాగం.

## రైతుకు మిగులు, లేదా నష్టం

ఉత్పత్తికి అవసరమైన మూడు కారకాలను ఉపయోగించుకుని రైతులు తమ పొలంలో గోధుమలు పండించారని అనుకుందాం. ఉత్పత్తిలో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని మిగిలినది బజారులో అమ్ముతారు. సవిత, లేక గోవిందు కొడుకుల వంటి చిన్న రైతులకు మిగులు గోధుమ చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకంటే వీళ్లు ఉత్పత్తి చేసేదే తక్కువ, అందులో చాలావరకు కుటుంబ అవసరాలకు ఉంచుకుంటారు. కాబట్టి మధ్యతరగతి, పెద్ద రైతులే అధిక మొత్తంలో మార్కెటు యార్డుకు గోధుమలు సరఫరా చేస్తారు. మార్కెటు యార్డులోని వ్యాపారస్తులు ఈ గోధుమలను కొని వాటిని తిరిగి పట్టణాలు, నగరాలలోని దుకాణదారులకు అమ్ముతారు.



*చిత్రం 9.3 : మార్కెటుకు తీసుకెళుతున్న గోధుమలు*

*పెద్ద రైతు అయిన తేజ్‌పాల్‌కు అతని భూములన్నింటిలోంచి 350 క్వింటాళ్ల గోధుమ మిగులుగా ఉంటుంది. దీనిని రాయిగంజ్ మార్కెట్టులో అమ్మి పెద్ద మొత్తంలో డబ్బు పొందుతాడు.*

*ఈ డబ్బును తేజ్‌పాల్ ఏం చేస్తాడు? గత సంవత్సరం తేజ్‌పాల్ ఈ డబ్బులో చాలా వరకు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. తరువాత సవిత లాగా అవసరమైన వాళ్లకు అప్పులు ఇచ్చాడు. తర్వాత పంటకాలంలో తన పొలాలకు అవసరమైన నిర్వహణ పెట్టుబడిని కూడా ఈ డబ్బునుంచే సమకూర్చుకున్నాడు. ఈ సంవత్సరం తన సంపాదనతో తేజ్‌పాల్ మరొక ట్రాక్టరు కొనాలనుకుంటున్నాడు. పక్క గ్రామాలలో అద్దె ట్రాక్టర్లకు మంచి గిరాకీ ఉంది. ఇంకొక ట్రాక్టరుతో అతడి స్థిరపెట్టుబడి పెరుగుతుంది.*

తేజ్‌పాల్ లాగానే ఇతర మధ్యతరగతి, పెద్దరైతులు తమ మిగులు వ్యవసాయ ఉత్పత్తిని అమ్ముతారు. ఈ ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేసి, ఆ తరువాత పంట ఖర్చులకు ఉపయోగిస్తారు. కొంతమంది రైతులు తమ మిగులు డబ్బుతో పశువులు, ట్రక్కులు కొంటారు లేదా దుకాణాలు పెడతారు. ఇవి వ్యవసాయేతర పనులకు పెట్టుబడి అవుతాయి. వాళ్లు ఇంకా భూమి కూడా కొనవచ్చు.

వ్యవసాయ పనులలో నష్టంకూడా వస్తూ ఉంటుంది. వరదలు, పురుగుల వల్ల పంట నష్టపోయినప్పుడు ఇలా జరుగుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవటంవల్ల కూడా నష్టాలు రావచ్చు. ఇటువంటి సందర్భాలలో చిన్న రైతులకు తాము పెట్టిన పెట్టుబడిని తిరిగి పొందటం కూడా చాలా కష్టమౌతుంది.

**మిగులు, ఉత్పత్తికి పెట్టుబడి**

- ముగ్గురు రైతులను తీసుకోండి. ముగ్గురూ గోధుమలు పండించారు. అయితే వాళ్లు ఉత్పత్తి చేసిన దానిలో తేడా ఉంది (రెండవ నిలువు వరస). వివిధ రైతులు ఎదుర్కొనే పరిస్థితిని విశ్లేషించటానికి కొన్ని అంశాలు అందరికీ సమానమని అనుకోవాలి. తేలికగా లెక్క కట్టటానికి ఈ అంశాలను అనుకుందాం:

1. ప్రతి రైతు కుటుంబం వినియోగించే గోధుమల మొత్తం సమానం (మూడవ నిలువు వరస).
2. ఈ సంవత్సరంలో మిగిలిన గోధుమనంతా వచ్చే సంవత్సరం విత్తనంగా రైతులందరూ ఉపయోగించుకుంటారు. అందుకు వాళ్లకు తగినంత భూమి ఉంది.
3. అందరికి ఉపయోగించిన విత్తనంకంటే రెట్టింపు దిగుబడి వస్తుందనుకుందాం. ఉత్పత్తిలో ఎటువంటి అకస్మాత్తు నష్టాలు లేవు.

**పట్టికను పూర్తి చెయ్యండి.**

**1వ రైతు**

| సం॥ము | ఉత్పత్తి | వినియోగం | మిగులు = ఉత్పత్తి - వినియోగం | వచ్చే సంవత్సరానికి పెట్టుబడి |
|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 100 | 40 | 60 | 60 |
| 2వ సంవత్సరం | 120 | 40 | | |
| 3వ సంవత్సరం | | 40 | | |

**2వ రైతు**

| సం॥ము | ఉత్పత్తి | వినియోగం | మిగులు | వచ్చే సంవత్సరానికి పెట్టుబడి |
|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 80 | 40 | | |
| 2వ సంవత్సరం | | 40 | | |
| 3వ సంవత్సరం | | 40 | | |

**3వ రైతు**

| సం॥ము | ఉత్పత్తి | వినియోగం | మిగులు | వచ్చే సంవత్సరానికి పెట్టుబడి |
|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 60 | 40 | | |
| 2వ సంవత్సరం | | 40 | | |
| 3వ సంవత్సరం | | 40 | | |

- మూడు సంవత్సరాలలో ముగ్గురు రైతుల గోధుమ ఉత్పత్తిని పోల్చండి.
- 3వ రైతు పరిస్థితి 3వ సంవత్సరంలో ఏమవుతుంది? అతడు ఉత్పత్తిని కొనసాగించగలడా? ఉత్పత్తిని కొనసాగించటానికి అతడు ఏం చెయ్యాలి?




*చిత్రం 9.4 : తేయాకు, రబ్బరు తోటలు. వ్యవసాయ రంగంలో తేయాకు, కాఫీ, రబ్బరు, పళ్లతోటలు వంటివి కూడా వస్తాయి.*

## రాంపురంలో వ్యవసాయేతర పనులు

ప్రధాన ఉత్పత్తి కార్యకలాపమైన వ్యవసాయం కాకుండా రాంపురంలో కొన్ని వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలు ఉన్నాయి. రాంపురంలో పని చేసేవాళ్లల్లో 25 శాతం మంది మాత్రమే వ్యవసాయేతర పనుల్లో ఉన్నారు.

### పాడి పరిశ్రమ – రెండవ సాధారణ కార్యకలాపం

రాంపురంలో అనేక కుటుంబాలు పాల ఉత్పత్తి చేస్తాయి. గేదెలకు వివిధ రకాల గడ్డి, వానాకాలంలో సాగుచేసే జొన్న, సజ్జ మేతను మేపుతారు. రాయిగంజ్‌లో పాలు అమ్ముతారు. జహంగీరాబాదుకు చెందిన ఇద్దరు వ్యాపారస్తులు రాయిగంజ్‌లో పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాలను వీళ్లు బులంద్‌షహర్, ఢిల్లీ వంటి దూర ప్రదేశాలకు రవాణా చేస్తారు. ఈ పనిలోని ఉత్పత్తి కారకాలను క్లుప్తంగా తెలుసుకుందాం:

భూమి: గ్రామంలో సొంత కొట్టం (షెడ్డు).

శ్రమ: కుటుంబశ్రమ; ప్రధానంగా మహిళలు గేదెల పోషణ పని చూస్తారు.

భౌతిక పెట్టుబడి: పశువుల సంతలో కొన్న గేదెలు.

నిర్వహణ పెట్టుబడి: తమ భూమిలోంచి వచ్చిన పశువుల మేతతో పాటు కొన్న మందులు.

## రాంపురంలో చిన్నతరహా వస్తువుల తయారీ

ప్రస్తుతం రాంపురంలో వస్తువుల తయారీ (ఉత్పత్తి) పరిశ్రమలో ఉపాధి పొందుతున్న వాళ్లు 50 కంటే తక్కువ మంది ఉన్నారు. పెద్ద నగరాలు, పట్టణాలలోని కర్మాగారాలలో జరిగే ఉత్పత్తి మాదిరి కాకుండా రాంపురంలో ఉత్పత్తి తేలిక పద్ధతులు ఉపయోగించి, చిన్న స్థాయిలో జరుగుతుంది. వీటిని సాధారణంగా ఇంటి దగ్గరకానీ, పొలం దగ్గరకానీ పనిచేస్తూ కుటుంబ శ్రమను ఉపయోగించి చేస్తారు. కూలీలను వినియోగించటం చాలా తక్కువ.

*మిశ్రిలాల్ విద్యుచ్ఛక్తితో పనిచేస్తూ చెరకు రసం తీసే యంత్రం కొని బెల్లం తయారుచేస్తాడు. అంతకు ముందు చెరకురసం తియ్యడానికి ఎడ్లను ఉపయోగించేవాళ్లు, కానీ ఇప్పుడు అందరూ యంత్రాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తను పండించిన చెరకును ఉపయోగించటమే కాకుండా మిశ్రిలాల్*

*ఇతర రైతుల నుంచి కూడా చెరకు కొని బెల్లం తయారుచేస్తాడు. ఈ బెల్లాన్ని జహంగీరాబాదులో అమ్ముతాడు. ఈ క్రమంలో మిశ్రిలాల్ కొంత లాభం చేసుకుంటాడు.*

- ఈ పనికి మిశ్రిలాల్‌కు ఏ భౌతిక పెట్టుబడులు అవసరం అయ్యాయి?
- దీనికి శ్రమ ఎవరిద్వారా అందుతోంది?
- మిశ్రిలాల్ తన లాభాన్ని ఎందుకు పెంచుకోలేక పోతున్నాడు? అతడికి నష్టాలు వచ్చే సందర్భాలు ఏమిటో ఆలోచించండి.
- బెల్లాన్ని మిశ్రిలాల్ తన ఊళ్లో కాకుండా జహంగీరాబాదులోని వ్యాపారస్తులకు ఎందుకు అమ్ముతున్నాడు?

**రాంపురంలోని దుకాణదారులు**

రాంపురంలో వ్యాపారంలో (వస్తువుల మార్పిడిలో) ఉన్నవాళ్లు ఎక్కువగా లేరు. రాంపురంలోని వ్యాపారస్తులు నగరాలలోని హోల్‌సేల్ మార్కెట్లలో సరుకులు కొనుక్కొచ్చి వాటిని రాంపురంలో అమ్ముతారు. రాంపురంలోని చిన్న కిరాణా కొట్లు బియ్యం, గోధుమలు, పంచదార, టీ, నూనె, బిస్కెట్లు, సబ్బులు, టూత్‌పేస్ట్, బ్యాటరీలు, కొవ్వొత్తులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బట్టలు కూడా అమ్ముతాయి.

బస్‌స్టాండ్‌కు దగ్గరగా ఉన్న ఇళ్లల్లో కొన్ని కుటుంబాల వాళ్ళు తమకున్న స్థలంలో కొంత దుకాణాలు తెరవడానికి ఉపయోగించారు. వాళ్లు టీ, సమోసా, కచోరి, కారా, మిఠాయిలు, చాక్‌లెట్లు, శీతల పానీయాలు వంటివి అమ్ముతారు. కుటుంబంలోని మహిళలు, పిల్లలు ఈ పనిలో పాలుపంచుకుంటారు. మన దేశంలో రైతులు, దుకాణదారులు, బజార్లలో తిరిగి వస్తువులు అమ్మేవాళ్లలాగా చాలామంది స్వయం ఉపాధి ఉన్నవాళ్లు ఉన్నారు. వస్తువులు, సేవల ఉత్పత్తికి ప్రణాళికలు తయారుచేసి, ఆ పనులు చేపట్టి అందులోని లాభనష్టాలను భరించాల్సి ఉంటుంది కాబట్టి వాళ్లు యజమానులౌతారు. అదే సమయంలో ఈ ప్రక్రియలో తమ సొంత శ్రమను ఉపయోగిస్తారు.

- ఎవరి స్థలంలో దుకాణాలను నెలకొల్పుతారు?
- తినే వస్తువులు అమ్మే ఈ దుకాణాలలో శ్రమ ఎవరిది?
- ఇటువంటి దుకాణాలకు ఎలాంటి నిర్వహణ పెట్టుబడి అవసరం అవుతుంది?
- భౌతిక పెట్టుబడి కిందికి వచ్చేవాటిని పేర్కొనండి.
- మీ ప్రాంతంలో బజారులో తిరుగుతూ సరుకులు అమ్మేవాళ్లల్లో ఒకరినుంచి వాళ్ల రోజువారీ అమ్మకాలు ఎంతో తెలుసుకోండి. ఏమైనా పొదుపు చేస్తున్నారో, లేదో ఎలా తెలుస్తుంది? టీచరుతో చర్చించండి.

కొంతమంది దుకాణదారులు గ్రామంలో ఉత్పత్తి అవుతున్న వాటిని కొని పెద్ద గ్రామాలు లేదా పట్టణాల్లోని మార్కెట్లలో దుకాణాలకు తిరిగి అమ్ముతారు. ఉదాహరణకు పిండిమర నడిపే వ్యక్తి గ్రామంలోని చిన్న రైతులనుంచి గోధుమలు కొని, వాటిని రాయిగంజ్ మార్కెట్లో అమ్ముతాడు. పిండిమర నిర్వహించడం, గోధుమలు కొని, అమ్మటం రెండూ వేరువేరు వ్యాపారాలు.

## రవాణా; వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం

రాంపురం నుంచి రాయిగంజ్‌కు రోడ్డు మార్గంలో అనేక రకాల వాహనాలు ఉన్నాయి – రిక్షాలు, జట్కాలు, జీపు, ట్రాక్టరు, లారీ. రవాణా రంగంలో లారీ డ్రైవర్లు, ఎడ్ల బళ్లు, జట్కాలను నడిపేవాళ్లు మొదలైన వ్యక్తులు ఉన్నారు. వాళ్లు మనుషులను, వస్తువులను ఒక చోటునుంచి మరొకచోటుకు చేర్చి దానికి బదులుగా డబ్బులు తీసుకుంటారు. గత కొద్ది సంవత్సరాలుగా రవాణాలో ఉన్నవాళ్ల సంఖ్య పెరుగుతోంది.

*కిశోర్ ఒక వ్యవసాయ కూలి. ఇతర కూలీల మాదిరిగానే కిశోర్‌కు వ్యవసాయ కూలి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోయేది కాదు. కొన్ని సంవత్సరాల క్రితం కిశోర్ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడు. భూమిలేని పేద కుటుంబాలకు తక్కువ వడ్డీపై రుణాలు ఇచ్చే ప్రభుత్వ కార్యక్రమం కింద అతడు ఈ రుణం తీసుకున్నాడు. ఈ డబ్బుతో కిశోర్ ఒక గేదెను కొన్నాడు. ఇప్పుడు అతడు గేదె పాలు అమ్ముతున్నాడు. అంతేకాదు అతడు తన గేదెకు బండిని కట్టి వివిధ సరుకులను రవాణా చేస్తాడు. వారానికి ఒకసారి గంగానదికి వెళ్లి కుండలు చేసే వ్యక్తికి బంకమట్టి తెస్తాడు. లేదా బెల్లం, ఇతర సరుకులు తీసుకుని అప్పుడప్పుడు జహంగీరాబాదు వెళతాడు. ప్రతి నెల అతడికి రవాణాలో కొంత పని దొరుకుతుంది. ఫలితంగా కొన్ని సంవత్సరాల క్రితం కంటే కిశోర్ ఎక్కువ ఆదాయం పొందుతున్నాడు.*

- కిశోర్ స్థిర పెట్టుబడి ఏమిటి? అతడి నిర్వహణ పెట్టుబడి ఏమై ఉంటుంది?
- కిశోర్ ఎన్ని ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొంటూ ఉన్నాడు?
- రాంపురంలో మెరుగైన రోడ్ల వల్ల కిశోర్ లాభపడ్డాడా?

## సారాంశం

ఈ గ్రామంలో వ్యవసాయం ప్రధానమైన పని. కాలక్రమంలో వ్యవసాయ పద్ధతుల్లో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయి. దీనివల్ల అంతే భూమినుంచి రైతులు మరింత ఎక్కువ పంటలు పండిస్తున్నారు. ఇది ముఖ్యమైన పరిణామం – ఎందుకంటే భూమి తక్కువగా ఉంది, స్థిరంగా ఉంది. కానీ ఉత్పత్తిని పెంచటంలో భూమిమీద, సహజ వనరులపైన ఒత్తిడి పెరిగింది. ఉత్పత్తి పద్ధతులను సమీక్షించి, వనరులను సుస్థిర విధానంలో ఉపయోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యవసాయానికి ఇప్పుడు ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతోంది. ఉత్పత్తిలో మిగుల్చుకున్న డబ్బు ద్వారా మధ్యతరగతి, పెద్ద రైతులకు తరువాతి పంటకు పెట్టుబడి ఏర్పాటు అవుతుంది. ఇంకొకవైపున భారతదేశంలో 87 శాతంగా ఉన్న చిన్న రైతులకుపెట్టుబడి దొరకటం కష్టంగా ఉంది. వాళ్ల సాగుభూమి తక్కువగా ఉండటం వల్ల వాళ్ల ఉత్పత్తి సరిపోదు. అదనపు ఉత్పత్తి లేనందువల్ల వాళ్ల మిగులునుంచి పెట్టుబడి అందక అప్పు చెయ్యాల్సి వస్తుంది. తక్కువ ఆదాయం కారణంగా చిన్న రైతులు వ్యవసాయ కూలీ పనికి వెళ్లాల్సి వస్తుంది.

ఉత్పత్తి కారకాలలో శ్రమ ప్రధానకారణమైనందున కొత్త వ్యవసాయ పద్ధతులు ఎక్కువ శ్రమను ఉపయోగించుకోగలిగితే బాగుంటుంది. దురదృష్టవశాత్తు ఇటువంటిది జరగలేదు. వ్యవసాయంలో శ్రమను మితంగా ఉపయోగించుకుంటున్నారు. దాంతో శ్రామికులు అవకాశాల కోసం వెదుక్కుంటూ పక్క గ్రామాలకు, పట్టణాలు, నగరాలకు వలస వెళుతున్నారు. కొంతమంది కార్మికులు గ్రామంలో వ్యవసాయేతర పనులు చేపడుతున్నారు.

ప్రస్తుతం గ్రామాలలో వ్యవసాయేతర పనులు అంత ఎక్కువగా లేవు. గ్రామాలలో అనేక రకాల వ్యవసాయేతర పనులలో (మనం కొన్ని ఉదాహరణలే చూశాం) చాలా కొద్దిమందికే ఉపాధి దొరుకుతోంది. 2009–2010 లో భారతదేశంలోని ప్రతి 100 మంది గ్రామీణ కార్మికులలో 32 మంది వ్యవసాయేతర పనులలో ఉన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

కింద వివిధ పనులు చేసేవాళ్లు కూడా ఇందులో ఉన్నారు. గ్రామీణ కార్మికులకు ఉపాధి హామీ పథకం కొంత అదనపు ఆదాయాన్ని ఇచ్చింది.

భవిష్యత్తులో గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలు ఇంకా పెరగాలి. వ్యవసాయంలా కాకుండా వ్యవసాయేతర పనులకు చాలా తక్కువ భూమి కావాలి. కొంత పెట్టుబడి ఉన్న వాళ్లు వ్యవసాయేతర పనులు చేపట్టవచ్చు. ఎవరికైనా పెట్టుబడి ఎలా లభిస్తుంది? ఇందుకు సొంతంగా ఉన్న పొదుపు మొత్తాలను ఉపయోగించవచ్చు, అయితే తరచుగా దానికోసం అప్పు తీసుకోవాల్సి వస్తుంది. తక్కువ వడ్డీతో అప్పులు అందుబాటులో ఉండటం ముఖ్యం, అప్పుడు పొదుపు మొత్తాలు లేనివాళ్లు కూడా అప్పు తీసుకుని ఏదో ఒక వ్యవసాయేతర పని మొదలుపెట్టగలుగుతారు. వ్యవసాయేతర పనులు విస్తరించటానికి మరొక ముఖ్యమైన అవసరం ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవలు అమ్మటానికి మార్కెటు ఉండటం. రాంపురంలో ఉత్పత్తి అవుతున్న పాలు, బెల్లం, గోధుమల వంటి వాటికి చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలు, నగరాలలో మార్కెటు ఉండటాన్ని చూశాం. మంచిరోడ్లు, రవాణా, టెలిఫోను సౌకర్యం వంటివి మెరుగుపడటం ద్వారా గ్రామాలకు పట్టణాలు, నగరాలతో మంచి అనుసంధానం ఏర్పడి రానున్న సంవత్సరాలలో గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలు పెరుగుతాయి.

### కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| ఉత్పత్తి కారకాలు | భూమి | శ్రమ | నిర్వహణ పెట్టుబడి |
| స్థిర పెట్టుబడి | మిగులు | వ్యవసాయ కార్యకలాపాలు | వ్యవసాయేతర కార్యకలాపాలు |

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. భారతదేశంలోని ప్రతి గ్రామాన్ని ప్రతి పదేళ్ళకు ఒకసారి జనాభా గణనలో సర్వేచేసి కింద ఇచ్చిన విధంగా వివరాలను పొందుపరుస్తారు. రాంపురానికి సంబంధించిన సమాచారం ఆధారంగా కింది వివరాలను నింపండి.
   అ. ఎక్కడ ఉంది (ఉనికి) :
   ఆ. గ్రామ మొత్తం విస్తీర్ణం:
   ఇ. భూ వినియోగం హెక్టార్లలో:

| సాగులో ఉన్న భూమి | | సాగుకు అందుబాటులో లేని భూమి (ఇళ్ళు, రోడ్లు, చెరువులు, పశువులబీడు ఉన్న ప్రాంతం) |
|---|---|---|
| సాగునీటి కింద | సాగునీరు లేకుండా | |
| | | 26 హెక్టార్లు |

ఈ. సౌకర్యాలు

| | |
|---|---|
| విద్య | |
| వైద్యం | |
| మార్కెటు | |
| విద్యుత్తు సరఫరా | |
| ప్రసార సాధనాలు | |
| సమీప పట్టణం | |

2. రాంపురంలోని వ్యవసాయ కూలీలకు కనీస కూలీ కంటే తక్కువ కూలి ఎందుకు లభిస్తోంది?

3. మీ ప్రాంతంలోని ఇద్దరు కూలీలతో మాట్లాడండి. ఇందుకు వ్యవసాయ కూలీలనుగానీ, భవన నిర్మాణంలో పని చేసేవాళ్ళనుగానీ ఎంచుకోండి. వాళ్ళకు ఎంత కూలీ లభిస్తోంది? వాళ్ళకు నగదు రూపంలో చెల్లిస్తారా, వస్తు రూపంలోనా? వాళ్ళకు క్రమం తప్పకుండా పని దొరుకుతుందా? వాళ్ళ అప్పుల్లో ఉన్నారా?

4. ఒకే విస్తీర్ణం ఉన్న భూమినుంచి ఉత్పత్తిని పెంచటానికి ఉన్న వివిధ పద్ధతులు ఏమిటి? కొన్ని ఉదాహరణలతో వివరించండి.

5. మధ్యతరగతి, పెద్ద రైతులకు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి ఎలా సమకూరుతుంది? చిన్నరైతులకూ వీళ్ళకు మధ్య ఉన్న తేడా ఏమిటి?

6. ఏ షరతుల మీద తేజ్‌పాల్‌నుంచి సవిత అప్పు పొందింది? తక్కువ వడ్డీకి బ్యాంకు నుంచి రుణం లభిస్తే సవిత పరిస్థితి భిన్నంగా ఉండేదా?

7. మీ ప్రాంతంలోని పెద్దవాళ్ళతో మాట్లాడి గత 30 సంవత్సరాలలో సాగునీటి విధానాలలోనూ, వ్యవసాయ పద్ధతులలోనూ వచ్చిన మార్పుల గురించి ఒక నివేదిక రాయండి.

8. మీ ప్రాంతంలోని ప్రధాన వ్యవసాయేతర పనులు ఏమిటి? ఏదైనా ఒక కార్యక్రమాన్ని ఎంచుకుని ఒక చిన్న నివేదిక తయారుచేయండి.

9. ఉత్పత్తికి భూమి కాకుండా శ్రమ కొరతగా ఉండే పరిస్థితిని ఊహించుకోండి. అప్పుడు రాంపురం కథ ఇందుకు భిన్నంగా ఉండేదా? ఎలా? తరగతిలో చర్చించండి.

10. గోసాయిపూర్, మజాలి అనేవి ఉత్తర బీహార్‌లోని రెండు గ్రామాలు. రెండు గ్రామాలలోని 850 కుటుంబాలనుంచి 250 కంటే ఎక్కువ మగవాళ్ళు పంజాబ్ లేదా హర్యానా గ్రామీణ ప్రాంతాలలో, లేదా ఢిల్లీ, ముంబయి, సూరత్, హైదరాబాదు, నాగపూర్ వంటి నగరాలలో పనిచేస్తున్నారు. ఇలా వలస వెళ్ళటం భారతదేశమంతటా గ్రామాలలో సాధారణమే. ప్రజలు ఎందుకు వలస వెళతారు? (గత అధ్యాయానికి మీ ఊహను జోడించి) గోసాయిపుర్, మజాలి గ్రామాలనుంచి వలస వెళ్ళినవాళ్లు ఆయా ప్రాంతాలలో ఏ పని చేస్తారో రాయండి.

11. పట్టణ ప్రాంతాలలో వస్తువుల ఉత్పత్తికి కూడా భూమి అవసరం. గ్రామీణ ప్రాంతంలో భూ వినియోగానికీ, దీనికీ తేడా ఏమిటి?

12. ఉత్పత్తి ప్రక్రియలో "భూమి" అన్న దాని అర్థం మరొకసారి చదవండి. వ్యవసాయం కాకుండా ఇతర ఉత్పత్తి ప్రక్రియలో భూమి ముఖ్యమైన అవసరంగా ఉన్న మరొక మూడు ఉదాహరణలు ఇవ్వండి.

13. ఉత్పత్తికి, ప్రత్యేకించి వ్యవసాయానికి అవసరమైన నీరు ఒక సహజ వనరు. ఇప్పుడు నీటిని పొందటానికి దీని వినియోగానికి ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతోంది. ఈ వాక్యాలను వివరించండి.

పాఠం 10

# ప్రపంచీకరణ







*అ&ఆ) బడికి వెళ్లటం, ఇ) బడి ప్రవేశద్వారం, ఈ) తరగతి గదిలో, ఉ) నల్ల బల్ల దగ్గర టీచరు. మీకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే కింది లింకులో పూర్తి ప్రకటనను చూడండి:*
http://www.youtube.com/watch?v=VHYtShXI510

మీరు పైన చూస్తున్నది లండన్ నుంచి ప్రచురితమవుతున్న ఒక పత్రిక ప్రకటన. భారతదేశంలో చందాదారుల సంఖ్య పెంచుకోవడం దీని ఉద్దేశం. భారతీయ పాఠకులను ఆకట్టుకోటానికి చైనా వంటి దేశాలు భారతదేశంపై శ్రద్ధ పెట్టి భారతీయ భాషలను నేర్చుకుంటున్నాయని అది చెపుతున్నట్టుగా ఉంది. ఇది భారతీయ ఉత్పత్తిదారులు లేదా వ్యాపారస్తులను ఉద్దేశించింది కావచ్చు, లేదా భారతదేశం వెళ్లి పని చెయ్యాలనుకుంటున్న చైనా కార్మికులను ఉద్దేశించింది కావచ్చు. అంటే, ఈ ప్రకటనలో ప్రపంచీకరణ వివిధ కోణాలను మీరు చూడవచ్చు: బ్రిటన్‌లో ఇంగ్లీషులో ప్రచురితమవుతున్న పత్రిక భారతదేశంలో కొనుగోలుదారుల కోసం చూస్తోంది; చైనీయులు భారతీయ భాషలను నేర్చుకోటానికి ప్రయత్నిస్తూ, భారతదేశంలో తమ వస్తువులను అమ్మాలని, తమ కార్మికులను అక్కడికి పంపించాలని, భారతీయ భాగస్వాములతో వ్యాపారం చెయ్యాలని అనుకుంటున్నారు.

20వ శతాబ్దం చివరలో ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ముఖ్యమైన పరిణామాల్లో ప్రపంచీకరణ ఒకటి. దీనికి రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక కోణాలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అంశాలను ఎనిమిదవ, తొమ్మిదవ తరగతులలో సేవారంగంలో కాల్ సెంటర్ వంటి కొత్త ఉద్యోగ అవకాశాలు ఏర్పడటం వంటివి చూశారు. మార్కెటులో పెద్ద సంఖ్యలో వినియోగ వస్తువులు లభిస్తున్నాయన్నది మీకు తెలుసు. అంతర్జాతీయ ఆర్థిక మార్పిడిలతో మనం మూడు రకాల ప్రవాహాలను గుర్తించవచ్చు. మొదటిది వస్తువులు, సేవల ప్రవాహం. రెండవది శ్రమ ప్రవాహం – ఉపాధికోసం వెతుక్కుంటూ ప్రజలు వలస వెళ్లటం. మూడవది పెట్టుబడి ప్రవాహం – స్వల్పకాల, లేదా దీర్ఘకాల ప్రయోజనాల కోసం దూరప్రాంతాలకు పెట్టుబడి ప్రవహించటం. ఇవేకాక ప్రపంచీకరణకు రాజకీయ, సాంస్కృతిక కోణాలు ఉన్నాయి. ఉదాహరణకు పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికాలలో ట్యునీసియా, ఈజిప్టు వంటి అనేక దేశాలు ఒకదానితో ఒకటి ప్రభావితమై నియంతలను తొలగించటానికి విప్లవాలు చోటు చేసుకున్నాయి. ప్రసార మాధ్యమాల్లో దీనిని 'అరబ్ వసంతంగా' పేర్కొన్నారు. ఈ దేశాలలో ప్రసార మాధ్యమాలు కీలకమైన పాత్రను పోషించాయి. ఇతర దేశాల యాజమాన్యంలో ఉండి వాళ్లతో నడపబడుతున్న టీవీ ఛానెళ్లు ప్రజలకు మద్దతు ఇవ్వటంతో స్థానిక నాయకుల అధికారాలను నియంత్రించటం వీలైంది. పౌరయుద్ధం, సునామీ వంటి ప్రకృతి వైపరీత్యాలు జాతీయ సరిహద్దులకు లోబడి చర్చించినప్పటికీ వాటికి ప్రపంచం నలుమూలల నుంచి మద్దతు, సానుభూతి లభిస్తుంది. ప్రపంచీకరణ కేవలం మార్కెట్‌కే పరిమితమై లేదు, ఆలోచనలు , భావాలు కూడా పంచుకోబడి విస్తృతమౌతున్నాయి.

- మొబైల్ ఫోన్లు లేదా వాహనాలు వంటి ఏదో ఒక దానిని తీసుకోండి. మార్కెట్లో అందుబాటులో ఉన్న బ్రాండ్లను గుర్తించండి. వాటి యజమానులు ఎవరు? అవి భారతదేశంలో తయారవుతున్నాయా? మీ తల్లిదండ్రులతో లేదా ఇతర పెద్దవాళ్లతో చర్చించి 30 సంవత్సరాల క్రితం ఎన్ని బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోండి.

## 19వ శతాబ్దంలో కార్మికుల వలస

*ప్రపంచీకరణను 20వ శతాబ్దపు చివరి దశలోని పరిణామంగా చాలామంది అనుకుంటారు. ప్రపంచీకరణలోని ప్రస్తుత దశ మొదలై 30, 40 సంవత్సరాలు అవుతోందన్నది నిజమేకానీ, దేశాల మధ్య సంబంధాలు ఏర్పడిన ముఖ్యమైన దశలు ప్రపంచ చరిత్రలో ఉన్నాయి. 19వ శతాబ్దంలో విదేశీ వ్యాపారం, విదేశాలలో పెట్టుబడులు, కార్మికుల వలసలు వేగం పుంజుకున్నాయి. వస్తువులు, పెట్టుబడులు కదిలినంత స్వేచ్ఛగా కార్మికుల వలసలు లేనప్పటికీ దాదాపుగా అయిదుకోట్ల మంది యూరపునుంచి అమెరికా, ఆస్ట్రేలియాలకు వెళ్లి ఉంటారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల మంది తమ ఇళ్లను వదిలి వెళ్లారని లెక్కగట్టారు. వలసపాలకుల ప్రణాళికలలో భాగంగా లక్షలాది భారతీయ, చైనా కార్మికులు ప్రపంచవ్యాప్తంగా తోటలలో, గనులలో, రోడ్డు, రైలు మార్గ నిర్మాణ పథకాలలో పని చెయ్యటానికి వలస వెళ్లారు. వీళ్లలో చాలామంది ఒప్పంద కూలీలు. అంటే కొత్త దేశానికి, లేదా ప్రాంతానికి ప్రయాణానికయ్యే ఖర్చును యజమాని పెట్టుకోగా దానికి బదులుగా ఒక నిర్దిష్ట కాలంపాటు అతని వద్ద పని చేస్తానని కార్మికుడు ఒప్పందం కుదుర్చుకుంటాడు, అతడికి కట్టుబడి ఉంటాడు. ఈ విధంగా భారతదేశంనుంచి కార్మికులు కరేబియన్ దీవులకు, మారిషస్, ఫిజీ, మలయా, శ్రీలంక వంటి దేశాలకు వెళ్లారు. అక్కడ నివాస, పని పరిస్థితులు చాలా దారుణంగా ఉండటమేకాక వాళ్ళకు ఎటువంటి చట్టబద్ధమైన హక్కులు ఉండేవి కావు. ఇలా వలస వెళ్లిన వాళ్లల్లో చాలామంది ఆయా దేశాలలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఈ విధంగా సాంస్కృతిక మేళవింపులు అనేకం జరిగాయి.*

*ఇటీవల ప్రపంచీకరణ అనుభవంలో కార్మికుల వలస ఇంత పెద్ద ఎత్తున జరగలేదన్నది గమనించాల్సిన విషయం. ఈనాడు వృత్తినైపుణ్యాలు ఉన్న ప్రజల వలసకు గిరాకీ ఉంది, అయితే ఇది పరిమితంగా ఉండి, తరచు వైరుధ్యాలకు దారితీస్తోంది.*

ఈ పాఠంలో ప్రపంచీకరణలో భాగంగా గత 30, 40 సంవత్సరాలలో చోటు చేసుకున్న ఆర్థిక అంశాలను చూద్దాం.

## పలు దేశాలలో ఉత్పత్తి

20వ శతాబ్దం మధ్యభాగం వరకు ఉత్పత్తిని ప్రధానంగా దేశంలోపల నిర్వహించేవాళ్లు. ముడి సరుకులు, ఆహార ధాన్యాలు, తయారైన వస్తువులను మాత్రమే దేశ సరిహద్దులను దాటి వెళ్లేవి. భారతదేశం వంటి వలస దేశాలు ముడి సరుకులు, ఆహార ధాన్యాలను ఎగుమతి చేసి, తయారైన సరుకులను దిగుమతి చేసుకునేవి. దూరదేశాలను కలపటానికి వాణిజ్యం ప్రధాన మార్గంగా ఉండేది. ఇది పెద్ద బహుళజాతి సంస్థలు (MNCs) రంగప్రవేశం చెయ్యటానికి ముందు పరిస్థితి. ఒక దేశంకంటే ఎక్కువ దేశాలలో ఉత్పత్తిని చేపట్టే లేదా ఉత్పత్తులను నియంత్రించే సంస్థలను బహుళజాతి సంస్థ (MNC) అంటారు. కార్మికులు, ఇతర వనరులు చౌకగా లభించే ప్రాంతాలలో బహుళజాతి సంస్థలు తమ కార్యాలయాలను, కర్మాగారాలను నెలకొల్పుతాయి. ఉత్పత్తి ఖర్చులను తగ్గించి తమ లాభాలను పెంచుకోటానికి బహుళజాతి సంస్థలు ఇలా చేస్తాయి.

ఈ ఉదాహరణను చూడండి. పారిశ్రామిక పరికరాలను తయారుచేసే ఒక పెద్ద బహుళజాతి సంస్థ వాటిని అమెరికాలోని పరిశోధనా కేంద్రాలలో డిజైన్ చేస్తుంది. దాంట్లోని విడి భాగాలు చైనాలో తయారవుతాయి. ఈ విడిభాగాలను మెక్సికో, తూర్పు యూరపు దేశాలకు పంపించి అసెంబ్లింగ్ చేస్తారు. ఆ తరువాత పూర్తి అయిన సరుకులను, ప్రపంచం అంతటా అమ్ముతారు. భారతదేశంలోని కాల్ సెంటర్లు ఈ సంస్థల 'వినియోగదారుల సేవ (Customer Care)ల ద్వారా సేవలు అందిస్తారు. (ఈ దేశాలను ప్రపంచ పటంలో గుర్తించండి.)

ఈ ఉదాహరణలో బహుళజాతి సంస్థ తన వస్తువులను ప్రపంచవ్యాప్తంగా అమ్మటమే కాకుండా వస్తువులు, సేవల ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసింది. దీని ఫలితంగా ఉత్పత్తి ప్రక్రియ అనేక సంక్లిష్ట రూపాలలో నిర్వహింపబడుతుంది. ఉత్పత్తి ప్రక్రియను చిన్న చిన్న భాగాలుగా చేసి వాటిని ప్రపంచంలో పలు చోట్ల చేపడతారు. పై ఉదాహరణలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చెయ్యగల దేశంగా చైనా ఉపయోగపడింది. అమెరికా, యూరపులలోని మార్కెట్లకు దగ్గరగా ఉండటంతో మెక్సికో, తూర్పు యూరపులో అసెంబ్లింగ్ చేపట్టారు. భారతదేశంలో ఇంగ్లీషు మాట్లాడగలిగిన విద్యావంతులైన యువత కస్టమర్ కేర్ సేవలను అందిస్తున్నారు. వీటన్నిటి ఫలితంగా బహుళజాతి సంస్థలకు ఖర్చులో 50–60 శాతం ఆదా అవుతుంది! ఉత్పత్తిని దేశ సరిహద్దులు దాటి చేపట్టటం వల్ల బహుళజాతి సంస్థలకు చాలా లాభాలు ఉంటాయి.

## దేశాల మధ్య ఉత్పత్తిని అనుసంధానం చేయటం

బహుళజాతి సంస్థలు పని ప్రదేశాన్ని ఎంచుకోటానికి ఉపయోగించే సాధారణ సూచికలు: మార్కెట్లకు దగ్గరగా ఉండటం; తక్కువ ఖర్చుతో నైపుణ్యం ఉన్న, నైపుణ్యంలేని కార్మికుల లభ్యత; ఇతర ఉత్పత్తి కారకాల అందుబాటు, తమ ప్రయోజనాలను కాపాడే ప్రభుత్వ విధానాలు ఉండటం మొదలైనవి. భూమి, భవనాలు, యంత్రాలు, ఇతర పరికరాలు వంటి వాటికోసం బహుళజాతి సంస్థలు ఖర్చు పెట్టే మొత్తాన్ని విదేశీ పెట్టుబడులు అంటారు. లాభాలు సంపాదించిపెడతాయన్న ఆశతోనే ఇటువంటి పెట్టుబడులు పెడతారు.

కొన్ని సందర్భాలలో బహుళజాతి కంపెనీలు ఆయా దేశాల స్థానిక కంపెనీలతో కలిసి ఉత్పత్తిని చేపడతాయి. వీటిని జాయింట్ వెంచర్లు అంటారు. బహుళజాతి సంస్థలు తెచ్చే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంవల్లా, అదనపు పెట్టుబడుల వల్లా స్థానిక కంపెనీలు ప్రయోజనం పొందుతాయి.




అయితే చాలా సందర్భాలలో బహుళజాతి పెట్టుబడులు స్థానిక కంపెనీలను కొనేసి ఉత్పత్తిని విస్తరించుకుంటాయి. పెద్ద ఎత్తున నిధులు ఉండే బహుళజాతి కంపెనీలు ఈ పనిని తేలికగా చెయ్యగలుగుతాయి. ఉదాహరణకు, కార్గిల్ ఫుడ్స్ అనే అమెరికాకు చెందిన పెద్ద బహుళజాతి సంస్థ 'పారఖ్ ఫుడ్స్' వంటి చిన్న భారతీయ కంపెనీలను కొనేసింది. పారఖ్ ఫుడ్స్‌కు నాలుగు నూనె శుద్ధి కర్మాగారాలు, భారతదేశమంతటా పెద్ద మార్కెటింగ్ నెట్‌వర్క్, తమ బ్రాండుకు మంచి పేరు ఉన్నాయి. స్థానిక కంపెనీలను కొనుగోలు చేసిన తరువాత భారతదేశంలో వంటనూనెలలో కార్గిల్ అతి పెద్ద ఉత్పత్తిదారుగా పరిణమించింది.

బహుళజాతి సంస్థలు ఉత్పత్తిని మరొక విధంగా కూడా నియంత్రిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలలోని పెద్ద బహుళజాతి సంస్థలు చిన్న ఉత్పత్తిదారులకు ఉత్పత్తికి ఆర్డర్లు ఇస్తాయి. ప్రపంచవ్యాప్తంగా చిన్న ఉత్పత్తిదారులు దుస్తులు, చెప్పులు, క్రీడా పరికరాలు వంటి ఎన్నో వస్తువులనుఉత్పత్తి చేసి బహుళజాతి సంస్థలకు అందచేస్తే అవి వాటిని తమ బ్రాండ్ పేర్లతో వినియోగదారులకు అమ్ముతాయి. ఈ చిన్న ఉత్పత్తిదారులకు చెల్లించే ధర, నాణ్యత, సరుకు అందించే సమయం, కార్మికుల పరిస్థితులను ప్రభావితం చేసే అధికారం బహుళజాతి సంస్థలకు ఉంటుంది. బహుళజాతి సంస్థల కారణంగా దూర ప్రాంతాలలోని ఉత్పత్తి మధ్య అనుసంధానం ఏర్పడుతోంది.

*ఫోర్డ్ మోటర్స్ అనే అమెరికా కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 26 దేశాలలో ఉత్పత్తి సౌకర్యాలు కలిగి ఉండి అతి పెద్ద కార్ల ఉత్పత్తిదారుగా ఉంది. ఫోర్డ్ మోటర్స్ 1995లో భారతదేశానికి వచ్చి 1700 కోట్ల రూపాయలతో చెన్నై దగ్గర కర్మాగారాన్ని నెలకొల్పింది. భారతదేశంలో జీపులు, లారీల అతి పెద్ద కంపెనీయైన మహీంద్ర & మహీంద్రతో కలిసి ఈ కర్మాగారాన్ని నెలకొల్పింది. 2004 నాటికి ఫోర్డ్ మోటర్స్ భారతదేశంలో 27,000 కార్లు అమ్ముతోంది, భారతదేశం నుంచి దక్షిణ ఆఫ్రికా, మెక్సికో, బ్రెజిల్ దేశాలకు మరో 24,000 కార్లు ఎగుమతి చేస్తోంది. ఇతర దేశాలలోని ఉత్పత్తి కేంద్రాలకు విడి భాగాలను సరఫరా చేసేలా ఫోర్డ్ ఇండియాను అభివృద్ధి చేయాలన్న తలంపుతో కంపెనీ ఉంది.*



- ఫోర్డ్ మోటర్స్ బహుళజాతి కంపెనీయా? ఎందుకు?
- విదేశీ పెట్టుబడి అంటే ఏమిటి? ఫోర్డ్ మోటర్స్ భారతదేశంలో ఎంత పెట్టుబడి పెట్టింది?

- ఫోర్డ్ మోటర్స్ వంటి బహుళజాతి కంపెనీలు భారతదేశంలో ఉత్పత్తి చేసే కర్మాగారాలను నెలకొల్పటం వల్ల ఇటువంటి దేశాలు అందించే పెద్ద మార్కెట్టునే కాకుండా తక్కువ ఉత్పత్తి ఖర్చు వల్ల కూడా లాభపడతాయి. ఈ వాక్యాన్ని వివరించండి.
- ప్రపంచ వ్యాప్త కార్ల ఉత్పత్తికి భారతదేశం విడిభాగాలను అందించేలా అభివృద్ధి చెయ్యాలని కంపెనీ ఎందుకు అనుకుంటోంది? కింది అంశాలను చర్చించండి:
  - (అ) భారతదేశంలో కార్మికులు, ఇతర వనరుల ఖర్చు.
  - (ఆ) ఫోర్డ్ మోటర్స్‌కు వివిధ విడి భాగాలను అందించే పలు స్థానిక ఉత్పత్తిదారులు ఉండటం.
  - (ఇ) భారతదేశం, చైనాలలోని అధిక సంఖ్యాక కొనుగోలుదారులకు దగ్గరగా ఉండటం.
- భారతదేశంలో ఫోర్డ్ మోటర్స్ కార్ల ఉత్పత్తిని చేపట్టటం వల్ల ఉత్పత్తి కార్యకలాపాలలో ఎటువంటి అనుసంధానం జరుగుతోంది?
- ఇతర కంపెనీలకు, బహుళజాతి సంస్థలకు మధ్య తేడాలు ఏమిటి?
- నైక్, కోకాకోలా, పెప్సి, హోండా, నోకియా వంటి బహుళజాతి కంపెనీలు దాదాపుగా అమెరికా, జపాను, లేదా ఐరోపా దేశాలకు చెందినవే. ఎందుకో ఊహించగలరా?

## విదేశీ వాణిజ్యం, మార్కెట్ల అనుసంధానం

దేశాల మధ్య అనుసంధానంగా చాలా కాలంగా వాణిజ్యం ఉంటోంది. భారతదేశం, దక్షిణ ఆసియాలనుంచి తూర్పు, పశ్చిమవైపులనున్న మార్కెట్లకు ఉన్న వ్యాపార మార్గాల గురించి, ఈ దారుల వెంట జరిగిన పెద్ద మొత్తం వ్యాపారాల గురించి మీరు చరిత్రలో చదివి ఉంటారు. వాణిజ్య ప్రయోజనాల కోసం ఈస్ట్‌ఇండియా కంపెనీ వంటి వాణిజ్య సంస్థలు భారతదేశానికి వచ్చాయన్న విషయం కూడా మీకు గుర్తు ఉండే ఉంటుంది. అయితే ఈ విదేశీ వాణిజ్యం మౌలిక విధి ఏమిటి?

క్లుప్తంగా చెప్పాలంటే ఉత్పత్తిదారులకు దేశీయ మార్కెట్లకు మించిన అవకాశాలను విదేశీ వాణిజ్యం అందిస్తుంది. అదేవిధంగా కొనుగోలుదారులకు స్థానికంగా ఉత్పత్తి అయిన వస్తువులే కాకుండా మరిన్ని వస్తువులు అందుబాటులోకి వస్తాయి. అంటే విదేశీ వాణిజ్యం వివిధ దేశాలలోని మార్కెట్లను అనుసంధానం చేస్తుంది.

- గతంలో దేశాలను కలిపిన ప్రధాన అంశం ఏమిటి? గతానికి, ప్రస్తుత పరిస్థితికి తేడా ఏమిటి?
- విదేశీ వాణిజ్యం, విదేశీ పెట్టుబడులకు మధ్య తేడా ఏమిటి?
- ఇటీవలి కాలంలో భారతదేశం నుంచి చైనా ఉక్కును దిగుమతి చేసుకుంటోంది. ఈ దిగుమతులు వీటిని ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పండి:
  - (అ) చైనాలోని ఉక్కు కర్మాగారాలు
  - (ఆ) భారతదేశంలోని ఉక్కు కర్మాగారాలు
  - (ఇ) చైనాలో ఇతర పారిశ్రామిక వస్తువులు తయారు చేయటానికి ఉక్కును కొనుగోలు చేసే పరిశ్రమలు
- చైనాలోకి భారత ఉక్కును దిగుమతి చేసుకోవటం వల్ల రెండు దేశాల ఉక్కు మార్కెట్లు ఎలా అనుసంధానమౌతాయి?

చైనా ఉత్పత్తిదారులు భారతదేశానికి ప్లాస్టిక్ బొమ్మలు ఎగుమతి చేయసాగారు. భారతదేశంలో కొనుగోలుదార్లకు ఇప్పుడు భారతీయ, చైనా బొమ్మలలో ఎంచుకునే అవకాశం ఉంది. కొత్త డిజైన్లు, తక్కువ ధర కారణంగా చైనా బొమ్మలు ఎంతో ఆదరణ పొందాయి. ఒక సంవత్సర కాలంలో బొమ్మల దుకాణాలలో 70-80 శాతం భారతీయ బొమ్మలకు బదులుగా చైనా బొమ్మలను అమ్మసాగాయి. గతంలో కంటే ఇప్పుడు భారతదేశంలో బొమ్మలు చవకగా ఉన్నాయి.

చైనాలో బొమ్మల ఉత్పత్తిదారులకు ఇది తమ వ్యాపారాన్ని విస్తరింపచేసుకోటానికి అవకాశం ఇచ్చింది. భారతీయ బొమ్మల ఉత్పత్తిదారుల పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. పోటీవల్ల భారతీయ ఉత్పత్తిదారులు కొత్త మార్గాలను అన్వేషించవలసి వచ్చింది, ఈ ప్రక్రియలో కొంతమంది దివాళా తీశారు కూడా.

## బహుళజాతి కంపెనీలు, ప్రపంచీకరణ

గత మూడు, నాలుగు దశాబ్దాలుగా చాలా బహుళజాతి సంస్థలు తాము చౌకగా ఉత్పత్తి చేపట్టే అవకాశాలున్న ప్రదేశాల కోసం ప్రపంచం నలుమూలలా వెదకసాగాయి. ఆయా దేశాలలో ఈ బహుళజాతి కంపెనీల విదేశీ పెట్టుబడులు పెరుగుతున్నాయి. అదే సమయంలో దేశాల మధ్య విదేశీ వాణిజ్యం కూడా వేగంగా పెరుగుతోంది. విదేశీ వాణిజ్యంలో కూడా అధిక భాగాన్ని బహుళజాతి సంస్థలు నియంత్రిస్తున్నాయి. ఉదాహరణకు భారతదేశంలోని ఫోర్డ్ మోటర్స్ కార్ల తయారీ కర్మాగారం భారతీయ మార్కెట్లకోసమే కాక ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు కార్లను ఎగుమతి చేస్తోంది, కార్ల విడిభాగాలను ప్రపంచమంతటా ఉన్న తన అనేక కర్మాగారాలకు ఎగుమతి చేస్తోంది. ఇదేవిధంగా అనేక బహుళజాతి కంపెనీల కార్యకలాపాలు వస్తువులు, సేవల వాణిజ్యంలో కూడా ప్రధానపాత్ర వహిస్తున్నాయి.




అధిక విదేశీ పెట్టుబడులు, అధిక విదేశీ వాణిజ్యం వల్ల వివిధ దేశాల ఉత్పత్తి, మార్కెట్ల మధ్య అనుసంధానం పెరిగింది. వేగంగా పెరుగుతున్న ఈ దేశాల అనుసంధానం, అంత: సంబంధాలే ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణ ప్రక్రియలో బహుళజాతి కంపెనీలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. దేశాల మధ్య వస్తువులు, సేవలు, పెట్టుబడులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాలు పెరుగుతున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితంతో పోలిస్తే ప్రపంచంలోని అనేక ప్రాంతాల మధ్య దగ్గర సంబంధాలు ఏర్పడ్డాయి.

పెట్టుబడి, ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానాల ప్రవాహంవల్ల సరిహద్దులు లేని ప్రపంచం ఏర్పడింది. ఫలితంగా అనేక దేశాలు తమ దేశ సరిహద్దుల లోపల కూడా జీవితానికి సంబంధించిన అనేక అంశాలపై నియంత్రణ కోల్పోతారు. ఉదాహరణకు ఒకప్పుడు, సర్వసత్తాక ప్రభుత్వాలు కరెన్సీ విలువను నిర్ణయించడం వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసికొనేవి. ఇప్పుడు ప్రభుత్వం వెలుపల, ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ లేని మార్కెటు శక్తులు ఆ నిర్ణయాలు చేస్తున్నాయి.

- ప్రపంచీకరణ ప్రక్రియలో బహుళజాతి సంస్థల పాత్ర ఏమిటి?
- దేశాలను అనుసంధాన పరిచే వివిధ మార్గాలేవి?
- సరైన సమాధానాన్ని ఎంచుకోండి:

ప్రపంచీకరణ దేశాలను అనుసంధానం చేయటం వల్ల

(అ) ఉత్పత్తిదారుల మధ్య పోటీని తగ్గిస్తుంది.

(ఆ) ఉత్పత్తిదారుల మధ్య పోటీని పెంచుతుంది.

(ఇ) ఉత్పత్తిదారుల మధ్య పోటీలో తేడా ఉండదు.

## ప్రపంచీకరణకు దోహదం చేసిన అంశాలు

### సాంకేతిక పరిజ్ఞానం

ప్రపంచీకరణ ప్రక్రియకు ముఖ్య కారణం సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందడం. ఉదాహరణకు, గత యాభై సంవత్సరాలలో రవాణా, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందాయి. ఫలితంగా ఎంతో దూరాలకు త్వరగా, తక్కువ ధరలకు వస్తువులను చేరవేస్తున్నారు.

సమాచార, భావ ప్రసార సాంకేతిక రంగంలో అభివృద్ధి ఇంకా గణనీయంగా, వేగంగా ఉన్నాయి. టెలికమ్యూనికేషన్ సేవలను (టెలిగ్రాఫ్, టెలిఫోను, మొబైల్ ఫోన్లతోసహా ఫ్యాక్స్) ప్రపంచంలో ఒకరితో ఒకరు మాట్లాడుకోటానికి, మారుమూల ప్రాంతాలనుంచి కూడా సమాచారాన్ని వెంటనే గ్రహించడానికి ఉపయోగించుకుంటున్నారు. ఉపగ్రహ ప్రసార సాధనాల వల్ల ఇదంతా సాధ్యమయ్యింది. ప్రస్తుతం ప్రతి రంగంలో కంప్యూటర్లు ప్రవేశించాయి. ఇంటర్నెట్ అనే అద్భుత ప్రపంచంతో మీకు పరిచయం ఉండి ఉంటుంది. దీని ద్వారా మీరు ఏ విషయం గురించైనా సమాచారాన్ని పొందవచ్చు, మీ దగ్గర ఉన్న సమాచారాన్ని పంచుకోవచ్చు. ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంలో ఎక్కడికైనా నామమాత్రపు ఖర్చుతో మీరు తక్షణమే ఎలక్ట్రానిక్ మెయిల్ (e-mail) పంపించవచ్చు, ఎవరితోనైనా (Voice-mail) మాట్లాడవచ్చు.




*ఇరవై సంవత్సరాల క్రితం:*
"మా కంప్యూటర్లకు వేగవంతమైన కనెక్షన్లు ఉన్నాయి."
*ప్రస్తుతం:*
*"మాకు మొబైల్ ఫోన్లలో కూడా ఇంటర్నెట్ వస్తోంది."*




*ఇరవై సంవత్సరాల క్రితం:*
*"మాకు ఇంకా విద్యుత్తుకోతలు ఉన్నాయి."*
*ప్రస్తుతం: "3జి, 4జి అంటే ఏమిటి? మాకు స్థిరమైన కనెక్షన్ దొరకటమే కష్టంగా ఉంది."*

లండన్‌లోని పాఠకుల కోసం ప్రచురించే ఒక వార్తాపత్రికను ఢిల్లీలో డిజైన్ చేసి ముద్రించాలి. పత్రికలో ప్రచురించాల్సిన అంశాలను ఇంటర్నెట్ ద్వారా ఢిల్లీలోని కార్యాలయానికి పంపిస్తారు. టెలికమ్యూనికేషన్ సదుపాయాల ద్వారా పత్రికను ఎలా రూపొందించాలో ఢిల్లీలోని డిజైనర్లకు లండన్ కార్యాలయం నుంచి సమాచారం అందుతుంటుంది. పత్రిక డిజైనింగ్ అంతా కంప్యూటర్‌లో జరుగుతుంది. పత్రికను ముద్రించిన తరువాత ప్రతులను విమానం ద్వారా లండన్‌కు పంపిస్తారు. డిజైనింగ్‌కు, ముద్రణకు డబ్బులు లండన్‌లోని బ్యాంకు నుంచి ఢిల్లీలోని బ్యాంకుకు ఇంటర్నెట్ (e-Banking) ద్వారా తక్షణమే పంపిస్తారు!

- ఈ ఉదాహరణలో ఉత్పత్తిలో సాంకేతిక విజ్ఞాన ఉపయోగాన్ని తెలియచేసే పదాల కింద గీత గీయండి.
- ప్రపంచీకరణకు, సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి మధ్యగల సంబంధం ఏమిటి? సమాచార సాంకేతిక పరిజ్ఞానం (IT) విస్తరించకుండా ప్రపంచీకరణ సాధ్యమై ఉండేదా?

## విదేశీ వాణిజ్యం, విదేశీ పెట్టుబడుల విధానాల సరళీకరణ

భారతదేశంలో చైనా బొమ్మల దిగుమతి ఉదాహరణకు మరొకసారి వద్దాం – బొమ్మల దిగుమతిపై భారతీయ ప్రభుత్వం పన్ను విధించిందనుకుందాం. పన్ను కారణంగా కొనుగోలుదారులు దిగుమతి చేసుకున్న బొమ్మలకు అధిక ధరలు చెల్లించాల్సివస్తుంది. అప్పుడు భారతీయ మార్కెట్లో చైనా బొమ్మలు మరీ అంత చవకగా ఉండవు, దాంతో చైనా నుంచి దిగుమతులు తగ్గిపోతాయి. భారతదేశ ఉత్పత్తిదారులు పుంజుకుంటారు.

వాణిజ్య అవరోధాలకు పన్ను ఒక ఉదాహరణ. కొన్ని పరిమితులను విధించటం వల్ల దీనిని అవరోధం అంటారు.విదేశీ వాణిజ్యాన్ని పెంచటానికి, లేదా తగ్గించటానికి (నియంత్రించటానికి) ప్రభుత్వం వాణిజ్య అవరోధాలను ఉపయోగించవచ్చు.ఈ విధంగా ఎటువంటి వస్తువుల దిగుమతిని అనుమతించాలి, ఒక్కొక్క దానిని దేశంలోకి ఎంత మొత్తంలో దిగుమతి చేసుకోవచ్చు వంటివి ప్రభుత్వం నిర్ణయించవచ్చు.

స్వాతంత్ర్యం పొందిన తరువాత భారత ప్రభుత్వం విదేశీ వాణిజ్యం, విదేశీ పెట్టుబడులకు అవరోధాలు విధించింది. దేశంలోని ఉత్పత్తిదారులకు విదేశీ పోటీనుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని భావించింది. 1950–1960లలో పరిశ్రమలు అప్పుడే నెలకొల్పబడుతున్నాయి, ఈ దశలో దిగుమతులనుంచి పోటీని అనుమతించి ఉంటే ఈ పరిశ్రమలు నిలదొక్కుకుని ఉండేవి కావు. కాబట్టి అత్యవసర వస్తువులైన యంత్రాలు, రసాయనిక ఎరువులు, ముడి చమురు వంటి వాటి దిగుమతిని మాత్రమే ప్రభుత్వం అనుమతించింది. అన్ని అభివృద్ధి చెందిన దేశాలు అవి అభివృద్ధి చెందుతున్న దశలో తమ దేశ ఉత్పత్తిదారులకు ఏదో ఒక విధంగా రక్షణ కల్పించాయన్న విషయాన్ని ఇక్కడ దృష్టిలో ఉంచుకోవాలి.

అయితే, 1991 నుండి మొదలుకొని దీర్ఘకాల ప్రభావం చూపించేలా భారతదేశ విధానాలలో మార్పులు చేశారు. భారతీయ ఉత్పత్తిదారులు ప్రపంచవ్యాప్త ఉత్పత్తిదారులతో పోటీ పడాల్సిన సమయం వచ్చిందని ప్రభుత్వం నిర్ణయించింది. పోటీ ఫలితంగా దేశంలోని ఉత్పత్తిదారులు తమ నాణ్యతను మెరుగుపరచుకోవలసి ఉంటుంది కాబట్టి వాటి పని తీరు మెరుగు అవుతుందని భావించారు. ఈ నిర్ణయానికి బలమైన అంతర్జాతీయ సంస్థల మద్దతు ఉంది.

దాంతో విదేశీ వాణిజ్యం, విదేశీ పెట్టుబడులకు అవరోధాలను చాలావరకు తొలగించారు. దీని అర్థం దేశంలోకి సరుకులు స్వేచ్ఛగా దిగుమతి చేసుకోవచ్చు, అలాగే ఎగుమతి కూడా చేయవచ్చు. విదేశీ కంపెనీలు ఇక్కడ కార్యాలయాలు, కర్మాగారాలను స్థాపించవచ్చు.

ప్రభుత్వం విధించిన అవరోధాలను, పరిమితులను తొలగించటాన్ని ఆర్థిక సరళీకరణ అంటారు. సరళీకృత విధానాల ఫలితంగా తాము ఏమి ఎగుమతి, దిగుమతి చెయ్యదలచుకున్నారో ఆ వ్యాపారులు, వాణిజ్యం చేసేవారు స్వేచ్ఛగా నిర్ణయించు కోవచ్చు. అంతకు ముందుతో పోలిస్తే చాలా తక్కువ పరిమితులను ప్రభుత్వం విధిస్తుంది కాబట్టి దీనిని 'సరళీకృత ఆర్థిక విధానం' అంటారు.

ప్రపంచీకరణకు చోదక శక్తి ఏది అనే ప్రశ్నను ఇప్పుడు వేసుకోవాలి. అది రాజకీయ నిర్ణయమా లేక ఆర్థిక, సాంకేతిక రంగ విప్లవమా? ప్రపంచీకరణకు ఆర్థికరంగమే మూలం అని భావించేవాళ్లు దానికి ఆర్థిక శక్తులు కారణమని, దాని ఎల్లలను అవే నిర్ణయిస్తాయని వాదిస్తారు. రాజకీయాలు కారణం అని భావించేవాళ్లు ప్రభుత్వ నిర్ణయాల వల్ల ముందుగా ఇది మొదలయ్యిందని అంటారు. ప్రభుత్వాలు పరిమితులు విధిస్తాయి, లేదా వాటిని తొలగిస్తాయి. ఒక ప్రదేశం అనువుగా ఉందో, లేదో అంచనా వేసుకోటానికి మార్కెటు పరిస్థితులే కాకుండా రాజకీయ వాతావరణం కూడా ముఖ్యమైన అంశం అవుతుంది. వాస్తవం ఏమిటంటే పై రెండింటికీ సంబంధం ఉంది. ఒక ప్రత్యేక నేపథ్యంలో రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారని గుర్తిస్తే, ఇవి ఆపాటికే వచ్చిన ఆర్థిక, సాంకేతిక మార్పులను పరిగణనలోకి తీసుకుంటాయని అర్థం అవుతుంది.

- విదేశీ వాణిజ్య సరళీకరణ అంటే ఏమి అర్థం చేసుకున్నారు?
- దిగుమతులపై పన్ను వాణిజ్య అవరోధానికి ఒక ఉదాహరణ. దిగుమతి చేసుకునే సరుకుల సంఖ్య/మోతాదుపై కూడా ప్రభుత్వం పరిమితి విధించవచ్చు. దీనిని కోటాలు అంటారు. చైనా బొమ్మల ఉదాహరణలో కోటాలను ఉపయోగించి వాణిజ్య అవరోధాన్ని ఎలా విధించవచ్చో వివరించండి. ఈ విధానాన్ని ఉపయోగించుకోవాలా? చర్చించండి.

## ప్రపంచ పరిపాలన సంస్థలు

ఈ రోజు ప్రపంచంలోని అధిక శాతం జనాభాను ప్రభావితం చేసే కీలక అంశాలపై నిర్ణయాలను ప్రపంచ పరిపాలన సంస్థలు తీసుకుంటున్నాయి. దీనికి చక్కని ఉదాహరణ శీతోష్ణస్థితి మార్పు. మొదట కర్బన ఉద్గారాలను తగ్గించుకునే విషయాన్ని ఆయా దేశాలకు వదిలిపెట్టారు. అయితే కర్బన ఉద్గారాలను తగ్గించటానికి ఒక దేశం ప్రయత్నిస్తే పరిశ్రమలు నియంత్రణలు తక్కువగా ఉన్న వేరే చోటుకు తరలిపోయి ఉద్గారాలను విడుదల చేస్తూ ఉంటాయని గుర్తించారు. కాబట్టి ఉద్గారాలు, శీతోష్ణస్థితి మార్పు వంటి అంశాలను దేశాలన్నీ కలిసి పరిష్కరించుకోవలసిన అవసరం ఉంది.

ప్రపంచ పరిపాలన సంస్థలలో ఒకటైన ప్రపంచ వాణిజ్య సంస్థను (WTO) గూర్చి కొంత వివరంగా చూద్దాం.

## ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO)

భారతదేశంలో విదేశీ వాణిజ్యం, పెట్టుబడులలో సరళీకృత విధానాలకు బలమైన అంతర్జాతీయ సంస్థల మద్దతు ఉందని తెలుసుకున్నాం. విదేశీ వాణిజ్యానికి, పెట్టుబడులకు అవరోధాలు నష్టం కలగచేస్తాయని ఈ సంస్థలు వాదిస్తాయి. దేశాల మధ్య వాణిజ్యం ఎటువంటి అవరోధాలు లేకుండా స్వేచ్ఛగా ఉండాలని వీళ్లు అంటారు. అంతర్జాతీయ వాణిజ్యంలో సరళీకృత విధానాలు ఏర్పడేలా చూసే ఉద్దేశంతో పని చేస్తున్న సంస్థలలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఒకటి. అభివృద్ధి చెందిన దేశాల చొరవతో ఏర్పడిన ఈ సంస్థ అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి నియమాలను రూపొందించి, అవి పాటించబడేలా చూస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలోని దాదాపు 150 దేశాలు ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యులుగా ఉన్నాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ అందరూ స్వేచ్ఛా వాణిజ్యం చేపట్టేలా చూడాలి. అయితే ఆచరణలో అభివృద్ధి చెందిన దేశాలు అన్యాయపూరిత వాణిజ్య అవరోధాలను ఇంకా కొనసాగిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను వాణిజ్య అవరోధాలు తొలగించాలని ఒత్తిడి చేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల్లో వాణిజ్యంపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ దీనికి ఉదాహరణ.

భారతదేశంలో వ్యవసాయరంగమే అత్యధిక ఉపాధిని కల్పిస్తోంది. దీనిని అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశంతో పోల్చండి: అమెరికా GDP లో వ్యవసాయం వాటా 1 శాతం కాగా మొత్తం ఉపాధిలో 0.5% మాత్రమే వ్యవసాయంలో ఉన్నారు. అయినాకానీ అమెరికా వ్యవసాయంలో ఉన్న ఈ కొద్దిమందికే ఉత్పత్తికి, ఇతర దేశాల ఎగుమతికి అమెరికా ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు లభిస్తాయి. పెద్ద ఎత్తున లభించే ఈ సబ్సిడీల వల్ల అమెరికా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను చాలా తక్కువ ధరకు అమ్మగలుగుతున్నారు. అదనంగా ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను వీళ్లు ఇతర దేశాల మార్కెట్లలో చాలా తక్కువ ధరలకు అమ్మ గలుగు తున్నారు. ఇది ఆ దేశాలలోని రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

కాబట్టి అభివృద్ధి చెందిన దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇలా ప్రశ్నిస్తున్నాయి, "ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాల ప్రకారం మేం వాణిజ్య అవరోధాలను తొలగించాం. కానీ మీరు ఆ నియమాలను పట్టించుకోకుండా మీ రైతులకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తున్నారు. మా రైతులకు మద్దతు ఇవ్వొద్దని మా ప్రభుత్వాలకు చెప్పి మీరు మీ రైతులకు మద్దతును కొనసాగిస్తున్నారు. స్వేచ్ఛా, న్యాయమైన వాణిజ్యం అంటే ఇదేనా?"

- ఖాళీలను పూరించండి.

  ------- దేశాల చొరవతో ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలయ్యింది. ఈ సంస్థ ఉద్దేశం --------. ప్రపంచ వాణిజ్య సంస్థ ----------- కు సంబంధించి నియమాలు రూపొందించి ------ చూస్తుంది. అయితే, ఆచరణలో దేశాల మధ్య వాణిజ్యం ------- లేదు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ------------- కానీ అనేక సందర్భాలలో అభివృద్ధి చెందిన దేశాలు తమ ఉత్పత్తిదారులకు మద్దతు కొనసాగిస్తున్నాయి.

- దేశాల మధ్య వాణిజ్యం మరింత న్యాయ పూరితంగా ఉండటానికి ఏం చేయవచ్చు?

- పై ఉదాహరణలో అమెరికా ప్రభుత్వం ఉత్పత్తి చెయ్యటానికి రైతులకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తుందని చూశాం. కొన్నిసార్లు ప్రభుత్వాలు కొన్ని రకాల వస్తువుల, ఉదాహరణకు పర్యావరణ అనుకూలమైన వాటి ఉత్పత్తికి మద్దతు ఇస్తాయి. ఇది న్యాయమైనదో కాదో చర్చించండి.

### భారతదేశంపై ప్రపంచీకరణ ప్రభావం

ప్రపంచీకరణ ఫలితంగా ప్రజల జీవితాలు ఎలా ప్రభావితం అవుతున్నాయి? ప్రపంచీకరణ వల్ల వినియోగదారులు, ప్రత్యేకించి పట్టణాలలోని సంపన్నులకు మేలు జరిగింది. వీళ్లు ఎంచుకోటానికి ఇప్పుడు ఎన్నో వస్తువులు లభిస్తున్నాయి, అనేక ఉత్పత్తులలో నాణ్యత పెరిగి, ధరలు తగ్గాయి. ఫలితంగా ఈ ప్రజలకు అంతకు ముందు సాధ్యం కానంతగా మెరుగైన జీవన ప్రమాణాలను అనుభవిస్తున్నారు. ఉత్పత్తిదారులు, కార్మికులపై ప్రపంచీకరణ ప్రభావం ఒకే రకంగా లేదు.

బహుళజాతి సంస్థలు భారతదేశంలో తమ పెట్టుబడులను పెంచాయి, అంటే భారతదేశంలో పెట్టుబడులుపెట్టటం వాళ్లకు లాభసాటిగా ఉంది. సెల్‌ఫోన్లు, వాహనాలు, ఎలక్ట్రానిక్స్, శీతల పానీయాలు, ఫాస్ట్ ఫుడ్ వంటి పరిశ్రమలలోనూ, పట్టణ ప్రాంతాలలో బ్యాంకింగ్ వంటి సేవలలోనూ బహుళజాతి సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ ఉత్పత్తులకు సంపన్న కొనుగోలుదారులు అధిక సంఖ్యలో

ఉన్నారు. ఈ పరిశ్రమలు, సేవలలో కొత్త ఉద్యోగాలు ఏర్పడ్డాయి. ఈ పరిశ్రమలకు ముడి సరుకులు అందించే స్థానిక సంస్థలు కూడా లాభపడ్డాయి.

భారతదేశ అతిపెద్ద కంపెనీలలో అనేకం పెరిగిన పోటీవల్ల ప్రయోజనం పొందాయి. వాళ్లు కొత్త సాంకేతిక విజ్ఞానంలోనూ, ఉత్పత్తి పద్ధతులలోనూ పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి ప్రమాణాలను పెంచారు. విదేశీ కంపెనీలతో కలిసి పనిచెయ్యటం ద్వారా కొన్ని కంపెనీలు లాభపడ్డాయి.

అంతేకాదు, ప్రపంచీకరణ వల్ల కొన్ని పెద్ద భారతీయ కంపెనీలు స్వయంగా బహుళజాతి సంస్థలుగా ఎదిగాయి! టాటా మోటర్స్ (వాహనాలు), ఇన్ఫోసిస్ (IT), రాన్‌బాక్సీ (మందులు), ఏషియన్ పెయింట్స్ (రంగులు), సుందరం ఫాస్టెనర్స్ (నట్టులు, బోల్టులు) వంటి భారతీయ కంపెనీలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా లావాదేవీలు కలిగి ఉన్నాయి.

ప్రపంచీకరణ వల్ల సేవలు, ప్రత్యేకించి IT తో కూడిన సేవలు అందించే కంపెనీలకు కొత్త అవకాశాలు లభించాయి. లండన్‌లోని కంపెనీకి భారతదేశంలోని కంపెనీ పత్రికను ముద్రించి ఇవ్వటం, కాల్ సెంటర్ల నిర్వహణ ఇందుకు కొన్ని ఉదాహరణలు. అంతే కాకుండా డేటా ఎంట్రీ, జమాఖర్చు లెక్కలు, పరిపాలనా సంబంధ మైన పనులు, ఇంజినీరింగ్ మొదలైనవి ఇప్పుడు భారతదేశం వంటి దేశాలలో చౌకగా చేసి, అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

*ఇటీవలి కాలంలో భారతదేశంలో పెట్టుబడులు పెట్టేలా విదేశీ కంపెనీలను ఆకర్షించటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలి (SEZs) అనే పారిశ్రామిక ప్రాంతాలను నెలకొల్పుతున్నాయి. ఈ సెజ్‌లలో ప్రపంచస్థాయి సౌకర్యాలు ఉంటాయి: విద్యుత్తు, నీళ్లు, రోడ్లు, రవాణా, గిడ్డంగులు, విద్య, వినోద సదుపాయాలు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల(SEZ)లో కర్మాగారాలను స్థాపించే కంపెనీలు మొదటి అయిదేళ్లపాటు ఎటువంటి పన్నులు చెల్లించాల్సిన పనిలేదు.*

*విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి ప్రభుత్వం కార్మిక చట్టాలను సడలించింది. కార్మికులను దీర్ఘకాలిక ప్రాతిపదికన కాకుండా పని ఒత్తిడిని బట్టి తక్కువ కాల వ్యవధికి నియమించుకునే అవకాశం ఉంది. దీనివల్ల కంపెనీకి కార్మికుల పైన అయ్యే ఖర్చు తగ్గుతుంది. అయితే విదేశీ కంపెనీలు కార్మిక చట్టాలను ఇంకా సడలించాలని కోరుతున్నాయి.*

- భారతదేశ ప్రజలు పోటీవల్ల ఏవిధంగా లాభపడ్డారు?
- మరిన్ని భారతీయ కంపెనీలు బహుళజాతి కంపెనీలుగా ఎదగాలా? దేశంలోని ప్రజలకు దానివల్ల ప్రయోజనాలు ఏమిటి?
- మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి ప్రభుత్వాలు ఎందుకు ప్రయత్నిస్తున్నాయి?
- ఒకరికి అభివృద్ధి అయినది మరొకరికి విధ్వంసం కావచ్చని మనం ఇదివరకే చదివాం. ఆర్థిక మండళ్లను నెలకొల్పటాన్ని భారతదేశంలోని కొంతమంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. వీళ్లు ఎవరో, ఎందుకు వాటిని వ్యతిరేకిస్తున్నారో తెల్పండి.

*ఈ చిత్రానికి ఒక ఊహాత్మక వ్యాఖ్య రాయండి. ఇది ప్రపంచీకరణ గురించి ఏమి చెబుతోంది?*



## చిన్న ఉత్పత్తిదారులు : పోటీ పడండి, లేదా అంతరించిపోండి



అనేక చిన్న ఉత్పత్తిదారులకు, కార్మికులకు ప్రపంచీకరణ పెను సవాళ్లను సృష్టించింది.

పారిశ్రామికవేత్తగా ఇంత తక్కువ కాలంలో సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వస్తుందని రవి ఊహించలేదు. తమిళనాడులోని పారిశ్రామిక పట్టణమైన హొసూరులో కెపాసిటర్లు ఉత్పత్తి చేసే సొంత కంపెనీ స్థాపించటానికి 1992లో రవి బ్యాంకు నుంచి అప్పు తీసుకున్నాడు. ట్యూబ్‌లైట్లు, టెలివిజను వంటి పలు ఎలక్ట్రానిక్ గృహోపకరణాలలో కెపాసిటర్లను ఉపయోగిస్తారు. మూడు సంవత్సరాలలో అతడి కంపెనీ వృద్ధి చెంది 20 మంది కార్మికులు పని చెయ్యసాగారు.

2001లో ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందం కారణంగా ప్రభుత్వం కెపాసిటర్ల దిగుమతిలో పరిమితులను తొలగించటంతో అతడి కష్టాలు మొదలయ్యాయి. అతడి ప్రధాన కొనుగోలుదారులైన టెలివిజన్ కంపెనీలు టెలివిజన్ సెట్ల ఉత్పత్తికి కెపాసిటర్లతో సహా వివిధ విడి భాగాలను పెద్ద సంఖ్యలో కొనేవి. అయితే బహుళజాతి సంస్థ (MNC)ల టీవీ బ్రాండుల నుంచి పోటీ ఫలితంగా భారతీయ టెలివిజన్ కంపెనీలు బహుళజాతి సంస్థలకు అసెంబ్లింగ్ కేంద్రాలుగా మారిపోయాయి. అవి ఒకవేళ కెపాసిటర్లు కొనాల్సి ఉన్నా వారు దిగుమతి చేసుకున్నవి రవి లాంటి ఉత్పత్తిదారులు ఇస్తున్న ధరలో సగానికి వస్తున్నాయి కాబట్టి వాటికే మొగ్గు చూపుతారు.

ఇప్పుడు రవి 2000 సంవత్సరంలో ఉత్పత్తి చేసిన సంఖ్యలో సగమే ఉత్పత్తి చేస్తున్నాడు, అతని దగ్గర ఇప్పుడు ఏడుగురు కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. ఇదే వ్యాపారంలో హైదరాబాదు, చెన్నైలలో ఉన్న రవి మిత్రులు తమ పరిశ్రమలను మూసివేశారు.

- పెరుగుతున్న పోటీ వల్ల రవి చిన్న ఉత్పత్తి కేంద్రం ఏ విధంగా ప్రభావితం అయ్యింది?
- ఇతర దేశాలతో పోలిస్తే తమ ఉత్పత్తి ఖర్చు ఎక్కువ కాబట్టి రవిలాంటి వాళ్ళు ఉత్పత్తిని నిలిపివెయ్యాలా? మీ అభిప్రాయం ఏమిటి?
- భారతదేశ చిన్న ఉత్పత్తిదారులు మార్కెట్లో పోటీకి తట్టుకోవాలంటే మూడు అవసరాలు ఉన్నాయని ఇటీవలి అధ్యయనాలు పేర్కొన్నాయి: (అ) మెరుగైన రోడ్లు, విద్యుత్తు, నీళ్లు, ముడిసరుకులు, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్, (ఆ) సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధి, ఆధునికీకరణ, (ఇ) తక్కువ వడ్డీకి సకాలంలో రుణాల అందుబాటు. ఈ మూడు అంశాలు భారతీయ ఉత్పత్తిదారులకు ఎలా సహాయ పడతాయో వివరించండి.
- వీటిల్లో పెట్టుబడులు పెట్టటానికి బహుళజాతి సంస్థలు ఆసక్తి చూపిస్తాయా? ఎందుకు?
- ఈ సౌకర్యాలు అందుబాటులోఉండేలా చూడటంలో ప్రభుత్వ పాత్ర ఉందనుకుంటున్నారా? ఎందుకు?
- ప్రభుత్వం తీసుకోగల ఇతర చర్యల గురించి ఆలోచించండి. తరగతిలో చర్చించండి.

## న్యాయమైన ప్రపంచీకరణ కోసం పోరాటం

పై ఉదాహరణల ద్వారా ప్రపంచీకరణ వల్ల అందరూ ప్రయోజనం పొందలేదని తెలుస్తోంది. విద్య, నైపుణ్యం, సంపద ఉన్న వాళ్లు కొత్త అవకాశాల వల్ల బాగా లాభపడ్డారు. ఇంకొకవైపున ఎటువంటి ప్రయోజనం పొందని ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. ప్రపంచీకరణ ఇప్పుడు ఎవరూ కాదనలేని వాస్తవం. ప్రపంచీకరణ వల్ల అందరికీ న్యాయం జరిగేటట్లు ఎలా చెయ్యాలి అనేది మన ముందున్న ప్రశ్న. న్యాయమైన ప్రపంచీకరణ అందరికీ అవకాశాలు సృష్టిస్తుంది. దాని ప్రయోజనాలు మరింత బాగా పంచుకోబడతాయి.

దీనిని సాధ్యం చెయ్యటంలో ప్రభుత్వం ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుంది. ప్రభుత్వ విధానాలు ధనికులు, అధికారం ఉన్న వాళ్లవే కాక దేశంలోని ప్రజలందరి ప్రయోజనాలను కాపాడేలా ఉండాలి. ప్రభుత్వం చేపట్టగలిగిన కొన్ని చర్యల గురించి మీరు తెలుసుకున్నారు. ఉదాహరణకు కార్మిక చట్టాలు సరిగా అమలు అయ్యేలా చూసి కార్మికులకు తమ హక్కులు లభించేలా చూడాలి. చిన్న ఉత్పత్తిదారులు తమ సామర్థ్యాన్ని పెంచుకుని పోటీపడగల శక్తి వచ్చేంతవరకు వాళ్లకు సహాయపడాలి. అవసరమైతే ప్రభుత్వం వాణిజ్య, పెట్టుబడి అవరోధాలను ఉపయోగించుకోవచ్చు. మరింత న్యాయపూరిత నియమాల కోసం ప్రపంచ వాణిజ్య సంస్థతో సంప్రదింపులు జరపవచ్చు. ఇవే ఆసక్తులు ఉన్న ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో కలిసి, ప్రపంచ వాణిజ్య సంస్థలో అభివృద్ధి చెందిన దేశాల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడవచ్చు.

గత కొద్ది సంవత్సరాలలో పెద్ద ఎత్తున జరిగిన ఉద్యమాలతో, ప్రజాసంఘాల విన్నపాలతో ప్రపంచ వాణిజ్య సంస్థలో వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు ప్రభావితం అయ్యాయి. న్యాయమైన ప్రపంచీకరణ కోసం జరిగే పోరాటంలో ప్రజలు కూడా ముఖ్యమైన పాత్ర పోషించగలరని ఇవి నిరూపిస్తున్నాయి.

## ఇతర అంశాలు

ప్రపంచీకరణ వల్ల జాతీయ రాజ్యాలు అంతరించిపోతాయా అనేది ఒక ప్రముఖ చర్చనీయాంశం అయ్యింది. ప్రజలు ఒక ప్రాంత ఆధారంగా సంఘటితమై, దేశాలను రాజకీయంగా గుర్తించడం ఇంత కాలం జరుగుతోంది. ఈ రకమైన ప్రాంతాల విభజన వల్ల మేము, వాళ్ళు; బయటది, స్థానికమైనది అనే మానసిక పునాదులతో తమ దేశం అనే భావన ఏర్పడి, జాతీయతాభావన రూపొందింది. ప్రపంచీకరణ యొక్క అతి పెద్ద ప్రభావం ఏదైనా ఉంటే అది ఈ జాతీయ భావన పలచబడటమే.

అందరి దృష్టినీ ఆకర్షించిన మరొక అంశం, ప్రపంచీకరణ సాంస్కృతిక వైవిధ్యతకు

### ప్రపంచ బ్యాంకు (WB), అంతర్జాతీయ ద్రవ్యసంస్థ (IMF) – వాటి అధికారం:

పునర్నిర్మాణం, అభివృద్ధికి అంతర్జాతీయ బ్యాంకును (IBRD), అంతర్జాతీయ అభివృద్ధి సంఘాలను (IDA) కలిపి ప్రపంచ బ్యాంకుగా వ్యవహరిస్తారు. ఈ రెండు సంస్థలలో 170కి పైగా సభ్యదేశాలు ఉన్నాయి. అమెరికా వంటి దేశాలు ఈ సంస్థల పనిని నిర్దేశిస్తాయి. ఈ నాటికి కూడా అమెరికా ఓటుకు 16% విలువ ఉంది. జపాన్, జర్మనీ, యుకె, ఫ్రాన్స్ వంటి దేశాలు ఒక్కొక్కదానికి 3–6% ఓటు అధికారం ఉంది. పేద దేశాల ఓటుకు తక్కువ విలువ ఉంది. ప్రస్తుతం ఇతర పేద దేశాలతో పోలిస్తే ఇండియా, చైనాలకు ఎక్కువ ఓటింగు అధికారం ఉంది. ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించుకోవటంలో ప్రపంచ బ్యాంకు సలహా ఇచ్చి, మార్గదర్శనం చేస్తూ వాటిని ప్రభావితం చెయ్యగలుగుతోంది.

దారితీస్తుందా లేక సాంస్కృతిక మూసపోతకు దారితీస్తుందా అనేది. ఆధునిక ప్రసార సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని సంస్కృతులు, భావాలు ప్రాచుర్యం పొంది ఇతర స్థానిక, అల్పసంఖ్యాక వర్గాల సంస్కృతులు పక్కకు నెట్టివేయబడ్డాయని కొందరు వాదిస్తారు. అయితే మరికొందరు ప్రత్యేక, తరచుగా పక్కకు నెట్టివేయబడిన సాంస్కృతిక అలవాట్లకు ప్రపంచీకరణ తగినంత చోటు ఇచ్చి అవి విస్తరించడానికి దోహదపడిందని భావిస్తున్నారు. కొన్ని భాషలు విస్తృతంగా ఉపయోగింపబడి అంతర్జాతీయ ప్రసార సాధనాలకు వారధిగా ఉండి ఇతర భాషలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కొన్ని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని కొంతమంది పేర్కొంటున్నారు.

## ముగింపు

దేశాలు వేగంగా అనుసంధానమయ్యే ప్రక్రియను ప్రపంచీకరణ అంటారు. ఇది 20వ శతాబ్దం చివరలో ప్రపంచమంతటా సంభవించిన గొప్ప మార్పు. దీనికి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలు సైతం ఉన్నాయి. ప్రపంచీకరణ ప్రస్తుత దశలో ఒక ముఖ్యమైన అంశం అపార సంపద ఉన్న బహుళజాతి కంపెనీల నియంత్రణలో పెట్టుబడులు, వాణిజ్యం ద్వారా మార్కెట్లు, ఉత్పత్తి అనుసంధానింపబడటం. వాణిజ్యం, పెట్టుబడులకు ఉన్న సరళీకృత విధానం ద్వారా అవరోధాలను తొలగించటం వల్ల ప్రపంచీకరణ శక్తులకు ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరచినట్లు అయ్యింది.

ప్రపంచీకరణ ప్రయోజనాలు సమానంగా పంపిణీ కాలేదు. సంపన్న వినియోగదారులకు, నైపుణ్యం, విద్య, అపార సంపద ఉన్న ఉత్పత్తిదారులకు అది ప్రయోజనకరంగా ఉంది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న కొన్ని సేవలు విస్తరించాయి. ఇంకొకవైపున వేలాదిమంది చిన్న ఉత్పత్తిదారులకు, కార్మికులకు వాళ్ల ఉపాధికి, హక్కులకు భంగం కలుగుతోంది. రెండు పార్శ్వాలున్న ఈ ప్రపంచీకరణను అర్థం చేసుకోవటం ముఖ్యం.

అసమానత్వంలోని మరొక కోణం ఇతర దేశాల విధానాలలో ధనిక దేశాల పెత్తందారీ ఆధిపత్యం. వాణిజ్యం, పెట్టుబడులు, వలస వంటి అంతర్జాతీయ ఆర్థిక విధానాలలో అయితేనేమి, దేశ వ్యవహారాలలో అయితేనేమి ధనిక పాశ్చాత్య దేశాలు మిగిలిన ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO), ప్రపంచ బ్యాంకు(WB), అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) వంటి అంతర్జాతీయ సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలకంటే అభివృద్ధి చెందిన దేశాల ప్రయోజనాలకు ఎక్కువగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఒకవైపున ప్రపంచీకరణకు మద్దతు పలికేవాళ్లు విశ్వ అనుసంధానం ద్వారా ప్రపంచీకరణ అభివృద్ధికి, సంపదకు అవకాశాలను అందిస్తుందని భావించగా, దానిని విమర్శించే వాళ్లు ప్రపంచంపై ఆధిపత్యం పొందటానికి కొన్ని పాశ్చాత్య దేశాలు చేసే ప్రయత్నమని భావిస్తున్నారు. అనేక పేద దేశాలలో దీనివల్ల ప్రజాస్వామ్యం, కార్మికుల హక్కులు, పర్యావరణానికి భంగం కలుగుతోందని వీళ్లు వాదిస్తున్నారు.

### కీలక పదాలు

| | | |
|---|---|---|
| బహుళజాతి సంస్థలు(MNCs) | జాతీయరాజ్యం | సాంకేతిక పరిజ్ఞానం |
| విదేశీ పెట్టుబడి | విదేశీ వాణిజ్యం | సరళీకృత ఆర్థిక విధానం |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. విదేశీ పెట్టుబడి, వాణిజ్యాలపై భారత ప్రభుత్వం అవరోధాలు కల్పించటానికి గల కారణాలు ఏమిటి? ఈ అవరోధాలను తొలగించాలని అది ఎందుకు అనుకుంది?
2. కార్మిక చట్టాల సడలింపు కంపెనీలకు ఏ విధంగా సహాయపడుతుంది?
3. ఉత్పత్తిని చేపట్టటానికి, దానిని నియంత్రించటానికి, లేదా ఇతర దేశాలలో స్థిరపడటానికి బహుళజాతి సంస్థలు అవలంబించే విధానాలు ఏమిటి?
4. అభివృద్ధి చెందుతున్న దేశాలు వాణిజ్యం, పెట్టుబడులలో సరళీకృత విధానాలను అవలంబించాలని అభివృద్ధి చెందిన దేశాలు ఎందుకు కోరుకుంటున్నాయి? దీనికి ప్రతిగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏ షరతులను కోరాలి?
5. "ప్రపంచీకరణ ప్రభావం ఒకేరకంగా లేదు." ఈ వాక్యాన్ని వివరించండి.
6. వాణిజ్య, పెట్టుబడి విధానాలను సరళీకరించటం వల్ల ప్రపంచీకరణ ప్రక్రియకు మేలు ఎలా జరిగింది?
7. దేశాల మధ్య మార్కెట్ల అనుసంధానానికి విదేశీ వాణిజ్యం ఎలా దోహదం చేస్తుంది? ఇక్కడ ఇచ్చినవి కాకుండా కొత్త ఉదాహరణలతో దీనిని వివరించండి.
8. ప్రపంచీకరణ భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. ఇప్పటినుంచి ఇరవై ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందో ఊహించండి మీ ఊహలకు కారణాలను పేర్కొనండి.
9. ఇద్దరు వ్యక్తులు వాదించుకోవటం మీరు వింటున్నారు: ఒకరు ప్రపంచీకరణ మన దేశ అభివృద్ధిని కుంటుపరిచిందని అంటున్నారు. మరొకరు భారతదేశం అభివృద్ధి చెందటానికి ప్రపంచీకరణ సహాయపడుతోందని అంటున్నారు. ఈ వాదనలకు మీరు ఎలా స్పందిస్తారు?
10. ఖాళీలను పూరించండి:

భారతీయ కొనుగోలుదారులకు రెండు దశాబ్దాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు సరుకుల ఎంపికకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ------------ ప్రక్రియ వల్ల ఇది సాధ్యమయ్యింది. అనేక ఇతర దేశాలలో ఉత్పత్తి అయిన సరుకులను భారతదేశ మార్కెట్లలో అమ్ముతున్నారు. దీని అర్థం ఇతర దేశాలతో ---------- పెరుగుతోంది. అంతేకాకుండా మనం మార్కెట్లో చూస్తున్న అనేక బ్రాండ్లను బహుళజాతి సంస్థలు భారతదేశంలోనే ఉత్పత్తి చేసి ఉండవచ్చు. బహుళజాతి సంస్థలు ---------------, ----------- కారణంగా భారతదేశంలో పెట్టుబడులుపెడుతున్నాయి. మార్కెట్లో వినియోగదారుల ఎంపికకు అవకాశాలు పెరిగాయి కానీ ---------------- , --------------- వల్ల ఉత్పత్తిదారుల మధ్య ----------- తీవ్రతరం అయ్యింది.

11. కిందివాటిని జతపరచండి:

| | |
|---|---|
| (i) బహుళజాతి సంస్థలు తక్కువ ధరకు చిన్న ఉత్పత్తిదారుల నుంచి కొంటాయి | (అ) వాహనాలు |
| (ii) వస్తువుల వాణిజ్యాన్ని నియంత్రించటానికి కోటాలు, పన్నులు ఉపయోగిస్తారు | (ఆ) దుస్తులు, పాదరక్షలు, క్రీడాపరికరాలు |
| (iii) విదేశాలలో పెట్టుబడులు పెట్టిన భారతీయ కంపెనీలు | (ఇ) కాల్ సెంటర్లు |
| (iv) సేవల ఉత్పత్తి విస్తరించటానికి సమాచార సాంకేతిక రంగం (IT) దోహదపడింది | (ఈ) టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, రాన్‌బాక్సి |
| (v) భారతదేశంలో ఉత్పత్తి చెయ్యటానికి అనేక బహుళజాతి సంస్థలు కర్మాగారాల ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టాయి. | (ఉ) వాణిజ్య అవరోధాలు |

పాఠం
11

# ఆహార భద్రత

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు కరువులు – అంటే ఆహార కొరత తీవ్రంగా ఉండే పరిస్థితులు – పెద్ద ఎత్తున ఆకలి చావులకు కారణమయ్యేవి. ఉదాహరణకు 1943-45 సంవత్సరాలలో బెంగాల్ కరువు వల్ల బెంగాల్, అస్సోం, ఒడిశాలలో 30-50 లక్షలమంది ప్రజలు చనిపోయారు. ఇది చదవండి:

"మా కుటుంబంలో నేనే పెద్దవాడిని. బతకటానికి నేను దినసరి కూలి పని చేసేవాడిని. ఆ సమయంలో నా తమ్ముళ్లను, చెల్లెళ్లను తీసుకుని తండ్రిని వదిలిపెట్టి నేను కోల్‌కతా వెళ్లాను. మాకు ఆహారంగా పిండి మాత్రమే దొరికేది. ఆహారం ఎక్కడ పంచుతుంటే మేం అక్కడికి వెళ్లేవాళ్లం. కోల్‌కతా వీధులలో ఎంతోమంది బాధలు అనుభవించేవారిని నేను చూశాను. చనిపోయిన పిల్లలను చేతుల్లో పెట్టుకుని తిరుగుతున్న తల్లులను చూశాను. వాళ్లు మళ్లీ లేస్తారన్న ఆశతో వాళ్ల మీద ఆ తల్లులు నీళ్లు చల్లుతూ ఉన్నారు. నేను ఎన్నో చూశాను – ప్రజలు గడ్డిని, పాములను తిన్నారు. నా ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు చనిపోయారు.

"వీళ్లు రైతులు, వ్యవసాయదారులు; అంతేగాని అడుక్కునే వాళ్లుకాదు. అందుకే వాళ్లకు అడుక్కోవటం కూడా తెలిసేదికాదు. వాళ్లకు ఆత్మాభిమానం ఎక్కువ. కోల్‌కతా వచ్చిన వాళ్లు రోడ్ల పక్కన అలా కూర్చుండి, అక్కడే చనిపోయారు. కోల్‌కతా వాసులు ఆ ఫొటోలను చూసినప్పుడు సమస్య తీవ్రత ఒక్కసారిగా వాళ్లకు బోధపడింది."




*లైఫ్ (LIFE) పత్రికలోని ఫోటోలు:*
*(అ) ఆహార ధాన్యాలు రవాణా చేస్తున్న రైలునుంచి కొంత ధాన్యం తీసుకోటానికి ప్రయత్నిస్తున్న పిల్లలు.*
*(ఆ) నేలమీద పడిన గింజలను ఊడ్చుకుంటున్న మహిళ.*

పాలకులు ఆహార ధాన్యాల సరఫరా చేయలేకపోయినందువల్ల కరువులు సంభవించిన సందర్భాలు భారతదేశ చరిత్రలో ఉన్నాయి. ఆహార నిల్వలనుంచిగానీ, ఇతర ప్రాంతాలనుంచి ఆహార ధాన్యాలను

తెప్పించికానీ వీటిని సరఫరా చేసి ఉండవచ్చు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయం నాటికి ప్రజలకు ఆహారం అందేలా చూడటానికి ప్రభుత్వాలు వివిధ విధానాలను రూపొందించసాగాయి. తక్కువ ధరలకు ఆహార ధాన్యాలు లభించే రేషను దుకాణాలు, మీలో చాలామంది బడిలో తింటున్న మధ్యాహ్న భోజనం, చిన్నపిల్లల సంరక్షణతోపాటు, మధ్యాహ్న భోజనం పెట్టే అంగన్‌వాడి కేంద్రాలు వంటివాటి ద్వారా ప్రభుత్వం ఆహార భద్రత కల్పించటానికి ప్రయత్నిస్తోంది. ఈ పాఠంలో ఆహార భద్రతకు సంబంధించిన కొన్ని అంశాలను చూద్దాం.

మొదటిభాగంలో ఆహార భద్రతకు సంబంధించిన అంశాలను చూస్తాం: దేశం మొత్తం మీద ఆహార ఉత్పత్తి, లభ్యత వంటివి ఇందులో తెలుసుకుంటాం. రెండవ భాగంలో ప్రజలకు ఆహార అందుబాటు గురించి చూస్తాం – ఉత్పత్తి అయిన ఆహారం ప్రజలకు ఎంతవరకు చేరుకుంటుందో తెలుసుకుంటాం. చివరిగా, కుటుంబాల పోషకాహార స్థాయిని చూసి ఈ పథకాలు, పద్ధతులు సమర్థంగా పని చేస్తున్నాయో లేదో తెలుసుకుంటాం.

## దేశానికి ఆహార భద్రత

### ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచటం

ఆహార భద్రతకు సరిపోయేటంత ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయటం ముఖ్యమైన అవసరం. దీని అర్థం అధిక మొత్తంలో ఆహార పదార్థాలను రైతులు పండించగల పరిస్థితులను భారతదేశ ప్రభుత్వం కల్పించటం.

రేఖాచిత్ర పటం1ని పరిశీలించి ఖాళీలను పూరించండి (ప్రతి బిందువు దగ్గర ఖచ్చితమైన విలువను తెలుసుకోటానికి 'వై' అక్షం మీది స్కేలుని ఉపయోగించండి).

- ఆహారధాన్యాల ఉత్పత్తి 1970–71 నుండి ------ కు పెరిగింది. వరి ఉత్పత్తి 1970–71 నాటి 40 మిలియన్ టన్నులనుంచి 2010–11 నాటికి -------- మిలియన్ టన్నులకు పెరిగింది. ఈ 40 ఏళ్ల కాలంలో ఉత్పత్తి వేగంగా పెరిగిన మరొక ముఖ్యమైన ఆహారపంట ------. వరి, గోధుమలతో పోలిస్తే 1970–2011 కాలంలో -------- ఉత్పత్తి పెరగలేదు. దీనికి కారణం ------ అయి ఉండవచ్చు.
- పాఠం 9 "రాంపురం : గ్రామ ఆర్థిక వ్యవస్థ" లోని 'భూమి, ఇతర సహజ వనరులు' అనే భాగాన్ని మళ్ళీ చదవండి. భూమి నుంచి పంట ఉత్పత్తి పెంచటానికి ఏఏ విధానాలు ఉన్నాయి?

రేఖా చిత్రపటం 1 : ఎంపిక చేసిన ఆహార ధాన్యాల ఉత్పత్తి (మిలియన్ టన్నులలో)



రేఖాచిత్ర పటం 2 : ఎంపిక చేసిన ఆహార ధాన్యాల దిగుబడి (హెక్టారుకు కిలోలలో)




గత కొద్ది దశాబ్దాలుగా సాగుకింద ఉన్న భూమి ఇంచుమించు స్థిరంగా ఉందని మనకు తెలుసు. కాబట్టి దిగుబడులు ముఖ్యమౌతాయి. రేఖాచిత్ర పటం 2 చూడండి.

హెక్టారుకు లభించే పంట దిగుబడిని పెంచటానికి అవసరమైన ఉత్పాదకాలను సక్రమంగా వినియోగించుకోవాలి. సాగునీటి వసతిని పెంచటం ఒక మార్గం. అయితే ఈ కీలక వనరు అందరికీ అందేలా పంచుకునే పద్ధతిలో వినియోగించాలి.

రేఖాచిత్ర పటం 2 లో తక్కువ దిగుబడి ఉన్న పంటలను ప్రధానంగా వర్షాధార ప్రాంతాలలో సాగుచేస్తారు, ఈ భూములకు భవిష్యత్తులో కూడా సాగునీటి సదుపాయం లభించే అవకాశం లేదు. కాబట్టి వర్షాభావ పంట రకాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విత్తటం, వర్షపు నీటిని నిల్వ చేయటం, పంటమార్పిడి వంటి పద్ధతుల ద్వారా దిగుబడులు పెంచాలి.

ఈ ప్రక్రియలో నేల, ఇతర సహజ వనరులు అంతరించిపోకుండా, క్షీణతకు గురికాకుండా చూడడం కూడా ఎంతో ముఖ్యం. భారతదేశంలో వరి, గోధుమలను పండిస్తున్న విధానం వల్ల – రసాయనిక ఎరువులు, పురుగుమందులను అశాస్త్రీయంగా, విచక్షణారహితంగా వాడటం వల్ల దిగుబడులు అయితే పెరిగాయికానీ ఇది సుస్థిర పద్ధతి కాదని కొంతమంది శాస్త్రజ్ఞులు, వ్యవసాయరంగంలో పనిచేస్తున్న వ్యక్తులు భావిస్తున్నారు. వాస్తవానికి ఈ పద్ధతులవల్ల నేల క్షీణతకు గురయ్యింది, భూగర్భజల వనరులు అంతరించిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే దిగుబడులు పెరగటం అటుంచి పడిపోవటం మొదలవుతుంది.

కింది వాక్యాలను చదివి హెక్టారుకు వరి, గోధుమల దిగుబడులు ఎలా ఉన్నాయో వివరించండి.

- ---------, ------------- పంటల దిగుబడులు వరి, గోధుమలతో పోలిస్తే ఎప్పుడూ తక్కువగానే ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో ఈ పంటల దిగుబడులు మెల్లగా పెరుగుతున్నాయి.
- జొన్న దిగుబడులను పెంచటంపై దృష్టి ఎందుకు పెట్టాలి? చర్చించండి.
- దీర్ఘ కాలంపాటు వరి, గోధుమ దిగుబడులు గణనీయంగా పెరగటానికి ఏ అంశాలు దోహదం చేశాయి?

## ఆహారధాన్యాల లభ్యత

దేశం మొత్తానికి సరిపడా ఆహార ధాన్యాలను పండించటం అనేది మొదటి మెట్టు. అందరికీ సరిపడా ఆహారం ఉందో, లేదో ఎలా లెక్కగడతాం? ఈ ఆహారం కుటుంబాలకు అందుతుందో, లేదో తరువాత చూద్దాం. ముందుగా లభ్యత ఎంత ఉందో చూస్తున్నాం. దీని అర్థం దేశంలో తలసరి సగటు ఆహార ధాన్యాల లభ్యత సరిపడా ఉండాలి, కాలక్రమంలో పెరుగుతూ ఉండాలి. ఆహార ధాన్యాల లభ్యత వాస్తవంలో పెరుగుతోందా?

ఆహారధాన్యాల ఉత్పత్తి, లభ్యతల మధ్య తేడా ఉంది. దీనిని ఈ విధంగా అంచనా వేస్తారు.

**సంవత్సరానికి లభ్యతలో ఉన్న ఆహారధాన్యాలు** = సంవత్సరంలో ఆహారధాన్యాల ఉత్పత్తి (ఉత్పత్తి – విత్తనం, దాణా, వృధా) + నికర దిగుమతులు (దిగుమతులు – ఎగుమతులు) – ప్రభుత్వ నిల్వలలో తేడా (సంవత్సరం ముగిసేనాటికి ఉన్న నిల్వలు – సంవత్సరం ఆరంభం నాటికి ఉన్న నిల్వలు).

**సగటున ప్రతి వ్యక్తికి, ప్రతిరోజూ లభ్యతలో ఉన్న ఆహారధాన్యాలు** = (సంవత్సరానికి లభ్యతలో ఉన్న ఆహారధాన్యాలు ÷ జనాభా) / 365.

ఉత్పత్తి, దిగుమతులు, ప్రభుత్వ నిల్వలలో మార్పులకు సంబంధించిన వివరాలు 1971, 1991, 2011 సంవత్సరాలకు కింద పట్టికలో ఉన్నాయి. ఉత్పత్తి కాకుండా ఒక సంవత్సరంలో ఆహారధాన్యాల లభ్యత పెంచటానికి దిగుమతులు ఒక మార్గం. ఆహార లభ్యతను పెంచటానికి ప్రభుత్వ నిల్వలను ఉపయోగించుకోవటం ముఖ్యమైన మార్గం. ఉదాహరణకు ప్రభుత్వం తన దగ్గర ఉన్న నిల్వల నుంచి ప్రజలకు బియ్యం అమ్మటంద్వారా దాని లభ్యతను పెంచవచ్చు. ప్రభుత్వం దగ్గర నిల్వలు పడిపోతాయి కాని ఆ సంవత్సరం వినియోగానికి బియ్యం లభ్యత పెరుగుతుంది. (తరువాతి భాగంలో ప్రభుత్వ నిల్వల గురించి మరింత తెలుసుకుంటాం.)

1971కి లెక్కగట్టిన విధంగా, 1991, 2011 సంవత్సరాలకు తలసరి సగటు ఆహార ధాన్యాల అందుబాటును లెక్కగట్టండి.

*పట్టిక 1 : తలసరి ఆహార ధాన్యాల లభ్యత*

| *సంవత్సరం* | *జనాభా (మిలియన్లు)* | *నికర ఆహార ధాన్యాల ఉత్పత్తి #* | *నికర దిగుమతులు #* | *ప్రభుత్వ నిల్వల్లో మార్పు #* | *ఆహారధాన్యాల నికర లభ్యత #* | *తలసరి లభ్యత ఒకరోజుకు (గ్రాముల్లో)* |
|---|---|---|---|---|---|---|
| col (1) | col (2) | col (3) | col (4) | col (5) | col (6) | col (7) |
| 1971 | 551 | 94.9 | 2 | 2.6 | col (3) + col (4) – col (5) = 94.3 | ={col (6)/col (2)}/365}<br>= (94.3/551)/365<br>= 0.000469 *టన్నులు* *<br>= 0.000469 x 1000<br>= 0.469 *కిలోగ్రాములు* *<br>= 0.469 x 1000<br>= 469 *గ్రాములు* |
| 1991 | 852 | 154.3 | –0.1 | –4.4 | | |
| 2011 | 1202 | 214.2 | –2.9 | 8.2 | | |

గమనిక: 1 టన్ను = 1000 కిలోలు; 1 కిలో = 1000 గ్రాములు; # = మిలియన్ టన్నులు

- మీరు లెక్కించిన దాని ఆధారంగా ఖాళీలను పూరించండి: 1971 నుంచి 1991 నాటికి తలసరి ఆహారధాన్యాల లభ్యత -------- (పెరిగింది/ తగ్గింది), కానీ 2011లో ఇది -------(ఎక్కువ / తక్కువగా) ఉంది. ఇటీవల దశాబ్దాలలో జనాభావృద్ధిలో తగ్గుదల ఉన్నప్పటికీ ఇలా జరిగింది. భవిష్యత్తులో ఆహారధాన్యాల లభ్యత పెరగటానికి ప్రభుత్వం ------------ చర్యలు చేపట్టాలి.

**ఆహారధాన్యాలు అంటే ఏమిటి?**




*'తృణ' ధాన్యాలు అంటారు కాబట్టి ఇవి తక్కువ పంటలు అని చాలామంది అనుకుంటారు, ఇవి తృణప్రాయమని, పోషక విలువలు తక్కువ అని అనుకుంటారు. ఇందుకు విరుద్ధంగా వీటిల్లో పోషకాలు ఎక్కువ, ఒక రకంగా పరిపూర్ణమైన ఆహారం ఇవి. దేశంలోని వర్షాధార ప్రాంతంలో ఉంటున్న లక్షలాది ప్రజల ప్రధాన ఆహారం ఇవే. ఒకప్పుడు భారతీయ కుటుంబాలన్నింటిలో వీటిని ఇష్టంగా తినేవాళ్లు. బియ్యం, గోధుమల తెల్లరంగు ఇష్టపడే వలస పాలకులతో వీటికి తృణ ధాన్యాలన్న పేరు వచ్చింది; అంతేకాకుండా వాళ్లు స్థానిక ఆహారాన్ని, సాంస్కృతిక ఆచారాలను చిన్నచూపు చూశారు. ప్రస్తుతం చాలా మంది వీటిని 'పోషక ధాన్యాలు'గా వ్యవహరిస్తున్నారు.*

## ఇతర ఆహార పదార్థాల లభ్యత

ఆహార వినియోగంలో మార్పులు వచ్చి పళ్లు, కూరగాయలు, పాలు, మాంసం, కోడి మాంసం, చేపలను ప్రజలు కోరుకుంటున్నారని చెపుతారు. ఇది వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు మంచి సంకేతం. వినియోగదారులు రకరకాల ఆహార పదార్థాలతో సమతుల ఆహారం తీసుకోవాలి. ఆహార ధాన్యాలను పండించే రైతులు తమ ఆదాయాలను పెంచుకోటానికి వివిధ పంటలసాగును చేపట్టవచ్చు. గత రెండు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ధాన్యాలు పండించే భూమిని పత్తివంటి వాణిజ్యపంటలకు మళ్లిస్తున్నారని ఇంతకు ముందు తరగతులలో చదివాం. రైతుల సంక్షోభానికి ఇది కూడా ఒక కారణం. వీటికి బదులుగా రైతులు కోళ్ల పెంపకం, చేపల పెంపకం, పాడి పరిశ్రమ వంటి అనుబంధ పనులను చేపట్టి కొత్త అవకాశాలను అంది పుచ్చుకోవచ్చు.

కాలక్రమంలో ఇతర ఆహార పదార్థాల ఉత్పత్తి పెరిగినప్పటికి రోజువారీ కనీస ఆహార అవసరాలు తీర్చటానికి సరిపడేటంతగా ఇది లేదు. భారతదేశంలో సగటున ప్రతి వ్యక్తీ రోజుకు 300 గ్రాముల కూరగాయలు, 100 గ్రాముల పళ్లు తీసుకోవాలని పోషకాహార నిపుణులు చెపుతున్నారు. అయితే, వీటి లభ్యత వరసగా 180 గ్రాములు, 58 గ్రాములు మాత్రమే ఉంది. అదే విధంగా సగటున ప్రతి వ్యక్తి సంవత్సరంలో 180 గుడ్లు తీసుకోవలసి ఉండగా వీటి లభ్యత 30 మాత్రమే. ఆహారంలో సగటున ప్రతి వ్యక్తి సంవత్సరానికి 11 కిలోల మాంసం తీసుకోవలసి ఉండగా లభ్యత 3.2 కిలోలు మాత్రమే. రోజుకు ప్రతి వ్యక్తి 300 మిల్లీలీటర్ల పాలు తీసుకోవలసి ఉండగా లభ్యత 210 మిల్లీలీటర్లు మాత్రమే.

కాబట్టి ఇతర ఆహార పదార్థాల ఉత్పత్తి చేపట్టటానికి రైతులకు ఉత్పాదకాలు, మార్కెటు అవకాశాల రూపంలో మద్దతు కావాలి. కొత్త పరిస్థితిలో రైతులు ఎదుర్కొనే మార్కెటు ఒడిదుడుకులనుంచి రైతులకు రక్షణ, మద్దతు అవసరం అవుతాయి.

## వ్యవసాయ వైవిధ్యీకరణ

మిద్నపూర్ ప్రాంతంలో ఎర్రనేలలు ఉన్నాయి. బొర్కొల్లా గ్రామ పంచాయితి పరిధిలోని కస్బల్ గ్రామం అది. దాదాపు అందరికీ బోరుబావులు ఉన్నాయి. నీటి వసతి అభివృద్ధికి బ్యాంకులు వాళ్లకు రుణాలు ఇచ్చాయి. నేను హరిప్రసాద్ సమంత, చిట్టో మైతి, ఝూథ్ లెంకాలతో మాట్లాడాను – ఎవరూ రెండు ఎకరాలకు మించి సాగు చెయ్యటంలేదు. సాంకేతిక విజ్ఞానం చాలా బాగుంది. వరి విత్తనాలను ఎప్పుడో విశ్వవిద్యాలయం నుంచి తెచ్చుకుని ఇంకా అవే వాడుతున్నారు. వాణిజ్య పంటలద్వారా వాళ్లకు ఎక్కువ ఆదాయం వస్తుంది, ప్రతి ఒక్కరూ కూరగాయలు పండిస్తారు. బంగాళాదుంపలంటే అందరికీ పిచ్చి మోజు. వీటి విత్తనాలు వాణిజ్య కంపెనీల నుంచి లభిస్తాయి, ఖరీదు ఎక్కువ... ఇంకొక మంచి పరిణామం పాడి పరిశ్రమ. దాదాపు అందరికీ 3 నుంచి 5 ఆవులు ఉన్నాయి. వీటి పోషణ బాధ్యత ఆడవాళ్లది. ఇది ఇప్పుడు విస్తరిస్తోంది. మంచి పప్పుధాన్యాల విత్తనాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి వస్తాయని రైతులకు తెలుసు. వాళ్ల దగ్గర ఉన్న ఆవాల విత్తనాలు మంచివి.

నది నుంచి నేల పైకి ఏటవాలుగా ఉంటుంది. మూడు వందల మీటర్ల పైకి, కొంతదూరం వెళ్లిన తరువాత మరొక గ్రామం చూశాను. అక్కడ సగం జనాభా పేదరికంలో ఉంది. అక్కడ ఒకే పంట పండుతుంది, రెండవ పంట వర్షాలపై ఆధారపడి సాగు చేస్తారు. దిగుబడులు తక్కువ. అనేక అవకాశాలు ఉన్నాయి. అయితే ఒక ప్రణాళిక, ప్రభుత్వ సహాయమూ లేకుండా వాళ్లతో వైవిధ్యీకరణ గురించి మాట్లాడటం వృథా ప్రయాసే అవుతుంది.

- వ్యవసాయ వైవిధ్యీకరణకు సంబంధించిన పదాలు, వాక్యాల కింద గీత గీసి భారతీయ రైతులకు ఇది ఎందుకు అవసరమో వివరించండి.
- మీ గ్రామంలో లేదా మీకు తెలిసిన గ్రామంలో వ్యవసాయ వైవిధ్యీకరణను వివరించండి.

వ్యవసాయ వైవిధ్యీకరణ ఆహారధాన్యాల ఉత్పత్తిని ప్రభావితం చేస్తుందన్న విషయాన్ని గమనించండి. దీని వల్ల ఎదురయ్యే విధానాల సందిగ్ధతను సరియైన ప్రణాళికల ద్వారా ఎదుర్కోవాలి. ఆహారేతర పంటలకు వనరులను మళ్లించటం వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గవచ్చు. తలసరి ఆహార ధాన్యాల లభ్యతలో యూరపు (700 గ్రాములు), అమెరికా (850 గ్రాములు) వంటి దేశాలతో పోలిస్తే భారతదేశంలో తక్కువ. ఆహార ధాన్యాల తలసరి లభ్యత తగ్గుతూ ఉండటం భారతదేశం ఆహార భద్రత విషయంలో ఆందోళన కలిగించే విషయం. పేద కుటుంబాల వాళ్లు శారీరిక కష్టం చేస్తారు, శక్తి కోసం వాళ్లు ఎక్కువగా ఆహారధాన్యాలపైనే ఆధారపడి ఉన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తితోపాటు ఇతర ఆహార పదార్థాల ఉత్పత్తి పెంచేలా మన విధానాలు ఉండాలి.

### ఆహార అందుబాటు

ఆహార భద్రతలో తరువాత ముఖ్యమైన అంశం ఆహార అందుబాటు. ఆహారధాన్యాలు, ఇతర పదార్థాలు ఉత్పత్తి చేసినంత మాత్రాన సరిపోదు. ప్రతి ఒక్కళ్లు వాటిని కొని, వినియోగించే స్థితిలో ఉండాలి. కనీసంగా అవసరమైన ఆహారం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉందా?

ఎనిమిదవ తరగతిలో పేదరికం గురించి చదివింది మననం చేసుకోండి. మనం తినే ఆహారం శరీరంలో జీర్ణమై శక్తిని ఉత్పత్తి చేస్తుంది, దీనిని కాలరీలలో కొలుస్తారు. దీని వల్ల మనం పని చెయ్యగలుగుతాం. తక్కువ లేదా తక్కువ పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే మన శరీరానికి అందే




కాలరీలు తగ్గుతాయి. ఫలితంగా పనిచెయ్యటం కష్టంగా ఉంటుంది, లేదా ఆరోగ్యం క్షీణిస్తుంది. రోజుకు పట్టణ ప్రాంతాల్లో 2100 కాలరీలు, గ్రామీణ ప్రాంతాల్లో 2400 కాలరీలు శక్తిని ఇచ్చే ఆహారం తీసుకోవాలి.

తీసుకోవలసిన కాలరీల కంటే గ్రామీణ, పట్టణ ప్రాంతాల జాతీయ సగటు తక్కువగా ఉంది. అంతేకాకుండా కాలరీల వినియోగం 1983తో పోలిస్తే 2004 నాటికి తగ్గింది. మన దేశ ఆర్థిక పరిస్థితి వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వస్తువులు, సేవల ఉత్పత్తి అనేక రెట్లు పెరిగిన నేపథ్యంలో ఇలా జరగటం ఆందోళనకరంగా ఉంది. అంతేకాదు. పంపిణీలోని తేడాలను సగటు మరుగుపరుస్తుంది. బాగా సంపన్నులు సిఫారసు చేసిన కాలరీలకంటే ఎక్కువ వినియోగిస్తుండగా జనాభాలో అధికశాతం ప్రజలు తీసుకునే ఆహారం వాళ్ళకు సరిపడా కాలరీలను అందించటం లేదు. భారతదేశ గ్రామీణ ప్రాంతంలో 80 శాతం ప్రజలు కాలరీల దృష్ట్యా తినవలసిన దానికంటే తక్కువ ఆహారం తింటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అత్యంత పేదల కాలరీ వినియోగం అందరికంటే తక్కువగా ఉందని రేఖాచిత్రపటం 3 తెలియచేస్తోంది. ఇది అవసరమైన 2400 కాలరీల కంటే చాలా తక్కువగా కూడా ఉంది. అందరిలో శారీరక శ్రమ, కష్టమైన పనులు ఎక్కువగా చేసేది వీళ్ళే.

తక్కువ కాలరీల వినియోగానికి ముఖ్యమైన కారణం ప్రజల కొనుగోలు శక్తి తక్కువగా ఉండటం. ఆహారం కొనటానికి సరిపడా ఆదాయం ప్రజలకు ఉండటం లేదు. పేదరికం, నిరుద్యోగం, ప్రజాసదుపాయాలు వంటి వాటి చర్చలో మీరు చదివినట్టుగా దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిని మరొకసారి మననం చేసుకుని ముందుకు సాగండి.

## ప్రజా పంపిణీ వ్యవస్థ

భారతదేశంలో ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండటానికి ప్రజలకు చౌకధరల దుకాణాలు ఎంతో ముఖ్యమైనవి. 2004-05లో వివిధ రాష్ట్రాల ప్రజలు ప్రజా పంపిణీ వ్యవస్థలోని చౌక ధరల దుకాణాల నుంచి కొనుగోలు చేసే ఆహార ధాన్యాలు వాళ్ల మొత్తం ఆహార ధాన్యాల వినియోగంలో ఎంత శాతమో తెలుసుకోటానికి ఒక సర్వే చేశారు. రేఖాచిత్ర పటం 4 చూడండి. భారతదేశ రాష్ట్రాలలో ఆహార ధాన్యాల కొనుగోలుకు ప్రజా పంపిణీ వ్యవస్థపై ఆధారపడిన తీరుని ఇది తెలియచేస్తుంది.

- ఎనిమిదవ తరగతిలోని ప్రజా పంపిణీ వ్యవస్థపై చర్చను గుర్తుకు తెచ్చుకోండి. ప్రజా పంపిణీ వ్యవస్థకు, ప్రజల ఆహార భద్రతకు మధ్య గల సంబంధం ఏమిటి?

భారతదేశ దక్షిణాది రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ బాగుందని అధ్యయనాలు వెల్లడి చేస్తున్నాయి. ఇవి ప్రజా పంపిణీ వ్యవస్థను అందరికీ వర్తింపచేసిన రాష్ట్రాలు కావటం గమనించవలసిన విషయం. ఇవి అందరికీ తక్కువ ధరలలో ఆహార ధాన్యాలను అందించాయి. ఇందుకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాలు పేదవాళ్లను గుర్తించి ఆహార ధాన్యాలను పేదలకు,

పేదలు కానివాళ్లకు వేరువేరు ధరలకు అమ్మాయి. పేదలలో కూడా అత్యంత పేదలకు కూడా వేరే హక్కులు ఉన్నాయి, వాళ్ళకు అందించే మోతాదు వేరు. ఉదాహరణకు అంత్యోదయ కార్డు ఉన్న వాళ్ళకు ప్రతి కుటుంబానికి, నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలు (బియ్యం, గోధుమలు) అందుతాయి.

*రేఖాచిత్ర పటం 4 : 2009-10లో బియ్యం, గోధుమల కొనుగోళ్ళలో రేషను దుకాణాల నుంచి కొన్నశాతం.*




- ఖాళీలనుపూరించండి

అఖిల భారతానికి ప్రజల మొత్తం వినియోగంలో ------- శాతం బియ్యం, ----- శాతం గోధుమ చౌక ధరల దుకాణాలనుంచి కొనుగోలు చేస్తారు. దీని అర్థం ప్రజలు తమ ఆహార ధాన్యాల అవసరంలో అధిక భాగం ----- నుంచి కొనుక్కోవాలి. అయితే ------- , ------- రాష్ట్రాలలో పరిస్థితి బాగుంది. -------, -------- , ---------- రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రజల ఆహార ధాన్యాల అవసరాలను నామమాత్రంగా తీరుస్తోంది.

## ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహార బఫర్ నిల్వలు

భారత ప్రభుత్వం భారత ఆహార సంస్థ (Food Corporation of India) ద్వారా కొని నిల్వచేసే ఆహార ధాన్యాలను బఫర్ నిల్వలు అంటారు. అదనపు ఉత్పత్తి ఉన్న రాష్ట్రాలలో రైతుల నుంచి వడ్లు, గోధుమలను FCI కొనుగోలు చేస్తుంది. వీటికి ముందుగా ప్రకటించిన ధరల ప్రకారం రైతులకు చెల్లిస్తారు. ఈ ధరను కనీస మద్దతు ధర (Minimum Support Price) అంటారు. ప్రభుత్వ సంస్థ ప్రతిసంవత్సరానికి MSP ని ప్రకటిస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడింట ఒక వంతు ఆహార ధాన్యాలను రైతులనుంచి కొనుగోలు చేస్తాయి. వివిధ పథకాల ద్వారా ఈ ఆహార ధాన్యాలను ప్రజలకు పంపిణీ చేస్తుంది. ఇటీవల కాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన దానికంటే ఎక్కువ ఆహార ధాన్యాలను ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. ప్రభుత్వ నిల్వలు ప్రతి సంవత్సరం పెరుగుతుంటే ఆహార ధాన్యాల లభ్యత తగ్గుతుంది (ఆహార లభ్యత పట్టికలో 2011 వివరాలు చూడండి). అవసరమైన ప్రజలకు ఈ ఆహార ధాన్యాలను పంపిణీ చేయటం లేదన్న విమర్శ ప్రభుత్వంపై ఉంది. కొన్నిసార్లు, ప్రభుత్వాలు ఈ ఆహార ధాన్యాలను విదేశాలకు ఎగుమతికూడా చేశాయి.

- దేశంలో అధిక శాతం ప్రజలకు ఆహార ధాన్యాలు అందుబాటులోలేని నేపథ్యంలో స్వల్ప ఆదాయంకోసం ఆహార ధాన్యాలను ఎగుమతి చెయ్యటం సరైనదేనా?

2013లో భారత ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం అనే ఒక కొత్త చట్టం చేసింది. ఇది ప్రజలకు ఉన్న ఆహారాన్ని పొందే హక్కుకు చట్టబద్ధతనిచ్చింది. భారతదేశంలోని మూడింట రెండు వంతుల జనాభాకు ఇది వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలలోని ప్రతి వ్యక్తికి సబ్సిడీ ధరకు 5 కిలోల ఆహార ధాన్యాలు అందుతాయి. పేదవాళ్ళల్లో అత్యంత పేదలకు 35

కిలోలు ఇవ్వాలి. కొన్ని సంవత్సరాలపాటు కేంద్ర ప్రభుత్వం బియ్యం, గోధుమ, చిరుధాన్యాలను వరసగా 3,2,1 రూపాయలకు అందిస్తుంది. ఈ చట్టం ప్రకారం అవసరమైతే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 75 శాతానికి, పట్టణ జనాభాలో 50 శాతానికి ప్రజా పంపిణీ వ్యవస్థనుంచి ఆహార ధాన్యాలను కొనుగోలు చేసే హక్కు ఉంది. ప్రభుత్వం ఆహార ధాన్యాలను అందించే పరిస్థితిలో లేకపోతే ప్రజలు వాటిని కొనుక్కోటానికి నగదు ఇవ్వాలి. ఈ చట్టం ప్రకారం గర్భిణి స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, అంగన్‌వాడీకి వచ్చే 1–6 సంవత్సరాల పిల్లలకు, బడికి వచ్చే 6–14 సంవత్సరాల పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టాలి.

భారత పార్లమెంటు జాతీయ ఆహార భద్రత చట్టం వంటి చట్టాలను, సమగ్ర శిశు అభివృద్ధి పథకం వంటి పథకాలను అమలు చేస్తుండగా ఇటీవల కాలంలో ఆహార భద్రత అమలు అయ్యేలా చూడటంలో భారత న్యాయ వ్యవస్థ కూడా చురుకైన పాత్ర పోషిస్తోంది. స్వచ్ఛంద సంస్థలు వేసిన దావాలలో తీర్పును ఇస్తూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం తమిళనాడు వంటి రాష్ట్రాలలో చిన్న స్థాయిలో అమలు అవుతూ ఉండేది. ఇప్పుడు ఈ పథకం అన్ని రాష్ట్రాలలో అమలు అవుతోంది. పాఠశాలల్లో చదువుతున్న 14 కోట్లమంది పిల్లలు ప్రస్తుతం మధ్యాహ్న భోజనం తింటున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చెయ్యటానికి నిరాకరించినప్పుడు న్యాయ స్థానం పర్యవేక్షణ విధానాన్ని కూడా నెలకొల్పింది. అలాగే స్థానికంగా పండించిన ఆహార ధాన్యాలను ఉపయోగించాలని, వేడిగా వండి పెట్టాలని (అప్పటిదాకా అనేక ప్రభుత్వాలు ఆహార ధాన్యాలు లేదా తినుబండారాలు ఇచ్చేవి), అది శుభ్రంగా, పోషకాహారంగా (సిఫారసు చేసిన కాలరీలు ఉండేలా) ఉండాలని, వారంలో ప్రతిరోజు వేర్వేరు పదార్థాలు పెట్టాలంటూ మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగ్గా అమలు పరచటానికి అనేక సిఫారసులు న్యాయస్థానం చేసింది. ఆహారం వండటంలో దళితులకు, విధవలకు, ఏ ఆధారంలేని మహిళలకు ప్రాధాన్యతనివ్వాలని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. ప్రపంచంలోకెల్లా ఇదే అత్యంత పెద్ద పాఠశాల భోజన పథకం. ఈ పథకానికి డబ్బులు సమకూర్చుకోటానికి పన్నులు విధించమని కూడా భారత ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ఇప్పుడు అంగన్‌వాడీలలోని పిల్లలకు కూడా వేడిగా వండిన ఆహారం పెడుతున్నారు.

## పోషకాహార స్థాయి

చివరిగా పెద్దలు, పిల్లలు తీసుకుంటున్న ఆహారం సరిపోతోందో లేదో తెలుసుకోటానికి వాళ్ల పోషకాహార స్థాయి చూద్దాం. పైన చర్చించిన పథకాలు సమర్ధంగా పని చేస్తున్నాయో, లేదో, సమస్యాత్మక రంగాలు ఏమిటో కూడా ఇది తెలియచేస్తుంది.

శరీరం అన్ని విధులను నిర్వహించడానికి – శక్తికి, ఎదుగుదలకు, ఆరోగ్యంగా ఉండటానికి, రోగాలతో పోరాడటానికి – ఆహారం కావాలి. మనం తినే ఆహారాన్ని కింది విధంగా వర్గీకరిస్తారు:

**పిండి పదార్థాలు:** గోధుమలు, బియ్యం, రాగులు, జొన్నలు, నూనెలు, పంచదార, కొవ్వు పదార్థాలు వంటి వాటిద్వారా ఇవి శక్తిని అందిస్తాయి.

**మాంసకృత్తులు:** చిక్కుళ్లు, పప్పులు, మాంసం, గుడ్లు, బియ్యం, గోధుమలు వంటివి శారీరక ఎదుగుదలకు, కణజాల పునరుద్ధరణకు దోహదం చేస్తాయి.

**విటమిన్లు:** పళ్లు, ఆకుకూరలు, మొలకలు, ముడి బియ్యం వంటి వాటి ద్వారా శరీరానికి రక్షణ ఇచ్చి అనేక కీలక వ్యవస్థలు పని చెయ్యటానికి ఉపయోగపడతాయి.

**ఖనిజ లవణాలు:** రక్తం ఏర్పడటానికి ఇనుములాగా అనేక ముఖ్యమైన విధులకు ఇవి తక్కువ మోతాదులో కావాలి. ఇవి ఆకుకూరలు, రాగులు వంటి వాటిద్వారా అందుతాయి.

ఇంతకు ముందు పాఠాలలో మాదిరి ప్రజలు ఒక రోజులో ఏమి తింటారో అడిగి వాళ్లు తింటున్న ఆహారం గురించి ఒక సర్వే ద్వారా తెలుసుకోవచ్చు. దీని ద్వారా పైన పేర్కొన్న అన్ని ఆహార పదార్థాలను ప్రజలు తింటున్నారో లేదో తెలుసుకోవచ్చు. అయితే కుటుంబంలోని ఒక్కొక్కరు ఎంత మోతాదులో పిండిపదార్థాలు, విటమిన్లు, మాంసకృత్తులు, ఖనిజ లవణాలను తీసుకుంటున్నారో ఖచ్చితంగా తెలుసుకోవటం కష్టం. ప్రజలు పోషకాహారం తీసుకుంటున్నారో లేదో తెలుసుకోటానికి వాళ్ల ఎత్తు, బరువును సూచికగా ఉపయోగించే విధానాన్ని పోషకాహార శాస్త్రజ్ఞులు రూపొందించారు. చాలా ఎక్కువమంది వివరాలు తీసుకుని, గణాంక శాస్త్ర పరిజ్ఞానంతో ఆధారపడదగిన ప్రామాణిక పరిధులను పోషకాహార శాస్త్రజ్ఞులు తయారుచేశారు. దీనితో వ్యక్తులను పోల్చటం సాధ్యం అవుతుంది. దీని ద్వారా ప్రజల పోషకాహారస్థాయి గురించి ఖచ్చితంగా అంచనా వేయవచ్చు.

హైదరాబాదులోని జాతీయ పోషకాహార సంస్థ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో చేసిన పోషకాహార సర్వే భారతదేశంలో పోషకాహార స్థాయి ఆందోళనకరంగా ఉందని వెల్లడి చేస్తోంది. గత తరగతులలో పేదరికానికి, పోషకాహార లోపానికి సంబంధించి వాస్తవ పరిస్థితిని తెలియచేసే ఉదాహరణలు చూశాం. వ్యక్తుల గురించి తెలియచెయ్యని ఈ గణాంకాలను పరిశీలించటం కూడా ఎంతో ముఖ్యం. ఇలాంటి పరిస్థితులు చాలా అరుదుగా ఉంటున్నాయా, లేదా సాధారణ ధోరణిగా ఉందా అని అర్థం చేసుకోటానికి ఇది సహాయపడుతుంది. స్పష్టంగా వెల్లడి కాని, దాగి ఉన్న అంశాలను చూడటానికి కూడా ఇది దోహదపడుతుంది.

పైన పేర్కొన్నట్టుగా పిల్లల పోషకాహారస్థాయిని పరిశీలించటానికి ఎత్తు, బరువు కొలతలను ఉపయోగిస్తారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి దీనిని ఎలా చేస్తారో చూడండి. పిల్లలు చాలా వేగంగా ఎదుగుతారు కాబట్టి పెద్దవాళ్లలా కాకుండా వయసుతోపాటు వాళ్ల బరువు పెరుగుతుంటుంది. వయస్సు, బరువు ఖచ్చితంగా తెలుసుకుంటే ఈ సూచిక బాగా ఉపయోగపడుతుంది. ఇలా తీసుకున్న కొలతలను పోషకాహార శాస్త్రజ్ఞులు రూపొందించిన చార్టులో పొందుపరిస్తే ఆ పిల్లలు సాధారణ పరిధిలో ఉన్నారా లేదా దాని దిగువన ఉన్నారా అనేది తెలుస్తుంది.

ఉదాహరణకు ఒక పిల్లవాడి బరువు అతడి వయస్సుకు ఎదురుగా ఈ చార్టులో గుర్తిస్తే అతడు తక్కువ బరువులో ఉన్నాడో, లేదో తెలుస్తుంది. ఇది ఒక పిల్లవాడి వివరం.

*రేఖాచిత్రం 5: ఆంధ్రప్రదేశ్‌లో పిల్లల పోషణ స్థాయిని తెలుసుకోటానికి అంగన్‌వాడీలలో ఉపయోగించే బరువు చార్టు*



జాతీయ పోషకాహార సంస్థ చేసిన సర్వే ఏం తెలియచేస్తోంది? దేశంలోని పలు రాష్ట్రాలలో సర్వే చేసిన 1–5 సంవత్సరాల వయసున్న 7000 పిల్లల్లో 45% మంది తక్కువ బరువు ఉన్నారు. అంటే సాధారణ ప్రామాణికాల ప్రకారం ఉండవలసిన దానికంటే తక్కువ బరువు ఉన్నారు. ఈ పిల్లలు వాస్తవానికి సరిపడా ఆహారం దొరకక ఆకలితో ఉంటున్నారు. వాళ్లు చాలా తక్కువ బరువు ఉంటే తప్పించి చూడగానే గుర్తించటం కష్టం. మన లోక వ్యవహారంతో దేశంలో అధిక సంఖ్యలో పిల్లలు తక్కువ బరువు ఉన్నారని గుర్తించటం కష్టం. ఇటువంటి పిల్లలను చూడటం అలవాటైపోయి ఇదే 'సహజం' అని అనుకుంటాం. ఈ సర్వే మన సాధారణ అభిప్రాయాలను బద్దలుగొట్టి దేశంలోని దాదాపు సగంమంది పిల్లల ఎదుగుదల, సామర్థ్యాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని గుర్తించేలా చేస్తుంది.

ఈ నివేదిక ఇలా పేర్కొంటోంది:

"మొత్తంగా 45% పిల్లలు తక్కువ బరువు ఉన్నారు, 1–3 సంవత్సరాల పిల్లలతో పోలిస్తే, 3–5 సంవత్సరాల పిల్లల్లో ఇది చాలా ఎక్కువగా ఉంది. గుజరాత్ (58%), మధ్యప్రదేశ్ (56.9%), ఉత్తరప్రదేశ్ (53.2%) వంటి రాష్ట్రాలలో ఇది 50 శాతం మించి ఉంది. తక్కువ బరువు ఉండటం అన్నిటికంటే తక్కువగా కేరళ రాష్ట్రం (24%)లో ఉంది...

"బరువు చాలా తక్కువగా ఉన్న తీవ్ర పరిస్థితి మొత్తం మీద 16% పిల్లల్లో ఉంది..."

- సమర్థంగా పనిచేసే అంగన్‌వాడీ కేంద్రం ఈ పరిస్థితిని ఎలా సరిదిద్దగలదు? చర్చించండి.

బడిలో చేరే వయస్సు రాని పిల్లలకు పోషకాహార శాస్త్రజ్ఞులు మూడు చార్టులను ఉపయోగిస్తారు. ఈ మూడు వేరు వేరు సూచికలు మనకు పిల్లల పోషకాహార స్థాయికి సంబంధించి పూర్తి వివరాలను అందిస్తాయి. వాటిని కింద ఇచ్చాం.

| సూచిక | సాధారణ స్థాయికంటే కింద ఉన్న పిల్లల్లో ఏమవుతోంది | మీ మాటల్లో వివరించండి | దేశంలో ఎంతమంది పిల్లలు ఈ కోవలోకి వస్తారు |
|---|---|---|---|
| వయస్సుకు ఎదురుగా బరువు చూపించటం | తక్కువ బరువు | | 45% |
| వయస్సుకు ఎదురుగా ఎత్తు చూపించటం | ఎదుగుదల కుచించుకు పోయింది | దీర్ఘకాలంపాటు పిల్లలు పోషకాహార లోపానికి గురయితే వారి ఎముకలు ప్రభావితం అవుతాయి. ఇటువంటి పిల్లలు వాళ్ల వయస్సుకు తగిన ఎత్తు ఉండరు. ఆ తరువాత దీనిని సరి చేయటం కుదరదు. | 41% |
| ఎత్తుకు ఎదురుగా బరువును చూపించడం | బక్క చిక్కటం | ఇటీవలే బరువు కోల్పోవటాన్ని ఇది సూచిస్తుంది. వెంటనే తగినంత ఆహారం ఇస్తే ఈ స్థితినుంచి కోలుకోగలుగుతారు. | 21% |

- ఈ గణాంకాల నుంచి ఎటువంటి నిర్ధారణలకు వస్తారు? ఒక పేరా రాయండి.

వయోజనులైన స్త్రీ, పురుషులలో పోషకాహార స్థాయిని శరీర బరువుసూచిక (BMI)తో కొలుస్తారు. దీని గురించి ఇంతకు ముందు తరగతులలో తెలుసుకున్నారు.

BMI = (బరువు కిలోలలో/ మీటర్లలో ఎత్తు వర్గం).

ఈ సూచికను ఒక పరిధితో పోల్చి ఒక వ్యక్తి బరువు తక్కువ ఉందో, సాధారణ బరువు ఉందో, ఎక్కువ బరువు ఉందో తెలుసుకోవచ్చు. ఈ సూచిక ఎక్కువగా ఉంటే కొవ్వుఎక్కువగా ఉందని, తక్కువగా ఉంటే ఉండవలసిన దానికంటే కొవ్వు తక్కువగా ఉందని తెలుస్తుంది. జాతీయ పోషకాహార సంస్థ సర్వే ప్రకారం స్త్రీ, పురుషుల పరిస్థితి ఇలా ఉంది:

"పురుషులలో తీవ్ర శక్తి లోపం (BMI <18.5) 35%, అధిక బరువు/ ఊబకాయం (BMI >25) 10%గా ఉంది.

"35% మహిళలలో తీవ్ర శక్తిలోపం ఉండగా 14% మహిళలలో అధిక బరువు/ ఊబకాయం, కనిపిస్తుంది. తీవ్ర శక్తి లోపం ఒడిశా, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో అత్యధికంగా ఉంది, ఆ తరువాత కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో 33-38% మహిళల్లో తీవ్ర శక్తిలోపం ఉంది..."


చిత్రం 11.2: రేషన్ దుకాణం

ఆహార భద్రతకూ దీనికీ గల సంబంధం ఏమిటి? చత్తీస్‌గఢ్‌లో ప్రజా వైద్యశాలకు తక్కువ బరువు ఉన్న రోగులు ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో వస్తారు. అక్కడి డాక్టరు ఈ పరిస్థితిని వివరించారు. కుటుంబానికి నెలకు రేషను దుకాణం ద్వారా లభించే 35 కిలోల ఆహార ధాన్యాలు అయిదుగురు ఉన్న కుటుంబంలో 11 రోజులకు సరిపోతాయి. మిగిలిన రోజులకు వాళ్లు తాము పండించిన ఆహారంపైనా లేదా మార్కెట్లో కొన్న దానిపైనా ఆధారపడాలి.

ఉదాహరణకు బిలాస్‌పూర్‌లో రిక్షాతొక్కే వ్యక్తి రోజుకు 70-80 రూపాయలు సంపాదిస్తాడు. అతడికి ఇంటి అద్దెకు 400 రూపాయలు, కరెంటుకి 100 రూపాయలు ఖర్చు అవుతాయి. అతడు బరువుకోల్పోటం, క్షయకు గురికావటం ఆశ్చర్యం కలిగించదు.

అంటే ఈ గణాంకాలు ఆహార భద్రతకు సూచికలు. చత్తీస్‌గఢ్ డాక్టరు ఇలా చెపుతున్నారు:

"సరిపడా ఆహారం ఉంటే ఎవరూ ఉండవలసిన దానికంటే తక్కువ బరువుకానీ, తక్కువ ఎత్తుకానీ ఉండరు. దేనికైనా నిరూపణ వాస్తవంలో కనపడాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ సామర్థ్యం, ఆహార పంటలను పండించటానికి ప్రాధాన్యత. ప్రజల కొనుగోలుశక్తి వంటి వాటినన్నింటినీ ప్రజల ఎత్తు, బరువు వంటి సూచికల ఆధారంగా అంచనా వేయవచ్చు. అంతేకాకుండా ఒక వ్యక్తి ఎత్తు ద్వారా అతనికి / ఆమెకు బాల్యంలో సరిపడా ఆహారం అందిందో లేదో చెప్పవచ్చు. తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్నవాళ్లు పోషకాహారలోపానికి గురయ్యారని పేర్కొంటారు. కాని 'ఆకలి'కి గురయ్యారనటం సరైనదని నా అభిప్రాయం."

## సారాంశం

ఈ పాఠం, మొదటి భాగంలో దేశం మొత్తాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార భద్రత అనే అంశాన్ని పరిశీలించాం. ఆహారోత్పత్తిని పెంచడానికి ఏం చేయాలనే ముఖ్యమైన ప్రశ్న తరువాత ఆహార లభ్యతను ఎలా గణించాలి అనే విషయం చర్చించాం. తలసరి ఆహార ధాన్యాల అందుబాటు అనేవి వాస్తవంలో పెరగకపోగా అది తగ్గిపోవడమనేది బాధాకరమైన వాస్తవం.

ఉత్పత్తి అయిన ధాన్యం ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి. మార్కెట్‌లో కొనడం ద్వారా కాని, చౌక ధరల దుకాణం నుండిగాని, మధ్యాహ్న భోజనం వంటి పథకాల ద్వారా గాని ఆహారం అందుబాటులోకి రావాలి. అధిక శాతం ప్రజలు వారికి కావల్సిన దానికంటే తక్కువ కాలరీలు తీసుకొంటున్నారు. ఇది పేదవారిలో చాలా ఎక్కువ. పండ్లు, కూరగాయలు, మాంసం, గుడ్లు వంటి వాటి వినియోగం చూస్తే కేలరీల క్షీణత ఆందోళనకరంగా ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరమైన చోట ప్రభావవంతంగా పనిచేయడం లేదు. పిల్లల్లోను, వయోజనుల్లోను తక్కువ బరువు సమస్య తీవ్రంగా ఉందని పోషకాహార నివేదికలు తెలియజేస్తున్నాయి. ప్రజలు తీసుకోవాల్సిన ఆహారం కంటే తక్కువ తీసుకుంటున్నారు. దేశంలో సరిపడేంత ఆహార నిల్వలు ఉన్నప్పటికీ చాలా మంది ప్రజలు ఆకలితో ఉంటూ పోషకాహార లోపానికి గురవుతున్నారు. ఇది ఆమోదనీయం కాదు. ఆహార భద్రత సమస్యను పరిష్కరించడానికి జాగ్రత్తగా ఆలోచిస్తూ పైన చర్చించిన అన్ని కోణాలలో ప్రయత్నించవలసి ఉంది.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| ఉత్పత్తి | లభ్యత | అందుబాటు | పోషకాహారం |
| బఫర్ నిల్వలు | ఆకలి | ప్రజా పంపిణీ వ్యవస్థ | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను సరి చేయండి
   - ★ ఆహార భద్రత సాధించటానికి ఆహార ఉత్పత్తిని మాత్రమే పెంచితే సరిపోతుంది.
   - ★ ఆహార భద్రత సాధించటానికి ఒకే పంటసాగును ప్రోత్సహించాలి.
   - ★ తక్కువ ఆదాయం ఉన్న ప్రజలలో తక్కువ కాలరీల వినియోగం ఎక్కువగా ఉంటుంది.
   - ★ ఆహార భద్రతను సాధించటంలో చట్ట సభల ప్రాధాన్యత ఎక్కువ.
   - ★ పిల్లల్లో పోషకాహారలోపాన్ని సరిచెయ్యటానికి ప్రజా పంపిణీ వ్యవస్థను ఉపయోగించవచ్చు.
2. గ్రామీణ ప్రాంతాలలో కాలరీల వినియోగం గత కొద్ది కాలంగా .............. 2004-05లో తలసరి సగటు కాలరీల వినియోగం అవసరమైన దానికంటే ..............ఉంది. పట్టణ ప్రాంతంలో ఉంటున్న వ్యక్తికి రోజుకు కనీసం 2100 కాలరీలు అవసరం. పట్టణ ప్రాంతంలో 2004-05లో కాలరీల అవసరం.............. వినియోగం మధ్య అంతరం ..............
3. ప్రకృతి వైపరీత్యం వల్ల ఒక సంవత్సరం ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిందని అనుకుందాం. ఆ సంవత్సరంలో ఆహార ధాన్యాల లభ్యత పెరగటానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోవాలి?
4. బరువు తక్కువగా ఉండటానికి, ఆహార అందుబాటుకు మధ్య గల సంబంధాన్ని తెలియజేయటానికి మీ ప్రాంతంనుంచి ఒక ఊహాజనిత ఉదాహరణను ఇవ్వండి.
5. వారం రోజుల మీ కుటుంబ ఆహార అలవాట్లను విశ్లేషించండి. దాంట్లోని పోషకాలను వివరించటానికి ఒక పట్టిక తయారుచెయ్యండి.
6. ఆహార ఉత్పత్తి పెరగటానికి, ఆహార భద్రతకు మధ్య గల సంబంధాన్ని వివరించండి.
7. "ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రజలకు ఆహార భద్రత ఉండేలా చూడగలదు." ఈ వ్యాఖ్యానానికి మద్దతుగా వాదనలు పేర్కొనండి.




8. ఆహార భద్రత గురించి ఇటువంటిదే ఒక పోస్టరు తయారుచెయ్యండి.

**ప్రాజెక్టు**

అమ్మ అనే కింద కవిత చదవండి. ఆహార భద్రతకు సంబంధించి ఏదో ఒక అంశంపైన మీరు కూడా ఒక కవిత రాయండి.

## అమ్మ

పేగుల అరుపులను పట్టించుకోకుండా
ఎండిన గొంతు, పెదాలతో బాధపడుతూ
ప్రవహించే కన్నీటిని ఆపుతూ
తటాకాలైన కళ్లతో నిన్ను చూశాను ...

నువ్వు మాత్రం సగమే తింటూ,
అందరికీ తినటానికి ఉండాలని
ఒక రొట్టె, ఇంకొంచెం
ఏదో చెయ్యటానికి
పొయ్యిముందు కూర్చుని
నీ ఎముకలనే కాల్చిన
నిన్ను చూశాను ...

అందరి ఇళ్లల్లో బట్టలు ఉతుకుతూ,
అంట్లు తోముతూ
వాళ్లు పారేసింది నీకు ఇస్తే
పరమాన్నంగా తీసుకున్న
నిన్ను చూశాను ...

పాఠం 12

# సమానత - సుస్థిర అభివృద్ధి

## అభివృద్ధిని మరొకసారి చూద్దాం...

అభివృద్ధికి కొలబద్దగా తలసరి ఆదాయం, స్థూల జాతీయోత్పత్తి (GDP)ల కంటే మానవ అభివృద్ధి సూచిక (HDI) మెరుగైనది (రెండవ పాఠం చూడండి). ఒక దేశంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులు, సేవల విలువను GDP సూచిస్తుంది, అయితే అభివృద్ధిని కేవలం వస్తువులు, సేవల ఉత్పత్తికి పరిమితం చెయ్యలేం. ఉత్పత్తి, ఆదాయాలు ఒకవైపున వేగంగా పెరుగుతున్నప్పటికీ ఇంకోవైపున భారతదేశంలోలాగా అధిక శాతం ప్రజలు పోషకాహార లోపంతోనూ, విద్య, వైద్య సదుపాయాలు అందని పరిస్థితులు ఉన్నప్పుడు మరింత ఆలోచించాల్సిన అవసరం ఉంది. అభివృద్ధిలో సామాజిక సూచికలైన విద్య, వైద్యం వంటివి చోటు చేసుకునేలా HDI చేస్తుంది.

అయితే విస్తరించిన ఈ అభివృద్ధి కొలమానం కూడా పరిగణనలోకి తీసుకోని అంశాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. భారతదేశంలో కార్మికవర్గంలో 90 శాతానికి పైగా అవ్యవస్థీకృత రంగంలో ఉంది, అక్కడి పని పరిస్థితులు ఏమాత్రం బాగుండవు. అవ్యవస్థీకృత రంగంలోని స్వయం ఉపాధి, రోజువారీ కూలీల ఆదాయం చాలా తక్కువగా ఉంటోంది (మూడవ పాఠం చూడండి). శ్రామిక వర్గంలో అధిక శాతం తక్కువ ఆదాయం వచ్చే ఉపాధిలో ఉన్నప్పుడు GDP పెరుగుతూ ఉండటమంటే పెరుగుతున్న అనేక వస్తువులు, సేవల వల్ల కొద్దిమంది మాత్రమే ప్రయోజనం పొందుతున్నారని అర్థం. అధిక ఆదాయం, సంపద ఉన్నవాళ్లు ఏది కావాలన్నా కొనుక్కోగల, వినియోగించుకోగల స్థితిలో ఉన్నారు (10వ పాఠం చూడండి). కొంతమంది ప్రపంచస్థాయి భోగ భాగ్యాలలో తులతూగుతూ ఉండగా అధిక శాతం ప్రజలు సరైన ఉద్యోగం లేక, చాలినంత ఆదాయాలు లేక గౌరవప్రదంగా జీవించటానికి అవసరమయ్యే కనీస అవసరాలు కూడా అందని పరిస్థితిలో ఉన్నారు. ప్రజల ఆదాయాలు, అవకాశాలలో ఇంత అంతరం ఉండటం సమసమాజానికి ఆధారం కాబోదు.

- ఇక్కడ ఇచ్చిన గ్రాఫ్‌ల ఆధారంగా భారతదేశంలోని అంతరాల గురించి క్లుప్తంగా రాయండి.




*గ్రాఫ్ 1 : భారతదేశంలో వార్షిక ఆదాయం ఆధారంగా కుటుంబాల పంపిణీ (లక్షలలో) (2010 సర్వే)*

గ్రాఫ్ 2: భారతదేశంలో శతకోటీశ్వరులకు ఉన్న మొత్తం సంపద (బిలియన్ రూ॥లలో)




గ్రాఫ్ 3: భారతదేశంలో శత కోటీశ్వరుల (బిలియనీర్ల) సంఖ్య పెరుగుదల






చిత్రం 12.1 : ముంబాయిలోని ధారవి మురికివాడ. భారతదేశంలో పట్టణ ప్రాంత పేదలు నివసించే అతి పెద్ద కాలనీల్లో ఇది ఒకటి.



చిత్రం 12.2 : హైదరాబాద్‌లో ఒక హోటల్ నుండి కనిపించే బంజారా హిల్స్ దృశ్యం. ఇది ధనవంతులు నివసించే ఒక ప్రాంతం.

GDP మీద దృష్టి కేంద్రీకరించే ఆర్థిక అభివృద్ధిపై పర్యావరణ అంశాల దృష్ట్యా కూడా ప్రధాన విమర్శ ఉంది. ఆర్థిక అభివృద్ధిని సాధించే క్రమంలో పర్యావరణ వనరులను ఇంతకు ముందు కనీ, వినీ ఎరగని రీతులలో ఉపయోగించామని, నాశనం చేశామని వివిధ సందర్భాలలో చూశాం. అడవులను నరికివెయ్యటం, నేలకోతకు గురికావటం, భూగర్భ జలాలు తగ్గిపోతుండటం, కాలుష్యం పెరుగుతుండటం, పచ్చికబయళ్ళమీద ఒత్తిడి, శిలాజ ఇంధనాల మీద ఆధారపడటం, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం, శీతోష్ణస్థితి మార్పు వంటివి మనముందున్న ముఖ్యమైన పర్యావరణ సమస్యలు. పారిశ్రామికీకరణ వల్ల కొంతమందికి అనేక వస్తువులు అందుబాటులోకి వచ్చాయి, అయితే దీని ఫలితంగా ప్రపంచ సహజ వనరులు అంతరించి పోతున్నాయి, వాతావరణం కూడా అతలాకుతలమయిపోతోంది. ఈ రకమైన వృద్ధి ఎంతో కాలం కొనసాగలేదు.

ఈ అధ్యాయంలో మనం అభివృద్ధి, పర్యావరణం, ప్రజల మధ్య సంబంధాలను పరిశీలిద్దాం. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ పర్యావరణంలోని వివిధ అంశాలను ఎలా ప్రభావితం చేసింది? ప్రకృతి వనరులపై ప్రజలకు గల హక్కును, అందుబాటును వాళ్ల జీవితాలను అభివృద్ధి ఏ రకంగా ప్రభావితం చేసింది? అభివృద్ధికి తోడ్పడే విభిన్నమైన నమూనాలు ఉన్నాయా? ప్రస్తుత అంశాల ఆధారంగా, ప్రజల జీవిత అనుభవాల ద్వారా ఈ ప్రశ్నలకు సమాధానాలను అన్వేషిద్దాం. భౌతిక వస్తువులు, సేవలే కాకుండా ప్రజలందరూ (ప్రస్తుత తరం / రానున్న తరాలు కూడా), సజీవ, నిర్జీవ పర్యావరణం అనే అర్థం కూడా వచ్చేలా అభివృద్ధిని విస్తృతం చేయాలి.

## పర్యావరణం, అభివృద్ధి

అభివృద్ధిలో పర్యావరణం పాత్ర ఏమిటో ముందుగా మరొకసారి గుర్తు చేసుకుందాం. ఉత్పత్తి ప్రక్రియలో భూమి, నీరు, ఖనిజాలు, చెట్లనుంచి వచ్చే ఉత్పత్తులు, పశువులు వంటి సహజ వనరులు ఎంతో ముఖ్యమైనవి. వ్యవసాయం, గనుల తవ్వకం వంటి ప్రాథమిక రంగ కార్యకలాపాల్లోనే కాకుండా తయారీ, ఇంధన రంగాలలో కూడా సహజ వనరుల మీద ఉత్పత్తి ప్రధానంగా ఆధారపడి ఉంది. ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలు కూడా వివిధ స్థాయిలలో సహజ వనరుల మీద ఆధారపడి ఉన్నాయి. ఈ వనరులను అందించటంలో పర్యావరణ సామర్థ్యాన్ని 'పర్యావరణ వనరుల సరఫరా విధి' (Environment's Source Function) అంటారు. వనరులను వినియోగిస్తూ ఉండటం వల్ల, లేదా అవి కాలుష్యానికి గురికావటం వల్ల ఈ సామర్థ్యం తగ్గుతూ ఉంటుంది.

భారతీయ వ్యవసాయం, పరిశ్రమలకు సంబంధించి తొమ్మిదవ తరగతి పాఠాలను మరొకసారి చూడండి.

- ఈ రెండు సందర్భాలలోనూ వనరుల పంపిణీ, అందుబాటుకు సంబంధించి అసమానతలను అవి ఎలా చర్చించాయి?
- పర్యావరణ సమస్యల ద్వారా అభివృద్ధి అనే భావనను ఎలా ప్రశ్నించారో గుర్తించండి.
- 'హరిత విప్లవం' విస్తరించటం వల్ల ఎటువంటి పర్యావరణ సమస్యలు ఏర్పడ్డాయి? దీనినుంచి భవిష్యత్తుకు మనం ఎటువంటి గుణపాఠాలు నేర్చుకోవాలి?

పర్యావరణం నిర్వర్తించే మరొక విధి కూడా ఉంది. అది వివిధ కార్యక్రమాల ద్వారా విడుదలయ్యే వ్యర్థాలను శుద్ధిచేసి, ప్రమాదరహితంగా చేయటం. ఉత్పత్తి, వినియోగాలలో నిరుపయోగమైన ఉప

ఉత్పత్తులు– ఉదాహరణకు ఇంజన్ల నుండి వెలువడే పొగ, శుభ్రం చెయ్యటానికి ఉపయోగించిన నీళ్లు, పారేసిన పనికిరాని అట్టపెట్టెలు, వస్తువులు వంటి వాటిని పర్యావరణం శుభ్రం చేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన విధి. కాలుష్యాన్ని పర్యావరణం గ్రహించి ప్రమాదరహితంగా మార్చే శక్తిని 'శుద్ధిచేసే విధి' (Environment Sink Function) తెలియచేస్తుంది. పర్యావరణం శుద్ధి చెయ్యగలిగిన దానికంటే ఎక్కువ మోతాదులో వ్యర్థ పదార్థాలు ఉత్పన్నమౌతూ ఉంటే పర్యావరణానికి దీర్ఘకాల నష్టం జరుగుతుంది.

గత యాభై సంవత్సరాల అభివృద్ధిలో పర్యావరణం యొక్క ఈ రెండు విధులను పరిమితికి మించి ఉపయోగించారు. దీని వల్ల పర్యావరణం మద్దతు ఇచ్చే సామర్థ్యం, అంటే భవిష్యత్తులో ఆర్థిక ఉత్పత్తి, వినియోగాలకు మద్దతు ఇవ్వగల సామర్థ్యం ప్రభావితం అయ్యిందని అంటారు. దీనిని కొన్ని ఉదాహరణల ద్వారా చూద్దాం.

*ఉదాహరణ 1: సాంప్రదాయ వ్యవసాయంలో వానలతోపాటు భూగర్భజలాలను తడి పెట్టడానికి లేదా కొద్ది విస్తీర్ణాన్ని సాగుచెయ్యటానికి వినియోగించేవాళ్లు. ఉదాహరణకు మోటబావితో 2–3 ఎకరాలు మాత్రమే సాగు చేసే వాళ్లు. వ్యవసాయం వానాకాలానికి పరిమితం అయ్యేది, అధిక ప్రాంతం వర్షాధారంగా ఉండేది. కాలక్రమంలో కొత్త ఇంధన వనరులు అందుబాటులోకి రావటంవల్ల పెట్రోలు/డీజిలు లేదా విద్యుత్తుతో పనిచేసే మోటారుపంపులు వాడుకలోకి వచ్చాయి. దీని ప్రభావం రెండు దశలలో చూడాలి: మొట్టమొదటగా మానవ శ్రమ తగ్గింది. భూమినుంచి నీళ్లు పైకి తోడటం మోటారుతో తేలికయ్యింది. అంతేకాకుండా ఈ దశలో భూగర్భజలాలు దండిగా ఉన్నాయి. సాధారణ బావులలో 10–15 అడుగులలో నీళ్లు ఉండేవి, మహా అయితే 100 అడుగులు లోతులో ఉండేవి. విద్యుత్తు, డీజిలు మోటర్లతో భూగర్భజలాలు తోడటం మొదలైన తరువాత అవి కొన్ని వందల అడుగుల లోతుకి వెళ్లిపోయాయి. లోపలి నుంచి తోడుకోటానికి ముందుగా నీళ్లు లోపలికి ఇంకాలి కదా. దీనినే భూగర్భ జలాల 'పునరుద్ధరణ' అంటారు. భూమి లోపలి మట్టి, రాళ్లగుండా భూగర్భజలాలు ప్రవహిస్తాయి. లోపలికి ఇంకే నీటికంటే తోడేనీళ్లు ఎక్కువైతే కొంతకాలానికి తోడటానికి నీళ్లు ఉండవన్నది తేలికగా అర్థం చేసుకోవచ్చు.*



*చిత్రం 12.3 : రాజస్థాన్‌లో నీటి పారుదల వ్యవసాయం (1957 ఐక్యరాజ్య సమితి ఫోటో)*

*భారతదేశ భూగర్భ జల వనరులకు సంబంధించి ఇటీవలి గణాంకాల ప్రకారం దేశంలోని అనేక ప్రాంతాలలో వీటిని అధికంగా వినియోగించటం వల్ల తీవ్ర సంక్షోభంలో ఉన్నామని వెల్లడి అవుతోంది. దేశంలో మూడవ వంతు ప్రాంతంలో భూగర్భజలాల పునరుద్ధరణ కంటే ఆ నీటి వినియోగం ఎక్కువగా ఉంది. సుమారుగా 300 జిల్లాల్లో గత 20 సంవత్సరాలలో భూగర్భజలాలు 4 మీటర్ల మేర పడిపోయాయి. భూగర్భ నీటిని చాలా ఎక్కువగా వాడుకుంటున్నామన్నది ఇది తెలియచేస్తోంది. వ్యవసాయపరంగా సంపన్నంగా ఉన్న పంజాబ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలోను, మధ్య, దక్షిణ పీఠభూములలోని రాతి ప్రాంతాలలోనూ, కొన్ని కోస్తా ప్రాంతాలలోనూ, వేగంగా పెరుగుతున్న పట్టణ ప్రాంతాలలోనూ భూగర్భజలాల వినియోగం చాలా ఎక్కువగా ఉంది.*

- భూగర్భ జలాలను ఎక్కువగా తోడటం సుస్థిర పద్ధతి ఎందుకు కాదు?

భూగర్భ జలాలను అధికంగా వాడటం వల్ల దాని నిల్వలు అంతరించి పోతున్నాయి. భూగర్భ జలాలు చాలా వేగంగా కిందికి, ఇంకా కిందికి పడిపోతున్నాయి.

భూగర్భ జలాలు తగ్గిపోవటమే కాదు, వాటి నాణ్యత కూడా తగ్గిపోతోంది. భారతదేశంలోని 59% జిల్లాల్లో చేతిపంపులలోని నీళ్లు తాగటానికి పనికిరావు. పరిశ్రమలు, వ్యవసాయం నుంచి వచ్చే రసాయనిక వ్యర్థాలు భూగర్భ జలాలను కలుషితం చెయ్యటం వలన ఇలా జరుగుతోంది. అన్నీ వ్యర్థ, విషపూరిత పదార్థాలను నీటిలో పడేస్తున్నారు. ఈ పరిస్థితిని తేలికగా సరిదిద్దలేం. దీని పరిణామాలను తరువాతి ఉదాహరణలో చూద్దాం.

ఈ రకమైన అభివృద్ధి సరిగ్గా సుస్థిర అభివృద్ధికి విరుద్ధమైనది. సుస్థిర అభివృద్ధి అంటే భవిష్యత్తు తరాలు తమ అవసరాలను తీర్చుకునే సామర్థ్యాన్ని దెబ్బతీయకుండా ప్రస్తుత తరాల అవసరాలను తీర్చుకోవటం. వేరేమాటల్లో చెప్పాలంటే సుస్థిర అభివృద్ధి అందరికీ – ప్రస్తుత, రాబోయే తరాలకు నాణ్యమైన జీవనాన్ని కోరుకుంటుంది.

అయితే, ప్రస్తుతం మనం వనరులను ఉపయోగిస్తున్న తీరు చూస్తే అరుదైన వనరులలో భవిష్యత్తు తరాలు తమ న్యాయమైన వాటాను పొందే అవకాశాలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా మనం ఉపయోగించే వనరుల ప్రభావం పర్యావరణంపై పడి దాని సామర్థ్యాన్ని శాశ్వతంగా దెబ్బతీసే అవకాశం ఉంది.

*ఉదాహరణ 2వ : ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో అధిక దిగుబడులను పొందటానికి పంటలకు పురుగుమందులు వాడటం చాలా ముఖ్యం. అయితే రసాయనిక పురుగుమందులు వాడటంవల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని పర్యావరణవేత్తలు చాలా సంవత్సరాల క్రితమే గుర్తించారు. ఒక స్థాయిని మించి విషపదార్థాలను పర్యావరణం జీర్ణించుకోలేదు.*




*దోమల నియంత్రణ కోసం డిడిటి పిచికారిచెయ్యటం వల్ల మనుషులపై, పక్షులపై పడే ప్రభావం గురించి రాచెల్ కార్సన్ అన్న మహిళ 1962లోనే 'సైలెంట్ స్ప్రింగ్' (నిశ్శబ్ద వసంతం) అన్న పుస్తకంలో రాశారు. పురుగుమందులలోని భారలోహాలు పర్యావరణంలో కరిగి పోకుండా జీవులలో పేరుకుని పోతాయి. డిడిటి ఉన్న నీళ్లు చెరువులలోకి చేరి కలుషితం చేసినప్పుడు డిడిటిలోని విషపదార్థం ఆ చెరువుల్లోని చేపల్లో పేరుకోవటం మొదలవుతుంది. ఈ విషమోతాదు తక్కువగా ఉండి చేపలు చనిపోవు. కాని ఒక పక్షి అనేక చేపలను తిన్నప్పుడు వాటన్నిటిలో ఉండే విషమోతాదు ఆ పక్షిని చంపటానికి సరిపోతుంది. దోమలవంటి పురుగులు డిడిటికి త్వరగా నిరోధక శక్తిని పెంచుకుంటాయని కూడా రాచెల్ కార్సన్ చూపించారు. మానవ చర్యలు సరిదిద్దలేని విధంగా ప్రకృతిని, మానవులనే ఇది నాశనం చేస్తుందని ఆమె కనుగొన్న అంశాలు నిరూపిస్తున్నాయి.*

*భారతదేశంలో ఎండోసల్ఫాన్ అనే రసాయనిక పురుగుమందు హానికారక ప్రభావాన్ని చూశారు. 1976లో జీడిమామిడి తోటలను పురుగునుంచి రక్షించటానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్లతో 15000 ఎకరాల్లో ఈ పురుగుమందును పిచికారీ చేయించింది. కేరళలోని ఉత్తర ప్రాంతమైన కాసర్‌గోడ్ జిల్లాలో ఇలా జరిగింది. ఈ పని 25 సంవత్సరాలపాటు కొనసాగటంతో గాలి, నీళ్లు, మొత్తం పర్యావరణం ఎండోసల్ఫాన్‌తో కలుషితమయ్యాయి. దీని పిచికారీ వల్ల స్థానిక ప్రజలలో, ప్రత్యేకించి వ్యవసాయ*

*కూలీలలో చాలా తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీని వల్ల కనీసం 5,000 మంది చనిపోయారు. అంతకంటే ఎన్నోరెట్ల ఎక్కువ మంది అవయవలోపాల వల్ల, క్యాన్సర్ వల్ల మరణం కంటే దారుణమైన జీవితాన్ని గడుపుతున్నారు.*

*ఇటీవల కాలంలో న్యాయస్థానం ఆదేశాల ఫలితంగా కొన్ని సంవత్సరాలుగా ఎండోసల్ఫాన్ పిచికారీ ఆపేశారు. క్రమంగా రోగాలు తగ్గి, ప్రజల ఆరోగ్యం మెరుగవుతోంది.*

*ఇది ఆ ప్రాంతానికి పరిమితమైన ఒక ఉదాహరణ మాత్రమే కాదు. ఆధునిక వ్యవసాయంలో పురుగుమందులను విచ్చలవిడిగా వాడటాన్ని పర్యావరణం మీద, ప్రజలమీద దాని ప్రభావాన్ని గురించి అనేక అధ్యయనాలు వెల్లడి చేశాయి. విచారకరమైన విషయం ఏమిటంటే ఉపయోగించే పురుగుమందులో ఒక్క శాతమే పురుగు మీద ప్రభావం చూపుతుంది – మిగిలింది ఆహారం, నీళ్లు, పర్యావరణం ద్వారా తిరిగి మనలోకే చేరుతుంది.*

- పర్యావరణాన్ని 'సహజ పెట్టుబడి' అనికూడా అంటారు. 9వ అధ్యాయంలో పెట్టుబడి నిర్వచనాన్ని మరొకసారి చూడండి. పర్యావరణాన్ని సహజ పెట్టుబడి అని ఎందుకు అంటారు?
- నీటిని ఉమ్మడి ఆస్తిగా ఎందుకు పరిగణించాలి?
- ఎండోసల్ఫాన్ వినియోగాన్ని నిలిపివెయ్యటానికి న్యాయస్థానానికి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది?
- ఎండోసల్ఫాన్ వాడకాన్ని నిషేధిస్తూ న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలలో ఆ పురుగుమందు వాడకం జీవించే హక్కుకు (రాజ్యాంగంలోని 21వ అధికరణానికి) భంగం కలిగించిందని పేర్కొంది. జీవించే హక్కుకు ఎండోసల్ఫాన్ ఎలా భంగం కలిగించిందో వివరించండి.

## పర్యావరణంపై ప్రజల హక్కులు

ఆధునిక అభివృద్ధి వల్ల పెద్ద ఎత్తున పర్యావరణ సమస్యలు ఏర్పడిన అనేక ఉదాహరణలు ఈ రోజు మనముందున్నాయి. పెద్ద ఆనకట్టల నిర్మాణం దీనికి ఒక ఉదాహరణ, దీని పరిణామాలు చాలా తీవ్రంగా ఉన్నాయి.

భారతదేశంలో నర్మాదా లోయ అభివృద్ధి పథకం అతి పెద్ద ఆనకట్ట. ఇది ప్రపంచంలోని అతి పెద్ద జల విద్యుత్తు ప్రాజెక్టుల్లో ఒకటి. దీని వల్ల విద్యుదుత్పత్తి, సాగునీటి వసతి, వరదల నియంత్రణ వంటి ప్రయోజనాలు సమకూరతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు లోని 3000 పెద్దా, చిన్నా ఆనకట్టల వల్ల పర్యావరణానికి జరిగే నష్టం కంటే ఎంతో ఎక్కువగా ఉంటుంది. నిర్మించిన ఆనకట్టలలోకెల్లా సర్దార్ సరోవర్ అతి పెద్దది. దీనివల్ల 37,000 హెక్టార్ల అడవి, వ్యవసాయ భూమి ముంపునకు గురి అవుతుంది, అయిదు లక్షలకు పైగా ప్రజలు దీనివల్ల నిర్వాసితులు అవుతున్నారు. భారతదేశంలోనే అత్యంత సారవంతమైన నేలలు దీనివల్ల నాశనం అవుతాయి. వేలాది ఎకరాలలో అటవీ ప్రాంతం, వ్యవసాయ భూమి ముంపునకు గురి కావటం వల్ల జీవ వైవిధ్యత, మానవ జీవితాలు ధ్వంసం అయ్యాయి. నిర్వాసితులైన వాళ్లలో అధిక శాతం ఆదివాసీలు, దళితులు.

మధ్యప్రదేశ్‌లోని ఝబువా జిల్లా, జలసింధి గ్రామానికి చెందిన బావా మహలియా 1994లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి ఈ కింది ఉత్తరాన్ని రాశాడు. ఇది గిరిజన భాష భిలాలాలో రికార్డు చేయగా, హిందీలోకి అనువదించారు. ఆ ఉత్తరంలోని కొంత భాగాన్ని ఇక్కడ ఇస్తున్నాం. ఇది అభివృద్ధి అనే భావననే ప్రశ్నిస్తోంది.

ప్రియమైన దిగ్విజయ్‌సింగ్ గారు,

ఝబువా జిల్లాలోని జలసింధి గ్రామ ప్రజలైన మేము మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రియైన మీకు ఈ ఉత్తరం రాస్తున్నాం.

మేం నదీ తీర ప్రజలం, ఉత్తుంగ నర్మదా తీరాన మేం ఉంటాం. ఈ సంవత్సరం (1994), సర్దార్ సరోవర్ ఆనకట్ట వల్ల మధ్యప్రదేశ్‌లో ముంపునకు గురయ్యే మొదటి గ్రామం జలసింధియైన మా గ్రామం. మాతోపాటు సాకర్జా, కకర్‌శిలా, అకాడియా వంటి నాలుగైదు ఇతర గ్రామాలు కూడా మునిగిపోతాయి... మా ఊళ్లోకి నీళ్లు వచ్చి, ఇళ్లు, పొలాలు మునిగినప్పుడు మేం కూడా మునిగిపోతాం – ఇది మా గట్టి నిర్ణయం.

ముంపునకు గురికానున్న జలసింధి గ్రామానికి చెందిన ఆదివాసీ ప్రజలు తాము కూడా మునగటానికి ఎందుకు సిద్ధమౌతున్నారో తెలియచెయ్యటానికి మీకు ఈ ఉత్తరం రాస్తున్నాం.

మీరు, మీలాగా పట్టణాల్లో ఉండే వాళ్లందరూ కొండల్లో నివసించే మేము పేదవాళ్లమని, అడవుల్లోని కోతుల మాదిరి జీవిస్తున్నామని అనుకుంటారు. "గుజరాత్‌లోని మైదానాలలోకి వెళ్లండి. మీ పరిస్థితి మెరుగుపడుతుంది, మీరు అభివృద్ధి చెందుతారు," అంటూ మాకు సలహాలు ఇస్తారు. కానీ మేం ఎనిమిది సంవత్సరాలనుంచి పోరాడుతున్నాం – మేం లాఠీ దెబ్బలు తిన్నాం, అనేకసార్లు జైలుకు వెళ్లాం. అంజనవర గ్రామంలో పోలీసులు మామీద కాల్పులు కూడా జరిపారు, మా ఇళ్లను ధ్వంసం చేశారు... గుజరాత్ వెళితే మా పరిస్థితి బాగుపడేటట్టు అయితే ఇప్పుడు కూడా మాలో అందరూ అక్కడికి వెళ్లటానికి ఎందుకు సిద్ధంగా లేరు?

మీ అధికారులు, పట్టణంలో ఉండే ప్రజలు ఏటవాలులతో ఉండే కొండలు నివాసానికి అంత అనువుగా ఉండవని భావిస్తారు. కానీ అడవులతో నర్మదానది తీరాన మా భూములు ఉండటం మాకు ఎంతో బాగుంది. ఎన్నో తరాలనుంచి మేం ఇక్కడ నివసిస్తున్నాం. ఈ భూమిమీదే మా పూర్వీకులు అడవులను నరికారు, దేవతలను పూజించారు, నేలను మెరుగుపరిచారు, జంతువులను మచ్చిక చేసుకున్నారు, గ్రామాలను ఏర్పాటు చేశారు. అదే భూమిని మేం ఈనాటికీ సాగుచేస్తున్నాం. మేం పేదవాళ్లమని మీరు అనుకుంటారు. మేం పేదవాళ్లం కాదు. మేం ఉండేచోట మా ఇళ్లను మేమే స్వయంగా కట్టుకున్నాం. మేం రైతులం. మా వ్యవసాయం ఇక్కడ బాగుంటుంది. మేం నేలను దున్ని బతుకుతాం. తక్కువ వర్షాలతోనే మాకు కావలసిన ఆహారాన్నంతా పండించుకుంటాం. తల్లి మొక్కజొన్న మా కడుపులు నింపుతుంది. సాగుభూమిలో కొంత ఊరిలోనూ, కొంత అడవిలోనూ ఉంటుంది. అడవి భూమిలో సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న, *బోడి, బేటీ, సానిస్, కాద్రి,* శనగలు, మిటికెలు, మినుములు, నువ్వులు, పల్లీలు పండిస్తాం. మాకు అనేక రకాలైన పంటలు ఉన్నాయి. వీటిని మేం మారుస్తూ ఉంటాం. మా ఆహారం అంతా వీటి నుంచే వస్తుంది.



గుజరాత్‌లో ఏమి సాగుచేస్తారు? గోధుమలు, జొన్నలు, కందులు, కొంత పత్తి. తినటానికి తక్కువ, బజారులో అమ్మకానికి ఎక్కువ. మేం తిండికోసం పంటలు పండిస్తాం. బట్టలు వంటివి కొనుక్కోటానికి మాత్రమే అదనంగా ఉన్నది అమ్ముతాం.

మా శ్రమతో మేం అనేక రకాలైన ఆహార ధాన్యాలను పండిస్తాం. మాకు డబ్బుతో పనిలేదు. మేం మా విత్తనాలనే వాడతాం, మా పశువుల నుంచి వచ్చే ఎరువుని వాడతాం – వీటినుంచి మాకు మంచి పంట లభిస్తుంది. గుజరాత్‌లో వ్యవసాయానికి చాలా డబ్బులు కావాలి. అంత డబ్బు మాకు ఎక్కడి నుంచి వస్తుంది? అక్కడ మాకు ఎవరు తెలుసు? ఏ వడ్డీ వ్యాపారస్తుడు మాకు అప్పు ఇస్తాడు? మంచి పంటలు పండకపోతే, మా దగ్గర డబ్బులు లేక మా భూములను తాకట్టు పెట్టాల్సి వస్తుంది.

ఇక్కడ మేం వాగులకు కాలవలు చేసి మా పంటలకు నీళ్లు పెట్టుకుంటాం... మాకు విద్యుత్తు సౌకర్యం ఉన్నట్లయితే నర్మదానది నుంచి పైకి నీళ్లు తోడి శీతాకాలం పంట కూడా సాగుచేసి ఉండేవాళ్లం. స్వాతంత్ర్యం వచ్చి నలభై అయిదు సంవత్సరాలు గడిచినా గానీ నదీతీర గ్రామాలకు విద్యుత్తు లేదు, నదీ జలాలతో సాగులేదు.

... మాకు అడవిలో ప్రవహించే నీళ్లు, చక్కటి మేత ఉన్నాయి. వ్యవసాయం కంటే కూడా మాకు పశు సంపద ఎంతో ముఖ్యం. మేం కోళ్లు, గొర్రెలు, ఆవులు, గేదెలను పెంచుకుంటాం. కొంతమందికి 2–4 గేదెలు ఉంటే, కొంతమందికి 8–10 ఉంటాయి. దాదాపు ప్రతి ఒక్కరికి పది – ఇరవై – నలభై మేకలు ఉంటాయి. గుజరాత్‌నుంచి మనుషులు వచ్చి మా కొండల్లో తమ పశువులను మేపుకుంటారు. ఇక్కడ మేత, నీళ్లు అంత సమృద్ధిగా దొరుకుతాయి.

... అడవే మాకు అప్పులిస్తుంది, అడవే మాకు బ్యాంకు. కష్టకాలంలో మేం అడవికి వెళతాం. అడవిలో దొరికే టేకు, వెదురుతో మేం ఇళ్లు కట్టుకుంటాం. నింగొండి, హియాలీ రకం వెదురును చీల్చి తడికలు అల్లుతాం. అడవిలోని వస్తువులతో బుట్టలు, మంచాలు, నాగలి, గొర్రు వంటివి తయారుచేస్తాం... మేం అడవిలోని ఆకులను తింటాం. ఇప్పపూలు, మునగ, చింత, ఇమ్లీ వంటి అనేక స్థానిక చెట్ల ఆకులను తింటాం. కరువు సంభవిస్తే అడవిలోని వేళ్లు, దుంపలు తిని బతుకుతాం. మేం జబ్బుపడినప్పుడు మా వైద్యులు అడవినుంచి ఆకులు, వేళ్లు, బెరడు వంటివి తెచ్చి నయంచేస్తారు... మాకు అడవిలోని ప్రతి చెట్టు, పొద, మొక్క పేరు తెలుసు; వాటి ఉపయోగాలు తెలుసు. అడవులులేని ప్రాంతంలో మేం నివసించాల్సివస్తే ఎన్నో తరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ఈ జ్ఞానమంతా ఉపయోగంలేకుండా అయిపోతుంది. మెల్లగా ఇదంతా మరచిపోతాం.

...నదీ పాటను పాడటం ద్వారా మా దేవుళ్లను కొలుస్తాం. నావల్, దివస పండగలప్పుడు ఈ ప్రపంచం ఎలా ఏర్పడింది, మనుషులు ఎలా పుట్టారు, ఈ నది ఎక్కడినుంచి వచ్చింది వంటివి వివరిస్తూ మేం నదీ పాటను పాడతాం... మేం తరచు చేపల్ని తింటాం. అనుకోకుండా అతిథులు వస్తే చేపలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. పైనుంచి నది ఒండ్రుమట్టి తెచ్చి ఒడ్డులకు మేట వేస్తుంది... మా పిల్లలు నదీ తీరంలో ఆడుకుంటారు, నదిలో ఈతకొడతారు, స్నానం చేస్తారు. ఈ నది సంవత్సరం పొడవునా పారుతూనే ఉంటుంది కాబట్టి మా పశువులకు ఎప్పుడూ నీళ్లు దొరుకుతాయి. నదీ తల్లి చల్లని కడుపులో మేం సంతృప్తికరమైన జీవితాలు గడుపుతున్నాం. మేం ఇక్కడ ఎన్నో తరాల నుంచి జీవిస్తున్నాం. ఈ నర్మదానది మీద, మా అడవుల మీద మాకు హక్కు ఉందా, లేదా? మీ ప్రభుత్వం ఈ హక్కును గుర్తిస్తుందా, గుర్తించదా?

పట్టణంలో మీరు వేరువేరు ఇళ్లల్లో ఉంటారు. ఒకరి సుఖదు:ఖాలు ఒకరికి పట్టవు. మేము మా వంశంతో, మా బంధువులతో, అయినవాళ్లతో ఉంటాం: మేం అందరం కలిసి కష్టించి ఒక్కరోజులో ఇల్లు కట్టుకుంటాం, పొలాల్లో కలుపు తీస్తాం, ఎదురైన చిన్నా, పెద్దా పనులను పూర్తిచేస్తాం. గుజరాత్‌లో ఎవరు

మాకు సహాయంగా వచ్చి మా పనిభారాన్ని తగ్గిస్తారు? పెద్ద రైతులు వచ్చి మా పొలాల్లో కలుపుతీస్తారా, మా ఇళ్లు కట్టి పెడతారా? ఇక్కడ మా గ్రామాలలో, మాతోటి వాళ్లనుంచి ఇంత సహాయం ఎందుకు లభిస్తుంది? ఎందుకంటే మేమంతా ఒకేలాగా ఉన్నాం, మాదంతా ఒకటే అవగాహన. కొద్దిమంది మాత్రమే ఇక్కడ కౌలుదారులు ఉన్నారు; ప్రతి ఒక్కరికీ భూమి ఉంది. ఏ ఒక్కరికీ ఎక్కువ భూమిలేదు, కానీ అందరికీ కొంత ఉంది. మేం గుజరాత్‌కు వెళితే పెద్ద రైతులు మమ్మల్ని అణచివేస్తారు. నలభై-యాభై సంవత్సరాల క్రితమే అక్కడ ఉండే ఆదివాసీల భూమిని వాళ్లు లాగేసుకున్నారు. ఇప్పటికీ ఇది కొనసాగుతోంది. మేమేమో అక్కడ కొత్తవాళ్లం మాకు అక్కడి భాష తెలియదు, సంప్రదాయాలు తెలియవు; పెత్తనమంతా వాళ్లదే. ఎక్కువ డబ్బులు అవసరమయ్యే వ్యవసాయాన్ని చెయ్యలేనప్పుడు మా భూములను వాళ్లకు తాకట్టు పెట్టాలి, వాళ్లు మెల్లగా వాటిని కబ్జా చేస్తారు. అక్కడ ఉన్న ఆదివాసీల భూమే తీసుకున్నప్పుడు మా భూమి ఎందుకు తీసుకోరు? అప్పుడు మాకు ఇంకో భూమి ఎవరిస్తారు? ఈ భూమి మా పూర్వీకులది. దీని మీద మాకు హక్కు ఉంది. దీనిని కోల్పోతే మా చేతికి పారలు, పలుగులు తప్ప ఇంకేమీ రావు...

మా ఊరి దేవుళ్లందరూ ఇక్కడ ఉన్నారు. మా పూర్వీకుల జ్ఞాపకార్థం ఉంచిన రాళ్లు అన్నీ ఇక్కడ ఉన్నాయి. మేం కాలో రానో, రాజా పాంతో, ఇంది రాజాలను పూజిస్తాం. ఆయి ఖాడా, భేదు బాయిని కూడా పూజిస్తాం. రాణి కాజోల్ మా పెద్ద దేవత. ఆమె, కుంబాయి, కుందు రాణీల కొండలు మధ్వాడలో ఉన్నాయి. వీళ్లందరిని విడిచి వెళితే మాకు కొత్త దేవతలు ఎక్కడినుంచి వస్తారు? ఇందల్, దివస, దివాలి వంటి పండగలు జరుపుకోటానికి అన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వస్తారు. భంగోరియాకు మేమంతా సంతకు వెళతాం, అక్కడ మా యువత తమ జీవిత భాగస్వాములను స్వయంగా ఎంచుకుంటారు. గుజరాత్‌లో మా దగ్గరకు ఎవరు వస్తారు?

గుజరాత్‌లో భూమి మాకు ఆమోదయోగ్యం కాదు. మీ నష్టపరిహారం మాకు ఆమోదయోగ్యం కాదు. నర్మదానది కడుపులోంచి మేం పుట్టాం, దాని ఒడిలో చనిపోటానికి భయపడం.

మేం మునిగిపోతాం కానీ ఇక్కడి నుంచి కదలం!

బావా మహాలియా

- అభివృద్ధి భావనలు అన్న అధ్యాయంలో ఒకరికి అభివృద్ధి అయినది మరొకరికి అభివృద్ధి కాకపోవచ్చని చదివాం. దీనిని వివరించటానికి బావా మహాలియా ఉత్తరాన్ని ఉపయోగించండి.
- గిరిజనులకు వేరే రాష్ట్రంలో పునరావాసం కల్పిస్తే దిగువ పేర్కొన్న విషయాల్లో ప్రస్తుత అలవాట్లలో ఏమి మారతాయో చూపించటానికి ఒక పట్టిక తయారుచేయండి: ఆహార అలవాట్లు, వ్యవసాయం, ఆర్థిక అంశాలు, అడవితో సంబంధం, మత ఆచారాలు, ఇల్లు కట్టుకోవటం, సామాజిక సంబంధాలు.
- జీవ వైవిధ్యత కోల్పోటాన్ని ఉత్తరంలో ఎలా పేర్కొన్నారు?
- గిరిజనులలో జీవనోపాధి, సంస్కృతి, సామాజిక సంబంధాలు అడవితో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. దీనిని వివరించండి.
- జలసింధి గ్రామంలోని ప్రజలకు ప్రస్తుతం ఆహార భద్రత ఉందా?
- పైన పేర్కొన్న పరిస్థితులలో మీరు నివసిస్తుంటే పునరావాసం పొందాలన్నప్పుడు ఎలా స్పందిస్తారు?

సర్దార్ సరోవర్ ఆనకట్ట వంటి అభివృద్ధి పథకాలు వేలాది ప్రజల జీవితాలను, జీవనోపాధులను చిన్నాభిన్నం చేశాయి. వీటి వల్ల ఆధునిక అభివృద్ధికి అవసరమైన విద్యుత్తు, సాగునీరు అందుబాటులోకి వచ్చాయన్నది నిజమే. కానీ వీటివల్ల నిర్వాసితులైన ప్రజలకు – వీళ్లు లక్షల సంఖ్యలో ఉన్నారు – అన్యాయంగాను, విధ్వంసకరంగానూ ఇవి ఉన్నాయి. ఆధునిక అభివృద్ధి పథకాల వల్ల వీళ్లకు అతిముఖ్యమైన వనరైన స్థానిక పర్యావరణం అందుబాటులో లేకుండా పోయింది. ఇదే విషయాన్ని బావా మహాలియా మళ్లీ మళ్లీ ప్రస్తావించారు. స్థానిక పర్యావరణం లేకపోతే వాళ్ల జీవితాలు శూన్యమై పోతాయి. స్వయం సమృద్ధ దశనుండి ఒక్కసారిగా కొరతలోకి విసిరివేయబడతారు. ఇప్పుడు వాళ్లు ఒక్క పంట అయినా పండించగలుగుతున్నారు, భవిష్యత్తులో సాగునీటి వసతి ఏర్పడితే పలు పంటలు పండించవచ్చున్న ఆశతో ఉన్నారు. కానీ, నిర్వాసితులైతే వాళ్ల జీవితాలు బయటి శక్తులమీద ఆధారపడతాయి, వాళ్లు పేదరికంలోకి నెట్టబడతారు.

గ్రామీణ ప్రాంతంలో ఉండే చాలా మంది ప్రజల జీవితాలకు పర్యావరణానికీ, మధ్య బలమైన సంబంధం ఉంది. పర్యావరణం అందుబాటులో ఉన్నప్పుడు దానినుంచి వాళ్ల అనేక అవసరాలు (ఆహారం, కట్టెపుల్లలు, పశుగ్రాసం, ఆర్థికంగా విలువైన వస్తువులు వంటివి) తీరతాయి, అదే లేకపోతే వీటికి డబ్బులు చెల్లించాల్సి వస్తుంది. నిర్వాసితులైనందువల్ల పర్యావరణం అందుబాటులో లేకుండా పోయినా, లేదా అది కలుషితమైనా, విధ్వంసమైనా ఎక్కువగా నష్టపోయేది పేదవాళ్లే. పర్యావరణం, సుస్థిరత అన్న అంశాలు సమానత అన్న అంశంతో బలంగా ముడిపడి ఉన్నాయి.

స్థానిక పర్యావరణం నుంచి నిర్వాసితులు కావటం వల్ల నష్టపోయేది ప్రజలు ఒక్కరే కాదన్నది ముఖ్యంగా గుర్తించాలి. ప్రజలతోపాటు సాంప్రదాయ జ్ఞానం మాయమైపోతుంది, సుసంపన్నమైన పర్యావరణ జీవ వైవిధ్యత అంతరించిపోతుంది. ఈ జ్ఞానంఎన్నో తరాలలో ఏర్పడి పెంపొందుతూ వచ్చింది. ఇటువంటి సాంప్రదాయ జ్ఞానం బావా మహాలియా వంటి వాళ్లలో ఉంది. "మాకు అడవిలోని ప్రతి చెట్టు, పొద, మొక్క పేరు తెలుసు; వాటి ఉపయోగాలు తెలుసు. అడవులు లేని ప్రాంతంలో మేం నివసించాల్సి వస్తే ఎన్నో తరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ఈ జ్ఞానమంతా ఉపయోగం లేకుండా అయిపోతుంది. మెల్లగా ఇదంతా మరచిపోతాం." పర్యావరణం అనేక రకాలుగా ముప్పుకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో దానిని బాగా అర్థం చేసుకున్న ఇటువంటి సమూహాల పాత్ర ఎంతో ముఖ్యమని గుర్తించాలి.




*చిత్రం 12.5 : పర్యావరణం నేపథ్యంలో దీనికి ఒక శీర్షిక సొంతంగా రాయండి.*

సర్దార్ సరోవర్‌కు, నర్మాదాలోయలో ఇవే పరిణామాలున్న ఇతర ఆనకట్టలకు ఉన్న వ్యతిరేకత ఒక సామాజిక ఉద్యమ రూపం దాల్చింది. దీనిని 'నర్మదా బచావో ఆందోళన్' (నర్మదను కాపాడే ఉద్యమం) అంటారు. దీని గురించి, దీని చుట్టూ ఏర్పడిన నిర్వాసితుల, పర్యావరణ ఉద్యమాల గురించి, ఇటువంటివే ఇతర ఉద్యమాల గురించి మీరు 'సామాజిక ఉద్యమాలు' అన్న అధ్యాయంలో తెలుసుకుంటారు.

## చిప్కో ఉద్యమం

ఉత్తరాఖండ్‌లోని గఢ్‌వాల్ కొండలలో 1970 ఆరంభంలో మొదలైన చిప్కో ఉద్యమం మరొక ముఖ్యమైన పర్యావరణ ఉద్యమం. నర్మదాలోయలోని గిరిజన ప్రజలకు మాదిరిగానే ఇక్కడి కొండ ప్రాంతాల్లోని ప్రజల మనుగడకు అడవులు ఎంతో కీలకమైనవి. ఇవి ప్రత్యక్షంగా ఆహారం, కట్టెపుల్లలు, పశువుల మేత ఇవ్వటమే కాకుండా పరోక్షంగా నేల, నీటి వనరులను సుస్థిర పరచటంలో ప్రధానపాత్ర పోషిస్తాయి. వ్యాపారం, పరిశ్రమల కోసం అడవులను నరికివెయ్యటం తీవ్రరూపం దాల్చటంతో తమ జీవనోపాధులను కాపాడుకోటానికి దీనిని అహింసాయుత పద్ధతిలో వ్యతిరేకించాలని ప్రజలు చెట్లను హత్తుకున్నారు. దీనినుంచే ఈ ఉద్యమం పేరు వచ్చింది, చిప్కో అంటే హత్తుకోవటం. చెట్లను పల్లెవాసులు హత్తుకొని గుత్తెదార్ల గొడ్డళ్ళకు అడ్డుగా నిలిచారు. ఈ ఉద్యమంలో గ్రామీణ మహిళలు ప్రధానంగా పాల్గొన్నారు. ఈ ఉద్యమం కారణంగా ఎంతోమంది పర్యావరణ సుస్థిరత గురించి ఆలోచించటం మొదలుపెట్టారు.



*చిత్రం 12.6*

ఈ అన్ని ఉద్యమాల నేపథ్యంలో కొంత తేడా ఉన్నప్పటికీ మౌలికంగా ఇవన్నీ పర్యావరణంపై స్థానిక ప్రజల హక్కులకోసం పోరాడుతున్నాయి. చెట్లను నరకటాన్ని అడ్డుకుని, గుత్తేదార్లనుంచి ముప్పును ఎదుర్కొంటున్న తమ సాంప్రదాయ అటవీ హక్కుల కోసం చిప్కో ఉద్యమం మొదలయ్యింది. భూమి, అడవులు, నదిపై ప్రజల హక్కుల కోసం నర్మదా బచావో ఉద్యమం పోరాడుతోంది.

- 'అభివృద్ధి భావనలు' అన్న అధ్యాయంలో మీరు 'కుడంకుళం అణు విద్యుత్తు కర్మాగారానికి నిరసనల గురించి చదివారు. ఇక్కడ తెలుసుకున్న వాటి ఆధారంగా ఆ నిరసనలను వివరించండి.
- "పర్యావరణ పరిరక్షణ ప్రత్యక్షంగా ప్రభావితులయ్యే సమూహాలకే కాక మనందరికీ కూడా ఎంతో కీలకమైనది." కొన్ని ఉదారణలతో దీనిని వివరించండి.
- ఎనిమిదవ తరగతిలోని ఆంధ్రప్రదేశ్‌లోని ఖనిజాలకు సంబంధించిన అధ్యాయాలను మరొకసారి చూడండి. పారిశ్రామికవేత్తలకు, ఖనిజాలు ఉన్న ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు మధ్య ఎటువంటి వైరుధ్యాలు చోటు చేసుకుంటాయి?
- భారతదేశ ఆర్థిక విధానంలో సరళీకరణ, ప్రపంచీకరణ చోటు చేసుకున్న తరువాత స్థానిక అవసరాలకు, ఎగుమతులకు ఖనిజాల తవ్వకం వేగంగా పెరిగింది. పక్కన ఇచ్చిన పట్టికలోని గణాంకాల ఆధారంగా ఈ వ్యాఖ్యానాన్ని వివరించండి.
- గనుల తవ్వకం వేగంగా వృద్ధి చెందటం వల్ల పర్యావరణానికి, మనుషులకు ఏ విధమైన నష్టాలు జరుగుతాయి?

**పట్టిక :** భారతదేశంలో కొన్ని కీలక ఖనిజాల తవ్వకం (వేల టన్నులలో)

| ఖనిజం | 1997-98 | 2008-09 |
|---|---|---|
| బాక్సైట్ | 6,108 | 15,250 |
| బొగ్గు | 2,97,000 | 4,93,000 |
| ఇనుప ఖనిజం | 75,723 | 2,23,544 |
| క్రోమైట్ | 1,515 | 3,976 |

## సమానతతో కూడిన సుస్థిర అభివృద్ధి

విధానాలను నిర్ణయించేవాళ్లు చాలా కాలం పర్యావరణ అంశాలను నిర్లక్ష్యం చేశారు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో పేదరికం ఉంది కాబట్టి ఆర్థికాభివృద్ధి అవసరం అని వాళ్లు వాదించేవాళ్లు. ఎన్ని విపరీత పరిణామాలు ఉన్నా అభివృద్ధి మాత్రం తప్పనిసరి అని భావించారు. పేదరికాన్ని తగ్గించటానికి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచటానికి ఆధునిక పరిశ్రమలలోనూ, జిడిపి లోనూ అభివృద్ధి సాధించటం తప్పనిసరి అనేవాళ్లు. ఆధునిక పారిశ్రామిక వ్యవసాయ అభివృద్ధికి ఇంధనంతో సహా ప్రకృతి వనరులను ఎక్కువగా వినియోగించాలి కాబట్టి ఈ వనరులు అంతరించిపోవడం, వాతావరణ కాలుష్యానికి దారితియ్యటం ఊహించిన పరిణామాలే. అభివృద్ధి సాధించటానికి ఈ త్యాగం చెయ్యాల్సి ఉంటుందని వాళ్లు చెప్పేవాళ్లు. అధిక ఆర్థిక అభివృద్ధి, సంపన్నత సాధించిన తరువాత కాలుష్యాన్ని, పర్యావరణ క్షీణతను పరిష్కరించవచ్చని భావించారు. డబ్బు ఖర్చుచేసి నదులను, గాలిని శుభ్రపరచవచ్చు, సీసాలలోని నీళ్లు తాగవచ్చు, ఇంధనాన్ని పొదుపుగా వినియోగించే కార్లను రూపొందించవచ్చు అని వాదించేవాళ్లు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా గతంలో ఇదే మార్గాన్ని అనుసరించాయి అని చెప్పేవాళ్లు.

ఈ వాదనలలో అనేక లోపాలు ఉన్నాయి. అనేక పార్శ్వాలలో పర్యావరణం తీవ్ర క్షీణతకు గురయ్యిందని మీరు ఈపాటికి గుర్తించే ఉంటారు. అభివృద్ధి చెందిన దేశాల మాదిరి మనం కూడా వృద్ధి సాధించి వనరులను, ఇంధనాన్ని వినియోగిస్తే, పర్యావరణాన్ని కలుషితం చేస్తే భూమి వినాశనానికి లోనవుతుంది. పర్యావరణానికి జరిగిన హానిని తిరిగి సరిదిద్దగల స్థితిలో మనం ఉండం. జరిగిన నష్టాన్ని పర్యావరణం తనంతట తాను సరిచేసుకుంటుందన్న భావన సరైనది కాదు. దానిని పునరుద్ధరించటానికి ముందే పర్యావరణం నాశనం అయిపోవటాన్ని మనం కోరుకోవటంలేదు. భవిష్యత్తు తరాలు జరిగిన నష్టాన్ని సరిదిద్దగలిగినా ఇప్పుడు చేసిన కాలుష్యాన్ని తొలగించటానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు మన నదులు, మురికి కాలవలను శుభ్రపరచటానికి డబ్బులు ఖర్చు చేయటమే కాకుండా అవి తిరిగి కాలుష్యానికి గురికాకుండా చూడాలి. ప్రకృతి వనరులను ధ్వంసం చేసి భవిష్యత్తు తరాలకు క్షీణించిన స్థితిలో వాటిని అందించే అభివృద్ధి విధానాన్ని మనం అనుసరించాలా? ముందుగా సమస్యలకు కారణమైన జీవన విధానాన్ని ప్రోత్సహించి, ఆ తరువాత వీటిని సరిచెయ్యటానికి కోట్లాది రూపాయలు ఖర్చు చెయ్యటంలోని వైరుధ్యం మనకు బోధపడటం లేదా?



చిత్రం 12.7 : చర్చించిన అంశాల నేపథ్యంలో ఈ చిత్రానికి ఒక శీర్షిక రాయండి.

వేగమైన ఆర్థిక అభివృద్ధి వల్ల అనేక రంగాలలో ఇప్పటికే మనం వ్యతిరేక పరిణామాలను చవి చూస్తున్నాం – భూగర్భజలాలు, రసాయనిక పురుగుమందుల సమస్యలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు. పర్యావరణంపై ఆధారపడి అనేక వేల సమూహాలు నివసిస్తున్నాయి. పర్యావరణాన్ని విధ్వంసం చెయ్యటమంటే ఈ సమూహాలను మట్టు పెట్టటమే. అభివృద్ధికి పేద ప్రజలను మూల్యం చెల్లించమనటం న్యాయం కాదు.

దీని అర్థం మనం ప్రగతిని సాధించగూడదని కాదు. ప్రగతితో పాటు పర్యావరణ అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. సమానత, న్యాయం అన్న భావనలను పరిగణనలోకి తీసుకోవాలి. పేదరికం నుంచి బయటపడటానికి పర్యావరణ రీత్యా సుస్థిర మార్గాన్ని కనుగొనాలి. ఇది అత్యంత తేలికైన పనికాదు. అయితే ఇప్పటికే ఆ దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.

1. పర్యావరణంపై స్థానిక ప్రజల హక్కుల కోసం వివిధ బృందాలు ఎలా పనిచేస్తున్నాయో చూశాం. ప్రజలలో పర్యావరణ చైతన్యాన్ని కలిగించటానికి, సుస్థిర అభివృద్ధి దిశగా మళ్లటానికి వాళ్లు ఎంతగానో కృషి చేశారు.

2. ప్రాథమిక హక్కు అయిన జీవించే హక్కులో భాగంగా ఆరోగ్యకరమైన పర్యావరణానికి హక్కు ఉంటుందని న్యాయస్థానాలు అనేక తీర్పులు ఇచ్చాయి. 1991లో రాజ్యాంగంలోని అధికరణంలోని ప్రాథమిక హక్కులోని జీవించే హక్కులో జీవితాన్ని పూర్తిగా ఆనందించటానికి కాలుష్య రహిత నీటిని, గాలిని పొందే హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కాలుష్యాన్ని అరికట్టడానికి అనువైన చట్టాలు, విధానాలు రూపొందించే బాధ్యత ప్రభుత్వానిది, కాలుష్య కారకులకు భారీ జరిమానాలు విధించాలి. నియంత్రణ పాత్రను పోషించటానికి అనేక ప్రభుత్వ సంస్థలను నెలకొల్పారు.



*చిత్రం 12.8 : వాహనాల నుంచి వెలువడే పొగ పర్యావరణ కాలుష్యానికి ఒక ప్రధాన కారణం. (1998 నుంచి మొదలుకొని) సుప్రీంకోర్టు వెలువరించిన అనేక ఆదేశాలలో ప్రజా రవాణా వాహనాలన్నీ డీజిల్‌నుంచి పీడనానికి గురిచేసిన సహజవాయువుకు (సిఎన్‌జి) మారాలని పేర్కొంది. డీజిల్‌తో పోలిస్తే ఈ ఇంధనం వల్ల కాలుష్యం తక్కువ. ఈ చర్యల వల్ల ఢిల్లీవంటి నగరాలలో వాయుకాలుష్యం గణనీయంగా తగ్గింది. అయితే ఇటీవల కాలంలో డీజిల్‌తో నడిచే ప్రైవేటు కారుల సంఖ్య గణనీయంగా పెరగటంతో వాయు కాలుష్యం మళ్లీ పెరిగింది. కార్ల ఉత్పత్తిదారులు డీజిల్‌తో నడిచే కార్లను తయారుచేసి, అమ్మటం మొదలుపెట్టారు! సుస్థిర అభివృద్ధి ముందు ఉన్న సమస్య అంతతేలికైనది ఏమీ కాదు.*

3. వాతావరణ మార్పు వంటి అంశాలలో ఉమ్మడి నిర్ణయాలు తీసుకోటానికి వివిధ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. వాతావరణ మార్పు వల్ల అన్ని దేశాలు, ప్రజలు అందరూ స్థాయీ బేధాలతో ప్రభావితం అవుతారు. ఈ మార్పులలో అనేకం మనం అర్థం చేసుకునే స్థితిలో లేం, చాలావాటిని ముందుగా ఊహించలేం. హరితగృహ వాయు ఉద్గారాలను తగ్గించటానికి ఒక దేశం నిర్ణయించుకోవచ్చు. అయితే ఇతర దేశాలు తమ ఉద్గారాలను నియంత్రించుకోకపోతే ఆ దేశ పర్యావరణ క్షీణత కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి ప్రపంచస్థాయిలో అన్ని దేశాలు కలిసి చేపట్టే పరిష్కారాలు అవసరం అవుతాయి.

4. ప్రజల స్థాయిలో ప్రజలతో పనిచేస్తున్న అనేక సంఘాలు సుస్థిరత, సమానత సాధించే విధంగా అనేక పాత పద్ధతులను తిరిగి కనుగొన్నాయి, కొత్త పద్ధతులను కూడా రూపొందించాయి. చేపల పెంపకం, గనుల తవ్వకం, రవాణా, ఇంధనం, వ్యవసాయం, పరిశ్రమలవంటి పలు రంగాలలో ఇటువంటి పద్ధతులు ఎన్నో ఉన్నాయి. సమాజానికి అత్యంత మౌలిక అవసరమైన ఆహారంపై ప్రభావం చూపే కొన్ని ప్రయత్నాలను పరిశీలిద్దాం.

వ్యవసాయ రంగంలో మీరు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఉత్పత్తుల గురించి విని ఉంటారు. సేంద్రియ రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులను వినియోగించరు. ఇందుకు బదులుగా పంట మార్పిడి, పెంటపోగు ఎరువు, పురుగుల జైవిక నియంత్రణ వంటి సహజ పద్ధతులను

వీళ్లు అవలంబిస్తారు. సేంద్రియ వ్యవసాయంలో ముఖ్యమైన ఒక లక్షణం స్థానిక వనరులను వినియోగించటం. ఉదాహరణకు హానికరమైన పురుగులను తినే జీవులను (పక్షులు, సాలీళ్లు, మేలుచేసే పురుగులను) ప్రోత్సహించటం, పోషకాలను మొక్కలకు అందుబాటులోకి తెచ్చే నేలలోని సూక్ష్మజీవులను (రైజోబియం, అజటొబాక్టర్ వంటివి) పెంపొందించటం. కృత్రిమ రసాయనిక పదార్థాల వినియోగాన్ని సాధ్యమైనంతగా తగ్గిస్తారు. అలాగే ఒకటి రెండు పంటలు మాత్రమే కాకుండ అనేక పంటలను సాగు చెయ్యటం వల్ల జీవ వైవిధ్యత పెరుగుతుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో సాధించిన ఉత్పత్తిని ఈ పద్ధతులతోనూ పొందవచ్చు.

ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయ అవసరాన్ని, దాని సామర్థ్యాన్ని అనేక రాష్ట్రాలు గుర్తించాయి. స్థానికంగా చేపట్టిన చొరవలు ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేశాయి. సిక్కిం ప్రభుత్వం రాష్ట్రంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులను నిషేధించే సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకుంది. 2015 నాటికి మొత్తంగా సేంద్రియ వ్యవసాయానికి మారాలని నిర్ణయించుకున్న మొదటి రాష్ట్రం దేశంలో ఇదే. 100 శాతం సేంద్రియ రాష్ట్రంగా మారే ఇదే పంథాని ఉత్తరాఖండ్ కూడా అనుసరిస్తోంది.













*చిత్రం 12.9: 2013 సంవత్సరంలో "వాళ్లు అంతరించి పోయేముందు" (బిఫోర్ దే పాస్ అవే) అన్న బొమ్మల పుస్తకం ప్రచురితమయ్యింది. ఈ పుస్తకం మనకి అందుబాటులో లేదు. అంతరించిపోయే ప్రమాదమున్న సంచార జాతులను రచయిత గుర్తించారు. (ఇక్కడ ఇచ్చిన బొమ్మలు వేరు వేరు చోట్లనుంచి పొందినవి.) ఈ బొమ్మలను చూసి సుస్థిర అభివృద్ధి ఎందుకు ముఖ్యమైనదో ఆలోచించండి. ఈ సంచార జాతులు అంతరించిపోతున్నాయని రచయిత ఎందుకు భావించారు?*

1. *కెన్యాలోని మస్సాయి యోధులు*
2. *ఖజకిస్తాన్‌కు చెందిన యుర్తా గిరిజనులు*
3. *టిబెట్‌లోని కియాంగ్ గిరిజనులు*
4. *దక్షిణ అమెరికాలోని గౌచొ తెగవారు*

సుస్థిర పద్ధతుల్లో ఆహార ఉత్పత్తి, దాని సమాన పంపిణీకి మరొక చక్కని ఉదాహరణ ప్రత్యామ్నాయ ప్రజా పంపిణీ వ్యవస్థ. దీనిని ఆంధ్రప్రదేశ్‌లోని జహీరాబాద్ ప్రాంతంలో ప్రజా బృందాలు చేపట్టాయి.

## *ప్రత్యామ్నాయ ప్రజా పంపిణీ వ్యవస్థ*

భారతదేశంలోని మొత్తం సాగుభూమిలో 9.2 కోట్ల హెక్టార్లు వర్షాధారం కాగా 5.1 కోట్ల హెక్టార్లు సాగునీటి కింద ఉంది. దీని అర్థం భారతదేశంలోని మూడింట రెండు వంతుల భూమి వర్షాధారంగా ఉండి సాగునీటి వ్యవసాయానికి అనువైనది కాదు. సాంప్రదాయంగా ఈ ప్రాంతాలలో వర్షాధారంగా పండే అనేక పంటలను కలిపి సాగు చేసేవారు. ఉదాహరణకు దక్కన్ పీఠభూమిలో 16 రకాల పంటలను కలిపి ఒకేసారి విత్తేవాళ్లు. ఇవి పంటకి వచ్చే కాలం వేరువేరుగా ఉండటం వల్ల పని దినాలు పొడిగింపబడి ఆదాయాలు/ ఆహార ధాన్యాల సరఫరా ఎక్కువ కాలంపాటు ఉంటుంది. దీనివల్ల పంట నష్టాలనుంచి కూడా రక్షణ లభిస్తుంది, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో కనీసం ఒక పంట అయినా దిగుబడినిస్తుంది. మిశ్రమ పంటల వల్ల ఒక పురుగు తీవ్ర నష్టం కలిగించే స్థాయికి చేరకుండా నిరోధింపబడుతుంది. సాగుచేసే పంటలు నేలకి (నేలసారానికి), మనుషులకు, పశువులకు సమతుల పోషకాహారాన్ని ఇచ్చేలా ఎంపిక చేస్తారు.

అయితే, హరిత విప్లవం తరువాత వరి, గోధుమలకు ప్రాధాన్యత పెరిగింది. ఈ పంటల ఆహారధాన్యాలే ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) ద్వారా చౌకధరల దుకాణాలలో లభించేవి. రోజువారి ఆహారంలో బియ్యం, గోధుమల వాడకం పెరిగింది. స్థానిక ఆహార ధాన్యాలకు గిరాకీ పడిపోవటంతో కాలక్రమంలో అనేక వర్షాధార భూములను సాగుచెయ్యకుండా వదిలేశారు. హరిత విప్లవం కింద ఆహారంలో స్వయం సమృద్ధి సాధించటానికి వరి, గోధుమల సాగును వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రోత్సహించారు. ఇందుకు విరుద్ధంగా చిరుధాన్యాల సాగుకు ఎటువంటి మద్దతు, ప్రోత్సాహం లభించలేదు. ఈ చిరుధాన్యాల దిగుబడులు పెంచటానికి తగినంత పరిశోధన కూడా జరగలేదు. వర్షాధార పంటలైన చిరుధాన్యాలు (జొన్న, సజ్జ, రాగి వంటివి), నూనెగింజల దిగుబడులు తగ్గటానికి ఇది ఒక ప్రధాన కారణం.

ఆంధ్రప్రదేశ్‌లోని మెదక్ జిల్లా జహీరాబాద్ మండలంలోని గ్రామస్తులు కొనుగోలు చేసిన బియ్యం, గోధుమలపై ఆధారపడటం నుంచి బయటపడ్డారు. స్థానిక ఆహార అలవాట్లు, సంస్కృతిని కోల్పోవటం గురించి 2000 సం॥లో మహిళలు ఆలోచనలతో ఇదంతా మొదలయ్యింది. సాంప్రదాయంగా ఈ ప్రాంతంలో చిరుధాన్యాలు ప్రధాన ఆహారంగా ఉండేవి. వీటి స్థానాన్ని బియ్యం తీసుకుంది. పోషకాల రీత్యా చూస్తే చిరుధాన్యాల కంటే బియ్యం చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. పోషకాహారాన్ని కోల్పోవటమే కాకుండా తమ భూముల్లో పండించే పంటలపైన కూడా నియంత్రణ కోల్పోవటం ప్రజలు గుర్తించారు. అనేక భూములు ఇప్పుడు బీడు పడ్డాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో ఇలా బీడుపడ్డ భూములను, ఉమ్మడి భూములను కలిసి సాగు చెయ్యాలని గ్రామస్తులు నిర్ణయించారు. స్థానిక పర్యావరణానికి అనువైనవి అయినందున చిరుధాన్యాలను సాగు చెయ్యాలని సహజంగానే నిర్ణయించారు. చిరుధాన్యాలు మొండి మొక్కలే కాకుండా అధిక పోషకాలను కలిగి ఉంటాయి.

వర్షాధార భూములను సాగులోకి తీసుకురావటం వల్ల ప్రజలకు పని దొరికింది. అంతేకాకుండా పంటను బయట అమ్మకుండా గ్రామస్థాయిలో ప్రజా ధాన్య బ్యాంకును ప్రారంభించారు. ఇది ప్రజా పంపిణి వ్యవస్థ మాదిరి పనిచేసేది. (ప్రజలకు వేరువేరు కార్డులు ఉండి, వాటి ఆధారంగా ఎవరికి ఎంత ఇవ్వాలో నిర్ణయించే వాళ్లు.) అయితే దీనిని స్థానికంగా నిర్వహించేవాళ్లు, అక్కడ దొరికే ధాన్యం స్థానికంగా పండినది.

ధాన్యం ఎక్కడో వందల కిలోమీటర్ల దూరం నుంచి తీసుకురావలసిన అవసరం లేకుండా గ్రామంలో ఆహార భద్రతను సాధించటానికి స్థానికంగా పండించిన ఆహారం ఇప్పుడు అందుబాటులో ఉంది.

## క్లుప్తంగా...

పర్యావరణ సమస్యలను ఆధునిక అభివృద్ధి తీవ్రతరం చేసిందని చూశాం. దీనిని ఈ రోజు మనం అనేక విధాలుగా, స్పష్టంగా చూడగలుగుతున్నాం. వస్తువులు, సేవల పెరుగుదలపై ఆధారపడిన అభివృద్ధి నుంచి సమానతతో కూడిన సుస్థిర అభివృద్ధి అన్న లక్ష్యం వైపు మళ్లాలి. ఈ మార్పుకోసం వ్యక్తులూ, కంపెనీలూ, రైతులూ, ప్రభుత్వాలూ, న్యాయస్థానాలూ, స్వచ్ఛంద సంస్థలూ, ప్రజాసంఘాలూ, ప్రపంచ స్థాయి సంస్థలూ – ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి.

## కీలక పదాలు

సుస్థిర అభివృద్ధి

పర్యావరణం

వనరుల మూలం

ప్రజల హక్కులు

సమానత

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. మీరు తినే ఆహార పదార్థాలలో పదింటిని తీసుకుని మీ వద్దకు చేరటానికి ఉత్పత్తి అయిన స్థలం నుంచి ఎంత దూరం ప్రయాణించాయో తెలుసుకోండి.

| క్ర.సం. | ఆహార పదార్థం | ప్రయాణించిన దూరం |
|---|---|---|
| 1 | బియ్యం | |
| 2 | వంటనూనె | |
| 3 | అరటి పళ్లు | |

చాలా మంది ఆహారం దూర ప్రాంతాలు రవాణా చెయ్యటం కాకుండా స్థానికంగా ఉత్పత్తి చెయ్యాలని అంటారు. స్థానికంగా ఆహారం ఉత్పత్తి చెయ్యటానికీ, పర్యావరణానికీ సంబంధం ఏమిటి? స్థానికంగా ఆహారాన్ని పండించి, వినియోగించాలన్న ఉద్యమం గురించి మరింత తెలుసుకుని తరగతి గదిలో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించండి. (మీకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే యుట్యూబ్‌లో కింద లింకులో ఉన్న హెలెనా నార్బెర్గ్–హాడ్జ్ ఉపన్యాసాన్ని వినండి:

https:/ www.youtube.comwatch? v=4r06_F2F1KM

2. జలసింధి గ్రామ ప్రజలు తమ ఊరినుంచి తరలి వెళ్లటాన్ని ఎందుకు తిరస్కరించారు?
3. “ఇది మా పూర్వీకుల భూమి. దీనిపై మాకు హక్కు ఉంది. దీనిని కోల్పోతే మా చేతికి పారలు, గడ్డపారలు వస్తాయి తప్ప ఇంకేమీ మిగలదు...” అన్న బావా మహాలియా మాటలను వివరించండి.

4. "చివరిగా (అంతమాత్రాన దీని ప్రాముఖ్యత తక్కువేమీకాదు) వ్యర్థ పదార్థాలు, కాలుష్యం తక్కువగా ఉండేలా మన జీవన సరళిని మార్చుకోవటంపైన పర్యావరణ సమస్యల పరిష్కారం ఆధారపడి ఉంది."
   - మన జీవన శైలి పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? మీ నేపథ్యం నుంచి కొన్ని ఉదాహరణలు తీసుకుని దీనిని వివరించండి.
   - ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో చెత్త, కాలుష్య విడుదల సమస్యలను అధికమిస్తున్న వివిధ పద్ధతులను పేర్కొనండి.
5. ఖనిజాలు, ఇతర సహజ వనరులను వేగంగా సంగ్రహించడం వల్ల భవిష్యత్తు అభివృద్ధి అవకాశాలు దెబ్బ తింటాయి. మీరు ఏకీభవిస్తారా?
6. వాతావరణ మార్పు ప్రభావం అన్ని దేశాలపై ఉంటుందని ఎందుకనుకుంటున్నారు?
7. భూమి సగటు ఉష్ణోగ్రతలను ప్రజలందరికీ సహజ వనరుగా పరిగణించాలా?
8. ఆంధ్రప్రదేశ్‌లోని జహీరాబాద్ మండలంలోని ప్రత్యామ్నాయ ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి ఏ గుణపాఠాలు నేర్చుకోవచ్చు?
9. "స్థానిక జన జీవనానికి, జీవనోపాధులకు, పరిసరాలతో సహజీవనం చేసే జీవన విధానానికి పర్యావరణం చాలా ముఖ్యమైనది." వివరించండి.

## ప్రాజెక్టు

సేంద్రియ వ్యవసాయం నేపథ్యంలో మీరు పెంటపోగు ఎరువు గురించి చదివారు. మీ బడిలో, ఇంటి దగ్గర ప్రయత్నించటానికి తేలికైన పద్ధతి ఇదిగో:

- ★ ఒక పెద్ద పాత్ర తీసుకుని అధికంగా ఉన్న నీళ్లు పోవటానికి కింద భాగంలో రంధ్రాలు చెయ్యండి.
- ★ కొబ్బరి పీచు ఒక పొర వేయండి. అధికంగా ఉన్న నీళ్లు పోటానికి ఇది దోహదం చేస్తుంది.
- ★ ఒక పలచటి మట్టి పొరతో దీనిని కప్పండి.
- ★ కూరగాయల పొట్టు ఇతర వ్యర్థ పదార్థాలను ఒక పొర లాగా వెయ్యండి.
- ★ మరొక పొర మట్టి వెయ్యండి.
- ★ కూరగాయల వ్యర్థాలను మళ్లీ పొరలాగా వెయ్యండి.
- ★ మట్టితో కప్పండి.
- ★ వారం రోజుల తరువాత దీంట్లోకి వానపాములను ప్రవేశపెట్టండి.
- ★ ఇది కుళ్లిన తరువాత మీ తోటలో కావలసిన మొక్కలు పెంచటానికి ఈ మట్టిని ఉపయోగించండి.

పాఠం

13

# ప్రపంచ యుద్ధాల మధ్య ప్రపంచం
## 1900-1950 : భాగం - I

20వ శతాబ్దపు ఆరంభంలో ప్రపంచ జనాభా 160 కోట్లు. పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం ప్రజల జీవనోపాధిని పొందే విధానాన్ని మార్చేసింది. అయితే ఈ మార్పు పాశ్చాత్య దేశాలలోనే సంభవించింది. ఈ మార్పు పొందిన దేశాలలో ప్రత్యేకించి బ్రిటన్ పారిశ్రామికంగా అగ్రగామిగా ఉండటమే కాకుండా ప్రపంచమంతటా విశాల వలస సామ్రాజ్యాలు విస్తరింపచేసింది. దేశాలను ప్రపంచం అనుభవిస్తున్న పాశ్చాత్య దేశాలుగాను, వీటి వలస దోపిడీలతో మరింత వెనుకబడిన దేశాలుగాను ఆర్థికాభివృద్ధిని విభజించారు.

చరిత్రకారుడైన ఎరిక్ హాబ్స్‌బామ్ 20వ శతాబ్దాన్ని 'తీవ్ర సంచలనాల యుగం'గా పేర్కొన్నాడు. రాజకీయంగా చూస్తే ప్రపంచంలోని ఇతర ప్రజల పట్ల ద్వేషం, అవధులు లేని అధికారంతో ఫాసిజం భావజాలం తీవ్ర రూపం దాలుస్తున్న క్రమంలోనే ప్రజలలో ప్రజాస్వామిక ఆకాంక్షలు చిగురులు తొడగసాగాయి. అంతటా, అందరికీ అక్షరాస్యత స్థాయి, సగటు జీవితకాలం అపారంగా పెరిగాయి. సినిమాలు వంటి కొత్త కళలు ఆవిర్భవించాయి. విజ్ఞాన శాస్త్రం కొత్త శిఖరాలను అందుకుని పరమాణువు, జీవుల రహస్యాన్ని ఛేదించింది. ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళలకు పాశ్చాత్య దేశాలలో మొదటగా ఓటు హక్కును ఈ కాలంలోనే కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు స్వాతంత్ర్యం పొంది స్వేచ్ఛావాయువులు పీల్చసాగాయి. ఇది గొప్ప ప్రయోగాల కాలం కూడా: సమానత్వం, సౌభ్రాతృత్వ సిద్ధాంతాలతో నమ్మిన సమసమాజాన్ని నిర్మించటానికి లేదా ప్రత్యామ్నాయంగా రాజకీయ స్వేచ్ఛలతో ఉదారవాద ప్రజాస్వామ్యాలు, పెట్టుబడిదారీ ఆర్థిక విధానం నిర్మాణానికి ప్రయత్నాలు కొనసాగాయి. అయితే ఇదే సమయంలో **తీవ్ర ఆర్థిక మాంద్యం** (గ్రేట్ డిప్రెషన్) సంభవించి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయ్యింది, ప్రజలు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులయ్యారు. రెండు ప్రపంచ యుద్ధాలు సంభవించి లక్షలాది మంది చనిపోయారు, ఇంకా ఎన్నో లక్షల మంది నిర్వాసితులయ్యారు. 20వ శతాబ్దం ఎన్నో ఆశలు, ప్రయోగాలు, ప్రమాదకర పరిణామాల సమ్మేళనంగా మారింది.

ఈ అధ్యాయంలో మనం రెండు ప్రపంచ యుద్ధాలకు గల కారణాలు, వాటి పరిణామాలు, 1929 నాటి తీవ్ర ఆర్థిక మాంద్యానికి మూడు ప్రతిచర్యలు, ప్రపంచశాంతి, అభివృద్ధికి ఐక్యరాజ్యసమితి సంస్థల ఏర్పాటు గురించి తెలుసుకుందాం.



*చిత్రం 13.1: అంతర్జాతీయ మహిళల ఓటు హక్కు ఉద్యమ సంస్థ లోగో, ఇది 1914లో ఏర్పడింది.*

- ఇక్కడ కొన్ని బొమ్మలు ఉన్నాయి. వీటికీ పైన పేర్కొన్న అంశాలకీ సంబంధం గుర్తించి వాటి మీద చిన్న వ్యాసం రాయండి.










చిత్రం 13.2




అ) నర్స్‌బెర్గ్ వద్ద 1934లో హిట్లర్ నాజీపార్టీ ప్రదర్శన. మీరు చూసిన రాజకీయ పార్టీల ప్రదర్శనలతో దీనిని పోల్చండి.

ఆ) మాంద్య కాలంలో పోలిష్ వలస కార్మికురాలు ఫ్లోరెన్స్ ఓవెన్స్ ఫోటో. డోరొతియా లాంజ్ తీసిన ఈ ఫోటో ఎంతో ప్రఖ్యాతిగాంచింది. 1936 మార్చి సమయంలో కాలిఫోర్నియాలో బఠాణి కోసేవాళ్ల తీవ్ర పరిస్థితిని ఇది సూచిస్తోంది. ఆమె ఏమి ఆలోచిస్తూ ఉంటుంది?

ఇ) నాగసాకి మీద అణు బాంబు; ఈ బాంబు ప్రభావాన్ని తెలియచేసే ఫోటోలు ఈ అధ్యాయం చివరలో ఉన్నాయి.

ఈ) రష్యాలో బోల్షివిక్ విప్లవాన్ని సూచిస్తూ 1920లో కుస్తోదీవ్ వేసిన చిత్రం. చిత్రకారుడు ఏం చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడు? పెద్ద ఆకారంలో ఉన్న ఆ వ్యక్తి ఎవరు?

ఉ) 1929లో జర్మనీలో వెలువడిన వ్యంగ్య చిత్రం. దాని కింద 'యూదుల నుంచి కొనండి, మీ ప్రజలకు ద్రోహం చెయ్యండి' అనే వ్యాఖ్యానం ఉంది. ఇది ఏ వివక్షతా ధోరణిని చూపిస్తోంది?



## ప్రపంచ యుద్ధాలు: కొన్ని ప్రతికూలమైన వాస్తవాలు

20వ శతాబ్దపు ఆరంభంలో ప్రపంచం పాశ్చాత్య పారిశ్రామిక అభివృద్ధి దేశాలుగా (బ్రిటన్, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, జపాను, మొదలైనవి), ఆఫ్రికా, ఆసియాలకు చెందిన వలస పాలిత దేశాలుగా విభజింపబడి ఉంది. వలసపాలిత ప్రాంతాలు ఆరంభం నుండి స్వాతంత్ర్యం కోసం పోరాటాలు మొదలుపెట్టాయి. అయితే పారిశ్రామిక దేశాలు ఒకదానితో ఒకటి గొడవలు పడుతూ రెండు బృందాలుగా చీలిపోయి (జర్మనీ–ఆస్ట్రియా–హంగరీ, బ్రిటన్–ఫ్రాన్స్–రష్యా) ప్రపంచ ఆధిపత్యం కోసం, తద్వారా వలసప్రాంతాలు, మార్కెట్లపై ఆధిపత్యం కోసం పోటీపడసాగాయి. మొదటి ప్రపంచ యుద్ధం 1914లో మొదలయ్యింది – తూర్పున జపాను, చైనా నుంచి పడమరన అమెరికా వరకు దాదాపు అన్ని దేశాలు దీంట్లో పాల్గొనటంతో అది నిజంగా ప్రపంచ యుద్ధమే. 1918లో జర్మనీ దాని మిత్ర దేశాల ఓటమితో, బ్రిటన్, ఫ్రాన్స్‌ల గెలుపుతో అది ముగిసింది. శాంతికోసం విధించిన షరతులు వాస్తవానికి 1939–1945 మధ్య మరింత ప్రమాదకరమైన యుద్ధానికి పునాదులు వేశాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో కూడా ఒకవైపున జర్మనీ దాని మిత్రదేశాలైన జపాను, ఇటలీ వంటివి ఉండగా మరొకవైపు బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, రష్యా, అమెరికాలు ఉన్నాయి. జర్మనీ దాని మిత్రదేశాల ఓటమితో యుద్ధం ముగిసింది, కానీ అప్పటికే యుద్ధంలో పాల్గొన్న దేశాలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి.

### మరణాలు, విధ్వంసం

ప్రపంచం అప్పటివరకు చూసిన యుద్ధాలకంటే రెండు ప్రపంచ యుద్ధాలు భిన్నమైనవి. అంతకు ముందు కనీ, వినీ ఎరుగనంత మరణాలు, విధ్వంసాలు సంభవించాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోటి మంది చనిపోయారు. (దీంట్లో బ్రిటన్ తరఫున పోరాడి ఆఫ్రికా, యూరపులో చనిపోయిన 75,000 భారతీయ సైనికులు కూడా ఉన్నారు.) రెండవ ప్రపంచ యుద్ధ పరిణామాలు మరింత తీవ్రంగా ఉన్నాయి. దీని వల్ల 2.2–2.5 కోట్ల సైనికులు చనిపోయారు. అంతేకాకుండా సుమారుగా 4–5.2 కోట్ల పౌరులు కూడా చనిపోయారు. దీంట్లో హోలోకాస్ట్‌లో చనిపోయిన 60 లక్షల యూదులు, జపానులోని నాగసాకి, హీరోషిమాలపై అమెరికా వేసిన అణుబాంబు వల్ల వెంటనే చనిపోయిన 1,50,000 నుంచి 2,46,000 పౌరులు ఉన్నారు. ఈ అణుబాంబుల వల్ల ల్యుకీమియా, క్యాన్సర్ వంటి సమస్యలు దశాబ్దాల పాటు కొనసాగాయి.

**యుద్ధ మరణాలు 1500 - 1999**




*గ్రాఫ్ 1 యుద్ధ మరణాలు 1500 – 1999*
*యుద్ధ మరణాలు, మిలియన్లలో ప్రతి వెయ్యిమందికి మరణాలు*

*ప్రతి శతాబ్దానికి యుద్ధాల వల్ల ఆ శతాబ్ద జనాభాలో ప్రతి వెయ్యిమందిలో ఎంతమంది చనిపోయారో తెలియచేస్తుంది. అంటే 16వ శతాబ్దంలో ప్రతి వెయ్యిమందికి నలుగురు కంటే తక్కువమంది చనిపోగా చివరి శతాబ్దంలో అది 44 మందికి పెరిగింది – అంటే సుమారు 4.5% ప్రజలు!*

అంతకు ముందు దేశాల మధ్య జరిగిన యుద్ధాలు ఇంకా ఎక్కువ కాలంపాటు కొనసాగి ఉండవచ్చు. అయితే 20వ శతాబ్దంలో మాదిరి అవి భౌగోళికంగా అంతటా విస్తరించలేదు, అంత ప్రాణ నష్టానికి దారి తీయలేదు.

- తెలుసుకోండి: భారతదేశం – పాకిస్తాన్‌ల మధ్య 1971లో యుద్ధం ఎంతకాలం కొనసాగింది? ఈ యుద్ధంలో ఎంతమంది చనిపోయారు?

## అధికార కేంద్రాలు

ఈ కాలం గురించి రెండవ వాస్తవం ప్రపంచం జాతీయ రాజ్యాలుగా విభజింపబడి ఉండడం. ఈ దేశాలు అధికార కేంద్రాలుగా విడిపోయి, కూటములుగా ఏర్పడి పరస్పర విరుద్ధ యుద్ధ శిభిరాలుగా మారాయి. ఇంతకు ముందు తరగతిలో మీరు 19వ శతాబ్దంలో తలెత్తిన జాతీయతావాదం గురించి, దాని ఆధారంగా ఏర్పడిన దేశాలు, వాటికై జరిగిన ఉద్యమాల గురించి చదివారు. జాతీయ రాజ్యాలుగా ఏర్పడే ప్రక్రియతో, పారిశ్రామిక దేశాలు ప్రపంచంపై మరింత ఆధిపత్యం కోసం దౌత్యంతో పోటీని పెంచాయి. ఈ జాతీయ ప్రయోజనాలను కాపాడుకోటానికి ఈ దేశాలు సైన్యాన్ని పెంచుకోసాగాయి. 19వ శతాబ్దం చివరి నాటికి యూరపులోని వివిధ దేశాలు ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని కూటములుగా విడిపోయాయి. అంతిమంగా రెండు ప్రధాన కూటములు ఏర్పడ్డాయి – కేంద్ర రాజ్యాల కూటమి, మిత్ర రాజ్యాల కూటమి. ఇవి ప్రాంతాల మీద ఆధిపత్యం కోసం, అధికారం కోసం పోటీని సూచిస్తున్నాయి. ఈ పోటీ ఫలితంగా గతంలో శత్రువులైన ఆస్ట్రియా–ఇటలీల మధ్య, లేదా బ్రిటన్–ఫ్రాన్స్‌ల మధ్య అభద్రతా భావం పెరిగి రహస్య ఒడంబడికలకు దారి తీసింది.

ఇదే విధమైన కూటములు రెండవ ప్రపంచ యుద్ధం కాలంలోనూ కొనసాగాయి – అక్ష/కేంద్ర రాజ్యాల కూటమికి జర్మనీ నాయకత్వం వహించగా, మిత్రరాజ్యాల కూటమికి బ్రిటన్, అమెరికా, రష్యాలు నాయకత్వం వహించాయి.

*కాల పట్టిక*

| | |
|---|---|
| *మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం, ఆగస్టు 1* | *1914* |
| *రష్యా విప్లవం* | *1917* |
| *మొదటి ప్రపంచ యుద్ధం ముగింపు* | *1918* |
| *వర్సయిల్స్ ఒప్పందం* | *1919* |
| *నానాజాతి సమితి ఏర్పాటు* | *1919* |
| *జర్మనీలో హిట్లర్ ప్రాభవం* | *1933* |
| *రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభం* | *1939* |
| *రష్యాపై జర్మన్ దండెత్తటం* | *1942* |
| *ఐక్యరాజ్యసమితి ఏర్పాటు* | *1945* |
| *రెండవప్రపంచయుద్ధంముగింపు,ఆగస్టు* | *1945* |

## రెండు ప్రపంచ యుద్ధాలకు కారణాలు – పోలికలు, తేడాలు

ఏ రెండు సంఘటనలూ ఒకేరకంగా ఉండవు. 20వ శతాబ్దంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు సదృశ్యమైనవి కావు. వీటి మధ్య 21 సంవత్సరాల వ్యవధి ఉంది. అంతే కాకుండా ఆర్థిక పరిస్థితులు, దౌత్యపరమైన కూటములు, ఆయుధ సామగ్రి వంటి వాటిలో ఎన్నో తేడాలు ఉన్నాయి. అయితే ఈ రెండు ప్రపంచ యుద్దాల మధ్య తేడాలను తెలుసుకోవటానికి వాటిని పోల్చటం ఉపయోగకరంగా ఉంటుంది. ముందుగా యుద్ధాలు చెలరేగటానికి తక్షణ కారణాలను చూసిన తరువాత రెండు ప్రపంచ యుద్ధాలకు ప్రధాన కారణాలను పరిశీలిద్దాం.

ప్రతి యుద్ధానికి దీర్ఘకాలంగా మసులుతున్న కారణాలతో పాటు యుద్ధానికి కారణమైన తక్షణ కారణాలు కొన్ని ఉంటాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి తక్షణ కారణం 1914 జూన్ 28న ఆస్ట్రియాకు చెందిన ఆర్చ్‌డ్యూక్ ఫ్రాంజ్ ఫెర్డినాండ్ ఒక సెర్బియన్ ఉన్మాది చేతిలో

హత్యకావింపబడటం. దీంతో సెర్బియాపై ఆస్ట్రియా యుద్ధం ప్రకటించింది. బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా కూటమిలో సెర్బియా ఉండటం వల్ల ఆస్ట్రియా దండెత్తటంతో సెర్బియాకి మద్దతుగా ఆ దేశాలు వచ్చాయి. దాంతో ఆస్ట్రియా పక్షాన ఉన్న జర్మనీ, ఇటలీలు కూడా యుద్ధంలో చేరటంతో మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యింది.

అదే విధంగా రెండవ ప్రపంచ యుద్ధం 1939 సెప్టెంబరు 1న డాంజింగ్ రేవును జర్మనీకి అప్పగించటానికి పోలాండ్ నిరాకరించటం తక్షణ కారణ. ఆ వెంటనే పోలాండ్‌లోకి ప్రవేశించి, శిక్షించటానికి జర్మనీ యుద్ధ ట్యాంకులు, హిట్లర్ సేనలు దండెత్తాయి. జర్మనీలోని రెండు భాగాల మధ్య పోలిష్ ప్రాంతం ఉంది. పోలాండ్‌ను స్వాధీనం చేసుకోవటం చిన్న సైనిక చర్య అవుతుందని హిట్లర్ భావించాడు. కానీ పోలాండ్‌కు బ్రిటన్‌తో సైనిక ఒప్పందం ఉండటంతో పోలాండ్ పక్షాన అది యుద్ధంలో చేరింది, రెండవ రోజు ఫ్రాన్స్ కూడా యుద్ధంలో చేరింది. దీనితో రెండవ ప్రపంచ యుద్ధం మొదలయ్యింది.

ఇప్పుడు, ఈ రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీసిన దీర్ఘకాలిక కారణాలను చూద్దాం. మొదటి ప్రపంచ యుద్ధానికి 19వ శతాబ్దం నుంచే రంగం సిద్ధమౌతోంది. దురహంకారపూరిత జాతీయతావాదం, సామ్రాజ్యవాదం, రహస్య ఒప్పందాలు, సైనిక వాదం మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసిన మూడు ప్రధానమైన కారణాలు. ఇవే కారణాలు ప్రపంచాన్ని మరో యుద్ధం వైపుకి నెట్టాయి. అయితే రెండవ ప్రపంచ యుద్ధానికి మరికొన్ని దీర్ఘకాల కారణాలు తోడయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధ పరిణామాల పట్ల జర్మనీ అసంతృప్తి చెంది ఉండటం వీటిలో ఒకటి. ఈ దీర్ఘకాల కారణాలేవో ఒకటొకటిగా చూద్దాం.

### దురహంకారపూరిత జాతీయతావాదం

జాతీయతావాదం అనే భావజాలం ఒక మంచి ప్రేరేపణ. ఆధునిక జాతీయ రాజ్యాలు ఏర్పడటానికి, జర్మనీ, ఇటలీల ఏకీకరణకు ఇది కారణం అయ్యింది. అయితే ఈ భావజాలం తమ పట్ల గర్వాన్ని, ఇతరుల పట్ల ద్వేషాన్ని కలిగించటానికి కూడా వాడుకున్నారు. యూరపులోని దేశాల మధ్య ఈ ద్వేషం 19వ శతాబ్దంలో క్రమేపీ పెరుగుతూ వచ్చింది.

1923 నుంచి ఇటలిలో ఫాసిజం, జర్మనీలో నాజీజం రెండూ కూడా విధ్వంసకర రూపంలోని దురహంకారపూరిత జాతీయతావాదాలు. ఫాసిస్టులు దురహంకారపూరిత జాతీయతావాదాన్ని రెచ్చగొట్టి, ప్రపంచాన్ని జర్మనీ విజేతగా పాలిస్తుందన్న చిత్రాన్ని చూపించి యూరపులోని ఇతర దేశాలకు వ్యతిరేకంగా జర్మన్ ప్రజలను సమీకరించసాగారు.

### సామ్రాజ్యవాదం

బ్రిటన్, జర్మనీ వంటి ఐరోపా దేశాలలోనూ, అమెరికాలోనూ పారిశ్రామిక మూలధనం అభివృద్ధి చెందటంతో, తమ ఉత్పత్తులకు మార్కెటు, ముడి సరుకులకు అందుబాటు అవసరమయ్యాయి. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో పెట్టుబడి మరింతగా పోగు బడటంతో వలస ప్రాంతాలలో పెట్టుబడి పెట్టే అవకాశాల



*చిత్రం 13.3 : చరిత్రలో మొదటిసారి మొదటి ప్రపంచ యుద్ధంలో బాంబులు వెయ్యటానికి విమానాలను ఉపయోగించారు.*

**గ్రాఫ్ : 2 ఆయుధ పోటీ**




*1880–1914 మధ్య ప్రధాన శక్తులైన జర్మనీ, ఆస్ట్రియా–హంగరీ, బ్రిటన్, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్‌ల సైనిక ఖర్చు (మూలం: టైమ్స్ ప్రపంచ చరిత్ర అట్లాసు,లండన్, 1978)*

కోసం చూడసాగారు. దాంతో 19వ శతాబ్దం ముగిసేనాటికి ఐరోపా శక్తుల మధ్య వలసప్రాంతాల కోసం పోటీ మొదలయ్యింది. ఆయా దేశాల ప్రభుత్వాలు తమ పెట్టుబడిదారుల తరఫున తమ అధీనంలోని ప్రాంతాలను పెంచి, వాళ్ల పోటీదారుల ప్రాభవాన్ని తగ్గించటానికి వివిధ చర్యలకు పూనుకున్నాయి. కొత్త పారిశ్రామిక శక్తులు (జపాను, జర్మనీ, ఇటలీ వంటివి) ఏర్పడటంతో ఇవి వలస ప్రాంతాలను తిరిగి విభజించాలని కోరుకున్నాయి. అయితే పాత శక్తులు దీనికి సిద్ధంగా లేవు. ఇది తీవ్ర ఒత్తిడులకు, తరచు యుద్ధాలకు కారణం అవుతుండేది.

## రహస్య ఒప్పందాలు

1870లో ఫ్రాన్స్‌ని ఓడించిన తరువాత జర్మనీ ఛాన్సలర్ అయిన బిస్మార్క్ దానిని ఒంటరిని చెయ్యాలని చూసాడు. దీనికి అనుగుణంగా అతడు ఆస్ట్రియాతో 1879లోనూ, ఇటలీతో 1882లోనూ రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. ఈ రక్షణ ఒప్పందంలో ఒక అంశం రష్యానుంచి ఆస్ట్రియాని, ఫ్రాన్స్‌నుంచి ఇటలీని కాపాడటం. అయితే ఫ్రాన్స్ ఏకాకి కాకుండా1891లో రష్యాతోనూ, కొన్ని చికాకులు తొలగించిన తరువాత 1904లో బ్రిటన్‌తో సంబంధాలు కుదుర్చుకుంది. 1907లో రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు మూడు మిత్ర దేశాల కూటమిగా ఏర్పడ్డాయి. జర్మనీ త్రైపాక్షిక కూటమి, ఫ్రాన్స్ మిత్రరాజ్యాల వల్ల ఐరోపా దేశాలు ఒకదానినొకటి శంకించసాగాయి, ఈర్ష్య పడసాగాయి. ఈ కూటములు నిజమైన శాంతికి దారి తియ్యలేదు, అందుకు విరుద్ధంగా యూరపులో 'సాయుధ శాంతి', భయ వాతావరణం నెలకొన్నాయి.

- పారిశ్రామికీకరణ ఆధునిక యుద్ధాలకు ఎలా దారి తీసింది?
- తమ దేశం పట్ల ప్రజలకు ఉన్న ప్రేమ ఇతర దేశాలతో యుద్ధానికి దారి తీస్తుందా?
- ఒక దేశం రెండవ దేశంతో దురహంకార పూరితంగా ప్రవర్తిస్తే, రెండవదేశం కూడా అదే విధంగా స్పందించాలా? సమస్య పరిష్కారానికి ఇతర మార్గాలు ఏమున్నాయి?
- దురహంకారపూరిత జాతీయతావాదం, సామ్రాజ్య వాదం, అధికార కేంద్రాలు, మిలటరీవాదం ఇప్పుడు కూడా ఉన్నాయా? ఉదాహరణలతో తరగతిలో చర్చించండి.
- గత పది సంవత్సరాలలో జరిగిన కొన్ని యుద్ధాల గురించి తెలుసుకొని వాటికి పై నాలుగు కారణాలు ఎంతవరకు దోహదం చేశాయో చూడండి.

## సైనికవాదం

భద్రతకు సైనిక శక్తి మంచి మార్గమని, సమస్యల పరిష్కారానికి యుద్ధమే సరైన విధానమని నమ్మటాన్ని సైనికవాదం అంటారు. 1880 నుంచి 1914 నాటికి ఆరు ప్రధాన శక్తుల (జర్మనీ, రష్యా, ఆస్ట్రియా, ఇటలీ, ఫ్రాన్స్, బ్రిటన్) సైనిక ఖర్చు 300 శాతానికి పైగా అంటే 132 మిలియన్ పౌండ్ల నుంచి 397 మిలియన్ పౌండ్లకు పెరిగింది. సైనికవాద నేపథ్యంలో మూడు ముఖ్యమైన విషయాలను గమనించాలి. ఈ దేశాలు పెద్ద సంఖ్యలో శాశ్వత సైన్యాన్ని పెంచాయి, ఆయుధాలు సమకూర్చుకోవటంలో ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయి, తమ ప్రజలను మానసికంగా యుద్ధానికి సంసిద్ధం చేశాయి. ఆయుధాలను ఉత్పత్తిచేసే పెద్ద పారిశ్రామిక సంస్థలు ఆవిర్భవించి దౌత్య సమస్యల పరిష్కారానికి యుద్ధాన్ని ఉపయోగించటాన్ని ఇవి ప్రోత్సహించాయి. సాధారణంగా యుద్ధాల వల్ల వాళ్ల లాభాలు ఎన్నో రెట్లు పెరిగాయి.

## రెండవ ప్రపంచ యుద్ధానికి దోహదం చేసిన ప్రత్యేక అంశాలు

### వర్సయిల్స్ ఒప్పందం

మొదటి ప్రపంచ యుద్ధం 1919లో వర్సయిల్స్ శాంతి సమావేశంతో ముగిసింది. ప్రపంచంలో నాల్గింట మూడు వంతుల జనాభాకు ప్రాతినిధ్యం వహించిన 32 దేశాల ప్రతినిధి బృందాలు హాజరయిన అతి పెద్ద సమావేశం ఇది. యుద్ధంలో విజేతలైన అతి పెద్ద అయిదు దేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపానులు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. అయితే సోషలిస్టు రష్యాతో పాటు ఓటమిపాలైన జర్మనీ, ఆస్ట్రియా, టర్కీ వంటి దేశాలను ఈ సమావేశానికి ఆహ్వానించలేదు. దాంతో ప్రపంచ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్న వాళ్లు ఈ దేశాల సలహాలు, భావాలను పరిగణనలోకి తీసుకోలేకపోయారు. దీనివల్ల వర్సయిల్స్ ఒప్పందం తమపై బలవంతంగా రుద్దబడిందనీ, దానిని గౌరవించాల్సిన బాధ్యత తమపై లేదని జర్మనీ భావించటం ఆశ్చర్యం కలిగించదు. జర్మనీని బలహీన పరచటానికి వర్సయిల్స్ ఒప్పందం దాని మీద సైనిక కోతలను, భౌగోళిక పరిమితులను విధించింది. ముందుగా1880లలో ఆక్రమించుకున్న ఆఫ్రికాలోని వలసప్రాంతాలను, ఫ్రాన్స్‌నుంచి 1871లో స్వాధీనం చేసుకున్న ఆల్సాస్, లోరైన్ వంటి ఐరోపా ప్రాంతాలను జర్మనీ వదులుకునేలా చేశారు. తరువాత, మొదటి ప్రపంచయుద్ధ సమయంలో 9,00,000 సైనిక బలగాన్ని 1,00,000కి తగ్గించుకోమన్నారు. అదేవిధంగా జలాంతర్గాములు ఉండకూడదని, ఒక్కొక్కటి డజను టార్పిడో పడవలు, వినాశకారులతో 10,000 టన్నులలోపు ఉండే ఆరు యుద్ధనౌకలకు మించని నావికా దళం ఉండాలని నిర్దేశించారు.



*చిత్రం 13.4 : హిట్లర్‌ని శాంతి, యుద్ధ కాముకుడిగా చూపించిన వ్యంగ్య చిత్రం*

### నానాజాతి సమితి

భవిష్యత్తులో యుద్ధాలను నివారించటానికి వర్సయిల్స్ ఒప్పందం నానాజాతి సమితిని ఏర్పాటు చేసింది. ఈ కూటమిలో చేరటానికి రష్యా, జర్మనీలను ఆహ్వానించలేదు. కూటమి ఏర్పడటంలో అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ చురుకైన పాత్ర పోషించినప్పటికీ అతని ప్రతిపాదనను అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఆమోదించటానికి తిరస్కరించటంతో అది కూడా సభ్యత్వం పొందలేదు. దీని ఫలితంగా ఈ కూటమిలో, దాని అత్యున్నత దశయైన 1934లో కూడా 58 మంది సభ్యులే ఉన్నారు. 'ఉమ్మడి భద్రత' ద్వారా,

చర్చలు, సంప్రదింపులతో దేశాల మధ్య విభేదాలను పరిష్కరించుకోవటం ద్వారా యుద్ధాలు రాకుండా చెయ్యవచ్చని ఆశించారు. ఆరోగ్యం, కార్మిక సంక్షేమం వంటి సంక్షేమ కార్యక్రమాల కోసం అనేక అంతర్జాతీయ సంస్థలను నానాజాతి సమితి ఏర్పాటు చేసింది. దేశాల మధ్య వివాదాల పరిష్కారం కోసం అంతర్జాతీయ న్యాయస్థానాన్ని కూడా ఏర్పాటు చేసింది. నానాజాతి సమితిపైన చాలా ఆశలు పెట్టుకున్నారు, అది ఎంతో సాధిస్తుందని ఆశించారు. కానీ అంతర్జాతీయ ఒప్పందాలను ఉల్లంఘించకుండా, ఇతర దేశాలపై దండెత్తకుండా జర్మనీ, ఇటలీలను ఇది నివారించలేకపోయింది.

- నానాజాతి సమితిలో ఏర్పడిన అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్ఓ), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఓ) వంటివి ఈనాటికీ పనిచేస్తున్నాయి. వాటి కార్యక్రమాల గురించి తెలుసుకుని వాటిల్లో ఒకదాని గురించి ఒక నివేదిక తయారుచేయండి.
- 1919లో గెలిచిన దేశాలు జర్మనీపట్ల అంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించి ఉండకపోతే రెండవ ప్రపంచ యుద్ధం వచ్చి ఉండేదా?

## ప్రతీకార పెత్తందారీతనం: జర్మనీ సవాలు

1919 చివరిలో మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోవటంతో యుద్ధాన్ని మొదలుపెట్టినందుకు జర్మనీని శిక్షించాలని, మళ్లీ కోలుకోకుండా దెబ్బతీయాలని గెలుపొందిన మిత్రదేశాలు భావించాయి. వర్సయిల్స్ ఒప్పందం తమపై విధించిన షరతులు తమను బానిసత్వంలోకి నెడుతున్నాయని జర్మనీవాసులు భావించారు. దీంతో జర్మనిలో ప్రతిస్పందన ఏర్పడి హిట్లరు, అతడి నాజీపార్టీ ప్రాభవంలోకి వచ్చాయి. వర్సయిల్స్ ఒప్పందం వల్ల తాము కోల్పోయిన ప్రాంతాలను తిరిగి సాదించుకోవాలని, మధ్య యూరపుపై జర్మనీ తిరిగి ఆధిపత్యం పొందాలని, జర్మను ఆయుధాలపై ఉన్న పరిమితులకు అంతం పలకాలని వాళ్లు కోరుకున్నారు. నాజీల కింద జర్మనీ తిరిగి వేగంగా పారిశ్రామికీకరణ చెందింది, యుద్ధం వల్ల మాత్రమే ఉపయోగంలోకి వచ్చే ఆయుధ పరిశ్రమను, అతి పెద్ద సైన్యాన్ని నిర్మించుకుంది.



చిత్రం 13.5 : 1940ల నాటి డచ్ గోడపత్రం : 'నాగరికతా లేక ఆటవికతా' ......

## సామ్యవాదం, రష్యాపట్ల భయాలు

మొదటి ప్రపంచ యుద్ధ తీవ్ర పరిణామాల వల్ల యూరపు అంతటా సామాజిక కల్లోలం ఏర్పడింది. కార్మికులు సామ్యవాదం, కమ్యూనిజం భావాల వల్ల ప్రభావితులు కాసాగారు. యూరపు అంతటా శాంతి ఉద్యమాలు గొప్ప ప్రజాదరణ పొందాయి. రష్యాలో 1917లో విప్లవం సంభవించి అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. యుద్ధంలో రష్యా భాగస్వామ్యాన్ని ఉపసంహరించుకుని శాంతి చర్చలు చేపట్టటం కొత్త ప్రభుత్వం చేపట్టిన తొలి చర్యలలో ఒకటి. (రష్యా 1924లో సోవియట్ సోషలిస్టు దేశాల సమాఖ్యగా – యుఎస్ఎస్ఆర్‌గా మారింది.) బ్రిటన్ వంటి పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలు యూరపులోని ఇతర దేశాలలో కూడా ఇలాంటి విప్లవాలే సంభవిస్తాయని భయపడి సోవియట్ సోషలిజానికి వ్యతిరేకశక్తిగా ఉంటుందని హిట్లర్, నాజీలు బలపడటాన్ని మొదట్లో బలపరిచాయి. హిట్లర్‌ని 'సంతృప్తి పరచటం' అనే విధానాన్ని అవలంబించాయి.

అయితే 1939లో జర్మనీ, రష్యా పరస్పరం దండెత్తకుండా ఉండటానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. బ్రిటన్, ఫ్రాన్స్ కూటమికి వ్యతిరేకంగా హిట్లర్ నిలిచాడు. ఇది రెండవ ప్రపంచ యుద్ధానికి కారణమయ్యింది. పశ్చిమ యూరపు ఖండంలోని అధికభాగంపై హిట్లర్ తన ఆధిపత్యాన్ని నెలకొల్పగలిగాడు. 1942లో హిట్లరు రష్యాపై దండెత్తాలని నిర్ణయించుకున్నాడు. అదే సంవత్సరంలో జర్మనీ మిత్ర దేశమైన జపాను అమెరికాపై దాడి చేసింది. దాంతో జర్మనీకి వ్యతిరేకంగా యుద్ధంలో అమెరికా, రష్యా కూడా భాగస్వాములయ్యాయి.



*పటం 1 : రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ సామ్రాజ్యం*

## ప్రపంచ యుద్ధాల పరిణామాలు

ప్రపంచ రాజకీయాలు, సమాజం, ఆర్థికవ్యవస్థపై ప్రపంచ యుద్ధాలు దీర్ఘకాలం ఎలా ప్రభావం చేశాయో ఇక్కడ పరిశీలిద్దాం.

### అసంఖ్యాక ప్రాణ నష్టం

ప్రపంచ యుద్ధాల కారణంగా ఎంతోమంది చనిపోయారు, గాయపడ్డారు. ఇంతకు ముందు పేర్కొన్నట్టుగా మొదటి ప్రపంచ యుద్ధంలో దాదాపు కోటిమంది, రెండవ ప్రపంచ యుద్ధంలో 2-2.5 కోట్లమంది చనిపోయారు. చనిపోయిన వాళ్లల్లో అధిక శాతం 40 ఏళ్లలోపు పురుషులే. ఈ రెండు యుద్ధాల వల్ల మారణాయుధాల పోటీ ప్రత్యేకించి అణు బాంబులు, రసాయనిక ఆయుధాల పోటీ పెరిగింది. ఇటువంటి ఆయుధాలు ప్రమాదవశాత్తు పేలిపోయినా పూర్తి వినాశనం, మానవ నష్టం జరిగే ముప్పు భయంతో ప్రపంచం ఈనాటికీ జీవిస్తూ ఉంది.

## ప్రజాస్వామ్య సూత్రాల పునరుద్ధాటన

అప్రజాస్వామిక ప్రభుత్వాల వల్ల ప్రమాదాలు ఏమిటో ప్రపంచ యుద్ధాలు తెలియచేయటంతో అధికారం ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. మొదటి ప్రపంచ యుద్ధంతోపాటే అనేక సామ్రాజ్యాలు (ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యం, రష్యన్ సామ్రాజ్యం, ఓట్టోమాన్ సామ్రాజ్యం, జర్మన్ సామ్రాజ్యం) అంతం అయ్యాయి. రష్యా వంటి దేశాలలో సోషలిస్టు విప్లవాలు సంభవించగా జర్మనీ వంటి దేశాలు రాచరికం నుంచి బయటపడి వైమర్ గణతంత్రంగా ఏర్పడ్డాయి. టర్కీలో ఓట్టోమాన్ సామ్రాజ్యం స్థానంలో ప్రజాస్వామ్య, లౌకిక ప్రభుత్వం ఏర్పడింది. అదేవిధంగా మొదటి ప్రపంచయుద్ధ కాలంలో వలసపాలిత ప్రాంత ప్రజల కోరిక మేరకు వలస ప్రాంతాల్లో స్వయం పరిపాలన ఆవశ్యకతను సిద్ధాంతరీత్యా వలస పాలక దేశాలు గుర్తించాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత వలసపాలన అంతమయ్యే ప్రక్రియ మొదలు కావటంతో ఆసియా, ఆఫ్రికా ఖండాలలో పదుల సంఖ్యలో వలసపాలిత దేశాలు స్వాతంత్ర్యం పొంది కొత్త దేశాలుగా ఏర్పడ్డాయి.

## అధికార సమతౌల్యంలో మార్పు

మొదటి ప్రపంచ యుద్ధం ముగియటంతో జర్మన్, ఆస్ట్రో–హంగేరియన్, రష్యన్, టర్కిష్ సామ్రాజ్యాలు కూడా అంతమయ్యాయని తెలుసుకున్నాం. మధ్య, తూర్పు యూరపు ప్రాంతం జాతీయత, ఆర్థిక మనుగడ, సైనిక భద్రత వంటివాటి ఆధారంగా తిరిగి విభజింపబడింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగియటంతో ఒకప్పుడు వలస ప్రాంతాలుగా ఉన్న దేశాలు స్వాతంత్ర్యం పొందటంతో ప్రపంచ పటం రూపురేఖలు మరొకసారి మారాయి.

## కొత్త అంతర్జాతీయ సంస్థలు

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత విభేదాల వల్ల శాంతియుత పరిష్కారం కోసం నానాజాతి సమితి ఏర్పడింది, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐక్య రాజ్య సమితి (యుఎన్ఓ) ఏర్పడింది. ఐక్య రాజ్య సమితి నాలుగు సిద్ధాంతాల ఆధారంగా ఏర్పడిన ప్రపంచ ప్రభుత్వం లాంటిది: శాంతిని నెలకొల్పటం, మానవ హక్కులను కాపాడటం, అంతర్జాతీయ చట్టాలను గౌరవించటం, సామాజిక ప్రగతిని ప్రోత్సహించటం. బాలల అత్యవసరనిధి (యునిసెఫ్), విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో), ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ), కార్మిక సంస్థ (ఐఎల్ఓ) వంటి సంస్థల ద్వారా ఇది పని చేస్తుంది. వీటిలో కొన్నింటి గురించి మీరు విని



*చిత్రం 13.6 : అణు బాంబు వేయటానికి ముందు, వేసిన తరువాత నాగసాకి పట్టణం*

ఉంటారు, వాటి పని తీరు కూడా చూసి ఉంటారు. అమెరికా, రష్యా వంటి పెద్ద దేశాల చేతిలో ఐక్యరాజ్యసమితి కీలుబొమ్మగా మారిందన్న అపవాదులు ఉన్నప్పటికీ రెండవ ప్రపంచ యుద్ధస్థాయి యుద్ధాలు సంభవించకుండా నిలువరించగలిగింది.

### మహిళలకు ఓటు హక్కు

ఓటు హక్కు వంటి రాజకీయ హక్కుల కోసం సుదీర్ఘ పోరాటం తరువాత 1918లో బ్రిటిష్ మహిళలకు ఓటు హక్కు లభించింది. ప్రపంచ యుద్ధాల మాదిరి దీర్ఘకాలంపాటు జరిగే యుద్ధకాలంలో పారిశ్రామిక ఉత్పత్తి, ఇతర సేవలు కొనసాగవలసిన అవసరం ఉంది. మగవాళ్లు యుద్ధభూమిలో ఉండటంతో ఫ్యాక్టరీలు, దుకాణాలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సేవలు, ఆసుపత్రులు, పాఠశాలల వంటి వాటిలో మహిళలు పనిచేయాల్సి వచ్చింది. సంపాదనపరులు కావటంతో పెరిగిన ఆత్మవిశ్వాసంతో జీవితంలోని అన్ని అంశాలలో మహిళలు సమానత్వాన్ని కోరసాగారు. ఆ దిశలో ఓటు హక్కు లభించటం అనేది ఒక పెద్ద ముందడుగు.

### కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం | మైత్రీ ఒప్పందాలు | | |
| దురహంకారపూరిత జాతీయతావాదం | సైనికవాదం | ఫాసిజం | సామ్రాజ్యవాదం |

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. తప్పు వాక్యాలను సరిచేయండి.
   - ★ 20వ శతాబ్ద ఆరంభంలో ప్రపంచదేశాల మధ్య తేడాలు పాశ్చాత్య దేశాలు, మిగిలిన దేశాలుగా వ్యక్తమయ్యాయి.
   - ★ ప్రజాస్వామ్యం పుంజుకోవటంతో పాటు కొన్ని నియంతృత్వ ధోరణులను, కొత్త సామ్రాజ్యాలు ఏర్పడటాన్ని 20వ శతాబ్దం చూసింది.
   - ★ సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న సిద్ధాంతాల పునాదిపై సోషలిస్టు సమాజాలు ఏర్పడ్డాయి.
   - ★ యుద్ధంలో పాల్గొన్న దేశాల సైనికులే కాకుండా వివిధ దేశాల సైనికులు పోరాటాలలో ఉన్నారు.
   - ★ మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో, లేదా ఆ తరువాత అనేక దేశాలు రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దేశాలుగా మారాయి.
2. ప్రపంచ యుద్ధాలలో మిత్ర రాజ్యాల, అక్ష రాజ్యాల, కేంద్ర రాజ్యాల కూటములలో భాగస్వాములైన దేశాలతో కూడిన పట్టికను తయారు చేయడం: ఆస్ట్రేలియా, యు.ఎస్.ఎస్.ఆర్.(రష్యా), జర్మనీ, బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, యు.ఎస్.ఐ.
3. ప్రపంచ యుద్ధాలలో జాతీయ రాజ్యాలు, జాతీయతా భావం యుద్ధ కాంక్షను ఎలా ప్రభావితం చేశాయి?
4. రెండు ప్రపంచ యుద్ధాల కారణాల మీద క్లుప్తంగా రాయండి. ప్రపంచంలో ఏదైనా దేశాలలో ఈనాటికీ ఈ అంశాలు ఏమైనా ఉన్నాయా? ఏ రూపంలో?
5. 20వ శతాబ్దపు ప్రథమ అర్ధభాగంలో యుద్ధాల యొక్క వివిధ ప్రభావాలు ఏమిటి?

పాఠం 14

# ప్రపంచ యుద్ధాల మధ్య ప్రపంచం 1900-1950 : భాగం - II

## రష్యాలో సోషలిస్టు విప్లవం

జార్‌ల పాలనలో రష్యా రెండు ఖండాలలో విస్తరించి యూరో ఆసియా శక్తిగా విశాల సామ్రాజ్యంగా ఉండేది. చైనా, భారతదేశం తరువాత 15.6 కోట్ల జనాభాతో మూడవ అతి పెద్ద దేశంగా ఉండేది. దీనిలో రష్యా, ఉక్రేయిన్, ఉజ్బెకిస్తాన్, కజకస్తాన్, తజికిస్తాన్, తుర్క్మేనియా వంటి పలు దేశాలు ఉండేవి. రష్యన్లలో అధిక శాతం వ్యవసాయంతో జీవనోపాధి పొందేవారు. భూమిపై నియంత్రణ విషయంలో ఫ్యూడల్ భూస్వాములకు, రైతాంగానికీ మధ్య ఘర్షణలు తలెత్తుతూ ఉండేవి. భూముల్లో అధిక భాగం ఫ్యూడల్ భూస్వాముల కింద ఉండేవి, రైతాంగంలో అధిక శాతం తాము సాగు చేస్తున్న భూమికి అద్దె చెల్లించేవాళ్లు.

ఇతర నియంతల మాదిరే జార్ నికొలాస్ II కూడా తన విశాల రష్యా సామ్రాజ్యాన్ని సైన్యం, పాలనాధికారుల సహాయంతో పాలించాడు - అయితే ప్రపంచ యుద్ధం వల్ల రష్యా ఆర్థిక పరిస్థితి పూర్తిగా చిన్నాభిన్నమైపోయింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సైన్యం రష్యాకు ఉండేది. అయితే 1917 నాటికి 20 లక్షల సైనికులు, పౌరులు చనిపోయి మొదటి ప్రపంచ యుద్ధంలో అత్యధిక ప్రాణనష్టం చవిచూసింది. యుద్ధరంగానికి ఆహారాన్ని మళ్లించటం వల్ల పట్టణాల్లో కొరత ఏర్పడింది. 1917 మార్చి 8న సేంట్ పీటర్స్‌బర్గ్ నగరంలో 10,000 మహిళలు నిరసన ఊరేగింపు చేపట్టి 'రొట్టె, శాంతి' కావాలని కోరారు. ఈ నిరసనలో మహిళలతో పాటు కార్మికులు కూడా చేరారు. రాజధానిలోని ఈ నిరసనలతో కంగారు పడిపోయిన జార్ నికొలస్ II నిరసనకారులను అణిచివెయ్యమని, అవసరమైతే కాల్పులు జరపమని ఆదేశించాడు. రెండు రోజుల్లో పరిస్థితి ఎంతగా మారిపోయిందంటే జార్ పరారీ కావటంతో రాచరికానికి చెందని రష్యన్లు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీనినే 1917లో సంభవించిన తొలి రష్యన్ విప్లవం అని లేదా మార్చి విప్లవం అని అంటారు.



*చిత్రం 14.1 : రెడ్‌స్క్వేర్‌లో కవాతు చేస్తున్న బోల్షివిక్కులు, 1917లో రష్యా విప్లవం*

తరువాత ఇంతకంటే పెద్ద విప్లవం అక్టోబరు 1917లో సంభవించింది, ఇది అనుకోకుండా జరిగింది కాదు. జార్ పదవీచ్యుతుడైన తరువాత రష్యాను పాలిస్తున్న ఉదారవాదులు, రాచరిక కుటుంబాల వాళ్లు పితృభూమి గౌరవాన్ని కాపాడటానికి యుద్ధాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. యుద్ధంలో ఓటముల వల్ల, ఆర్థిక కొరతల వల్ల

సామాన్య ప్రజానీకం విసిగిపోయి యుద్ధాన్ని వ్యతిరేకించారు. వాళ్లు సోవియట్లుగా పిలవబడే సంఘాలుగా ఏర్పడ్డారు. సైనికులు, పారిశ్రామిక కార్మికులు, గ్రామీణప్రాంత ప్రజలు కూడా ఏర్పరిచిన సోవియట్లు సాధారణ ప్రజల శక్తిని వెల్లడి చేసాయి. రష్యా కమ్యూనిస్టు పార్టీలో బోల్షివిక్కులు అనే ఒక బృందం వీటికి దిశానిర్దేశం చేసింది.

### రష్యా విప్లవం తేదీ

1918 ఫిబ్రవరి 1 వరకు రష్యా జులియన్ క్యాలెండర్‌ను అనుసరించింది. అప్పటినుంచి ప్రపంచమంతా ఉపయోగిస్తున్న గ్రిగోరియన్ క్యాలెండరుకు మారింది. గ్రిగోరియన్ తేదీలు జులియన్ తేదీలకంటే 13 రోజులు ముందు ఉంటాయి. కాబట్టి మన క్యాలెండరు ప్రకారం 'ఫిబ్రవరి' విప్లవం మార్చి 12న, 'అక్టోబరు' విప్లవం నవంబరు 7న జరిగాయి.

బోల్షివిక్కులకు వ్లాడిమిర్ లెనిన్ (1870–1924) నాయకత్వం వహించాడు. షరతులు లేని శాంతిని వెంటనే నెలకొల్పటం, భూమినంతటిని జాతీయం చేసి దానిని రైతాంగానికి పంచి పెట్టటం, ధరల నియంత్రణ, అన్ని కర్మాగారాలు, బ్యాంకుల జాతీయీకరణ వంటి సోవియట్ల (రైతాంగ, కార్మిక, సైనిక సంఘాల) డిమాండులను చేపట్టటం వల్ల బోల్షివిక్కులు వాళ్ల విశ్వాసాన్ని చూరగొనగలిగారు. తాత్కాలిక ప్రభుత్వం నుంచి అక్టోబరు–నవంబరు 1917లో బోల్షివిక్కుల నాయకత్వంలోని సోవియట్లు అధికారాన్ని చేజిక్కించుకుని యుద్ధానికి అంతం పలకటానికి, భూమిని పున:పంపిణి చెయ్యటానికి వెంటనే చర్యలు చేపట్టాయి. రష్యా రాచరికవాదుల తెల్లసైన్యం, కమ్యూనిస్టు వ్యతిరేక సైనికులు బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, జపానుల సహాయంతో పౌరయుద్ధానికి దిగటంతో రష్యాలో వెంటనే శాంతి నెలకొనలేదు. 1920 నాటికి ఈ శక్తులన్నీ ఓటమి పాలయ్యాయి. బోల్షివిక్కులు రష్యన్ సామ్రాజ్యం ముగిసిందని ప్రకటించి దానికింద ఉన్న దేశాలు స్వతంత్రంగా ఉండటానికి అవకాశం కల్పించారు. అయితే 1924లో రష్యా సోవియట్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల సమాఖ్యలో (యుఎస్ఎస్ఆర్) లోగడ జార్ సామ్రాజ్యంలో ఉన్న దేశాలన్నీ చేరటానికి అంగీకరించాయి.

దీనితో ఫ్యూడల్ భూస్వాములు, రాజులు, పెట్టుబడిదారులు వంటి దోపిడీదారులు లేని దేశాన్ని నిర్మించటానికి ఒక బృహత్ ప్రయోగం మొదలయ్యింది. ఆధునిక, పారిశ్రామిక సమాజాన్ని నిర్మిస్తూనే అసమానతలు, పుట్టుక, లింగం, భాష వంటి ప్రాతిపదికన వివక్షతలేని సమాజాన్ని ఏర్పాటు చెయ్యటానికి యుఎస్ఎస్ఆర్ ప్రయత్నించింది.

*కాల పట్టిక–I*

| | |
|---|---|
| రష్యాలో సోషలిజంపై చర్చలు | • 1850 - 1880 |
| రష్యా సోషల్ ప్రజాస్వామిక కార్మికుల పార్టీ ఏర్పాటు | • 1898 |
| రక్తసిక్త ఆదివారం విప్లవం | • 1905 |
| మార్చి 2 – జారు చక్రవర్తి పరారీ<br>అక్టోబరు 24 – పెట్రోగ్రాడ్‌లో బోల్షివిక్కులు తిరుగుబాటు | • 1917 |
| పౌర యుద్ధం | • 1918-20 |
| కొమిన్‌టర్న్ ఏర్పాటు | • 1919 |
| భూముల ఏకీకరణ ప్రారంభం | • 1929 |

## అధికారంలోకి స్టాలిన్

1924లో లెనిన్ చనిపోయిన తరువాత స్టాలిన్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు అయ్యాడు. తరువాత దశాబ్దాలలో అతడు తన పూర్తి నియంత్రణను సాధించుకొని వ్యతిరేకత అన్నది లేకుండా చేశాడు. ఎవరూ శాసించటానికి లేని అధికారంతో సోవియట్ రష్యాని బలమైన ఆర్థిక శక్తిగా మలిచాడు.

## ఫిబ్రవరి విప్లవంలో మహిళలు

"మహిళా కార్మికులు తరచు తమ తోటి పురుష కార్మికులకు స్ఫూర్తిని ఇచ్చేవాళ్లు... లోరెంజ్ టెలిఫోన్ కర్మాగారంలో మార్ఫా వాసిలేవా ఒంటరిగా విజయవంతమైన సమ్మెకు పిలుపునిచ్చింది. ఆ రోజు ఉదయం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికులు పురుషులకు ఎర్ర మెడపట్టీలను బహుమతిగా ఇచ్చారు... ఆ సమయంలో మిల్లింగ్ యంత్ర నిర్వాహకురాలైన మార్ఫా వాసిలేవా పని ఆపేసి అప్పటికప్పుడు సమ్మెకు పిలుపునిచ్చింది. అక్కడ ఉన్న కార్మికులు ఆమెకు మద్దతు ఇచ్చారు... ఫోర్‌మాన్ ఆ విషయాన్ని యాజమాన్యానికి తెలియచేసి ఆమెకు పూర్తిరొట్టెను పంపించాడు. ఆమె రొట్టె తీసుకుంది కానీ పని తిరిగి ప్రారంభించలేదు. పని ఎందుకు చెయ్యటంలేదని ఫోర్‌మాన్ అడిగితే, "మిగిలిన అందరూ ఆకలితో ఉంటే నేను ఒక్కదానినే కడుపు ఎలా నింపుకుంటాను?" అని ఆమె బదులిచ్చింది. కర్మాగారంలోని ఇతర విభాగాలలోని మహిళలు మార్ఫాకి మద్దతుగా ఆమె చుట్టూ చేరారు. క్రమేపీ మహిళలందరూ పని ఆపేశారు. ఆ తరువాత పురుషులు కూడా తమ పరికరాలు వదిలేసి సమ్మెకి దిగారు. అందరూ బజారులోకి పరుగులు తీశారు."

1928లో పంచవర్ష ప్రణాళికలతో యుఎస్ఎస్ఆర్ ప్రణాళికాబద్ధ ఆర్థిక అభివృద్ధిని చేపట్టింది. ఇది వేగవంతమైన పారిశ్రామికీకరణ, వ్యవసాయంలో భూముల ఏకీకరణ అన్న జోడు విధానాలను అవలంబించింది. జోసెఫ్ స్టాలిన్ నాయకత్వంలోని యుఎస్ఎస్ఆర్ చిన్న, పెద్ద రైతులు తమ భూములను వదిలేసి 'ఉమ్మడి క్షేత్రాల'లో చేరేలా బలవంతం చేసి చిన్న రైతాంగ ఉత్పత్తికి స్వస్తి పలకాలని ప్రయత్నించింది. ఈ క్షేత్రాలు గ్రామంలోని భూములు, పరికరాలు, యంత్రాలు, పశువులను అన్నింటిని ఉమ్మడి సొత్తుగా చేశాయి. అందరూ కలిసి వ్యవసాయం చేసి ఉత్పత్తిని సభ్యులు పంచుకునేవారు. చిన్న కమతాల వ్యవసాయాన్ని విడిచిపెట్టి ఆధునిక పద్ధతులు, యంత్రాలను ఉపయోగించుకునేలా పెద్ద కమతాల వ్యవసాయానికి మారాలన్నది ఉద్దేశం. దీనిని వేలాదిమంది రైతాంగం, ప్రత్యేకించి పెద్ద రైతులు వ్యతిరేకించటంతో వాళ్లను జైలుపాలు చేశారు, విదేశాలకు పంపించేశారు, మరణ శిక్షలు విధించారు. ఈ కారణంగా 1929–30లో తీవ్ర కరువు ఎదురయ్యి చాలా పెద్ద సంఖ్యలో ప్రజలు చనిపోయారు. మొదట్లో వ్యవసాయ ఉత్పత్తి తగ్గినా, తరువాత అది పెరిగి అంతకు ముందెన్నడూ లేనిస్థాయిలో పారిశ్రామికీకరణను యుఎస్ఎస్ఆర్ సాధించింది. పరిశ్రమలు అన్నీ ప్రభుత్వ అధీనంలో ఉండేవి, అక్కడ స్వేచ్ఛా మార్కెట్టుకి అనుమతి లేదు. పారిశ్రామిక ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్మేవాళ్లు.



*చిత్రం 14.2 : కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న లెనిన్*

అయితే వేగవంతమైన నిర్మాణం వల్ల పని పరిస్థితులు సరిగా ఉండేవి కావు. మాగ్నిటొగోర్స్క్ అన్న పట్టణంలో మూడు సంవత్సరాలలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించారు. కార్మికుల జీవన పరిస్థితులు చాలా కష్టంగా ఉండేవి, మొదటి సంవత్సరంలోనే ఉత్పత్తి 550 సార్లు నిలిచిపోయింది. ఇళ్ల విషయాలకు వస్తే, 'చలికాలంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు తక్కువగా ఉండేవి. ప్రజలు నాలుగు అంతస్తులు కిందకి దిగి బజారులో అవతలివైపున ఉండే మరుగుదొడ్లలోకి పరిగెత్తవలసి వచ్చేది'.

విస్తరించిన విద్యావిధానాన్ని రూపొందించారు. కార్మికులు, రైతాంగం విశ్వవిద్యాలయాలలోకి ప్రవేశించే ఏర్పాట్లు చేశారు. మహిళా కార్మికుల కోసం ఫ్యాక్టరీలలో శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో ప్రజారోగ్యం, సంరక్షణ కల్పించి, కార్మికులకు ఆదర్శ గృహ వసతిని ఏర్పాటు చేశారు. అయితే, ప్రభుత్వం దగ్గర పరిమితమైన వనరులు ఉండటంతో ఇవన్నీ అసమంగా ఉండేవి.

యుఎస్ఎస్ఆర్ పౌరులందరికీ పూర్తి ఉపాధి కల్పించగలిగింది, వాళ్ల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచగలిగింది. అందరికీ అక్షరాస్యత, ప్రాథమిక విద్యను అందించగలిగింది. ఇదే కాలంలో పాశ్చాత్య ప్రపంచం 'తీవ్ర మాంద్యాన్ని' ఎదుర్కొంటోంది. కర్మాగారాలు మూతపడటంతో లక్షలాది కార్మికులు తమ ఉద్యోగాలుకోల్పోయారు. ఫ్యాక్టరీలు మూతపడటంతో తమ ఉత్పత్తులకు గిరాకీ లేక వేలాది రైతులు తమ సరుకుల ధరలు తీవ్రంగా పడిపోవటం చూశారు. ఈ తీవ్ర మాంద్య ప్రభావానికి గురికాకుండా ఉండటం యు.ఎస్.ఎస్.ఆర్. గొప్పగా భావించింది. అంతర్జాతీయ మార్కెటుతో యు.ఎస్.ఎస్.ఆర్. అనుసంధానమై లేనందున ఈ మాంద్యం నుంచి తప్పించుకోగలిగింది. అంతేకాకుండా అక్కడ ప్రణాళికా బద్ధమైన ఆర్థిక విధానం ఉండేది – ఏమి ఉత్పత్తి చెయ్యాలో, ఎంత ఉత్పత్తి చెయ్యాలో ప్రభుత్వం నిర్ణయించేది.

## అక్టోబరు విప్లవం, రష్యా గ్రామీణ ప్రాంతం: రెండు దృక్కోణాలు

1) '1917 అక్టోబరు 25 విప్లవ తిరుగుబాటుకు సంబంధించిన వార్తలు గ్రామానికి ఆ మరునాడు చేరాయి. దీనిని ప్రజలు ఉత్సాహంతో స్వాగతించారు. తమకు ఉచితంగా భూమి దొరుకుతుందని, యుద్ధం ముగుస్తుందని రైతాంగం ఆశించింది... ఈ వార్త వచ్చిన రోజున భూస్వామికి చెందిన కోటలాంటి ఇంటిని లూటీ చేశారు, పశువులను 'జప్తు' చేశారు, విశాలమైన పండ్లతోటను నరికివేసి కట్టెలుగా రైతాంగానికి అమ్మివేశారు. అంతటా ఉన్న అతడి భవనాలను కూలగొట్టి, శిధిలాలుగా వదిలేశారు. కొత్త సోవియట్ విధానాన్ని అనుసరించటానికి సిద్ధంగా ఉన్న రైతాంగానికి అతడి భూమిని పంచిపెట్టారు.' ఫెడార్ బెలోవ్ రాసిన 'ది హిస్టరీ ఆఫ్ ఎ సోవియట్ కలెక్టివ్ ఫాం' నుంచి.

2) భూమి ఉన్న కుటుంబ సభ్యుడు ఎస్టేట్‌లో జరిగిన విషయాల గురించి తన బంధువుకి ఇలా రాశాడు:

'నిశ్శబ్దంగా, శాంతియుతంగా, ఎటువంటి బాధ లేకుండా "తిరుగుబాటు" జరిగిపోయింది... మొదటి కొన్ని రోజులు భరింపరానివిగా ఉన్నాయి. మిఖాయిల్ మిఖాయిలోవిచ్ (ఎస్టేటు యజమాని) ప్రశాంతంగా ఉన్నాడు ... ఆడవాళ్లు కూడా... చైర్మన్ మర్యాదగానూ, సరిగానూ ప్రవర్తించాడనే చెప్పాలి. మాకు రెండు ఆవులు, రెండు గుర్రాలను ఉంచారు. మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దని పనివాళ్లు వాళ్లకి చెబుతుండేవాళ్లు, "వాళ్లని బతకనివ్వండి. వాళ్ల భద్రతకి, ఆస్తికి మాది పూచీ. వాళ్లని సాధ్యమైనంత మానవీయంగా చూడండి..."

'... అనేక గ్రామాలలో కమిటీలను తొలగించి ఎస్టేటుని మిఖాయిల్ మిఖాయిలోవిచ్‌కి తిరిగి ఇవ్వటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పుకార్లు వస్తున్నాయి. అలా జరుగుతుందో, లేదో అది మాకు మంచిదేనో, కాదో నాకు తెలియదు. కానీ మా ప్రజల అంతరాత్మ సజీవంగా ఉందని మాకు సంతోషంగా ఉంది...'

మూలం: సెర్జ్ ష్మెమాన్ రాసిన 'ఎకోస్ ఆఫ్ ఎ నేటివ్ ల్యాండ్ – టు సెంచరీస్ ఆఫ్ ఎ రష్యన్ విలేజ్, (1997) నుండి.

- విప్లవం గురించి గ్రామీణ ప్రాంతంలో రెండు పక్షాలను పైన చదవండి. ఆ ఘటనలకు మీరు కూడా సాక్షిగా ఊహించుకోండి. 1) ఎస్టేట్ యజమాని 2) చిన్న రైతు, 3) పత్రికా విలేఖరిగా ఆనాటి ఘటనల గురించి క్లుప్తంగా రాయండి.

## అక్టోబరు విప్లవం నాటి మధ్య ఆసియా: దృష్టి కోణాలు

ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవాన్ని ప్రోత్సహించటానికి ఏర్పడిన 'కొమిన్‌టర్న్' అన్న అంతర్జాతీయ సంస్థలో ఎం ఎన్ రాయ్ ముఖ్యపాత్ర పోషించాడు. 1920ల పౌర యుద్ధకాలంలో అతడు మధ్య ఆసియాలో ఉన్నాడు. అతడు ఇలా రాశాడు:

"గ్రామ పెద్ద వృద్ధుడు, ఎంతో మంచివాడు. అతడికి సహాయంగా ఉన్న యువకుడు రష్యన్ మాట్లాడగలిగేవాడు... విప్లవం గురించి అతడు విన్నాడు, జారు పారిపోయాడని, తన స్వస్థానం అయిన కిర్‌గిజ్‌ని స్వాధీనం చేసుకున్న సైన్యాధిపతులు ఓడిపోయారని తెలిసింది. అంటే విప్లవం వల్ల కిరిగిజ్ స్వతంత్రం పొందింది. "విప్లవం వర్ధిల్లాలి," అంటూ ఆ యువకుడు నినదించాడు, అతడు జన్మత: బోల్షివిక్‌లాగా ఉన్నాడు. ఊరు మొత్తం అతడితో గొంతు కలిపింది."

ఎం.ఎన్. రాయ్ మెమాయర్స్ (1964)

## సోవియట్ రష్యాలో 1920లో కాలుపెట్టిన భారతీయుడు

'మా జీవితాల్లో మొదటిసారి ఐరోపావాసులు ఆసియావాసులతో స్వేచ్ఛగా కలవటం చూశాం. రష్యన్లు దేశంలోని మిగిలిన ప్రజలతో స్వేచ్ఛగా కలవటం చూసి నిజమైన సమానత్వం ఉన్న దేశానికి వచ్చామన్న నమ్మకం నాకు కుదిరింది. నిజమైన స్వేచ్ఛ అంటే ఏమిటో మేం చూశాం. విప్లవ ప్రతీఘాతుక శక్తులు, సామ్రాజ్యవాదుల కారణంగా పేదరికం ఉన్నప్పటికీ ప్రజలు ఇంతకు ముందు కంటే సంతోషంగానూ, సంతృప్తిగానూ ఉన్నారు. విప్లవం వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని, భయంలేనితనాన్ని నింపింది. యాభై వేరువేరు జాతులు ఉన్న ఈ దేశంలో నిజమైన మానవ సౌభ్రాతృత్వం కనపడుతుంది. ఒకరితో ఒకరు స్వేచ్ఛగా కలవటానికి వాళ్లకి మతం, కులం వంటి ఆటంకాలు ఏమీలేవు. ప్రతి వ్యక్తి ఒక ఉపన్యాసకుడిగా మారాడు. ఒక కార్మికుడు, రైతు, లేదా సైనికుడు ఉపాధ్యాయుడి మాదిరి వాదనలు వినిపించటం కనపడుతుంది.'

షౌకత్ ఉస్మాని, 'హిస్టారిక్ ట్రిప్స్ ఆఫ్ ఎ రివల్యుషనరీ' నుండి.

దీనివల్ల డిమాండు-గిరాకి మధ్య సమతౌల్యాన్ని అది సాధించగలిగింది.

అయితే, ఇదంతా కమ్యూనిస్టు పార్టీ, దాని నాయకుల చేతులలో అధికారాన్ని కేంద్రీకృతం చేయటం ద్వారా సాధించారు. పౌరులకు సాధారణ ప్రజాస్వామిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదు. వ్యతిరేకతను బలంతో అణిచివేశారు, ప్రతిపక్ష నాయకులను పెద్ద సంఖ్యలో చంపేశారు. సోషలిస్టు నిర్మాణం జరగాలంటే యుఎస్ఎస్ఆర్‌ని పడదొయ్యటానికి నిరంతరం ప్రయత్నిస్తున్న పెట్టుబడిదారీ శక్తులను ఓడించాలని, అందుకు ఇవన్నీ తప్పవని వాదించేవాళ్లు.

సమానత, జాతి స్వేచ్ఛ వంటి ఆదర్శాల పట్ల నిబద్ధతగల ప్రపంచవ్యాప్త ప్రజలందరిలో యుఎస్ఎస్ఆర్ అనుభవం స్ఫూర్తిని నింపింది. వాళ్లల్లో చాలామంది కమ్యూనిస్టులుగా మారి తమ తమ దేశాలలో కమ్యూనిస్టు విప్లవాల కోసం కృషి చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలను అణిచివెయ్యటం వంటి కమ్యూనిజంలోని కొన్ని విధానాలతో ఏకీభవించక పోయినప్పటికీ ఎంఎన్ రాయ్, టాగూర్, నెహ్రూ వంటి వాళ్లు దాని నుంచి ప్రేరణ పొందారు.

యుఎస్ఎస్ఆర్‌లో ప్రతిపక్షాన్ని హింసాత్మకంగా నిర్మూలించటం, బహుళపార్టీ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ లేకపోవటం చాలా దారుణమైన విషయంగా అనేకమంది భావించారు. జార్జ్ ఆర్వెల్ అన్న రచయిత 'యానిమల్ ఫాం' అన్న తన ప్రఖ్యాత వ్యంగ్య నవలలో రష్యన్ విప్లవంలోని ఆదర్శాలను యుఎస్ఎస్ఆర్‌లో ఎలా నీరుకార్చారో చిత్రీకరించాడు.



చిత్రం 14.3 : రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 'మరింత లోహం, మరిన్ని ఆయుధాలు' అని చాటుతున్న యుఎస్ఎస్ఆర్ గోడపత్రిక

- సమానత్వం, స్వేచ్ఛ, సంపదలతో కూడిన ప్రపంచాన్ని నిర్మించటంలో సోవియట్ ప్రయోగం ఏ మేరకు విజయం సాధించిందో అంచనా వేయండి.
- ఇటువంటి ప్రయోగాల కోసం వేలాదిమందిని చంపటం సమర్థనీయమేనా?
- కమ్యూనిస్టు విధానాలపై వచ్చిన విమర్శలు ఏమిటి?

**రష్యానుంచి 1930లో రవీంద్రనాథ్ టాగూరు ఇలా రాశారు**

'ఐరోపాలోని ఇతర రాజధానులతో పోలిస్తే మాస్కో అంత శుభ్రంగా అనిపించదు. బజారులో వెళుతున్న వాళ్లెవరూ డాబుసరిగా లేరు. ఈ ప్రదేశమంతా కార్మికులకు చెందినది... ఇక్కడి సామాన్య ప్రజలు పెద్దమనుషుల కారణంగా మరుగున పడలేదు... ఎన్నో యుగాలుగా తెరవెనక ఉండిపోయినవాళ్లు ఇప్పుడు బయటకు వచ్చారు... నా దేశంలోని రైతాంగం, కార్మికుల గురించి ఆలోచించాను. ఇదంతా అరేబియన్ రాత్రుల కథలలోని భూతం చేసిన మాయలా కనిపిస్తుంది. ఒక దశాబ్దం క్రితం వరకు మన ప్రజల మాదిరిగానే వీళ్లూ నిరక్షరాస్యులుగా, నిస్సహాయులుగా, ఆకలిగొన్నవారిగా ఉన్నారు... ఈ కొద్ది సంవత్సరాలలోనే పర్వతం వంటి అజ్ఞానం, నిస్సహాయత తొలగించబడటం చూసి నాబోటి భారతీయుడి కంటే ఎక్కువ ఆశ్చర్యానికి ఎవరు లోనవుతారు?'

## తీవ్ర మాంద్యం

తీవ్ర మాంద్యం 1929 చివరలో మొదలయ్యి దాదాపు రెండవ ప్రపంచ యుద్ధం మొదలైన 1939 వరకు కొనసాగింది. ఈ దశాబ్ద కాలంలో ప్రంచవ్యాప్తంగా గిరాకి పడిపోవటం వల్ల ధరలు పడిపోయి ఆర్థిక పరిస్థితి క్షీణించింది. గిరాకి తగ్గటంతో కర్మాగారాలు మూతపడ్డాయి, దాంతో ప్రజల కొనుగోలు శక్తి మరింత తగ్గి గిరాకి మరింత తగ్గింది. ఈ చక్రియ పరిణామాల వల్ల పెద్ద ఎత్తున నిరుద్యోగం, నిజమైన ఆదాయాలు తగ్గి ప్రపంచవ్యాప్తంగా సాధారణ ప్రజలు, ప్రభుత్వాలు కూడా ప్రభావితం అయ్యాయి. అమెరికాలో స్టాక్ మార్కెట్ కుప్పకూలటంతో మొదలైన పరిణామాలు అనతికాలంలోనే దాదాపుగా అన్ని దేశాలను ప్రభావితం చేశాయి.

అమెరికాలో నిరుద్యోగులు 25% శాతానికి పెరిగారు, అనేక ఇతర దేశాలలో ఈ సంఖ్య 33% దాకా ఉంది. ఫ్యాక్టరీలు మూతపడి వాణిజ్యం తగ్గటంతో పట్టణాలు పతనానికి కేంద్రాలుగా మారాయి. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు (60% దాకా) తగ్గి లక్షలాది రైతులు పేదవాళ్లుగా మారారు, వాళ్ళు సాగు మానేశారు. ఇప్పటివరకు ఆధునిక ఆర్థిక విధానం చూసిన అత్యంత దీర్ఘకాల క్షీణత ఇదే. దీని సామాజిక పరిణామాలు తీవ్రంగా ఉన్నాయి: పేదరికం పెరిగి, పెద్ద సంఖ్యలో ఇళ్లులేని వాళ్ళతో నిర్జన ప్రాంతాలుగా మారాయి.

అప్పటినుంచి ఈ క్షీణతకు కారణాల గురించి, దీనిని అధిగమించటానికి గల మార్గాలు, పునరావృతం కాకుండా చూసే విధానాల గురించి ఆర్థిక శాస్త్రజ్ఞులు, రాజకీయ నాయకులు వాదించుకుంటూనే ఉన్నారు. మార్క్సిస్టు ఆర్థికవేత్తలు ఈ రకమైన సంక్షోభాలు పెట్టుబడిదారి విధాన లక్షణమని సోషలిజం ఏర్పాటుతోనే వీటిని నిర్మూలించగలమని అంటారు. ఇంకొకవైపున జె.ఎం. కీన్స్ వంటి ఆర్థిక వేత్తలు ఆర్థిక విధానం పురోగమించటంలో ప్రభుత్వానికి కీలకపాత్ర ఉందని, అది ప్రభావవంతంగా జోక్యం చేసుకోకపోతే మాంద్యానికి దారితీస్తుందని అంటారు. ఆర్థిక పరిస్థితి క్షీణించి గిరాకి క్షీణిస్తున్నప్పుడు ప్రభుత్వం నిధులు ఖర్చు చేసి ఉపాధిని కల్పించాలని, దీనివల్ల ప్రజలకు ఆదాయం సమకూరి మార్కెటులో వస్తువులకు గిరాకీ ఏర్పడుతుందని కీన్స్ వాదించాడు. ప్రభుత్వ జోక్యం వల్ల పెరిగిన గిరాకీతో ఆర్థిక పరిస్థితి కోలుకోటానికి దోహదం చేస్తుంది అంటాడు. అయితే 1920లు, 1930లలో పెట్టుబడిదారీ దేశాలు జోక్యం చేసుకోటానికి సిద్ధంగా లేకపోవటంతో సంక్షోభం తీవ్రరూపం దాల్చింది.

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన రూస్‌వెల్ట్ కొత్త ఒప్పందాన్ని ప్రకటించాడు. దీని ప్రకారం మాంద్యానికి గురైనవారికి పునరావాసం, ఆర్థిక సంస్థల సంస్కరణ, ఆర్థిక పరిస్థితి తిరిగి కోలుకోటానికి చర్యలు చేపట్టారు. దీనికోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు పెట్టసాగింది. అయితే రెండవ ప్రపంచ యుద్ధం మొదలుకావటంతో సైన్యం, ఆయుధాలపై ప్రభుత్వ ఖర్చు పెరిగి కర్మాగారాల ఉత్పత్తి, వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకి ఒక్కసారిగా పెరిగాయి. అమెరికాలో ఎంతో అవసరమైన సామాజిక భద్రతా విధానాన్ని కూడా రూస్‌వెల్ట్ ప్రవేశపెట్టాడు. అందరికీ వర్తించే పదవీ విరమణ పింఛను, నిరుద్యోగ బీమా, వికలాంగులకు, తండ్రిలేని కుటుంబాలలో అవసరమున్న పిల్లలకు సంక్షేమ ప్రయోజనాలు వంటివి దీనివల్ల సమకూరాయి. అమెరికాలోని సంక్షేమ వ్యవస్థకు ఇది ఒక చట్రాన్ని ఏర్పరిచింది. మాంద్యం మొదలుకాక ముందు మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనే ఈ దిశలో బ్రిటన్ కొన్ని చర్యలు చేపట్టింది. నిరుద్యోగ బీమా, వృద్ధాప్య పింఛను పథకాలను ఏర్పరించింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి బ్రిటన్ కూడా నిరుద్యోగ భృతి, అనారోగ్యానికి ఖర్చులు, ఆరోగ్య పథకాలు, శిశు సంరక్షణ వంటి సామాజిక భద్రతాచర్యలను విస్తృతంగా చేపట్టింది. ఇవన్నీ సంక్షేమ రాజ్యం అన్న దానిని ఏర్పరచటానికి దోహదం చేశాయి. దీని ప్రకారం ప్రజలందరికీ కనీస జీవనస్థాయి, ఆహారం, గృహవసతి, ఆరోగ్యం, విద్య, శిశు, వృద్ధాప్య సంరక్షణ వంటి మౌలిక అంశాలకు ప్రభుత్వం హామీగా ఉంటుంది. పని చెయ్యగల పౌరులందరికీ ఉపాధిని కల్పించే బాధ్యతను చాలావరకు ప్రభుత్వం తీసుకుంది. ఈ విధంగా ప్రభుత్వం మార్కెటు ఆధారిత పెట్టుబడిదారీ విధానంలోని ఒడిదుడుకులను తగ్గించటానికి ప్రయత్నించింది.




*చిత్రం 14.4 : స్టాక్ మార్కెట్టు కుప్పకూలటంతో తన సంపదను కోల్పోయిన న్యూయార్క్‌వాసి తన కారును అమ్మకానికి పెట్టాడు.*

- ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోయి, కొన్ని సంవత్సరాలపాటు ఉద్యోగం దొరకని కార్మికులుగా మిమ్మల్ని మీరు ఊహించుకోండి. మీ జీవితంలోని ఒక రోజు గురించి రాయండి.
- పండించిన పంట ధర సగానికంటే తక్కువగా పడిపోయిన రైతుగా మిమ్మల్ని ఊహించుకోండి. మీ స్పందనను మూడు వందల పదాలలో రాయండి.
- భారతదేశంలో ఈనాడు సంక్షేమ రాజ్యంలోని ఏఏ అంశాలు అమలులో ఉన్నాయి?

## జర్మనీలో నాజీజం ప్రాబల్యం

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత యుద్ధనష్టాల చెల్లింపులు వంటివాటి భారం వల్ల జర్మనీ ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడింది. దీంతో జర్మనీ ప్రభుత్వం పెద్ద ఎత్తున కరెన్సీ నోట్లు ముద్రించసాగింది, ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగింది. బ్రెడ్డు కొనటానికి బస్తాలలో డబ్బులు తీసుకెళ్లాల్సి వచ్చేదని చెబుతారు! జర్మనీకి రుణాలు ఇవ్వటం ద్వారా, యుద్ధ నష్టాల చెల్లింపులను వాయిదా వెయ్యటం ద్వారా సహాయపడటానికి అమెరికా నిర్ణయించింది. దీంతో 1928 నాటికి జర్మనీ ఆర్థిక పరిస్థితి కొంతవరకు కుదుటపడింది. అయితే 1929లో మాంద్యం మొదలయ్యి అమెరికానే తీవ్రంగా ప్రభావితం అయ్యి జర్మనీకి సహాయం చెయ్యలేకపోవటంతో జర్మనీ మళ్లీ కుదేలయ్యింది.

### హిట్లర్ ఉపన్యాసం నుండి:

అన్నిటికంటే బలమైన జాతికి ప్రపంచాన్ని ఓడించే హక్కు ఉందని హిట్లర్ వాదించేవాడు.

'భూమి ఎవరికీ కేటాయింపబడి లేదు, ఎవరికీ బహుమతిగా కట్టబెట్టిలేదు. తమ హృదయాలలో దానిని జయించగల సాహసం, దానిని కాపాడుకోగల బలం, దానిని దున్నగల శ్రమ చెయ్యగల ప్రజలకు దేవుడు దానిని ఉద్దేశించాడు... ప్రపంచం ప్రాథమిక హక్కు దానికి శక్తి ఉన్నంతవరకు జీవించటానికి ఉన్న హక్కు. ఈ హక్కు ఆధారంగా బలమైన జాతి తన జనాభాకి తగినట్టు సరిహద్దులను విస్తరించుకుంటుంది!

- *ప్రపంచాన్ని జయించాలన్న భావనను హిట్లర్ ఇక్కడ ప్రతిపాదిస్తున్నాడా? బలం, శక్తి ఉన్న వాళ్లకే ఈ ప్రపంచం చెందాలని మీరు అనుకుంటున్నారా?*

మాంద్యం వల్ల అన్నిటికంటే ఎక్కువగా జర్మనీ ప్రభావితం అయ్యింది. 1932 నాటికి పారిశ్రామిక ఉత్పత్తి 1929 స్థాయితో పోలిస్తే 40 శాతానికి పడిపోయింది. కార్మికులు ఉపాధి కోల్పోయారు, లేదా వాళ్ల వేతనాలు తగ్గాయి. నిరుద్యోగుల సంఖ్య అంతకు ముందెన్నడూ లేనంతగా 60 లక్షలకు చేరింది. జర్మనీ వీధులలో పురుషులు 'ఏపని చెయ్యటానికైనా సిద్ధం' అనిరాసి ఉన్న కార్డులు మెడలో తగిలించుకుని కనపడేవాళ్లు. నిరుద్యోగ యువత పేకాటతో కాలక్షేపం చేసేవాళ్లు, లేదా వీధుల్లో కూర్చుండేవాళ్లు, లేదా స్థానిక ఉపాధి కల్పన కార్యాలయాల వద్ద బారులు తీరేవాళ్లు. ఉద్యోగాలు మాయమైపోవటంతో యువకులు నేరాలకు పాల్పడ్డారు. నిరాశ, నిస్పృహలు సర్వత్రా అలుముకున్నాయి.

ఈ ఆర్థిక సంక్షోభం ప్రజలలో తీవ్ర భయాలు, ఆందోళనలు కలిగించింది. కరెన్సీ విలువ కోల్పోటంతో మధ్యతరగతి ప్రజలు, ప్రత్యేకించి ఉద్యోగస్తులు, పింఛనుదార్ల పొదుపులు కరిగిపోసాగాయి. తమ వ్యాపారాలు దెబ్బతినడంతో చిన్న వ్యాపారస్తులు, రిటేలు వర్తకులు, స్వయం ఉపాధిలో ఉన్నవాళ్లు ఎన్నో కష్టాలకు లోనయ్యారు. సమాజంలోని ఈ వర్గాలు తాము పేదవాళ్లుగా మారతామని,

## సిద్ధాంత బోధన

నాజీలు తమ పిల్లలకు మొదటినుంచి ఒకేరకమైన ఆలోచనను నేర్పించసాగారు: జర్మను జాతి గొప్పదన్న నాజీ భావజాలం, హిట్లర్ గొప్పతనం, యూదులు, ఇతర ప్రజల పట్ల ద్వేషం. ఈ సిద్ధాంత బోధన ఎలా చేశారు?

ఆరు నుంచి పది సంవత్సరాల మగపిల్లలందరూ నాజీ సిద్ధాంతంలో ప్రాథమిక శిక్షణ పొందేవాళ్లు. ఈ శిక్షణ పూర్తి అయిన తరువాత హిట్లరు పట్ల విశ్వాసపాత్రత కనబరుస్తామని ఇలా ప్రతిజ్ఞ చేసే వాళ్లు, "మన మహాధినేతకు ప్రాతినిధ్యంగా నిలిచిన ఈ రక్త కేతనం సమక్షంలో నా శక్తులు, బలాన్నంతటినీ మన దేశ రక్షకుడైన అడాల్ఫ్ హిట్లర్‌కి అంకితం చేస్తానని ప్రతిజ్ఞ పూనుతున్నాను. అతడి కోసం నా ప్రాణాన్ని కూడా త్యాగం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను, దీంట్లో దేవుడు నాకు సహాయపడుగాక."

డబ్ల్యు షిరెర్ 'ది రైజ్ ఎండ్ ఫాల్ ఆఫ్ థర్డ్ రీచ్' నుండి.

జర్మను కార్మిక సమాఖ్య నాయకుడైన రాబర్ట్ లే ఇలా చెప్పాడు: 'పిల్లవాడికి మూడేళ్ల వయస్సు నుంచే మొదలుపెడతాం. అతడిలో ఆలోచన మొదలు అయ్యాకాకుండానే ఊపటానికి అతడికి ఒక చిన్న జెండా ఇస్తాం. తరువాత బడిలో హిట్లరు యువత, మిలటరీ సేవ ఉంటాయి. ఇదంతా అయిన తరువాత ఎవరినీ వదలం. కార్మిక సమాఖ్య వాళ్లని అప్పటిదాక పట్టుకునే ఉంటుంది. వాళ్లకి ఇష్టం ఉన్నా లేకపోయినా వాళ్లు చనిపోయేవరకు వదిలి పెట్టం.'

## నాజీజం–మహిళలు

1934 సెప్టెంబరు 8న న్యురెంబర్గ్ పార్టీ ప్రదర్శనలో మహిళలను ఉద్దేశించి హిట్లర్ తన ప్రసంగంలో ఇలా పేర్కొన్నాడు:

"పురుషుల ప్రపంచంలో, అతని ప్రధాన రంగంలో మహిళలు జోక్యం చేసుకోవటం సరైనది కాదు. ఈ రెండు ప్రపంచాలు భిన్నంగా ఉండటం సహజమని నేను అనుకుంటున్నాను. యుద్ధరంగంలో పురుషుడు కనబరిచే సాహసం, మహిళ తన నిరంతర ఆత్మత్యాగం, నిరంతర వ్యధ, బాధలలో కనబరుస్తుంది. ఈ లోకంలోకి మహిళ తెచ్చే ప్రతి సంతానమూ ఒక యుద్ధమే, తన ప్రజల కోసం మహిళ ఈ పోరు సలుపుతోంది."

అదే ప్రదర్శనలో హిట్లర్ ఇంకా ఇలా అన్నాడు:

"ఒక జాతిని కాపాడటంలో అన్నిటికంటే స్థిరమైన అంశం మహిళయే... ఒక జాతి అంతరించిపోకుండా ఉండటానికి ముఖ్యమైనవన్నీ ఆమెకు బాగా అర్థమవుతాయి ... ఎందుకంటే ఈ వేదన వల్ల ముందుగా ప్రభావితమయ్యేది ఆమె పిల్లలే... అందుకే ఈ పోరాటంలో మహిళల భాగస్వామ్యం ప్రకృతి సిద్ధమైనది, దైవీకృతమైనది.



*చిత్రం 14.5 : యూదులను కాపాడారన్న ఆరోపణతో బహిరంగంగా శిక్షింపబడుతున్న మహిళలు*

- పిల్లల్ని పెంచేశ్రమ, బాధలకే మహిళలు పరిమితం కావాలన్న దృక్పథంతో మీరు ఏకీభవిస్తారా?
- పిల్లల పెంపకం, కర్మాగారాలు, కార్యాలయాలు, పొలాల్లో పని చెయ్యటం వంటి జీవితానికి సంబంధించిన అంశాలలో స్త్రీ, పురుషులు సమానంగా భాగస్వాములు కాగలరని మీరు అనుకుంటున్నారా?

లేదా కార్మికవర్గశ్రేణికి పడిపోతామని, లేదా ఇంకా దారుణంగా నిరుద్యోగులవుతామని భయపడ్డారు. సంఘటిత కార్మికులు మాత్రమే ఎలాగో నెట్టుకురాగలిగారు, కాని సమాజంలోని నిరుద్యోగం వల్ల తమ కోర్కెలను సాధించుకునే శక్తిని కొంత కోల్పోయారు. పెద్ద వ్యాపారస్తులు సంక్షోభంలో ఉన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవటం వల్ల రైతాంగంలో అధిక భాగం ప్రభావితమయ్యింది. తమ పిల్లల కడుపులు నింపలేని మహిళలు తీవ్ర నిస్పృహకు లోనయ్యారు. రాజకీయ అస్థిరత్వంతో ప్రభుత్వం, తరువాత ప్రభుత్వం కుప్పకూలిపోయి స్థిరమైన పాలన లేకుండా పోయింది.

ఇటువంటి పరిస్థితులలో నాజీ పార్టీ ప్రచారంతో మెరుగైన భవిష్యత్తు పట్ల ఆ పార్టీకి తిరుగులేని నాయకుడిగా ఉన్న హిట్లర్ ఆశలు కల్పించాడు. 1928లో జర్మనీ పార్లమెంటు రీచ్‌స్టాగ్‌లో నాజీ పార్టీకి 2.6 శాతం ఓట్లకు మించి రాలేదు. 1937 నాటికి 37 శాతం ఓట్లతో అతి పెద్ద పార్టీగా పరిణమించింది.

కాలపట్టిక – II

| | |
|---|---|
| *వైమర్ గణతంత్ర రాజ్యాంగా ప్రకటన* | *నవంబర్ 9, 1918* |
| *హిట్లర్ జర్మనీకి ఛాన్సలర్ కావడం* | *జనవరి 30, 1933* |
| *పోలెండ్‌పై జర్మనీ దండెత్తడం, రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం* | *సెప్టెంబర్ 1, 1939* |
| *యు.ఎస్.ఎస్.ఆర్. పై జర్మనీ దండెత్తడం* | *జూన్ 22, 1941* |
| *యూదులపై సామూహిక హత్యాకాండ* | *జూన్ 23, 1941* |
| *అమెరికా సంయుక్త రాష్ట్రాలు రెండవ ప్రపంచ యుద్ధంలో చేరడం* | *డిసెంబర్ 8, 1941* |
| *సోవియట్ సేనలు ఔష్‌విడ్జ్‌కు విముక్తి కల్పించడం* | *జనవరి 27, 1945* |
| *యూరప్‌లో కూటమిగా సాధించిన విజయం* | *మే 8, 1945* |

హిట్లర్ అద్భుతమైన వక్త. అతడి ఉద్వేగం, అతడి మాటలు ప్రజల్ని కదిలించివేశాయి. ఒక బలమైన దేశాన్ని నిర్మిస్తానని, వర్సయిల్స్ ఒప్పందపు అన్యాయాన్ని రద్దు చేస్తానని, జర్మనీ ప్రజల గౌరవాన్ని తిరిగి నిలబెడతానని అతను చెప్పాడు. పని కావాలి అనుకుంటున్నవాళ్లకి పని, యువతకు బంగారు భవిష్యత్తు కల్పిస్తానని వాగ్దానం చెయ్యసాగాడు. అన్ని విదేశీ ప్రభావాలను తొలగిస్తానని, జర్మనీకి వ్యతిరేకంగా అన్ని విదేశీ 'కుట్రలను' తిప్పికొడతానని అతడు చెప్పసాగాడు.

రాజకీయాలలో ఒక కొత్త శైలిని హిట్లర్ ప్రవేశపెట్టాడు. పెద్ద ఎత్తున జన సమీకరణ చెయ్యటంలో ఆచారాలు, అద్భుత దృశ్యాల ప్రాముఖ్యతను అతను గుర్తించాడు. హిట్లర్‌కి ఉన్న మద్దతు తెలియచెయ్యటానికి, ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించటానికి నాజీలు పెద్ద పెద్ద బహిరంగ సభలను, ప్రదర్శనలను నిర్వహించసాగారు. స్వస్తిక గుర్తుతో ఎర్ర జండాలు, నాజి వందనం, ఉపన్యాసాల తరువాత తప్పట్లు కొట్టటం వంటివన్నీ అతడి అఖండ అధికారంలో భాగం. ప్రపంచంపై జర్మనీ ఆర్య జాతి ఆధిపత్యాన్ని నెలకొల్పుతానన్న వాగ్దానంతో, అన్ని సమస్యలకు యూదులువంటి అల్పసంఖ్యాకులు కారణంగా పేర్కొంటూ హిట్లర్ తన మద్దతుదారులను కూడగట్టుకోసాగాడు. కమ్యూనిజం, పెట్టుబడిదారీవిధానం రెండింటినీ యూదుల కుట్రగా పేర్కొంటూ, ఆ రెండింటినీ తిప్పి కొట్టే బలమైన దేశాన్ని నిర్మిస్తానని హిట్లర్ చెప్పసాగాడు. తీవ్ర మాంద్యం, పెట్టుబడిదారీ విధానంతో భయపడిపోయిన మధ్యతరగతికి హిట్లర్ మాటలు ఎంతగానో నచ్చాయి. అదే సమయంలో అతడు కమ్యూనిస్టులు, సోషలిస్టుల నాయకత్వంలోని శ్రామిక వర్గ ఉద్యమాలను వ్యతిరేకించసాగాడు.

హిట్లర్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్లమెంటు వంటి అన్ని ప్రజాస్వామిక సంస్థలను తొలగించి అప్రజాస్వామిక, నియంత పాలనను ఏర్పరిచాడు. రాజకీయ ప్రత్యర్థులను, ప్రత్యేకించి కమ్యూనిస్టులను ఇష్టం వచ్చినట్లు అరెస్టు చేసి కాన్సంట్రేషన్ క్యాంపులు (శిక్షా శిభిరాల)కు పంపించేవారు.

## నిరసన

నాజీ సామ్రాజ్యం సాధారణ ప్రజలపై సాగిస్తున్న దారుణ, సంఘటిత హింసపట్ల సామాన్య జర్మన్లు మౌనం వహించటం, వ్యతిరేకత కనపరచకపోవటాన్ని నిరసనకారుడైన పాస్టర్ నీమొల్లర్ గమనించాడు. ఈ మౌనాన్ని నిరసిస్తూ ఇలా రాశాడు:

'ముందువాళ్లు కమ్యూనిస్టుల కోసం వచ్చారు,
నేను కమ్యూనిస్టుని కాదు కదా
అందుకనే నేను ఏమీ అనలేదు.
తరువాత వాళ్లు సోషల్ డెమోక్రాట్ల కోసం వచ్చారు,
నేను సోషల్ డెమోక్రాట్‌ని కాదుకదా
అందుకనే నేను ఏమీ అనలేదు.
తరువాత వాళ్లు కార్మిక సంఘాల వాళ్లకోసం వచ్చారు,
నేను కార్మిక సంఘ నాయకుడిని కాదుకదా.
ఆ తరువాత వాళ్లు యూదుల కోసంవచ్చారు,
నేను యూదుని కాదు - కాబట్టి మిన్నకున్నాను.
చివరికి నాకోసం వాళ్లు వచ్చినప్పుడు,
నిరసన తెలియచేసే వాళ్లు ఎవరూ మిగలకుండా
పోయారు.'

- నాజీ సిద్ధాంతం అధికస్వామ్య సూత్రాలపై ఆధారపడి ఉంది. జర్మనీ జనాభాలో యూదులు 0.75 శాతం మాత్రమే. యూదులనే కాకుండా నాజీలను వ్యతిరేకించే వాళ్లను కూడా శిక్షించేవాళ్లు. పై కవితలో దీనిని ఎలా చూపించాడు?



*చిత్రం 14.6 :1945లో జెనా జర్మనీ వద్ద బచెన్‌వాల్డ్ నిర్బంధ శిబిరంలో యూదు బానిస కార్మికులు*

1933 మార్చి 3న ఆమోదం పొందిన 'ఎనేబ్లింగ్ యాక్ట్'తో జర్మనీలో నియంతృత్వం ఏర్పడింది. పార్లమెంటును పట్టించుకోకుండా డిక్రీల ద్వారా పాలించే అధికారాన్ని హిట్లర్‌కి ఈ చట్టం కట్టబెట్టింది. నాజీ పార్టీ దాని అనుబంధ సంస్థలు తప్పించి మిగిలిన అన్ని రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను నిషేధించారు. ఆర్థిక పరిస్థితి, ప్రసార సాధనాలు, సైన్యం, న్యాయ వ్యవస్థల మీద ప్రభుత్వం పూర్తి పట్టు సాధించింది.

నాజీలు కోరుకున్న విధంగా సమాజాన్ని నియంత్రించటానికి, నడిచేలా చూడటానికి ప్రత్యేక నిఘా, భద్రతా దళాలను ఏర్పరిచారు. అప్పటికే ఆకుపచ్చ యూనిఫారంలో ఉన్న పోలీసు సిబ్బంది, స్టార్మ్ ట్రూపర్స్ (ఎస్ఏ) కాకుండా గెస్టాపో (రహస్య పోలీసు బృందం), రక్షణ దళాలు (ఎస్ఎస్), నేర విచారణ పోలీసులు, భద్రత సేవలు (ఎస్‌డి) ఏర్పడ్డాయి. ఈ కొత్తగా ఏర్పరిచిన దళాల రాజ్యాంగేతర అధికారాలు నాజీ ప్రభుత్వానికి భయంకరమైన నేరపూరిత ప్రభుత్వంగా గుర్తింపును తెచ్చిపెట్టాయి. ప్రజలను ఇప్పుడు ఎటువంటి చట్టబద్ధ విధానం లేకుండానే అరెస్టు చెయ్యవచ్చు, ఇష్టమొచ్చినట్టు హింసా శిబిరాలలో ఉంచవచ్చు, నిర్బంధ శిబిరాలకు తరలించవచ్చు, లేదా దేశంనుంచి బహిష్కరించ వచ్చు. ఎదురులేని అధికారాన్ని పోలీసు దళాలు సమకూర్చుకున్నాయి.

ఈ అధికారాలను ఉపయోగించుకుని లక్షలాది రాజకీయ ఉద్యమకారులను, కార్మిక సంఘ నాయకులను, అల్పసంఖ్యాక వర్గ ప్రజలను అరెస్టు చేసి, హింసించేవాళ్లు. అంతకు ముందెన్నడూ లేనంతగా దారుణాలకు ఒడిగట్టారు, వ్యతిరేకులను భయభ్రాంతుల్ని చేశారు.

ఆర్థిక పునః నిర్మాణ బాధ్యతను ఆర్థికవేత్త హజాల్మర్ షాకిట్ హిట్లర్ అప్పగించాడు. ప్రభుత్వ నిధులతో ఉపాధి కల్పన ద్వారా అతడు పూర్తి

ఉపాధి, పూర్తి ఉత్పత్తి అన్న లక్ష్యాలను పెట్టుకున్నాడు. పైన పేర్కొన్న కీన్స్ భావాలను గుర్తుకు తెచ్చుకోండి. ఈ పథకం ద్వారా జర్మనీలో వాహనాలు అత్యంత వేగంగా వెళ్లే రహదారులను నిర్మించారు, ప్రజల కారు (వోక్స్ వాగెన్)ను ఉత్పత్తి చేశారు. ఈ సమయంలో జాత్యాహంకార ప్రభుత్వ కోపానికి గురైన ప్రజల పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ జర్మనీలోని ఒక వర్గ ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఆ తరువాత మరింత ఉపాధి కల్పించటానికి ఆయుధ కర్మాగారాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. అయితే పొరుగువాళ్లతో యుద్ధానికి దిగితే తప్పించి ఇది కొనసాగటానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోటానికి హిట్లర్ దుందుడుకు విదేశీ విధానాన్ని అవలంబించాడు. తరువాత, 1939లో అతడు పోలాండ్‌పై దండెత్తడంతో రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసిందని ఇంతకుముందు చూశాం.

యుద్ధం కొనసాగుతున్న కాలంలో నాజీ ప్రభుత్వం జర్మను జాతి ఆధిపత్యాన్ని నిర్మించటానికి అల్పసంఖ్యాక వర్గాల దారుణ మూక హత్యాకాండల కార్యక్రమాన్ని చేపట్టింది.

రెండవ ప్రపంచ యుద్ధం నీడలో జర్మనీ మానవ మారణ హోమాన్ని చేపట్టింది. దీని ఫలితంగా యూరపులో ఎంపిక చేయబడిన అమాయకులైన పౌరులు పెద్ద సంఖ్యలో చంపివేయబడ్డారు. చనిపోయిన వాళ్లలో ఆరు కోట్ల యూదులు, 20 లక్షల జిప్సీలు, కోటి పోలిష్ పౌరులు, మానసిక, శారీరక వైకల్యంగా ఉన్నవాళ్లుగా పేర్కొనబడిన 70,000 జర్మన్లు, 10,000 స్వలింగ సంపర్కులు, ఇంకా అనేక రాజకీయ ప్రత్యర్థులు, వివిధ మత విశ్వాసాల ప్రజలు ఉన్నారు. ప్రజలను చంపటానికి నాజీలు అంతకు ముందెన్నడూ లేని విధానాలను కనుగొన్నారు. ఉదారణకు ఆష్విట్జ్ వంటి హత్యాకేంద్రాలలో ప్రజలను గదులలోకి పంపి దాంట్లోకి గ్యాసు పంపించడం ద్వారా చంపేసేవాళ్లు.

## ఓటమి, అంతం

జర్మను సైన్యాలు తొలుత విజయాలు సాధించినా, 1943 ఆరంభంలో ప్రఖ్యాత స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలో ఓటమితో అపజయాలుగా మారసాగాయి. భయంకర నాజీ పాలననుంచి విముక్తిదాతలుగా సోవియట్ సైన్యానికి తూర్పు యూరపు అంతటా ఘనస్వాగతం లభించింది. అంతిమంగా సోవియట్ సైన్యం జర్మనీ రాజధాని అయిన బెర్లిన్‌ని చేజిక్కించుకుంది. నిర్బంధం, విచారణలను తప్పించుకోటానికి హిట్లర్, అతడి సన్నిహిత మిత్రులు ఆత్మహత్య చేసుకున్నారు. అంతిమంగా జర్మనీ రెండుగా విభజింపబడింది. తూర్పు భాగమైన జర్మన్ గణతంత్ర

**పటం 1 : 1942లో జపాను నియంత్రణలో ఉన్న ప్రాంతం**



ప్రజాస్వామ్యం (జి.డి.ఆర్) యుఎస్ఎస్ఆర్ ప్రభావం కిందకి, పశ్చిమ భాగమైన జర్మను గణతంత్ర సమాఖ్య (ఎఫ్ ఆర్ జి) అమెరికా ప్రభావం కిందకి వెళ్లాయి.

తూర్పు ప్రాంతంలో హీరోషిమా, నాగసాకిలలో అమెరికా అణుబాంబులు వేయడంతో జపాను లొంగిపోయింది. అమెరికా సైన్యాలు జపానుని ఆక్రమించుకున్నాయి, కానీ జపనీయుల మనోభీష్టానికి అనుగుణంగా జపాను చక్రవర్తిని కొనసాగనిచ్చారు. అయితే ఇంగ్లాండులో మాదిరిగా రాజ్యాంగబద్ధ రాచరిక పాలనను అక్కడ ఏర్పాటు చేశారు. పార్లమెంటు (డైట్)కి బాధ్యత వహించే ఎన్నికైన ప్రభుత్వం జపాను పాలనను చేపట్టింది.

- హిట్లరు సిద్ధాంతం, ఆర్థిక విధానాల ఫలితంగా రెండవ ప్రపంచ యుద్ధం సంభవించిందని ఎలా చెప్పవచ్చు?
- జర్మను ప్రజల శత్రువులుగా హిట్లర్ యూదులను ఎందుకు ఎంపిక చేసుకున్నాడు?
- 'హెూలోకాస్ట్' గురించి, ఆష్విట్జ్ తరహా శిబిరాల గురించి మరింత తెలుసుకుని వాటి ఆధారంగా ఒక నివేదిక తయారుచేయండి.

నాజీ సైన్యాధిపతులు, నాయకులలో అనేక మందిని నిర్బంధించి ప్రఖ్యాత న్యూరెంబర్గ్ విచారణలలో బోనెక్కించారు. న్యూరెంబర్గ్ న్యాయస్థానం కేవలం పదకొండు మంది ప్రముఖ రాజకీయ నాయకులకే మరణశిక్ష విధించింది. మరి కొందరికి జీవిత ఖైదు విధించింది. అంతిమంగా న్యాయం లభించింది కానీ, నాజీల నేరాల తీవ్రత, సంఖ్యలతో పోలిస్తే వాళ్లకు పడిన శిక్ష చాలా తక్కువ. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీతో వ్యవహరించినంత కఠినంగా ఈసారి కూడా వ్యవహరించాలని మిత్రదేశాలు అనుకోలేదు. వాస్తవానికి యుద్ధం తరువాత జర్మనీ, జపాను ఆర్థిక పరిస్థితి కుప్పకూలటంతో వాటి ఆర్థిక పునరుద్ధరణకు అమెరికా మార్షల్ ప్రణాళికతో నిధులతో ముందుకొచ్చింది. అదేవిధంగా తూర్పు యూరపుదేశాల పున రుద్ధరణకు యుఎస్ఎస్ఆర్ చేయూతనిచ్చింది.



*చిత్రం 14.7 : (ఎడమ నుండి) యల్టా సమావేశంలో పాల్గొన్న చర్చిల్, రూస్‌వెల్ట్, స్టాలిన్*



*చిత్రం 14.8 : (ఎడమ) ఇరువురు నియంతలు – ముసోలిని, హిట్లర్*

20వ శతాబ్దంలో మొదటి సగం హీరోషిమా, నాగసాకిలపై జరిగిన భయంకర అణుబాంబుతోనూ, ఐక్యరాజ్య సమితి ఏర్పాటుతో తలెత్తిన ఆశలతోనూ ముగిసింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, ఇటలీ, జర్మనీల వలస సామ్రాజ్యాలు కూడా అంతం అయ్యాయి. 1950ల నాటికి భారతదేశం, చైనా, ఇండోనేసియా, వియత్నాం, ఈజిప్టు, నైజీరియా వంటి దేశాలు

స్వాతంత్ర్యం పొందాయి. యుద్ధానికి ముందు అత్యంత శక్తిమంతమైన దేశంగా ఉండిన బ్రిటన్ ఇప్పుడు ద్వితీయశ్రేణికి పడిపోయింది. ప్రపంచ రంగం మీద రెండు అగ్రరాజ్యాలు ఆవిర్భవించాయి: అవి రష్యా, అమెరికా. హిట్లర్ యుద్ధ తాకిడికి ప్రధానంగా గురయ్యి, తీవ్ర ఆర్థిక విధ్వంసాన్ని చవిచూసిన రష్యా క్రమేపీ తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోసాగింది. అయితే రష్యా సాధించిన విజయంతో ప్రపంచంలో దాని ప్రతిష్ఠ ఎంతో పెరిగింది. తూర్పు యూరపు, చైనాలతో కలిసి ఇప్పుడు అది విశాల 'సామ్యవాద శిబిరం'గా పరిగణింపబడసాగింది.

- మొదటి ప్రపంచ యుద్ధం తరువాత రష్యా, జర్మనీల అనుభవాలను పోల్చండి. వాటిల్లో పోలికలు, తేడాలు ఏమిటి?
- యుద్ధం, తీవ్ర మాంద్యం తరువాత జాతీయ అభివృద్ధికి అనేక నమూనాలు ముందుకు వచ్చాయి. వాటిని పేర్కొని, వాటి పరిమితులను కూడా పేర్కొనండి.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| సోషలిజం | కమ్యూనిజం | విప్లవం | అధికార కేంద్రీకరణ |
| బోల్షివిక్ | భూముల ఏకీకరణ | పునరావాసం – | సంస్కరణ – స్వాధీనత |
| సంక్షేమ రాజ్యం | సిద్ధాంత బోధన | ప్రచారం | జాతి ఆధిపత్యం |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. రష్యన్ విప్లవం ఆ సమాజంలో ఎన్నో మార్పులను తెచ్చింది. అవి ఏమిటి? వాళ్లు ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి?
2. తీవ్ర మాంద్యానికి కారణాల గురించి భిన్న వాదనలను పోల్చండి. వాటిల్లో దేనితో మీరు ఏకీభవిస్తారు? కారణాలు పేర్కొనండి.
3. నాజీ జర్మనీల చేతిలో యూదులు ఏవిధమైన వేధింపులకు గురయ్యారు? ప్రతి దేశంలోనూ కొంతమంది తమ ప్రత్యేక గుర్తింపు కారణంగా వేరుగా చూడబడుతున్నారా?
4. తీవ్ర మాంద్య పరిస్థితులలో సంక్షేమ రాజ్యం అన్న భావన కింద చేపట్టిన వివిధ చర్యలను పేర్కొనండి. రష్యాలో చేపట్టిన సంస్కరణలకూ, వీటికీ ఉన్న పోలికలు, తేడాలను పేర్కొనండి.
5. తీవ్ర మాంద్యంతో జర్మనీ ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి? నాజీ పాలకులు, హిట్లర్ వాటిని ఎలా ఉపయోగించుకున్నారు?
6. నాజీ పాలనలో తీసుకొచ్చిన రాజకీయ మార్పులు ఏమిటి? ఒక బలమైన నాయకుడు ఉంటే చాలు దేశ సమస్యలు తీరిపోతాయని తరచు ప్రజలు వాదిస్తూ ఉంటారు. నాజీ జర్మనీలో ఎదురైన అనుభవాల నేపథ్యంలో ఈ వాదనకు ఎలా స్పందిస్తారు?

## ప్రాజెక్టు

తరువాత పేజీలో ఇచ్చిన చిత్రాలను చర్చించండి. ఈ కాలానికి సంబంధించి మరిన్ని చిత్రాలు సేకరించండి.







1వ వ్యంగ్య చిత్రంలో అమెరికాకు చెందిన చిత్రకారుడు అమెరికాలో నల్లజాతీయులతో వ్యవహరించినట్లే జర్మనీలో యూదులతో వ్యవహరిస్తున్నట్లు చిత్రీకరించాడు. రెండవ వ్యంగ్య చిత్రంలో నాజీ జర్మనీ గురించి భయపడాల్సింది లేదని అమెరికాకు బ్రిటిష్ ప్రధానమంత్రి సలహా ఇస్తున్నాడు.







ఎడమ చేతి వైపున ఉన్న మొదటి వ్యంగ్య చిత్రంలో నాజీ జర్మనీ ప్రజలను బానిసత్వంలోకి తీసుకెళుతున్నట్లు చిత్రీకరించారు. కానీ రెండవ వ్యంగ్య చిత్రం చూపించినట్టు యూదులకు వ్యతిరేకంగా జర్మనీ చేసిన ప్రచారాన్ని చాలామంది ప్రజలు నమ్ముతున్నారని తెలియచేస్తుంది.







యుద్ధానికి చాలా ఖర్చు అవుతుంది, ప్రజల జీవితాలను ఎంతగానో ప్రభావితం చేస్తుంది. నాజీలపై, యుద్ధంలో ప్రజల సహాయాన్ని కూడగట్టటానికి అమెరికాలో ముద్రించిన రెండు గోడ పత్రికలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ ఉన్న బొమ్మల గురించి వ్యాఖ్యానించండి.

పాఠం
15

# వలస పాలిత ప్రాంతాలలో జాతి విముక్తి ఉద్యమాలు

వలసపాలిత ప్రాంతాలను సూచించే కింది పటాన్ని చూడండి. 19వ శతాబ్దం నాటికి లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలపై ఐరోపా దేశాలు నియంత్రణ పొందిన విధానాన్ని మీరు ఎనిమిదవ తరగతిలో చదివారు. ఈ దేశాలు తమ స్వాతంత్ర్యం కోసం పోరాడిన విధానాల గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం. కింది పటంలో బ్రిటన్ వలసపాలిత ప్రాంతాలు ఊదా రంగులనూ, ఫ్రాన్స్‌కి చెందినవి నీలం రంగులోనూ, హాలెండ్‌కి చెందినవి లేతగోధుమ రంగులోనూ ఉన్నాయి. ఆసియా, ఆఫ్రికాలలో కొన్ని దేశాలు స్వతంత్రంగానే ఉన్నాయి, ఇవి బూడిద రంగులో ఉన్నాయి. ఆధునిక ప్రపంచ పటంలో ఈ దేశాలన్నింటినీ గుర్తించండి.

- బ్రిటన్‌కి చెందిన వలసలలో ఆసియాలో ఒక ప్రాంతాన్ని, ఆఫ్రికాలో మరొక ప్రాంతాన్ని గుర్తించండి.
- హాలాండ్‌కి చెందిన ఒక ఆసియా, ఒక ఆఫ్రికా వలస ప్రాంతాన్ని గుర్తించండి.
- ఫ్రాన్స్‌కి చెందిన ఒక ఆసియా, ఒక ఆఫ్రికా వలస ప్రాంతాన్ని గుర్తించండి.
- ఏ దేశానికి వలసపాలిత ప్రాంతంగాలేని ఆసియాలో రెండు దేశాలను, ఆఫ్రికాలో ఒక దేశాన్ని గుర్తించండి.
- ఆస్ట్రేలియా ఏ దేశానికి వలసపాలిత ప్రాంతంగా ఉంది?



*పటం 1 : 1914లో వలసపాలిత ప్రాంతాలు*

స్వతంత్ర దేశాలైన చైనావంటివి వాస్తవానికి అనేక వలసపాలక దేశాల నియంత్రణలో ఉండి పేరుకి మాత్రమే స్వతంత్రంగా ఉన్నాయి. ఈ అధ్యాయంలో వలసపాలిత ప్రాంతాల దారుణ పరిస్థితుల గురించి, ఐరోపా దేశాల వలస పెత్తనానికి వ్యతిరేకంగా వాళ్ల పోరాటాల గురించి చదువుదాం. ఈ దేశాలలో చాలా వాటిల్లో అనేక భాషలు, అనేక మతాలు ఉన్న వివిధ రకాల ప్రజలు ఉండేవాళ్లు. వీళ్లందరికీ తాము అంతా ఒక జాతి అన్న భావన అంతగా ఉండేది కాదు. ఈ ప్రాంతాలలో సాంప్రదాయ పాలకులుగా ఉన్న రాజులు, చక్రవర్తులు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి భావనలకు అంతగా మద్దతు పలికేవాళ్లు కాదు. కొత్త ఉద్యమాలు చోటుచేసు కోవటంతో యూరపులో వ్యాప్తిలో ఉన్న జాతీయతావాదం, ప్రజాస్వామ్యం, చివరికి సోషలిజం వంటి కొత్త భావనలతో ప్రజలు స్ఫూర్తి పొందసాగారు. కొన్ని దేశాలలోని అనుభవాలను, వలసపాలిత ప్రాంతాల లక్షలాది ప్రజల జీవితాలలో మార్పును అర్థం చేసుకోటానికి వీటిని మన దేశంలోని అనుభవాలతో పోల్చి చూద్దాం.

- జాతీయతా భావం అంటే ఏమిటో, అది ఎలా రూపుదిద్దుకుందో అర్థం చేసుకోటానికి 9వ తరగతి పాఠ్యపుస్తకాన్ని మరొకసారి చదవండి.
- ఆయాదేశాల సాంప్రదాయ పాలకులు స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉండి ఉంటే ఎటువంటి రాజకీయ వ్యవస్థలు ఏర్పడి ఉండేవి?
- వలసపాలిత ప్రాంతాలలో ఏ సామాజిక వర్గాలు స్వాతంత్ర్యం కోసం పోరాడాయి? సమానత్వం, ప్రజాస్వామ్యం అన్న భావనలు వాళ్ళకు ఎందుకు ముఖ్యం అయ్యాయి?

## చైనా : రెండు భిన్న దశలు

20వ శతాబ్దం ఆరంభంలో మంచూ వంశ చక్రవర్తులు చైనాని పాలిస్తూ ఉండేవాళ్లు. అయితే పాశ్చాత్య వలసపాలక శక్తులనుంచి చైనా ప్రయోజనాలను కాపాడగలిగే పరిస్థితిలో వాళ్లు లేరు. ఈ వలస పాలక శక్తులు చైనాలోని వివిధ ప్రాంతాలలో తమ 'ప్రాభవ ప్రాంతాలను' ఏర్పరచుకుని తక్కువ దిగుమతి పన్నులు చెల్లించడం, చైనా చట్టాలు తమకు వర్తించకపోవటం, సైనిక దళాలను కలిగి ఉండటం వంటి మినహాయింపులను ఇచ్చేలా చైనా చక్రవర్తులపై ఒత్తిడి తేగలిగారు. ఈ పరిస్థితుల పట్ల చైనాలోని పాలనాధికారులు, ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ప్రజలు అనేక తిరుగుబాట్లు చేశారు. పాలనాధికారులు అనేక సంస్కరణలకు ప్రయత్నించారు.

### గణతంత్రం ఏర్పాటు

మంచూ సామ్రాజ్యాన్ని కూలదోసి సన్‌యెట్-సెన్ (1866-1925) తన నేతృత్వంలో 1911లో గణతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. సన్‌యెట్-సెన్‌ని ఆధునిక చైనా నిర్మాతగా పరిగణిస్తారు. అతడు పేద కుటుంబానికి చెందినవాడు. అతడు చదివిన మిషనరీ పాఠశాలల్లో క్రైస్తవ మతంతోటి, ప్రజాస్వామ్య భావనలతోటి ప్రభావితం అయ్యాడు. అతడు వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు కానీ చైనా భవిష్యత్తు పట్ల ఎంతో ఆందోళన పడేవాడు. చైనా సమస్యలను అధ్యయనం చేసి ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాడు. అతడి కార్యక్రమాన్ని 'మూడు సిద్ధాంతాలు' అంటారు (సన్, మిన్, చుయి). ఇవి ఏవనగా "జాతీయతావాదం"- అంటే విదేశీ పాలకులుగా భావింపబడుతున్న మంచూ వంశాన్ని, ఇతర విదేశీ సామ్రాజ్యవాద శక్తులను పారదోలటం; "ప్రజాస్వామ్యం"- అంటే ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం; "సామ్యవాదం"- అంటే పరిశ్రమలపై నియంత్రణ, భూమిలేని రైతాంగానికి భూమిని పంచటానికి భూ సంస్కరణలు. మంచూ వంశాన్ని తొలగించి గణతంత్రాన్ని ప్రకటించినప్పటికీ, సన్ నాయకత్వంలోని గణతంత్ర ప్రభుత్వం స్థిరపడలేకపోయింది. 'యుద్ధ ప్రభువులు' అని పిలవబడే స్థానిక సైనిక శక్తుల నియంత్రణలో దేశం ఉంది.

సామాజిక, రాజకీయ అనిశ్చితి కొనసాగింది. వర్సయిల్స్‌శాంతి సమావేశం నిర్ణయాలను నిరసిస్తూ 1919 మే 4న బీజింగ్‌లో ఒక నిరసన ప్రదర్శన చేపట్టారు. మొదటి ప్రపంచ యుద్ధంలో గెలుపొందిన బ్రిటన్ పక్షాన ఉన్నప్పటికీ జపాను ఆక్రమించిన ప్రాంతాలు చైనాకి తిరిగి రాలేదు. ఈ నిరసన ఒక ఉద్యమంగా రూపొంది 'మే నాలుగు ఉద్యమం'గా పిలవబడసాగింది. పాత సాంప్రదాయాలను తిరస్కరించి ఆధునిక విజ్ఞానశాస్త్రం, ప్రజాస్వామ్యం, జాతీయతావాదం ద్వారా చైనా ముందుకు వెళ్లాలని ఒక తరం ఉద్యమించింది. దేశ వనరులను నియంత్రిస్తున్న విదేశీయులను తరిమెయ్యాలని, పేదరికాన్ని తగ్గించి, అసమానతలను తగ్గించాలని విప్లవకారులు కోరసాగారు. సాధారణ భాష, లిపిలను అనుసరించడం, మహిళల పరాధీనత, ఆడపిల్లల పాదాలు కట్టివెయ్యటం (ఆడపిల్లల పాదాలు పూర్తిగా పెరగకుండా నిరోధించే క్రూరమైన సాంప్రదాయం) వంటి వాటిని వ్యతిరేకించటం, వివాహంలో సమానత్వం, పేదరికాన్ని అంతం చెయ్యటానికి ఆర్థిక అభివృద్ధి వంటి సంస్కరణలను వాళ్లు ప్రతిపాదించారు.



*చిత్రం 15.1 : మే నాలుగు ఉద్యమంలో ప్రజల నిరసన*

- యువ చైనీయులు పాత సాంప్రదాయాలను, విదేశీ శక్తులను ఎందుకు వ్యతిరేకించసాగారు?
- ఇటువంటిది ఏమైనా భారతదేశంలో జరిగిందా?

గణతంత్ర విప్లవం తరువాత దేశం ఒక సంక్షోభ స్థితిలోకి నెట్టబడింది. దేశాన్ని ఐక్యం చెయ్యటానికి, సుస్థిరత సాధించటానికి కృషి చేసే ప్రధాన శక్తులుగా గుయోమిండాంగ్ (జాతీయ ప్రజాపార్టీ, దీనినే కెఎంటి అనేవాళ్లు), చైనా కమ్యూనిస్టు పార్టీ (సిసిపి) ఆవిర్భవించాయి. గుయోమిండాంగ్ రాజకీయ సిద్ధాంతానికి సన్‌యెట్ –సెన్ భావనలు ఆధారమయ్యాయి. కూడు, గుడ్డ, ఇల్లు, రవాణా అన్నవి 'నాలుగు ప్రధాన అవసరాలు'గా వాళ్లు గుర్తించారు. సన్‌యెట్ –సెన్ చనిపోయిన తరువాత గుయోమిండాంగ్ నాయకుడిగా చియాంగ్ కైషేక్ (1887–1975) ఎన్నికయ్యాడు. అధికారాన్ని హస్తగతం చేసుకున్న 'యుద్ధ ప్రభువుల'కు, స్థానిక నాయకులకు వ్యతిరేకంగానూ, కమ్యూనిస్టులను నిర్మూలించటానికీ అతడు సైనిక చర్యకు పూనుకున్నాడు. దేశాన్ని సైనిక దేశంగా మలచటానికి అతడు ప్రయత్నించాడు. ప్రజలు 'కలిసి పనిచేసే' సహజాత అలవాటుని పెంపొందించుకోవాలని అతడు కోరాడు.




*చిత్రం 15.2 : ఆ తరువాతి కాలంలోని గోడ పత్రిక : 'పాత ప్రపంచాన్ని కూలగొట్టు, కొత్త ప్రపంచాన్ని నిర్మించు'అని ఇది పేర్కొంటోంది.*

గుయోమిండాంగ్ సామాజిక మూలాలు పట్టణ ప్రాంతాలలో ఉన్నాయి. పారిశ్రామిక ప్రగతి పరిమితంగానూ, నిదానంగానూ ఉంది. ఆధునిక ప్రగతికి కేంద్రాలుగా మారిన షాంఘై వంటి నగరాలలో

1919 నాటికి 5 లక్షల పారిశ్రామిక కార్మిక వర్గం ఏర్పడింది. అయితే వీళ్లల్లో చాలా తక్కువ శాతం ఓడల నిర్మాణం వంటి ఆధునిక పరిశ్రమలలో ఉపాధి పొందారు. వీరిలో అధిక శాతం 'మధ్యతరగతి పట్టణవాసులు' (సియావో షిమిన్)గా పరిగణింపబడే వ్యాపారస్తులు, దుకాణదారులు ఉన్నారు. పట్టణ కార్మికులకు, ప్రత్యేకించి మహిళలకు చాలా తక్కువ వేతనాలు లభించేవి. వాళ్లు కార్మిక సంఘాలలో సంఘటితం కాసాగారు. పని గంటలు సుదీర్ఘంగా ఉండటమే కాకుండా పని పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. స్వేచ్ఛా భావనలు ఆదరణ పొందటంతో మహిళల హక్కుల గురించి, సమానత్వం పునాదిపై కుటుంబాలను నిర్మించటం, ప్రేమ వంటి వాటి గురించి ఆలోచించటం, చర్చించటం మొదలుపెట్టారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విస్తరించటంతో (పెకింగ్ విశ్వవిద్యాలయం 1902లో ఏర్పడింది) సామాజిక, సాంస్కృతిక మార్పులకు ఊతం లభించింది. ఈ కొత్త ఆలోచనల పట్ల పెరుగుతున్న ఆకర్షణను సూచిస్తూ జర్నలిజం విలసిల్లింది.

- ఈ కాలంలో ఆవిర్భవించిన ముఖ్యమైన రాజకీయ పార్టీలు ఏమి?
- ఇటువంటి సమీకరణల్లో సభ్యులు ఎవరు?
- వాళ్లు ఆశించిన సామాజిక, ఆర్థిక మార్పుల స్వరూపం ఏమిటి?

చియాంగ్ సాంప్రదాయవాది. మహిళల పాత్ర ఇంటికి పరిమితమై ఉందని, 'పాతివ్రత్యం, రూపం, మాట, పని' అన్న నాలుగు సుగుణాలపై వాళ్లు శ్రద్ధ పెట్టాలని అతడు భావించేవాడు. ఆడవాళ్లు ధరించే గౌనులు ఎంత పొడవు ఉండాలన్నది కూడా సిఫారసు చెయ్యసాగారు. ఫ్యాక్టరీ యజమానులకు ప్రోత్సాహకంగా కార్మిక సంఘాలను అణిచివెయ్యటానికి కూడా అతడు పూనుకున్నాడు. గుయోమిండాంగ్ పార్టీ తన సంకుచిత సామాజికతత్వం వలన, రాజకీయ దూరదృష్టి లోపించడం వలన దేశంలో ఏకత్వం సాధించడంలో విఫలమైంది. సన్‌యెట్-సెన్ కార్యక్రమం లోని ప్రధాన అంశమైన పెట్టుబడి నియంత్రణ, భూమి సమాన పంపిణి అన్న వాటిని అమలు చెయ్యనే లేదు. పెరుగుతున్న సామాజిక అసమానతలను, రైతాంగాన్ని పార్టీ పట్టించుకోలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి బదులు సైన్యంతో శాంతిభద్రతలను కల్పించటానికి ప్రయత్నించారు.

## చైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం

1937లో చైనాపై జపాను దండెత్తినప్పుడు గుయోమిండాంగ్ వెనకడుగు వేసింది. సుదీర్ఘ యుద్ధం వల్ల చైనా బలహీనపడింది. 1945-1949 మధ్యకాలంలో ధరలు నెలకి 30 శాతం చొప్పున పెరిగాయి, దీంతో సాధారణ ప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. గ్రామీణ చైనా రెండు సంక్షోభాలను ఎదుర్కొంది: మొదటిది నేలలు నిస్సారం కావటం, అడవులు నరికివెయ్యటం, వరదల వంటి జీవావరణ పరమైనది. రెండవది దోపిడీపూరిత భూమి కౌలు విధానాలు, రుణ భారం, పురాతన సాంకేతిక విజ్ఞానం, అభివృద్ధి చెందని ప్రసార మాధ్యమాలతో కూడిన సామాజిక - ఆర్థిక పరమైనది.

రష్యా విప్లవం తరువాత కొద్దికాలానికే 1921లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. రష్యా సాధించిన విజయం ప్రపంచంపై బలమైన ప్రభావాన్ని చూపింది. దోపిడీని అంతంచేసే ప్రపంచ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యటానికి దోహదపడే కొమిన్‌టర్న్‌ని లెనిన్ వంటి నాయకులు 1918 మార్చిలో స్థాపించారు. వివిధ దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలకు సోవియట్ యూనియన్, కొమిన్‌టర్న్ మద్దతు ఇచ్చాయి. అయితే, పట్టణాలలోని శ్రామిక వర్గం ద్వారానే విప్లవం వస్తుందన్న సాంప్రదాయ మార్క్సిస్టు అవగాహనతోనే అవి పనిచేయసాగాయి. సిసిపి నాయకుడిగా ఎదిగిన మావో జెడాంగ్ (1893-1976) తన విప్లవ కార్యక్రమానికి రైతాంగాన్ని ఆధారంగా చేసుకుని భిన్నమైన పంథాని అవలంబించసాగాడు. భూస్వామ్యాన్ని అంతం చెయ్యటానికి పోరాడేలా అతడు చైనా రైతాంగాన్ని సంఘటితం చేస్తూ రైతాంగ సైన్యాన్ని నిర్మించసాగాడు. సిసిపి నాయకత్వంలోని పోరాటంలో భూమిలేని రైతాంగం లక్షలాదిగా

చేరసాగారు. అతడి విజయాలు సిసిపిని బలమైన రాజకీయ శక్తిగా రూపొందించి, అంతిమంగా గుయోమిండాంగ్‌పై విజయం సాధించేలా చేశాయి. గుయోమిండాంగ్ దాడుల నుంచి రక్షణనిచ్చే జియాంగ్క్సి పర్వతాలలో 1928 నుంచి 1934 వరకు బస చెయ్యటం మావో జెడాంగ్ భిన్నమైన పంథాని సూచిస్తుంది. భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకుని పున: పంపిణీ చెయ్యటం ద్వారా బలమైన రైతాంగ సంఘాలను (సోవియట్లను) నిర్మించాడు. ఇతర నాయకుల లాగా కాకుండా స్వతంత్రంగా ఉండే ప్రభుత్వం, సైన్యాలను మావో నిర్మించాడు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గ్రామీణ మహిళాసంఘాల ఏర్పాటును ప్రోత్సహించాడు. పెద్దలు కుదిర్చిన వివాహాలను నిషేధిస్తూ, వివాహ ఒప్పంద పత్రాల కొనుగోలు, అమ్మకాలను నిలిపివేస్తూ, విడాకుల విధానాన్ని సరళీకృతం చేస్తూ కొత్త వివాహ చట్టాన్ని చేశారు.



*చిత్రం 15.3 : 1944లో యానాన్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మావో*

కమ్యూనిస్టుల సోవియట్లను గుయోమిండాంగ్ చక్రబంధం చెయ్యటంతో పార్టీ తమ స్థావరాన్ని మార్చుకోవలసి వచ్చింది. దీంతో 'లాంగ్ మార్చ్'గా ప్రఖ్యాతిగాంచిన షాంక్సికి 6000 మైళ్ల కష్టభూయిష్ట ప్రయాణం (1934–35) మొదలయ్యింది. ఇక్కడ యానాన్‌లోని తమ కొత్త స్థావరంలో యుద్ధ ప్రభువులను అంతమొందించి, విదేశీ సామ్రాజ్యవాదంపై పోరాడటానికి, భూసంస్కరణలు చేపట్టటానికి తమ కార్యక్రమాన్ని మరింత తీవ్రతరం చేశారు. భూ సంస్కరణలు, జాతీయకరణ అన్న ఈ రెండు అంశాల కారణంగా పార్టీకి బలమైన సామాజిక పునాది ఏర్పడింది.

1937–1945 మధ్యకాలంలో చైనాపై జపాను దండెత్తి చాలా భూభాగాన్ని ఆక్రమించింది. క్రూర, వలస, సైనిక పాలనను జపాను అమలు చెయ్యటంతో చైనా సమాజం, ఆర్థిక పరిస్థితి దారుణంగా ప్రభావితమయ్యాయి. జపాను ఆక్రమణను ప్రతిఘటించటానికి గుయోమిండాంగ్, సిసిపి చేతులు కలిపాయి. 1945 ఆగస్టులో అమెరికాకి జపాన్ దాసోహం అయిన తరువాత చైనాపై ఆధిపత్యం కోసం గుయోమిండాంగ్, సిసిపిల మధ్య పూర్తిస్థాయి యుద్ధం జరిగింది. అంతిమంగా చైనా ప్రధాన భూభాగంపై పట్టు సాధించటంలో సిసిపి విజయమయ్యింది. గుయోమిండాంగ్‌కి తైవాన్ దీవిలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే పరిస్థితి కలిగింది.

### నూతన ప్రజాస్వామ్యం ఏర్పాటు : 1949–1954

1949లో చైనా ప్రజల గణతంత్రం ఏర్పడింది. ఇది 'నూతన ప్రజాస్వామ్యం' అన్న సిద్ధాంతంపై ఏర్పడింది. భూస్వామ్య విధానాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే సామాజిక వర్గాలన్నీ ఈ సిద్ధాంతం ఆధారంగా ఏకమయ్యాయి. ఆర్థిక విధానంలోని కీలకాంశాలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచారు. అధికారంలోకి వచ్చిన తరువాత సిసిపి పెద్ద ఎత్తున భూ సంస్కరణలు అమలు చేసింది – అంటే భూస్వాముల భూమిని జప్తు చేసి పేద రైతాంగానికి పంచిపెట్టారు. మహిళల రక్షణకు, వాళ్ల హక్కులకు, బహు భార్యత్వ నిషేధానికి కూడా కొత్త ప్రభుత్వం చట్టాలుచేసింది. దీనివల్ల మహిళలు వివిధ రంగాలలో పురుషులతో సమాన హోదా పొందగలిగారు.

## భూ సంస్కరణలు

గ్రామీణ పరిస్థితిని అర్థం చేసుకోవటం, రైతాంగ సంఘాల నిర్మాణం వంటి వాటితో రెండు సంవత్సరాలు శాంతియుతంగా గడిచిన తరువాత 1950–51లో భూ సంస్కరణల అమలు మొదలుపెట్టారు. గ్రామాలలో ఉంటున్న అందరి వర్గాలను గుర్తించటం, తరువాత భూస్వాముల భూమి, ఇతర ఉత్పాదక ఆస్తులను స్వాధీనం చేసుకుని తిరిగి పంచటం వంటివి దీంట్లో ముఖ్యమైన దశలు. ఈ ప్రక్రియలో ప్రధాన భూమికను "ప్రాంత స్థాయి భూ సంస్కరణల సంఘం" పంపించిన పని బృందాలు పోషించాయి. రైతాంగ సంఘాలను ఏర్పాటు చెయ్యటం, స్థానిక నాయకత్వ స్థానాలకు వాటినుంచి క్రియాశీలక సభ్యులను ఎంపిక చెయ్యటం వీటి ముఖ్య విధుల్లో భాగంగా ఉండేది. ఈ కొత్త నాయకత్వం ప్రధానంగా పేద, మధ్యతరగతి రైతాంగం నుంచి ఏర్పడింది. పలు ప్రాంతాలలో తమ నైపుణ్యాల కారణంగా మధ్యతరగతి రైతాంగం ఆధిపత్యంలోకి వచ్చింది. అంతేకాకుండా ప్రజా సమావేశాలు, బహిరంగ విచారణల ద్వారా భూస్వాములకు వ్యతిరేకంగా గ్రామం అంతటిని సమీకరించటానికి పని బృందాలు ప్రయత్నించాయి.



*చిత్రం 15.4 : భూమి రికార్డులను తగలబెడుతున్న ప్రజలు*

ఈ పద్ధతుల వల్ల భూస్వాములు ప్రజా అవమానాలకు గురయ్యారు. విచారణలలో ఈ వర్గం వాళ్లకు మరణశిక్ష విధించారు. ఈ విధంగా ఈ వర్గానికి చెందిన 10–20 లక్షల మందిని చంపి ఉంటారు.

ఆర్థిక సంస్కరణల కార్యక్రమంలో భాగంగా చైనా సాగుభూమిలో 43 శాతాన్ని గ్రామీణ ప్రజలలో 60 శాతానికి పంచిపెట్టడంలో భూసంస్కరణలు విజయం సాధించాయి. పేదరైతుల కింద భూమి గణనీయంగా పెరిగింది. అయితే ముందునుంచి మధ్యతరగతి రైతాంగం బలమైన స్థితిలో ఉన్నందువల్ల అది ఎక్కువ ప్రయోజనం పొందింది.

పాత సంపన్న వర్గానికి చెందిన అధికారం, ఆర్థిక వనరులను తీసేసుకోగా ఇంకోవైపున సిసిపి ద్వారా రాజకీయ రంగంలోకి వచ్చిన పేద, మధ్యతరగతికి చెందిన గ్రామ కార్యకర్తల నుంచి కొత్త కులీన వర్గం ఏర్పడసాగింది. భూ సంస్కరణలతోపాటు రాజకీయ విద్య, అక్షరాస్యతలను వ్యాపింపచెయ్యటానికి పెద్ద ఎత్తున వయోజన రైతాంగ పాఠశాలలను ప్రారంభించారు. దీనితోపాటు గ్రామాల్లోని చిన్న పిల్లలకు, పెద్దవాళ్లకు ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు.

- యుద్ధంలో గెలవటానికి సిసిపికి భూ సంస్కరణలు ఎలా దోహదపడ్డాయి?
- భారతదేశంలో అమలు అయిన భూ సంస్కరణలను చైనాలో జరిగిన వాటితో పోల్చండి. వాటి మధ్య పోలికలు, తేడాలను పేర్కొనండి.
- దేశ అభివృద్ధికి, స్వాతంత్ర్యానికి స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు, వాళ్ల సమాన భాగస్వామ్యం అవసరమన్న దృక్పథంతో మీరు ఏకీభవిస్తారా?

విప్లవ తొలి సంవత్సరాలలో భూ సంస్కరణలు అమలుచెయ్యటంలోనూ, అందరికీ ప్రాథమిక విద్యను అందించటంలోనూ సాధించిన విజయాలు చైనా భవిష్యత్తు ప్రగతికి బలమైన పునాదిగా నిలిచాయని మేధావులంతా సాధారణంగా ఏకీభవిస్తారు.

సిపిపి పాలన క్రమేపీ ఏక పార్టీ పాలనకు దారితీసింది. సిపిపికి చెందిన అధినాయకులు, లేదా 'చైర్మన్' చాలా శక్తిమంతులుగా ఎదిగారు. ప్రతిపక్ష కార్యకలాపాలు అణగదొక్కబడ్డాయి.

## వియత్నాం : ఇద్దరు వలస పాలకులకు వ్యతిరేకం

### వలసపాలన అనుభవం

19వ శతాబ్ద మధ్యకాలం నాటికి ఫ్రెంచి ప్రత్యక్ష పాలన కిందకి వియత్నాం వచ్చింది. ఫ్రెంచి పాలకులు వియత్నాం చక్రవర్తిని తమ చేతిలో కీలుబొమ్మగా చేసుకుని భారతదేశాన్ని బ్రిటిష్ వాళ్లు పాలించినట్లే పాలించారు. భారతదేశాన్ని బ్రిటన్ ప్రభావితం చేసినట్లే వియత్నామీయుల జీవితాలలో అన్ని అంశాలను ఫ్రెంచి వాళ్లు ప్రభావితం చేశారు.




పటం 2 : వియత్నాం

### ఎగుమతులు, భూస్వామ్యవాదం, రైతాంగం

వియత్నాంని వరిని ఎగుమతి చేసే దేశంగా అభివృద్ధి చెయ్యాలని ఫ్రెంచి చాలా ఆసక్తి కనబరిచింది. ఇందుకు అది మూడు ఎత్తుగడలను అనుసరించింది – సాగునీటి సదుపాయాన్ని మెరుగుపరచటం, భూస్వాములను ప్రోత్సహించటం, వరి, రబ్బరు వంటి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కి సహకరించటం. మెకాంగ్ డెల్టా ప్రాంతంలో సాగు విస్తీర్ణాన్ని పెంచటానికి ఫ్రెంచివాళ్లు బీడు భూముల నుంచి నీటిని తోడి కాలవల నిర్మాణం చేపట్టారు. ఈ విస్తృత సాగునీటి పనులలో ముఖ్యంగా కాలవలు, కరకట్ట నిర్మాణంలో బలవంతంగా పనిచేయించి వాటిని పూర్తి చేశారు. దీని ఫలితంగా వరి ఉత్పత్తి పెరిగి అంతర్జాతీయ మార్కెట్లో దానిని ఎగుమతి చెయ్యటం సాధ్యమయ్యింది. వియత్నాం తన వరి ఉత్పత్తిలో మూడింట రెండు వంతులు ఎగుమతి చేయసాగింది. 1931 నాటికి వియత్నాం ప్రపంచంలో మూడవ అతి పెద్ద బియ్యం ఎగుమతిదారుగా ఎదిగింది. దీనితోపాటు వాణిజ్య సరుకుల రవాణా కోసం, సైనిక కేంద్రాలను తరలించటానికి, మొత్తం ప్రాంతాన్ని తమ అదుపులో పెట్టుకోవడానికి మౌలిక సదుపాయాలను (రోడ్లు, రైలు మార్గాల) అభివృద్ధి చేసారు. వియత్నాం ఉత్తర, దక్షిణ ప్రాంతాలను, చైనాను కలిపే ఇండో–చైనా ఖండాంతర రైలుమార్గ నిర్మాణాలను మొదలుపెట్టారు.

వియత్నాం వలసపాలిత ఆర్థిక పరిస్థితి ప్రధానంగా ఫ్రెంచి, కొంతమంది సంపన్న వియత్నామీయుల అధీనంలో ఉన్న వరి ఉత్పత్తి, రబ్బరు సాగుపై ఆధారపడి ఉంది. రబ్బరు తోటలలో వెట్టి కార్మికులను ఉపయోగించుకునేవాళ్లు. ఆర్థిక వ్యవస్థ పారిశ్రామికీకరణ చెందటానికి ఫ్రెంచివాళ్లు ఏమీ చెయ్యలేదు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్యం పెరిగి పెద్ద పెద్ద భూస్వాములు చిన్న రైతుల భూములను చేజిక్కించుకుని వారితో కౌలు రైతులుగా పని చేయించుకునేవాళ్లు. ఫలితంగా రైతాంగ జీవనప్రమాణం పడిపోయింది.

దశాబ్దాల పాటు సాగిన భూ పరాయీకరణ, ఫ్రెంచివాళ్లకు/ వాళ్ల పక్షాన నిలిచిన వియత్నామీయులకు కొన్ని అంశాలలో మినహాయింపులు ఇవ్వటం వల్ల భూమి పెద్ద, సంపన్న భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతం కాసాగింది. భూమి లేకపోవటం, లేదా నామమాత్రంగా ఉండటంతో వియత్నాం రైతాంగం అప్పుల విష వలయంలో చిక్కుకుపోయి బయటపడలేక పోయేది. గ్రామ పెద్దలైన భూస్వాములు విధించే అధిక పన్నులు, అధిక కౌలు, అధిక వడ్డీ భారం కింద రైతాంగం నలిగిపోసాగింది. 1930

నాటికి భూమిలేనితనం, భూ యాజమాన్యానికి సంబంధించిన గణాంకాలు వియత్నాం రైతాంగం ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులను వెల్లడి చేశాయి. అన్నాం అనే ప్రాంతంలో సుమారుగా 53% కుటుంబాలకు అసలు ఏమాత్రం భూమి లేదు. టోన్‌కిన్, కొచిన్‌చినాలో సుమారుగా 58%, 79% కుటుంబాలకు అరంగుళం భూమి కూడా లేదు. 1930లలో భూమి ఉన్న కుటుంబాలలో అత్యధిక శాతం ఆకలికి గురయ్యారంటే భూమిలేని కూలీల పరిస్థితి ఏమిటో ఊహించుకోండి!

- వియత్నాంలో రైలు మార్గాలను, కాలవలను ఫ్రెంచివాళ్లు ఎందుకు అభివృద్ధి చేశారు?
- భూమిలేని రైతాంగానికీ, భూమిలేని కార్మికునికీ మధ్య తేడా ఏమిటి?
- బ్రిటిష్ పాలనలోని భారతదేశ రైతాంగ పరిస్థితి గురించి మీరు చదివారు. వియత్నాం రైతాంగ స్థితికీ, దీనికీ పోలికలు ఏమిటి?

భూస్వాముల నుంచి భూమి తీసుకున్న రైతాంగం దానికి కౌలు చెల్లించటమే కాకుండా భూస్వామి పొలాల్లోనూ, వాళ్ల ఇళ్లలోనూ పని చేయాలి. అంతేకాకుండా వాళ్లు ఇష్టంవచ్చినట్టు విధించే అనేక రకాల పన్నులను కూడా చెల్లించాలి. వీటివల్ల భూస్వాములనుంచి రైతాంగం బియ్యం, డబ్బు అప్పుగా తీసుకోక తప్పేది కాదు. దాంతో వాళ్లు మరింతగా రుణ బంధాలలో కూరుకుపోయేవాళ్లు.

### "నాగరికులుగా చేసే బాధ్యత"

బ్రిటిష్ వాళ్లలాగానే ఫ్రెంచి వలస పాలకులు కూడా వలస పాలిత ప్రజలు అనాగరికులని తమ పాలనతో ఆధునిక నాగరికత ఫలాలను అందించటం తమ కర్తవ్యమని వాళ్లు భావించారు. 'స్థానికులను' నాగరికులుగా చెయ్యటానికి విద్య ఒక మార్గంగా భావించారు. ఫ్రెంచి వాళ్లకు చదువుకున్న కార్మికుల అవసరం ఉంది కానీ విద్య వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని భయపడసాగారు. ఒకసారి విద్యావంతులైన తరువాత వియత్నామీయులు వలస పాలకుల ఆధిపత్యాన్ని ప్రశ్నించవచ్చు. అంతేకాకుండా వియత్నాంలో ఉంటు ఫ్రెంచి పౌరులు చేస్తున్న టీచర్లు, దుకాణదారులు, పోలీసులు వంటి ఉద్యోగాలను విద్యావంతులైన వియత్నామీయులు లాగేసుకుంటారని భయపడసాగారు. కాబట్టి వీళ్లు వియత్నామీయులకు పూర్తి ఫ్రెంచివిద్యను అందించే విధానాలను వ్యతిరేకించసాగారు. ప్రాథమిక స్థాయిలో వియత్నామీ భాషను నేర్పినప్పటికీ ఉన్నతవిద్య అంతా ఫ్రెంచి భాషలో ఉండేది. జనాభాలో చాలా తక్కువగా ఉన్న వియత్నాం సంపన్నుల పిల్లలు మాత్రమే ఫ్రెంచి బడిలో చేరగలిగేవాళ్లు. అలా బడిలో చేరిన వాళ్లలో చాలా కొద్దిమంది మాత్రమే పాఠశాల విద్య పూర్తి చేసే పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యేవాళ్లు. పాఠ్యపుస్తకాలు ఫ్రెంచివాళ్లను పొగుడుతూ, వలసపాలనను సమర్థించేవి.

- భారతదేశంలో బ్రిటిషువాళ్లు అనుసరించిన విధానాన్ని గుర్తుచేసుకోటానికి ప్రయత్నించండి. భారతదేశంలో బ్రిటిషువాళ్లు, వియత్నాంలో ఫ్రెంచివాళ్లు అనుసరించిన వలసపాలన విధానాలను పోల్చండి. వాటి మధ్య పోలికలు, ఏమిటి, తేడాలు ఏమిటి?

### వియత్నాం జాతీయతావాద ఆవిర్భావం

ఫ్రెంచివాళ్లు ఇచ్చిన పాఠ్యాంశాలను టీచర్లు, విద్యార్థులు గుడ్డిగా అనుసరించలేదు. కొన్నిసార్లు దీనిని బహిరంగంగా, కొన్నిసార్లు మౌనంగా నిరసన వ్యక్తం చేసేవారు. కింది తరగతులలో వియత్నాం టీచర్ల సంఖ్య పెరుగుతుండటంతో వారి బోధనను నియంత్రించటం కష్టమైపోయింది. పాఠాలు చెప్పేటప్పుడు వియత్నాం టీచర్లు పాఠాలలో ఉన్నదానిని మార్చి ఫ్రెంచి ప్రభుత్వాన్ని విమర్శించే వారు. కార్యాలయాలలో ఉద్యోగాలకు వియత్నామీయులను అనర్హులుగా చేసేవిధంగా ఉన్న వలస ప్రభుత్వ ప్రయత్నాలను విద్యార్థులు ప్రతిఘటించసాగారు. దేశభక్తి

భావంతో సమాజ ప్రయోజనం కోసం పోరాడటం విద్యావంతుల విధి అన్న నమ్మకంతో వారు ప్రేరణ పొందారు. దీంతో వాళ్లు తమ స్థానానికి ముప్పు వాటిల్లుతుందని భయపడే ఫ్రెంచి పాలకులతోనూ, స్థానిక సంపన్నులతోనూ ఘర్షణ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1920ల నాటికి విద్యార్థులు యువ అన్నాం పార్టీ వంటి రాజకీయ పార్టీలను ఏర్పాటుచేసి 'అన్నామీస్ స్టూడెంట్' వంటి పత్రికలను ప్రచురించసాగారు.

20వ శతాబ్ది ఆరంభంలో ఆధునిక విద్యకోసం వియత్నాం విద్యార్థులు జపాను వెళ్లసాగారు. వాళ్లల్లో చాలామంది ప్రధాన ఉద్దేశం వియత్నాంనుంచి ఫ్రెంచివాళ్లను తరిమెయ్యటం, కీలుబొమ్మ చక్రవర్తిని తొలగించి అంతకుముందు ఫ్రెంచివాళ్లు పడదోసిన ఎన్‌గుయెన్ వంశాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావటం.

చైనాలో సన్ యట్-సేన్ గణతంత్ర విప్లవం సాధించిన తరువాత వియత్నాంలో కూడా గణతంత్ర, ప్రజాస్వామిక పాలనను ఏర్పాటు చేయటానికి అక్కడి ప్రజలు ప్రేరణ పొందారు. చాలామంది విద్యార్థులు ఆ కాలంలో కొత్త రాజకీయ భావాల గురించి తెలుసుకోటానికి చైనా, ఫ్రాన్స్, రష్యా దేశాలకు వెళ్లసాగారు.

### *తిరుగుబాటుదారులుగా మహిళలు*

*వియత్నాం మహిళలు, ప్రత్యేకించి కింది వర్గాల వారు సాంప్రదాయంగా పురుషులతో సమానత్వాన్ని అనుభవించే వాళ్లు. అయితే ప్రజా జీవితంలో వాళ్ల పాత్ర ఉండేది కాదు, తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం ఉండేది కాదు.*

*జాతీయతా ఉద్యమం పెరుగుతున్న తరుణంలో మహిళల హోదా గురించి ఆలోచన మొదలయ్యి స్త్రీతత్వానికి కొత్త రూపు అన్వయించసాగారు. సామాజిక నియమాలను వ్యతిరేకించిన మహిళలను రచయితలు, రాజకీయ మేధావులు కొనియాడసాగారు. 1930లలో నాలిన్ రాసిన నవలలో ఒక మహిళ బలవంతపు పెళ్లి నుంచి బయటకు వచ్చి తనకు నచ్చిన వ్యక్తిని – అతను జాతీయ ఉద్యమంలో పనిచేస్తున్నాడు – పెళ్లి చేసుకుంటుంది. ఈ నవల ఆరోజుల్లో పెద్ద సంచలనం కలిగించింది. సామాజిక నియమాలపై తిరుగుబాటు వియత్నాం సమాజంలో నూతన మహిళ ఆవిర్భావాన్ని సూచిస్తుంది.*

1930ల నాటి ఆర్థిక మాంద్యం వియత్నాంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. రబ్బరు, బియ్యం ధరలు పడిపోయి గ్రామీణ రుణభారం, నిరుద్యోగం పెరిగిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రజలు తిరుగుబాటు చెయ్యసాగారు. వీటిని ఫ్రెంచివాళ్లు ఉక్కుపాదంతో అణిచివెయ్యసాగారు. నిరసనకారులపై విమానాలతో బాంబులు కూడా వేశారు.

1930 ఫిబ్రవరిలో హొ చి మిన్ (అతడు కొన్నాళ్లు ఫ్రాన్స్‌లోనూ, రష్యాలోనూ ఉన్నాడు) పరస్పరం పోటీపడుతున్న జాతీయతా బృందాలను కలిపి వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (వియత్నాం కాంగ్ సాన్ డాంగ్)ని ఏర్పాటు చేశాడు. ఆ తరువాత దీని పేరు ఇండో-చైనీస్ కమ్యూనిస్టు పార్టీగా మార్చారు. ఐరోపాలోని కమ్యూనిస్టు పార్టీల మిలిటెంట్ ప్రదర్శనలతో అతడు స్ఫూర్తి పొందాడు.

ఆగ్నేయ ఆసియాపై తన ఆధిపత్యం సాధించాలన్న సామ్రాజ్యవాద కాంక్షలో భాగంగా జపాను 1940లో వియత్నాంను ఆక్రమించింది. దాంతో జాతీయవాదులు ఫ్రెంచివాళ్లనే కాకుండా జపనీయులను కూడా వ్యతిరేకించాల్సి వచ్చింది. అయితే అప్పటికే రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఫ్రాన్స్ మొత్తాన్ని ఆక్రమించటం వల్ల ఫ్రెంచివారు బలహీనస్థితిలో ఉన్నారు. వియత్నాం స్వాతంత్ర

- బియ్యం ధరలు పడిపోవటంతో గ్రామీణ రుణభారం ఎందుకు పెరిగింది?
- వియత్నాం, చైనాలలో జాతీయతావాదం ఏర్పడటంలో యువత, విద్యార్థులు ముఖ్య పాత్ర పోషించారు. వీటి మధ్య పోలికలు, తేడాలను చర్చించండి.
- స్వతంత్ర వియత్నాం ప్రభుత్వం తీసుకున్న మొదటి చర్యలలో భూమి కౌలు తగ్గించటం ఒకటి. ఈ చర్య ఎందుకు చేపట్టారు?



చిత్రం 15.5 : హెూచిమిన్

సమితి – (వియత్‌నాం డాక్ లాప్ డాంగ్ మిన్) దీనిని వియత్‌మిన్‌గా పిలుస్తారు – జపనీయుల ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి 1945 సెప్టెంబరులో హనాయ్‌ని తిరిగి స్వాధీనం చేసుకుంది. వియత్నాం ప్రజాస్వామ్య గణతంత్రం ఏర్పడింది. హెూచిమిన్ దానికి చైర్మన్ అయ్యాడు. 1945 ఆగస్టులో వియత్‌మిన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భూమి కౌలును 25 శాతం తగ్గించారు. మారు కౌలుకి ఇవ్వటాన్ని నిషేధించారు. 1945 ఆగస్టు నాటికి ఉన్న కౌలుదార్ల కౌలు బకాయిల మొత్తాన్ని మాఫీ చేశారు. ఉమ్మడి భూమిని, ఫ్రెంచివాళ్ల అధీనంలో ఉన్న భూమిని, వియత్నాం విద్రోహుల భూమిని ప్రజలకు పంచసాగారు.

## వియత్నాంలో నూతన గణతంత్ర వ్యవస్థ

కొత్తగా ఏర్పడిన ఈ గణతంత్ర దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంది. చక్రవర్తి బావో దాయిని కీలుబొమ్మగా చేసి వియత్నాంపై నియంత్రణను తిరిగి సాధించటానికి ఫ్రెంచివాళ్లు ప్రయత్నించారు. ఫ్రెంచి దాడుల నేపథ్యంలో వియత్‌మిన్ సభ్యులు కొండలలో తలదాచుకోవలసి వచ్చింది. ఎనిమిది సంవత్సరాల యుద్ధం తరువాత 1954లో డీన్ బీన్ ఫు వద్ద ఫ్రెంచి ఓడిపోయింది. 16,000 ఫ్రెంచి సైనికులు, అధికారులను యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నారు.

ఫ్రెంచివాళ్లు ఓడిపోయిన తరువాత జెనీవాలో జరిగిన శాంతి సంప్రదింపులలో దేశాన్ని రెండుగా విభజించటానికి వియత్నాం ప్రజలను ఒప్పించారు. దేశం ఉత్తర, దక్షిణ భాగాలుగా రెండుగా ఏర్పడింది. హెూచిమిన్, కమ్యూనిస్టులు ఉత్తర భాగంలో అధికారానికి వచ్చారు. దక్షిణ భాగానికి పురాతన చక్రవర్తిని అధిపతిగా చేశారు. అయితే అనతికాలంలోనే అతడిని పడదోసి ఎన్‌గో డిన్ డీం అధికారంలోకి వచ్చాడు. అతడు అణచివేత, నియంతృత్వపు ప్రభుత్వాన్ని ఏర్పరిచాడు. అతడిని వ్యతిరేకించిన వాళ్లనందరినీ జైలుపాలు చేశాడు. అతడి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా "జాతీయ విముక్తి సమాఖ్య" (ఎన్.ఎల్.ఎఫ్.) అనే పేరుతో ప్రజలు పోరాడసాగారు.

- ఇటువంటి భూ సంస్కరణలు వియత్నాం సమాజంపై ఎటువంటి ప్రభావాన్ని చూపి ఉంటాయి? గ్రామీణ ప్రాంతాలలోని వివిధ సామాజిక వర్గాల దృష్ట్యా దీనిని చర్చించండి.
- చైనా, వియత్నాం, భారత దేశాలలోని భూ సంస్కరణల తీరును పోల్చండి.

ఉత్తర వియత్నాంలో ఈ కాలం వరకు భూమికౌలు తగ్గించటం పైన, ఫ్రెంచి లేదా జపనీయుల పక్షాన బహిరంగంగా నిలిచిన భూస్వాముల భూములను మాత్రమే స్వాధీనం చేసుకోవటంపైన దృష్టి పెట్టినందు వలన భూ సంస్కరణల కోసం పట్టు పట్టలేదు. అయితే, 1954 తరువాత ఉత్తర వియత్నాంలో భూసంస్కరణలలో కొత్త యుగం మొదలయ్యింది. భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకుని భూమిలేని రైతాంగానికి, పేద రైతులకు భూమిని పంచారు. సొంత భూమి అనే యుగయుగాల రైతుల కలను నిజం చెయ్యటంతో వియత్నాం రైతాంగం పూర్తి మద్దతు వాళ్లకు లభించింది.

## యుద్ధంలోకి దిగిన అమెరికా

ఉత్తర వియత్నాంలోని హెూచిమిన్ ప్రభుత్వ సహాయంతో దేశాన్ని ఏకం చెయ్యటానికి ఎన్ ఎల్ ఎఫ్ పోరాడసాగింది. ఈ పరిణామాలతో అమెరికా భయపడసాగింది. కమ్యూనిస్టుల ప్రాబల్యం

### ఏజెంట్ ఆరెంజ్ : అత్యంత విష పదార్థం

*ఏజెంట్ ఆరెంజ్ ఆకులు రాలిపోయేలా చేసి మొక్కల్ని చంపే విషం. నారింజ పట్టీ ఉన్న డ్రమ్ములలో నిల్వ చెయ్యటం వల్ల దానికి ఆ పేరు వచ్చింది. **1961-1971** మధ్య కాలంలో అమెరికా కార్గో యుద్ధ విమానాలు వియత్నాంపై **500** లక్షల లీటర్ల ఈ విషపూరిత రసాయనాన్ని చల్లాయి. అడవులను, పొలాలను నిర్మూలించటం ద్వారా ప్రజలు దాక్కోటానికి అవకాశం లేకుండా చేసి వాళ్లని తేలికగా చంపొచ్చన్నది అమెరికా ప్రణాళిక. దేశంలోని 14 శాతం సాగుభూమి ఈ విషపూరిత రసాయనం వల్ల ప్రభావితం అయ్యింది. దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ఈనాటికి కూడా ప్రజలపై దాని ప్రభావం ఉంది. ఏజెంట్ ఆరెంజ్‌లోని రసాయనిక అంశమైన డైఆక్సిన్ పిల్లల్లో మెదడు దెబ్బతినటానికి, క్యాన్సర్‌కి కారకం. ఈ మందు పిచికారీ చేసిన ప్రాంతాల్లో పిల్లలలో అవయవలో పాలు అధికంగా ఉండటానికి ఈ విషమే కారణమని ఒక అధ్యయనం వెల్లడి చేసింది.*

*రసాయనిక ఆయుధాలతో సహా అమెరికా జోక్యంలో భాగంగా (ప్రధానంగా పౌరులను లక్ష్యంగా చేసుకుని) వియత్నాంపై వేసిన బాంబుల మొత్తం బరువు రెండవ ప్రపంచ యుద్ధకాలం మొత్తంలో కంటే ఎక్కువ.*

పెరుగుతుందన్న ఆందోళనతో సైన్యాన్ని, ఆయుధాలను ఉత్తర వియత్నాంకు పంపించి అది ప్రత్యక్ష జోక్యానికి నిర్ణయించుకుంది.

యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవటం వల్ల వియత్నామీయులకే కాకుండా అమెరికాకి కూడా చాలా భారంగా పరిణమించింది. 1965 నుంచి 1972 మధ్య కాలంలో వియత్నాం యుద్ధంలో 34,00,000 అమెరికా సైనికులు పాల్గొన్నారు. అమెరికా వద్ద ఆధునిక సాంకేతిక విజ్ఞానం, చక్కని వైద్య సదుపాయాలు ఉన్నప్పటికీ సైనికుల మరణాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ యుద్ధకాలంలో మొత్తం 47,244 మంది సైనికులు చనిపోయారు, 3,03,704 మంది గాయపడ్డారు. (ఇలా గాయపడిన వాళ్లలో 23,014 మంది 100 శాతం వైకల్యం పొందిన వాళ్లుగా వెటిరన్స్ అడ్మినిస్ట్రేషన్ పేర్కొంది.)

అమెరికాతో జరిగిన ఈ యుద్ధకాలం చాలా దారుణమైనది. వేలాది అమెరికా సైనికులు శక్తిమంతమైన ఆయుధాలు, యుద్ధ ట్యాంకులతో వచ్చేవాళ్లు, వాళ్లకి అండగా ఆనాటికి అత్యంత శక్తిమంతమైన వైమానిక బాంబర్లు అయిన బి52 విమానాలు ఉండేవి. పెద్ద ఎత్తున సాగిన దాడులు, రసాయనిక ఆయుధాల వినియోగంతో - నాపాలం





*చిత్రం 15.6 : (అ) అడవుల మీద విష రసాయనికాలను చల్లుతున్న అమెరికా యుద్ధ విమానాలు, (ఆ) ఈ బొమ్మకు అసలు వ్యాఖ్య: "ప్రతిదానికీ ఒక ఉపయోగం." ఈ బొమ్మలో ఒక అమ్మాయి డ్రమ్ముని దొర్లించుకుంటూ వెళుతోంది. ఈ లోహాన్ని చిన్న డబ్బాలు, గరిటలు తయారు చెయ్యటానికి ఉపయోగిస్తారు.*

(మనుషులకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదకరమైన బాంబు), ఏజెంట్ ఆరెంజ్ (ఇది చెట్లు, మొక్కలను చంపేసి భూమిని చాలా సంవత్సరాలపాటు బీడుగా మార్చింది), భాస్వరం బాంబులతో అనేక గ్రామాలు విధ్వంసమయ్యాయి, అడవులు నాశనమైపోయాయి. పెద్ద సంఖ్యలో పౌరులు చనిపోయారు.

ప్రతిఘటనకి, ఇళ్లు, కుటుంబాలను త్యాగం చెయ్యటానికి, దారుణ పరిస్థితులలో జీవించటానికి, స్వాతంత్రం కోసం పోరాడటానికి వీలుగా ప్రజలకు జాతీయతాభావం ఇచ్చే ప్రేరణను అమెరికా విధానకర్తలు తక్కువ అంచనా వేశారు. ప్రపంచంలోకెల్లా అత్యంత ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఉన్న అభివృద్ధి చెందిన దేశాన్ని ప్రతిఘటించటంలో ఒక చిన్న దేశానికి ఉండే శక్తిని అంచనా వెయ్యటంలో వాళ్లు పొరబడ్డారు. భూస్వాముల చేతులలో తరాలపాటు దోపిడీకి గురయ్యి ఇటీవలే కొంత భూమిని పొందిన లక్షలాది పేద రైతాంగ నిబద్ధతని వారు తక్కువ అంచనా వేశారు. జాతీయతాభావంతో ప్రేరణ పొంది, భూ సంస్కరణలతో ఉత్సాహం పొందిన ఈ పేద రైతాంగం ప్రపంచంలోకెల్లా మేటి సైన్యాన్ని ఓడించటంలో కీలకపాత్ర పోషించింది.

- పౌరులపైన, అడవుల మీద నాపాలం, ఏజెంట్ ఆరెంజ్ వంటి రసాయనిక ఆయుధాలను అమెరికా ఉపయోగించటం సరైనదేనా?
- అమెరికా అంతటి బలమైన దేశాన్ని వియత్నాం వంటి చిన్న దేశం ఎలా ఎదిరించగలిగింది?
- వియత్నాం నుంచి అమెరికా ప్రభుత్వం విరమించుకోవటంలో ఆ దేశంలోని శాంతి ఉద్యమం పాత్ర ఏమిటి?

ఈ యుద్ధ ప్రభావం అమెరికాపై సైతం పడింది. తనకు సంబంధంలేని యుద్ధంలో జోక్యం చేసుకున్నందుకు ప్రభుత్వాన్ని చాలామంది విమర్శించారు. యుద్ధం కోసం యువతను సైన్యంలోకి తీసుకోవటంతో అక్కడ వ్యతిరేకత ఇంకా పెరిగింది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగటంతో అమెరికాలో దాని పట్ల బలమైన నిరసనలు వెల్లువెత్తసాగాయి. ప్రభుత్వ విధానాన్ని సర్వత్రా ప్రశ్నించటంతో అంతిమంగా యుద్ధ ముగింపు సంప్రదింపులు చేపట్టేలా చేసింది. 1974 జనవరిలో పారిస్‌లో శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో అమెరికాతో యుద్ధం ముగిసింది. అయితే సైగాన్ ప్రభుత్వం, ఎన్ఎల్ఎఫ్ మధ్య ఘర్షణ ఇంకా కొనసాగింది. 1975 ఏప్రిల్ 30న జాతీయ విముక్తి సమాఖ్య (ఎన్ఎల్ఎఫ్) సైగాన్‌లోని అధ్యక్ష భవనాన్ని స్వాధీనం చేసుకుని అంతిమంగా వియత్నాంలను ఒకటిగా చేశారు.

## నైజీరియా : వలస పాలకులకు వ్యతిరేకంగా ఏకం కావటం

ఇప్పుడు ఆఫ్రికాలోని వలస పాలన, జాతీయతావాదాల గురించి తెలుసుకోటానికి ఆ ఖండ పశ్చిమ తీరాన ఉన్న నైజీరియాను అధ్యయనం చేద్దాం. ఈ దేశాన్ని పటంలో గుర్తించండి. ఈ దేశం గురించి ఎనిమిదవ తరగతిలో చదివినది గుర్తు చేసుకోండి.



పటం 3 : నైజీరియా పటం

### బ్రిటిష్ వలసపాలన, ఒక జాతి ఏర్పాటు

ప్రపంచంలో మిగిలిన ప్రాంతాల్లో మాదిరిగానే ఆఫ్రికాలో కూడా జాతీయ రాజ్యాలు అన్న భావన కొత్తది. తరచుగా గిరిజన తెగల ఉనికి గుర్తింపు సాధారణంగా ప్రజలను ఒకటిగా ఉంచేది. వలస పాలకులు కొంత ప్రాంతాన్ని ఇష్టానుసారంగా తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ప్రస్తుతం నైజీరియాగా మనకు తెలిసిన దేశాన్ని బ్రిటిషువారు ఏర్పరిచారు. నైజర్ నదీ వ్యవస్థ కింద వివిధ తెగలు

ఉంటున్న వేరు వేరు ప్రాంతాలను ఒకటిగా చెయ్యటం ద్వారా దీనిని ఏర్పరిచారు. ఉత్తర నైజీరియాలో హౌసా-ఫులాని ప్రజలు అధికంగా ఉన్నారు. వీరు ముఖ్యంగా ముస్లిములు. ఆగ్నేయ నైజీరియాలో ఈబో తెగ, నైరుతి భాగంలో యోరుబా తెగల ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. అనేక సంవత్సరాల మిషనరీల ప్రచార కారణంగా దక్షిణ ప్రాంతాలలో క్రైస్తవ మతస్తులు అధిక సంఖ్యలో ఉన్నారు. అయినప్పటికీ గిరిజన మత నమ్మకాలు ఉన్నవాళ్లు కూడా ఎక్కువ గానే ఉన్నారు. ఈ మూడు ప్రాంతాల మధ్య ఘర్షణలు, ఉమ్మడి ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థను ఏర్పరచాలన్న ప్రయత్నాలతో ఆధునిక నైజీరియా కథ నిండి ఉంది. ఆ దేశ సహజ వనరులపై, ప్రత్యేకించి చమురుపై యూరపు నియంత్రణతో వలస పాలన వారసత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది.

ఆఫ్రికాలో అధిక జనాభా సాంద్రతగల దేశాలలో నైజర్‌నదీ ప్రాంతం ఒకటి. ఇది అనేక రకాల వలస పాలనతో దోపిడీకి గురయ్యింది. 16వ శతాబ్దం నాటినుంచి అమెరికాకు బానిసలను సరఫరా చెయ్యటంలో ఇది ప్రధాన కేంద్రంగా ఉండింది. ఆఫ్రికా లోపలినుంచి రైతాంగ గిరిజనులను పట్టుకుని ఐరోపా బానిస వర్తకులకు అమ్మేవాళ్లు. 19వ శతాబ్దంలో బానిసల వ్యాపారాన్ని నిషేధించటంతో ఈ ప్రాంతంలోని వ్యవసాయ ఉత్పత్తులు, ప్రత్యేకించి కోకో, పామాయిల్ పట్ల వలస పాలకుల ఆసక్తి పెరిగింది. తీరప్రాంతాలపై 1861లో బ్రిటన్ తన పాలనను ఏర్పాటుచేసింది. పశ్చిమ ఆఫ్రికాలోని లాగోస్‌ని విద్య, వ్యాపారం, పరిపాలనలకు ప్రధాన కేంద్రంగా రూపు దిద్దింది. అది వలస పాలనపై వ్యతిరేకతకు, నైజీరియా జాతీయతావాదానికి, ఖండాంతర ఆఫ్రికా వాదానికి కూడా కేంద్రంగా ఉంది.

19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస సామ్రాజ్యంలో జాత్యాహంకారం తిరిగి చోటు చేసుకుంది. విద్యావంతులైన ఆఫ్రికా వాసులను సివిల్ సేవలకు అనుమతించలేదు, ఆఫ్రికా వ్యాపారవేత్తల పట్ల వివక్షత చూపేవాళ్లు. అదే సమయంలో ప్రజలపై మరింత నియంత్రణను సాధించటానికి వీలుగా గిరిజన తెగ నాయకులు, సంపన్నులతో సంబంధాలు నెరిపింది.

వలసపాలకుల విధానాల వల్ల దక్షిణ ప్రాంతంలో ఆధునిక విద్యకు, పరిపాలన ఆధునీకరణకు ప్రోత్సాహం లభించగా ఉత్తర ప్రాంతంలో పూర్వ సాంప్రదాయాలు కొనసాగాయి. ఫలితంగా 20వ శతాబ్దం చివరినాటికి ప్రాంతీయ అసమానతలు పెరిగాయి, ఉత్తర ప్రాంతం ఆధునిక విద్యను పొందిన సామాజిక వర్గాన్ని ఏర్పరుచుకోలేకపోయింది. 1939లో బ్రిటిష్ పాలకులు పశ్చిమ, తూర్పు నైజీరియా ప్రాంతాలను ఏర్పరిచి యోరుబా, ఈబు తెగల మధ్య కూడా విభజనలు సృష్టించారు. ఆ విధంగా 'విభజించి, పాలించు' అన్న సిద్ధాంతానికి అనుగుణంగా మూడు ప్రధాన గిరిజన తెగల మధ్య పోటీని, ఘర్షణని ప్రోత్సహించారు.

దీనిని వ్యతిరేకిస్తూ పాశ్చాత్య విద్య పొందిన కొంతమంది మేధావులు ఉమ్మడి నైజీరియా దేశం అన్న భావనను కలిగించి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడసాగారు. నైజీరియాలో మొదటి రాజకీయ పార్టీయైన నైజీరియా జాతీయ ప్రజాస్వామిక పార్టీ (ఎన్ ఎన్ డి పి) ని 1923లో హెర్బెర్ట్ మకాలే స్థాపించాడు. 1923, 1928, 1933లో జరిగిన ఎన్నికలలో ఎన్ ఎన్ డి పి అన్ని స్థానాలనూ గెలుచుకుంది. 1930లలో బ్రిటిష్ వలస ప్రభుత్వంపై తీవ్రవాద దాడులను కూడా మకాలే సమర్థించాడు. 1936లో ఎన్ నంది అజికివె అనే

**ఖండాంతర ఆఫ్రికావాదం**

దేశ, తెగ తేడాలు లేకుండా ఆఫ్రికా ప్రజలందరినీ ఒకటిగా చెయ్యటానికి ఖండాంతర ఆఫ్రికావాదం ప్రయయత్నిస్తుంది. ఈ ఐకమత్యంతో వలసపాలనను, జాతి వివక్షతను వ్యతిరేకించటమే కాకుండా సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం అన్న సూత్రాల ఆధారంగా ఆఫ్రికా ఖండంలోని అన్ని తెగలు, ప్రజల సమూహాల మధ్య ఐకమత్యం సాధించటానికి ప్రయత్నించింది. ఘనా స్వాతంత్ర యోధుడు క్వామె న్క్రుమా దీంట్లో ప్రముఖపాత్ర పోషించాడు.

వ్యక్తి "నైజీరియా యువ ఉద్యమాన్ని" (ఎన్ వై ఎం) స్థాపించాడు. సాంస్కృతిక నేపథ్యంతో సంబంధం లేకుండా నైజీరియా ప్రజలందరినీ అది ఆకర్షించసాగి అనతికాలంలోనే అది బలమైన రాజకీయ ఉద్యమంగా ఎదిగింది. 1944లో మకాలే, ఎన్ వై ఎం నాయకుడు ఎన్ నంది అజికివె కలిసి నైజీరియా, కామెరూన్‌ల జాతీయ సంఘాన్ని (ఎన్‌సిఎన్‌సి) ఏర్పరచటానికి అంగీకారానికి వచ్చారు. క్రమేపీ ఎన్ నంది అజికివె ప్రముఖ జాతీయ నాయకుడిగా ఎదిగాడు. ఖండాంతర ఆఫ్రికావాదం, ఖండాంతర నైజీరియావాదం ఆధారిత జాతీయ ఉద్యమానికి అతడు మద్దతు తెలిపాడు.



చిత్రం 15.7: ఎన్ నంది అజికివె

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నైజీరియా ఆర్థిక పరిస్థితి కష్టాలకు లోనవటంతో నైజీరియా జాతీయతావాదం తీవ్రవాద భావాలకు గురయ్యి దానికి ప్రజల ఆదరణ పెరిగి బలం పుంజుకోసాగింది. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ తరపున పోరాడి తిరిగి వచ్చిన సైనికులు, కార్మిక సంఘ నాయకులు ఈ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. 1945లో అతివాద జాతీయతావాద కార్మిక సంఘ నాయకుల ఆధ్వర్యంలో జాతీయ సాధారణ సమ్మె నిర్వహించారు.

- జాతీయతావాదానికీ, ఖండాంతర ఆఫ్రికా భావానికి మధ్య తేడాలు ఏమిటో చర్చించండి. జాతీయతావాదం అన్నది పరిమితమైన భావమా?
- ఒక శతాబ్ద కాల వలసపాలన వల్ల ప్రాంతాల మధ్య అసమానతలు నెలకొన్నాయి. భారతదేశంలో కూడా బ్రిటిష్ పాలనలో కోస్తా ప్రాంతాలైన బెంగాలు, మద్రాసు, బొంబాయి వంటివి వేగంగా అభివృద్ధి చెందాయి. అభివృద్ధిలో ఇలా అసమానతలు ఎందుకు చోటు చేసుకుంటాయి?

నైజీరియా జాతీయతా వాదం ముందు రెండు కర్తవ్యాలు ఉన్నాయి: బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడటం; ఘర్షణ పడుతున్న వివిధ తెగల మధ్య ఐకమత్యాన్ని సాధించటం. ఉత్తర ప్రాంతంలో కంటే బాగా అభివృద్ధి చెందిన దక్షిణ ప్రాంతంలో జాతీయ ఉద్యమం బాగా బలంగా ఉండటంతో ఉత్తర–దక్షిణ ప్రాంతాల మధ్య తేడాలు పొడసూపసాగాయి. దక్షిణ ప్రాంతంలో కూడా యొరుబా, ఈబూ తెగల మధ్య ఘర్షణలు జాతీయ ఉద్యమాన్ని పీడించసాగాయి. 1950ల నాటికి ఈ మూడు ప్రాంతాలలో వలసపాలనను వ్యతిరేకిస్తూ మూడు ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి: ఉత్తర ప్రాంతంలో "సాంప్రదాయ భావాలతో కూడిన ఉత్తర ప్రజల కాంగ్రెస్" (ఎన్‌పిసి), తూర్పు ప్రాంతంలో "నైజీరియా, కెమరూన్ల జాతీయ సంఘం" (ఎన్‌సిఎన్‌సి), పశ్చిమ ప్రాంతంలో యాక్షన్ గ్రూపు (ఎజి).

## స్వాతంత్ర్యం, బలహీన ప్రజాస్వామ్యం

జాతీయ ఉద్యమ తీవ్రతను గుర్తించిన బ్రిటిష్ పాలకులు నైజీరియన్లకు అధికారాన్ని అప్పగించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు మూడు ప్రధాన ప్రాంతాల స్వయంప్రతిపత్తిని గుర్తిస్తూ సంక్లిష్ట సమాఖ్య వ్యవస్థను నెలకొల్పారు. 1963 అక్టోబరు 1న నైజీరియా స్వాతంత్ర్యం పొందింది. దురదృష్టవశాత్తు ప్రజాస్వామిక, న్యాయపూరిత సమతుల్యం సాధించలేకపోవటం వల్ల అనతికాలంలోనే నైజీరియాలో పౌర యుద్ధం చెలరేగింది. ఫలితంగా సైనిక పాలన ఏర్పడింది. ఉత్తర ప్రాంత ఆధిపత్య ధోరణిని ఇది

కొనసాగించింది. పౌర, ప్రజాస్వామిక ప్రభుత్వాలను ఏర్పాటు చెయ్యటానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి కానీ ఇవన్నీ విఫలమయ్యాయి. సైనిక పాలనలో అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన కొనసాగాయి. అవినీతి పాలకులకు మద్దతు ఇచ్చే బహుళజాతి చమురు కంపెనీలు, సైనిక ప్రభుత్వాలు దీంట్లో భాగస్వామ్యం అయ్యాయి.

సుదీర్ఘ సైనిక నియంతృత్వ పాలన తరువాత 1999లో నైజీరియా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఎన్నుకుంది. ప్రజాస్వామిక నైజీరియాను నిర్మించే సవాలును ఇది ఎట్లా ఎదుర్కొంటుందో వేచి చూడాల్సి ఉంది.



*చిత్రం 15.8: బైఫారియన్ యుద్ధం*

## చమురు, పర్యావరణం, రాజకీయాలు

నైజర్ డెల్టాలో 1950లలో చమురును కనుగొన్నారు. ఈ చమురును వెలికితీసే హక్కులను డచ్ షెల్ కంపెనీ నేతృత్వంలోని వివిధ బహుళజాతి కంపెనీలు పొందాయి. ప్రస్తుతం ఇది నైజీరియాకి ముఖ్యమైన వనరు. చమురు బావులలో అనేకం బహుళజాతి సంస్థల అధీనంలో ఉన్నాయి. ఇవి చమురుని వెలికితీసి తమ లాభాల్లో కొంత శాతాన్ని సైనిక పాలకులతో పంచుకున్నాయి. సాధారణ ప్రజలకు దీనివల్ల ఎటువంటి ప్రయోజనమూ ఒనగూడలేదు. అంతేకాదు విదేశీ చమురు కంపెనీలు పర్యావరణాన్ని పట్టించుకోకుండా యధేచ్ఛగా చమురును వెలికి తీయటం వల్ల తీరప్రాంత వాతావరణంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయి. చమురు బావుల నుంచి సముద్రపు నీటిలో కలిసే చమురు వల్ల ఇక్కడి జీవావరణ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమయ్యింది. ప్రత్యేకించి మడ అడవులు చమురుకి తట్టుకోలేవు. ఈ చమురు నేలలోకి ఇంకి ప్రతి సంవత్సరం ముంపుకి గురైనప్పుడు తిరిగి నీటిపైకిరావటం వల్ల చాలా విస్తీర్ణంలో మడ అడవులు అంతరించిపోయాయి. నైజీరియాలోని మడ అడవులు జీవావరణ వ్యవస్థలో 5-10 శాతం వరకు నరికివెయ్యబడటం వల్లగానీ, చమురు ఊటల వల్లగానీ నష్టపోయాయని అంచనా. ఈ చమురు వల్ల నేలలు, భూగర్భజలాలు కలుషితమయ్యి పంటలు, చేపల పెంపకం వంటివి దెబ్బతింటున్నాయి. తాగునీరు కూడా తరచు కలుషితమవుతున్నాయి. స్థానిక నీటి మడుగులలో పలచటి నూనె జిడ్డు కనపడుతుంటుంది. తాగునీళ్లు కలుషితం కావటంతో ఆరోగ్యంపై వెంటనే ప్రభావం కనపడకపోయినప్పటికీ, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి సమస్యలు ఏర్పడవచ్చు. సముద్ర జలాల్లో చమురు ఊటలు చాలా ఎక్కువగా ఉండి, తీరప్రాంత పర్యావరణం ప్రభావితమయ్యి స్థానికంగా చేపల ఉత్పత్తి పడిపోతుంది.



*చిత్రం 15.9: చమురుతో కలుషితమైన జలాలు*



*చిత్రం 15.10: కెన్ సారో వివా*

> • నైజీరియాలోని చమురు వనరులలో అధిక భాగం ఆగ్నేయ భాగంలో ఉన్నాయి. చమురు లాభాలలోని అధిక భాగం తమకు చెందాలని ఈబూలు భావిస్తారు. చమురు సంపదతో ఉత్తర ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యటాన్ని వాళ్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ సమస్యకు సరైన, న్యాయపూరితమైన పరిష్కారం ఏమిటి?

1990ల కాలంలో ప్రత్యేకించి నైజర్ డెల్టా ప్రాంతంలో ప్రజల ఆందోళన క్రమేపీ పెరగసాగింది. స్థానిక గిరిజన తెగలు సంవత్సరాల తరబడి జరిగిన జీవావరణ నష్టానికి పరిహారం చెల్లించాలని, తమ ప్రాంతంలోని చమురు వనరులపై తమకు నియంత్రణ కావాలని పోరాడసాగాయి. ఈ ఆందోళన మొదట జాతి ఆధారంగా సభ్యులలో ఐకమత్యం సాధించి శాంతియుతంగా ఉన్నది. ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త, పర్యావరణవాది అయిన కెన్ సారో వివాని అంతర్జాతీయ నిరసనల మధ్య మిలటరీ ప్రభుత్వం మరణశిక్ష వెయ్యటంతో పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి.

ఒక జాతిగా ఏర్పడటానికి, సుస్థిర ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించటానికి, తన భౌతిక వనరులపై నియంత్రణను సాధించటానికి నైజీరియా ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| భూ సంస్కరణలు | భూస్వామ్యవాదం | నూతన ప్రజాస్వామ్యం | వెట్టి కార్మికులు |
| రసాయనిక ఆయుధాలు | బలహీన ప్రజాస్వామ్యం | ఖండాంతర ఆఫ్రికా వాదం | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది వాటిని జతపరచండి

| | |
|---|---|
| • సన్‌యట్-సెన్ | దేశాన్ని సైనిక దేశం చేశాడు |
| • చియాంగ్ కైషేక్ | పర్యావరణ ఉద్యమం |
| • మావో జెడాంగ్ | జాతీయతావాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం |
| • కెన్ సారో వివా | రైతాంగ విప్లవం |

2. దశాబ్దాల కాలంలో చైనాలో మహిళల పాత్రలో వచ్చిన మార్పులను గుర్తించండి. రష్యా, జర్మనీలో సంభవించిన మార్పులకూ, వీటికీ తేడాలు, పోలికలు ఏమిటి?
3. రాచరిక పాలనను పడదోసిన తరువాత చైనాలో రెండు రకాల పాలనలు ఏర్పడ్డాయి. వీటి మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
4. ఈ అధ్యాయంలో చర్చించిన దేశాలన్నీ ప్రధానంగా వ్యవసాయం పైన ఆధారపడినవే. అందులోని పద్ధతులు మార్చటానికి ఈ దేశాలలో ఎటువంటి ప్రయత్నాలు జరిగాయి?
5. పైన చర్చించిన దేశాలలో పరిశ్రమలు ఎవరి అధీనంలో ఉన్నాయి? ఈ పద్ధతులను మార్చటానికి ఎటువంటి ప్రయత్నాలు జరిగాయి. పోల్చటానికి ఒక పట్టికను తయారుచెయ్యండి.
6. భారతదేశం, నైజీరియాలలోని జాతీయ ఉద్యమాలను పోల్చండి. భారతదేశంలో ఇది ఎందుకు బలంగా ఉండింది?
7. స్వతంత్ర నైజీరియా దేశం ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి? స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లతో పోలికలు, తేడాలు ఏమిటి?
8. భారతదేశం, వియత్నాంల లాగా స్వాతంత్ర్యం కోసం నైజీరియా మరీ అంత కష్టపడాల్సి రాలేదు. దీనికి కొన్ని కారణాలను పేర్కొనండి.
9. పైన చర్చించిన దేశాలలోని జాతీయ ఉద్యమాలలో పాఠశాల విద్య పాత్ర ఏమిటి?
10. ఈ దేశాల స్వాతంత్ర్య పోరాటాలలో పాలకులపై యుద్ధాలు చేశారు. వాటి ప్రభావాన్ని క్లుప్తంగా వివరించండి.

పాఠం 16

# భారతదేశ జాతీయోద్యమం - దేశ విభజన, స్వాతంత్ర్యం : 1939-1947

జాతీయోద్యమ చివరి దశ గురించి తెలుసుకుని భారతదేశ విభజనకు దారి తీసిన పరిస్థితులు ఏమిటో అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం. దీనికి సంబంధించి దేశ ప్రజలు ఎన్నో క్లిష్టమైన ప్రశ్నలను ఎదుర్కొన్నారు. కాలక్రమంలో వాటికి చాలా కఠినమైన సమాధానాలను అంగీకరించవలసి వచ్చింది.

## ప్రపంచ యుద్ధానికి భారతీయులు మద్దతు తెలపాలా? 1939-42

మీరు ఇంతకు ముందు రెండవ ప్రపంచ యుద్ధం గురించి చదివారు. ఈ యుద్ధం 1939లో మొదలయినప్పుడు దేశంలోని పలు రాష్ట్రాలు కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో ఉన్నాయి. భారతీయులకు స్వయం పరిపాలన సిద్ధాంతాన్ని అధికారం కొంతమేరకైనా ఇవ్వాలని ఆంగ్లేయ ప్రభుత్వం అంగీకరించింది. 1935లో బ్రిటిషు పార్లమెంటు భారత ప్రభుత్వ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం రాష్ట్రాలలో ఎన్నికలు నిర్వహించి వీటిలో గెలిచిన పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అయితే ఓటు వేసే అధికారాన్ని జనాభాలో చాలా కొద్దిమందికే ఇచ్చారు – రాష్ట్ర శాసనసభలకు 12%, కేంద్ర సభకు 1% ప్రజలకే ఓటు హక్కు లభించింది. బ్రిటిష్ ఇండియాలోని 11 రాష్ట్రాలలో 1937లో ఎన్నికలు నిర్వహించినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. 11 రాష్ట్రాలకు 8 రాష్ట్రాలలో కాంగ్రెస్ 'ప్రధాన మంత్రులు' ఎన్నికయ్యారు, వీళ్ల బ్రిటిష్ గవర్నర్ పర్యవేక్షణలో పని చేయసాగారు.

కాంగ్రెస్ నాయకుల ముందు ఒక పెద్ద సమస్య వచ్చిపడింది. జర్మనీ, జపాన్, ఇటలీ, ఇతర దేశాల కూటమికి (అక్ష రాజ్యాల) వ్యతిరేకంగా ఆంగ్లేయులు చేస్తున్న యుద్ధానికి సహాయపడాలా? కాంగ్రెస్ ప్రభుత్వాలను కనీసం సంప్రదించ కుండానే బ్రిటను యుద్ధంలో భారతదేశం పాలుపంచుకుంటుందని నిర్ణయం తీసుకుంది. యుద్ధంలో సహాయపడటానికి, పడకపోవటానికి అనేక కారణాలు ఉన్నాయి.

- 1935 చట్టం ఇచ్చిన అధికారాలకు భారతీయులు బ్రిటిష్ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలా?
- భారతీయులు తమ స్వాతంత్ర్య పోరాటాన్ని పక్కన పెట్టి స్వేచ్ఛాయుత ప్రపంచంపై దృష్టి కేంద్రీకరించాల్సినంతగా హిట్లర్ బలం పుంజుకుని మానవాళి స్వేచ్ఛకు ముప్పు కలిగించేవాడా?
- రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్‌ని సమర్థించటానికి, సమర్థించకపోవటానికి మీ కారణాలను పేర్కొనండి.

ఈ సమస్యలతో కాంగ్రెస్ సతమతమై పోయింది. అనేకమంది కాంగ్రెస్ నాయకులు హిట్లర్‌ని, ముస్సోలినిని, ఫాసిజాన్ని వ్యతిరేకించారు. ఇతర స్వతంత్ర దేశాలను జయించటానికి ప్రయత్నిస్తున్న ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవాలన్న కృతనిశ్చయంతో వాళ్లు ఉన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం (కనీసం మాట అయినా) ఇవ్వకుండా ఫాసిస్టులపై తమ పోరాటంలో భారతదేశం మద్దతు ఇవ్వాలని కోరుకోవటంలో అవలంబిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను బ్రిటిష్ ప్రభుత్వం గుర్తిస్తుందని కాంగ్రెస్ ఆశించింది.

### అడాల్ఫ్ హిట్లర్‌కి ఉత్తరం

హెర్ హిట్లర్

బెర్లిన్,

జర్మనీ

ప్రియమైన మిత్రమా,

మానవాళికోసం నీకు ఉత్తరం రాయమని మిత్రులు నన్ను ఒత్తిడి పెడుతున్నారు. నా నుంచి ఉత్తరం అసందర్భంగా ఉంటుందన్న అభిప్రాయంతో వారి అభ్యర్థనలను తోసిపుచ్చుతూ వచ్చాను. అయితే నేను లెక్కలు వేయటం మాని నా విన్నపాన్ని మీకు తెలియచేయాలి.

మానవాళిని ఆటవిక దశకి దిగజార్చే యుద్ధాన్ని నివారించగల వ్యక్తి ప్రపంచంలో మీరు ఒక్కరే అన్నది స్పష్టంగా ఉంది.

మీ ఆశయం మీకు ఎంత ముఖ్యమైనది అయినప్పటికీ దానికి ఇంతటి మూల్యం చెల్లించాలా? హింసను కావాలని తిరస్కరించి ఎంతో కొంత విజయాలు సాధించిన వ్యక్తిగా నేను చేస్తున్న విన్నపాన్ని ఆలకిస్తారా?

మీకు రాయటంలో ఏదైనా తప్పు జరిగితే మన్నించండి.

మీ

ఎం.కె. గాంధీ

**మూలం :** మహాత్మా గాంధీ సంకలిత రచనలు సంపుటి 76:31 మే, 1939–15 అక్టోబరు, 1939

బ్రిటిష్ వారు దీనిని గుర్తించారు. కానీ తాము నిర్మించిన సామ్రాజ్యాన్ని వదులుకోవటం వాళ్లకి చాలా కష్టంగా అనిపించింది. బ్రిటన్‌లో వివిధ రాజకీయ పార్టీలు ఉన్నాయి. యుద్ధ సమయంలో కన్సర్వేటివ్ పార్టీకి చెందిన విన్‌స్టన్ చర్చిల్ ప్రధానమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వం ఉండేది. సాధ్యమైనంతకాలం తమ సామ్రాజ్యాన్ని నిలుపుకోవాలని కన్సర్వేటివ్‌లు ప్రయత్నించారు. కన్సర్వేటివ్‌లతో పోలిస్తే భారతీయులు స్వాతంత్ర్యం పొందటానికి లేబర్ పార్టీ ఎక్కువ సుముఖంగా ఉంది.

బ్రిటిష్ సామ్రాజ్యం కింద భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తి ఇవ్వటానికి బ్రిటిష్‌వాళ్లు సంసిద్ధంగా ఉన్నారు కానీ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్యం కోరింది. అంతేకాకుండా కేంద్రంలో కూడా జాతీయ ప్రభుత్వాన్ని వెంటనే ఏర్పరచాలని కాంగ్రెస్ కోరింది. భారతదేశంలో అనేక ఇతర సమూహాల ప్రయోజనాలను కాపాడాలి కాబట్టి బ్రిటన్ దీనికి అభ్యంతరం పెట్టింది. కాంగ్రెస్ భారతీయులందరికి ప్రాతినిధ్యం వహించటంలేదని (ఉదాహరణకు ముస్లిములకు) బ్రిటన్ భావం. అనేకమంది భారతీయుల ప్రయోజనాలను కాంగ్రెస్ పట్టించుకోవటం లేదని వాటిని కాపాడాల్సిన బాధ్యత తమపైన ఉన్నదని బ్రిటన్ భావించింది.

బ్రిటన్ మొండి పట్టుతో విసిగిపోయిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వైదొలగాలని నిర్ణయించింది. 1937లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు 1939 అక్టోబరులో రాజీనామా చేశాయి.

యుద్ధంలో గెలవటంపై దృష్టి కేంద్రీకరించటానికి వీలుగా శాంతిభద్రతలను కాపాడటానికి ప్రభుత్వం యుద్ధ సమయములో ప్రత్యేక అధికారాలను పొందింది. ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన ఎవరినైనా వెంటనే

- బ్రిటన్ దృక్పథం పట్ల నిరసన వ్యక్తపరచటానికి కాంగ్రెస్ ఏ చర్య చేపడితే బాగుండేది?
- బ్రిటన్ మాట ఇచ్చి భారతీయుల మద్దతు ఎందుకు పొందలేదు? 1939లో భారతీయులు అడిగింది మాటేకదా. తరగతిలో అందరూ చర్చించండి.
- ప్రభుత్వాలు రాజీనామా చేస్తే రోజువారీ వ్యవహారాలను ఎవరు నిర్వర్తిస్తారు?

జైలుకి పంపించి, కోర్టుకి వెళ్లకుండా కావలసినంతకాలం బందీగా ఉంచవచ్చు. వాక్ స్వాతంత్ర్యాన్ని కూడా పరిమితం చేశారు. యుద్ధం ముగిసిన తరువాత పాలకులు స్వాతంత్ర్యం ప్రకటించేలా ఒత్తిడి తీసుకురాటానికి 1940, 1941 సంవత్సరాలలో కాంగ్రెస్ అనేక వ్యక్తిగత సత్యాగ్రహాలను నిర్వహించింది. పెద్ద ప్రజా ఉద్యమం ఏదీ ఆ కాలంలో చేపట్టలేదు.

- ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలను కాంగ్రెస్ తీవ్రతరం చేసి ఉన్నట్లయితే ఏం జరిగి ఉండేది? ఇది స్వాతంత్ర్య పోరాటానికి బలం చేకూర్చి ఉండేదా?

## దేశ ప్రజలకు ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారు?

నిరాశతో తమ పాలనపై తిరగబడుతున్న భారతీయులతో ఎలా వ్యవహరించాలో బ్రిటన్‌కు తెలియలేదు. ప్రజలపై కాంగ్రెస్‌కు ఉన్న పట్టు బలహీనపడేలా చేసి దానిని దండించటానికి గల మార్గాలకోసం చూశారు. దేశప్రజలకు ప్రాతినిధ్యం వహించటానికి కాంగ్రెస్‌కు ఏమి అధికారం ఉందంటూ అనుమానాలను లేవనెత్తసాగారు. ఇదే అదనుగా 'విభజించి పాలించు' అన్న సిద్ధాంతాన్ని వాళ్లు పూర్తిస్థాయిలో అమలు చేశారు.

ఈ దిశగా బ్రిటిష్ ప్రభుత్వం ముస్లిం లీగు ప్రణాళికలకు మద్దతు ఇచ్చి, ప్రోత్సహించి కాంగ్రెస్‌కి ఇచ్చే ప్రాముఖ్యతను తగ్గించసాగింది. ఈ కాలంలోనే ముస్లిం లీగు, ఎం. ఎ. జిన్నా వంటి నాయకులు ప్రజారాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషించసాగారు.



*చిత్రం 16.1 : ఇరవాడి నదిని దాటుతున్న రాయల్ నౌకాదళం, 1945.*



*చిత్రం 16.2 : భారతదేశంలో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సి-46 విమానాలలోకి సరుకులు ఎత్తుతున్న ఏనుగులు.*

### ముస్లిం లీగు

ఈ పార్టీ 1906లో ఏర్పడింది. ఉత్తరప్రదేశ్‌లోని ముస్లిం భూస్వాముల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ పార్టీకి 1930ల వరకు పెద్దగా ప్రజల మద్దతు లేదు. అన్ని సభలలోనూ ముస్లిములు మాత్రమే ఓటు చేసే ప్రత్యేక స్థానాలు ఏర్పాటు చేయాలని బ్రిటన్‌ను అది కోరసాగింది. చాలా ప్రాంతాలలో హిందువులు అధిక సంఖ్యలో ఉన్నారు కాబట్టి హిందువులే ఎన్నికవుతారని ప్రభుత్వంలో ముస్లిముల ప్రయోజనాలను కాపాడటం కష్టమవుతుందని వాదించసాగారు. కొన్ని స్థానాలను ముస్లిములకు రిజర్వుచేసి ఆ ప్రాంతంలోని ముస్లిములకు ఓటు హక్కు కల్పిస్తే శాసనసభలకు ముస్లిములు ఎన్నికయ్యి

వాళ్ల సమస్యలను ప్రస్తావించగలుగుతారు. ఈ వాదనను కాంగ్రెస్ కూడా అంగీకరించటంతో 1909 నుంచి ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. 1937లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు జరిగినప్పుడు దేశంలోని 482 ముస్లిం నియోజక వర్గాలలో ముస్లిం లీగు 102 స్థానాలను గెలుచుకుంది. అయితే తమది జాతీయ పార్టీ కాబట్టి హిందువులకే ప్రాతినిధ్యం వహించటం లేదంటూ ముస్లిము నియోజకవర్గాలలో కాంగ్రెస్ కూడా పోటీ చేసింది. కాంగ్రెస్ మొత్తం 58 ముస్లిం నియోజకవర్గాలలో పోటీ చెయ్యగా 28 స్థానాలలో గెలిచింది.

- అల్పసంఖ్యాక వర్గాల భయాలు, సమస్యలను పరిష్కరించాల్సిన ఆవశ్యకత గురించి చర్చించండి. అధిక ఓట్లతో గెలిచే ఎన్నికలు అల్పసంఖ్యాక వర్గాలకు సహాయ పడలేవని ఎందుకు భావించారు?
- అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడటానికి ప్రత్యేక నియోజకవర్గాలు ఒక విధానం. ఈ ఉద్దేశం నెరవేర్చటంలో సహాయపడగల విధానాలు ఇంకేమైనా ఉన్నాయా? ఉదాహరణకు ముస్లిములకు సంబంధించిన అంశం మీద ఓటు వేయటానికి ముందు ముస్లిమేతర సభ్యులు తమ నియోజకవర్గంలోని ముస్లిములను సంప్రదించాలన్న షరతు పెడితే ఎలా ఉంటుంది? ఇటువంటి పద్ధతి ఎప్పుడు పనిచేస్తుంది? ఎటువంటి పరిస్థితులలో ఇది విఫలం అవుతుంది?

1937 ఎన్నికలలో మొత్తం ముస్లిం ఓట్లలో 4.4 శాతం మాత్రమే ముస్లిం లీగుకి వచ్చాయి. యునైటెడ్ ప్రావిన్సస్, బాంబే, మద్రాసులో ముస్లిం లీగుకి కొంత ఆదరణ లభించింది. పది సంవత్సరాల తరువాత పాకిస్తాన్‌గా ఏర్పడిన మూడు రాష్ట్రాలలో, అంటే బెంగాల్, నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్ (ఎన్ డబ్ల్యు ఎఫ్ పి), పంజాబ్‌లలో అది చాలా బలహీనంగా ఉంది. సింద్‌లో కూడా అది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఆ తరువాత పది సంవత్సరాలలో పరిస్థితి మారి పోయింది. 1946లో తిరిగి రాష్ట్ర, కేంద్ర సభలకు ఎన్నికలు జరిగినప్పుడు ముస్లిం నియోజకవర్గాలలో ముస్లిం లీగు విజయభేరి మోగించింది.

1937–1947 మధ్య ముస్లింల ఆలోచనలు ఎందుకు మారాయి? ముస్లిముల పట్ల కాంగ్రెస్ సున్నితత్వంతో స్పందించటం లేదని అనేక అంశాలను ముస్లిం లీగు ఎత్తి చూపింది. ఉదాహరణకు యునైటెడ్ ప్రావిన్స్‌లో ఎక్కువ సీట్లనే గెలుచుకున్న ముస్లిం లీగుతో కలిపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయటాన్ని కాంగ్రెస్ తిరస్కరించింది. తమ సభ్యులు ముస్లిం లీగులో సభ్యత్వం తీసుకోవటాన్ని కాంగ్రెస్ నిషేధించింది. అంతకుముందు వరకు కాంగ్రెస్ సభ్యులు హిందూ మహాసభలో కూడా సభ్యులుగా ఉండే అవకాశం ఉండేది. మౌలానా ఆజాద్ వంటి కాంగ్రెస్‌లోని ముస్లిం నాయకులు దీనికి అభ్యంతరం తెలిపిన తరువాత 1938లో దీనిని కూడా నిషేధించారు. ఈ విధంగా కాంగ్రెస్ మౌలికంగా హిందువుల పార్టీ అని, ముస్లిములతో అధికారాన్ని పంచుకోటానికి అది సుముఖంగా లేదన్న అభిప్రాయాన్ని ముస్లిం లీగు సృష్టించగలిగింది.

### హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్

ఈ సమయంలో హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం(ఆర్ఎస్ఎస్) ప్రజలను సమీకరించటానికి చురుకుగా పని చేశాయి. కులం, వర్గాలను అధిగమించి హిందువులనందరినీ ఏకం చేసి సామాజిక జీవితంలో సంస్కరణలు తీసుకురావాలని ఈ సంఘాలు ఆశించాయి. భారతదేశం

అధిక సంఖ్యలో ఉన్న హిందువుల భూమి అన్న అభిప్రాయాన్ని కూడా వాళ్లు కలిగించారు. ఈ సంఘాల కార్యకలాపాలతో అనేకమంది కాంగ్రెస్‌వాదులు కూడా ప్రభావితమయ్యారు.

తమ సభ్యులలో లౌకిక అవగాహనను పెంచటానికి కాంగ్రెస్ ఎంతో ప్రయత్నించింది. ముస్లిం ప్రజలలో భద్రతాభావాన్ని పెంచి ముస్లిం లీగు, హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థల కార్యక్రమాలు, సందేశాల ద్వారా వాళ్లలో కలుగుతున్న తప్పుడు అభిప్రాయాలను తొలగించటానికి కూడా కాంగ్రెస్ ప్రయత్నించింది. హిందువులు, ముస్లింలు రెండు దేశాల ప్రజలు కాదని భారతదేశంలో సమగ్ర భాగమని కాంగ్రెస్ వాదించేది. అయితే హిందువుల ఆధిపత్యం గురించి ముస్లిం లీగుకి ఉన్న భయాలను బ్రిటన్ ఆసక్తిగా వింటూ ముస్లింలకు భద్రత కల్పించటానికి సూచనలు చేయసాగింది.

## 'పాకిస్తాన్' తీర్మానం

ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాలలో పాలనకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న భావన చాలామందిలో ఏర్పడసాగింది. ఉదాహరణకు, "సారే జహాసే అచ్ఛా హిందూస్తాన్ హమారా" అన్న కవిత రాసిన ఉర్దూ కవి మొహ్మద్ ఇక్బాల్ 1930లో ముస్లిం లీగుకు అధ్యక్షోపన్యాసం చేస్తూ 'వాయవ్య ముస్లిం రాష్ట్ర' ఆవశ్యకత గురించి మాట్లాడాడు.

పాకిస్తాన్ లేదా పాక్‌స్తాన్ (పంజాబ్, ఆఫ్ఘన్, కాశ్మీరు, సింద్, బలుచిస్తాన్‌ల ఇంగ్లీషు అక్షరాల నుంచి ఏర్పడింది) అన్న పేరును కేంబ్రిడ్జ్‌లోని పంజాబీ ముస్లిం అయిన చౌదరీ రెహ్మత్ ఆలి రూపొందించాడు. 1933, 1935లో రాసిన కరపత్రాలలో ఈ యువ విద్యార్థి ఈ రాష్ట్రాలకు ప్రత్యేక జాతీయ ప్రతిపత్తిని ఆశించాడు. 1930లలో రెహ్మత్ ఆలిని ఎవరూ పట్టించుకోలేదు. ప్రత్యేకించి ముస్లిం లీగు, ఇతర ముస్లిం నాయకులు దానిని విద్యార్థి కలగా కొట్టిపారేశారు.

**డా॥ బి.ఆర్. అంబేద్కర్, పాకిస్తాన్ లేదా భారతదేశ విభజన 'పరిచయం' 1940**

*పాకిస్తాన్‌ను పరిగణనలోకి తీసుకోవాలనటంలో సందేహం లేదు. దీని గురించి ఆలోచించాలని ముస్లింలు పట్టుబడతారు..... బ్రిటన్ తన వారసత్వాన్ని అధిక సంఖ్యాకులైన హిందువులకు అప్పగించి అల్పసంఖ్యాకులను వాళ్ల దయా దాక్షిణ్యాలకు వదిలేస్తూ అధికారాన్ని కట్టబెట్టలేదు. అది సామ్రాజ్యవాదాన్ని అంతం చెయ్యటంకాదు. మరొక రూపంలో సామ్రాజ్యవాదాన్ని సృష్టించటం.*

హిందువుల ఆధిపత్యం పట్ల ముస్లిం లీగు రెచ్చగొట్టిన భయాలను తొలగించటంలో కాంగ్రెస్ వైఫల్యం చెందటం వల్ల, బ్రిటిష్ పాలకులు 'విభజించి పాలించు' అన్న విధానాన్ని అవలంబించటం వల్ల రాజకీయ వాతావరణం మారిపోయింది. 1940 మార్చి 23న ఉపఖండంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలలో కొంత స్వయం ప్రతిపత్తిని కోరుతూ ముస్లిం లీగు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అస్పష్టంగా ఉన్న ఈ తీర్మానం దేశవిభజనను కానీ, పాకిస్తాన్‌ను కానీ పేర్కొనలేదు. అయితే, ఆ తరువాత సంవత్సరాలలో దీనిని పాకిస్తాన్ తీర్మానంగా పేర్కొనటం మొదలుపెట్టారు. ముస్లిం లీగు లేవనెత్తిన అంశాలను పరిష్కరించటానికి ప్రజలు అనేక ప్రత్యామ్నాయాలను సూచిస్తున్నారని, ఆ ప్రత్యామ్నాయాలలో పాకిస్తాన్ అనే కొత్త దేశం ఒకటన్న విషయం గుర్తుంచుకోవాలి. చర్చలు, సంప్రదింపులు మొదలయ్యి, ఆగిపోవటంతో కొత్త దేశంగా పాకిస్తాన్ ఏర్పడటానికి మద్దతు పొందసాగింది. ముస్లింలీగు నాయకుడైన ఎం. ఎ. జిన్నా డిమాండ్లను ఒప్పుకోవటం కాంగ్రెస్‌కి కూడా కష్టమయ్యింది.

1940-1946 మధ్య ప్రత్యేక దేశం ఆవశ్యకత, దాని ప్రయోజనాల గురించి ముస్లిం ప్రజలను

ముస్లిం లీగు ఒప్పించగలిగింది. హిందూ జమిందార్లు, వడ్డీవ్యాపారస్తులు తమను దోచుకోని పరిస్థితి గురించి రైతులు కలలు కన్నారు. వ్యాపారస్తులు, ఉద్యోగార్థులు హిందువులనుంచి పోటీ ఉండదని ఆశించారు. మరింత మత స్వాతంత్ర్యం ఉంటుంది. తమకు కావలసిన విధంగా ప్రభుత్వాన్ని నడుపుకోటానికి ముస్లిం సంపన్నుల నుంచి స్వేచ్ఛ లభిస్తుంది. 1942-1945 మధ్యకాలంలో చాలామంది కాంగ్రెస్ నాయకులు జైల్లో ఉన్నారు. ప్రజలమధ్య తన ఆదరణను పెంచుకోటానికి ముస్లిం లీగు ఈ కాలాన్ని సద్వినియోగపరుచుకుంది.

- ముస్లిం లీగు రాజకీయాల వల్ల ఒనగూరే ప్రయోజనాలను ప్రజలు ఏ విధంగా అంచనా వేసుకున్నారు? వాళ్లకి ఏమైనా ప్రశ్నలు తలెత్తాయా? ఏమైనా సందేహాలు ఉన్నాయా? చర్చించండి.

## బ్రిటిష్‌వాళ్లు భారతదేశం వదిలి వెళ్లేలా ఎవరు చేస్తారు?

1941 నాటికి జపాను ఆగ్నేయ ఆసియాలోకి విస్తరించసాగింది. భారతదేశ భూభాగాలకు కూడా ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. జపానుకు వ్యతిరేక యుద్ధంలో భారతీయులు కూడా పాల్గొనేలా బ్రిటను చూడాల్సిన పరిస్థితి. 1942 వసంతకాలంలో తన మంత్రులలో ఒకరైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ని భారతదేశం పంపించి గాంధీజీతో, కాంగ్రెస్‌తో రాజీ కుదుర్చుకోవలసిందిగా ఒత్తిడిని పెంచింది. వైస్రాయ్ తన కార్యనిర్వాహక వర్గంలో రక్షణ సభ్యునిగా భారతీయుడిని ముందుగా నియమించాలని కాంగ్రెస్ పట్టుబట్టడంతో ఈ చర్చలు విఫలం అయ్యాయి.

క్రిప్స్ దౌత్యం విఫలమైన తరువాత బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ తన మూడవ ముఖ్యమైన ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1942 ఆగస్టులో మొదలైన ఈ ఉద్యమం 'క్విట్ ఇండియా' (భారతదేశం వదిలి వెళ్లండి). గాంధీజీని వెంటనే ఖైదు చేసినా యువ కార్యకర్తలు దేశవ్యాప్తంగా సమ్మెలు నిర్వహించారు, దాడులలో ఆస్తినష్టం గావించారు. యువత పెద్ద సంఖ్యలో కళాశాల చదువులు వదిలిపెట్టి జైళ్లకు వెళ్లారు. ప్రత్యేకించి రహస్య ఉద్యమంలో కాంగ్రెస్‌లోని జయప్రకాశ్ నారాయణ్ వంటి సోషలిస్టు సభ్యులు చురుగ్గా పాల్గొన్నారు. పశ్చిమంలో సతారా, తూర్పులో మేదినిపూర్ వంటి పలు జిల్లాల్లో 'స్వతంత్ర' ప్రభుత్వాలను ప్రకటించారు. బ్రిటిష్ పాలకులు మరింత బల ప్రయోగంతో శక్తి వంతంగా ఉద్యమాన్ని అణచివేశారు. అయినప్పటికీ ఈ ఉద్యమాన్ని నిలువరించటానికి సంవత్సరానికి పైగా పట్టింది.

ఈలోగా యుద్ధంలో బ్రిటన్‌కు మద్దతు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. నాజీ సైన్యం సోవియట్ యూనియన్‌పై దండెత్తటంతో అది ఆందోళన చెందింది. ప్రపంచస్థాయిలో ప్రమాదాన్ని గుర్తించి, ఈ యుద్ధాన్ని అది ప్రజల యుద్ధంగా పేర్కొంది. ఇందుకు విరుద్ధంగా గాంధీజీ వంటి వాళ్లు బ్రిటన్ భారతదేశం విడిచి వెళ్లిపోతే అది సొంతంగా జపానును ఎదుర్కోగలదని భావించారు.

అమెరికా, యూరపులలో జపాన్ సాధించిన విజయాలు భారతీయులపై బలమైన ముద్రలు వేశాయి. ఐరోపా వలసపాలకులు త్వరలోనే ఓడింపబడతారని అనుకోసాగారు. జపాను ఆసియా దేశం, అది ఐరోపా వలస పాలకులను ఎదుర్కోగలిగింది. తాము కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా పోరాడి, గెలవగలమని భారతీయులు అనుకోసాగారు. ఆంగ్లేయులు ఉన్నత జాతికి చెందిన వాళ్లన్న భ్రమ బద్దలయ్యింది.

బ్రిటన్ ఎదుర్కొంటున్న కష్ట సమయాన్ని సుభాష్ చంద్ర బోస్ మంచి అవకాశంగా భావించాడు. భారతదేశ స్వాతంత్ర్యం అత్యంత ప్రాధాన్యత గల అంశమని, బ్రిటిష్ పాలకులను తరిమెయ్యటానికి జపాను వాళ్ల సహాయం తీసుకోవాలని అతడు భావించాడు. అతడు రహస్యంగా జర్మనీకి, అక్కడినుంచి జపానుకి వెళ్లి 1942లో భారతీయ సైనికులతో ఒక సైన్యాన్ని తయారుచేశాడు. ఈ సైనికులు ఎవరు? బర్మా, మలయా దేశాలలో బ్రిటన్‌ని జపాను ఓడించినపుడు బందీలుగా తీసుకున్న బ్రిటిష్ సైన్యంలోని వాళ్ళే వీళ్లు. భారత జాతీయ సైన్యం అని పేరుపెట్టి తన సైన్యంలోకి బోస్ వీళ్లని తీసుకున్నాడు. తరువాత ఎంతోమంది మహిళలతో సహా ఇతర భారతీయులు కూడా ఈ సైన్యంలో చేరారు. అయితే బోస్‌తో గాంధీజీ ఏకీభవించలేదు, జపనీయులు భారతదేశానికి విముక్తి దాతలు కాలేరని అతడు భావించాడు. కానీ సుభాష్ తాను ఎంచుకున్న మార్గంలో ముందుకు సాగాడు. జపాను సైన్యంతో కలిసి తన సైన్యంతో బ్రిటిష్‌వాళ్లకు వ్యతిరేకంగా దాదాపు మూడు సంవత్సరాలపాటు యుద్ధం చేశాడు.



చిత్రం 16.3 :సుభాష్ చంద్ర బోస్

- తాము బందీలుగా పట్టుకున్న సైనికులను బోస్ తన సైన్యంలోకి తీసుకోవటాన్ని జపనీయులు ఎందుకు అనుమతించారు?
- భారత సైనికులు భారత జాతీయ సైన్యంలో ఎందుకు చేరారు?
- యుద్ధంలో ఓడిపోతే బ్రిటిష్ వాళ్ల చేతుల్లో చిక్కుతామన్న భయం భారతీయ సైనికులకు ఎందుకు లేకపోయింది? బ్రిటిష్‌వాళ్లు వీరిని ఏమి చేసి ఉండేవాళ్లు?

అది అత్యంత క్లిష్ట, సాహసోపేత, నాటకీయ పరిణామాల కాలం. ఒక దశలో మిత్రపక్షాలు యుద్ధంలో ఓడిపోతాయనిపించింది. స్టాలిన్‌గ్రాడ్‌లో తిరుగులేని విజయం సాధించటంతో రష్యా నాజీశక్తుల ఆటకట్టించింది. మిత్రకూటమి యుద్ధంపై తిరిగి పట్టు సాధించి అంతిమంగా రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించింది. సుభాష్ చంద్ర బోస్ భారత జాతీయ సైన్యం బ్రిటిష్ వాళ్ల చేతుల్లో ఓటమి పాలయ్యింది. ఆ తరువాత ఘటనలలో బోస్ చనిపోయాడో, మాయమయ్యాడో ఖచ్చితంగా తెలియరాలేదు. 1944 జూన్‌లో యుద్ధం ముగింపుదశను చేరుకుంటూ ఉండగా బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని చెరసాలనుంచి విడుదల చేసింది. భారతదేశ స్వాతంత్ర్యం గురించి మరొక దఫా సంప్రదింపులకు సమయం ఆసన్నమయ్యింది.

- 1942-45 మధ్యకాలాన్ని సమీక్షించండి. అంతకు ముందు కంటే ఇప్పుడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయుల ప్రతిఘటన బలం పుంజుకుందా? వివరించండి.

## ప్రజల తిరుగుబాటు – 1946–48

భారత జాతీయ సైన్యానికి చెందిన సైనికులను జైలుపాలు చేసి వారిని శిక్షించాలని బ్రిటిష్ పాలకులు నిర్ణయించారు. విద్రోహ చర్య కింద వారిని విచారించి ఉరిశిక్ష విధించాలని నిర్ణయించారు.

భారత జాతీయ సైనికుల విచారణ కొనసాగుతుండగా దేశంలోని పలు ప్రాంతాలలో అశాంతి, అసంతృప్తి చెలరేగసాగాయి. జాతీయ చైతన్యంతో చెలరేగిన ఈ ప్రజా తిరుగుబాటులో హిందువు–ముస్లింల గుర్తింపు, విభజన రాజకీయాలు వంటివి ప్రాముఖ్యతను కోల్పోయాయి. ఉదాహరణకు భారత జాతీయ సైనికులలో విచారింపబడుతున్న వాళ్లల్లో చాలామంది ముస్లింలు, అయితే వాళ్ల పట్ల ప్రజల సానుభూతి వెల్లివిరిసి వాళ్ల మతంగురించి ఎవరూ ఆలోచించలేదు.

- ఘటనలు ఈ విధమైన మలుపు తీసుకోవటం వల్ల ప్రజల జీవితాలు ఏ విధంగా ప్రభావితమై ఉంటాయి?
- నాయకులుగా ఆరాధించిన భారత జాతీయ సైనికులను బ్రిటిష్ వాళ్లు విద్రోహులుగా పరిగణించి, విచారించి, ఉరి తీయటం ఇతర భారతీయులను ఎలా ప్రభావితం చేసి ఉంటుంది?

యుద్ధం ముగిసిన తరువాత మీరు ఉన్నట్లు ఊహించుకుంటే దేశ పరిస్థితిని తేలికగా అర్థం చేసుకోగలుగుతారు. ఆహార ధాన్యాల కొరత, ఆహార కోటాలు, పెరుగుతున్న ధరలు, అక్రమ నిల్వలు, నల్ల బజారు వంటి వాటితో ప్రజల్లో తీవ్ర అశాంతి చెలరేగింది. తక్కువ వేతనాల పట్ల ప్రజలు కోపంగా ఉన్నారు. ధరలపై రైల్వే, తపాలా ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు అఖిల భారత సమ్మె చేపట్టాలన్న ప్రణాళికతో ఉన్నారు.



*చిత్రం 16.4 : భారతదేశ స్వాతంత్ర్యం కోసం 1946లో తిరుగుబాటు చేసిన నావికా దళాల స్మారక చిహ్నం*

1946 ఫిబ్రవరి 16న బొంబాయి రేవులోని రాయల్ నౌకా దళంలోని భారత సైనికులు నాసిరకం ఆహారం, తమ పట్ల బ్రిటిష్ అధికారుల ప్రవర్తన పట్ల నిరసనగా నిరాహారదీక్ష చేపట్టారు. అనతికాలంలోనే ఈ సమ్మె బొంబాయిలోని ఇతర నావికా వర్గాలకు, భారతదేశంలోని అన్ని నౌకా దళ కేంద్రాలకు విస్తరించింది. తిరుగుబాటుదారులు నౌకలపై మూడు రంగుల జండా, నెలవంక జండా, కత్తి, సుత్తి జండాలను కలిపి ఎగరవేశారు. ఎంఎస్ ఖాన్ నాయకుడిగా నౌకాదళ కేంద్రీయ సమ్మె సంఘం ఏర్పడింది. మెరుగైన ఆహారం ఇవ్వాలని తెల్లసైనికులకు, భారతీయసైనికులకు సమాన వేతనాలు ఇవ్వాలని, భారతీయ జాతీయ సైనికులను, ఇతర రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, ఇండోనేషియా నుంచి భారతీయ సైనికులను ఉప సంహరించాలని ఈ సంఘం కోరింది.

ఈ సమ్మెలో 78 ఓడలు, 20 తీరప్రాంత కార్యాలయాలు, 20,000 మంది సైనికులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు మద్దతుగా వందలాది హిందూ, ముస్లిం యువకులు బొంబాయి వీధులలోకి వచ్చి సైనికులతోటి, పోలీసులతోటి ఘర్షణలకు దిగారు. ఫిబ్రవరి 22న బొంబాయిలోని మూడు లక్షల మిల్లు కార్మికులు తమ పనిముట్లు వదిలిపెట్టి రెండు రోజులపాటు పోలీసులు, సైనికులతో తీవ్ర ఘర్షణలకు పాల్పడ్డారు.

1946లో దేశంలో పలు ప్రాంతాలలో మిల్లులు, కర్మాగారాలలో పని ఆపేశారు, సమ్మెలు చేశారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీలు ఈ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాయి. గ్రామీణ ప్రాంతాలు సైతం అసంతృప్తితో రగులుకున్నాయి.

బెంగాల్‌లో పెద్ద భూస్వాములనుంచి భూమిని సాగుకు తీసుకున్న చిన్న, పేద రైతులు ఆందోళన చేయసాగారు. ఆ సమయంలో కౌలుకింద తమకు సగం, లేదా అంతకంటే తక్కువ ఇస్తుండగా తమ వాటాని మూడింట రెండు వంతులకు పెంచాలని వాళ్లు కోరారు. దీనిని 'తెభాగ' ఉద్యమం అంటారు. దీనికి ఆ రాష్ట్ర కిసాన్ సభ నేతృత్వం వహించింది.

హైదరాబాదులో కమ్యూనిస్టు పార్టీ తెలంగాణప్రాంత రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించింది. తెలంగాణ రైతులు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ రైతుల రుణాలను మాఫీ చెయ్యాలని, వెట్టిచాకిరిని నిర్మూలించాలని, దున్నేవాడికే భూమి ఇవ్వాలని కోరారు. పాలకులు, వాళ్ల సైనికులకు వ్యతిరేకంగా రైతాంగం సాయుధ పోరాటం చేపట్టింది. ఈ పోరాటంలో దాదాపు 3000 గ్రామాలు పాల్గొన్నాయి. మరొక సాయుధ పోరాటం ట్రావెన్‌కోర్‌లోని పున్నప్రా – వాయలార్ ప్రాంతంలో జరిగింది.

- దేశంలోని సాధారణ ప్రజల చర్యలను సమీక్షించండి. వాళ్ల కోరికలు ఏమిటి?
- పైన పేర్కొన్న పలు ప్రజా ఉద్యమాలలో మతపర తేడాలను పట్టించుకోలేదని గమనించాం. ఈ ఉద్యమాలలో ప్రజల ఐకమత్యానికి కారణం ఏమిటి?

## ముస్లిం లీగు, కాంగ్రెస్ – అధికారం బదిలీకి సంప్రదింపులు

1945లో అగ్రనాయకుల మధ్య రాజకీయ సంప్రదింపులు తిరిగి ప్రారంభమైనప్పుడు పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వటానికి ముందుగా వైస్రాయ్, సైనికా దళాల కమాండర్–ఇన్–చీఫ్ మినహా కేంద్ర కార్యనిర్వాహక వర్గాన్ని పూర్తిగా భారతీయులతోనే ఏర్పరచటానికి బ్రిటన్ సిద్ధం అయ్యింది. ఈ కార్యనిర్వాహక వర్గంలో ముస్లిం సభ్యులను ఎంపిక చెయ్యటానికి ముస్లిం లీగుకి సంపూర్ణ అధికారం ఉండాలని జిన్నా పట్టుబట్టడంతో అధికార బదిలీకి సంబంధించిన చర్చలు విఫలమయ్యాయి. దీని పట్ల ఇతరులు అభ్యంతరం వ్యక్తపరిచారు. జాతీయవాద ముస్లిములలో పలువురి మద్దతు కాంగ్రెస్‌కు ఉంది. పంజాబ్‌లోని యూనియనిస్టు పార్టీలో పలువురు ముస్లిములు సభ్యులుగా ఉన్నారు. ఈ రెండు పార్టీలు ముస్లిం లీగు కోరికను సమర్థించలేదు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా మౌలానా అజాద్ ఉండటంతో దాని ప్రతినిధి బృందానికి అతడు నేతృత్వం వహించాడు.

1946లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు జరిగాయి. కేంద్రంలో రిజర్వు చేసిన 30 స్థానాలనూ, రాష్ట్రంలోని 569 స్థానాలలో 442 స్థానాలనూ ముస్లిం లీగు గెలుచుకుంది. అంటే 1946 చివరినాటికి ముస్లిం ఓటర్లలో ప్రధాన పార్టీగా ముస్లిం లీగు ఆవిర్భవించి భారతీయ ముస్లిముల 'ఏకైక ప్రతినిధి'ని అన్న తన వాదనను నిజం చేసుకుంది. ముస్లిం ఓట్లలో 86 శాతానికి పైగా ఆ పార్టీకి వచ్చాయి. 1946లో సాధారణ నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీ ముస్లిమేతర ఓట్లలో 91 శాతంతో అఖండ విజయం సాధించింది.

## దేశ విభజన – ప్రత్యామ్నాయ మార్గాలు

ముస్లిం లీగు కోరికను పరిశీలించి స్వతంత్ర భారతదేశానికి అనువైన రాజకీయ చట్రాన్ని సిఫారసు చెయ్యటానికి బ్రిటిష్ మంత్రివర్గం 1946 మార్చిలో ముగ్గురు సభ్యుల బృందాన్ని ఢిల్లీకి పంపించింది.

ఈ క్యాబినెట్ మిషన్ మూడు నెలలపాటు దేశమంతా తిరిగి భారతదేశాన్ని విభజించకుండా మూడంచెల సమాఖ్యను ప్రతిపాదించింది. మొదట్లో అన్ని ప్రధాన పార్టీలు ఈ ప్రణాళికను అంగీకరించాయి. అయితే ఈ ప్రణాళికను వివిధ పార్టీలు పరస్పర విరుద్ధమైన పద్ధతిలో అర్థం చేసుకోవటం వల్ల ఈ ఒప్పందం ఎక్కువకాలం నిలబడలేదు. దాంతో అంతిమంగా కాబినెట్ మిషన్ ప్రతిపాదనను అటు కాంగ్రెస్, ఇటు ముస్లిం లీగు ఆమోదించలేదు.



చిత్రం 16.5 : స్వాతంత్ర్య ప్రకటనచేస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ

తమ కోరికలు చర్చల ద్వారా నెరవేరవని నిర్ణయించిన ముస్లిం లీగు ప్రజలను వీధులలోకి రమ్మని పిలుపునిచ్చింది. తమ కోరిక అయిన పాకిస్తాన్‌ని సాధించు కోటానికి 'ప్రత్యక్ష కార్యాచరణ' కు దిగటానికి నిర్ణయించుకుని 1946 ఆగస్టు 16ను 'ప్రత్యక్ష కార్యాచరణ దినం'గా ప్రకటించింది. ఆ రోజున కలకత్తాలో అల్లర్లు చెలరేగి చాలా రోజులపాటు కొనసాగాయి, వీటిలో వేలాది మంది చనిపోయారు. 1947 మార్చి నాటికి హింసాత్మక ఘటనలు ఉత్తర భారతదేశానికంతటికీ వ్యాపించాయి.

పెద్ద ఎత్తున చెలరేగిన ఈ హింసాత్మక చర్యల నేపథ్యంలో 1947 మార్చిలో పంజాబ్‌ని రెండుగా విభజించటానికి కాంగ్రెస్ అధినాయకత్వం సమ్మతించింది. ఒక భాగంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉండగా, మిగతా సగభాగంలో హిందూ, సిక్కులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఇదే సిద్ధాంతాన్ని బెంగాల్‌కు వర్తింపచెయ్యటానికి కాంగ్రెస్ సమ్మతించింది.

1947 ఫిబ్రవరిలో వావెల్ స్థానంలో వైస్రాయ్‌గా మౌంట్‌బాటెన్ వచ్చాడు. ముందుకు వెళ్లటానికి మౌంట్‌బాటన్ ఆఖరి దఫా చర్చలకు ఆహ్వానించాడు. ఇవి కూడా సఫలం కాకపోవటంతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ఇస్తామని దానితోపాటు దేశాన్ని విభజిస్తామని కూడా ప్రకటించాడు. ముస్లిములు అధిక సంఖ్యలో ఉన్న పంజాబు ప్రాంతం, ఎన్ డబ్ల్యూ ఎఫ్ పి, సింద్, బలుచిస్తాన్, తూర్పు బెంగాల్‌లు కొత్త దేశమైన పాకిస్తాన్‌లో భాగంగా ఉంటాయి. బ్రిటిష్ ప్రభుత్వం నుంచి పాకిస్తాన్‌కు అధికార బదిలీ 1947 ఆగస్టు 14న, భారతదేశానికి 15న చేస్తామని ప్రకటించారు. ప్రజలను సంవత్సరకాలంగా ముంచెత్తుతున్న అల్లర్లు, రక్తపాతం, విద్వేషాలకు ఇదొక్కటే ఆచరణీయ పరిష్కారంగా కనపడింది.

- కాంగ్రెస్‌కి ఆమెదయోగ్యంకాని ముస్లిం లీగు కోరికలు ఏమిటి? కాంగ్రెస్ పేర్కొన్న కారణాలతో మీరు ఏకీభవిస్తారా?
- ప్రజల అభిప్రాయాలను 1946 ఎన్నికలు ఏవిధంగా సూచించాయి? మీ అభిప్రాయాలను పేర్కొనండి.



VOLKART SIMPLEX
The Statesman
(With which the FRIEND OF INDIA is Incorporated.)
PUBLISHED SIMULTANEOUSLY FROM CALCUTTA AND DELHI.
QUALITY There is TRUTH in our Quality MODERN FURNISHERS
Vol. CXIII. No. 23112 REG. No. C193 CALCUTTA, FRIDAY, AUGUST 15, 1947. TWO ANNAS.

# TWO DOMINIONS ARE BORN

## *Political Freedom For One-Fifth Of Human Race*

## POWER ASSUMED BY INDIANS

### Constituent Assembly Members Take The Oath

### WORK FOR COMMON PROSPERITY

From Our Special Representative

NEW DELHI, Aug 15.—Two new Dominions, India and Pakistan, were born at zero hour today, ushering in political freedom to 400 million people, constituting one-fifth of the human race.

AT a special session of the Indian Constituent Assembly, the House assumed full powers for the administration of the Indian Dominion.

The Constituent Assembly tonight passed Pandit Nehru's resolution prescribing the Oath. All the members took the Oath and then Dr Rajendra Prasad and Pandit Nehru left for Government House to request

[See Editorial Comment—Page 6.]

Lord Mountbatten to accept the post of Governor-General.

Pandit Nehru's resolution, which was seconded by Chaudhuri Khaliq-uz-Zaman, Leader of the Muslim League Party, expressed the hope that

(Continued on page 8, col. 3)

**NO DISTURBANCE IN CALCUTTA**

No incidents of a communal nature occurred in Calcutta and Howrah yesterday.

**AUGUST 15, 1947.**

A special Independence Day supplement is published with this issue of The Statesman.

An exclusive article by a special correspondent on the negotiations which led to India's freedom appears on Page 6.

H.E. Sir Frederick Burrows talking to Mr S C Roy Chowdhury, Mayor of Calcutta, at Dum Dum while waiting for the arrival of Mr C Rajagopalachari. Dr P C Ghosh is chatting to Maj.-Gen Ranking.—Statesman.

## Close Friendship with Britain

### Nehru's Reply to Mr. Attlee

NEW DELHI, Aug 15.—"My colleagues in the U.K. Government join with me in sending, on this historic day, greetings and good wishes to the Government and people of India, says a message from Mr Attlee to Pandit Nehru. He adds:

"It is our earnest wish that India may go forward in tranquillity and prosperity and, in so doing, contribute to the peace and prosperity of the world."

Pandit Nehru replied: "On behalf of my colleagues in the Government of India and myself I wish to express our grateful thanks for your message of greeting on this historic day when India emerges into freedom. That freedom means much to us, but it also means much to Asia and the world. We hope to utilize that freedom for the advancement of our own people as well as for the furtherance of the peace and prosperity of the world. In these great tasks we shall look forward to the closest co-operation with your Government."—API

**VISCOUNT MOUNTBATTEN AWARDED EARLDOM**

LONDON, Aug 14.—Viscount Mountbatten, Governor-General-designate of India, was today awarded an Earldom.—Reuter

## *Joyful Scenes In Calcutta*

### *Celebrations By Hindus And Muslims*

By a Staff Reporter

REMARKABLE signs of a return to communal amity after a year of bloodshed were seen in Calcutta last night and early this morning. Almost unbelievable scenes of fraternity and rejoicing were witnessed in some of the hitherto worst-affected areas of Central and North Calcutta, particularly along Chittaranjan Avenue, Lower Chitpur Road, Zakaria Street, Harrison Road, Bowbazar Street and Dhurrumtollah Street.

The city, till an early hour this morning, resounded to cries of "Hindu Muslim Ek Ho," "Jai Hind," "Bande Mataram," and "Inquilab Zindabad." The shouts emanated from lorry, bus and taxi loads of Hindus and Muslims, who drove through the streets shouting slogans, to which large friendly crowds of both communities thronging the streets readily and joyfully responded.

The first signs of a return of brotherly feeling between the two communities came with the city's preparations

(Continued on page 9 col. 5)

Mr Rajagopalachari entering the Throne Room in procession for the office assumption ceremony.—Statesman.

Mr Rajagopalachari taking the Oath of Allegiance before Mr Justice Mitter.—Statesman.

Sir Frederick Burrows, retiring Governor of Bengal, and Mr Rajagopalachari, Governor of West Bengal, photographed at Government House yesterday.—Statesman.

## First Governor of W. Bengal

### C. R. Sworn In This Morning

By a Staff Reporter

WITH the birth of the Indian Dominion His Excellency Mr C. Rajagopalachari assumed charge of the office of Governor of West Bengal at one o'clock (BT) this morning. Immediately afterwards Dr P. C. Ghosh, Chief Minister, West Bengal, and the members of his Cabinet were sworn in.

The ceremony took place in the Throne Room of Government House, Calcutta, in the presence of high-ranking civil and military officials and some distinguished citizens, the whole proceedings occupying a little over half an hour.

Mr Rajagopalachari's daughter also attended.

In order that the Calcutta ceremony should synchronize with the assumption ceremonies elsewhere in the Indian Dominion, the swearing-in was

(Continued on page 5 column 1.)

**TWO HOLIDAYS**

Members of The Statesman Staff will participate in the two public holidays on August 15 and 16 officially announced to celebrate the birth of the two new Dominions. There will, therefore, be no issues of the paper on August 16 and 17.

## Gandhi & Suhrawardy to Fast and Pray Today

### Meeting Listens to Mahatma Without Interruption

By a Staff Reporter

MR Gandhi will celebrate Independence Day today, by observing a 24-hour fast and spinning and holding special prayer. At his prayer meeting last evening he invited the people to observe the day in a similar manner.

Mr H S Suhrawardy and Mr S M Osman, ex-Mayor and Secretary, Calcutta District Muslim League, will fast with Mr Gandhi.

Mr Gandhi and Mr Suhrawardy spent the second day of their joint peace mission in Belliaghatta, Calcutta, yesterday.

In contrast to the hostile demonstrations of Wednesday, their residence became a place of pilgrimage for thousands of people yesterday; a large number of them were women. Both Hindus and Muslims came in a constant stream from different disturbed localities of the city and placed their grievances before Mr

[See Editorial Comment—Page 6.]

Gandhi and sought his advice. At his prayer meeting a vast audience listened to him without interruption.

Later, Mr Suhrawardy also addressed a gathering.

Yesterday morning Mr Gandhi went round the neighbourhood of his residence and saw for himself some of the devastations caused by riots.

Mr S M Tsuiq on behalf of the Calcutta District Muslim League and

(Continued on page 7 Col. 5)

**CALCUTTA WEATHER**

Rainfall for the 24-hour period ending 5 p.m. IST yesterday 0.44".

Maximum temperature in Calcutta yesterday was 92° and minimum 79°.

Maximum humidity was 92% and minimum 74%.

(Weather Readings: P 3.)

## First Cabinet of India Begins to Function

### Pandit Nehru Heads Dominion Ministry of Fourteen

NEW DELHI, Aug 14.—The first Cabinet of the Indian Dominion which will function from Aug 15, announced tonight, will be headed by Pandit Nehru. The Cabinet consists of the following Ministers: Pandit Nehru, Prime Minister, External and Commonwealth Relations, Scientific Research.

Sardar Patel: Home, Information and Broadcasting, States.

Dr Rajendra Prasad: Food and Agriculture.

Maulana Azad: Education.

Dr Matthai: Railways and Transport.

Sardar Baldev Singh: Defence.

Mr Jagjivan Ram: Labour.

Mr C H Bhabha: Commerce.

Mr Rafi Ahmed Kidwai: Communications.

Rajkumari Amrit Kaur: Health.

Dr Ambedkar: Law.

Mr Shanmukham Chetty: Finance.

Dr Shyama Prasad Mookerjee: Industries and Supplies.

Mr N V Gadgil: Works, Mines and Power.—API

**INTERNATIONAL RIGHTS OF INDIAN DOMINION**

NEW DELHI, Aug 14.—The Dominion of India will be solely entitled to all the international rights to which India was entitled. Moreover, the Dominion of India will continue to be a member of international organizations of which India was a member, and the Dominion of Pakistan will take such steps as may be necessary to apply for membership of international organizations.

This is the substance of the Indian Independence Order, International Arrangements issued by the Viceroy today. The order is to have the force of an agreement between the two Dominions of India and Pakistan.—API

[See Editorial Comment—Page 6.]

Ω It's an OMEGA
Ch. ABRECHT
D.S. CLIVE BUILDINGS
CALCUTTA

చిత్రం 16.6 : భారతదేశ స్వాతంత్ర్యంపై దిన పత్రిక నివేదిక. దీంట్లో ఏఏ అంశాలను గుర్తించారు? చర్చించండి.

## దేశ విభజన - వలసలు

ముస్లిం మత పాకిస్తాన్ ఏర్పాటు కావటంతో చాలామంది ప్రజలముందు ఊహించని బాధాకరమైన పరిస్థితి ఎదురయ్యింది. కొత్తగా గీసిన సరిహద్దు రేఖకి ఒకవైపున ఉన్న హిందువులలో అభద్రతా భావం ఏర్పడి వలస వెళ్లడం తప్పనిసరి అయ్యింది. ఈ కొత్త సరిహద్దు రేఖకు ఆవలివైపున ఉన్న ముస్లిములలో కూడా ఇదే పరిస్థితి. అందరూ దీనిని కోరుకుని ఉండక పోవచ్చు, ఇది ఎందుకు జరుగుతోందో అందరికీ అర్థం అయి ఉండకపోవచ్చు. తమ ఇళ్లు, ఊళ్లు, పట్టణాలను విడిచి వెళ్లవలసి రావటంతో ఒకరిపట్ల ఒకరికి కోపం, విద్వేషాలు చెలరేగాయి. మొత్తంగా 1.5 కోట్ల హిందువులు, ముస్లిములు నిర్వాసితులయ్యారు. హత్యలు, దోపిడి, దహనాలు యదేచ్ఛగా కొనసాగాయి. హిందువులు, ముస్లిములు కలిపి రెండు నుంచి అయిదు లక్షల మంది చంపబడ్డారు. వాళ్లు కాందిశీకులుగా మారారు, పునరావాస శిబిరాలలో గడిపారు, రైళ్లల్లో కొత్త ఇళ్ల అన్వేషణలో బయలుదేరారు. శాంతి, సౌభ్రాతృత్వ సందేశాలను పంచుతూ గాంధీజీ అల్లర్లకు గురైన ప్రజల శిబిరాల మధ్య, ఆసుపత్రులలో గడిపాడు. తను ఇంతగా కష్టపడింది ఇటువంటి స్వేచ్ఛ, స్వరాజ్యాల కోసం కాదు. జాతిపిత మొదటి స్వాతంత్ర్య దినోత్సవంనాడు సంబరాలు చేసుకోకుండా నిరాహారదీక్ష చేశాడు.

గాంధీజీ చొరవతో 'అల్పసంఖ్యాక వర్గాల హక్కుల'పై నెహ్రూ, కాంగ్రెస్ ఒక తీర్మానాన్ని చేశాయి. ఆ పార్టీ 'రెండు దేశాల సిద్ధాంతాన్ని' ఎప్పుడూ అంగీకరించలేదు. తన ఇష్టానికి వ్యతిరేకంగా దేశవిభజనకు బలవంతంగా ఒప్పుకోవలసి వచ్చినప్పటికీ 'భారతదేశం అనేక మతాల, జాతుల దేశమనీ, అలాగే కొనసాగాలని' విశ్వసించింది. పాకిస్తాన్ ఎలా ఉన్నప్పటికీ భారతదేశం 'ప్రజాస్వామిక లౌకిక రాజ్యం'గా ఉంటుంది, మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ రాజ్యంనుండి రక్షణ లభిస్తుంది, సమాన హక్కులు ఉంటాయి.










*చిత్రం 16.7 : దేశవిభజనకు సంబంధించి వివిధ చిత్రాలు. ఈ ఫోటోలను మార్గరెట్ బోర్క్-వైట్ తీశారు, ఇవి లైఫ్ పత్రికలో ప్రచురితమయ్యాయి.*

## గాంధీజీ పై ఘాతుకం

1947 ఆగస్టు 15న బెంగాల్‌లో అల్లర్లతో అతలాకుతలమైన నోవఖలీలో శాంతిని నెలకొల్పటానికి జాతిపిత గాంధీజీ ప్రయత్నించాడు. దేశ రాజధాని అయిన ఢిల్లీకి అతడు 1947 సెప్టెంబరు 9న గాని రాలేదు. వాయవ్య భారతంలో పెద్ద ఎత్తున చెలరేగిన మత ఘర్షణలతో ఆ వృద్ధ నేత అసంతృప్తితో ఉన్నాడు, ప్రజల భయాలను దూరం చెయ్యటానికి అతడు ప్రయత్నించాడు. అయితే దేశంలోని ప్రజలలోని ఒక వర్గం భారతదేశ రాజకీయాలలో గాంధీ పాత్రతో కోపంగా ఉంది. అతడు నిర్వహిస్తున్న సర్వమత ప్రార్థనా సమావేశాలను పలుమార్లు వాళ్లు భంగపరిచారు. అతడిని చంపటానికి రెండు రోజుల ముందు అతడిపై జరిపిన హత్యాయత్నం విఫలమయ్యింది. 1948 జనవరి 28న గాంధీజీ "ఒక పిచ్చివాడి చేతిలో తుపాకికి నేను బలి కావలసి వస్తే, నవ్వుతూ అందుకు సిద్ధమవుతాను. నాలో ఎటువంటి కోపమూ ఉండకూడదు. నా హృదయంలో, పెదాల మీద దేవుడే ఉండాలి," అన్నాడు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలలలోపే 1948 జనవరి 30 సాయంత్రం సర్వమత ప్రార్థనకు వెళుతున్న జాతిపిత మూడు బుల్లెట్లకు నేలకొరిగాడు. అతడు కోరుకున్నట్టుగానే చనిపోటానికి ముందు అతడు 'హే, రాం' అన్నాడని అంటారు. అతడి హంతకుడైన నాథూరాం గాడ్సే అక్కడినుంచి పరారయ్యాడు. తరువాత అతడిని ముంబయిలో పట్టుకున్నారు. అతడు ఒకప్పుడు హిందూ మహాసభలో సభ్యుడు. దాంతో ఆ సంఘంపై వ్యతిరేకత వెల్లువెత్తింది. ఫలితంగా 1948 ఫిబ్రవరి 14న అఖిల భారత హిందూ మహాసభ 'రాజకీయ కార్యక్రమాన్ని త్యజించి నిజమైన సంస్థాగత పనిమీద దృష్టి కేంద్రీకరించాలని' నిర్ణయించింది. ఒక రకంగా తీవ్రవాద గాడ్సే అంతిమంగా తన మిత్రులకు, ఎంచుకున్న పంథాకి హాని కలిగించాడు.



*చిత్రం 16.8 : మహాత్మా గాంధి అంతిమ యాత్ర*

## సంస్థానాల విలీనం

బ్రిటిష్ అధికారం కింద వివిధ స్థాయిలలో సర్వసత్తాక పాలనతో సుమారుగా 550 సంస్థానాలు ఉండేవి. బ్రిటిష్ పాలకులు భారతదేశం నుంచి వెళ్లిపోతుండటంతో ఈ సంస్థానాలు కూడా స్వతంత్రం పొందుతాయి. భారతదేశంలో విలీనమవుతాయో, పాకిస్తాన్‌లో విలీనమవుతాయో, లేక స్వతంత్రంగా ఉంటాయో నిర్ణయించుకోమని ఈ సంస్థానాలను కోరారు. సంస్థానాల ప్రజలు ప్రజా మండల ఉద్యమాల్లో పాల్గొనటం ద్వారా వాళ్లు తమ ప్రజాస్వామిక హక్కుల పట్ల చైతన్యం పొందారు. రాచరిక కుటుంబాల పాలన కొనసాగాలని ఆ ప్రజలకు లేదు. హైదరాబాదు, ట్రావన్‌కోర్‌లలో పాలక జమీందార్లకు వ్యతిరేకంగా రైతాంగం సాయుధ పోరాటం చేపట్టింది.

సంస్థానాల ప్రజల ఉద్యమాలకు కాంగ్రెస్ మద్దతు ఇస్తూ అవి భారతదేశంలో విలీనమై కొత్త రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరింది. 1947 జులైలో ఈ బాధ్యతను సర్దార్

పటేల్‌కి అప్పగించారు. భారతదేశంలో విలీనం కావలసిన ఆవశ్యకత గురించి అతడు రాచరిక కుటుంబాలతో చర్చలు మొదలుపెట్టాడు. వాళ్లు తమంతట తాము విలీనం కాకపోతే ఆ ప్రక్రియను పూర్తి చెయ్యటానికి సైన్యాన్ని పంపించాల్సి ఉంటుందని కూడా అతడు స్పష్టపరిచాడు. 1947 ఆగస్టు 15 నాటికి కాశ్మీరు, హైదరాబాదు, జునాగఢ్‌లు తప్పించి మిగిలిన సంస్థానాలన్నీ భారతదేశంతో విలీన ఒప్పంద పత్రంపై సంతకం చేశాయి. తరువాత రెండు సంవత్సరాల లోపు ఈ మూడు సంస్థానాలు కూడా భారతదేశంలో విలీనం అయ్యేటట్టు చేశారు.

సంస్థానాల ప్రభుత్వాలను స్వాధీనం చేసుకుని ఆయా రాచరిక కుటుంబాలకు వ్యక్తిగత ఖర్చులకు పెన్షను మంజూరు చేశారు. దీనిని రాచరిక భరణం అనేవాళ్లు. ఈ ప్రాంతాలను విలీనం చెయ్యటం ద్వారా కొత్తగా పరిపాలనా సౌలభ్యానికై రాష్ట్రాలను ఏర్పరిచారు. భారతదేశంలో కొత్త రాష్ట్రాలను ఏర్పరిచే ఈ ప్రక్రియ 1956 వరకు కొనసాగింది. 1971లో భారత ప్రభుత్వం భరణాన్ని, గత రాచరిక కుటుంబాల బిరుదులను రద్దుచేసింది.

మీకు తెలిసిన ఆధునిక భారతదేశం ఏర్పడింది. 1947లో అది పేద దేశంగా ఉండేది – సరిగా లేని మౌలిక సదుపాయాలతో, మానవ అభివృద్ధి సూచికలలో చాలా వెనకబడి ఉండేది. రెండు శతాబ్దాలపాటు కొనసాగిన వలసపాలన దేశ అభివృద్ధిని అడ్డుకుని, దేశ ప్రజల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసింది. సమానతతో కూడిన స్వయం సమృద్ధ ఆధునిక దేశాన్ని నిర్మించడం ఒక సవాలుగాను, అవకాశంగాను ఉంది.

## కీలక పదాలు

రాజ్య (డొమీనియన్) ప్రతిపత్తి | విభజించి పాలించు | ప్రత్యేక నియోజకవర్గం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. భారతదేశంలో వివిధ బృందాలు, వ్యక్తులు రెండవ ప్రపంచ యుద్ధం పట్ల స్పందించిన విధానాన్ని పోల్చటానికి ఒక పట్టిక తయారు చెయ్యండి. ఈ బృందాలు ఎటువంటి సందిగ్ధతకు లోనయ్యాయి?
2. యూదులు, ఇతర సమూహాల పట్ల జర్మనీ దారుణంగా వ్యవహరించిన నేపథ్యంలో జర్మనీకిగాని, జపానుకిగాని మద్దతు ఇవ్వడం నైతికంగా సరైనదేనా?
3. భారతదేశ విభజనకు దారితీసిన వివిధ కారణాల జాబితా తయారుచేయండి.
4. దేశ విభజనకు ముందు వివిధ సమూహాల మధ్య అధికారాన్ని పంచుకోటానికి ఏఏ విధానాలను అవలంబించారు?
5. బ్రిటిష్ వలసపాలకులు తమ విభజించి, పాలించు అన్న విధానాన్ని భారతదేశంలో ఏ విధంగా అమలు చేశారు? నైజీరియాలో అవలంబించిన విధానానికీ, దీనికీ మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
6. దేశ విభజనకు ముందు రాజకీయాలలో మతాన్ని ఏ ఏ విధంగా ఉపయోగించుకున్నారు?
7. స్వాతంత్ర్య పోరాట చివరి సంవత్సరాలలో కార్మికులను, రైతాంగాన్ని ఏ విధంగా సమీకరించారు?
8. సాధారణ ప్రజల జీవితాలను దేశ విభజన ఏ విధంగా ప్రభావితం చేసింది? విభజన తరువాత జరిగిన వలసలకు రాజకీయ ప్రతిస్పందన ఏమిటి?
9. కొత్తగా ఏర్పడిన భారతదేశంలోకి వివిధ సంస్థానాలను విలీనం చేసే ప్రక్రియ ఒక సవాలుగా పరిణమించింది. చర్చించండి.

పాఠం 17

# స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

## భారత రాజ్యాంగ పునః సందర్శన

ముందుగా 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకంలోని 13వ అధ్యాయం చదివి భారత రాజ్యాంగానికి సంబంధించిన కింద ఇచ్చిన కృత్యాలను పూరించండి.

- భారత రాజ్యాంగానికి --------------, ----------------, -----------, --------------- ప్రధానంగా దోహదం చేశారు.
- భారత రాజ్యాంగ ప్రవేశికలో ఏ ఏ మౌలిక ఆదర్శాలు పొందుపరచబడ్డాయి?
- భారతదేశ రాజ్యాంగ ప్రవేశికతోపాటు కింద ఇచ్చిన రెండు దేశాల ప్రవేశికలను చదివి వాటిల్లో పోలికలు, తేడాలు పేర్కొనండి. తమ దేశం ఏర్పడటానికి దారితీసిన రాజకీయ ఘటనలను ప్రతిబింబించటానికి ప్రతి రాజ్యాంగమూ ప్రయత్నిస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోండి. రాజ్యాంగంలో చోటు చేసుకున్న వాటిని ప్రభావితం చేసిన రాజకీయ ఘటనలను గుర్తించటానికి ప్రయత్నించండి. జపాన్ నేపథ్యాన్ని అర్థం చేసుకోటానికి 13వ అధ్యాయంలో జపాను గురించి మరొకసారి చదవండి. నేపాల్ నేపథ్యాన్ని అర్థం చేసుకోటానికి 23వ పేజీ చూడండి.

### నేపాల్ మధ్యంతర రాజ్యాంగ ప్రవేశిక 2007

నేపాల్ ప్రజల సర్వసత్తాక, ప్రభుత్వ అధికార వారసుల మైన నేపాల్ ప్రజలం

2007 (1951) ముందునుంచి ఇప్పటివరకు ప్రజలు చేపట్టిన ఉద్యమాలు, చారిత్రిక పోరాటాల ద్వారా ప్రజాస్వామ్యం, శాంతి, ప్రగతిలకు అనుకూలంగా ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తూ వర్గ, జాతిమూలాలు, ప్రాంత, లింగ వంటి అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి రాష్ట్రాన్ని ప్రగతిశీలంగా పునః నిర్మించటానికి పూనుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం;

పోటీ ఆధారిత బహుళపార్టీ ప్రజాస్వామిక పాలనా వ్యవస్థ, పౌరస్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు, వయోజనులకు ఓటు హక్కు, క్రమం తప్పకుండా ఎన్నికలు, పత్రికా రంగానికి పూర్తి స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయవ్యవస్థ, చట్టబద్ధపాలన అన్న భావన వంటి వాటన్నింటితో కూడిన ప్రజాస్వామిక విలువలు, నియమాలకు పూర్తి నిబద్ధత వ్యక్తపరుస్తున్నాం;

తమ కోసం తమంతట తాము రాజ్యాంగాన్ని రూపొందించుకోటానికి, భయంలేని వాతావరణంలో రాజ్యాంగ సభను ఎన్నుకోటానికి స్వేచ్ఛాపూరిత, న్యాయమైన ఎన్నికలలో పాల్గొనటానికి నేపాల్ ప్రజలకు ఉన్న మౌలిక హక్కుకు హామీ ఇస్తున్నాం;

ప్రజాస్వామ్యం, శాంతి, అభివృద్ధి, ప్రగతిశీల సామాజిక–ఆర్థిక మార్పు, దేశ సర్వసత్తాకత, సమగ్రత, స్వతంత్రత, గౌరవాలను కేంద్రంగా ఉంచుతున్నాం;

రాచరిక పాలనను రద్దు చేస్తూ నేపాల్‌ని సమాఖ్య, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యంగా ప్రకటిస్తున్నాం;

ఇప్పటివరకు వివిధ విప్లవాలు, ఉద్యమాల ద్వారా సాధించిన వాటిని సంస్థాగతం చెయ్యటానికి రాజకీయ అవగాహన ద్వారా రూపొందిన నేపాల్ మధ్యంతర రాజ్యాంగాన్ని 2063 (2007) ప్రకటిస్తున్నాం, రాజ్యాంగ సభ కొత్త రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసేవరకు ఇది అమలులో ఉంటుంది.

## జపాను రాజ్యాంగ ప్రవేశిక 1946

జపాను ప్రజలమైన మేము దేశపార్లమెంటు (National Diet)లోని ఎన్నికైన ప్రజాప్రతినిధుల ద్వారా మాకు, రానున్న తరాలకు అన్ని దేశాలతో శాంతియుత సహకార ఫలాలను పొందాలనుకుంటున్నాం, ఈ భూమి అంతటా స్వేచ్ఛ వెల్లివిరియాలనుకుంటున్నాం, ప్రభుత్వ చర్యల ద్వారా ఎన్నడూ యుద్ధ భయాలు తిరిగి దేశాన్ని కమ్ముకోవని తీర్మానిస్తూ, సర్వసత్తాక అధికారం ప్రజలలో ఉంటుందని తెలియచేస్తూ ఈ రాజ్యాంగాన్ని ప్రకటిస్తున్నాం. ప్రభుత్వం అన్నది ప్రజల పవిత్ర నమ్మకం, దీనికి అధికారం ప్రజల నుండి సంక్రమిస్తుంది, దీని అధికారాలను ప్రజా ప్రతినిధుల ద్వారా అమలుచేస్తారు, దీని ఫలాలను ప్రజలు అనుభవిస్తారు. ఈ మానవతా విశ్వసూత్రం ఆధారంగా ఈ రాజ్యాంగం రూపొందింది. దీనితో విభేదించే అన్ని రాజ్యాంగాలను, చట్టాలను, నిర్ణయాలను, అధికారిక ప్రకటనలను రద్దు చేసి, తిరస్కరిస్తున్నాం. జపాను ప్రజలమైన మేము ఎల్లకాలాలకు శాంతిని కోరుకుంటున్నాం, మానవ సంబంధాలను నియంత్రించే ఉన్నత ఆదర్శాల పట్ల పూర్తి అవగాహనతో ఉన్నాం; శాంతి కాముకులైన ప్రపంచ ప్రజలకు న్యాయం, ధర్మాలపై నమ్మకాన్ని ఉంచుతూ మా భద్రతను, మనుగడను కాపాడుకోవాలని స్థిరంగా నిర్ణయించుకున్నాం. శాంతిని కాపాడటానికి, నిరంకుశత్వం, బానిసత్వం, అణచివేత, అసహనాన్ని భూమ్మీద లేకుండా శాశ్వతంగా పారదోలటానికి పాటు పడుతున్న అంతర్జాతీయ సముదాయంలో ఒక సమున్నత స్థానాన్ని పొందాలని ఆశిస్తున్నాం. శాంతితో, భయం, లేమి అన్నవి లేకుండా ఉండటానికి ప్రపంచ మానవాళి అంతటికీ ప్రశాంతంగా జీవించడానికి హక్కు ఉందని మేం గుర్తిస్తున్నాం. ఏ దేశమైనా సరే దాని ఒక్కదానికే బాధ్యతవహిస్తే సరిపోదు అని మేం నమ్ముతున్నాం: రాజకీయ నైతికతకు సంబంధించిన చట్టాలు విశ్వజనీనమైనవి; తమ సర్వసత్తాకతను కొనసాగిస్తూ, ఇతర దేశాలతో సర్వసత్తాక సంబంధాలను సమర్థించుకుంటూ అన్ని దేశాలూ ఈ చట్టాలను గౌరవించాలి. జపాను ప్రజలమైన మేం మాకున్న అన్ని వనరులతో ఈ ఉన్నత ఆదర్శాలను సాధిస్తామని మా జాతి గౌరవాన్ని పణంగా పెట్టి ప్రతిజ్ఞ చేస్తున్నాం.

- ఈ దేశాల రాజకీయ నేపథ్యాలలో పోలికలు, తేడాలు ఏమిటి? అంతకు ముందు ఘటనలు ఏమిటి? అంతకు ముందు పాలకులు ఎవరు?
- లింగం అన్న పదాన్ని ఏ దేశ రాజ్యాంగ ప్రవేశిక పేర్కొంది?
- శాంతి కాముకతను ఏ దేశ రాజ్యాంగ ప్రవేశిక కనపరిచింది?

- రాజ్యాంగ ప్రవేశికలో ప్రజా ఉద్యమాలు ఎలా ప్రతిబింబించాయి?
- గతం పట్ల సమీక్షలో వివిధ ప్రవేశికలలోని పోలికలు, తేడాలు ఏమిటి?
- మూడు దేశాలో భవిష్యత్తు సమాజం గురించి ఎటువంటి వాగ్దానాలు చేశారు?
- రాజకీయ వ్యవస్థ స్వరూపానికి సంబంధించి ఏ ఏ వాగ్దానాలు చేశారు?
- ఈ దేశాల పౌరులకు ఏ ఏ వాగ్దానాలు చేశారు?

## నేపాల్ నేపథ్యం

1959లో రాజు మహేంద్ర జారీ చేసిన రాజ్యాంగం కింద నేపాల్‌లో మొదటి ఎన్నికలు జరిగాయి. అయితే ఒక సంవత్సరం తిరిగే లోపలే ఎన్నికైన ప్రభుత్వాన్ని పడదోసి అధికారాలలో అధిక భాగం తిరిగి రాజుకి కట్టబెట్టారు. ప్రజాస్వామిక ప్రాతినిధ్య ప్రభుత్వం కోసం ప్రజల నిరంతర పోరాటంతో అంతిమంగా 1991లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో నేపాల్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇంకా రాజుకి ప్రభుత్వంలో పెత్తందారీ పాత్ర ఉన్న విధానంతో కమ్యూనిస్టు పార్టీ సంతృప్తి చెందలేదు. రాచరికాన్ని రద్దు చెయ్యాలని, రాజకీయ వ్యవస్థను సమూలంగా పున: నిర్మించాలని వాళ్లు కోరుకున్నారు. ఈ ఉద్యమం రాచరిక అనుకూల, రాచరిక వ్యతిరేక బృందాల మధ్య సాయుధ ఘర్షణగా మారింది. 2007లో రాచరికం రద్దు కావటానికి ఈ ఉద్యమం కారణమయ్యింది.

## చర్చలను చదవటం

ప్రభుత్వం ఎలా పని చేస్తుంది, దేశ భవిష్యత్తును ఎలా రూపొందిస్తారు వంటి అంశాలకు సంబంధించి ఏ దేశ రాజ్యాంగమైనా కొంత మౌలిక నిర్మాణాన్ని, సిద్ధాంతాలను అందచేస్తుంది. అంటే, రాజ్యాంగం రెండు విధులు నిర్వర్తిస్తుందన్నమాట: (అ) పౌరుల హక్కులు, బాధ్యతలను పేర్కొనటం; ప్రభుత్వం దాని అంగాలైన కార్యనిర్వాహక, శాసన, న్యాయ శాఖల వంటివాటి నిర్మాణం, అధికారాలను పేర్కొనటం; (ఆ) ప్రభుత్వమూ, సమాజమూ కలిసి నిర్మించాల్సిన భవిష్యత్తు సమాజ స్వభావాన్ని సూచించటం. అంటే దేశం ముందుకు వెళ్లటానికి ప్రస్తుత అంశాలను ఎలా మార్చాలో రాజ్యాంగం సూచిస్తూ ప్రధానంగా భవిష్యత్తు చిత్రాన్ని పేర్కొంటుంది.

నేపాల్‌లో రాజ్యాంగాన్ని రూపొందించే ప్రక్రియ 2007లో మొదలయ్యింది. కానీ 2014 నాటికి కూడా ఇది పూర్తికాలేదు. దీనికి కారణం అనేక మౌలిక అంశాలపై నేపాల్‌లోని అనేక రాజకీయ ధోరణులు ఒక ఏకాభిప్రాయానికి రాలేకపోవడం. అంటే రాజ్యాంగాన్ని రూపొందించే ప్రక్రియ-చర్చలు, వాదోపవాదాలు, అభిప్రాయ బేధాలను పరిష్కరించటం, పరస్పర విరుద్ధ భావాలు ఉన్న వాళ్లందరికీ ఆమోదయోగ్యమయ్యే చిత్రాన్ని రూపొందించడం. ఈ ప్రక్రియ రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియ. భారతదేశంలో ఇది ఎలా జరిగిందో చూద్దాం.

## భారతదేశ రాజ్యాంగ నిర్మాణం

భారదేశ రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ రూపొందించి, ఆమోదించింది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం భారతీయ ప్రజల సుదీర్ఘ పోరాట ఫలితం ఇది. భారతదేశానికి స్వాతంత్రం ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించటంతో తమను తాము పరిపాలించుకోటానికి, తమకు దీర్ఘకాల లక్ష్యాలు నిర్దేశించుకోటానికి భారత ప్రజలకు కొత్త రాజ్యాంగం అవసరమయ్యింది.

దీనికోసం 1946లో రాష్ట్రాలకు ఎన్నికలు జరిగిన తరువాత రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిగాయి. రాజ్యాంగ సభ సభ్యులను రాష్ట్ర శాసన సభలు పరోక్షంగా ఎన్నుకున్నాయి. 1946లో ఏర్పాటైన కేబినెట్ మిషన్

ప్రతి రాష్ట్రానికి, ప్రతి సంస్థానానికి లేదా కొన్ని సంస్థానాలతో కూడిన బృందాలకి కొన్ని స్థానాలను కేటాయించింది. ఈ ప్రకారం బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలోని రాష్ట్రాలు 292 సభ్యులను ఎన్నుకోగా, అన్ని సంస్థానాలు కలిసి 93 సభ్యులను ఎన్నుకున్నాయి. ప్రతి రాష్ట్రం నుంచి ఎన్నికయ్యే సభ్యులలో ఆ రాష్ట్రాలలో ఆయా వర్గాల జనాభాను బట్టి ముస్లిములు, సిక్కులు, ఇతరులు ఉండేలా ఈ ఎన్నికలు నిర్వహించారు. రాజ్యాంగ సభలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన 26 మంది సభ్యులు ఉండేలా కూడా చూశారు. రాష్ట్రాల శాసన సభలలో ఎన్నికలు నిర్వహించగా సంస్థానాల ప్రతినిధులను సంప్రదింపుల ద్వారా ఎంపిక చేశారు. మొత్తం మీద దీంట్లో తొమ్మిది మంది మాత్రమే మహిళలు. దీంట్లో 69% సీట్లతో భారత జాతీయ కాంగ్రెస్ అతి పెద్ద పార్టీ కాగా ఆ తరువాత స్థానంలో ముస్లింలకు కేటాయించిన స్థానాల్లో అధిక శాతాన్ని గెలుచుకున్న ముస్లిం లీగు ఉంది. మొదట్లో బ్రిటిష్ ఇండియాకి చెందిన అన్ని ప్రాంతాల సభ్యులు దీంట్లో ఉన్నారు. అయితే 1947 ఆగస్టు 14న పాకిస్తాన్, భారతదేశంగా దేశ విభజన జరగటంతో పాకిస్తాన్‌కి చెందిన సభ్యులు పాకిస్తాన్ రాజ్యాంగ సభగా ఏర్పడ్డారు.



చిత్రం 17.1

రాజ్యాంగ సభను వయోజనులందరికీ కల్పించిన సార్వత్రిక వయోజన ఓటు హక్కు ద్వారా ఎన్నుకోలేదని మీరు చూశారు. దీనికి ఎన్నికలు పరోక్షంగా జరిగాయి, అంటే భారత సమాజంలోని అన్ని వర్గాలకు ఇది ప్రాతినిథ్యం వహించటం లేదు. అప్పట్లో జనాభాలో 10 శాతం ప్రజలకే రాష్ట్ర శాసన సభలకు ఓటు వేసే హక్కు ఉంది. అంతేకాదు, సంస్థానాల ప్రతినిధులకు ఎన్నికలు జరగనేలేదు, సంబంధిత సంస్థానాలతో చర్చల ద్వారా వీళ్లను ఎంపిక చేశారు. స్వాతంత్ర్యం పొందనున్న నేపథ్యంలో తీవ్ర రాజకీయ కార్యకలాపాలు, ప్రజల మధ్య పెరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతదేశంలో విలీనం కావాలని సంస్థానాలు ఇంకా నిర్ణయించుకోలేదు, స్వతంత్ర రాజ్యాలుగా కొనసాగుతామన్న ఆశ వాళ్లల్లో చాలా మందికి ఉండేది. అందుకే వాటి ప్రతినిధులను రాజ్యాంగ సభలో చేరమని అడిగారు. మొదట్లో ముస్లిం లీగుకి చెందిన సభ్యులు సమావేశాలకు హాజరు కాలేదు, అయితే ఆ తరువాత హాజరు కాసాగారు.



*చిత్రం 17.2 : ఈ చిత్రంలో చూపించిన సమానత, న్యాయం అన్న భావనను చర్చించండి*

రాజ్యాంగ సభ అందరికీ ప్రాతినిధ్యం వహించనప్పటికీ అన్ని రకాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోటానికి ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఉత్తరాలు, వార్తాపత్రికలలో వ్యాసాలు, ఇతర మార్గాల ద్వారా అన్ని రకాల ప్రజలు తమ భావాలను తెలియచేసేలా తన పనికి విస్తృత ప్రచారాన్ని కల్పించింది. 1946 డిసెంబరు 13న రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ ఈ ముఖ్యమైన ప్రకటన చేశాడు:



చిత్రం 17.3

"... భారతదేశానికి మనం కోరుకుంటున్న భవిష్యత్తు ఒక బృందానికో లేక ఒక వర్గానికో, లేదా ఒక రాష్ట్రానికో పరిమితమైనది కాదు. ఇది దేశ 40 కోట్ల జనాభాకు సంబంధించినది.... ఇక్కడ లేనివాళ్లను గుర్తు చేసుకోవటం మన విధి, ఇక్కడ ఒక పార్టీ కోసమో, లేక ఒక బృందం కోసమో పని చెయ్యటానికి లేము; దేశం మొత్తం కోసం మనం ఆలోచన చెయ్యాలి, భారతదేశ 40 కోట్ల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ... మన స్వార్థాల నుంచి, పార్టీ వివాదాల నుంచి సాధ్యమైనంత వరకు బయటపడి మన ముందున్న పెద్ద సమస్య గురించి అత్యంత విస్తృత, సహనశీల ప్రభావవంత పద్ధతిలో ఆలోచించి మనం రూపొందించేది దేశమంతటికీ అర్థమైనదిగా ఉండాలి. ఈ అత్యంత బాధ్యతాయుత కార్యక్రమంలో ప్రవర్తించవలసిన విధంగా మనం ప్రవర్తించామని ప్రపంచం గుర్తించేలా ఉండాలి."

డా॥ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో ఒక 'ముసాయిదా సంఘం' ఏర్పడింది, అన్ని దృష్టికోణాలను పరిగణనలోకి తీసుకుని అంతిమ ముసాయిదాను రూపొందించే బాధ్యత ఈ సంఘానికి అప్పగించారు. రాజ్యాంగానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సభలో సుదీర్ఘంగా చర్చించి వాటికి విస్తృత దిశా నిర్దేశం చేశారు. చర్చించి, ఆమోదించే నిమిత్తం అంతిమ ముసాయిదాను రాజ్యాంగ సభ ముందు ఉంచారు. అంతిమంగా ఈ సభ 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది, ఇది 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. భారతదేశ రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలు ఎలా రూపొందాయో తెలుసుకోటానికి రాజ్యాంగ సభలోని కొన్ని ముఖ్యమైన చర్చలను ఇప్పుడు చూద్దాం.

- "భారతదేశ ప్రజలమైన మేము ..." అన్న పదాలతో భారతదేశ రాజ్యాంగం మొదలవుతుంది. భారతదేశ ప్రజలందరికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకోవటం సమర్థనీయమేనా?
- దేశం మొత్తానికి రాజ్యాంగాన్ని రూపొందించటంలో భారతదేశ ప్రజలందరూ పాల్గొనగలరా? ఈ ప్రక్రియలో క్రియాశీలంగా పాల్గొనాల్సిన అవసరం ప్రజలందరికీ ఉందా లేక కొంతమంది విజ్ఞులకు ఈ బాధ్యత అప్పగిస్తే సరిపోయేదా?
- పాఠశాల మొత్తానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చెయ్యాల్సి ఉంటే ఎవరెవరు అందులో భాగస్వాములు కావాలి, ఎలా భాగస్వాములు కావాలి?

## రాజ్యాంగ సభ చర్చలను చదవటం

1948లో రాజ్యాంగ సభ ముందు బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదాను ఉంచాడు. అతడి ఉపన్యాసంలోని కొంత భాగాన్ని ఇక్కడ ఇచ్చాం. "భారతదేశ రాజ్యాంగ సభ ప్రొసీడింగ్స్" అన్న దాంట్లో ఇది నమోదు అయ్యి ఉంది. ఉపన్యాసాన్ని క్లుప్తీకరించిన చోట... చుక్కలతో సూచించబడి ఉంది.

డా॥ అంబేద్కర్ ముసాయిదా ప్రతిని తయారుచేసే ప్రక్రియను వివరించటంతో మొదలుపెట్టాడు. సార్వత్రిక వయోజన ఓటు హక్కుతో రాజ్యాంగ సభ ఎన్నుకోబడలేదు కాబట్టి సాధారణ ప్రజలు, సభ్యులలో అత్యధిక శాతం ఇందులో పాల్గొనేలా తీసుకున్న చర్యలను గమనించండి.

1948 నవంబరు 4, గురువారం ముసాయిదా రాజ్యాంగం

గౌరవనీయ డా॥ బి.ఆర్. అంబేద్కర్.... అధ్యక్షా, ముసాయిదా సంఘం తయారుచేసిన ముసాయిదా రాజ్యాంగాన్ని మీ ముందు ఉంచి దీనిని పరిగణనలోకి తీసుకోవలసిందిగా ప్రతిపాదిస్తున్నాను.

రాజ్యాంగ సభ తీసుకున్న వివిధ నిర్ణయాలకు అనుగుణంగా, కేంద్ర అధికారాల సంఘం, కేంద్ర రాజ్యాంగ సంఘం, రాష్ట్రాల రాజ్యాంగ సంఘం, ప్రాథమిక హక్కులు, అల్పసంఖ్యాక వర్గాలు, గిరిజన ప్రాంతాలు వంటి వాటిపై రాజ్యాంగ సభ ఏర్పాటు చేసిన సలహా సంఘాల నివేదికల ఆధారంగా రాజ్యాంగాన్ని తయారుచేసే బాధ్యతను రాజ్యాంగ కమిటీకి అప్పగించారు. కొన్ని విషయాల్లో భారత ప్రభుత్వ చట్టం, 1935లోని అంశాలను అనుసరించాలని కూడా రాజ్యాంగ సభ నిర్దేశించింది. ... తనకి ఇచ్చిన ఆదేశాలను ముసాయిదా సంఘం నిజాయితీతో పాటించిందన్న విషయాన్ని మీరు గమనిస్తారని ఆశిస్తాను.

ముసాయిదా రాజ్యాంగం ... చాలా పెద్ద పత్రం. దీంట్లో 315 అధికరణాలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. ముసాయిదా రాజ్యాంగం అంత పెద్ద రాజ్యాంగం ఉన్న దేశం మరొకటి లేదని ఒప్పుకోవాలి.

- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సుమారు ................ రోజులకు ముసాయిదా సంఘాన్ని ఏర్పాటు చేశారు.
- రాజ్యాంగ సభ ముందుగా..................................., ......................, .................వంటి ముఖ్యాంశాలపై ప్రత్యేకసంఘాలను నియమించింది.
- ఈ కమిటీల నివేదికలను డా॥ అంబేద్కర్ అధ్యక్షతన ఉన్న ..................... చర్చించి, కీలకమైన నిర్ణయాలను తీసుకుంది.
- డా॥ అంబేద్కర్ అధ్యక్షతన .................. కమిటీ తీసుకున్న నిర్ణయాలను ముసాయిదా రాజ్యాంగంలో చేర్చడం జరిగింది.
- బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ..................... అంశాలను కూడా ముసాయిదా తీసుకుంది.
- ఆ తరువాత విమర్శలకు, సూచనలకు దీనిని ..................... నెలల పాటు ప్రజల ముందు ఉంచారు.
- ముసాయిదా రాజ్యాంగంలో ..................... అధికరణలు, ..................... షెడ్యూళ్లు ఉన్నాయి.

ఈ ముసాయిదా రాజ్యాంగాన్ని ఎనిమిది నెలల పాటు ప్రజల ముందు ఉంచాం. దాంట్లోని అంశాల పట్ల తమ స్పందనలను తెలియచెయ్యడానికి మిత్రులకు, విమర్శకులకు, ప్రత్యర్థులకు తగినంత సమయం లభించింది.

రాజకీయ వ్యవస్థకి సంబంధించి ఇతర దేశాల అనుభవాలను మన రాజ్యాంగం ఎలా తీసుకుందో ఇప్పుడు చూద్దాం. ఈ ఉపన్యాసంలో ఛైర్‌పర్సన్ అయిన డా॥ అంబేద్కర్ ఇతర రాజ్యాంగాల నుంచి అరువు తీసుకున్న

ప్రక్రియను వివరిస్తున్నాడు. వీటిని చదువుతున్న క్రమంలో ముసాయిదాలో పార్లమెంటరీ ప్రభుత్వానికి ఇచ్చిన వ్యవస్థాగత నిర్మాణాన్ని గుర్తించండి. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన ఒక సంవత్సరానికి ఈ ఉపన్యాసం ఇచ్చారన్నది గుర్తుంచుకోండి.



చిత్రం 17.4 :
డా॥ బి.ఆర్. అంబేద్కర్

## పార్లమెంటరీ వ్యవస్థ

"రాజ్యాంగాన్ని చేతిలో పెడితే చట్టానికి సంబంధించిన ఏ విద్యార్థి అయినా సరే రెండు ప్రశ్నలు వేస్తారు. మొదటిది, ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ రూపం ఏమిటి? రెండవది, రాజ్యాంగ రూపం ఏమిటి? ...నేను మొదటి ప్రశ్నతో మొదలుపెడతాను.

రాజ్యాంగ ముసాయిదాలో భారత సమాఖ్య అధిపతిగా అధ్యక్షుడు ఉంటారు. ఈ పేరు అమెరికా అధ్యక్షుడిని గుర్తుకు తెస్తుంది. అయితే పేర్లకు మించి అమెరికాలోని ప్రభుత్వానికి ముసాయిదా రాజ్యాంగం ప్రతిపాదిస్తున్న ప్రభుత్వానికీ ఏమాత్రమూ పోలిక లేదు. అమెరికా ప్రభుత్వాన్ని అధ్యక్ష వ్యవస్థ ప్రభుత్వం అంటారు. ముసాయిదా రాజ్యాంగం పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ప్రతిపాదిస్తోంది. ఈ రెండింటికీ మౌలిక తేడాలు ఉన్నాయి.

అమెరికాలోని అధ్యక్ష వ్యవస్థ ప్రభుత్వంలో కార్యనిర్వాహక వర్గానికి అధిపతిగా అధ్యక్షుడు ఉంటాడు. పరిపాలన బాధ్యత అతడి కింద ఉంటుంది. ముసాయిదా రాజ్యాంగంలోని అధ్యక్షుడు బ్రిటిష్ రాజ్యాంగంలోని రాజు స్థానంలో ఉంటాడు. అతడు రాజ్యానికి అధిపతి కానీ కార్యనిర్వాహక వర్గానికి కాదు. అతడు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు కానీ దేశాన్ని పాలించడు. అతడు దేశానికి ప్రతీక. పరిపాలనలో అతడి స్థానం అలంకారప్రాయం, అతడి ముద్ర ద్వారా దేశ నిర్ణయాలను తెలియచేస్తారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుని కింద వివిధ శాఖలకు బాధ్యత వహిస్తూ సెక్రటరీలు ఉంటారు. అదేవిధంగా భారత సమాఖ్య అధ్యక్షుని కింద పరిపాలనలో వివిధ శాఖలకు బాధ్యత వహిస్తూ మంత్రులు ఉంటారు. ఇక్కడ కూడా ఈ రెండింటికీ మధ్య మౌలికమైన తేడా ఉంది. తన సెక్రటరీలు ఇచ్చే సలహాకు అమెరికా అధ్యక్షుడు కట్టుబడి ఉండాలని లేదు. కానీ, భారత సమాఖ్య అధ్యక్షుడు సాధారణంగా తన మంత్రుల సలహాలకు కట్టుబడి ఉంటాడు. వాళ్ల సలహాలకు విరుద్ధంగా అతడు ఏమీ చేయలేడు, అదే విధంగా వాళ్ల సలహా లేకుండా కూడా ఏమీ చేయలేడు. అమెరికా అధ్యక్షుడు ఏ సెక్రటరీనైనా, ఎప్పుడైనా తొలగించవచ్చు. పార్లమెంటులో మెజారిటీ మద్దతు ఉన్నంత వరకు భారత సమాఖ్య అధ్యక్షుడికి మంత్రులను తొలగించే అధికారం లేదు...."

- భారత అధ్యక్షునికి ఇచ్చిన అధికారాలు ----------- కి చెందిన ------------- కంటే --------- కి చెందిన ---------------- అధికారాలకు దగ్గరగా ఉన్నాయి.
- భారత అధ్యక్షుడు -------------- సలహాలను పాటించేలా రాజ్యాంగ సభ రూపొందించింది.
- బ్రిటన్ రాజు, భారత అధ్యక్షుడి స్థానాలలో తేడా ఏమిటి?

## సమాఖ్య వ్యవస్థ

"చరిత్రలో ముఖ్యంగా రెండు రకాల రాజ్యాంగ రూపాలు ఉన్నాయి – ఒకదానిని ఏకీకృత విధానమని, రెండవదానిని సమాఖ్య విధానమని అంటారు. ఏకీకృత రాజ్యాంగంలోని రెండు ముఖ్యమైన అంశాలు: (1) కేంద్ర రాజ్యతంత్రం (రాజ్యతంత్రం అంటే ప్రభుత్వ విధానం లేదా రాజకీయ నిర్మాణం) యొక్క సర్వాధికృత, (2) ఉప సర్వసత్తాక రాజ్యతంత్రాలు లేకపోవటం. ఇందుకు విరుద్ధంగా సమాఖ్య విధాన రాజ్యాంగంలో: (1) కేంద్ర రాజ్యతంత్రంతో పాటు ఉప రాజ్యతంత్రాలు కూడా ఉండటం; (2) వాటికి కేటాయించిన రంగాలలో ఈ రెండూ సర్వసత్తాకత కలిగి ఉండటం. ఇంకో మాటల్లో చెప్పాలంటే సమాఖ్య వ్యవస్థ అంటే ద్వంద్వ రాజ్యతంత్రాన్ని ఏర్పాటు చెయ్యటం (కేంద్ర, రాష్ట్రాలతో కూడిన ద్వంద్వ ప్రభుత్వాల విధానం). ముసాయిదా రాజ్యాంగాన్ని సమాఖ్య విధాన రాజ్యాంగంగా పేర్కొనవచ్చు, ఇది ద్వంద్వ రాజ్యతంత్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రతిపాదిత రాజ్యాంగంలోని ద్వంద్వ రాజ్యతంత్రం కింద కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం, వాటి పరిధుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఉంటాయి. రాజ్యాంగం వీటికి కేటాయించే రంగాలలో అవి సర్వసత్తాక అధికారాలను కలిగి ఉంటాయి.

"ఈ ద్వంద్వ రాజ్యతంత్ర విధానం, అమెరికా రాజ్యాంగాన్ని పోలి ఉంటుంది. అమెరికా రాజ్యతంత్రం కూడా ద్వంద్వ రాజ్యతంత్రమే, వీటిల్లో ఒకదానిని ఫెడరల్ ప్రభుత్వం అని, రెండవ దానిని రాష్ట్ర ప్రభుత్వం అనీ అంటారు. ముసాయిదా రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాదిరి అన్నమాట. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఫెడరల్ ప్రభుత్వం కేవలం రాష్ట్రాల కూటమి కాదు, అలాగే రాష్ట్రాల పాలనా అంగాలు ఫెడరల్ ప్రభుత్వ శాఖలు కావు. ఇదేవిధంగా ముసాయిదా రాజ్యాంగంలో ప్రతిపాదించిన భారతదేశ రాజ్యాంగం కేవలం రాష్ట్రాల కూటమికాదు, రాష్ట్ర పాలనా విభాగాలు కేంద్ర ప్రభుత్వ శాఖలు కావు. భారతదేశ, అమెరికా రాజ్యాంగాల మధ్య పోలిక ఇక్కడితో అంతం అవుతుంది. ఈ రెండింటికీ మధ్య పోలికల కంటే తేడాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి....

"ప్రతిపాదిత భారత రాజ్యాంగం ఒకే పౌరసత్వంతో ఉండే ద్వంద్వ రాజ్యతంత్రం. మొత్తం భారతదేశానికి ఒకే పౌరసత్వం ఉంటుంది. రాష్ట్రాల పౌరసత్వం ఉండదు. ప్రతి భారతీయుడు ఏ రాష్ట్రంలో ఉంటున్నప్పటికీ ఒకేరకమైన పౌరసత్వ హక్కులు కలిగి ఉంటాడు.

"భారత సమాఖ్య వ్యవస్థలో ఉన్న మరొక ప్రత్యేక అంశం ఇతర సమాఖ్య వ్యవస్థలకు భిన్నంగా నిలుపుతుంది. అధికార పంపిణీతో, ప్రత్యేక శాసన, కార్యనిర్వాహక, న్యాయ అధికారాలతో ఉండే ద్వంద్వ రాజ్యతంత్రాలతో

- సమాఖ్య రాజ్యతంత్రంలో ఒకటికంటే ఎక్కువ ప్రభుత్వాలు ఉంటాయి, భారతదేశ విషయంలో అవి ----------, ---------------- స్థాయిలలో ఉన్నాయి. మీరు ----------- రాష్ట్రానికి, ------------ దేశానికి చెందుతారు.
- ఏ రకమైన రాజ్యాంగం కింద కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉంటాయి?
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఖచ్చితమైన అధికారాలను ఏ రకమైన రాజ్యాంగం ఇస్తుంది?
- భారతదేశ రాష్ట్రాలు ఏ విధంగా "కేంద్ర ప్రభుత్వ పాలనా అంగాల శాఖలు కావు"?
- భారత రాజ్యాంగ రూపకర్తలు ద్వంద్వ పౌరసత్వ (దేశ, రాష్ట్ర) విధానాన్ని ఎందుకు తిరస్కరించారు?

కూడిన సమాఖ్య వ్యవస్థలో భిన్న చట్టాలు, పరిపాలన, న్యాయ రక్షణ ఏర్పడటం అనివార్యమవుతుంది. కొంతమేరకు ఈ వైవిధ్యతను పట్టించుకోనవసరం లేదు. స్థానిక అవసరాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ అధికారాలను మార్చుకునే ప్రయత్నంగా దీనిని స్వాగతించవచ్చు. అయితే ఒక స్థాయిని దాటి ఈ వైవిధ్యత ఉంటే అది గందరగోళాన్ని సృష్టిస్తుంది, అలా అనేక సమాఖ్య దేశాలలో గందరగోళాన్ని సృష్టించింది! వివాహానికి, విడాకులకు, ఆస్తుల వారసత్వానికి, కుటుంబ సంబంధాలకు, ఒప్పందాలకు, నేరాలకు, తూనికలు, కొలతలకు, బిల్లులు, చెక్కులకు, బ్యాంకింగు, వాణిజ్యానికి, న్యాయం పొందే విధానాలకు, పరిపాలనకు సంబంధించిన ప్రామాణికాలు, పద్ధతులకు – సమాఖ్యలో ఇరవై రాష్ట్రాలు ఉన్నాయనుకుంటే – ఇరవై రకాల చట్టాలుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఇటువంటి వ్యవహారం రాష్ట్రాలను బలహీనపరచటమే కాకుండా ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లే పౌరులను సహించదు, ఆ పౌరులు ఒక రాష్ట్రంలో చట్టబద్ధమైనది మరొక రాష్ట్రంలో కాదని తెలుసుకుంటారు. భారతదేశం సమాఖ్య వ్యవస్థగా ఉండి, అదే సమయంలో భారతదేశ ఐక్యతను కాపాడటానికి అవసరమైన అన్ని మౌలిక అంశాలలో సారూప్యతను కలిగి ఉండేలా విధానాలను, పద్ధతులను రూపొందించటానికి ముసాయిదా రాజ్యాంగం ప్రయత్నించింది. ఇందుకు ముసాయిదా రాజ్యాంగం మూడు విధానాలను అవలంబించింది:

(1) ఒకే న్యాయ వ్యవస్థ,

(2) పౌర, నేర అంశాలలోని మౌలిక చట్టాలలో సారూప్యత,

(3) ముఖ్యమైన పదవులలో నియమించటానికి దేశమంతటికీ అఖిల భారత సివిల్ సర్వీస్.

"సమాఖ్య వ్యవస్థలోని ద్వంద్వ రాజ్యతంత్రంతో ద్వంద్వ న్యాయ వ్యవస్థ, ద్వంద్వ న్యాయ సూత్రాలు, ద్వంద్వ సివిల్ సర్వీసులు అనివార్య పరిణామంగా ఉంటాయి. అమెరికాలో సమాఖ్య న్యాయ వ్యవస్థ, రాష్ట్ర న్యాయ వ్యవస్థ రెండూ వేరు; వేటికవి స్వతంత్రమైనవి. భారత సమాఖ్యలో ద్వంద్వ రాజ్యతంత్రాలు ఉన్నప్పటికీ, ద్వంద్వ న్యాయ వ్యవస్థలు లేనేలేవు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఒకే సమగ్ర న్యాయ వ్యవస్థలో భాగం; రాజ్యాంగ చట్టం, పౌర చట్టం, నేర చట్టాల కింద అన్ని విషయాలలో వీటి పరిధి ఉండి, న్యాయం చేకూర్చవచ్చు. న్యాయం చేకూర్చే విధానంలో వైవిధ్యత లేకుండా చెయ్యటానికి ఇలా చేశారు. దీనికి కెనడా దేశం ఒక్కటే చాలా వరకు సమీప పోలిక కలిగి ఉంది. ఆస్ట్రేలియా యొక్క విధానం, ఇదీ ఒకటే అనిపిస్తాయి కానీ ఒకటి కావు. (వివరణ: కొన్ని సమాఖ్య దేశాలలో రాష్ట్రాలకు సంబంధించిన చట్టాలలో రాష్ట్ర కోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు మార్చలేదు. కానీ భారతదేశంలో కింది కోర్టు ఏదైనా ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి తీర్పు చెప్పవచ్చు.)

"పౌర, వ్యాపార జీవితాలకు మూలాధారంగా ఉన్న చట్టాలలో వైవిధ్యత లేకుండా చెయ్యటానికి జాగ్రత్త వహించాం. పౌర విచారణ స్మృతి, శిక్షాస్మృతి వంటి పౌర, నేర చట్టాల స్మృతులు, సాక్ష్యాల చట్టం, ఆస్తి బదిలీ చట్టం, వివాహ, విడాకులు, వారసత్వానికి సంబంధించిన చట్టాలు ఉభయ జాబితాలో (లేదా కేంద్ర జాబితాలో) చేర్చి సమాఖ్య వ్యవస్థ దెబ్బతినకుండా ఈ చట్టాలలో సారూప్యతను కాపాడారు.



*చిత్రం 17.5 : 1950ల నాటి గణతంత్ర దినోత్సవ కవాతు, ఆకాశంనుంచి తీసిన చిత్రం*

(వివరణ: చట్టాలు చేసే అంశాలను కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉభయ జాబితాగా విభజించారు. కేంద్ర జాబితాలోని అంశాలపై కేంద్రం మాత్రమే చట్టాలు చెయ్యగలదు, రాష్ట్ర జాబితాలోని అంశాలపై రాష్ట్రం మాత్రమే చట్టాలు చెయ్యగలదు. ఉభయ జాబితాలోని అంశాలపై రాష్ట్రాలు, కేంద్రం చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్రం చేసే చట్టానికి విరుద్ధంగా రాష్ట్రం చట్టం చేస్తే కేంద్రం చేసిన చట్టం మాత్రమే చెల్లుబాటవుతుంది.)

"సమాఖ్య వ్యవస్థలో భాగంగా ఉండే ద్వంద్వ రాజ్యతంత్రాలలో అన్ని దేశాలలో ద్వంద్వ సేవల విధానాన్ని అవలంబించారు. అన్ని సమాఖ్యలలో సమాఖ్య సివిల్ సర్వీసు, రాష్ట్ర సివిల్ సర్వీసు ఉన్నాయి. భారతదేశం ద్వంద్వ రాజ్యతంత్రం అయినప్పటికీ ఈ ఒక్క అంశం మినహాయించి ద్వంద్వ సేవలు ఉంటాయి. ప్రతి దేశంలోనూ పరిపాలనా ప్రామాణికాలను కాపాడే దృష్టికోణం నుంచి పరిపాలన వ్యవస్థలో కొన్ని కీలకమైన పదవులు ఉంటాయి. అతి పెద్ద, సంక్లిష్టమైన పరిపాలనా యంత్రాంగంలో ఇటువంటి పదవులను గుర్తించటం కష్టమే. అయితే, ఇటువంటి కీలక పదవులకు నియమించే వ్యక్తుల సామర్థ్యాన్ని బట్టి పరిపాలనా ప్రామాణికాలు ఆధారపడి ఉంటాయని చెప్పటంలో సందేహం లేదు. అయితే అదృష్టవశాత్తు దేశం మొత్తానికి ఒకే విధంగా ఉన్న గత పాలనా వ్యవస్థ నుంచి ఈ కీలకమైన పదవులు ఏవో మనకి తెలుసు. రాష్ట్రాలు తమకు ప్రత్యేక సివిల్ సర్వీసును ఏర్పరుచుకునే హక్కుకు భంగం కలిగించకుండానే భారతదేశమంతటా ఇటువంటి కీలక పదవులలో నియమింటానికి ఒకే అర్హత, ఒకే రకమైన వేతనంతో అఖిల భారత స్థాయిలో ఎంపిక అయ్యే అఖిల భారత సర్వీసు ఉంటుంది." [అంబేద్కర్ ఇక్కడ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఐఎఎస్, ఐపిఎస్) ఏర్పాటు గురించి ప్రస్తావిస్తున్నాడు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలోని ముఖ్యమైన పదవులకు దీని ద్వారా నియామకం జరుగుతుంది.]

- భారతీయ సమాఖ్య వ్యవస్థకూ, అమెరికా సమాఖ్య వ్యవస్థకూ మధ్యగల ముఖ్యమైన తేడాలను పేర్కొనండి.
- రాష్ట్రాలు తమ సొంత సివిల్ సర్వెంట్లను (అధికారులను) కలిగి ఉండే అధికారాన్ని భారత రాజ్యాంగం కల్పిస్తుందా?
- ఒక రాష్ట్రంలోని అధికారులందరూ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నుండి నియమింపబడిన వాళ్లేనా?
- అమెరికాలో కేంద్ర ప్రభుత్వ న్యాయ వ్యవస్థ, రాష్ట్ర న్యాయ వ్యవస్థ వేరువేరు. భారతదేశంలో కేంద్ర, రాష్ట్రాల న్యాయ వ్యవస్థలు సమగ్ర న్యాయ వ్యవస్థలో భాగం – వివరించండి?

## రాజ్యాంగ సభలోని చర్చలలో విమర్శలకు ఉదాహరణలు

ముసాయిదా రాజ్యాంగంపై అనేక విమర్శలు ఉన్నాయి – మౌలానా హస్రత్ మొహానీ వంటి వాళ్లు అది 1935 చట్టానికి నకలు మాత్రమేనని ఆరోపించారు. స్వాతంత్ర పోరాట సమయంలో భారతదేశానికి క్యాబినెట్ మిషన్ వచ్చినప్పుడు భారత జాతీయ కాంగ్రెస్ వంటి రాజకీయ బృందాలు వయోజనులందరికీ ఓటు హక్కును కోరుతూ 1935 చట్టాన్ని వ్యతిరేకించిన విషయాన్ని వాళ్లు గుర్తు చేశారు. దామోదర్ స్వరూప్ సేథ్ (డిఎస్ సేథ్) వంటి సోషలిస్టులు ఇటీవలి కాలంనాటి రాజ్యాంగాల నుంచి, ఉదా: సోవియట్ యూనియన్ నుంచి ముసాయిదా రాజ్యాంగం ఏమీ తీసుకోలేదని, భారతీయ నేపథ్యంలో కీలకమైన గ్రామాలను విస్మరించారని విమర్శించారు. రాజ్యాంగ సభ సభ్యులు వయోజన ఓటు హక్కు ద్వారా ఎన్నుకోబడలేదని కూడా వాదించారు. అతని విమర్శలు తెలుసుకుందాం.

డి ఎస్ సేథ్: "అయ్యా, మన భారత గణతంత్రం స్వయం ప్రతిపత్తిగల చిన్న చిన్న గణతంత్ర సమాఖ్యగా ఉండవలసింది. ... ఈ విధంగా మనదేశంలో ఏర్పడిన సమాఖ్యలో కేంద్రీకరణకు విజ్ఞుడైన డా॥ అంబేద్కర్ ఇచ్చినంత ప్రాముఖ్యత అవసరం అయ్యి ఉండేది కాదు. కేంద్రీకరణ మంచిదే, ఒక్కొక్కసారి ఉపయోగకరమే. కానీ మనం, మహాత్మాగాంధి తన జీవితకాలమంతా చెప్పినట్లుగా అధికారాన్ని మరీ కేంద్రీకరిస్తే అది మరీ నిరంకుశ అధికారంగా మారుతుందని, ఫాసిస్టు ఆదర్శాల వైపు తీసుకెళుతుందని మనం మరిచిపోతున్నాం. నిరంకుశత్వం, ఫాసిజం నుంచి రక్షణ పొందటానికి ఏకైక మార్గం అధికారాన్నీ సాధ్యమైనంతవరకు వికేంద్రీకరించటం. అప్పుడు మనం ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా హృదయాల కలయికతో అధికార కేంద్రీకరణను సాధించి ఉండేవాళ్లం. అయితే చట్టపరంగా అధికారాన్ని కేంద్రీకరిస్తే దాని సహజ పరిణామంగా మన దేశం ఇంతకాలం వ్యతిరేకించిన ఫాసిజంవైపుకి మరలడమే. ఈనాటికి కూడా దానిని బలంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పుకుంటూ మెల్లగా ఫాసిజంవైపుకే అడుగులు వేస్తాం..."

- సేథ్ అభిప్రాయాలు, ముసాయిదా రాజ్యాంగానికి మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
- రాజ్యాంగానికి 73వ సవరణ చేసిన తరువాత గ్రామాలకు ఎటువంటి స్వయం ప్రతిపత్తి కల్పించారో తెలుసుకోండి.

## ప్రాథమిక హక్కులపై చర్చలకు ఉదాహరణలు

సమానత్వ హక్కు నేపథ్యంలో 'అంటరానితనం' అన్న ఆచారానికి చట్ట పరంగా అంతం పలకాలని నిర్ణయించారు. ప్రాథమిక హక్కులపై చర్చలోని కొన్ని భాగాలను చదివి భిన్న దృష్టికోణాలను అర్థం చేసుకుందాం.

1947, ఏప్రిల్ 25, మంగళవారం

అధ్యక్షుడు (గౌరవనీయ డా॥ రాజేంద్ర ప్రసాద్) సమావేశంలో ఉన్నారు.

శ్రీ ప్రొమథ రంజన్ ఠాకూర్ : అయ్యా, ... 6వ క్లాజులో 'అంటరానితనం" గురించి ఇలా పేర్కొన్నారు:

"అంటరానితనాన్ని ఏ రూపంలోనైనా నిషేధిస్తున్నాం, దాని ఆధారంగా విధించే వివక్షత నేరం అవుతుంది."

కుల వ్యవస్థని నిషేధించకుండా అంటరానితనాన్ని ఎలా నిషేధిస్తారో నాకు అర్థం కావటంలేదు. అంటరానితనం అనేది కుల వ్యవస్థ అనే వ్యాధి యొక్క లక్షణం మాత్రమే. మనం కుల వ్యవస్థని సమూలంగా నిర్మూలిస్తే తప్ప అంటరానితనానికి పైపై చికిత్సలు చేసి ప్రయోజనం లేదు.

ఎస్.సి. బెనర్జీ: అధ్యక్షా, 'అంటరానితనం' అన్న పదానికి ముందు వివరణ ఇవ్వాలి. గత 25 సంవత్సరాలుగా ఈ పదాన్ని మనం ఉపయోగిస్తున్నాం, అయినా ఈనాటికీ అది ఏమి సూచిస్తోందో తెలియని తీవ్ర గందరగోళంలో ఉన్నాం. కొన్ని సందర్భాలలో ఒక గ్లాసు నీళ్లు తీసుకోవటం, కొన్నిసార్లు 'హరిజనులకు' ఆలయ ప్రవేశం కల్పించటం అన్న అర్థంలో వాడతారు, కొన్నిసార్లు అది అన్ని కులాలు కలిసి భోజనం చెయ్యటంగా పరిగణింపబడుతుంది, కొన్నిసార్లు కులాంతర వివాహంగా భావింపబడుతుంది. 'అంటరానితనం' గురించి ఎంతో కృషి చేసిన మహాత్మాగాంధీ దానిని వేరు వేరు విధాలుగా, వేరు వేరు సందర్భాలలో వేరు వేరు అర్థాలతో ఉపయోగించారు. కాబట్టి మనం 'అంటరానితనం' అన్న పదాన్ని ఉపయోగించినపుడు దాని అర్థం ఏమిటో మనందరికీ స్పష్టంగా ఉండాలి. ఈ పదం యొక్క పరిణామ ప్రభావం ఏమిటి?

అంటరానితనానికి, కుల వివక్షతకి మనం తేడా చూపకూడదు. శ్రీ ఠాకూర్ చెప్పినట్టు అంటరానితనం కేవలం లక్షణం మాత్రమే, దాని మూల కారణం కుల వివక్షత. మరి మూలకారణాన్ని, అంటే కుల వివక్షతను తొలగిస్తే తప్ప, అంటరానితనం ఏదో ఒక రూపంలో కొనసాగుతూ ఉంటుంది. స్వతంత్ర భారతదేశం ఏర్పడిన తరువాత అందరూ సమాన సామాజిక పరిస్థితులను అనుభవించాలని మనం కోరుకుంటాం.

శ్రీ రోహిణి కుమార్ చౌదరి.... అంటరానితనాన్ని నిర్వచించటానికి, స్పష్టంగా ఇలా పేర్కొనాలి: మతం, కులం, లేదా చట్టబద్ధ జీవనోపాధి ఆధారంగా వివక్షత చూపే ఏ చర్యనైనా 'అంటరానితనం' అంటారు....

శ్రీ కె.ఎం. మున్షి: అయ్యా, ఈ సవరణను నేను వ్యతిరేకిస్తున్నాను. ఈ నిర్వచనాన్ని ఆమోదిస్తే పుట్టిన ఊరు, కులం, లేదా లింగం ఆధారంగా చూపే వివక్షత కూడా 'అంటరానితనం'గా పరిగణింపబడుతుంది.



LATE CITY EDITION

# The Statesman

Incorporating and directly descended from THE FRIEND OF INDIA —Founded 1817

PUBLISHED SIMULTANEOUSLY FROM CALCUTTA AND DELHI

REG. No. C193 — CALCUTTA, THURSDAY, JANUARY 26, 1950 — Price, including 28 Page Supplement, TWO ANNAS.

# INDIA EMERGES AS REPUBLIC TODAY

## Of Significance To People, Says Nehru

### CALL FOR UNITY AND TOLERANCE

### Offer Of Friendship To All Nations

NEW DELHI, JAN 26.—INDIA EMERGES TODAY AS A "SOVEREIGN DEMOCRATIC REPUBLIC" UNDER THE NEW CONSTITUTION.

THE proclamation of India as a Republic will take place at a ceremony at 10-15 a.m. in the Durbar Hall of Government House.

"Undoubtedly, Jan 26, 1950, is a day of high significance for India and the Indian people," declared Pandit Nehru, Prime Minister, in a broadcast to the people last night.

Calling upon them "to found our republican freedom on the basic factors on which Gandhiji laid stress throughout his career—high character, integrity of mind and purpose, a spirit of tolerance and co-operation and hard work—Pandit Nehru asked them to "shed fear and hatred and think always of the betterment of the millions of our people."

Dr Soekarno, President of the United States of Indonesia, was received by Pandit Nehru and Mr Rajagopalachari when he arrived at the Willingdon aerodrome, New Delhi, on Tuesday to take part in the Indian Republic Day celebrations.—Statesman.

## SOEKARNO ADDRESSES INDIAN M.P.s

### CONGRATULATIONS ON BIRTH OF NEW REPUBLIC

NEW DELHI, Jan 25.—The President of the Republic of Indonesia, Dr Soekarno, addressing the members of the Indian Parliament this evening, conveyed his congratulations on India being declared a Republic.

### Communists Expel British Managers

Reported Incidents Near Tavoy

### BURMA OILFIELDS WORKERS' CLAIM

### Gunmen Kill Two Policemen

Incident In Howrah Village

TODAY'S PROGRAMME IN CALCUTTA

### Night Curfew In Bandoeng

### Proclamation As Republic

Ceremony This Morning

AT IRWIN STADIUM

### 2 Of Crew Killed In Plane Crash

On Way To Calcutta From Gauhati

REPUBLIC DAY HOLIDAY

The Offices of The Statesman will be closed today, and there will be no issue of the paper dated January 27.

Pandit Nehru signs the new Constitution, winding up the Constituent Assembly in New Delhi.—Statesman.

## PROVINCIAL BORDERS TO BE "RATIONALIZED"

NEW DELHI, Jan 25.—Completion of the "rationalization" of the borders of the provinces and States Unions by the transfer of over 1,600 enclaves on an agreed basis was announced today.

THE REPUBLIC OF INDIA

26th January 1950

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity; and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY DO HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

The preamble to the Constitution of the Republic of India.


BEACON STANDARD METAL WINDOWS AND FACTORY SASHES — MARTIN BURN LTD. CALCUTTA

ROYAL EXCHANGE ASSURANCE — FIRE, MARINE, ACCIDENT.

Hallmarks of quality

"REXINE" • "VYNIDE"

Years of manufacturing experience and technical research have produced "Rexine" and "Vynide"—the twin I.C.I. products—world famous in the leathercloth trade. Ideal for car and furniture upholstery, desk-top covering, book-binding and all similar applications.

They are colour fast, hardwearing, vermin-proof water-proof and washable. The only maintenance they need is an occasional cleaning with soap and warm water.

PRODUCTS OF ICI — IMPERIAL CHEMICAL INDUSTRIES (INDIA) LTD.

Calcutta Bombay Madras Kanpur, New Delhi Cochin Bangalore


చిత్రం 17.6 : 1950, జనవరి 26 నాటి వార్తాపత్రిక. ఈ పేజీలో ఏ ఏ అంశాలు ఉన్నాయి?

- పై చర్చలో ఏ అభిప్రాయ భేదాలు వ్యక్తమయ్యాయి?
- ఈ చర్చలో పాల్గొనే అవకాశం మీకు లభిస్తే, మీరు ఏ పరిష్కారాన్ని సూచిస్తారు?
- ఈ పదాన్ని రాజ్యాంగంలో నిర్వచించకుండా పొందుపరచడం ఒక మంచి ఆలోచన అని మీరు భావిస్తున్నారా? మీ వాదనకు కారణాలను తెల్పండి.
- 'కేవలం అంటరానితనమే కాకుండా రాజ్యాంగం కులవ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలకు అంతం పలికుండాల్సింది' అనే విషయంతో మీరు ఏకీభవిస్తారా? ఇది ఏ విధంగా చేసి ఉండాల్సిందని మీరు అనుకుంటున్నారు?

శ్రీ ధీరేంద్రనాథ్ దత్త: అయ్యా, శ్రీ రోహిణి కుమార్ చౌదరి ఇచ్చిన నిర్వచనం అంగీకరిస్తారో, లేదో తెలియదుకానీ ఏదో ఒక నిర్వచనం ఉండాలని నా అభిప్రాయం. 'అంటరానితనం' ఏ రూపంలోనైనా నేరమేనని ఇక్కడ పేర్కొన్నారు. నేరాలను పరిశీలించే మెజిస్ట్రేటు లేదా న్యాయమూర్తి నిర్వచనంలోంచి చూడాల్సి వస్తే, ఒక మెజిస్ట్రేటు ఒక ప్రత్యేక విషయాన్ని అంటరానితనంగా భావిస్తే మరొక మెజిస్ట్రేటు ఇంకొక విషయాన్ని అంటరానితనంగా భావించవచ్చు. ఫలితంగా, ఈ నేరాలతో వ్యవహరించే మెజిస్ట్రేట్ల మధ్య సారూప్యత ఉండదు. కేసులలో తీర్పు ఇవ్వటం న్యాయమూర్తులకు చాలా కష్టంగా ఉంటుంది.

అంతేకాకుండా అంటరానితనమంటే వివిధ ప్రాంతాల్లో వేరువేరు అర్థాలు ఉన్నాయి. బెంగాల్‌లో అంటరానితనమంటే ఒక అర్థం ఉండగా మిగిలిన రాష్ట్రాలలో పూర్తిగా భిన్నమైన అర్థం ఉంటుంది.

అధ్యక్షా, ... న్యాయస్థానాలు సరైన శిక్ష విధించేలా 'అంటరానితనం' అన్న పదాన్ని కేంద్ర శాసన సభ నిర్వచిస్తుందని ఆశిస్తున్నాను.

అంతిమంగా రాజ్యాంగంలో అంటరానితనానికి నిర్వచనం ఇవ్వగూడదని, భవిష్యత్తులో అవసరమైన చట్టాలను చేసే బాధ్యతను శాసన సభకు వదిలివెయ్యాలని నిర్ణయించారు.

## రాజ్యాంగం–సామాజిక నిర్మాణం (Constitution and Social Engineering)

భారత రాజ్యాంగ నిర్మాతలు భారతీయ సమాజం అసమానతలు, అన్యాయం, లేమి వంటి సమస్యలను ఎదుర్కొంటోందని, ఆర్థిక దోపిడీకి పాల్పడిన వలస పాలకుల విధానాలకు బలి అయ్యిందనీ గుర్తించారు. కాబట్టి అభివృద్ధితోపాటు సామాజిక మార్పుకి కూడా రాజ్యాంగం దోహదం చెయ్యాలని గుర్తించారు. "గత రాజకీయ, సామాజిక నిర్మాణాన్ని తిరస్కరించి ముందుకు కదులుతూ తనకు తాను కొత్త వస్త్రాలను రూపొందించుకుంటున్న దేశానికి" రాజ్యాంగ సభ ప్రాతినిధ్యం వహిస్తున్నట్టుగా జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నాడు.

కాబట్టి సామాజిక మార్పునకు దోహదం చేసే అనేక అంశాలు రాజ్యాంగంలో ఉన్నాయి. అంటరానితనాన్ని నిషేధించటం గురించి మీరు చదివారు. దీనికి ఒక మంచి ఉదాహరణ రాజ్యాంగంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వేషన్లను కల్పించటం. ఈ వర్గాలు తరతరాలుగా ఎదుర్కొన్న అన్యాయాలను అధిగమించటానికి, వారి యొక్క ఓటు హక్కుకు సరైన అర్థాన్ని ఇవ్వడానికి కేవలం సమానత్వపు హక్కు ఇస్తే సరిపోదని రాజ్యాంగ నిర్మాతలు విశ్వసించారు. వాళ్ల ప్రయోజనాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాజ్యాంగ చర్యలు అవసరం. అందుకనే షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలను కాపాడటానికి శాసనసభా స్థానాల రిజర్వేషన్ వంటి అనేక ప్రత్యేక అంశాలను రాజ్యాంగ నిర్మాతలు కల్పించారు. ఈ వర్గాలకు ప్రభుత్వరంగ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు కూడా రాజ్యాంగం అవకాశం కల్పించింది.

రాజ్యాంగంలో 'ప్రభుత్వ విధానాలకు ఆదేశిక సూత్రాలు' ఉన్నాయి. ఇవి ప్రభుత్వం ముందు ప్రధాన సామాజిక వ్యవస్థలను ఉంచాయి. సామాజిక ఇంజనీరింగ్ సాధనలో ఒక ముఖ్యమైన అంశం అల్పసంఖ్యాక వర్గాల హక్కులు. నాజీ జర్మనీలో అల్పసంఖ్యాక యూదులను అణిచివేసిన విషాద అనుభవం రాజ్యాంగ నిర్మాతలను ఆలోచింపచేసింది. అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించి అధిక సంఖ్యాకులు తమను అంచుకు నెట్టేశారన్న భావన కలగకుండా చెయ్యాలని వాళ్లు నిర్ణయించారు. మతపర అల్పసంఖ్యాక వర్గాలు తమ సొంత విద్యా సంస్థలను నిర్వహించుకునే హక్కు కల్పించడం ఇందుకు ఒక ఉదాహరణ. ఇటువంటి సంస్థలకు ప్రభుత్వం నిధులు కూడా కేటాయించవచ్చు.

## ప్రస్తుత రాజ్యాంగం

చట్టాలను అప్పుడప్పుడు సవరించాల్సిన అవసరం ఏర్పడుతుందని రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు. కాబట్టి చట్టాలను, రాజ్యాంగంలోని అధికరణాలను సవరించటానికి కూడా అది అవకాశం కల్పించింది. శాసన సభలలో సగంకంటే ఎక్కువ మంది ఆమోదంతో తరచు చట్టాలు చెయ్యవచ్చు. అయితే రాజ్యాంగంలోని అధికరణాల సవరణను పార్లమెంటు మాత్రమే చేపట్టాలి. అంతేకాకుండా రాజ్యసభ, లోక్‌సభల రెండింటిలో మూడింట రెండు వంతుల సభ్యుల ఆమోదం అవసరం. కొన్ని అధికరణాలను రాష్ట్ర శాసన సభలు అంగీకరించిన తరువాత (లేదా రాటిఫై చేసిన తరువాత) మాత్రమే సవరించవచ్చు. అంతేకాకుండా ఇతర చట్టాలలాగే కొత్త సవరణలను దేశ అధ్యక్షుడు కూడా ఆమోదించాల్సి ఉంది.




*రేఖాచిత్రం 1 : 1950, జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటినుంచి 2013 వరకు దాదాపు 99 సవరణలు చేశారు.*

రాజ్యాంగానికి ప్రధాన మార్పులు 1970లలో చేశారు. వీటిల్లో మొదటిది రాజ్యాంగ ప్రవేశికలో "లౌకిక", "సామ్యవాద" అన్న పదాలను చేర్చటం. ప్రవేశికలోని "సమానత్వం", "స్వేచ్ఛ", "న్యాయం" వంటి పదాలు లౌకికవాద, సామ్యవాద విలువలకు ప్రాధాన్యత నిచ్చాయి కాబట్టి ఈ పదాలను చేర్చారు. భారత రాజ్యాంగ చరిత్రలో రెండవ ముఖ్యమైన ఘట్టం కేశవానంద భారతి కేసుగా ప్రాచుర్యం పొందిన సుప్రీంకోర్టు తీర్పు. భారత రాజ్యాంగంలోని కొన్ని అంశాలను ఎట్టి పరిస్థితులలోనూ సవరించటానికి లేదని ఇందులో వాదించారు. వీటిల్లో ప్రాథమిక హక్కులు ఒకటి. సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసులో తీర్పును ఇస్తూ దేశ మనుగడ కొన్ని మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉంటుందని వాదించింది. ఏవి మౌలిక సూత్రాలు అన్న విషయంలో న్యాయమూర్తులలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఈ కిందివాటిపై ఏకీభావం కుదిరింది: ప్రభుత్వ నిర్మాణం, సమాఖ్య లక్షణం, ఉన్నతమైన రాజ్యాంగం, సర్వసత్తాక దేశం, న్యాయం, సంక్షేమ రాజ్యం వంటివి ఏర్పాటు చేయటం.

- భారత రాజ్యాంగంలోని మౌలిక అంశాలకు సంబంధించి మీరు గుర్తించిన ఉదాహరణలు, వివరణలు పేర్కొనండి.

## కీలక పదాలు

| | | |
|---|---|---|
| ముసాయిదా సంఘం | రాజ్యాంగ సభ | ప్రవేశిక |
| ఉభయ పద్దు | ఏకీకృత, సమాఖ్య సిద్ధాంతాలు | పౌరసత్వం |
| అధ్యక్ష, పార్లమెంటరీ తరహా వ్యవస్థ | | సవరణ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. విభిన్నంగా ఉన్నదానిని గుర్తించండి:
   - ★ స్వాతంత్ర్య పోరాట అనుభవాల నుంచి భారత రాజ్యాంగం ఏర్పడింది.
   - ★ అప్పటికే ఉన్న రాజ్యాంగాల నుంచి భారత రాజ్యాంగం రూపొందింది.
   - ★ ముసాయిదా రాజ్యాంగాన్ని ఉన్నది ఉన్నట్టుగా ఆమోదించారు.
   - ★ దేశాన్ని పాలించటానికి రాజ్యాంగ సూత్రాలను, అంశాలను పేర్కొంది.
2. తప్పు వాక్యాలను సరిదిద్దండి:
   - ★ రాజ్యాంగ సభ చర్చలలో కొన్ని అంశాలపై అందరూ ఒకటే భావాన్ని వ్యక్తం చేశారు.
   - ★ రాజ్యాంగ నిర్మాతలు దేశంలోని కొన్ని ప్రాంతాలకే ప్రాతినిధ్యం వహించారు.
   - ★ రాజ్యాంగంలోని అధికరణాలను సవరించటానికి అది అవకాశం కల్పించింది.
   - ★ రాజ్యాంగంలోని మౌలిక అంశాలను కూడా సవరించవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది.
3. రాజ్యాంగ సభ చర్చల నుంచి భారత ప్రభుత్వ ఏకీకృత, సమాఖ్య సూత్రాలను వివరించండి.
4. ఆనాటి రాజకీయ ఘటనలను రాజ్యాంగం ఎలా ప్రతిబింబిస్తోంది? స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి ఇంతకు ముందు అధ్యాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి.
5. రాజ్యాంగ సభను సార్వత్రిక వయోజన ఓటు హక్కుతో ఎన్నుకుని ఉంటే రాజ్యాంగాన్ని రూపొందించటంలో అది ఎటువంటి ప్రభావాన్ని చూపించి ఉండేది?
6. భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల గురించి చిన్న వ్యాసం రాయండి.
7. దేశంలోని రాజకీయ వ్యవస్థలను రాజ్యాంగం ఎలా నిర్వచించింది, వాటిని ఎలా మార్చింది?
8. రాజ్యాంగంలో, మౌలిక సూత్రాలు ఉంటాయి, అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినప్పుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి.

పాఠం 18

# స్వతంత్ర భారతదేశం
## (మొదటి ముప్పై సంవత్సరాలు - 1947-1977)

1950, జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవనంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో సమానత్వం ఉంటుంది, కానీ సామాజిక, ఆర్థిక అంశాల్లో అసమానత్వం ఉంటుంది. రాజకీయాలలో ఒక వ్యక్తి – ఒక ఓటు, ఒక ఓటు – ఒకే విలువ అన్న సూత్రాన్ని గుర్తించబోతున్నాం. అయితే సామాజిక, ఆర్థిక జీవితంలో మనకున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థ వల్ల ఒక వ్యక్తి– ఒక విలువ అన్న సూత్రాన్ని తిరస్కరిస్తూనే ఉంటాం. వైరుధ్యాలతో కూడిన ఈ జీవితాన్ని ఎంతకాలం భరిస్తూ వద్దాం? ఎంతకాలం మన సామాజిక, ఆర్థిక జీవితాలలో సమానత్వాన్ని సాధించకుండా ఉందాం? ఇలా ఎక్కువ కాలం కొనసాగనిస్తే మన రాజకీయ ప్రజాస్వామ్యమే ముప్పునకు లోనవుతుంది. ఈ వైరుధ్యాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి, లేకపోతే అసమానత్వంతో పీడింపబడుతున్న వాళ్లు ఈ రాజ్యాంగ సభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు.

– బి.ఆర్. అంబేద్కర్

ఇంతకు ముందు అధ్యాయంలో భారత రాజ్యాంగాన్ని ఎలా రూపొందించారో చూశాం. ఏక కాలంలో అనేక లక్ష్యాలను సాధించటానికి రాజ్యాంగం కృషి చేసింది: ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పటం, దేశాన్ని ఐక్యం చేసి ఒకే రాజకీయ విధానాన్ని రూపొందించటం, పెద్ద ఎత్తున సామాజిక, ఆర్థిక మార్పులను తీసుకురావటం. రెండు శతాబ్దాలపాటు విదేశీ శక్తులతో పాలింపబడిన ప్రజలకు తక్కువ కాలంలో జాతి లక్ష్యాలను రూపొందించి, వాటిని సాధించటానికి వ్యవస్థాగత విధానాలను ఏర్పరచటం చిన్న విషయం ఏమీకాదు.

భారతదేశ స్వాతంత్ర అనంతర చరిత్రలో తొలి సంవత్సరాలు నిర్ణయాత్మక పాత్రను పోషించాయనటంలో సందేహం లేదు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం, సామాజిక, ఆర్థిక మార్పులను తీసుకురావడం, ప్రజాస్వామిక వ్యవస్థ పనిచేసేలా చూడటం అన్నవి దేశ నాయకత్వం ముందున్న ప్రధాన సవాళ్లు. ఈ సమస్యలలో ఒకదానికొకటి సంబంధం ఉండి, సమతౌల్యం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చింది. ఉదాహరణకు ప్రజాస్వామ్యాన్ని పణంగా పెట్టి అభివృద్ధి లక్ష్యాలను, దేశ ఐక్యత, సమగ్రతలను సాధించటానికి లేదు. ఈ అధ్యాయంలో ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న ఈ మూడు అంశాలతో పాటు రాజ్యాంగమూ, ప్రజాస్వామ్యమూ ఎలా పనిచేశాయో, జాతి నిర్మాణంలో కీలకమైన అంశాలను భారతదేశం ఎలా ఎదురుకొందో చూద్దాం.

- సామాజిక సమానత్వాన్ని సాధించామని మీరు అనుకుంటున్నారా? సామాజిక సమానత్వాన్ని, అసమానత్వాన్ని సూచించే మీకు ఎదురైన ఉదాహరణలను పేర్కొనండి.

## మొదటి సార్వత్రిక ఎన్నికలు

కొత్త రాజ్యాంగం కింద నిర్వహించబోయే మొదటి సార్వత్రిక ఎన్నికలు భారతీయ ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైనవి. బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజాస్వామిక పంథాని అనుసరించటానికి భారతదేశం కట్టుబడి ఉండటాన్ని ఇవి సూచిస్తాయి. పాశ్చాత్య దేశాలలోలాగా ముందుగా ఆస్తి ఉన్న వాళ్లకి, తరువాత ఇతర సామాజిక వర్గాలకు ఓటు హక్కును దశల వారీగా విస్తరింపచెయ్యకుండా భారతదేశంలో వయోజనులందరికీ ఒకేసారి ఓటు హక్కు కల్పించారు. ఉదాహరణకు స్విట్జర్లాండ్‌లో మహిళలకు ఓటు హక్కు 1971లో గానీ లభించలేదు.



చిత్రం 18.1 : ముందుగా ఓటు వెయ్యటం

సామాజిక కోణాల కారణంగా కూడా మొదటి ఎన్నికలు కష్టమయ్యాయి. జనాభాలో అధిక భాగానికి చదవటం, రాయటం రాదు. వాళ్లు తమ ఎంపికను ఎలా తెలియచేస్తారు? దేశంలోని కొన్ని ప్రాంతాలలో మహిళలు వాళ్ల తండ్రి, లేదా భర్త ద్వారా గుర్తింపబడేవారు, వాళ్లకి వేరే ప్రత్యేక గుర్తింపు ఉండేది కాదు. మహిళలకు సమాన హక్కులు ఉండి దేశాన్ని మరింత సామాజిక సమానత్వంవైపు తీసుకెళ్లటానికి ఇది మారాల్సి ఉంది. ఓటర్ల జాబితా ఎలా తయారుచెయ్యాలి? దేశ వ్యాప్తంగా ఎన్నికలను నిర్వహించే బాధ్యతను చేపట్టటానికి ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు.

నిరక్షరాస్యతా సమస్యను అధిగమించటానికి ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలు, అభ్యర్థులను సూచించేలా రోజువారీ జీవితంనుంచి కొన్ని గుర్తులను ఉపయోగించటం అన్న వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చింది. ఈ సృజనాత్మక, వినూత్న ప్రయోగం కారణంగా సుదీర్ఘ వివరణల అవసరం లేకుండా బొమ్మను గుర్తిస్తే సరిపోయింది. ఇదే విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిని మరింత సులభతరం చేయడానికి మొదటి ఎన్నికలలో ప్రతి అభ్యర్థికి బయట వైపు వాళ్ల గుర్తు అంటించిన వేరువేరు బ్యాలెట్ పెట్టెలు కేటాయించారు. తాను ఎంచుకున్న అభ్యర్థి బ్యాలెట్ పెట్టెలో ఓటరు తన ఓటును వేస్తే సరిపోతుంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న క్రమంలో ఓటు వేసేలా ప్రజలను ప్రోత్సహించటానికి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

- ఎన్నికలను, ప్రత్యేకించి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవటాన్ని నిరక్షరాస్యత ఎలా ప్రభావితం చేసుంది? ఈ సమస్యను ఎలా పరిష్కరించవచ్చు?
- ప్రజలందరికీ ఓటు హక్కు లేకపోతే మనది ప్రజాస్వామిక దేశమని చెప్పుకోటానికి వీలు ఉండేదా?
- మహిళలలో అక్షరాస్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వాళ్లకు ఓటు హక్కు కల్పించకుండా ఉంటే అది మన విధానాలను ఎలా ప్రభావితం చేసి ఉండేది?
- క్రమం తప్పకుండా ఎన్నికలను నిర్వహించటం అన్నది ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పామనటానికి స్పష్టమైన సంకేతం. ఈ వ్యాఖ్యానంతో మీరు ఏకీభవిస్తారా? కారణాలను పేర్కొనండి.

**ఎన్నికల వివరాలు**

పరదా వ్యవస్థని ఖచ్చితంగా పాటించే జిల్లాలలో సాధారణంగా కేవలం మహిళా అధికారులతో ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అజ్మేర్‌లో ఒక రాజ్‌పుత్ మహిళ పూర్తిగా కప్పిన రథంలో పోలింగ్ కేంద్రానికి వచ్చింది. ఆమె శరీరమంతా వెల్వెట్ వస్త్రంలో చుట్టి ఉంది. మళ్లీ ఓటు వెయ్యకుండా చెరిగిపోని సిరా చుక్క వేయించుకోవడానికి చాచిన ఎడమ చూపుడువేలు తప్ప, ఆమె శరీరంలోని మరో భాగాన్ని కనిపించనీయలేదు.

కొన్ని గ్రామాలు మొత్తంగా కలిపి ఓటు వేశాయి. అసోం నుంచి వచ్చిన నివేదిక ప్రకారం ఒక గిరిజన గ్రామ ప్రజలు ఓటింగ్ జరగటానికి ఒక రోజు ముందే ప్రయాణం చేసి అక్కడికి చేరుకున్నారు. ఆ రాత్రి అంతా వాళ్లు పెద్ద మంటల చుట్టూతా పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ గడిపారు. సూర్యోదయం అయ్యేవరకు ఇలా గడిపారు. ఆ తరువాత పోలింగ్ కేంద్రాలకు ఒక వరసలో క్రమశిక్షణతో కవాతు చేస్తూ వెళ్లారు.

పెప్పు గ్రామ ప్రజలు ఎవరికి ఓటెయ్యాలో నిర్ణయించుకునే సమస్యకు పరిష్కారంగా ఆ అభ్యర్థుల యువ ప్రతినిధులకు కుస్తీ పోటీ పెట్టి అందులో గెలిచిన అభ్యర్థికి ఓటు వేస్తామన్న అంగీకారానికి వచ్చారు.

పోలింగ్ కేంద్రాలలో సమర్పించటానికి ఎన్నో వస్తువులను తీసుకువచ్చారు. బ్యాలెట్ పెట్టెలను తెరిచినప్పుడు తమ విశ్వాసాన్ని ప్రకటించే ఉత్తరాలు, ఒక్కొక్కసారి ఆహారం, బట్టలు ఇవ్వమని వేడుకునే విన్నపాలు కనిపించేవి.

(1958లో మార్గరెట్ డబ్ల్యు. ఫిషర్, జోన్ వి. బొండ్యురాంట్ రాసిన "ప్రజాస్వామిక ఎన్నికలలో భారతీయ అనుభవం" పుస్తకంలో నుంచి తీసుకున్న అంశాలు, ప్రచురణకర్త: ఇండియన్ ప్రెస్ డైజెస్ట్స్.)

## రాజకీయ వ్యవస్థలో ఏకపార్టీ ఆధిపత్యం

స్వతంత్ర భారతదేశంలో 1952, 1957, 1962లలో జరిగిన మొదటి మూడు సార్వత్రిక ఎన్నికలలో ఇతర అభ్యర్థులను నామమాత్ర స్థానాలకు పరిమితం చేస్తూ భారత జాతీయ కాంగ్రెస్ అఖండ విజయాలు సాధించింది. భారతదేశానికి జవహర్‌లాల్ నెహ్రూ మొదటి ప్రధానమంత్రి అయ్యాడు. ఇతర పార్టీలలో ఏ ఒక్కదానికి 11 శాతానికి మించి ఓట్లు రాలేదు. మొత్తం పోలయిన ఓట్లలో 45%తో కాంగ్రెస్ 70 శాతానికి పైగా స్థానాలను గెలుచుకుంది. ఇతర ఏ పార్టీ కూడా కాంగ్రెస్‌కి సమీపంలో లేదు.

కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాలలో కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో కొంతమంది పరిశీలకులు పేర్కొంటున్న కాంగ్రెస్ వ్యవస్థ ఏర్పడింది. దాదాపుగా అన్ని సందర్భాలలో పాలకపార్టీగా ఉన్న కాంగ్రెస్‌కి, ఇతర పార్టీలకు మధ్య ఉన్న సంబంధాల ప్రత్యేక స్వభావాన్ని బట్టి ఈ కాలాన్ని గుర్తిస్తారు. అయితే, కాంగ్రెస్‌లో ఎల్లప్పుడూ అంతర్గతంగా చిన్న చిన్న బృందాలు (Groups) ఉండేవి. ఈ బృందాలు నాయకుల మధ్య పోటీ కారణంగా ఏర్పడ్డాయి. పార్టీ లక్ష్యాలతో వీళ్లు ఏకీభవించినప్పటికీ కొన్ని విధానాల విషయంలో విబేధాలు ఉండేవి.

సభ్యుల ప్రయోజనాలను బట్టి ఈ బృందాలు వివిధ అంశాలపై వేరువేరుగా స్పందించేవి. దీని వల్ల కాంగ్రెస్ పార్టీ విభిన్న దృక్పథాలు, ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా కనిపించేది. కొన్ని సందర్భాలలో ఈ బృందాలు ఇతర రాజకీయ పార్టీలతో కలిసి నాయకత్వం మీద ఒత్తిడి తీసుకురావటానికి

*గ్రాఫ్ 1 : 1952, 1962 ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు గెలుచుకున్న స్థానాలు*




*రాజకీయ పార్టీల సూచిక (అయిదు కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నవి మాత్రమే)*




ప్రయత్నించేవి. ఇది పాలనాపక్షంలోపల తన విధానాలను సవరించుకునేందుకు కూడా దోహదం చేసేది. ఏకపార్టీ ఆధిపత్యంలో ఉన్న పరిస్థితిలో కూడా కాంగ్రెస్ పార్టీలోపలే రాజకీయ పోటీ ఉంటూ ఉండేది. కాబట్టి ప్రతిపక్ష పార్టీలు నిజమైన ప్రమాదాన్ని కాక అవ్యక్త ప్రమాదాన్ని మాత్రమే సూచించేవి.

కాబట్టి ఈ పరిస్థితి ఇతర రాజకీయ పార్టీలు లేని అప్రజాస్వామిక పరిస్థితి కాదు. ఇతర పార్టీలు పోటీ చేశాయి కానీ, కాంగ్రెస్‌ని సవాలుచేయగలిగే సంఖ్యలో స్థానాలను గెలుచుకోలేక పోయాయి. ఇతర రాజకీయ పార్టీలు క్రమేపీ బలం పుంజుకుని రెండు దశాబ్దాల కాలంలో అధికారానికి పోటీదారుగా ఎదిగాయి. ఈ కాలం ప్రధానంగా తొలి సంవత్సరాలలో ప్రజాస్వామ్యాన్ని సంరక్షించి స్వేచ్ఛాయుత, బహిరంగ పోటీపై ఆధారపడిన బహుళ పార్టీ వ్యవస్థ ఏర్పడటానికి దోహదం చేసింది.

రాజ్యాంగ చట్రం బలం కారణంగా, స్వాతంత్ర ఉద్యమం వేసిన ప్రజాస్వామిక పునాదుల కారణంగా భారతదేశ రాజకీయాలు బహుళపార్టీ ప్రజాస్వామ్యంగా ఎదగగలిగాయి. అధికారంలో ఉన్న పార్టీలు తరచు పక్షపాతంతో వ్యవహరించి, బహుళపార్టీ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోకుండా ప్రతిపక్షాలను అణిచి వేసేవి. అదే సమయంలో స్వాతంత్రం పొందిన ఇండోనేసియా, పాకిస్తాన్, చైనా, నైజీరియా వంటి వలసపాలిత దేశాల అనుభవం కంటే భారతదేశ అనుభవం ఎంతో భిన్నంగా ఉంది.

- రాజకీయ వ్యవస్థలో కాంగ్రెసు ఆధిపత్యానికి దోహదం చేసిన కారణాలను క్లుప్తంగా వివరించండి.

## రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ

కొత్తగా ఏర్పడిన దేశం ఎదుర్కొన్న మొదటి సవాళ్లలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను పునఃవ్యవస్థీకరించాలన్న కోరిక ఒకటి. బ్రిటిష్ కాలంలో దేశం ప్రెసిడెన్సీలు (కలకత్తా, మద్రాస్, బాంబే)

గానూ, సెంట్రల్ ప్రావిన్సెస్, బీదర్ వంటి అనేక పెద్ద రాష్ట్రాలుగానూ విభజించి ఉండేది. దేశంలో అధిక భాగం అనేక సంస్థానాల కింద ఉంది. ఈ రాష్ట్రాలలో పలు భాషలు మాట్లాడే ప్రజలు కలిసి జీవిస్తున్నారు. ఉదాహరణకు మద్రాసు ప్రెసిడెన్సీలో తమిళం, మళయాళం, కన్నడ, తెలుగు, గోండి, ఒడియా భాషలు మాట్లాడేవాళ్లు ఉండేవాళ్లు. ఒకే భాషను మాట్లాడుతూ పక్కపక్క ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలంతా ఒక రాష్ట్రంగా సంఘటితపరచాలంటూ కోరసాగారు. వీటిల్లో సంయుక్త కర్నాటక (మద్రాసు, మైసూరు, బాంబే, హైదరాబాదులలో కన్నడ మాట్లాడే ప్రజలను కలుపుతూ), సంయుక్త మహారాష్ట్ర, మహాగుజరాత్ ఉద్యమం, ట్రావెన్‌కూర్-కొచ్చిన్ సంస్థానాల విలీనం, సిక్కులకు పంజాబ్ రాష్ట్రంవంటి కోరికలు ఉండేవి. ఈ కోరికలను అంగీకరించటంవల్ల దేశ ఐక్యతను పెంచటానికి దోహదం చేస్తుందా, లేక భాషా ప్రాతిపదికన దేశంలో విభజనను తెస్తుందా అన్నది ప్రధాన అంశంగా మారింది.



*చిత్రం 18.2 : 1950ల ఆరంభంలో రోడ్డుకి పునాది వేస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ*

మత ఆధారంగా దేశ విభజన జరగటంతో నాయకుల మనసులో భారతదేశ భద్రత, సుస్థిరత పట్ల అనుమానాలు, భయాలు కలగసాగాయి. భాషా ప్రాతిపదిక రాష్ట్రాలను పునఃవ్యవస్థీకరిస్తే దేశం ముక్కలుగా కావటానికి దారితీస్తుందని భయపడసాగారు. కాంగ్రెస్ పార్టీ భాషా ప్రాతిపదికపై సంఘటితమై ఉన్నప్పటికీ, ఆ ఆధారంగా దేశాన్ని పునఃసంఘటితం చేస్తామని మాట ఇచ్చినప్పటికీ స్వాతంత్రం వచ్చిన తరువాత అందుకు వెంటనే పూనుకోలేదు.

తెలుగు మాట్లాడే ప్రజలు అన్నిటికంటే తీవ్ర ఉద్యమాన్ని చేపట్టారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలకు అనుగుణంగా కాంగ్రెస్ చేసిన తీర్మానాన్ని అమలు చెయ్యాలని వాళ్లు పట్టుపట్టారు. బ్రిటిష్ పాలనలో కూడా ఆంధ్ర మహాసభ క్రియాశీలంగా ఉండి మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే ప్రజలను ఒక్క తాటి కిందకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేసింది. ఈ ఉద్యమం స్వాతంత్రం తరువాత కూడా కొనసాగింది. విన్నపాలు, దరఖాస్తులు, వీధులలో కవాతులు, నిరాహారదీక్షలు వంటి పద్ధతులను ఇందుకు ఉపయోగించారు. ఈ కోరికను కాంగ్రెస్ వ్యతిరేకించటం వల్ల తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో మొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను గెలుచుకోలేదు. భాషా ప్రాతిపదిక ఉద్యమాన్ని బలపరిచిన పార్టీలు ఎక్కువ స్థానాలను గెలుచుకున్నాయి.




*పటం 1 : రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణకు ముందు ద్వీపకల్ప దక్షిణ ప్రాంతంలో వివిధ ప్రాంతాలను చూపించే పటం.*

భాషా ప్రాతిపదిక రాష్ట్రాలకు జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకం కాదు; అయితే ఇది అందుకు తగిన సమయం కాదని భావించాడు. ఆనాటి నాయకులలో ఈ విషయంలో ఇదే ఏకాభిప్రాయం ఉండేది. భారతదేశం తన స్థానాన్ని పదిలపరుచుకునే ప్రక్రియలో ఉందని, ఈ సమయంలో ఎటువంటి దృష్టి మళ్లింపులు ఉండకూడదని వాళ్లు భావించారు.

## రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ చట్టం, 1956

ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోరుతూ నిరాహారదీక్ష చేస్తున్న పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్ష తరువాత 1952 అక్టోబరులో చనిపోయాడు. దాంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలను ఏర్పరిచారు. 1953 ఆగస్టులో రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ సంఘాన్ని (ఎస్ ఆర్ సి) వేశారు. దీంట్లో ఫజల్ ఆలి, కె.ఎం. పణిక్కర్, హృదయనాథ్ కుంజ్రులు సభ్యులుగా ఉన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించవలసిందిగా ఈ సంఘాన్ని కోరారు. ఈ సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా 1956లో పార్లమెంటు రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ చట్టాన్ని ఆమోదించింది. దీని ఆధారంగా 14 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. భాషా ప్రాతిపదిక రాష్ట్రాలను ఏర్పాటు చేస్తున్నప్పుడు గోండి, సంథాలి, లేదా ఒరావన్ వంటి గిరిజన భాషలను పరిగణనలోకి తీసుకోలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి; ఆధిపత్య, లేదా శక్తిమంత ప్రజానీకం మాట్లాడే తమిళం, తెలుగు వంటి భాషలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు.

- భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడి ఉండకపోతే దేశ ఐక్యతకు మరింత మేలు జరిగి ఉండేదా?
- ఆ సమయంలో గిరిజన భాషలను ఎందుకు పట్టించుకోలేదు?
- భారతదేశంలో ప్రస్తుతం ఎన్ని రాష్ట్రాలు, ఎన్ని కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి?
- భారతదేశంలో ఇటీవల ఏర్పడిన కొత్త రాష్ట్రాలు ఏవి, అవి ఎప్పుడు ఏర్పడ్డాయి?

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటం ప్రజల అభీష్టం ఎలా నెగ్గిందో, ఒక సమస్యను రాజకీయాలు ఎలా పరిష్కరించాయో తెలియచేస్తుంది. ఇప్పుడు ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ నాయకులు భయపడినట్లుగా దేశాన్ని బలహీన పరచలేదు, అది భారతదేశం బలపడటానికే దోహద పడింది.

## సామాజిక, ఆర్థిక మార్పు

రాజ్యాంగ సభ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, హోదా, అవకాశాలలో సమానత్వాన్ని కోరుకుంది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో సామాజిక, ఆర్థిక మార్పుకి అది ప్రముఖ స్థానాన్ని ఇచ్చింది. కొత్త రాజ్యాంగాన్ని ఆవిష్కరించిన నెల రోజులకు ప్రణాళికా సంఘాన్ని ఏర్పరిచారు. ప్రణాళికా రచనను నెహ్రూ మంచి ఆర్థిక విధానమే కాకుండా మంచి రాజకీయాలుగా కూడా భావించాడు. ప్రణాళికాబద్ధ అభివృద్ధి ద్వారా కులం, మతం, ప్రాంతం వంటి విభజన ధోరణులు తగ్గి భారతదేశం బలమైన, ఆధునిక దేశంగా ఎదుగుతుందని అతడు ఆశించాడు.

మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యవసాయం మీద కేంద్రీకరించి ఆహార ఉత్పత్తిని పెంచటానికి, రవాణా, ప్రసారాల రంగాల మెరుగుదలకి, సామాజిక సేవల కల్పనకు ప్రాధాన్యతను ఇచ్చింది. భారతదేశం సాధ్యమైనంత త్వరగా పారిశ్రామికీకరణ చెందటానికి కూడా అది శ్రద్ధ వహించింది. ఆహారం మౌలిక



*చిత్రం 18.3 : 1960లో నిర్మాణంలో ఉన్న భాక్రా ఆనకట్ట, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశం నిర్మించిన మొదటి ఆనకట్టలలో ఇది ఒకటి. (కింద) తొలి దశాబ్దాల నాటి వయోజన విద్యాతరగతులకు సంబంధించిన ఫొటో. ఈ పథకాలతో సమాజంలో అభివృద్ధి లేదా మార్పులకు సంబంధించిన భావాలు ఎలా వ్యక్తం అవుతున్నాయో చర్చించండి.*



అవసరం కావటంతో ఆహార ఉత్పత్తిని పెంచాలన్న దానిమీద ఏకాభిప్రాయం ఏర్పడింది, కానీ దీనిని ఎలా సాధించాలన్న దానిమీద ఏకాభిప్రాయం కుదరలేదు. రాజకీయ అభిప్రాయం రెండు ప్రశ్నలపై విడిపోయింది. విస్తృత అభివృద్ధి విధానంలో వ్యవసాయానికి ఇవ్వవలసిన స్థానం ఏమిటి? వ్యవసాయానికీ, పరిశ్రమలకీ మధ్య వనరుల కేటాయింపు ఎలా ఉండాలి?

వ్యవసాయ రంగంలోని మార్పును నెహ్రూ కేవలం ఆర్థిక అంశంగా చూడలేదు, దానిని గ్రామీణ రంగ రాజకీయ, సామాజిక, ఆర్థిక మార్పుగా పరిగణించాడు. నెహ్రూ మొగ్గుచూపిన విధానాన్ని చివరికి అనుసరించారు. ఇందులో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి: భూ సంస్కరణలు, వ్యవసాయ సహకార సంఘాలు, స్థానిక స్వపరిపాలన. మూడు రకాల భూ సంస్కరణలను ప్రతిపాదించారు: జమీందారీ వ్యవస్థ రద్దు, కౌలు విధానాల సంస్కరణ, భూ పరిమితి విధానాలు. వీటన్నిటి ప్రధాన ఉద్దేశం దున్నేవానికి భూమి చెందేలా చూసి మరింత ఉత్పత్తి చెయ్యటానికి ప్రోత్సహించటం. సహకార సంఘాల ద్వారా ఆర్థికంగా లాభసాటి పరిమాణాన్ని చేరుకోవటమే కాకుండా విత్తనాలు, ఎరువులు, రసాయనాలు వంటి విలువైన ఉత్పాదకాలను అందించాలి. స్థానిక ప్రభుత్వాలు భూ సంస్కరణలు అమలు అయ్యేలా చూసి, గ్రామ ఉమ్మడి ప్రయోజనాలకు అనుగుణంగా సహకార సంఘాలు నడిచేలా చూస్తాయి.

అయితే భారతదేశమంతటా భూ సంస్కరణలను మనఃస్ఫూర్తిగా అమలు చేయలేదు. జమీందారీ వ్యవస్థను రద్దు చేశారు కానీ, భూమి లేనివాళ్లకి భూ పంపిణీ జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ధనికులు, శక్తిమంతులు భూమిలోని అధిక భాగాలపై నియంత్రణ కొనసాగిస్తూనే ఉన్నారు. దళితులు ఇంకా భూమి హీనులుగానే ఉన్నారు, కానీ వెట్టిచాకిరి నిర్మూలన, అంటరానితనం నిషేధం వల్ల ప్రయోజనం పొందారు.

మొదటి పంచవర్ష ప్రణాళికలో పెద్ద ఆనకట్టలు కట్టి విద్యుత్తు ఉత్పత్తి, సాగునీటి కల్పనల ద్వారా వ్యవసాయాన్ని వృద్ధి చేయటంపై దృష్టి సారించారు. ఆనకట్టల వల్ల వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు

రెండూ లబ్ధి పొందాయి. వ్యవసాయ ఉత్పత్తి పెరిగినప్పటికీ అది జనాభా అవసరాలకు సరిపోయేటంతగా లేదు.

దేశం ప్రగతి సాధించాలంటే పరిశ్రమలను అభివృద్ధి చేసి మరింత మంది కర్మాగారాలలోనూ, సేవారంగంలోనూ పనిచేసేలా మళ్లించాల్సిన అవసరం ఉందని ప్రణాళికా కర్తలు గుర్తించారు. దాంతో రెండవ పంచవర్ష ప్రణాళిక నుంచి ప్రాధాన్యత పరిశ్రమల వైపుకి మళ్లింది. భారతదేశ ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన ఈ అంశాలను ఇంతకు ముందు తరగతులలో మీరు చదివి ఉంటారు.

## విదేశీ విధానం, యుద్ధాలు

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన సమయంలోనే ప్రచ్ఛన్న యుద్ధం మొదలయ్యి ప్రపంచమంతా రష్యా కూటమి (USSR) లేదా అమెరికా కూటమి (USA)గా విడిపోతోంది. జవహర్‌లాల్ నెహ్రూ ఏ శిబిరంలోనూ చేరకుండా రెండింటికీ సమ దూరంలో ఉంటూ విదేశీ విధానంలో స్వతంత్రంగా వ్యవహరించసాగాడు. అదే సమయంలో స్వాతంత్ర్యం పొంది అదే విధానాన్ని కొనసాగించాలనుకుంటున్న ఇండోనేసియా, ఈజిప్టు, యుగొస్లేవియా వంటి దేశాలతో అతడు చేతులు కలిపాడు. వీళ్లంతా కలిసి అలీనోద్యమాన్ని నిర్మించారు. పొరుగుదేశాలకు సంబంధించి ఒకరి అంతరంగ వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదన్న పంచశీల సూత్రాలను నెహ్రూ రూపొందించాడు. అయితే ఈ కాలంలో భారతదేశం రెండు యుద్ధాలను ఎదుర్కోవలసి వచ్చింది. మొదటిది 1948లో కాశ్మీరు విషయంపై పాకిస్తాన్‌తోనూ, రెండవది 1962లో చైనాతోనూ జరిగాయి. భారతదేశం ఈ యుద్ధాలకు, ప్రత్యేకించి 1962 యుద్ధానికి సన్నద్ధమైలేనందున పెద్ద ఎత్తున ప్రాణ నష్టాన్ని, ధన నష్టాన్ని చవి చూడవలసి వచ్చింది.

- మీరు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నట్లయితే 1970లకి ముందు సహకార సంఘాల వంటి సంస్థలను స్థాపించారేమో తెలుసుకోండి, దాంట్లో సభ్యులుగా ఎవరు ఉన్నారో తెలుసుకోండి.
- భారతదేశంలో చేపట్టిన భూ సంస్కరణలను చైనాలోనూ, వియత్నాంలోనూ చేపట్టిన వాటితో పోల్చండి.



చిత్రం 18.4 : లాల్ బహదూర్ శాస్త్రి

## నెహ్రూ తరువాత

1964లో నెహ్రూ చనిపోయిన తరువాత ప్రజాస్వామ్యం మనగలుగుతుందా, లేక ఇతర దేశాలలో లాగానే ప్రజాస్వామిక సూత్రం దెబ్బతింటుందా అన్న అనుమానాలు విమర్శకులకు కలిగాయి. అయితే ప్రభుత్వాధినేతగా లాల్ బహదూర్ శాస్త్రిని ఎంపిక చేయటంతో కాంగ్రెస్, మార్పును విజయవంతంగా చేపట్టగలిగింది. భారతదేశ లక్ష్యాలు, మౌలిక విలువలకు సవాలుగా నిలిచిన అనేక అంశాలతో శాస్త్రి వెంటనే తలపడాల్సి వచ్చింది. దక్షిణాదిన డిఎంకె చేపట్టిన హిందీవ్యతిరేక ఉద్యమం దేశ ఐక్యత, సమగ్రతకే ముప్పుగా నిలిచింది, ఆహార కొరత సామాజిక, ఆర్థిక ప్రగతికి ఆటంకంగా మారింది, అంతేకాకుండా 1965లో పాకిస్తాన్‌తో యుద్ధం మొదలయ్యింది. 1966లో శాస్త్రి అకాల మరణంతో ఆ తరువాత ప్రధాన మంత్రిగా ఇందిరాగాంధి ఎంపిక అయ్యింది.

## హిందీ వ్యతిరేక ఉద్యమం

1963లో అధికార భాషా చట్టాన్ని ఆమోదించినప్పుడు హిందీని మిగిలిన దేశంమీద రుద్దడానికి ఎత్తుగడగా భావించి, డిఎంకె తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా హిందీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సమ్మెలు, ధర్నాలు, హర్తాళ్‌లు నిర్వహించారు. దిష్టిబొమ్మలు, హిందీ పుస్తకాలు, చివరికి రాజ్యాంగంలోని పేజీలను కూడా తగలబెట్టారు. సైన్ బోర్డులలో హిందీలో ఉన్న దానిమీద చాలాచోట్ల నలుపు రంగు పూశారు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఈ అల్లర్లను పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీయే హిందీ అనుకూల, హిందీ వ్యతిరేక శిబిరాలుగా విడిపోయింది. దేశ ఐక్యతకే ముప్పు ఏర్పడిందని కొందరు భావించారు.

చివరికి పరిస్థితులు చేజారిపోతున్నట్లు అనిపించడంతో అప్పటి ప్రధాని శాస్త్రి హిందీ అనుకూల వాదనని సమర్థించినప్పటికీ, హిందీ వ్యతిరేక శిబిరంలోని ఉద్వేగాలను శాంతపరచటానికి అనేక మినహాయింపులను ప్రకటించాడు. వీటిల్లో కొన్ని: ప్రతి రాష్ట్రానికి తన సొంత భాష కలిగి ఉండే హక్కు ఉంది, అది ప్రాంతీయ భాష కావచ్చు లేక ఇంగ్లీషు కావచ్చు, పత్ర వ్యవహారాలు ఇంగ్లీషు అనువాదంతో ప్రాంతీయ భాషలలో ఉండవచ్చు, కేంద్రం-రాష్ట్రాల మధ్య వ్యవహార భాషగా ఇంగ్లీషు కొనసాగుతుంది, సివిల్ సర్వీసు పరీక్షలు కేవలం హిందీలోనే కాకుండా ఇంగ్లీషులో కూడా నిర్వహిస్తారు.

ఇక్కడ కూడా ఒక జనాదరణ పొందిన సామాజిక ఉద్యమం వల్ల ప్రభుత్వం తన అధికారిక స్థానాన్ని పునః సమీక్షించుకోవలసి వచ్చింది. ఆందోళనకారులతో ఏకీభవించకపోయినప్పటికీ ఈ రెండు సందర్భాలలో ప్రధాన మంత్రులిద్దరూ పరిస్థితులు చేజారిపోకుండా చూడటానికి తమ దృక్పథాన్ని మార్చుకున్నారు. తమ దృక్పథం కంటే దేశ ఐక్యత ముఖ్యమని నెహ్రూ, శాస్త్రి స్పష్టంగా గుర్తించారు.

- భాషా విధానం జాతి ఐక్యత, సమగ్రతలకు ఎలా దోహద పడింది?
- జాతీయ భాష అవసరం ఉందా?
- అన్ని భాషలకు సమాన హోదా ఉండాలా?

## హరిత విప్లవం

అభివృద్ధి వ్యూహానికి సంబంధించిన చర్చ కేవలం ఆర్థిక పరమైనదేకాదు, దీనికి రాజకీయ కోణాలు కూడా ఉన్నాయి. నెహ్రూ, కాంగ్రెస్‌లో వామపక్షం వైపు మొగ్గుచూపే బృందం వ్యవసాయంలో ప్రభుత్వ నియంత్రిత వ్యవస్థాగత విధానాన్ని ఎంచుకున్నారు. అయితే కాంగ్రెస్‌లోనే మితవాదంవైపు మొగ్గ చూపే బృందం ప్రభుత్వ నియంత్రణను వ్యతిరేకించింది. వీళ్లు ఆ కార్యక్రమాలను నిరంతరం విమర్శిస్తూ, ఆ ప్రతిపాదనలను నీరుకార్చసాగారు. ఈ బృందం రాష్ట్ర స్థాయిలో బలంగా ఉన్నందువల్ల ప్రణాళికలు సరిగా అమలుకాకుండా అడ్డుకుంది.

ముందు ఎంచుకున్న విధానం ఆహార ఉత్పత్తి పెరుగుదలకు దోహదం చేయడంలేదని గుర్తించిన తరువాత 1964-67 మధ్య భిన్నమైన వ్యూహాన్ని ఎంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆహార ఉత్పత్తి పెంచటానికి ప్రయత్నించారు. ఒక రకంగా నెహ్రూ చనిపోయిన తరువాత ఆర్థిక ఆలోచనలు, ఆర్థిక విధానాలలో మార్పును కూడా ఇది సూచిస్తుంది.

## ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయ ఉద్యమాల ప్రాబల్యం

భారతదేశ చరిత్రలో 1967 ఎన్నికలు చాలా కీలకమైనవి. ఎన్నికలను ప్రజలు చాలా ముఖ్యంగా పరిగణిస్తున్నారని, వాటికి తమదైన ఉనికి ఉందని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. ఈపాటికి ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల వల్ల లాభపడిన వాళ్లు, నష్టపడినవాళ్లు కూడా ఉండటంతో రాజకీయ పోటీ తీరులో కూడా మార్పు వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అంతకు ముందెన్నడూ చవిచూడని ఫలితాలను చవిచూసింది. స్వాతంత్ర్యం తరువాత అది అంత తక్కువ ఆధిక్యతతో (284 స్థానాలు) ఎప్పుడూ ఎన్నిక కాలేదు. బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మద్రాస్, కేరళ శాసన సభలలో కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. దాదాపు 20 ఏళ్లపాటు నిరాటంకంగా పాలించిన పార్టీ ఇప్పుడు సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే ఓడిపోయిన పార్టీ అధికారాన్ని పట్టుకుని వేలాడలేదు, ఎన్నికలలో గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యనిచ్చింది. దేశంలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకుందని ఇది సూచిస్తుంది, పోటీతో కూడిన బహుళపార్టీ వ్యవస్థ వైపుకి దేశం పయనిస్తోంది.

కాంగ్రెస్ ఘోర పరాజయంపాలైన రాష్ట్రాలలో తమిళనాడు, కేరళ ఉన్నాయి. తమిళనాడులో డిఎంకె ఘన విజయం సాధించింది. సంఘటితంగా నిర్వహించే ప్రాంతీయ ఉద్యమాలు ఆధిపత్య పార్టీకి సవాలుగా ఉండగలవని ఇది తెలియచేసింది. డిఎంకెకి సినిమా రంగంతో బలమైన సంబంధాలు ఉన్నాయి. ప్రజాదరణ ఉన్న సినిమా హీరో యం.జి. రామచంద్రన్, అతడిని అందరూ యంజిఆర్ అంటారు, అభిమాన సంఘాలను తనకు మద్దతుగా డిఎంకె ఉపయోగించుకోగలిగింది.

పక్కన ఉన్న కేరళలోనే కాకుండా పశ్చిమ బెంగాల్, ఒడిశాలో కూడా కాంగ్రెస్ ఓడిపోయింది. ఈ ఓటములు, సవాళ్లతో కాంగ్రెస్ అంతరంగికంగా కూడా బలహీనపడింది. ఉత్తరాది రాష్ట్రాలలో స్వల్ప విజయాలుపొందిన చోట్ల దాని ప్రతినిధులు ప్రతిపక్షాలకు ఫిరాయించారు. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోయి సంయుక్త విధాయక దళ్ (ఎస్‌విడి) ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇది ప్రధానంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకమైన శాసనసభ్యులు – జనసంఘ్, సోషలిస్టులు, స్వతంత్ర పార్టీ, కాంగ్రెస్ ఫిరాయింపుదారులు, స్థానిక పార్టీల శాసనసభ్యులు ఏర్పరిచిన సంకీర్ణం.

భారత రాజకీయ చరిత్రలో ఈ కొత్త ప్రభుత్వాలు ఒక మైలురాయిగా ఉంటాయి. ఒక విధంగా ప్రజాస్వామిక తిరుగుబాటును ఇది సూచిస్తుంది. మధ్యస్థాయి కులాలు – ఇవి భూ సంస్కరణల వల్ల ప్రయోజనం పొంది ఆర్థికంగా లాభపడ్డాయి – మొదటిసారిగా రాజకీయ అధికారాన్ని పొందాయి. ఈ కులాలు – హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో జాట్, బీహార్‌లో కుర్మి, కొయిరి, మధ్యప్రదేశ్‌లో లోధ్, ఈ అన్ని రాష్ట్రాలలో యాదవ్, ఆంధ్రప్రదేశ్‌లో రెడ్డి, కమ్మ, కర్నాటకలో ఒక్కళిగా, తమిళనాడులో వెల్లల. ఈ కులాలు ఆయా రాష్ట్రాలలో ఆధిపత్యకులాలుగా ఉండి జనాభా రీత్యాకూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇతర ఆధిపత్య (వెనకబడ్డ) కులాలు అధికారంలోకి రావటానికి డిఎంకె పార్టీయే మంచి ఉదాహరణ.

ఈ ఎస్‌విడి ప్రభుత్వాలలో చాలావరకు ఎక్కువకాలం పాటు నిలవలేదు. వాటిచరిత్ర అవినీతి, ఫిరాయింపులతో నిండిపోయింది. అధికార కాంక్ష ఒక్కటే వాళ్లను కలిపినట్టు ఉంది. ఈ ప్రభుత్వాలు సాధించింది ఏమీ లేదు. అయితే ఈనాటికి కూడా ప్రాంతీయ లేదా రాష్ట్రస్థాయి పార్టీలను వీటిని ప్రామాణికంగా చేసుకునే అంచనా వేస్తున్నారు.

ఈ కాలంలో దేశంలో వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ భావాలు తిరిగి ఊపందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణ కోరసాగారు. ఈ ఉద్యమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు నాయకత్వం వహించారు. అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని కొన్ని వర్గాలకే చెందుతున్నాయన్నది వీళ్ల ప్రధాన ఆరోపణ.

1969 డిసెంబరులో అసోంలోని ఖాసి, జైంతియా, గారో గిరిజన ప్రాంతాలతో మేఘాలయ అన్న కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. 1966లో ఏర్పడిన పంజాబ్‌కి తనదంటూ రాజధాని లేదు. హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధానిగా ఉన్న ఛండీఘర్‌ని తమకు ఇవ్వమని 1968–69లో పంజాబ్ ప్రజలు ఆందోళనలు చేశారు. మహారాష్ట్రలో బొంబాయి మహారాష్ట్రవాసులకే చెందాలన్న వింత వాదన మొదలయ్యింది. దీనికి శివసేన నాయకత్వం వహించింది. నగరంలోని ఉద్యోగాలన్నింటినీ దక్షిణాది రాష్ట్రాల వాళ్లు చేజిక్కించుకుంటున్నారన్న భావనతో ఈ పార్టీ ఆ రాష్ట్రాల ప్రజలను లక్ష్యంగా చేసుకుంది.



చిత్రం 18.5 : ఇందిరా గాంధి

అదే సమయంలో పాత డిమాండ్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాశ్మీరు, నాగాలాండ్ డిమాండ్లు ఈ కాలంలో చోటు చేసుకున్నాయి. గృహ నిర్బంధం నుంచి విడుదలైన తరువాత షేక్ అబ్దుల్లా కాశ్మీరు రాష్ట్రానికి తిరిగి వచ్చాడు. అదేవిధంగా నాగాలాండ్‌లో కొత్త, యువ నాయకత్వం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటానికి సన్నద్ధమయ్యింది.

ఈ కాలంలోనే మత ఉద్రేకాలు కూడా చోటు చేసుకున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో మతకల్లోలాలు చెలరేగాయి: రాంచి (బీహార్), అహ్మదాబాదు (గుజరాత్), జలగావ్ (మహారాష్ట్ర), అలీఘర్

### జమ్ము & కాశ్మీరు

*భారత సమాఖ్యలో ఇతర సంస్థానాల లాగా కాకుండా జమ్మూ & కాశ్మీరు చేరిన పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇతర పాలకుల లాగా కాకుండా రాజు అయిన హరిసింగ్ అటు పాకిస్తాన్‌లోనూ, ఇటు భారతదేశంలోనూ విలీనం కాకుండా జమ్మూ & కాశ్మీరుని స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని కోరుకున్నాడు. ఈ రాష్ట్రంలో ముస్లిములు అధిక సంఖ్యలో ఉన్నారు, రాజు హిందువు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినకాలంలో అక్కడ అఖిల జమ్ము & కాశ్మీరు కాన్ఫరెన్స్ పేరుతో ప్రజా ఉద్యమం ఒకటి నడుస్తోంది. దీనికి షేక్ మొహమ్మద్ అబ్దుల్లా నాయకత్వం వహిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లిములకు అధిక ప్రాతినిధ్యం, ప్రాతినిధ్య ప్రభుత్వం వంటి కోరికలతో ఈ ఉద్యమం సాగుతోంది. ఈ ఉద్యమం, ఆ తరువాత నేషనల్ కాన్ఫరెన్స్‌గా పరిణమించింది, దీంట్లో సిక్కులు, హిందువులు కూడా సభ్యులుగా ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కూడా కాంగ్రెస్ లాగానే మతసామరస్యానికి, సామ్యవాదానికి కట్టుబడి ఉంది.*

1947 చివరి నాటికి పశ్చిమ సరిహద్దులనుంచి పాకిస్తాన్ మద్దతుతో రజాకార్ల దాడులు మొదలయ్యాయి. ఈ దాడి చేస్తున్నవాళ్లు శ్రీనగర్‌ని సమీపిస్తుండటంతో రక్షణ కోసం మహారాజు భారతీయ సైన్యాన్ని సహాయం కోరాడు. అయితే జమ్ము & కాశ్మీరు భారతదేశంలో విలీనం అయిన తరువాత దాని సైన్యం అందుబాటులో ఉంటుందని భారత గవర్నర్ జనరల్ చెప్పారు.

ఆ సమయంలో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి, అది స్వయంప్రతిపత్తితో కొనసాగటం గూర్చి విస్తృతమైన చర్చలు జరిగాయి.

1948లో భారతదేశం ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి ముందు ఉంచింది. అయితే విషయాన్ని సరిగ్గా వివరించలేక పోవటంవల్ల ఇది భారతదేశం – పాకిస్తాన్‌ల సమస్యగా మారింది. ఈలోగా, షేక్ అబ్దుల్లా ఢిల్లీ ఒప్పందంగా పిలవబడుతున్న దానికి అంగీకరించాడు. దీని ప్రకారం కాశ్మీరీలు భారతదేశ పూర్తి పౌరులుగా ఉంటారు, అదే సమయంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆ రాష్ట్రం అధిక స్వయం ప్రతిపత్తి, అధికారాలు కలిగి ఉంటుంది. రాష్ట్ర మౌలిక స్వభావాన్ని కాపాడటానికి ఉద్దేశించిన ఈ ఒప్పందంలోని అనేక అంశాలు రాజ్యాంగంలోని 370వ అధికరణంలో చోటు చేసుకున్నాయి.

అదే సమయంలో రాష్ట్రంలో ఉన్న ఆర్థిక తేడాలు మతపరమైన రంగు సంతరించుకున్నాయి. రాష్ట్రంలో భూ సంస్కరణల వల్ల భూ పరిమితికి మించి ఉన్న భూస్వాముల భూములను స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా భూమి కోల్పోయిన వాళ్లల్లో ఎక్కువమంది హిందూ భూస్వాములు కాగా, మిగులు భూమి పంపకంలో భూమిని పొందిన వాళ్లు ముస్లిములు. 1950–1990 మధ్యకాలంలో ఈ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని తగ్గించి మిగిలిన రాష్ట్రాలతో సమానంగా చెయ్యటానికి కేంద్ర ప్రభుత్వం అనేకసార్లు ప్రయత్నించింది. దీనికి కాశ్మీరు ప్రజలు తీవ్రంగా స్పందించారు. దీనిని ఆధారంగా చేసుకుని 1990లలో కాశ్మీరు స్వతంత్రం కావాలంటూ ఉద్యమం మొదలయ్యింది. ఈ కాలంలో కాశ్మీరు లోయ నుంచి అనేక హిందు కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస పోవలసి వచ్చింది.

(ఉత్తరప్రదేశ్). ఇవి కష్టకాలాలు. రాజకీయ మార్పు అప్పుడే జరిగి కొత్త నాయకత్వం రూపుదిద్దుకుంటోంది. పెరుగుతున్న రాజకీయ చైతన్యం, కోర్కెలను వెల్లడించగలగటం కారణంగా ఏర్పడుతున్న ఒత్తిడిలను తట్టుకోటానికి కొత్త నాయకత్వం ఇంకా తగినంత సన్నద్ధంగా లేదు.

1967 ఎన్నికల తరువాత వామపక్ష పంథావైపు తీవ్ర మొగ్గు చూపడంద్వారా బయటినుంచి, పార్టీలోపలనుంచి వస్తున్న సవాళ్లను ఇందిరాగాంధి ఎదుర్కొంది. పేదలు, అట్టడుగు ప్రజలతో తాను, తమ పార్టీ మమేకం కావటంద్వారా పార్టీకి కొత్త సామాజిక మద్దతును కూడగట్టటానికి ఆమె ప్రయత్నించింది. ఇది రెండు వైపులా పదును ఉన్న ఆయుధం. సామాజిక, ఆర్థిక ప్రగతికి సంబంధించిన వాగ్దానాలు ఇంకా నెరవేరలేదు. 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవటానికి ఇదొక ప్రధాన కారణం. అయినా ఇందిరాగాంధి మరిన్ని కొత్త వాగ్దానాలు చేసింది. ఒక దశాబ్ద కాలంలో పెరుగుతున్న ప్రజల కోరికలు తీరక నిరాశ, నిస్పృహలు ఏర్పడి అత్యవసర పరిస్థితి విధించటానికి దారితీసింది.

## బంగ్లాదేశ్ యుద్ధం

1970 దశాబ్దం ప్రథమాంకంలో తూర్పు పాకిస్తాన్ (ఇప్పటి బంగ్లాదేశ్)లో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. పశ్చిమ పాకిస్తాన్ తమపై సవతితల్లి ప్రేమ కనపరచటంపై నిరసనలు చెలరేగాయి, తమ బెంగాలీ అస్థిత్వాన్ని చాటుకోటానికి ఉద్యమాలు మొదలయ్యాయి. సార్వత్రిక ఎన్నికలలో ముజిబుర్ రెహ్మన్ నాయకత్వంలోని పార్టీ గెలుపొందింది. కానీ అతడిని అరెస్టు చేసి పశ్చిమ పాకిస్తాన్‌కి తీసుకెళ్లారు. తూర్పు పాకిస్తాన్‌లో సైనిక అణిచివేత కాలం మొదలయ్యింది. అక్కడ నుంచి తరలి వచ్చిన లక్షలాది కాందిశీకులకు భారతదేశం వసతి కల్పించి ఆహారాన్ని అందించాల్సి వచ్చింది. ఈలోగా బంగ్లాదేశ్

విముక్తి ఉద్యమం మొదలయ్యింది. దీంట్లో భారతదేశ సహాయాన్ని కోరారు. 1971లో భారతదేశం–పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం మొదలయ్యింది. భారతదేశం నిర్ణయాత్మకంగా జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌కు విముక్తి సాధించి, స్వతంత్ర దేశంగా ఏర్పడేలా సహాయపడింది. భారతదేశం తన సైనిక బలాన్ని పెంచుకోవటం వల్లనే కాకుండా అలీన దేశంగా తన స్థితిని నైపుణ్యంతో ఉపయోగించుకుని రెండు అగ్రరాజ్యాలు యుద్ధంలో జోక్యం చేసుకోకుండా చెయ్యటంవల్ల ఇది సాధ్యమయ్యింది.

## వామపక్ష పంథావైపు మలుపు

కొత్త విధానాలు, కొత్త కార్యక్రమాలను చేపట్టటం ద్వారా ఇందిరాగాంధి తనకూ, కాంగ్రెస్ పార్టీకి కొత్త దారి వేసింది. ఈ విధానం ద్వారా ఆమెకు పార్టీ నిర్మాణంపై పూర్తి పట్టు లభించింది.

యుద్ధంలో గెలిచిన వెంటనే "గరీబీ హటావో" అన్న జనాకర్షక నినాదంతో 1971 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ రికార్డు స్థాయిలో విజయం సాధించింది. దీనితో ఇందిరాగాంధీకి ప్రజాదరణ మరింత పెరిగింది. ప్రతిపక్షం అన్నది దాదాపు లేకుండా పోయింది. ఆమె విమర్శకుల నోళ్లు మూతపడ్డాయి, ఆమె ప్రజల ప్రియతమ నేత అయ్యింది. ఆ తరువాత 1972లో రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధి ప్రజాదరణను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ మంచి ఫలితాలే పొందింది. ఇప్పుడు ఆమెకు పార్టీపైనా, పార్లమెంటుపైనా నియంత్రణ ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరాగాంధి అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ అంచెలంచెలుగా అధికార కేంద్రీకరణ గావించింది.

ఈ కాలంలో సామాజిక, ఆర్థిక మార్పు సాధించాలన్న లక్ష్యంతో అనేక ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేస్తూ చేసిన చట్టం, రాజ భరణాలను రద్దుచేస్తూ చేసిన చట్టం ముఖ్యమైనవి. ఈ రెండు చట్టాలను న్యాయస్థానాలలో సవాలు చేశారు. దాంతో రాజకీయ లక్ష్యాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటున్నాయనిపించేట్టుగా చేశారు.

అయితే, విధానాలు, కార్యక్రమాలకు సంబంధించి న్యాయవ్యవస్థకు భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. సామాజిక, ఆర్థిక మార్పు అన్న పేరుతో రాజ్యాంగాన్ని తరచు సవరిస్తున్నారని, అది వాస్తవానికి దాని స్వరూపాన్ని మార్చివేస్తోందని, భిన్న వ్యవస్థాగత నిర్మాణాల మధ్య ప్రస్తుతం ఉన్న సమతౌల్యం దెబ్బ తింటోందని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పును ఇచ్చింది. దీంతో రాజ్యాంగ సవరణకు ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు కొంతవరకు పరిమితులు విధింపబడ్డాయి.

తన నియంత్రణలో లేని ఘటనల కారణంగా ఇందిరాగాంధి సమస్యలలో చిక్కుకుని తన మాటలు నిలుపుకోవటం కష్టం అయ్యింది. ఆమె ప్రభుత్వం తీవ్ర సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంది. 1973లో అరబ్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధంతో చమురు ధరలు ఎన్నడూ లేనంతగా పెరగటంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆహార కొరత, నిరుద్యోగం వంటివి ప్రభావం చూపసాగాయి. ప్రజలలో అధిక శాతం సంతోషంగా లేరు. దీంతో ప్రతిపక్షాలకు అవకాశం దొరికింది. దేశ వివిధ ప్రాంతాలలోని అసంతృప్తిని ఆసరా చేసుకోసాగారు. జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ఐక్యమైన ప్రతిపక్షాలు దేశంలోని పలు ప్రాంతాలలో కాంగ్రెస్‌కి, ప్రత్యేకించి ఇందిరాగాంధికి వ్యతిరేకంగా ఉద్యమించాయి. దీనిని జెపి ఉద్యమంగా పేర్కొంటారు. ఇది బీహారులోనూ, గుజరాత్‌లోనూ చాలా పెద్ద ఎత్తున జరిగింది.

## అత్యవసర పరిస్థితి

శాంతిని కాపాడే పేరుతో ఈ ఉద్యమానికి స్పందిస్తూ పౌరహక్కులకు భంగం కలిగేలా ప్రభుత్వం అనేక తీవ్రమైన చట్టాలను చేసింది. ప్రభుత్వాన్ని తనకు వ్యక్తిగతంగా ప్రధానమంత్రి మలుచుకుంటోందని కూడా ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈలోగా 1971 ఎన్నికలలో ప్రజా ప్రతినిధుల చట్టంలోని కొన్ని అంశాలను అతిక్రమించిందంటూ లోక్‌సభకు ఇందిరాగాంధి ఎన్నికను అలహాబాదు కోర్టు రద్దు చేసింది. అయితే ఆమె సుప్రీంకోర్టు నుంచి నిలుపుదల ఆదేశాలు తెచ్చుకుంది.

కొన్ని రోజుల తరువాత జెపి ఉద్యమం మరింత తీవ్రతరం కావటంతో ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, శాంతి, భద్రతలు నెలకొల్పటానికి దేశ సమగ్రతను కాపాడటానికి, సామాజిక, ఆర్థిక మార్పులను కొనసాగించటానికి అది అవసరమయ్యిందని ప్రభుత్వం దానిని సమర్థించుకుంది.



*చిత్రం 18.6 : కోల్‌కతాలో కుటుంబ నియంత్రణ ఆసుపత్రి*

దీనితో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. దేశంలో శాంతి, భద్రతలకు అవసరమంటూ ప్రభుత్వం అనేక అణిచివేత చర్యలకు పాల్పడింది. అనేక ప్రాథమిక హక్కులను నిలిపి వేశారు. ఏ కారణం లేకుండా అరెస్టు చెయ్యటం, హింసించటం, పౌరహక్కులకు భంగం కలిగించటం వంటి అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ కాలంలో ధరల నియంత్రణ, నల్ల బజారు, వెట్టిచాకిరీలకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాలను ప్రజలు స్వాగతించారు. అయితే ఇదే కాలంలో చేపట్టిన మురికివాడల తొలగింపు, జనాభా నియంత్రణ పేరుతో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించటం వంటి కార్యక్రమాలు ప్రజల కోపానికి కారణమయ్యాయి. అయితే పౌరహక్కులు లేనందువల్ల ప్రజలు తమ అసంతృప్తిని వెల్లడిచేసే మార్గాలు లేకపోయాయి, దాంతో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ప్రభుత్వానికి లేకుండాపోయింది.

ఈ కాలంలో చెప్పుకోదగిన మరొక ముఖ్య పరిణామం రాజ్యాంగానికి చేసిన 42వ సవరణ. ఇది అనేక మార్పులను తీసుకు వచ్చింది. ఈ సవరణ ఉద్దేశాలు: అ) ఎన్నికల వివాదాలలో న్యాయస్థానాలకు చోటు లేకుండా చెయ్యటం; ఆ) రాష్ట్ర ప్రభుత్వాలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వాన్ని బలపరచటం; ఇ) సామాజిక, ఆర్థిక మార్పుకి ఉద్దేశించిన చట్టాలకు న్యాయస్థానాల నుంచి సాధ్యమైనంత రక్షణను కల్పించటం; ఈ) న్యాయ వ్యవస్థ పార్లమెంటుకు లోబడి ఉండేలా చేయటం. ఈ సవరణ ఉద్దేశాలుగా దేశ సమైక్యతను బలపరచటం, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని న్యాయస్థానాల నుంచి కాపాడటం వంటి వాటిని పేర్కొన్నప్పటికీ వాస్తవంలో దీనివల్ల దేశ ప్రజాస్వామ్య స్వభావం బలహీనపడింది.

## ముగింపు

మొదటి ముప్పై సంవత్సరాలు అత్యవసర పరిస్థితితో ముగిసినప్పటికీ, లాభ నష్టాల పట్టిక తయారుచేస్తే తప్పులు కంటే ఒప్పులే ఎక్కువ ఉన్నాయి.

స్థిరమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పటం ఈ కాలంలో సాధించిన అత్యంత ముఖ్యమైన విషయంగా పేర్కొనవచ్చు. అదే సమయంలో స్వాతంత్రం పొందిన ఇతర దేశాలతో భారతదేశాన్ని పోలిస్తే భిన్న ప్రయోజనాలు కలిగిన పార్టీలతో పోటీతో కూడిన బహుళపార్టీ వ్యవస్థ క్రమేపీ రూపొందటం అన్నది నిజమైన విజయంగా పేర్కొనాలి. ఇతర దేశాలలో లాగా కాకుండా భారతదేశంలో క్రమం తప్పకుండా, భయంలేని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగటమే కాకుండా ప్రభుత్వాలు, నాయకులు కూడా మార్పుకి లోనయ్యారు. భారత రాజ్యాంగం పౌరహక్కులను ఇవ్వటమే కాకుండా వాటిని కాపాడటానికి వ్యవస్థాగత నిర్మాణం కూడా రూపొందించింది.

న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం, కంట్రోలర్ & ఆడిటర్ జనరల్ వంటి స్వతంత్ర వ్యవస్థాగత ఏర్పాట్లతో భారతదేశం చక్కని సంస్థాగత చట్రాన్ని ఏర్పరిచింది. పాలనాధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించటం కూడా గొప్ప విజయమనే చెప్పుకోవాలి. సైనిక దళాలపై పౌర నియంత్రణను ఏర్పరచటం మరొక ముఖ్యమైన విషయం. మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో పోలిస్తే ప్రజాస్వామిక సంస్థలలో భారతదేశం ఎంతో ముందుంది.

ఐక్యతను, దేశ సమగ్రతను కాపాడి, నిలపటంలో కూడా భారతదేశం విజయవంతం అయ్యింది. దేశంలోని అంతులేని వైవిధ్యత కారణంగా అది విచ్ఛిన్నం కావటానికి అనువైన దేశమని అందరూ భావించారు, అలాకాకపోవటం అన్నది ఇతర దేశాలకు చక్కని గుణపాఠంగా ఉపయోగపడుతుంది.

ఆర్థిక లక్ష్యాల విషయంలో ప్రణాళికా సంఘాన్ని నెలకొల్పటం, సమతుల ప్రాంతీయ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవటం అన్న అంశాలు చెప్పుకోదగినవి. సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వర్గాల పట్ల నిజమైన శ్రద్ధ కనబరిచారు. ఆహారం కోసం ఇతరులపై ఆధారపడిన స్థితి నుంచి కాలక్రమంలో ఆహార స్వయం సమృద్ధిని సాధించిన స్థితికి దేశం చేరుకుంది. ఇది పరిశ్రమలకు చక్కని పునాదిగా నిలచింది. అయితే ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధి జరుగక కొన్ని ప్రాంతాలు ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ అభివృద్ధి చెందాయి. అదేవిధంగా, ఉపాధి అవకాశాలు పెరగవలసినంతగా పెరగలేదు.

ప్రాథమిక విద్యకి, ప్రజారోగ్యానికి తక్కువ ప్రాధాన్యతను ఇవ్వటం పెద్ద లోపమని నిస్సందేహంగా పేర్కొనవచ్చు. ఇది భారతదేశాన్ని చాలాకాలం పాటు పీడిస్తూ ఉంటుంది. అదే సమయంలో నూతన శకాన్ని ఆరంభించిన చైనా, కొరియాలు భారతదేశంతో పోలిస్తే ఈ రెండు అంశాల్లో ఎంతో ప్రగతిని సాధించాయి.

కుల వ్యవస్థలోని గర్హించదగ్గ అంటరానితనం వంటి వాటిని తొలగించినప్పటికీ వివక్షత ఇంకా తీవ్రంగానే కొనసాగుతోంది. లింగ వివక్షత కూడా కొనసాగుతోంది.

### కీలక పదాలు

| | | |
|---|---|---|
| రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ | ఒక పార్టీ ఆధిపత్యం | |
| అత్యవసర పరిస్థితి | ప్రాంతీయ ఉద్యమాలు | జాతీయీకరణ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. బ్రాకెట్టు ముందున్న వ్యాఖ్యానానికి సంబంధించి అనువైన వ్యాఖ్యానం/ వ్యాఖ్యానాలను బ్రాకెట్టు లోపల ఉన్నవాటి నుంచి గుర్తించండి.

   అ) రాజకీయ సమానత్వాన్ని దీనితో గుర్తించవచ్చు (ఏ పాఠశాలలోనైనా ప్రవేశం పొందే హక్కు, ఒక వ్యక్తి – ఒక ఓటు అన్న సూత్రం, దైవారాధన ప్రదేశంలోకి ప్రవేశించే హక్కు)

   ఆ) భారతదేశ విషయంలో అందరికీ వయోజన ఓటు హక్కు అంటే (అందరినీ ఏదో ఒక రాజకీయ పార్టీకి ఓటు వెయ్యటానికి అనుమతించటం, అందరినీ ఎన్నికలలో ఓటు వెయ్యటానికి అనుమతించటం, అందరినీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వెయ్యటానికి అనుమతించటం)

   ఇ) కాంగ్రెస్ ఆధిపత్యం దీని వల్ల సాధ్యమయ్యింది (విభిన్న సిద్ధాంతాలు ఉన్న వాళ్లని ఆకర్షించగలగటం, ఎన్నికల తరువాత అత్యధిక శాసన సభా స్థానాలను గెలుచుకోగలగటం, ఎన్నికలలో పోలీసు బలగాన్ని ఉపయోగించుకోగలగటం)

   ఈ) అత్యవసర పరిస్థితి ఫలితంగా (ప్రజల హక్కులకు పరిమితులు విధింపబడ్డాయి, పేదరికం తొలగింపబడింది, అన్ని రాజకీయ పార్టీల ఆమోదం పొందింది)

2. స్వాతంత్ర్యం వచ్చిన తొలి సంవత్సరాలలో సామాజిక–ఆర్థిక మార్పు తీసుకురావటానికి ఏ చర్యలు చేపట్టారు?

3. ఒక పార్టీ ఆధిపత్యం అంటే ఏం అర్థం చేసుకున్నారు? అది ఎన్నికలలో మాత్రమే ఆధిపత్యమా, లేక సిద్ధాంత భావజాలంలో కూడా ఆధిపత్యమా? మీ కారణాలను పేర్కొంటూ చర్చించండి.

4. ఐక్యత సాధించే అంశంగానో లేక విభజించే దానిగానో భారతదేశ రాజకీయాలలో భాష కేంద్ర బిందువుగా అనేకసార్లు తెరమీదకు వచ్చింది. ఈ ఘటనలను గుర్తించి వాటిని వివరించండి.

5. 1967 ఎన్నికల తరువాత రాజకీయ వ్యవస్థలో వచ్చిన ముఖ్యమైన మార్పులు ఏవి?

6. రాష్ట్రాలను ఏర్పరచటానికి మరొక ఆధారం ఏమైనా ఉందా? భాష ఆధారంగా పునఃవ్యవస్థీకరణ కంటే అది ఏవిధంగా మెరుగైనదిగా ఉండేది?

7. ఇందిరాగాంధీ తీసుకున్న ఏ చర్యలను 'వామపక్ష పంథా వైపు మళ్లించటం'గా పేర్కొన్నారు? అందుకు ముందు దశాబ్దాల విధానాలతో పోలిస్తే ఇవి ఏ విధంగా భిన్నమైనవి? ఆర్థిక శాస్త్ర అధ్యాయాల ఆధారంగా ప్రస్తుత విధానాలకూ, వాటికీ తేడా ఏమిటో పేర్కొనండి.

8. భారత ప్రజాస్వామ్యాన్ని అత్యవసర పరిస్థితి ఏ విధంగా వెనక్కి తీసుకుపోయింది?

9. అత్యవసర పరిస్థితి కాలంలో ఏ విధమైన వ్యవస్థాగత మార్పులు వచ్చాయి?

పాఠం 19

# రాజకీయ ధోరణుల ఆవిర్భావం : 1977-2000

- గత అధ్యాయంలో చర్చించిన స్వతంత్ర భారతదేశంలోని రాజకీయ ఘటనల గురించి క్లుప్తంగా రాయండి.

ఈ అధ్యాయంలో భారతదేశ ఆధునిక రాజకీయ ఘటనల గురించి వివరంగా తెలుసుకుందాం. ఈ ఘటనలు, అంశాలలో అనేకం దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని తీవ్ర విభజనకు, పరస్పర విరుద్ధ భావాలకు లోను చేసింది. పోటీతో కూడిన బహుళ పార్టీ వ్యవస్థ ఏర్పడటం వలన పార్టీ వ్యవస్థ మారిపోయింది. ఈ మార్పు వల్ల ఏ ఒక్క పార్టీ కూడా తనంతట తాను ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యలేకపోవటంతో వరుసగా అనేక సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఆర్థిక రంగంలో అభివృద్ధి విధానంలో ఈ కాలం ప్రధాన మార్పులను తెచ్చింది. మార్కెటు ఆర్థిక విధానం, రాజకీయాల ప్రజాస్వామ్యం మధ్య ఘర్షణలు ఈ కాలంలో చోటు చేసుకోసాగాయి. ఇదే సమయంలో మత, కుల భేదాలను కొత్తగా సింగారించి వాటిని రాజకీయ సమీకరణకు ఉపయోగించుకున్నాయి. ఈ సమకాలీన అంశాలు రాజ్యాంగంలోని మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, దేశ ఐక్యత, సమగ్రత, సామాజిక, ఆర్థిక మార్పులను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఈ అధ్యాయంలో చూద్దాం.

ఈ కాలంలోని ఘటనలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తమ నమ్మకాలను బట్టి తమ సొంత దృక్పథాలు ఉంటాయి. అయితే ఇతరుల దృక్పథాలను అర్థం చేసుకోవాలి, ఇతరులు నొచ్చుకోకుండా తమ అభిప్రాయాన్ని వెల్లడించాలి. ఈ అధ్యాయంలో చర్చించిన పరిణామాలు ప్రజాస్వామిక సంస్థల, స్వభావం భవిష్యత్తు పై ముఖ్యమైన ప్రభావాన్ని చూపిస్తాయి, వాటి వివిధ కోణాలను అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం. మన ప్రజాస్వామ్య పరిపక్వత ఈ చర్చలను ఎలా నిర్వహించాం అన్న దానిపై ఆధారపడి ఉంటుంది.

| | |
|---|---|
| అత్యవసర పరిస్థితి ముగింపు, మొరార్జీ దేశాయి, చరణ్ సింగ్‌ల కింద జనతాపార్టీ ప్రభుత్వాల ఏర్పాటు | 1977 |
| ఇందిరాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు | 1980 |
| టిడిపి ఏర్పాటు | 1982 |
| ఆపరేషను 'బ్లూస్టార్', ఇందిరాగాంధీ హత్య | 1984 |
| పంజాబ్‌పై హెచ్ ఎస్ లాంగొవాల్‌తోనూ, అస్సాంపై ఎఎఎస్‌యుతోనూ రాజీవ్‌గాంధీ ఒప్పందాలు | 1985 |
| మిజో నేషనల్ ఫ్రంట్‌తో ఒప్పందం | 1986 |
| శ్రీలంకతో ఒప్పందం | 1987 |
| విపి సింగ్, చంద్రశేఖర్‌లతో జనతాదళ్ ప్రభుత్వాల ఏర్పాటు | 1989 |
| మండల కమిషన్ సిఫారసుల అమలుకు నిర్ణయం | 1989 |
| రామజన్మభూమి రథయాత్ర | 1990 |
| రాజీవ్‌గాంధీ హత్య, పివి నరసింహారావు ప్రధానమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం | 1991 |
| ఆర్థిక సరళీకరణ విధానాలు | 1990 |
| బాబ్రి మస్జీద్ కూల్చివేత | 1992 |
| దేవెగౌడ, ఐకె గుజ్రాల్‌లు ప్రధానమంత్రులుగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం | 1996 |
| ఎబి వాజ్‌పేయి నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం | 1998 |

## అత్యవసర పరిస్థితి తరువాత తిరిగి ప్రజాస్వామ్యం

1975-85 మధ్య కాలం భారతదేశ ప్రజాస్వామ్యానికి పరీక్షాకాలం వంటిది. అది మౌలిక ప్రజాస్వామిక హక్కులను తిరస్కరించిన అత్యవసర పరిస్థితితో మొదలయ్యి రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక ఎన్నికల విజయంతో ముగిసింది. ఈ కాలం కాంగ్రెస్ పార్టీ పాలనతోనే మొదలయ్యి ముగిసినప్పటికీ కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయాలు రూపొందాయి. అనేక దేశాలలో జరిగినట్లు ఇది భారతదేశం కూడా 'ఏక పార్టీ ప్రజాస్వామ్యం'లోకి జారిపోకుండా సమర్థవంతంగా నివారించింది. పోటీదారు ప్రత్యామ్నాయాలు ఏర్పడటంతో భారతీయ ఓటర్లకు ఎంచుకోటానికి అవకాశం లభించింది. దీనివల్ల రాష్ట్ర స్థాయి, జాతీయ రాజకీయాలలో విభిన్న రాజకీయ దృక్పథాలకు, వర్గ ప్రయోజనాలకు అవకాశం లభించింది. సోషలిస్టులు, హిందూ జాతీయతావాదులు, కమ్యూనిస్టుల వంటి రాజకీయ దృక్పథాలు, రైతులు, దళితులు, వెనకబడిన కులాలు, ప్రాంతాల వంటి వర్గ ప్రయోజనాలు కూడా ముందుకొచ్చి తమ హక్కుల కోసం పోరాడసాగాయి. ఇదే సమయంలో పర్యావరణ ఉద్యమం, స్త్రీవాద ఉద్యమం, పౌరహక్కుల ఉద్యమం, సాహిత్య ఉద్యమం వంటి అనేక రాజకీయేతర ఉద్యమాలు మొదలయ్యి సామాజిక మార్పునకు బలమైన చోదక శక్తిగా మారాయి. వీటిల్లోని కొన్ని అంశాలను మరింత వివరంగా చూద్దాం.

- పలు పార్టీల ప్రజాస్వామ్యంతో పోలిస్తే 'ఏక పార్టీ ప్రజాస్వామ్యం' మెరుగైన ప్రత్యామ్నాయంగా ఉండేదా?
- నిరసన, మార్పులకు సంబంధించి సామాజిక ఉద్యమాలకు అనువైన పరిస్థితులను పలు పార్టీల ప్రజాస్వామ్యం ఎలా దోహదం చేస్తుంది?

## 1977 ఎన్నికలు, అత్యవసర పరిస్థితికి ముగింపు

1977 జనవరిలో ఎన్నికలను ప్రకటించినప్పుడు అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. ఎన్నికలు జరుగుతాయని ఎవరూ ఆశించలేదు. రాజకీయ ఖైదీలందరినీ కూడా ఇందిరాగాంధి విడుదల చేశారు. దీనితో పాటు స్వేచ్ఛగా తిరగటం, ప్రచారం చేయటం, సమావేశం నిర్వహించటం వంటి వాటి మీద నిషేధం ఉన్న ప్రాంతాలలో నియంత్రణలను తొలగించారు. కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా అన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కలిసి పోటీ చెయ్యాలని నిర్ణయించాయి. కాంగ్రెస్(ఓ), స్వతంత్ర పార్టీ, భారతీయ జన సంఘ్, భారతీయ లోక్ దళ్, సోషలిస్టు పార్టీలు విలీనమయ్యి జనతాపార్టీగా ఏర్పడాలని నిర్ణయించాయి. జగ్జీవన్‌రాం వంటి ముఖ్యమైన కాంగ్రెస్ నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ వ్యతిరేక వేదికలో చేరారు. ఇతర ప్రధాన ప్రతిపక్ష పార్టీలయిన డిఎంకె, ఎస్ఎడి, సిపిఐ(ఎం) వంటివి తమ ఉనికిని కొనసాగించాలనీ, అయితే కాంగ్రెస్ వ్యతిరేక వేదికలో జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలనీ నిర్ణయించుకున్నాయి. కాంగ్రెస్ వ్యతిరేక, అత్యవసర పరిస్థితి వ్యతిరేక పార్టీలు అన్నీ ఒక తాటికిందకు వచ్చి ఎన్నికలలో పోటీ చేయటంలో జయప్రకాష్ నారాయణ్, ఆచార్య జెబి కృపలాని వంటి సీనియర్ నాయకులు ముఖ్యపాత్ర పోషించారు. సామాజిక, రాజకీయ అంశాలపై ఈ పార్టీలలో కొన్నింటికి పూర్తి విరుద్ధ భావాలు ఉన్నాయన్న విషయాన్ని ఇక్కడ గుర్తు ఉంచుకోవాలి.

భారతదేశ ప్రజాస్వామ్యానికి అది ఒక చారిత్రాత్మకమైన ఎన్నిక. మొదటిసారి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఓటమిని చవి చూసింది.

ఈ సమయంలోనే నీలం సంజీవరెడ్డి 1977 మార్చి 26న ఆరవ లోకసభకు స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వగా ఆయన భారత రాష్ట్రపతి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికై, 1977 జులై 25న భారత ఆరవ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశాడు. దీనితో రాజకీయ పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం ద్వారా పాలించడం అనే ఒక క్రొత్త ధోరణిని రాజకీయ చరిత్రలో ప్రారంభించాయని స్పష్టమౌతుంది. గొప్ప రాజనీతివేత్తలు అవలంభించిన ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యక్తిగత జీవితాలను అంగీకరిస్తూ వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రాధాన్యత ఇవ్వడం అనేది సాంప్రదాయిక పార్టీ రాజకీయాల్లో వచ్చిన ఒక మలుపు అని చెప్పవచ్చు. నీలం సంజీవరెడ్డి పాలనా కాలంలో, మొరార్జీ దేశాయ్, చరణ్‌సింగ్, ఇందిరాగాంధీ ప్రధాన మంత్రులుగా ఏర్పాటు చేసిన మూడు ప్రభుత్వాలతో పనిచేశారు.



*చిత్రం 19.1 : భారత 6వ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి*

గెలుపొందిన జనతా పార్టీ తన స్థానాన్ని సుస్థిర పరుచుకోటానికి తొమ్మిది రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను తొలగించింది. శాసన సభలలో ఆధిక్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను వాటి ఆ పార్టీ పార్లమెంటు ఎన్నికలలో ఓడిపోవటంతో వాటిని కేంద్ర ప్రభుత్వం తొలగించటం న్యాయమైనదేనా? కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కాబట్టి రాష్ట్రాలలో సైతం పాలించే హక్కుని కోల్పోయిందని జనతా పార్టీ సమర్థించు కుంది. ఆ రాష్ట్రాలలో తిరిగి ఎన్నికలు జరిగినప్పుడు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, బీహార్‌లలో జనతా పార్టీ, పశ్చిమ బెంగాల్‌లో సిపిఐ(ఎం), తమిళనాడులో డిఎంకె గెలవటంతో ఆ పార్టీ నిర్ణయం కొంతవరకు సరైనదేననిపించింది.

### 1970లలో కొన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు

**బిఎల్‌డి – భారతీయ లోక్ దళ్** – భారతీయ రైతులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అన్న సోషలిస్టులతో ఏర్పడిన పార్టీ, ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌లో ఉంది.

**కాంగ్రెస్ (ఓ)** – ఇందిరాగాంధి విధానాలను వ్యతిరేకించిన కాంగ్రెస్‌లోని సాంప్రదాయవాద వర్గం.

**సిపిఐ(ఎం) – భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)** – జాతీయ స్థాయి ఉన్న పార్టీ, పెను భూ సంస్కరణలకు, కార్మిక సంఘాలు, సోషలిస్టు విధానాలకు కృషి చేస్తున్న పార్టీ.

**డిఎంకె – ద్రవిడ మున్నేట్రకజగం** – ప్రధానంగా తమిళనాడులో ఉన్న పార్టీ, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్వయం ప్రతిపత్తి కోరే పార్టీ.

**జన సంఘ్** – హిందూ జాతీయతావాది పార్టీ, ప్రధానంగా, ఉత్తరాది రాష్ట్రాలకు పరిమితమై ఉంది.

**ఎస్ఎడి – శిరోమణి అకాలీ దళ్** – పంజాబ్‌కి పరిమితమై సిక్కుల కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న పార్టీ, గురుద్వారాల ఆధారంగా సంఘటితమై ఉంది. కాబట్టి దీనికి కొంత మతపరమైన స్వభావం ఉంది. ఇది కూడా రాష్ట్రాలకు మరింత స్వయం ప్రతిపత్తిని కోరిన పార్టీ.



చిత్రం 19.2 : మొదటి కాంగ్రెసేతర ప్రధానమంత్రియైన మొరార్జీ దేశాయి

ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛని పునరుద్ధరిస్తామన్న వాగ్దానంతో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అంతర్గత విభేదాల కారణంగా దాని పాలన ప్రభావితం అయ్యింది. అంతర్గత కీచులాటలకు, ఫిరాయింపులకు ఈ పాలన గుర్తుండిపోయింది. పార్టీలో అంతర్గత కుమ్ములాటల వల్ల మూడు సంవత్సరాలలోపే ప్రభుత్వం పడిపోయి 1980లో తాజా ఎన్నికల నిర్వహణకు దారితీసింది.

1980లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. వెంటనే తొమ్మిది రాష్ట్రాలలోని కాంగ్రెసేతర, జనతా ప్రభుత్వాలను రద్దు చేసి జనతాపార్టీ రీతిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయం సాధించింది.

జనతా పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు సమాఖ్య సూత్రాలను బలహీనపరిచి కేంద్రీకృత చర్యలకు మద్దతునిచ్చాయి. దీనితోపాటు దేశ సమైక్యతకు కొన్ని తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. అనేక రాష్ట్రాల ప్రజలు పరాయీకరణ భావనకు లోనయ్యి కేంద్రం నుంచి మరింత స్వయం ప్రతిపత్తిని, కొన్ని భారతదేశం నుంచి విడిపోటాన్ని కోరుకున్నాయి. జాతీయస్థాయిలో మరింత నిర్ణయాత్మకమైన పాత్ర, మరింత ఆర్థిక స్వయం ప్రతిపత్తి, రాష్ట్ర విషయాల్లో జోక్యం చేసుకోకపోవటం, గవర్నరు అధికారాల దుర్వినియోగం, ఇష్టమొచ్చినట్లు రాష్ట్రపతి పాలన విధించటం వంటి అంశాలతో కాంగ్రెసేతర ప్రాంతీయ రాజకీయ పార్టీలు (ఎన్ఏడి, డిఎంకె వంటివి) ఒక వేదికగా ఏర్పడ్డాయి.

### రాష్ట్రపతి పాలన

రాజ్యాంగంలోని 356 అధికరణం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాన్ని పాలించలేక పోతోందని గవర్నరు అభిప్రాయపడితే రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించమని, ఇంకా అవసరమైతే శాసన సభను రద్దు చెయ్యమని రాష్ట్రపతికి సిఫారసు చెయ్యవచ్చు. అప్పుడు ప్రధానమంత్రి సలహాతో రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రపతి తొలగించి పాలనా బాధ్యతలను చేపట్టమని రాష్ట్ర గవర్నరును కోరవచ్చు.

దీనికి సంబంధించి ఖచ్చితమైన మార్గదర్శకాలు రాజ్యాంగంలో లేనందున అనేక కేంద్ర ప్రభుత్వాలు తరచుగా 356వ అధికరణాన్ని రాష్ట్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న ఇతర ప్రతిపక్ష పార్టీలను వేధించడానికి, తొలగించడానికి దుర్వినియోగ పరిచేవి.

కేంద్ర ప్రభుత్వం 356 అధికరణాన్ని ప్రయోగించటానికి 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన కీలకమైన తీర్పులో ఖచ్చితమైన నియమాలను పేర్కొంది. అప్పటినుంచి, ఈ అధికారాన్ని దుర్వినియోగపరచటం అరుదయ్యింది.

- రాష్ట్రాలలో వేరే రాజకీయ పార్టీలకు చెందిన ప్రభుత్వాలు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని తొలగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రజాస్వామిక సూత్రాలకు ఇది ఎలా భంగం కలిగిస్తోందో చర్చించండి.

### ప్రాంతీయ ఆకాంక్షల ఆవిర్భావం

భారతదేశంలోని విభిన్న ప్రాంతాల్లో మరింత స్వయం ప్రతిపత్తి కోసం జరిగిన మూడు ఉద్యమాలను పరిశీలిద్దాం. ఇవి ఆంధ్రప్రదేశ్, అసోం, పంజాబు. వీటి మధ్య పోలికలు, తేడాలు గుర్తించండి. స్వయం ప్రతిపత్తికి సంబంధించి మూడు రకాల ధోరణులకు ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి.

## ఆంధ్రప్రదేశ్



చిత్రం 19.3 : ఎన్.టి. రామారావు

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులను కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం తరుచు మారుస్తుండటం, పైనుంచి నాయకులను రుద్దటం ఇక్కడి ప్రజలకు నచ్చలేదు. జాతీయ కాంగ్రెస్ నాయకత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ నాయకత్వానికి తగినంత గౌరవం లభించటంలేదని భావించసాగారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి అవమానం జరిగిందని భావించసాగారు. జనాదరణ ఉన్న సినీ నటుడైన ఎన్.టి. రామారావు (ఎన్‌టిఆర్) ఈ అంశాన్ని చేపట్టాడు. 1982లో తన 60వ పుట్టినరోజునాడు తెలుగు దేశం పార్టీ (తెదేపా)ని స్థాపించాడు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెదేపా కృషి చేస్తుందని అతడు చెప్పాడు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ క్రిందిస్థాయి కార్యాలయంగా పరిగణించటానికి వీలు లేదని అతడు వాదించాడు. పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, మద్యపాన నిషేధం వంటి పేదల సంక్షేమ పథకాలను కూడా అతడు ప్రకటించాడు. ఈ జనాకర్షక చర్యల వల్ల 1982 ఎన్నికలలో తెదేపా ఘన విజయం సాధించింది. అయితే అతడు 1984లో ఆపరేషను కోసమని అమెరికాకి వెళ్లినప్పుడు గవర్నరు అతడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశాడు. తెదేపా నుంచి కాంగ్రెస్‌కి పార్టీ ఫిరాయించిన ఎన్. భాస్కరరావుని ముఖ్యమంత్రిగా గవర్నరు ఆహ్వానించాడు. అమెరికానుంచి తిరిగి వచ్చిన తరువాత ఎన్‌టిఆర్ గవర్నరు చర్యను సవాలుచేసి శాసనసభ్యులలో మెజారిటీ మద్దతు తనకే ఉందని నిరూపించాడు. ఒక నెల రోజుల ప్రజా ఉద్యమం తరువాత కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నరును నియమించింది. అతడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్.టి. రామారావుని తిరిగి నియమించాడు. తన ప్రభుత్వాన్ని అకారణంగా తొలగించటంపై చేసిన పోరాటంలో ఎన్‌టిఆర్‌కి ఇతర రాష్ట్రాలలో అధికారంలో ఉన్న సిపిఐ(ఎం), డిఎంకె, ఎస్‌ఎడి, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి అనేక పార్టీలు మద్దతునిచ్చాయి.

- ఎన్‌టిఆర్ రాజకీయాలలో ఈ దిగువ అంశాల ప్రాముఖ్యతను చర్చించండి.
  i. సినీ హీరోగా ఉన్న నేపథ్యం
  ii. రాష్ట్ర ఆత్మగౌరవం కోసం పోరాటం
  iii. పేదలకు జనాకర్షక సంక్షేమ పథకాలు
  iv. ఇతర ప్రాంతీయ పార్టీలతో సంబంధాలు

## అసోం (అస్సాం) ఉద్యమం

స్వయం ప్రతిపత్తికి ఇదే రకమైన కానీ ఇంకా బలమైన ఉద్యమం అసోంలో జరుగుతోంది. అసోంలో అస్సామీ భాషే కాకుండా బెంగాలీ భాష కూడా ఎక్కువగా మాట్లాడతారు. బ్రిటిష్‌పాలన నాటి నుంచి రాష్ట్ర పరిపాలనలోని కింది, మధ్యస్థాయి ఉద్యోగాలలో బెంగాలీలు ఉండేవాళ్లు. బెంగాలీ అధికారులు తమని సమానులుగా కాకుండా రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారని అస్సామీయులు భావించే వాళ్లు. స్వాతంత్ర్యం తరువాత బెంగాలీ మాట్లాడే ప్రజలు పెద్ద సంఖ్యలో అసోంలో స్థిరపడసాగారు. ఇవన్నీ చాలవన్నట్లు సరిహద్దు ఆవల బంగ్లాదేశ్‌నుంచి ఎంతోమంది వలస రాసాగారు. పొరుగు దేశంలో రాజకీయ అస్థిరత, లేదా ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు వేలాది ప్రజలు రాష్ట్రంలోకి వలస వచ్చి

స్థానికులకు ఇబ్బంది కలిగించసాగారు. స్థానిక ప్రజలు తమ సాంస్కృతిక మూలాలు కోల్పోతామనీ, అంతేకాకుండా 'బయటివాళ్లు' ఎక్కువైపోయి జనాభాలో తమ సంఖ్య తగ్గుతుందనీ భయపడసాగారు.

ప్రజలలో ఉన్న ఈ అసంతృప్తి 1970లలో సామాజిక ఉద్యమంగా మారింది. అఖిల అసోం విద్యార్థి సంఘం (ఎఎఎస్‌యు) ఈ ఉద్యమానికి ముందు నిలిచింది. ఈ సంఘం రాష్ట్రమంతా విస్తరించింది, ప్రత్యేకించి యువతలో దానికెంతో ఆదరణ లభించింది. తన కోరికలను– ప్రధానంగా బయటవాళ్లను తీసెయ్యమంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో సమ్మెలు, ఆందోళనలు, పాదయాత్రలు నిర్వహించింది.

సంస్కృతి, జనాభా అంశాలే కాకుండా ఈ ఉద్యమానికి ఆర్థిక కోణం కూడా ఉంది. వ్యాపారం, ఇతర సంస్థలు అస్సామేతర ప్రజల చేతుల్లో ఉండేవి. రాష్ట్రంలోని ప్రధాన వనరులైన టీ, చమురు వల్ల స్థానికులకు ప్రయోజనం ఒనగూరటం లేదు. టీ పరిశ్రమ ప్రధానంగా కోల్‌కతాలో ఉంది. చమురు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఉన్నప్పటికీ స్థానికులలో చాలా కొద్దిమంది మాత్రమే అందులో ఉన్నారు. అంతేకాకుండా చమురుని రాష్ట్రం నుంచి తరలించి వేరేచోట్ల శుద్ధి చేస్తున్నారు. వీటన్నిటి సారాంశం ఏమిటంటే అసోంని 'అంతర్గత వలస ప్రాంతం'గా పరిగణిస్తున్నారని, దీనిని ఆపివేయాలని ప్రజలు ఉద్యమించారు. ఉపాధిలో స్థానిక ప్రజలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం, "బయటివాళ్ల"ను తొలగించటం, వనరులను స్థానిక ప్రజల ప్రయోజనం కోసం వినియోగించటం అన్నవి ప్రధాన కోరికలు.

ఈ కోరికలు ప్రజల్లో మతపరమైన భేదాలను సృష్టించాయి. ఎందుకంటే పొరుగు దేశంనుంచి వచ్చిన బయటివాళ్లల్లో ఎక్కువమంది ముస్లింలు ఉన్నారు. ఉద్యమం బెంగాలీ వ్యతిరేక, వామపక్ష వ్యతిరేక (పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉంది), అస్సామేతర ప్రజల పట్ల వ్యతిరేకత, అంతిమంగా భారతదేశ వ్యతిరేకతను సంతరించుకోవటంతో పరిస్థితులు విషమించాయి. హింస, అల్లర్లు తీవ్ర రూపం దాల్చటంతో కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాల్సి వచ్చింది. ఆందోళనకారులు, కేంద్ర ప్రభుత్వం మధ్య మూడు సంవత్సరాల చర్చల తరువాత ఒక ఒప్పందానికి వచ్చారు. 1984లో రాజీవ్‌గాంధి చొరవతో కేంద్ర ప్రభుత్వం, ఎఎఎస్‌యు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేలా దోహద పడటానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా తన పదవీకాలం ఉండగానే ఉదారంగా దిగిపోయి ఎన్నికలకు అవకాశం కల్పించింది. ఈ ఎన్నికలలో అసోం గణ పరిషత్ (ఎజిపి – ఎఎఎస్‌యుకి అనుబంధంగా ఏర్పడిన పార్టీ) అధికారంలోకి వచ్చింది.

అయితే, ఈ రాజకీయ మార్పు వల్ల ఈ ఉద్యమానికి కారణమైన దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కాలేదు. దౌత్యకారణాలు, భౌగోళిక కారణాల వల్ల (కొండలు, నదులు ఉండటం వల్ల అంతటా కంచె వెయ్యటం సాధ్యంకాదు) బంగ్లాదేశ్‌తో సరిహద్దును మూసి వెయ్యటం సాధ్యం కాలేదు. ఎప్పుడో వచ్చి స్థిరపడిన బెంగాలీలను, తాజాగా వలస వచ్చిన వాళ్లను గుర్తించటం సాధ్యం కాలేదు, వలస వచ్చిన వాళ్లను వెనక్కి పంపించటం సాధ్యం కాలేదు. అదే సమయంలో అస్థిత్వ మూలాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వటంతో అసోంలో బోడోలు, ఖాసీలు, మిజోలు, కర్బీలు వంటి తెగలపై వ్యతిరేక ప్రభావం పడింది. వీళ్లల్లో అనేకులు తమకు కూడా స్వయం ప్రతిపత్తి కావాలని అడగసాగారు. వాళ్లు తమ హక్కులను, కోరికలను చాటటం మొదలుపెట్టి తమ ప్రాంతాలనుంచి బయటివాళ్లను తరిమెయ్యాలనుకున్నారు. దీంతో అసోంలోని పలుప్రాంతాలలో అల్పసంఖ్యాక తెగల ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించటానికి పూనుకున్నారు. ఒక తెగ హింసాత్మక చర్యలను ఎదుర్కోటానికి ప్రభుత్వం తరుచు రెండవ తెగను

రెచ్చగొట్టటం, లేదా ఆయుధాలు సమకూర్చటం వంటివి చేసింది. దీంతో ఘర్షణలు పరిష్కరింపబడటానికి బదులుగా అవి కొనసాగటానికే ప్రభుత్వం దోహదపడింది.

ఘర్షణలు తగ్గించి, శాంతిని నెలకొల్పటానికి ఈ ప్రాంతాలలో సాయుధ బలగాలను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నియమించసాగింది. ఈశాన్య ప్రాంతంలో సాయుధ దళాలను ప్రయోగించటానికి మూడు అంశాలు కారణమయ్యాయి: మొదటిది ఇది చైనా, బర్మా (ప్రస్తుతం మ్యాన్‌మార్), బంగ్లాదేశ్‌లతో సున్నిత సరిహద్దు ప్రాంతంగా ఉండటం; రెండవది తిరుగుబాటు బృందాలు తరచు భారతదేశం నుంచి విడిపోవాలని కోరుకోవటం; మూడవది అల్ప సంఖ్యాక వర్గాలపై తిరుగుబాటు బృందాలు పెద్ద ఎత్తున హింసాత్మక దాడులకు పాల్పడటం. భారత సైనిక దళాలు ఈ సమస్యాత్మక ప్రాంతంలోకి ప్రవేశించటంతో పౌరహక్కులు, స్వేచ్ఛ రద్దయ్యాయి. సైన్యానికి అసాధారణ అధికారాలు కట్టబెట్టారు. ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పటానికి ఇదొక్కటే మార్గమని ప్రభుత్వం భావించింది.

బెంగాలీలు, అస్సామీల మధ్య మొదలయిన ఈ సమస్య సున్నితంగా తయారయి, సంక్లిష్ట అంతః జాతి ఘర్షణలకు దారితీసింది. జాతి అస్థిత్వాలు, జాతుల సమస్య వంటి వాటిల్లో సంకుచితదృష్టి, సత్వర పరిష్కారాలు కాకుండా విశాల దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉంది.

- ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టిఆర్ ఉద్యమానికి అసోం ఉద్యమానికి పోలికలు, తేడాలు ఏమిటి?
- ఈ అంశాలపై మీ తరగతిలో చర్చ నిర్వహించండి:
  ఒక ప్రాంతంలో ఒకే సమూహానికి చెందిన ప్రజలు ఉండాలి, అన్ని ఉద్యోగాలు, అన్ని వ్యాపారాలు ఆ సమూహానికి చెందిన ప్రజల చేతిలోనే ఉండాలి. లేదా భారతదేశ ప్రజలందరూ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి స్వేచ్ఛగా వెళ్లగలగాలి, తాము ఎంచుకున్న ప్రాంతంలో స్థిరపడటానికి, పని చెయ్యటానికి అవకాశం ఉండాలి.
- ప్రజలు స్వేచ్ఛగా సంచరించే విధానం ఉంటే బయటి నుంచి వచ్చిన ధనిక, శక్తిమంతులైన వాళ్లు భూమి, వనరులు మొత్తాన్ని కొనేసి అసలు ఆ ప్రాంతంలోని వాళ్లను పేదలు, నిర్భాగ్యులుగా మిగులుస్తారా?

## పంజాబ్ ఆందోళన

భారతదేశానికి ఇంకొకవైపున పంజాబు రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తికి మరొక ఉద్యమం రూపు దిద్దుకుంటోంది. ఇక్కడ కూడా అత్యధిక శాతం ప్రజలు మాట్లాడే భాష, మతమూ ఆధారంగా ప్రజల సమీకరణ జరిగింది. ఇక్కడ కూడా దేశాభివృద్ధిలో రాష్ట్రం పాత్రను విస్మరిస్తున్నారన్నదే పంజాబ్ ఆరోపణ. రాష్ట్రం ఏర్పడినప్పుడు తమకు అన్యాయం జరిగిందని వాళ్లు భావిస్తున్నారు. రాజధాని నగరమైన చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతంగా కాక తమ రాష్ట్రానికే చెందాలని కోరసాగారు. భాక్రానంగల్ ఆనకట్ట నుంచి ఎక్కువ నీళ్లు కావాలని, సైన్యంలోకి ఎక్కువ మంది సిక్కులను తీసుకోవాలని కూడా కోరసాగారు.

కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఉండగా 1978లో అకాలీ దళ్ కొన్ని తీర్మానాలు చేసి వాటిని అమలు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. రాజ్యాంగాన్ని సవరించి అధికార వికేంద్రీకరణ చేసి, రాష్ట్రాలకు ఎక్కువ అధికారం ఇవ్వాలి అన్న అంశం దాని ముఖ్యమైన కోరిక. తీర్మానం ఇలా పేర్కొంటోంది, "విభిన్న భాష, సాంస్కృతిక వర్గాల, మతపరంగా అల్ప సంఖ్యాక వర్గాల, లక్షలాది ప్రజల కోరికలను జనతా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని దేశ ఐక్యత, సమగ్రతకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా

చెయ్యటానికి నిజమైన, అర్థవంతమైన సమాఖ్య సూత్రాల ఆధారంగా దేశ రాజ్యాంగ నిర్మాణాన్ని మార్చవలసిందిగా శిరోమణి అకాలీ దళ్ కోరుతోంది. అంతేకాకుండా దీని వల్ల రాష్ట్రాలు తమ తమ ప్రాంతాల్లో తమ అధికారాలను ఉపయోగించి భారతదేశ ప్రజల ప్రగతి, సౌభాగ్యాలలో అర్థవంతమైన పాత్ర పోషించగలుగుతాయి."

ఎస్ఎడి, కాంగ్రెస్‌ల మధ్య ఎన్నికల పోటీ పెరగటంతో పరిస్థితులు మరింతగా విషమించాయి. 1980లో అకాలీ ప్రభుత్వాన్ని రద్దుచేసి తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో సిక్కులు వివక్షతకు గురవుతున్నారన్న భావన పెరిగి ఉద్రిక్త వాతావరణం మరింత తీవ్రరూపం దాల్చింది. వరసగా అనేక అవాంఛిత సంఘటనలు సంభవించటంతో సిక్కులు, కేంద్ర ప్రభుత్వాల మధ్య దూరం, అపోహలు పెరిగాయి. తీవ్రవాద సిక్కుల బృందానికి నాయకుడుగా ఉన్న భింద్రేన్‌వాలా వేర్పాటు వాదాన్ని ప్రచారం చేస్తూ సిక్కులకు ప్రత్యేక దేశం ఖలిస్తాన్ కావాలని కోరసాగాడు. ఈ కాలంలో రాష్ట్రం తీవ్ర కల్లోలానికి లోనయ్యింది. తీవ్రవాదులు సిక్కులమీదే కాకుండా పంజాబ్‌లోని ఇతర మత ప్రజలపై కూడా సాంప్రదాయ, ఛాందసవాద జీవన విధానాన్ని అమలు చెయ్యటానికి ప్రయత్నించారు. ఈ ఘర్షణ మతపరమైన రంగును కూడా సంతరించుకుంది. సిక్కు మతానికి చెందని ప్రజలపై దాడులు జరిగాయి. వీటన్నిటి అంతిమ పర్యవసానంగా సిక్కు వేర్పాటు బృందాలు సిక్కుల పవిత్ర స్థలమైన గోల్డెన్ టెంపుల్‌ని ఆక్రమించుకోగా వాళ్లని అక్కడినుంచి ఖాళీ చెయ్యటానికి సైన్యం జోక్యం చేసుకోవలసి వచ్చింది. దీంతో తమ పుణ్యస్థలం అపవిత్రమయ్యిందని సిక్కులు భావించటంతో వాళ్ల విజాతిభావం మరింత తీవ్రమయ్యింది.




*చిత్రం 19.4: భారతదేశం 1970లు, 1980ల మధ్య సాంకేతిక, సహకార రంగాల వంటి వాటిల్లో ఎన్నో విజయాలను సాధించింది. శ్రీహరికోట నుంచి ఉపగ్రహ ప్రయోగం, అమూల్ సహకార సంఘం వంటివి కొన్ని పైన ఉన్నాయి.*

వీటన్నిటి కారణంగా 1984లో ప్రధానమంత్రి ఇందిరాగాంధి హత్యకు గురయ్యింది. దీని తరువాత అల్లర్లు చెలరేగి, ప్రత్యేకించి ఢిల్లీలో వేలాదిమంది సిక్కులపై దాడులు చేసి, వాళ్ల ఆస్తులను విధ్వంసం చేసి, హత్య చేశారు. ఈ హింసను ఆపటానికి పాలనాయంత్రాంగం స్పందించినట్లు అనిపించలేదు.

రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయిన తరువాత ఎస్ఎడితో చర్చలు జరిపి ఎస్ఎడి అధ్యక్షుడు సంత్ లాంగోవాల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. పంజాబ్‌లో తాజాగా ఎన్నికలు నిర్వహించి ఎస్ఎడి గెలిచినప్పటికీ తీవ్రవాదులు లాంగోవాల్‌ని హత్య చెయ్యటంతో శాంతి ఎక్కువ కాలం నిలవలేదు.

1986 ఏప్రిల్‌లో అకల్ తఖ్త్ వద్ద సమావేశంలో ఖలిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించారు. స్వతంత్ర దేశం కోసం పోరాడుతున్నామన్న అనేక బృందాలు సాయుధ దళాలను ఏర్పరిచి తీవ్రవాద చర్యలకు పాల్పడసాగాయి. ఈ బృందాలకు పాకిస్తాన్ ప్రభుత్వం క్రియాశీలక మద్దతు ఇస్తోందని భారత ప్రభుత్వం పేర్కొనసాగింది. పంజాబ్‌లో ఒక దశాబ్దకాలం పాటు హింస, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ తిరుగుబాటు కాలంలో సిక్కు తీవ్రవాదులు పోలీసులతోనూ, ఇతర మత బృందాలతోనూ తలపడ్డారు. తీవ్రవాదులు నిర్దేశించిన ప్రవర్తనను పాటించని పత్రికారులు, రాజకీయ నాయకులు, కళాకారులు, కార్యకర్తలు హత్యలకు లోనయ్యారు. పౌరుల ప్రాణనష్టం పెద్ద ఎత్తున ఉండేలా విచక్షణారహిత దాడులకు పాల్పడ్డారు: రైళ్లను పట్టాలు తప్పించటం, మార్కెట్లు, రెస్టారెంట్లు, పంజాబ్–ఢిల్లీ మధ్య పౌరులుండే ప్రాంతాలలో బాంబు పేలుళ్లు వంటి చర్యలు చేపట్టారు. ఒక్క 1991 సంవత్సరంలోనే వెయ్యిమంది దాకా చనిపోయారు. నిధుల సేకరణకు తీవ్రవాదులు పెద్ద ఎత్తున అపహరణలకు, బలవంతపు వసూళ్లకు పాల్పడసాగారు. వీటన్నిటి ఫలితంగా తీవ్రవాదులు సిక్కులతో సహా పంజాబీ ప్రజలకు దూరం కాసాగారు. కాలక్రమంలో పోలీసు చర్యలు తీవ్రవాద నడ్డి విరచగా, ప్రజల సానుభూతి కోల్పోయిన నేపథ్యంలో 1990ల చివరినాటికి అంతిమంగా పంజాబ్‌లో శాంతి వెలసిల్లింది.

అయితే, పంజాబ్‌లో తీవ్రవాదాన్ని అణచివెయ్యటానికి ప్రభుత్వం చాలా తీవ్ర పద్ధతులను ఉపయోగించింది. వీటిల్లో అనేకం పౌరుల రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించాయని భావించారు. తీవ్రవాద కార్యకలాపాల వల్ల రాజ్యాంగ యంత్రాంగమే కుప్పకూలే అంచున ఉండటంతో మానవ హక్కుల, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన సమర్థనీయమే అని చాలా మంది పరిశీలకులు భావించారు. తీవ్రవాదులపై వ్యతిరేక తీర్పులు ఇస్తే తమపై కూడా దాడులు జరుగుతాయని న్యాయమూర్తులు భయపడసాగారు. ఇతర పరిశీలకులు ప్రభుత్వం రాజ్యాంగేతర శక్తులను వినియోగించటం సరికాదని, ఇది దీర్ఘకాలంలో రాజ్యతంత్రంలో అప్రజాస్వామిక ధోరణులు బలపడటానికి దోహదం చేస్తుందని భావించారు.

- సిక్కుల వేర్పాటువాదం, తీవ్రవాదాలను ప్రేరేపించటంలో 1984లో ఢిల్లీలో చోటు చేసుకున్న సిక్కు వ్యతిరేక అల్లర్ల పాత్ర ఏమిటి?
- అసోం, పంజాబ్ ఉద్యమాల మధ్య పోలికలు, తేడాలను పేర్కొనండి. మన రాజకీయ వ్యవస్థకు అవి ఎటువంటి సవాళ్లను విసిరాయి?
- ఈ రెండు సమస్యలతో ప్రభుత్వం వ్యవహరించిన తీరు మన ప్రజాస్వామిక రాజతంత్రాన్ని బలపరిచిందా, బలహీనపరిచిందా?

## రాజీవ్‌గాంధీ కాలంలో కొత్త చర్యలు



చిత్రం 19.5 : రాజీవ్ గాంధీ

రాజీవ్ గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ అంతకు ముందెన్నడూ లేనంతగా ఎన్నికలలో ఘనవిజయం సాధించింది. రాజీవ్‌గాంధి పంజాబ్, అసోం, మిజోరాంలలో, పొరుగుదేశమైన శ్రీలంకలో కూడా శాంతి ప్రక్రియలు మొదలుపెట్టాడు. శ్రీలంకలో ఘర్షణ పడుతున్న ఇరుపక్షాల మధ్య (వేర్పాటువాద తమిళులు, శ్రీలంక ప్రభుత్వం) శాంతి నెలకొల్పటానికి భారతదేశం తన సైన్యాన్ని పంపించింది. అయితే దీనికి అటు తమిళులు, ఇటు శ్రీలంక ప్రభుత్వమూ అంగీకరించకపోవటం వల్ల ఇదొక దుస్సాహస చర్యగా పరిణమించింది. అంతిమంగా భారతదేశం తన సైన్యాన్ని 1989లో వెనక్కి తీసేసుకుంది.

దేశంలో అభివృద్ధిపై దృష్టి పెట్టినప్పటికీ అది నిజమైన లబ్ధిదారులకు చేరటంలేదని రాజీవ్‌గాంధి గుర్తించాడు. ప్రఖ్యాతిగాంచిన ఒక ఉపన్యాసంలో పేదలకోసం ఖర్చు పెడుతున్న ప్రతి రూపాయిలో 15 పైసలు కూడా వారిని చేరటంలేదని రాజీవ్ గాంధి అన్నాడు. అభివృద్ధికి కేటాయింపులు ఎంతగానో పెరిగినప్పటికీ పేదల పరిస్థితి మాత్రం అలాగే ఉండిపోయింది. పేదరికం, అంచులకు నెట్టబడిన పేద ప్రజలు, మహిళలు, దళితులు, గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందుబాటులో ఉండటం లేదు. పనులు జరుగుతున్న విధానంలో పెనుమార్పులు తీసుకు రావాలని కూడా అతడు గ్రహించాడు. ఇందుకు పంచాయితీరాజ్ సంస్థలను క్రియాశీలకంగా మలిచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాలనలో భాగస్వాములు అయ్యేలా చెయ్యటం మంచి పద్ధతని రాజీవ్ గాంధి భావించాడు. అయితే



చిత్రం 19.6 : కొత్త ఢిల్లీ టెలిఫోన్ ఎక్స్ఛేంజిలో పనిచేస్తున్న ఆపరేటర్లు, 1950లలోని చిత్రం

- ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే రాజీవ్ గాంధి దేశానికి ఒనగూర్చిన శాశ్వత ప్రయోజనాలు ఏమిటి?
- తమ కోసం ఉద్దేశించిన పథకాల వల్ల పేదప్రజలు తరచు ఎందుకు ప్రయోజనం పొందటం లేదో తరగతిలో చర్చించండి. ఇటువంటి ప్రయోజనాలు నిజంగా పేదవాళ్లకు చేరాలంటే ఏ దీర్ఘకాల చర్యలు తీసుకోవాలి?
- మీ పాఠశాల విద్యార్థులకు అందవలసిన ప్రయోజనాల జాబితా తయారు చెయ్యండి. ఇవి వాళ్లకు సరిగా అందుతున్నాయా? తరగతి గదిలోనూ, బయట క్రీడా మైదానాలలోనూ, ఇంటివద్ద చర్చించండి.

అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రత్యేకించి ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఇది తమ ద్వారా కాకుండా నేరుగా జిల్లాలకు చేరటానికి, తమ అధికారాలు తగ్గించటానికి ఉద్దేశించిన చర్యగా భావించారు.

ఆర్థికరంగంలో కూడా రాజీవ్ గాంధి భిన్న పంథాని అనుసరించటానికి ప్రయత్నించాడు. 1985లో అతడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లో అమలులో ఉన్న కొన్ని నియంత్రణలను, పరిమితులను తొలగించి సరళీకృత ఆర్థిక విధానంవైపు పయనం మొదలుపెట్టాడు.

ప్రపంచంలో ముందుకొస్తున్న కొత్త సాంకేతిక విజ్ఞానాలను ప్రత్యేకించి కంప్యూటరు, టెలికమ్యూనికేషన్ సాంకేతిక విజ్ఞానాన్ని భారతదేశం అవలంబించాలని రాజీవ్ గాంధి గట్టిగా నమ్మాడు. అతడు భారతదేశంలో 'టెలికం విప్లవం' అనబడుతున్న దానిని ఆరంభించాడు. ఉపగ్రహ సాంకేతిక విజ్ఞానంతో దేశంలో టెలిఫోనిక్ నెట్‌వర్క్ వేగంగా విస్తరించటానికి ఇది దోహదపడింది.

## మతతత్వం, ఉన్నత స్థానాలలో అవినీతి పెరుగుదల

దేశవిభజన సమయంలో ఘోరాల తరువాత రాజకీయ రంగం నుంచి మతాన్ని దూరంగా ఉంచటానికి కొంత ప్రయత్నం జరిగింది. అయితే ఆ తరువాత కాలం మత ధోరణి ఉన్న కొత్త రాజకీయ సమీకరణను చవిచూసింది. రాజకీయ ఉద్దేశాలకు మతాన్ని వాడుకోవటం, ప్రభుత్వ పక్షపాత ధోరణి కారణంగా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీసి దేశ ఐక్యత, సమగ్రతలనే ప్రశ్నార్థకంగా మార్చింది.

### ప్రధానమంత్రి క్షమాపణ

రాజ్యసభలో డా॥ మన్‌మోహన్ సింగ్ ప్రకటన–

... 1984లో జరిగిన ఈ మహా జాతీయ విపత్తులో నాలుగు వేలమంది చంపబడ్డారు. ఒకే దేశంగా కలిసి పనిచేస్తున్న సందర్భంలో ఇటువంటి ఘోర విషాదాలు దేశంలో తిరిగి ఎన్నడూ జరగకుండా కొత్త దారులు కనుక్కోటానికి ప్రయత్నించాలి. ... ఒక్క సిక్కు ప్రజలకే కాకుండా మొత్తం భారతదేశానికి క్షమాపణలు చెప్పటానికి నేను తటపటాయించను, ఎందుకంటే 1984లో జరిగింది మన రాజ్యాంగంలో పొందుపరిచిన దానికి, జాతి అన్న భావనకు పూర్తి వ్యతిరేకమయినది. మా ప్రభుత్వం తరఫున, ప్రజలందరి తరఫున ఇటువంటి ఘటన జరిగినందుకు నేను సిగ్గుతో తల వంచుకుంటున్నాను. అయితే దేశ వ్యవహారాల్లో శిఖరాలూ ఉంటాయి, లోయలు ఉంటాయి. గతం మనతో ఉంది, దానిని తిరగరాయలేం. కానీ మానవులంగా మనందరికీ మెరుగైన భవిష్యత్తును రూపొందించగల సామర్థ్యం, దృఢ చిత్తత మనకి ఉన్నాయి...

(pmindia.mic.co/Rs%20 speech.pdf) – 2005 ఆగస్టు 11.

- ఈ ఉపన్యాసంలోని ప్రధాన సందేశం ఏమిటి?
- ఈ ఉపన్యాసం ఏ సంకేతాలను పంపిస్తోంది?
- ప్రధానమంత్రి ఈ ఉపన్యాసం చెయ్యటంలోని ప్రాముఖ్యత ఏమిటి?

భర్తనుంచి విడాకులు పొందిన షా బానో అన్న మహిళ వేసిన కేసులో 1985లో సుప్రీంకోర్టు ఆమె మాజీ భర్త ఆమెకు భరణం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. ప్రగతిశీల ముస్లిములు ఈ తీర్పును స్వాగతించారు. అయితే ఇతరులు ఈ తీర్పు ఇస్లామిక్ చట్టంలో జోక్యం చేసుకుంటోందని, దీనిని

అనుమతిస్తే తమ మత జీవితంలో జోక్యం మరింత పెరుగుతుందని నిరసనలు చేపట్టారు. ఏక పక్షంగా భర్తలతో విడాకులు ఇవ్వబడి అన్యాయానికి గురవుతున్న మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఇది అరికడుతుందని మహిళా ఉద్యమ నాయకులు, ముస్లిం సమాజంలో సంస్కరణలు కోరుకుంటున్న సభ్యులు వాదించసాగారు. ఛాందసవాద వర్గాల ఒత్తిడికి లోనైన ప్రభుత్వం 1986లో కొత్త చట్టం చేసింది. దీని ప్రకారం ముస్లిం భర్తలకు ఎటువంటి బాధ్యత లేకుండా చేసి విడాకులు పొందిన మహిళలకు మూడు నెలలపాటు ముస్లిం మత సంస్థల భరణం ఇస్తే సరిపోతుంది. ఈ చర్య ముస్లిం మహిళల ప్రయోజనాలను కాదని మత ఛాందసవాదులకు తల ఒగ్గిందని చాలామంది భావించారు.

అదే సమయంలో అయోధ్యలో వివాదాస్పద కట్టడమైన బాబ్రీ మసీదు ఉన్న స్థానంలో రాముడికి గుడి కట్టాలని కొంతమంది హిందువులు ఉద్యమం మొదలుపెట్టారు. అది రాముని జన్మస్థలం అని, అంతకు ముందు అక్కడ ఉన్న గుడిని పడగొట్టి మసీదు కట్టారని వాళ్ల వాదన. బాబ్రీ మసీదు నిర్వాహకులు ఇది నిజంకాదని, ఇది ముస్లిముల ప్రార్థనా స్థలమని పేర్కొన్నారు. ఈ వివాదం కొంత కాలంగా సాగుతోంది. అంతిమ నిర్ణయం తీసుకునేదాకా సంవత్సరంలో ఒక రోజు తప్పించి మసీదును మూసి ఉంచాలని కోర్టు ఆదేశించింది. 1986లో కోర్టు తీర్పు ఇస్తూ మసీదుని సంవత్సరం పొడవునా తెరిచి ఉంచవచ్చని, హిందువులను రోజువారీ పూజలకు అనుమతించాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఆమోదించినందువల్లే ఇది జరిగి ఉంటుందని చాలామంది అభిప్రాయపడ్డారు. మసీదుని గుడిగా మార్చాలనుకుంటున్న వాళ్లు మరింతమంది ప్రజలను సమీకరించటానికి గుడిని తెరవటం సహకరించింది.

రాజకీయ పార్టీలు ప్రజలలో తమ ఆదరణను కోల్పోతున్నాయని చాలామంది పరిశీలకులకు అనిపించసాగింది. అనేక అంశాలపై రాజకీయేతర నాయకత్వం కింద అనేక ప్రజా ఉద్యమాలు చెలరేగసాగాయి. మార్కెటు కోసం ఉత్పత్తి చేస్తున్న రైతులు వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరల కోసం, డీజిలు, రసాయనిక ఎరువులు, విద్యుత్తు వంటి ఉత్పాదకాలపై సబ్సిడీలకోసం పోరాడసాగారు. ఉత్తరప్రదేశ్, హర్యానాలోని రైతులు మహేంద్ర సింగ్ తికాయత్ నేతృత్వంలో పోరాటం చేస్తుండగా మహారాష్ట్రలోని రైతులు శరద్ జోషి నాయకత్వంలో పోరాడసాగారు. అనేక రాష్ట్రాలలో ఆనకట్టలు, గనుల వంటి అభివృద్ధి పథకాల వల్ల నిర్వాసితులవుతున్న గిరిజనులు, రైతులు అనేక రాష్ట్రాలలో ఉద్యమించసాగారు. జనాదరణ కోల్పోతున్న జాతీయ రాజకీయ పార్టీలు ఎన్నికలలో మద్దతుకోసం హిందూ, ముస్లిం మతభావనలకు తల ఒగ్గసాగారని పరిశీలకులు భావించసాగారు. అయితే దీనివల్ల దేశ లౌకిక స్ఫూర్తి దెబ్బతిని, తరువాత దశాబ్దంలో మత తత్వ రాజకీయాలకు అవకాశం కల్పించింది.

ఇదే సమయంలో భారతీయ సైన్యానికి శతఘ్నులు సరఫరా చేసిన స్వీడిష్ ఉత్పత్తిదారుల ద్వారా అనేక మంది నాయకులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ముడుపులు ముట్టాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు ఖచ్చితంగా నిరూపింపబడక పోయినప్పటికీ మంత్రివర్గంలోని మాజీ మంత్రులైన విపి సింగ్ వంటి కొంతమంది నాయకత్వంలో బలమైన ఉద్యమం సాగింది. ఆ తరువాత 1989లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసేతర రాజకీయ శక్తులకు పరిపాలన, రాజకీయ రంగాలలో అవినీతి అన్నది ప్రధాన ప్రచార అంశం అయ్యింది. తమ మధ్య విభేదాలతో సంబంధం లేకుండా కాంగ్రెసేతర రాజకీయ పార్టీలు ఏకం కావటంతో కాంగ్రెస్‌కి గెలవటం కష్టమైపోయింది. అన్నిటికంటే ఎక్కువ సీట్లు కాంగ్రెస్‌కే

వచ్చినప్పటికీ అది ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే స్థితిలో లేదు. విపి సింగ్ నేతృత్వంలోని జనతా దళ్‌తో మొదటి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది.

## సంకీర్ణ రాజకీయాల శకం

1990ల కాలంలో స్వాతంత్ర్యానంతర భారతదేశంలో చాలా కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పోటీతో కూడిన బహుళపార్టీ వ్యవస్థకు మారటంతో మెజారిటీ స్థానాలు గెలిచి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి ఏ ఒక్క పార్టీకి లేదు. 1989 నుంచి జాతీయస్థాయిలో ఏర్పడిన ప్రభుత్వాలన్నీ సంకీర్ణ/ మైనారిటీ ప్రభుత్వాలే. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యటానికి అనేక జాతీయ, ప్రాంతీయ పార్టీలు కలవవలసి వచ్చేది. దీనర్థం అనేక పార్టీల రాజకీయ సిద్ధాంతాలను, కార్యక్రమాలను కలుపుకుని కనీస ఒప్పందాలకు రావలసి వచ్చేది. దాంతో ఏ ఒక్క పార్టీ తన పూర్తి పంథాను కొనసాగించటానికి వీలులేక కొంతవరకు తగ్గించుకోవలసి వచ్చేది. దీనివల్ల రాజకీయాలు, విధానాలలో అనేక దృష్టికోణాల పట్ల కేంద్ర ప్రభుత్వాలు సున్నితత్వంతో వ్యవహరించవలసి వచ్చింది. అదే సమయంలో దీనివల్ల ఎంతో అస్థిరత కూడా నెలకొంది. చిన్న పార్టీలు కూడా తమ మద్దతు ఉపసంహరించుకుంటే ప్రభుత్వం పడిపోతుంది కాబట్టి ఎక్కువ ప్రయోజనాలు రాబట్టుకోటానికి ప్రయత్నించాయి. కొన్నిసార్లు దీనివల్ల 'విధాన పక్షపాతం' కూడా సంభవించేది – అంటే ఏదో ఒక భాగస్వామి మద్దతు ఉపసంహరించుకుంటుందన్న భయంతో తీవ్ర మార్పులను తెచ్చే విధానాలను అమలు చెయ్యటానికి సంకీర్ణ ప్రభుత్వం భయపడేది.



చిత్రం 19.7: వి.పి. సింగ్

తొలి సంకీర్ణ ప్రభుత్వాలు చాలా అస్థిరంగా ఉండి వాటి పూర్తికాలం కొనసాగలేకపోయాయి. తరువాతి సంకీర్ణ ప్రభుత్వాలు కనీస ఉమ్మడి కార్యక్రమాలు, సమన్వయ సంఘాలువంటి పలు విధానాల ద్వారా భాగస్వాముల మధ్య మరింత అవగాహన సాధించగలిగాయి. ఫలితంగా బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రాటిక్ అలయన్స్, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెస్సివ్ అలయన్స్ (UPA)లాంటి సంకీర్ణ ప్రభుత్వాలు తమ పూర్తికాలం పదవిలో కొనసాగాయి. అంతేకాకుండా యుపిఏ సంకీర్ణ ప్రభుత్వం తిరిగి ఎన్నిక అయ్యింది.

- సంకీర్ణ రాజకీయాల వల్ల ప్రభుత్వం బలహీనపడిందని కొంతమంది భావిస్తుండగా, దానివల్ల ఏ ఒక్క పార్టీ తన విధానాన్ని దేశం మీద రుద్దకుండా చేసిందని కొంతమంది భావిస్తారు. దీనిని ఉదాహరణలతో చర్చించండి.

## పశ్చిమ బెంగాల్‌లో 'వామ పక్ష ప్రభుత్వం'

వామ పక్ష రాజకీయ పార్టీలైన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) వంటివి 1977లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికలలో గెలిచి సిపిఎంకి చెందిన జ్యోతి బసు నాయకత్వంలో వామ పక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి.

రాష్ట్రంలో అసంపూర్తిగా ఉండిపోయిన భూ సంస్కరణలను అది ముందుగా చేపట్టింది. జూన్ 1978లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కౌలుదార్ల పేర్లను నమోదు చేసి, వాళ్ల హక్కులను కాపాడటానికి 'ఆపరేషన్ బర్గా' చేపట్టింది (కౌలుదార్లను బెంగాలీలో బర్గాదార్లు అంటారు, వీళ్లు భూస్వాముల భూములను సాగుచేస్తూ పంటలో అధిక భాగం వాళ్లకి కౌలుగా చెల్లిస్తూ ఉండేవాళ్లు). పశ్చిమ బెంగాల్‌లో గ్రామీణ జనాభాలో ఈ కౌలుదార్లు అధిక సంఖ్యలో ఉండేవాళ్లు. పరిపాలనా సంబంధ ఆలస్యాలు, భూస్వామ్యవర్గాల పెత్తనమూ లేకుండా ఉండటానికి పంచాయితీ రాజ్ సంస్థలు, కౌలుదార్ల ఉమ్మడి కార్యాచరణపై ఆపరేషన్ బర్గా ఆధారపడింది. అధికారులు గ్రామాలలో సమావేశాలు నిర్వహించి వివిధ పాత్రధారులు చెప్పేది వినేవాళ్లు. ఆ వెంటనే కౌలుదార్ల జాబితా తయారుచేసి భూస్వాముల సమక్షంలో సరి చూసేవాళ్లు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచెయ్యటానికి భూస్వాములకు అవకాశం ఇచ్చేవాళ్లు. అక్కడికక్కడే కౌలుదార్ల పేర్లు నమోదు చేసి, అన్ని చట్ట సంబంధ కాగితాలు తయారుచేసి వెంటనే పంచిపెట్టేవాళ్లు.

ఆపరేషన్ బర్గా ఫలితంగా కౌలుదార్లను భూస్వాములు బలవంతంగా తొలగించటానికి వీలు లేకుండా పోయింది. వాస్తవానికి కౌలుదార్ల హక్కును వారసత్వం చేసి అది కొనసాగేలా చూశారు. అంతేకాకుండా పంటలో న్యాయమైన వాటా (శ్రమ కాకుండా ఇతర పెట్టుబడి కౌలుదారు పెడితే 75%, భూస్వామి పెడితే 50%) కౌలుదారుకి దక్కేలా ప్రభుత్వం చూస్తుంది. మొత్తంగా పశ్చిమ బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలలో సగం దాకా భూ సంస్కరణల ప్రయోజనాలను పొందాయి.

- పశ్చిమ బెంగాల్‌లోని భూ సంస్కరణలను చైనాలోని, లేదా వియత్నాంలోని భూ సంస్కరణలతో పోల్చండి. వీటిల్లో పోలికలు, తేడాలు గుర్తించండి.
- కౌలుదార్లకు రక్షణ లభించటం వల్ల ఉత్పత్తి ఎందుకు పెరిగింది?

ఈ చర్యల ఫలితంగా పశ్చిమ బెంగాల్ లో వ్యవసాయ ఉత్పత్తి 30 శాతం దాకా పెరిగింది, గ్రామీణ పేదరికం గణనీయంగా తగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో అధిక శాతం కౌలుదార్లు (70% దాకా) ఇంకా నమోదు కాలేదని, ఈ పాక్షిక అమలు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ధనిక వర్గం ఏర్పడిందని విమర్శకులు భావిస్తారు.

ఏదేమైనప్పటికీ ఆపరేషన్ బర్గా, పంచాయితీ రాజ్ వ్యవస్థ అమలువల్ల వామ పక్షానికి గ్రామీణ జనాభాలో గణనీయమైన మద్దతు లభించింది. 2006 వరకు అన్ని ఎన్నికలలోనూ విజయం సాధించింది. రాష్ట్ర ప్రజల అవసరాలను ప్రజాస్వామికంగా తీర్చిన ఉదాహరణలలో ఇది ఒకటి.

*1980ల నుంచి సంకీర్ణ ప్రభుత్వాలు కొన్ని రాజకీయ పార్టీలు*

| నేషనల్ ఫ్రంట్ 1989-1990 | యునైటెడ్ ఫ్రంట్ 1996-1998 | నేషనల్ డెమొక్రాటిక్ అలయన్స్ 1998-2004 |
|---|---|---|
| **అధికారంలో ఉన్న పార్టీలు**<br>జెడి, డిఎంకె, ఎజిపి, టిడిపి జమ్ము & కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జెకె ఎన్‌సి) | **అధికారంలో ఉన్న పార్టీలు**<br>జెకెఎన్‌సి, టిడిపి, టిఎంసి, సిపిఐ, ఎజిపి, డిఎంకె, ఎంజిపి, | **అధికారంలో ఉన్న పార్టీలు**<br>జెడియు, ఎస్ఎడి, ఎఐఎడిఎంకె, జెకెఎన్‌సి, తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతా దళ్, శివసేన |
| **మద్దతునిచ్చిన పార్టీలు**<br>**సిపిఎం, సిపిఐ, బిజెపి** | **మద్దతునిచ్చిన పార్టీలు**<br>**సిపిఎం** | **మద్దతునిచ్చిన పార్టీలు**<br>**టిడిపి** |

ఇది ప్రభుత్వంలో భాగస్వాములైన లేదా మద్దతు ఇచ్చిన అన్ని రాజకీయ పార్టీల జాబితా కాదు. తరచు, అయిదుగురు లేదా అంతకంటే ఎక్కువ ఎంపీలు ఉన్న పార్టీలను పేర్కొన్నాం.

## 20వ శతాబ్దపు చివరి దశకంలోని సమస్యలు

రాజకీయాల్లో ఈ మార్పుతోపాటు ఇతర కీలకమైన పరిణామాలు కూడా సంభవించాయి. భారతదేశంలోకి స్వేచ్ఛగా విదేశీ పెట్టుబడులు, వస్తువులను అనుమతించేలా భారత ఆర్థిక విధానం బలవంతంగా సరళీకృతం చేయబడింది. ఇంకొకవైపు కొత్త సామాజిక వర్గాలు మొదటిసారిగా తమ రాజకీయ ఆకాంక్షలను సాధించుకోటానికి ప్రయత్నించసాగాయి. అంతేకాకుండా రాజకీయ జీవితంలో మతపర జాతీయతావాదం, మతం పేరుతో రాజకీయ సమీకరణలు ముఖ్యాంశాలుగా మారాయి. వీటన్నిటి కారణంగా భారతీయ సమాజం తీవ్ర కల్లోలానికి లోనయ్యింది. ఈ మార్పులను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా మారే ప్రయత్నంలోనే ఇంకా మనం ఉన్నాం.

### రాజ్యాంగ సౌకర్యాల విస్తరణ

వెనుకబడిన తరగతుల ప్రజలకి కూడా అవకాశాలు కల్పించటంపై వాళ్లని కూడా కలుపుకుని అభివృద్ధి సాధించటంపై జనతా దళ్ దృష్టి కేంద్రీకరించింది. ప్రభుత్వ ఉద్యోగాలలోనూ, విద్యా సదుపాయాలలోనూ ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసిలకు) రిజర్వేషన్లు ఉండాలని సిఫారసు చేసిన మండల్ కమిషన్ నివేదికను నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వెలికి తీసింది. ఈ కమిషన్ గుర్తించిన సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 27% రిజర్వేషన్లు కల్పించమన్న మండల కమిషన్ ముఖ్యమైన సిఫారసును అమలు చేస్తున్నట్టు విపి సింగ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆదేశాలతో అనేక నిరసనలు, ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో చెలరేగాయి. దక్షిణాదిన అప్పటికే అనేక రాష్ట్రాలు ఒబిసిలకు అధిక శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నాయి. విపి సింగ్ ప్రభుత్వ ఈ నిర్ణయం పట్ల అనేక ఇతర రాజకీయ పార్టీలు అనుకూలంగా లేవు. కానీ తాము జనాదరణ కోల్పోతామన్న భయంతో దాని పట్ల వ్యతిరేకతను ప్రకటించలేదు. గత రెండు దశాబ్దాలలో ఒబిసి కులాల్లో అనేకం సంపన్నులై తమ ఉనికిని చాటుకోవటానికి ప్రయత్నిస్తుండటమే దీనికి కారణం. వాళ్లు ప్రత్యేకంగా భూ సంస్కరణలు, హరిత విప్లవం ద్వారా లాభపడ్డారు. అయితే విద్యలోను, ప్రభుత్వ ఉద్యోగాలలోను, రాజకీయాలలో సైతం తమకు తగినంత ప్రాతినిధ్యం లేదని భావించసాగారు. ఈ రంగాలలో ఇప్పుడు వీళ్లు తమ వాటా కోరసాగారు. మండల్ కమిషన్ సిఫారసులను అమలుచేయటం ద్వారా విపి సింగ్ ప్రభుత్వం వాళ్ల కోరికను తీర్చింది. క్రమేపీ పరిపాలనా విధానం కుల సమస్యలకు, ప్రత్యేకించి తక్కువ కులాల వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలకు మరింత

#### పంచాయతీరాజ్ & 73వ సవరణ

స్థానిక స్వపరిపాలనకు రాజ్యాంగ గుర్తింపునిస్తూ 1992వ సంవత్సరంలో పి.వి. నరసింహారావు ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసింది. 73వ రాజ్యాంగ సవరణ గ్రామ స్థాయిలో స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాలను కల్పించగా, 74వ రాజ్యాంగ సవరణ పట్టణ, నగరాలకు వాటి స్థాయిలో ప్రభుత్వాలను సార్వత్రిక వయోజన ఓటింగ్ ద్వారా మొట్టమొదటిసారి ఎన్నుకున్నారు. మొత్తం స్థానాలలో మూడింట ఒకవంతు (1/3వ వంతు) స్థానాలను స్త్రీలకు కేటాయించారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులకు కూడా కొన్ని స్థానాలను రిజర్వు చేసారు. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను గౌరవిస్తూ స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాలకు ఉండే విధులు, అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయానికి వదలి పెట్టారు. అందువలన, దేశ వ్యాప్తంగా పని చేసే స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాల అధికారాలలో తేడాలుంటాయి.

సున్నితంగా స్పందించసాగింది. దళితుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామనే బహుజన సమాజ్ పార్టీ, పైకెదుగుతున్న జాట్, యాదవుల వంటి కులాలకు ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీలు భారతదేశ రాజకీయాలలో ముఖ్యపాత్ర పోషించసాగాయి.

## రాజకీయాలు, మత వినియోగం

జనాభా సంఖ్యలో అత్యధికులు అంటే హిందువుల మత అస్తిత్వ ఆధారంగా దేశాన్ని నిర్మించాలన్న రాజకీయ ధోరణికి భారతీయ జనతా పార్టీ నేతృత్వం వహిస్తోంది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం వంటివి పాశ్చాత్య భావాలని, ఇవి సరిపోవని, పురాతన భారతీయ సంస్కృతినుంచి మనం నేర్చుకోవాలని ఈ పార్టీ విశ్వసిస్తుంది. అయితే మతగురువులు నడిపే మతపరమైన రాజ్యానికి బిజెపి వ్యతిరేకం. లౌకికరాజ్యం అల్పసంఖ్యాక వర్గాలకు మాత్రమే ప్రత్యేక సదుపాయాలు కల్పించడం కాకుండా, దేశ ప్రజలందరినీ సమదృష్టితో చూస్తూ ఒకే పౌర చట్టాన్ని అమలు చేయాలని బిజెపి లౌకికవాద స్వరూపం చర్చను ప్రారంభించింది.

1980ల వరకు భారత రాజకీయాలలో ఈ ధోరణి నామమాత్రంగా ఉండేది. ఉదాహరణకు 1984 లోకసభ ఎన్నికలలో వీళ్లు రెండు సీట్లు మాత్రమే గెలిచారు. అయితే అయోధ్య అంశాన్ని – రాముడు పుట్టిన ప్రదేశమంటూ మసీదు ఉన్నచోట గుడి కట్టటానికి ఉద్యమాన్ని చేపట్టటంతో బిజెపికి ఆదరణ గణనీయంగా పెరిగింది. ఈ అంశాలకు మద్దతుగా బిజెపి నాయకుడైన ఎల్ కె అద్వాని 1990లో సోమనాథ్‌నుంచి అయోధ్యవరకు 'రథయాత్ర' చేపట్టాడు. ఈ లౌకికవాద రాజకీయాలు అల్పసంఖ్యాక వర్గాలను, ప్రత్యేకించి ముస్లిములను సంతృప్తి పరచటానికి ప్రయత్నించి, అధిక సంఖ్యలో ఉన్న హిందువులను నిర్లక్ష్యం చేస్తున్నాయని వాదించసాగారు. ఈ ఉద్యమ సమయంలో ప్రజలు పలుప్రాంతాలలో మతపరంగా చీలిపోయారు. పెద్ద ఎత్తున మతపరమైన అల్లర్లు చెలరేగాయి. బీహార్‌లో అద్వానీని అరెస్టు చెయ్యటంతో ఈ యాత్ర ముగిసింది. దీనికి ప్రతిగా విపి సింగ్ ప్రభుత్వానికి బిజెపి తన మద్దతును ఉపసంహరించుకుని ముందుగానే ఎన్నికలు జరిపేలా చేసింది.

శ్రీలంకకు భారతీయ సైన్యాన్ని పంపించటంలో అతని పాత్రకు ప్రతీకారంగా శ్రీలంకలోని తమిళ వేర్పాటువాద బృందమైన ఎల్‌టిటిఇ చేతిలో ఈ ఎన్నికల ప్రచారంలో రాజీవ్‌గాంధి హత్యకు గురయ్యాడు. ఆ తరువాత కురిసిన సానుభూతి వెల్లువలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే లోకసభలో బిజెపి బలం 120కి పెరిగింది. రామాలయ ప్రచారంలో సమీకరింపబడిన పెద్దగుంపు 1992లో అయోధ్యకు చేరి మసీదును ధ్వంసం చేసింది. ఈ ఘటన తరువాత తీవ్ర నిరసనలు, మతకల్లోలాలు చెలరేగాయి, చాలా ప్రాణనష్టం జరిగింది.

## సరళీకృత ఆర్థిక విధానం

1991లో విపి సింగ్ ప్రభుత్వం పడిపోయినప్పుడు భారతదేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అప్పులను తిరగి కట్టటానికి, దిగుమతులకు చెల్లించటానికి ఉపయోగించే విదేశీ మారక నిల్వలు దాదాపుగా అడుగంటాయి. అంటే వెంటనే కొత్త అప్పు దొరికితే తప్పించి పాత బకాయిల కిస్తీలను సకాలంలో కట్టలేని పరిస్థితిలో భారతదేశం ఉంది. 1992లో పివి నరసింహారావు నేతృత్వంలో ఏర్పడిన కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని అధిగమించటానికి అంతర్జాతీయ ద్రవ్యనిధితో సంప్రదింపులు నిర్వహించింది. ఇందుకు అది కొన్ని తీవ్రమైన షరతులను విధిస్తూ (వీటిని 'వ్యవస్థాగత

మార్పుల కార్యక్రమం' అంటారు) భారతదేశం సరళీకృత ఆర్థిక విధానాన్ని అవలంబించేలా చేసింది. దీని అర్థం –

అ. ప్రభుత్వ ఖర్చును తీవ్రంగా తగ్గించుకోవటం – దీంట్లో రైతులకు ఇచ్చే సబ్సిడీలలో కోత, ప్రజాసేవలు, ఆరోగ్యం వంటి వాటిల్లో ప్రభుత్వ ఖర్చును తగ్గించుకోవటం వంటివి కూడా ఉన్నాయి.

ఆ. విదేశీ సరుకుల దిగుమతుల మీద పరిమితులను, పన్నులను తగ్గించుకోవటం.

ఇ. భారతదేశంలో విదేశీ పెట్టుబడులపై పరిమితులను తగ్గించుకోవటం.

ఈ. ఆర్థిక రంగంలోని అనేక రంగాలలో (ఉదాహరణకు టెలిఫోన్లు, బ్యాంకింగ్, విమానయానం, వంటి వాటిల్లో) ప్రైవేటు పెట్టుబడి దారులకు అవకాశం కల్పించటం (ఇవి ఇంతకు ముందు ప్రభుత్వ గుత్తాధిపత్యం కింద ఉండేవి).



చిత్రం 19.8: పి.వి. నరసింహా రావు

ఈ చర్యల కారణంగా భారతదేశంలోకి విదేశీ సరుకులు రావటంతో భారతీయ పారిశ్రామికవేత్తలకు ప్రపంచ ఉత్పత్తిదారులతో పోటీ పడక తప్పలేదు. దీనివల్ల విదేశీ కంపెనీలు భారతదేశంలో పరిశ్రమలను నెలకొల్పాయి, వ్యాపారాలు మొదలుపెట్టాయి. అయితే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే సబ్సిడీలలో కోత విధించటం వల్ల చౌక విదేశీ సరుకులు వెల్లువెత్తడంతో ఇక్కడ అనేక కర్మాగారాలు మూతపడటం వల్ల సాధారణ ప్రజలు ఎన్నో కష్టాలకు గురయ్యారు. విద్య, ఆరోగ్యం, రవాణా వంటి అనేక ప్రభుత్వ సదుపాయాల ప్రైవేటీకరణకు కూడా ఇది దారి తియ్యటంతో ఈ సేవలు అందించే ప్రైవేటు వ్యక్తులకు ప్రజలు పెద్ద మొత్తంలో డబ్బులు/ రుసుం చెల్లించాల్సి వస్తోంది.



చిత్రం 19.9 : హెచ్.డి. దేవెగౌడ



చిత్రం 19.10: ఎ.బి. వాజ్‌పేయి

20వ శతాబ్దం ముగింపులో భారతదేశం ప్రపంచ మార్కెట్‌లోకి లాగబడింది. ఈ భారతదేశంలో ఒకవైపున జనాభాలోని వివిధ వర్గాల గొంతులు వినిపించే ప్రజాస్వామ్యం విలసిల్లుతోంది, ఇంకోవైపున ప్రజలను విభజించే, మతపర రాజకీయ సమీకరణల వల్ల సామాజిక శాంతికి ముప్పు పొంచి ఉంది. యాభైఏళ్లకు పైగా అది కాలపరీక్షకు నిలబడింది; ఎంతో కొంత స్థిర ఆర్థిక పరిస్థితిని సాధించింది; ప్రజాస్వామిక రాజకీయాలు బలంగా వేళ్లూనుకున్నాయి. తీవ్ర పేదరికాన్ని, కులాలు, మతాలు, ప్రాంతాలు, స్త్రీ – పురుషుల మధ్య తీవ్ర అసమానతల్ని అది ఇంకా పరిష్కరించలేదు. 21వ శతాబ్ద భారతదేశానికి యాభై ఏళ్ల స్వాతంత్ర్యానంతరకాలం అందించిన వారసత్వం ఇదే.

## ముగింపు

భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొని నిలిచిందని, ఆ ప్రక్రియలో అది మరింత బలపడిందని చూశాం. క్రమం తప్పకుండా జరిగే స్వేచ్ఛాయుత, న్యాయపూరిత ఎన్నికలు, ఎన్నికలలో ఓటు వేసే వాళ్ల సంఖ్య,

ప్రభుత్వాల మార్పు, కొత్త గ్రూపుల సాధికారీకరణ, పౌర హక్కులను కాపాడటం వంటి అనేక విషయాలలో భారత ప్రజాస్వామ్యం విజయవంతమయ్యిందని చెప్పవచ్చు. అయితే శతాబ్దపు అంచులో భారత ప్రజాస్వామ్యం గురించి అనేక ప్రశ్నలు కూడా లేవనెత్తాయి. దీర్ఘకాలం ప్రజాస్వామిక దేశంగా ఉన్నప్పటికీ అధిక శాతం పౌరుల సంక్షేమాన్ని భారతదేశం ఎందుకు సాధించలేకపోయింది? అభివృద్ధి ప్రక్రియ లేవనెత్తిన పరస్పర విరుద్ధ కోరికల కారణంగా ఉత్పన్నమయ్యే ఒత్తిడిని అది ఎలా ఎదుర్కొంటుంది? పాదుకుని ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ప్రజాస్వామిక భారతదేశం ఎందుకు తగ్గించలేకపోయింది? రానున్న సంవత్సరాలలో ఈ ప్రశ్నలను, సమస్యలను భారతదేశం ఎదుర్కోవాలి. భారతదేశం ఇది చెయ్యగలుగుతుందని మీరు అనుకుంటున్నారా?

## కీలక పదాలు

| | | |
|---|---|---|
| ప్రాంతీయ ఆకాంక్షలు | సంకీర్ణ ప్రభుత్వాలు | మతతత్వ వాదం |
| అధిక సంఖ్యాక వర్గం | అల్ప సంఖ్యాక వర్గం | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది వాటిని జతపరచండి:

| | |
|---|---|
| సరళీకృత ఆర్థిక విధానం | విదేశీ దిగుమతులపై పన్నులమీద పరిమితులు |
| ఇష్టమొచ్చినట్లు తొలగించటం | కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు |
| ఇతరుల తొలగింపు | తమకంటే భిన్నంగా ఉన్న ప్రజలకు |
| సమాఖ్య సిద్ధాంతం | రాష్ట్ర ప్రభుత్వాలకు మరింత స్వయం ప్రతిపత్తి |

2. స్వాతంత్ర్యానంతర రెండవ దశలో పార్టీ వ్యవస్థలో ప్రధాన మార్పులను గుర్తించండి.
3. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో వివిధ ప్రభుత్వాల ప్రధాన ఆర్థిక విధానాలలో వేటిని గురించి ఈ అధ్యాయంలోనూ, ఇంతకు ముందు అధ్యాయాలలోనూ చర్చించారు? వాటిల్లో పోలికలు, తేడాలు ఏమిటి?
4. ప్రాంతీయ ఆకాంక్షలు ప్రాంతీయ పార్టీల ఏర్పాటుకు ఎలా దారితీశాయి? రెండు దశలలోని పోలికలు, తేడాలను వివరించండి.
5. ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలంటే రాజకీయ పార్టీలు సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఆకర్షించాలి. స్వాతంత్ర్యానంతర రెండవ దశలో ఈ పనిని వివిధ రాజకీయ పార్టీలు ఎలా చేశాయి?
6. భారతీయ పరిపాలనా విధానంలో అందరినీ కలుపుకునే స్వభావం బలహీన పడటానికి కారణమైన పరిణామాలు ఏమిటి? వివిధ ప్రజలను, రాజకీయ ఆకాంక్షలను కలుపుకుని వెళ్లగల సామర్థ్యం ఏ విధంగా దెబ్బతింటోంది?
7. వివిధ ప్రాంతీయ ఆకాంక్షలు సాంస్కృతిక, ఆర్థిక కోణాలను ఏ విధంగా ఉపయోగించుకుంటాయి?
8. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి సగంలో ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు. రెండవ సగంలో సరళీకృత ఆర్థిక విధానానికి ప్రాధాన్యతను ఇచ్చారు. ఇవి రాజకీయ భావాలను ఎలా ప్రతిభింబించాయో చర్చించండి.
9. సంకీర్ణ ప్రభుత్వం వల్ల విధానాలలో మధ్యేమార్గాన్ని అవలంబించటానికి సంకీర్ణ ప్రభుత్వంలోని వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రాంతీయ కోరికలను సాధించుకునే విధానానికి ఉదాహరణలను వార్తా పత్రికలు, వార పత్రికలు చదవటం ద్వారా గుర్తించండి.

పాఠం 20

# ప్రపంచ యుద్ధాల తరువాత ప్రపంచం, భారతదేశం

## రెండవ ప్రపంచ యుద్ధం తరువాత

రెండవ ప్రపంచ యుద్ధ ప్రభావం వేరు వేరు దేశాలపై వేరు వేరు విధాలుగా పడింది. ఐరోపా దేశాలు, ప్రత్యేకించి యుఎస్ఎస్ఆర్, పోలాండ్, యుగొస్లావియాలలో తమ జనాభాలో 20 శాతం వరకు చనిపోయి తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. నగరాలు, కర్మాగారాలు, గనులు పెద్ద ఎత్తున విధ్వంసం కావటంతో రష్యా, ఇతర ఐరోపా దేశాలు ఆర్థికంగా కూడా బాగా నష్టపోయాయి. రష్యాలో 1700 పట్టణాలు, 31,000 కర్మాగారాలు, 70,000 గ్రామాలు పూర్తిగా విధ్వంసమయ్యాయి. ఇందుకు విరుద్ధంగా అమెరికా భూభాగం మీద యుద్ధం జరగలేదు కాబట్టి దానికి జరిగిన నష్టం తక్కువ. వాస్తవానికి ఆర్థిక మాంద్యం కారణంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి అమెరికా బయటపడటానికి రెండవ ప్రపంచ యుద్ధం దోహదపడింది. యుద్ధ రంగాలకు దూరంగా ఉన్నందున అమెరికా పరిశ్రమలు, వ్యవసాయం వృద్ధి చెందాయి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో అమెరికా ఎక్కువ ఉపాధి, అధిక ఉత్పాదకత సాధించారు. 1945 మార్చిలో అమెరికా అధ్యక్షుడు హారీ ట్రుమన్ "యుద్ధం వలన మనం ప్రపంచంలోకెల్లా శక్తిమంతమైన దేశంగా ఆవిర్భవించాం – చరిత్ర మొత్తంలోనే ఇంతటి శక్తిమంత దేశం మరొకటి లేదు," అన్నాడు.



*చిత్రం 20.1 : యుద్ధం తరువాత వార్సా నగరం 85% భవనాలు నాశనమయ్యాయి.*

యుద్ధ వినాశనానికి గురయిన దేశాలు తమ ఆర్థిక పరిస్థితిని పునఃనిర్మించుకుంటున్న క్రమంలో ప్రపంచం కొత్త ప్రక్రియలను చూసింది. ఈ ప్రక్రియలలో ముఖ్యమైనవి మూడు: ఐక్యరాజ్య సమితి ఏర్పాటు, ప్రచ్ఛన్న యుద్ధం, వలసపాలన నుంచి విముక్తి. నాజీభావాలైన నియంతృత్వం, సామ్రాజ్యవాదాలకు విరుద్ధంగా శాంతి, ప్రజాస్వామ్యం, దేశాల స్వాతంత్రం అన్న సూత్రాల కోసం రెండవ ప్రపంచ యుద్ధం జరిగింది. కాబట్టి మొదటి కర్తవ్య నిర్వహణకు అన్ని దేశాలలో శాంతి, అభివృద్ధి వెల్లివిరిసేలా ఒక ప్రపంచ సంస్థను ఏర్పాటు చెయ్యటం. ఇది ఐక్యరాజ్య సమితి స్థాపనకు దారితీసింది. వలస పాలక శక్తులైన బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ వలస పాలన విధానాలను ఇక సమర్థించుకోలేకపోయాయి. అమెరికాతో పోలిస్తే ఈ దేశాలు రాజకీయంగా, ఆర్థికంగా బలహీనమయ్యాయి. పాత వలస వ్యవస్థ వల్ల వలసపాలిత దేశాలపై వలస పాలక దేశాలకు గుత్తాధిపత్యం కల్పిస్తున్నందువల్ల కూడా దానికి అంతం పలకాలని అమెరికా ఒత్తిడి చెయ్యసాగింది. రష్యాతో స్ఫూర్తి పొందిన కమ్యూనిస్టు పార్టీలు అనేక దేశాలలో వలస పాలనపై పోరాటాలు చెయ్యసాగాయి. ఆ విధంగా వలస వ్యతిరేక పోరాటాలకు వెన్నుదన్నుగా రష్యా నిలబడింది. ఈ పరిస్థితులలో తమ కింద ఉన్న

వలసపాలిత దేశాలకు బ్రిటన్ వంటి దేశాలు స్వాతంత్రం ఇవ్వక తప్పలేదు. దీని గురించి మీరు ఇంతకు ముందు అధ్యాయాలలో చదివారు. ఈ దేశాలు స్వతంత్రం పొందిన తరువాత పెట్టుబడిదారీ విధానం – కమ్యూనిజం మధ్య (అమెరికా–రష్యాల మధ్య) విభజింపబడిన ప్రపంచాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ దేశాలు తమ అభివృద్ధికి సొంత మార్గం అనుసరించనివ్వకుండా ఏదో ఒక శిబిరాన్ని ఎంచుకోమని ఒత్తిడి పెరగసాగింది. ఈ రెండు అగ్ర రాజ్యాల మధ్య విభేదాలను కొన్ని దేశాలు తమకు సానుకూలంగా వాడుకున్నాయి. ఈ అంశాలలో కొన్నింటి గురించి ఈ భాగంలో వివరంగా తెలుసుకుందాం.

- వలసపాలన నుంచి విముక్తి అంటే ఏమిటి?
- రెండు అగ్ర రాజ్యాల మధ్య పోటీతో కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు ఏ విధంగా ప్రభావితం అయ్యాయి?

## ఐక్యరాజ్య సమితి

యుద్ధం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మిత్ర దేశాలలో ముఖ్యమైన బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, రష్యా, చైనాలు ఐక్యరాజ్య సమితి ఏర్పాటుకు ఒక పత్రాన్ని తయారుచేశాయి. ఈ పత్రం యుద్ధాలను నివారించి, శాంతిని నెలకొల్పే అంశాన్నే కాకుండా ప్రపంచ ప్రజలందరికీ మానవ హక్కులు, ప్రజాస్వామ్యం లభించేలా, పేదరికం, ఆకలి అంతమయ్యేలా చెయ్యటానికి ప్రాధాన్యతను ఇచ్చింది. కాబట్టి ఐక్యరాజ్య సమితి శాశ్వత శాంతి, మానవ అభివృద్ధి అన్న రెండు ఉద్దేశాలతో ఏర్పడింది. అదే సమయంలో అది దేశాల స్వయంప్రతిపత్తిని గుర్తించి ప్రపంచ శాంతికి ముప్పు, లేదా తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన వంటి సందర్భాల్లో తప్పించి దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోనని మాట ఇచ్చింది.

ఐక్యరాజ్య సమితి ఏర్పడినప్పుడు దాంట్లో సభ్యులుగా 54 దేశాలు ఉండగా ప్రస్తుతం (2014లో) 193 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఆ తరువాత దశాబ్దంలో వలస పాలక శక్తులనుంచి స్వాతంత్ర్యం పొందిన దేశాలు ఐక్యరాజ్య సమితిలో చేరాయి. ఆరు వేరువేరు సంస్థల ద్వారా ఐక్యరాజ్య సమితి పని చేస్తుంది. ఒక్కొక్క సంస్థకి శాంతి, భద్రతలను కాపాడటం, విద్య, ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచటం, పేదరికాన్ని నిర్మూలించటం, అంతర్జాతీయ నేరాల నేపథ్యంలో న్యాయాన్ని అందించటం వంటి ప్రత్యేక విధులు ఉన్నాయి. ఈ విధులకు బాధ్యత వహించే కొన్ని సంస్థలు: హేగ్‌లో ఉన్న అంతర్జాతీయ న్యాయస్థానం, జెనీవాలో ఉన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ, పారిస్‌లో ఐక్యరాజ్య సమితి విద్య, విజ్ఞాన శాస్త్ర, సాంస్కృతిక సంస్థ, న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య బాలల అత్యవసర నిధి సంస్థ.


చిత్రం 20.2 : ఐక్యరాజ్య సమితి లోగో

ఐక్యరాజ్య సమితి ముఖ్య అధికారి అయిన సెక్రటరీ జనరల్ ఎన్నికలో అన్ని దేశాలు పాల్గొంటాయి. ఈ పదవి వివిధ దేశాల మధ్య మారుతూ ఉంటుంది. దీని ప్రధాన అంగం అయిన సాధరణ సభలో వివిధ దేశాల మధ్య చర్చలు జరుగుతుంటాయి. అయితే యుద్ధం, శాంతికి సంబంధించిన నిర్ణయాలు భద్రతా సమితిలో తీసుకుంటారు. దీంట్లో శాశ్వత సభ్యులైన చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, యుఎస్ఎస్ఆర్ (ఇప్పుడు రష్యా), అమెరికాలకు ప్రత్యేక హోదా ఉంది. భద్రతా సమితి తీసుకున్న నిర్ణయాలను ఈ అయిదు దేశాలలో

ఏ ఒక్కటైనా జోక్యం చేసుకుని వీటో చెయ్యవచ్చు (తిరస్కరించవచ్చు). అనేక ఘర్షణలలో ఈ అయిదు దేశాల ప్రత్యక్ష పాత్ర ఉండడంతో ఐక్యరాజ్య సమితి ఎటువంటి చర్య తీసుకోకుండా తమ వీటో అధికారంతో అడ్డుకునేవి. కొన్ని సందర్భాలలో తమ ఆదేశాలను పాటించేలా ఐక్యరాజ్య సమితిపై శక్తిమంతమైన దేశాలు ఒత్తిడి చేసేవి. ఇవి ఐక్యరాజ్యసమితిని తమ నియంత్రణతో పనిచేసేలా, మధ్య దారిలో నడిచేలా చేశాయి. ఈ శక్తిమంతమైన దేశాలకు ఇచ్చిన ప్రత్యేక అధికారం వల్ల ప్రపంచ శాంతిని కాపాడటంలో ప్రత్యేక పాత్రను, బాధ్యతను ఇచ్చినట్లు అయ్యింది.

విద్య, ఆరోగ్యం, సాంస్కృతిక అనుసంధానం, వారసత్వ రక్షణ వంటి రంగాలలో ఐక్యరాజ్య సమితి చెప్పుకోదగిన కృషి చేస్తుండగా యుద్ధాలను నివారించటంలో అది అంతగా విజయం కాలేకపోయింది. ప్రపంచ ఆధిపత్యానికి అగ్రరాజ్యాల మధ్య పోరులో అది తరచు బందీగా మారింది.



చిత్రం 20.3:న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యస్థలం

- యుద్ధాలకూ, పేదరికం, సమాన అభివృద్ధి లేకపోవటం, దేశాల మధ్య సాంస్కృతిక అనుసంధానానికీ మధ్య సంబంధం ఏమైనా ఉందా?
- అయిదు దేశాలకు ఇచ్చిన ప్రత్యేక అధికారాలు అప్రజాస్వామికం కాబట్టి వాటిని రద్దు చెయ్యాలని కొంతమంది వాదిస్తుంటారు. అయితే ఈ దేశాలకు ప్రత్యేక అధికారాలు లేకపోతే ఐక్యరాజ్య సమితి సాఫీగా పనిచెయ్యలేదని కొంతమంది అంటారు. చర్చించండి.

## రెండు శిబిరాలు, ప్రచ్ఛన్న యుద్ధం (1945-1991)

ప్రపంచ యుద్ధానంతర కాలంలో రెండు ప్రధాన సైద్ధాంతిక, రాజకీయ శిబిరాలు ఏర్పడ్డాయి – యుఎస్ఎస్ఆర్ నేతృత్వంలో కమ్యూనిస్టు శిబిరం, అమెరికా నేతృత్వంలో ప్రజాస్వామిక –పెట్టుబడిదారీ శిబిరం. సమానత్వం అన్న భావన, ప్రభుత్వ నియంత్రిత అభివృద్ధి, ఈ సిద్ధాంతాలను వ్యతిరేకించేవాళ్ల అణిచివేత వంటివాటిని రష్యా అవలంబించింది. ఇంకో వైపున పలు పార్టీల ప్రజాస్వామ్యం, ప్రైవేటు పెట్టుబడిదారులు నియంత్రిత అభివృద్ధి అన్న భావనలను అమెరికా ప్రోత్సహించింది. తూర్పు యూరపు (పోలాండ్, హంగరీ, తూర్పు జర్మనీ) మొత్తం రష్యా ప్రభావంలో ఉండగా, కొత్తగా స్వాతంత్ర్యం పొందిన చైనా, వియత్నాం వంటి వలసపాలిత ప్రాంతాలు దానికి సన్నిహితంగా ఉండేవి. పశ్చిమ యూరపు దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటివి అమెరికా పక్షాన నిలిచాయి. ప్రపంచంలోని దేశాలను తమ శిబిరంలో చేర్చుకోటానికి ఈ రెండు అగ్ర దేశాలు ఒకదానితో ఒకటి పోటీ పడసాగాయి.




రేఖాచిత్రం 1 : అమెరికా, రష్యాల వద్ద అణ్వాయుధ నిల్వలు



*చిత్రం 20.4 : అణుబాంబుల తీవ్రతను అర్థం చేసుకోటానికి ఇది చేసి చూడండి. హిరోషిమాపై వేసిన అణుబాంబు 15 కిలో టన్నులు కాగా, నాగసాకిపై వేసింది 21 కిలో టన్నులు. ఒక కిలో టన్నుకి ఒక చుక్కతో పైన హిరోషిమాపై వేసిన అణుబాంబుని సూచించారు. రష్యా దగ్గర ఉన్న అత్యంత శక్తిమంతమైన అణుబాంబు 50,000 కిలో టన్నులు. హిరోషిమాపై వేసిన అణుబాంబుని సూచించినట్టు దీనిని సూచించాలంటే పుస్తకంలో ఎన్ని పేజీలు కావాలో ఊహించండి. ఈ బాంబుని ఎప్పుడైనా ఉపయోగించాల్సి వస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందో ఊహించండి.*

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 45 సంవత్సరాల పాటు ఈ రెండు శిబిరాల మధ్య ఒక వింత యుద్ధం జరిగింది. దీంట్లో ముఖ్యమైన పోటీదారులు ఒకదానిపై ఒకటి భౌతిక దాడులకు దిగలేదు, ఒకదానితో ఒకటి నేరుగా యుద్ధంలోకి దిగలేదు. దీనికి బదులుగా ప్రపంచంలో ఏ రెండు చిన్న దేశాల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు ఈ అగ్రరాజ్యాలు చెరొక పక్షం వహించి మాటలు, ప్రచారం ద్వారా యుద్ధం చేశాయి. సంప్రదాయ యుద్ధాలలో మాదిరి నిజమైన పోరు లేదు కాబట్టి దీనిని ప్రచ్ఛన్న యుద్ధమన్నారు. ఈ ప్రచ్ఛన్న యుద్ధం వల్ల అమెరికా, రష్యాల మధ్య తీవ్ర ఘర్షణపూరిత వాతావరణం ఉండేది, 1945–1991 మధ్య జరిగిన ప్రపంచ ఘటనలన్నింటినీ ఇది ప్రభావితం చేసింది.

ప్రచ్ఛన్న యుద్ధమంటే ప్రచార యుద్ధం ఒక్కటే కాదు. ఈ కాలంలో జరిగిన యుద్ధాలలో రెండు కోట్లమంది చనిపోయారు. ఈ చనిపోయిన వాళ్లల్లో దాదాపు అందరూ మూడవ ప్రపంచ దేశాల వాళ్లే, అంటే వలస పాలన నుంచి బయటపడుతున్న వియత్నాం, కొరియా, అంగోలా, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల వాళ్లే. ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయి ఉండటం వల్ల భౌగోళికంగా పక్కపక్కన ఉన్న దేశాలు, ఒకే మూలాలు గల ప్రజలున్న దేశాలు శత్రువులుగా మారి వాటిమధ్య వినాశకర యుద్ధాలు చెలరేగాయి.

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ఈ రెండు శిబిరాలు పరోక్ష యుద్ధాలు, సైనిక ఒప్పందాలు, ఆయుధ పోటీ వంటి ఎత్తుగడలను అవలంబించాయి

## పరోక్ష యుద్ధాలు

మొదటినుంచి కూడా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న దేశాలను తమ ప్రాభవంలోకి తీసుకురాటానికి రెండు శిబిరాలు ప్రయత్నించాయి. దీని ఫలితంగా ఆయా దేశాలలో రెండు విరోధ బృందాలకు చెరొక శిబిరం మద్దతు ఇవ్వసాగింది. ఉదాహరణకు 1947లో టర్కీ, గ్రీకు దేశాలలో కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులకు అమెరికా అధ్యక్షుడు హారీ ట్రుమాన్ మద్దతు ఇచ్చాడు. ఆఫ్రికాలో బెల్జియం వలసపాలన కింద ఉన్న కాంగోకి 1960లో స్వాతంత్ర్యం వచ్చింది. దాని కమ్యూనిస్టు నాయకుడైన పాట్రిస్ లుముంబాని 1961లో చంపేశారు. ఇందులో అమెరికా గూఢచారి సంస్థ అయిన సిఐఏ ప్రోద్బలం ఉందంటారు. పోర్చుగల్ నుంచి అంగోలా 1975 నవంబరులో స్వాతంత్రం పొందింది. రష్యా, క్యూబాల సహాయంతో అంగోలాలోని కమ్యూనిస్టులు అధికారాన్ని చేజిక్కించుకున్నారు. లాటిన్ అమెరికాలో ఫిడెల్ కాస్ట్రో అమెరికా మద్దతు ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవానికి నాయకత్వం వహించి రష్యా పంథాలో సామ్యవాద వ్యవస్థని నిర్మించటానికి కృషిచేశాడు. దీంతో లాటిన్ అమెరికాలో అనేక దేశాలు ఇదేరకమైన మార్పు కోసం పోరాటాలను చేపట్టటానికి స్ఫూర్తిని పొందాయి. వాళ్లల్లో అత్యంత ప్రజాదరణ పొందిన చేగువేరా అన్న నాయకుడు చంపబడ్డాడు. సోషలిస్టుల నేతృత్వంలో ఎన్నికైన ప్రభుత్వాలను కూడా అమెరికా మద్దతుతో ఆ దేశాల సైన్యాధిపతులు పడదోశారు. ఇందుకు చిలీలో ఎస్ అల్లెండీ ప్రభుత్వాన్ని పడదొయ్యటం ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

రష్యా కూడా తన ప్రభావ పరిధిని పెంచుకోటానికి కృషి చేసింది. ఉదాహరణకు 1950లలో జర్మనీ, హంగరీ, చెకొస్లావేకియా వంటి దేశాలలో వ్యతిరేకత ఎదురైనప్పుడు రష్యా తన సైన్యాన్ని పంపించి ఆ దేశాలలో తనకు అనుకూలంగా లేని ప్రభుత్వాలను తొలగించి తమతో స్నేహపూర్వకంగా ఉండే ప్రభుత్వాలను స్థాపించింది. 1960ల తరువాత రష్యాతో సంబంధాలు తెంచుకోవాలని చైనా నిర్ణయించింది. చైనాపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించి రష్యా విఫలమయ్యింది. 1971లో ఆఫ్ఘనిస్తాన్‌పై రష్యా దాడి చేసి అక్కడ తనకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని నెలకొల్పింది. దాంతో మత తీవ్రవాదులైన ఆఫ్ఘన్ తిరుగుబాటుదార్లకు అమెరికా మద్దతు ఇచ్చింది. ఫలితంగా దీర్ఘకాల పౌరయుద్ధం చెలరేగింది. అంతిమంగా 1985లో ఆఫ్ఘనిస్తాన్ నుంచి తమ సైన్యాలను ఉపసంహరించుకోవాలని రష్యా నిర్ణయించింది. ఆ తరువాత మత తీవ్రవాదులైన తాలిబన్లు అధికారంలోకి వచ్చి ఇప్పుడు అమెరికాకు వ్యతిరేకంగా మారారు. ఈ అగ్రరాజ్యాలు ఆడిన ఆటలో వలసపాలకుల నియంత్రణ నుంచి బయట పడాలనుకుంటున్న మూడవ ప్రపంచం యుద్ధానికి, విధ్వంసానికి రంగభూమిగా మారిందని, యుద్ధంలో రష్యా, అమెరికా సైనికులు కాకుండా మూడవ ప్రపంచ ప్రజలు పాల్గొన్నారన్నది గమనించండి.

## సైనిక ఒప్పందాలు

అమెరికా, రష్యాల రెండింటి దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయి. అయితే అణు యుద్ధమే చెలరేగితే ఏ దేశమూ గెలవదని ఆ రెండింటికీ తెలుసు. అయినప్పటికీ అవి సైనిక, కీలక ఒప్పందాలు కుదుర్చుకోసాగాయి. 1949లో అమెరికా తన మైత్రిని ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ (నాటో) అన్న దాని ద్వారా బలపరుచుకుంది. దీనికి ప్రతిచర్యగా కమ్యూనిస్టు దేశాలు వార్సా ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెరికా వివిధ ప్రాంతాలలో మిలటరీ, మిత్రత్వ ఒప్పందాలైన – సౌత్ ఈస్ట్ ఏసియన్ ట్రీటీ ఆర్గనైజేషన్ (సీటో), సెంట్రల్ ట్రీటీ ఆర్గనైజేషన్ (సెన్‌టో)లను కుదుర్చుకుంది.




సైనిక ఒప్పందాలను కుదుర్చుకోవటం ద్వారా తమను తాము బలోపేతం చేసుకున్నప్పటికీ యుద్ధమే చెలరేగితే మొత్తం నాగరికతలకే ముప్పు తెచ్చే స్థాయిలో మానవ నష్టం జరుగుతుందని ఈ శిబిరాలకు తెలుసు. అందుకే అవి ఒకదానికొకటి ప్రతిబంధకంగా, నిరోధకంగా నిలిచేలా వ్యవహరించాయి.

ఈ ఒప్పందాల ద్వారా అగ్ర రాజ్యాల ప్రభావ పరిధి పెరిగి వాటికి కింద పేర్కొన్నవి అందుబాటులోకి వచ్చాయి:

- చమురు, ఖనిజాలు వంటి కీలక వనరులు
- తమ ఉత్పత్తులకు మార్కెట్లు, తమ పెట్టుబడులు పెట్టటానికి ప్రమాదకరంలేని ప్రదేశాలు
- తమ సైనికులను, ఆయుధాలను ఉపయోగించటానికి సైనిక స్థావరాలు
- తమ భావజాల వ్యాప్తి
- పెద్ద మొత్తంలోని సైనిక ఖర్చుకి ఆర్థిక మద్దతు

## ఆయుధ, అంతరిక్ష పోటీ

ఆయుధ పరిశోధనల పైనా, ఖండాంతర క్షిపణులు, విధ్వంసకర అణ్వాయుధాల నిల్వలపైనా అమెరికా, రష్యాలు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశాయి. ఈ రెండు దేశాలలో ఒక్కొక్క దాని దగ్గర ప్రపంచాన్ని పలుమార్లు మట్టుపెట్టగల అణ్వాయుధాలు ఉన్నాయి. కాలక్రమంలో వాటి మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, చైనాలు కూడా అణ్వాయుధాలను సమకూర్చు కున్నాయి. గూఢచర్యంలోనూ, క్షిపణులను నిర్దేశించటంలోనూ ఉపగ్రహాలు దోహదం చెయ్యటంతో ఇప్పుడు పోటీ అంతరిక్షంలోకి కూడా విస్తరించింది. మొదటి ఉపగ్రహం అయిన స్పుట్నిక్‌ని రష్యా ప్రయోగించింది. అలాగే అంతరిక్షంలోకి మొదటి వ్యక్తి యూరి గగారిన్‌ని రష్యా పంపించింది. దీంతో రెండు అగ్ర రాజ్యాల మధ్య ఉపగ్రహాలను ప్రయోగించటంలో పోటీ మొదలయ్యింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ని, ఇతరులను చంద్రమండలం మీదకి పంపటంలో 1969లో అమెరికా సఫలమయ్యింది.



*చిత్రం 20.5 : (ఎడమ) యూరి గగారిన్, (కుడి) చంద్రమండలంపై మనిషి*

## యుద్ధం అంచున

ప్రత్యర్థి శిబిరాలు విధ్వంసకర ఆయుధాల నిల్వలను పెంచుకుంటూ పోవటంతో ప్రపంచం అణ్వాయుధ యుద్ధ విధ్వంస నీడలో బితుకు బితుకుమంటూ ఉంది. అన్ని దేశాల ప్రజలు యుద్ధ భయంతో గడపసాగారు. రెండు అగ్ర రాజ్యాల మధ్య యుద్ధం అనివార్యమనిపించిన సందర్భాలు అనేకం ఎదురైనప్పటికీ దౌత్యంతో వీటిని ఎలాగో నివారించగలిగారు. రష్యా తమ దేశంలోని అమెరికాకి చెందిన గూఢచర్య విమానాన్ని కూల్చివెయ్యటం, క్యూబాలో రష్యా ఆయుధ నిల్వలను అమెరికా గుర్తించటం, కొరియా, గల్ఫ్ యుద్ధాల వంటి సందర్భాలలో పలు మార్లు ప్రపంచం యుద్ధం అంచున నిలిచింది.

## అలీనోద్యమం

1950లలో ప్రపంచం రెండు ప్రత్యర్థి శిబిరాల మధ్య తీవ్ర ఆయుధీకరణకు లోనయ్యింది. రెండు అగ్ర రాజ్యాల మధ్య సైనిక ఆధిపత్యం, సైద్ధాంతిక విరోధాలు, ఆర్థిక ఆధిపత్యం కోసం జరిగిన పోటీలు కారణంగా ప్రపంచం రెండు ధృవాలుగా విడిపోయింది. ఈ రెండు పక్షాలలో దేనివైపునా లేకుండా ఉండటానికి అంతగా అవకాశాలు లేకపోయినా అటువంటి ప్రయత్నం ఒకటి జరిగింది. అగ్ర రాజ్యాల మధ్య పోటీ వల్ల ఇటీవల వలస పాలననుంచి విముక్తి పొందిన దేశాల సమస్యలైన పేదరికం, అనారోగ్యం,

అసమానత్వం, వలసవాదం వంటివి ఏవీ పరిష్కారం కాలేదు.

కొత్తగా స్వతంత్రం పొందిన దేశాలు అభద్రతా భావంతో కూడిన పరిస్థితుల నుంచి మార్పు కావాలని కోరుకున్నాయి. ఆ ఉద్దేశంతో 1955లో ఇండోనేసియా లోని బాండుంగ్‌లో ఒక సమావేశం నిర్వహించారు. మొదటి ఆసియా–ఆఫ్రికా సమావేశమైన దీనికి 29 దేశాలు హాజరయ్యాయి. ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమైన నాయకుల్లో భారతదేశానికి చెందిన పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, ఈజిప్టుకి చెందిన గమల్ అబ్దుల్ నాసర్, యుగొస్లావియాకి చెందిన జోసెఫ్ బ్రిజ్ టిటోలు ఉన్నారు. పండిత్ నెహ్రూని దాని అధికార ప్రతినిధిగా గుర్తించారు. ఇది అలీనోద్యమానికి దారితీసింది.



*చిత్రం 20.6: జె. నెహ్రూ, కెన్యాకి చెందిన క్వామె న్క్రుమా, ఈజిప్టుకి చెందిన గమల్ అబ్దెల్ నాసర్, ఇండొనేషియాకి చెందిన సుకర్నో, యుగొస్లావియాకి చెందిన టిటో, 1960లో అలీనోద్యమ సమావేశం నాటి చిత్రం*

ఆసియా, ఆఫ్రికా, ఆ తరువాత లాటిన్ అమెరికాలో కొత్తగా స్వాతంత్రం పొందిన దేశాల మధ్య సాంస్కృతిక, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించటానికి అంతర్జాతీయ సంస్థగా అలీనోద్యమం రూపొందింది.

దీని మొదటి సమావేశం 1961 సెప్టెంబరులో యుగొస్లావియాలోని బెల్‌గ్రేడ్‌లో జరిగింది. దీనికి 25 సభ్య దేశాలు హాజరయ్యాయి. 2012 నాటికి దీని సభ్యత్వం 120 దేశాలకి పెరిగింది. దీంట్లో 17 మంది పరిశీలకులు ఉన్నారు. మూడు ముఖ్య ఉద్దేశాలతో మొదటి సమావేశం జరిగింది:

- అలీనోద్యమ సభ్యదేశాల మధ్య సహకారం, వీటిల్లో అనేకం కొత్తగా స్వతంత్ర దేశాలు అయ్యాయి
- పెరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధ తీవ్రతలు, మిగిలిన ప్రపంచంపై దాని ప్రభావం
- వలస పాలననుంచి విముక్తి అయిన దేశాలు ఏ సైనిక శిబిరంలోనూ చేరకుండా చూడటం

రెండు అగ్ర రాజ్యాలు పోటీపడుతూ వివిధ దేశాలను తమ వైపుకి లాక్కోటానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో భారతదేశం వంటి దేశాలు స్వతంత్ర వైఖరిని వ్యక్తపరచటానికి అలీనోద్యమం దోహదపడింది. అగ్ర రాజ్యాలను ఒకదానిని మరొకదానికి వ్యతిరేకంగా ఉపయోగించుకుని కొత్తగా అభివృద్ధి చెందిన దేశాలు తమకు కావలసిన సహాయాన్ని, స్థానాన్ని పొందగలిగాయి. అలీనోద్యమ దేశాల మధ్య విభేదాలను పరిష్కరించుకోటానికి కూడా కొంతవరకు ఇది దోహదపడింది. రెండు అగ్ర రాజ్యాలు అలీనోద్యమాన్ని అనుమానపు దృష్టితో చూశాయి. అంతర్జాతీయ అంశాలపై అలీనోద్యమం రష్యాకి దగ్గరగా ఉందని అమెరికా భావించేది. ఉదాహరణకు ఆఫ్ఘనిస్తాన్‌పై సోవియట్ దాడి చెయ్యటం పట్ల స్పందించకపోవటం అలీనోద్యమ నిష్పక్ష సిద్ధాంతాలకు భిన్నంగా ఉందని అమెరికా విమర్శించింది. అలీనోద్యమంలోని మరొక బలహీనత దాని సభ్యదేశాలు ఒకదానితో ఒకటి యుద్ధానికి దిగకుండా

- 1955 బాండుంగ్ సమావేశ ముఖ్య ఉద్దేశం ఏమిటి?
- అలీనోద్యమ సూత్రాలకు అగ్ర రాజ్యాలు ఎలా స్పందించాయి?
- అలీనోద్యమ దేశాలను మూడవ ప్రపంచ దేశాలని ఎందుకంటారు?

నివారించలేకపోవటం. ఉదాహరణకు ఇరాన్, ఇరాక్‌లు ఏడేళ్ల సుదీర్ఘ యుద్ధానికి దిగినప్పుడు అలీనోద్యమం ఏమీ చెయ్యలేకపోయింది. ఈ పరిమితులు ఉన్నప్పటికీ రెండు అగ్ర రాజ్యాల మధ్య చీలిన ప్రపంచ నేపథ్యంలో కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు అంతర్జాతీయ వ్యవహారాలలో స్వతంత్రంగా వ్యవహరించటానికి అలీనోద్యమం సహాయపడింది.

## పశ్చిమ ఆసియా ఘర్షణలు

యూరపు, ఆసియా మధ్య ప్రాంతాన్ని పశ్చిమ ఆసియా అంటారు. ఇదే ప్రాంతాన్ని మధ్యప్రాచ్యం అని కూడా అంటారు. అరబ్బులు, యూదుల మధ్య ఏర్పడిన ఘర్షణలను పశ్చిమ ఆసియా సంక్షోభమని అంటారు. ఇది ప్రధానంగా పాలస్తీనా ఆక్రమణకు సంబంధించినది. అరబ్బులు నివాసముంటున్న పాలస్తీనా రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బ్రిటిష్ నియంత్రణలో ఉండేది. అక్కడ ఉన్న జెరూసలేం యూదులు, క్రైస్తవులు, ముస్లిములందరికీ పవిత్ర స్థలం.

యూదులు పాలస్తీనాని తమ 'వాగ్దత్త భూమి'గా పరిగణిస్తారు. ప్రాచీనకాలంలో అక్కడినుంచి వాళ్లను నిర్వాసితులను చేయడంతో వారు యూరపు, ఆసియా అంతటా వలసలు పోయారు. యేసుక్రీస్తుని శిలువ వెయ్యటానికి యూదులను బాధ్యులను చేసి యూరపులో ఉన్న క్రైస్తవులు వాళ్లను వేధింపులకు గురి చేసేవాళ్లు. జర్మనీలో నాజీ పాలన కింద లక్షలాది యూదులను చంపటం, జైలుపాలు చెయ్యటం దీనికి పరాకాష్ట.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూదులను ఏకం చేసి, తమ మాతృభూమి అయిన పాలస్తీనాను తిరిగి పొంది, యూదులకు ప్రత్యేక దేశాన్ని నిర్మించటానికి యూదులలో 'జియానిస్ట్ ఉద్యమం' మొదలయ్యింది. 1945లో దీనికి పాశ్చాత్య శక్తుల మద్దతు కూడా లభించింది. అయితే అప్పటికే పాలస్తీనియన్లు (వీళ్లల్లో ఎక్కువ మంది అరబ్బు ముస్లిములు) అక్కడ నివసిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం కోసం ఇరు ప్రజల మధ్య ఘర్షణ మొదలయ్యింది.

మధ్యప్రాచ్యంలో, ప్రత్యేకించి అరబ్బు ద్వీపఖండంలో పెద్ద ఎత్తున చమురు నిల్వలను కనుగొనటంతో సమస్య మరింత సంక్లిష్టరూపం దాల్చింది. అమెరికా, రష్యాలు ఈ ప్రాంతాన్ని తమ ప్రాభవంలోకి తీసుకోవాలని ప్రయత్నించాయి. ఇతరులు దానిపై నియంత్రణ సాధించకుండా అడ్డుకున్నాయి.

1947లో ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీని ప్రకారం పాలస్తీనాను రెండు భాగాలుగా చేసి ఒకటి అరబ్బులకు, మరొకటి యూదులకు కేటాయించారు. 1948లో బ్రిటన్ తన సైన్యాలను పాలస్తీనానుంచి ఉపసంహరించుకుంది. యూదుల కోసం ఇజ్రాయెల్ ఏర్పడింది. అరబ్బులు తమ మాతృభూమిని వదులుకోటానికి అంగీకరించలేదు. ఇజ్రాయెల్‌ని చట్టబద్ధ దేశంగా గుర్తించటానికి అరబ్బులు తిరస్కరించారు. పాలస్తీనా పట్ల ఇజ్రాయెల్ దేశం అవలంబించిన విధానాలు విద్వేషాలను మరింత రెచ్చగొట్టాయి. అరబ్బులు తమ ఆస్తులు, ఇళ్లు వదిలి వెళ్లి ఇతర అరబ్బు దేశాలలో కాందిశీకులుగా ఆశ్రయం పొందారు.

ఈజిప్టు అధ్యక్షుడు గమల్ అబ్దెల్ నాసర్(1918 –1970) అరబ్బులను ఏకం చెయ్యటానికి ప్రయత్నించాడు. ఇజ్రాయెల్‌లోని బహిరంగ ప్రదేశాల్లో పేలుళ్లు చేపట్టటానికి అతడు ఆత్మాహుతి దళాలను ఏర్పాటు చేశాడు. అతడు బ్రిటన్, ఫ్రాన్స్‌లకు వ్యతిరేకంగా తీవ్ర విధానాలను అనుసరించి సుయెజ్ కాలువ నుంచి సైన్యాన్ని ఉపసంహరించు కోవలసిందిగా బ్రిటన్‌ని ఒత్తిడి చేశాడు. అస్వాన్

పటం 2 : 1947 నుంచి నేటివరకు పాలస్తీనా కోల్పోయిన భూమి




ఆనకట్ట కట్టినందుకు ఈజిప్టుకి అమెరికా తన ఆర్థిక సహాయాన్ని నిలిపి వేసింది. పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో ఈజిప్టుకి ఆయుధాలు, మందుగుండ్లు సరఫరా చేసిన రష్యా సహాయంతో నాసర్ సుయెజ్ కాలువను జాతీయం చేశాడు.

1956లో పాశ్చాత్య దేశాల మద్దతుతో ఈజిప్టుపై ఇజ్రాయెల్ దాడి చేసింది. యుద్ధాన్ని విరమించవలసిందిగా అమెరికా, రష్యాలు కోరాయి. ఇజ్రాయెల్ తన సైన్యాన్ని ఉపసంహరించుకుంది. 1967లో అరబ్బులు మరొకసారి ఇజ్రాయెల్‌పై దాడి చేశారు. ఎదురుదాడి చెయ్యటమే మెరుగైన రక్షణాత్మక చర్యగా భావించి ఈజిప్టుపై ఇజ్రాయెల్ దాడి చేసి దాని వాయు దళాన్నంతటినీ విధ్వంసం చేసింది. అంతేకాకుండా గాజా, గోలాన్‌హైట్స్, వెస్ట్ బ్యాంక్ భూభాగాలను ఆక్రమించింది. ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసినప్పటికీ ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి ఇవ్వటానికి ఇజ్రాయెల్ నిరాకరించింది, అయితే యుద్ధ విరమణకు మాత్రం అంగీకరించింది. ఈ ఆక్రమిత ప్రాంతాలు బఫర్ ప్రాంతంగా పని చేస్తుందని ఇజ్రాయెల్ భావించింది. అరబ్బుల ఉద్యమాన్ని ఈ యుద్ధం కుంటుపరిచింది.

ఈలోగా 1964లో జోర్డాన్‌లో పాలస్తీనా విముక్తి సంఘం (పిఎల్‌ఓ) ఆవిర్భవించింది. అరబ్బు బృందాలన్నింటినీ ఏకం చేసి ఇది ఒక కొత్త కోణాన్ని తీసుకొచ్చింది. కోల్పోయిన భూమిని శాంతియుతంగా తిరిగి పొందటం దీని లక్ష్యం. అయితే 1967లో యాసర్ అరాఫత్ నాయకత్వంలోని పిఎల్‌ఓ ఇజ్రాయెల్‌పై దాడి చెయ్యాల్సిందిగా అరబ్బు దేశాలపై ఒత్తిడి పెట్టసాగింది. దీనికి అయితే అరబ్బు దేశాలు అంత ఉత్సాహం చూపలేదు. దాంతో పిఎల్‌ఓలో నుంచి ఒక వర్గం అరాఫత్ నేతృత్వంలో చీలి విమానాల హైజాకింగ్, 1972 సెప్టెంబరులో మ్యునిచ్ ఒలంపిక్స్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన ఒలంపిక్ బృందాన్ని అపహరించి అనేకమంది క్రీడాకారులను చంపటం వంటి ఉగ్రవాదచర్యలకు పాల్పడింది. పాలస్తీనియన్ల ఈ దాడులను సాకుగా చేసుకుని ఇజ్రాయెల్ వాళ్లపై తిరిగి దాడులు చేసి, తాము గతంలో ఇచ్చిన మాటను అమలు చెయ్యటానికి నిరాకరించింది.

దాడులు, ప్రతిదాడులతో ఈ ప్రాంతమంతా నిత్యం యుద్ధ వాతావరణంతోటీ, ఉగ్రవాదుల దాడులతోటీ ఉండేది. పిఎల్‌ఓ పరస్పరం ఘర్షణకు పాల్పడే అనేక చిన్న వర్గాలుగా చీలిపోయింది. అంతిమంగా అరాఫత్ ఉగ్రవాదాన్ని విడిచిపెట్టి ఇజ్రాయెల్‌ను గుర్తించటం ద్వారా శాంతియుత పరిష్కారం కనుగొనటానికి అంగీకరించాడు. దీర్ఘకాల యుద్ధాన్ని ముగించటానికి అతడు ఇజ్రాయెల్‌తో సంప్రదింపులు జరిపి పాలస్తీనియన్ల స్వయంపాలనకు సంబంధించి అనేక ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. వెస్ట్ బ్యాంక్ నుంచి

తన సైన్యాన్ని ఉపసంహరించుకోటానికే కాక పాలస్తీనాలోని అరబ్ వాసులకు ఓటు హక్కు ఇవ్వటానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. అయితే ఇజ్రాయెల్ తన మాటను నిలుపుకోక ఏదో ఒక సాకుతో పాలస్తీనియన్లపై దాడులు కొనసాగించటం వల్ల ఈ ఒప్పందాలు విజయవంతం కాలేదు. పాలస్తీనియన్ దేశానికి పిఎల్ఓని చట్టబద్ధ ప్రతినిధిగానూ, అరాఫత్ దానికి అధ్యక్షుడుగానూ గుర్తించటానికి అనేక దేశాలు అంగీకరించాయి. అరాఫత్ 2004లో చనిపోయాడు. విషాహారం ఇచ్చి అతడిని చంపేశారన్న అనుమానం ఉంది.

ఇప్పటికీ పాలస్తీనియన్లు దేశ బహిష్కరణ, యుద్ధంలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూ, తమ సొంతగడ్డ కోసం, ప్రశాంత జీవనం కోసం పోరాటం సాగిస్తూనే ఉన్నారు.

- అరబ్బులు, పాలస్తీనియన్ల మధ్య ఘర్షణలకు కారణాలు ఏమిటి?
- ఘర్షణలలో పాలస్తీనియన్లకు ఈజిప్టు ఎందుకు మద్దతు ఇచ్చింది?
- కొంతమంది పాలస్తీనియన్లు ఉగ్రవాద పంథాని ఎందుకు ఎంచుకున్నారు? దాని ఫలితాలు ఏమిటి?
- శరణార్థుల శిబిరాలలో ఉంటూ నిరంతరం యుద్ధ భయమూ, పేదరికాన్ని ఎదుర్కొంటున్న పాలస్తీనియన్ల జీవన పరిస్థితుల గురించి తెలుసుకోండి.

## గల్ఫ్ (మధ్యప్రాచ్య) ప్రాంతంలో పెరిగిన జాతీయతావాద భావం

ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు కొనసాగిస్తూ ఉండటం, పాలస్తీనియన్ల దయనీయ పరిస్థితి కారణంగా ఈ ప్రాంతంలో అమెరికా వ్యతిరేక భావనలు బాగా వ్యాప్తి చెందాయి. తమకు, తమ మిత్ర దేశాలకు చమురు వనరులు అందుబాటులో ఉండటానికి ఈ ప్రాంతంలోని అప్రజాస్వామిక ప్రభుత్వాలకు అమెరికా మద్దతు ఇవ్వటం కారణంగా కూడా అది ప్రజల ద్వేషానికి గురయ్యింది. ఎడారి ప్రాంతంలో ఏ ఇతర వనరులు లేని ప్రజల సంక్షేమం కోసం చమురు వనరుల నుంచి వచ్చిన ఆదాయాన్ని వినియోగించాలని ప్రజలు కోరుకున్నారు. 1968లో ఇరాక్‌లో తిరుగుబాటు చేసి అరబ్బు జాతీయతావాదం, సోషలిజం అన్న జంట నినాదాలతో సద్దాం హుస్సేన్ అధికారంలోకి వచ్చాడు. సోషలిజం అంటే వాళ్ల ఉద్దేశంలో చమురు వనరుల జాతీయాకరణ, చమురు నుంచి వచ్చే ఆదాయాన్ని పౌరుల సంక్షేమ చర్యల కోసం ప్రభుత్వం ఖర్చు చేయటం. 1969లో ఇదే రకమైన పరిణామాలు లిబియాలోనూ చోటు చేసుకున్నాయి. (దీని గురించి మీరు తొమ్మిదవ తరగతిలోని 19వ అధ్యాయంలో చదివారు.) ఈ ప్రభుత్వాలు సంక్షేమ విధానాలతో పాటు ఒక వ్యక్తి, లేదా చిన్న బృందం యొక్క నియంతృత్వ పాలనను చేపట్టాయి. ఎటువంటి ప్రజాస్వామిక నిరసనలను కానీ, వ్యతిరేకతను కానీ ఇవి అనుమతించలేదు.

అనేక ప్రాంతాలలో అమెరికాకు, అమెరికా మద్దతు ఇచ్చిన ప్రభుత్వాలకు వ్యతిరేకత మతపరమైన రంగు సంతరించుకుంది. సంపదను, అవకాశాలను అందరికీ సమంగా పంచాలన్న భావనకు జాతీయతావాద శక్తులు రాకుండా ఆయా దేశాలలో మత ఛాందసవాదులు అధికారంలోకి వచ్చేందుకు మద్దతునిచ్చాయి. 1979లో ఇరాన్‌లో విప్లవం సంభవించి (అమెరికా మద్దతు ఇచ్చిన) ఇరాన్ రాజుని తొలగించి షియా ఇస్లామిక్ మత గురువులు, ప్రజాస్వామికంగా ఎన్నికైన నాయకులు కలిసి నిర్వహించే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

సోవియట్ సైనికులు తిరిగి వెళ్లిపోయిన తరువాత ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చి తీవ్రవాద ఇస్లామిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మతగ్రంథాలలో ఉన్న నియమాలను ప్రజలు ఖచ్చితంగా

పాటించాలని ప్రజలను బలవంతం చేయసాగారు. ఈ కారణంగా మహిళలకు, మతపర అల్పసంఖ్యాక ప్రజలకు మౌలిక స్వేచ్ఛ, సమానత్వం లేకుండా పోయాయి.

- అరబ్బు సోషలిస్టు జాతీయతావాదానికీ, మతపర జాతీయతావాదానికీ మధ్య తేడాలు ఏమిటి?
- ఇరాన్‌లోనూ, తాలిబన్ల కింద ఉన్న అఫ్ఘనిస్తాన్‌లోనూ సంభవించిన పరిణామాలను తెలుసుకుని మతపర ప్రభుత్వాలు పనిచేసే విధానాన్ని అర్థం చేసుకోండి.

21వ శతాబ్ద ఆరంభంలో అరబ్బులలో అసంతృప్తి పెరిగి, ఫలితంగా మతపర ఉగ్రవాదం పెరిగింది. కొంతమంది అరబ్బు ఉగ్రవాదులు అమెరికాకు చెందిన రెండు విమానాలను హైజాక్ చేసి వాటితో న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంలోకి దూసుకెళ్ళడంతో ఆ భవనాలు కూలి కొన్ని వేలమంది మరణించారు. దీంతో తాలిబన్లపైన అమెరికా యుద్ధం ప్రకటించి అంతిమంగా ఇరాక్‌పైన కూడా యుద్ధానికి దిగింది. ఇటీవల జరిగిన ఈ ఘటనల గురించి మరిన్ని వివరాలను వార్తాపత్రికల నుంచి, వార పత్రికల నుంచి తెలుసుకోండి.

## శాంతి ఉద్యమాలు, యుఎస్ఎస్ఆర్ పతనం, ప్రచ్ఛన్న యుద్ధం అంతం

కాలం గడుస్తున్నకొద్దీ ఆయుధ పోటీని తగ్గించి, అణ్వాయుధాలను నాశనం చెయ్యవలసిందిగా యుఎస్ఎస్ఆర్, అమెరికాలపై ప్రజలు తీవ్ర ఒత్తిడి చెయ్యసాగారు. దీని గురించి తరువాత అధ్యాయంలో వివరంగా తెలుసుకుంటారు. ఫలితంగా ఈ రెండు దేశాలు సంప్రదింపులు జరిపి ఆయుధ పోటీని, నిల్వలను తగ్గించుకోవలసి వచ్చింది. అంతిమంగా 1985-1991 మధ్య అణు పరీక్షలపై నిషేధం విధించారు.

యుఎస్ఎస్ఆర్‌లో మిహాయిల్ గోర్బచేవ్ అధికారంలోకి రావటం వల్ల ఇది సాధ్యమయ్యిందని చెప్పవచ్చు. యుఎస్ఎస్ఆర్‌లో తీవ్ర మార్పులు తెచ్చి, మరింత పారదర్శకంగా చేసి దాని రాజకీయాలను మార్చటానికి గోర్బచేవ్ ప్రయత్నించాడు. అతడు ఉదారవాద సిద్ధాంతాలు కలవాడు, ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకోటానికి అతడు కొన్ని సంస్కరణలను చేపట్టి పాశ్చాత్య దేశాలతో సంబంధాలను మెరుగుపరచటానికి ప్రయత్నించాడు. ఇతడు ప్రవేశపెట్టిన సంస్కరణలను 'గ్లాస్‌నోస్త్', 'పెరిస్త్రోయికా'గా వ్యవహరిస్తారు.



*చిత్రం 20.7: తూర్పు, పశ్చిమ జర్మనీలను విభజించిన బెర్లిన్ గోడను పడగొడుతున్న దృశ్యం.*

ఇదే సమయంలో తూర్పు యూరపు దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుండగా యుఎస్ఎస్ఆర్ వాళ్లకి సహాయపడే స్థితిలో లేదు. ఫలితంగా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ఆర్థిక సంస్కరణలు కోరుతూ తూర్పు యూరపు అంతటా ప్రజా ఉద్యమాలు వెల్లువెత్తాయి. ఫలితంగా దేశాన్ని నడపలేని ప్రభుత్వాలు కుప్పకూలిపోయాయి. పశ్చిమ జర్మనీనుంచి తూర్పు ప్రాంతాన్ని వేరు చేస్తున్న బెర్లిన్ గోడను పడగొట్టడం తూర్పు యూరపు పరిణామాలను సూచిస్తుంది. జర్మనీ ప్రజలు వ్యతిరేకించిన, ఈ గోడ యుఎస్ఎస్ఆర్ నియంత్రణకు సంకేతంగా ఉండి ఎంతో ఖ్యాతిగాంచింది.

> ● రెండు ధృవాల, ఏక ధృవ ప్రపంచం అన్న పదాలను వివరించండి.

యుఎస్ఎస్ఆర్‌లోనే కమ్యూనిస్టు ఛాందసవాదులు గోర్బచెవ్‌ని అధికారం నుంచి తొలగించటానికి ఒక తిరుగుబాటును ప్రోత్సహించారు. అయితే రష్యన్ పార్లమెంటు తరఫున బోరిస్ ఎల్సిన్ ఈ తిరుగుబాటును అడ్డుకున్నాడు. అతడు అంతిమంగా అధ్యక్ష ఎన్నికలలో గెలుపొంది 1991లో యుఎస్ఎస్ఆర్‌ని రద్దు పరుస్తున్నట్లు ప్రకటించాడు. మాజీ యుఎస్ఎస్ఆర్‌లోని రాజ్యాలు స్వతంత్ర దేశాలు అయ్యాయి. ఆ తరువాత వీటిల్లో చాలావరకు రష్యాతో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

యుఎస్ఎస్ఆర్ కుప్పకూలటంతో ప్రపంచ రాజకీయాలలో కొత్త యుగం ఆరంభమయ్యింది. అది ఏక ధృవ ప్రపంచంగా మారింది. ప్రపంచీకరణ యుగం మొదలయ్యింది. దీని గురించి మీరు మరొక అధ్యాయంలో తెలుసుకున్నారు.

## భారతదేశం, దాని పొరుగు దేశాలు

భారతదేశం అలీనోద్యమ వ్యవస్థాపక దేశమని, రెండు అగ్రరాజ్యాల మధ్య తన స్వతంత్ర దృక్పథాన్ని కాపాడుకోటానికి ప్రయత్నించిందని చదివాం. గాంధేయవాద సిద్ధాంతాలైన శాంతి, అహింస ఆధారంగా తన విదేశాంగ నీతిని మలుచుకోటానికి భారతదేశం ప్రయత్నించింది. శాంతిపట్ల తన నిబద్ధతను చాటటానికి జవహర్‌లాల్ నెహ్రూ ప్రఖ్యాతిగాంచిన తన పంచశీల సూత్రాలను ప్రతిపాదించాడు:

1. ఒకరి సర్వసత్తాకతను, భౌగోళిక సమగ్రతను మరొకరు గౌరవించటం.
2. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవటం.
3. దాడులకు దిగకపోవటం, వివాదాలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవటం.
4. అంతర్జాతీయ సంబంధాలలో పరస్పర గౌరవం, సహకారాల కోసం కృషి చేయటం.
5. శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహించటం.

ఇతర దేశాలతో, ప్రత్యేకించి పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్, శ్రీలంక, ఆ తరువాత బంగ్లాదేశ్‌తో భారతదేశ సంబంధాలను ఈ సూత్రాలు ప్రభావితం చేశాయి.

**పొరుగుదేశాలతో భారతదేశ సంబంధాల గురించి కింద ఇచ్చినది చదివి అది ఎంతవరకు ఈ పంచశీల సూత్రాలపై ఆధారపడి ఉందో తెలుసుకోండి.**

## చైనాతో భారతదేశం సంబంధాలు

సుదీర్ఘ పోరాటం, హింసాత్మక విప్లవం తరువాత 1949లో చైనా కమ్యూనిస్టు గణతంత్ర రాజ్యం అయ్యింది. చైనా కమ్యూనిస్టు పార్టీని గుర్తించిన తొలి దేశాలలో భారతదేశం ఒకటి. అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతాసమితిలో చియాంగ్ కై షేక్ ప్రభుత్వానికి ఉన్న శాశ్వత స్థానాన్ని ప్రస్తుతం చైనాకి ఇవ్వాలనటంలో భారతదేశం మద్దతు తెలియచేసింది. సైద్ధాంతిక విభేధాలు ఉన్నప్పటికీ బాండుంగ్ సమావేశంలో పాల్గొనటానికి చైనాకి భారతదేశం సహాయపడింది. పంచశీల ఒప్పందంపై రెండు దేశాలు 1954 ఏప్రిల్ 29న సంతకాలు చేశాయి. రెండు దేశాల నాయకులు తమ ఇరుదేశాలను సందర్శించారు, పెద్ద సంఖ్యలో ప్రజలు వాళ్లకు స్వాగతం పలికారు.

వలసపాలన కాలంలో రెండు దేశాల మధ్య సరిహద్దుగా మెక్ మోహన్ రేఖ గీశారు. నెహ్రూ దానిని అంగీకరించాడు. చైనా, భారతదేశాల మధ్యనున్న టిబెట్ స్వతంత్ర బఫర్ ప్రాంతంగా ఉండేది. అయితే ఒకప్పటి చైనా సామ్రాజ్యంలో టిబెట్ పరాధీన దేశంగా ఉందని పేర్కొంటూ 1950లో టిబెట్‌ని చైనా తనలో కలిపేసుకుంది. దీంతో భారత – చైనా దేశాల మధ్య బఫర్ ప్రాంతం లేకుండాపోయింది.

టిబెట్‌లో జరిగిన తిరుగుబాటుని చైనా అణిచివేసింది. దలైలామాతో సహా వేలాది టిబెటన్లు తప్పించుకుని భారతదేశంలో ఆశ్రయం తీసుకున్నారు. భారతదేశం దలైలామాకి ఆశ్రయం ఇచ్చింది. దీంతో భారత్–చైనాల మధ్య వైరుధ్యం మొదలయ్యింది. భారతదేశాన్ని చైనా ప్రత్యర్థిగా భావించటం మొదలుపెట్టింది. అంతకుముందే రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదం ఏర్పడింది. లడఖ్ ప్రాంతంలోని ఆక్సాయి–చిన్ ప్రాంతం, అరుణాచల్ ప్రదేశ్‌లోని చాలా ప్రాంతం తమదని చైనా పేర్కొంది. అనేక ప్రయత్నాలు, సుదీర్ఘ చర్చలు తరువాత కూడా ఈ వివాదాలు ఈనాటికీ పరిష్కృతం కాలేదు.

- దలైలామాకి, అతని టిబెట్ అనుచరులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వటం సరైనదేనా?
- టిబెట్‌ని నియంత్రించాలని చైనా అనుకోవటం సరైనదేనా?
- సరిహద్దులకు సంబంధించి గత వైరుధ్యాలను మరిచి రెండు దేశాలు ఎంతవరకు అర్థవంత సహకారాన్ని, మిత్రత్వాన్ని సాధించగలవని అనుకుంటున్నారు?

భారతదేశంతో చేసుకున్న శాంతి ఒప్పందాలను భంగపరుస్తూ 1962 అక్టోబరులో భారతదేశంపై చైనా దండెత్తింది. ఈ అకస్మాత్తు దాడికి భారతదేశం సన్నద్ధంగా లేకపోవటంతో దీంట్లో తీవ్ర నష్టాలు చవి చూసింది. అంతిమంగా చైనా ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించి సైన్యాన్ని ఉపసంహరించుకుంది. తిరిగి సాధారణ సంబంధాలు నెలకొనటానికి దశాబ్ద కాలానికిపైగా పట్టింది. పూర్తి స్థాయి దౌత్యసంబంధాలు 1976లో గాని నెలకొనలేదు.

ప్రస్తుతం రెండు దేశాలు ఆసియాలో బలపడుతున్న శక్తులుగా, ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవిగా గుర్తింపబడుతున్నాయి. ప్రపంచంలోనే ముఖ్య ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదగాలన్న కోరిక ప్రస్తుతం రెండు దేశాలకు ఉంది. దాంతో ఇవి ఒకదానిని ఒకటి రాజకీయ, ఆర్థిక పోటీదారుగా కూడా పరిగణిస్తున్నాయి. సరిహద్దుల వద్ద చెదురుమదురు ఘటనలు జరుగుతున్నప్పటికీ శాంతి, సామరస్యాలు నెలకొనేలా ఇరు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

## పాకిస్తాన్‌తో భారతదేశ సంబంధాలు

ఇంతకు ముందు పాఠంలో చెప్పినట్టు ఒకప్పటి బ్రిటిష్ ఇండియాని విభజించటం ద్వారా పాకిస్తాన్, భారతదేశం స్వతంత్ర దేశాలు అయ్యాయి. విభజన తరువాత రెండు దేశాల మధ్య నిరంతరం ఘర్షణలు కొనసాగుతున్నాయి. కాశ్మీరు రెండింటి మధ్య ముఖ్యమైన వివాదాంశంలుగా పరిణమించింది.

రెండు దేశాల మధ్య మొదటి యుద్ధం కాశ్మీరు కోసం 1947–48 మధ్య జరిగింది. అయితే ఇది సమస్యను పరిష్కరించలేదు. యుద్ధం వల్ల కాశ్మీరు రెండుగా విభజింపబడింది: పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీరు (పిఓకె), భారతదేశంలోని జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రం. ఈ రెండింటిని వాస్తవాధీన రేఖ విడదీస్తోంది.

*రేఖాచిత్రం 2 : భారతదేశం, పాకిస్తాన్‌ల సైనిక ఖర్చు*




1965లో భారతదేశానికి ప్రధాన మంత్రిగా లాల్‌బహాదుర్ శాస్త్రి ఉన్నాడు. పాకిస్తాన్‌లో సైనిక నియంత జనరల్ ఆయుబ్‌ఖాన్ అధికారంలో ఉన్నాడు. కాశ్మీరుని విముక్తి చెయ్యటం అన్న పేరుతో

### మతం, యుద్ధం

యుద్ధం ముగిసిన తరువాత ఢిల్లీలో జరిగిన ఒక ప్రదర్శనలో ఇది ముస్లిములు, హిందువులకు మధ్య యుద్ధంగా పేర్కొంటూ పాకిస్తాన్ మతాన్ని ఉపయోగించుకోటానికి చేసిన ప్రయత్నాన్ని లాల్‌బహదూర్ శాస్త్రి నిరసించాడు. భారతదేశం లౌకిక రాజ్యమని గర్వంగా చెప్పాడు.

"మన దేశ ప్రత్యేకత ఏమంటే ఇక్కడ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, పార్సీలు, ఇంకా ఎన్నో మతాల ప్రజలు ఉన్నారు. ఇక్కడ గుడులు, మసీదులు, గురుద్వారాలు, చర్చిలు ఉన్నాయి. అయితే వీటిని మనం రాజకీయాల్లో జోక్యం చేసుకోనివ్వం.... భారతదేశానికి, పాకిస్తాన్‌కి మధ్య ఉన్న తేడా ఇదే. పాకిస్తాన్ తనని తాను ఇస్లామిక్ దేశంగా పేర్కొంటూ మతాన్ని రాజకీయ అంశంగా ఉపయోగించుకుంటోంది. భారతదేశ ప్రజలు ఏ మతాన్ని అయినా ఆచరించవచ్చు, ఏ విధంగానైనా దేవుడిని ఆరాధించవచ్చు. రాజకీయాలకు వచ్చేసరికి ప్రతి ఒక్కరూ భారతీయులే."

భారతదేశంపై దాడి చేస్తే కాశ్మీరులో తిరుగుబాటు సంభవిస్తుందని ఆయుబ్ ఖాన్ ఆశించాడు. అయితే, కాశ్మీరు ప్రజలు ఇందుకు స్పందించలేదు, యుద్ధంలో భారత ప్రభుత్వానికి సహాయం చేశారు. లాహెూర్‌ని లక్ష్యంగా చేసుకుని పంజాబ్ నుండి భారతదేశం యుద్ధం చేయడంతో కాశ్మీరు నుంచి పాకిస్తాన్ వెనక్కి తగ్గక తప్పలేదు. కాల్పుల విరమణకు అంగీకరించేట్లు రెండు దేశాలను ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అయిన యుథాంట్ ఒప్పించాడు. కాల్పుల విరమణ తరువాత 1966లో తాష్కెంట్‌లో రెండు దేశాల ప్రధాన మంత్రులు ఒక ఒప్పందంపై సంతకం చేశారు.

1970 ఆరంభంలో పాకిస్తాన్ తీవ్ర అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంది. పాకిస్తాన్‌లో సైనిక నియంత అయిన జనరల్ యాహ్యాఖాన్ ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తానని మాట ఇచ్చి ఎన్నికలకు ఆదేశించాడు. ఎన్నికలలో ప్రజల తీర్పు భిన్నంగా వచ్చింది. పశ్చిమ పాకిస్తాన్‌లో జుల్ఫికర్ అలి భుట్టో గెలవగా తూర్పు పాకిస్తాన్‌లో షేక్ ముజిబుర్ రహ్మాన్ నాయకత్వంలోని అవామీ లీగ్ విజయం సాధించింది. అయితే ఈ ఎన్నికల తీర్పుకి కానీ, తూర్పు పాకిస్తాన్‌కి మరింత స్వయం ప్రతిపత్తి ఇచ్చేదానికి కానీ పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకరించలేదు. దానికి బదులు ముజిబుర్ రెహ్మాన్‌ని అరెస్టు చేసి అణిచివేతకు పూనుకున్నారు. తూర్పు పాకిస్తాన్ నుంచి వేలాది కాందిశీకులు భారతదేశానికి రాసాగారు. ముజిబుర్ రెహ్మాన్ మద్దతుదారులు 'ముక్తి బాహిని' పేరుతో విముక్తి పోరాటాన్ని చేపట్టారు. భారతదేశ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధి దీనికి మద్దతుగా నిలవటమే కాకుండా అంతర్జాతీయ మద్దతును కూడా కూడగట్టటానికి ప్రయత్నించింది. భారతదేశానికి మద్దతుగా నిలిచిన యుఎస్ఎస్ఆర్‌తో మైత్రీ ఒప్పందంపై భారతదేశం సంతకం చేసింది.

1971 డిసెంబరులో పాకిస్తాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం చెలరేగింది. తూర్పు పాకిస్తాన్ విముక్తి చెంది బంగ్లాదేశ్‌గా ఏర్పడింది. దీనితో భారతదేశం కాల్పుల విరమణ ప్రకటించటంతో యుద్ధం ముగిసింది. తరువాత జుల్ఫికర్ అలి భుట్టో, ప్రధానమంత్రి ఇందిరాగాంధి నేతృత్వంలో రెండు దేశాల మధ్య సిమ్లా ఒప్పందం కుదిరింది.

1971 యుద్ధం తరువాత రెండు దేశాల మధ్య బహిరంగ యుద్ధమేదీ జరగలేదు. కాని సరిహద్దు వెంట అనేకసార్లు కాల్పులు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మీరు 'కార్గిల్ యుద్ధం' గురించి విని ఉంటారు. 1999లో పాకిస్తాన్ సైన్యం సహాయంతో భారత వ్యతిరేక తీవ్రవాదులు భారత భూ భాగాలను ఆక్రమించుకోగా సైనిక చర్యతో వాళ్లను తిప్పికొట్టాల్సి వచ్చింది.

భారతదేశ సరిహద్దు రాష్ట్రాలైన పంజాబు, జమ్ము-కాశ్మీరులలో పాకిస్తాన్ వేర్పాటు ఉద్యమాలను బలపరుస్తూ వస్తోంది. ఇటువంటి ఉద్యమాలకు మద్దతు ఇవ్వటమే కాకుండా మతతత్వ తీవ్రవాదులకు శిక్షణనిచ్చి భారతదేశంలో సమస్యలు సృష్టించటానికి పాకిస్తాన్ నిరంతరం ప్రయత్నిస్తోందని భారతదేశం ఆరోపిస్తుంది. అందుకు బదులుగా భారతదేశం తమ దేశంలో అస్థిరత సృష్టిస్తోందని అణ్వాయుధాలు, ఇతర ఆయుధాల నిల్వల ద్వారా, సైనిక చర్య ద్వారా తనను నిత్యం బెదిరిస్తోందనీ పాకిస్తాన్ ఆరోపణలు

చేస్తుంది. దీని ఫలితంగా రెండు దేశాలు ఒకదానికి వ్యతిరేకంగా మరొకటి ఆయుధాలను సమకూర్చు కోటానికి పెద్ద ఎత్తున విలువైన నిధులను ఖర్చు చేస్తున్నాయి. రెండు దేశాల దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయి. రెండవదేశం తమపై దాడికి దిగకుండా ఈ అణ్వాయుధాలు నిరోధిస్తాయని రెండు దేశాలూ నమ్ముతున్నాయి.

- రెండు దేశాల మధ్య శాశ్వత శాంతి నెలకొనటానికి భారతదేశం, పాకిస్తాన్‌లు ఏ చర్యలు తీసుకోవాలి?
- భారతదేశం, పాకిస్తాన్‌ల అభివృద్ధికి రెండు దేశాల మధ్య శాంతి అవసరం ఏమిటి?

అదే సమయంలో సంస్కృతి, నాగరితలను పంచుకున్న సుదీర్ఘ చరిత్ర ఇరు దేశాలకు ఉండటంతో స్వార్థపరశక్తులు ద్వేషాన్ని పెంపొందించినప్పటికీ వాటిని అధిగమించటానికి పాకిస్తాన్, భారతదేశ ప్రజలు ప్రయయత్నిస్తున్నారు. వాణిజ్యం, క్రీడలు, సినిమాలు, పర్యటన, సాంస్కృతిక అనుసంధానాల ద్వారా స్నేహవారధులు నిర్మించటానికి ప్రయత్నిస్తున్నారు. రెండు దేశాలలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఉంటే ఇది ఇరు దేశ ప్రజల మధ్య మరింత అవగాహన, సహకారం ఏర్పడటానికి దోహదం చేస్తుందని భారతీయులు, పాకిస్తానీ ప్రజలు భావిస్తున్నారు. ఈ రెండు దేశాల మధ్య ఘర్షణ పెరగటం వల్ల ఈ ఆదర్శాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.

## బంగ్లాదేశ్‌తో భారతదేశ సంబంధాలు

1972లో భారతీయ సైనికుల సహాయంతో పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి చెందింది. అది స్వాతంత్ర్యం పొందిన వెంటనే భారతదేశంతో 25 సంవత్సరాల శాంతి ఒప్పందంపై సంతకం పెట్టింది. అయితే బ్రహ్మపుత్ర, గంగా నదీజలాల పంపకం వంటి అనేక అంశాలపై రెండు దేశాల మధ్య విభేదాలు ఉన్నాయి. బంగ్లాదేశ్ నుంచి ప్రజలు పెద్ద ఎత్తున చట్ట విరుద్ధంగా భారతదేశంలోకి రాకుండా కొన్ని సరిహద్దు ప్రాంతాలలో భారతదేశం కంచె నిర్మించటాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వం అభ్యంతర పెట్టింది. తీర ప్రాంతంలో భారతదేశం పెద్దన్న పాత్ర పోషిస్తోందని బంగ్లాదేశ్ భావిస్తోంది.

ఇన్ని విభేదాలు ఉన్నప్పటికీ రెండు దేశాలు అనేక రంగాలలో, ప్రత్యేకించి ఆర్థికరంగంలో సహకరించుకుంటున్నాయి. దక్షిణ ఆసియాని మ్యాన్‌మార్ ద్వారా తూర్పు ఆసియాతో అనుసంధానం చెయ్యాలన్న భారతదేశ విధానంతో బంగ్లాదేశ్ ఒక భాగమైంది. వైపరీత్యాల నిర్వహణలో రెండు దేశాల మధ్య సహకార ఒప్పందం ఉంది. బంగ్లాదేశ్ విముక్తి కోసం పోరాడిన, ప్రాణత్యాగం చేసిన ఎందరో భారతీయులను బంగ్లాదేశ్ సన్మానించింది.






*చిత్రం 20.8 : (ఎడమ) 1958లో చైనాకి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తున్న ప్రజలు, బ్యానర్‌లో 'కమ్యూనిస్టు చైనా టిబెట్ జోలికి పోవద్దు' అని ఉంది, (కుడి) 1971లో తూర్పు పాకిస్తాన్ నుంచి భారతదేశంలోకి వస్తున్న కాందిశీకులు*

- *పొరుగునున్న పెద్ద దేశాలు 'పెద్దన్న లాగా' వ్యవహరిస్తున్నాయని అనేక చిన్న దేశాలు ఆరోపిస్తూ ఉంటాయి. దీని అర్థం ఏమై ఉంటుంది?*
- భారతదేశం, బంగ్లాదేశ్ ఉన్న పటం చూసి రెండు దేశాల మధ్య సహకారం ఆ రెండింటికీ ఎందుకు కీలకమైనదో పేర్కొనండి.

## శ్రీలంకతో భారతదేశ సంబంధాలు

భారతదేశానికి దక్షిణాన హిందూ మహాసముద్రంలో ఉన్న ద్వీప దేశం శ్రీలంక. అది 1948లో స్వాతంత్ర్యం పొందింది. అనాదిగా భారతదేశం, శ్రీలంకల మధ్య సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. రెండూ వలస పాలననుంచి విముక్తి పొంది, ఈనాటికీ ప్రజాస్వామిక దేశాలుగా ఉన్నాయి. తమిళం మాట్లాడే అల్పసంఖ్యాక ప్రజల పట్ల శ్రీలంక ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఇరు దేశ సంబంధాలమధ్య ముల్లు మాదిరి తయారయ్యింది. దీని గురించి మీరు తొమ్మిదవ తరగతిలో చదివారు. ఆ చర్చను మరొకసారి గుర్తుకు తెచ్చుకోండి.

- బంగ్లాదేశ్‌కి భారతదేశం ఇచ్చిన మద్దతుని, శ్రీలంకలో దాని పాత్రని పోల్చండి. రెండు దేశాలలో పరిస్థితి ఒకే రకంగా ఉందా, తేడాలు ఉన్నాయా?

శ్రీలంక తమిళ కాందిశీకులు పెద్ద సంఖ్యలో భారతదేశంలోకి రావటం ప్రత్యేక సమస్యగా మారింది. దీంతో భారతదేశం మరింత చొరవ తీసుకుని ఆ దేశంలో శాంతిని నెలకొల్పటానికి శ్రీలంకతోటీ, తమిళ తీవ్రవాదులతోటి ఒప్పందం కుదుర్చుకుంది. శ్రీలంకలో శాంతిని నెలకొల్పటానికి భారతదేశం తన సైన్యాన్ని పంపించటం గురించి, ప్రధానమంత్రి రాజీవ్ గాంధీని తమిళ తీవ్రవాదులు చంపటం గురించి ఇంతకు ముందు చదివారు. తమిళ తీవ్రవాదులకు వ్యతిరేకంగా శ్రీలంక ప్రభుత్వం పూర్తిస్థాయి యుద్ధానికి దిగినప్పుడు భారతదేశం అందులో జోక్యం చేసుకోగూడదని నిర్ణయించుకుంది. ఈ యుద్ధంలో మానవ హక్కుల ఉల్లంఘన, తీవ్ర రక్తపాతం సంభవించాయి. దీంతో తన దేశంలో శ్రీలంక సైనిక ఘర్షణలకు ముగింపు పలకగలిగింది.

### కీలక పదాలు

సైనిక ఒప్పందాలు    పరోక్ష యుద్ధం    ఆయుధ పోటీ    ఏకధృవ ప్రపంచం    ద్విధృవ ప్రపంచం
వలసపాలిత దేశాల విముక్తి    వీటో    జాతి వైరుధ్యాలు    పంచశీల

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. సరైన సమాధానాన్ని ఎంచుకోండి: ప్రచ్ఛన్న యుద్ధం గురించి కింద ఉన్న వ్యాఖ్యానాలలో ఏది సరైనది కాదు?
అ) అమెరికా, యుఎస్ఎస్ఆర్‌ల మధ్య విరోధం ఆ) అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లు ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనటం
ఇ) ఆయుధ పోటీకి కారణం అవ్వటం    ఈ) రెండు అగ్రరాజ్యాల మధ్య సైద్ధాంతిక పోరు
2. కింద పేర్కొన్న వాటిల్లో ఏది పశ్చిమ ఆసియా సంక్షోభంలో లేదు?
అ) ఈజిప్టు    ఆ) ఇండోనేసియా    ఇ) బ్రిటన్    ఈ) ఇజ్రాయెల్
3. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ అధికారంలో ఎటువంటి మార్పులు వచ్చాయి?
4. ప్రపంచంలో శాంతి నెలకొల్పటానికి ఐక్యరాజ్య సమితి నిర్వహించే వివిధ పాత్రలు ఏమిటి?
5. ప్రజాస్వామ్య భావన నేపథ్యంలో నిర్ణయాలు తీసుకోవటంలో కొన్ని దేశాలకు ప్రత్యేక అధికారాలు ఉండటం సరైనదేనా?
6. సైనిక ఒప్పందాలతో అగ్రరాజ్యాలు ఎలా లాభపడ్డాయి?
7. ప్రచ్ఛన్న యుద్ధం వల్ల ఆయుధ పోటీ, ఆయుధ నియంత్రణ రెండూ ఎలా జరిగాయి?
8. ప్రపంచంలో ఘర్షణలకు కేంద్రంగా పశ్చిమ ఆసియా ఎందుకు మారింది?
9. 20వ శతాబ్దం చివరి నాటికి ఒక్క దేశమే ప్రపంచంమీద పెత్తనం వహిస్తోంది. ఈ నేపథ్యంలో అలీనోద్యమం పాత్ర ఏమై ఉంటుంది?
10. "కేవలం సైనిక ఒప్పందాల నేపథ్యంలోనే కాకుండా ఆర్థిక విధానాల నేపథ్యంలో కూడా అలీనోద్యమం ఏర్పడింది." దీనిని సమర్థించండి.
11. భారత దేశానికి పొరుగుదేశాలతో ఈ దిగువ అంశాలతో సంబంధాన్ని చూపటానికి ఒక పట్టిక తయారుచెయ్యండి: ఘర్షణకు కారణమైన అంశాలు; యుద్ధ సంఘటనలు; సహాయ, సహకార ఘటనలు.
12. "శ్రీలంకలో జాతి వైరుధ్యాలు భారతదేశంతో దాని సంబంధాలను ప్రభావితం చేశాయి." వివరించండి.

పాఠం 21

# సమకాలీన సామాజిక ఉద్యమాలు

ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్న అనేక ఉద్యమాలను మీరు చూసి ఉండవచ్చు. ఒక సమస్యను ఎంచుకొని, దాంట్లో మార్పు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఆ ఉద్యమం మొదలుపెడతారు. ఇటువంటి ఉద్యమాల్లో మీరు పాల్గొని ఉండవచ్చు. వార్తాపత్రికలలో చదివిన లేదా మీరు పాల్గొన్న ఉద్యమాలను గుర్తుకు తెచ్చుకోండి. సమస్యలు ఏమిటి, దాని వల్ల ఎవరు ప్రభావితులయ్యారు, వాళ్ల కోరికలు ఏమిటి, ఉద్యమానికి నాయకత్వం ఎవరు వహించారు, ఉద్యమంలో చేరమని ప్రజలని ఎలా ప్రోత్సహించారు, ఉద్యమంలోపల ఏవైనా అభిప్రాయబేధాలున్నాయా, ఉద్యమం ఎలా కొనసాగింది, తన ఉద్దేశాలను అది ఎంతవరకు సాధించింది?

## నేపథ్యం

20వ శతాబ్దం తొలి సగంలో ప్రపంచంలో యుద్ధాలు, విప్లవాలు, జర్మనీ ఫాసిజం, సోవియట్ సోషలిజం, పాశ్చాత్య ఉదారవాదం, జాతీయ విముక్తి పోరాటాలు వంటి ముఖ్యమైన ఘటనలు సంభవించాయి. అయితే 1950ల మధ్య నాటికి రెండవ ప్రపంచ యుద్ధం ముగియటం, భారతదేశం, చైనా, ఇండోనేసియా, నైజీరియా, ఈజిప్టు వంటి వలస, అర్ధవలస దేశాలు స్వతంత్రం కావటంతో ప్రపంచంలో ఒక కొత్త యుగం ఆరంభమయ్యింది. అనేక దేశాలలో ఇది ఆర్థిక ప్రగతి, సంపదల యుగంగా ఉంది. అయితే దీర్ఘకాలంగా సమాన హక్కులకు నోచని వాళ్లు తమ హక్కులు కోరుతూ ముందుకు రావటంతో ఇది అనేక దేశాలలో లేదా సమాజంలోని వర్గాలలో ఉద్రిక్తతలు నెలకొన్న కాలం కూడా.

## 1960లలోని పౌరహక్కులు, ఇతర ఉద్యమాలు

ఇటువంటి ఉద్యమాల్లో అత్యంత ముఖ్యమైనది అమెరికాలోని పౌరహక్కుల ఉద్యమం. పాఠశాలల్లో, బస్సులలో బహిరంగ ప్రదేశాలలో నల్లజాతి వాళ్లను వేరుగా ఉంచటానికి, ఉద్యోగాలలో, గృహ వసతిలో, ఓటు హక్కులో సైతం వాళ్లపట్ల వివక్షత చూపటానికి వ్యతిరేకంగా ఆఫ్రో–అమెరికన్లు లేదా నల్లజాతి అమెరికన్లు సమానత్వానికి చేపట్టిన పోరాటం ఇది. ఈ పోరాటం 1960లలో తీవ్ర దశకు చేరుకుంది. పెద్ద ఎత్తున ప్రదర్శనలు, ఊరేగింపులు, 'పౌరనిరాకరణ' (వివక్షతతో కూడిన చట్టాలను శాంతియుతంగా ఉల్లంఘించటం), వివక్షతతో కూడిన సేవల (శ్వేతజాతి, నల్లజాతి వాళ్లకి వేరువేరుగా సీట్లు ఉన్న బస్సుల



*చిత్రం 21.1: ఎలిజబెత్ ఎక్‌ఫోర్డ్ అన్న నల్లజాతి అమ్మాయి 1957 సెప్టెంబరు 4న లిటిల్ రాక్ స్కూల్ ప్రవేశించటానికి ప్రయత్నిస్తున్న చిత్రం. ఫోటో : విల్ సి*

చిత్రం 21.2 మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్



వంటి వాటి) బహిష్కరణలతో ఈ ఉద్యమం శాంతియుతంగా కొనసాగింది. వీటిల్లో ముఖ్యమైనది డా॥ మార్టిన్ లూథర్ కింగ్ నేతృత్వంలో మాంటగోమెరీలో సంవత్సరంపాటు నల్లజాతీయులు బస్సులను బహిష్కరించటం. దీనివల్ల బస్సులు నడిపే కంపెనీ తీవ్రంగా నష్టపోయింది. అంతిమంగా 1956లో బస్సులలో వివక్షతను న్యాయ స్థానాలు నిషేధించక తప్పలేదు. అదే సమయంలో నల్ల జాతీయులకు, తెల్ల జాతీయులకు వేరు వేరు పాఠశాలలు ఉండటానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడుస్తోంది. 1963 ఆగస్టు 28న రెండు లక్షలకు పైగా ప్రజలు వాషింగ్టన్‌కి ప్రదర్శనగా వెళ్లి పౌరహక్కుల చట్టాన్ని చేయాల్సిందిగా కోరారు. ఉపాధి కల్పనకు కార్యక్రమాలు, పూర్తి న్యాయమైన ఉపాధి, మంచి గృహవసతి, ఓటు హక్కు, శ్వేతజాతి, నల్లజాతి పిల్లలు కలిసి చదువుకునే సమ్మిళిత విద్యాసదుపాయాలు వంటివి వీళ్ల ప్రధాన కోరికలు. ఈప్రదర్శనలో ఇతరులతో పాటు డా॥ కింగ్ ఉపన్యసించాడు. "నాకొక కల ఉంది..." అన్న అతడి చరిత్రాత్మక ఉపన్యాసం చేశాడు. ఆ తరువాత కాలంలో నల్ల జాతీయుల కోసం చట్టాలు చేశారు. సుదీర్ఘ పోరాటం తరువాత ఇవి సమర్థంగా అమలు కాసాగాయి కూడా. సంస్కరణలు, మార్పుకోసం అహింసాత్మక సామాజిక ఉద్యమాలకు ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రేరణగా నిలిచింది.

**నాకొక కల ఉంది...**

వంద సంవత్సరాల క్రితం విముక్తి ప్రకటనపై సంతకం చేసిన మహనీయుడి నీడలో ఈ రోజు మనం నిలబడి ఉన్నాం. అన్యాయపు మంటల్లో కాలిపోతున్న నల్లజాతీయులకు ఈ చారిత్రాత్మక పత్రం ఒక ఆశాదీపంలాగా కనిపించింది... కానీ, వంద సంవత్సరాల తరువాత నల్లజాతి వాళ్లు ఇంకా స్వేచ్ఛను పొందలేదు. వివక్షత అన్న గొలుసులతోనూ, వేరు చెయ్యటం అన్న సంకెళ్లతోనూ వంద సంవత్సరాల తరువాత కూడా నల్లజాతీయుల జీవితం కునారిల్లుతోంది...

నా నలుగురు చిన్న పిల్లలు ఒకనాడు వాళ్ల చర్మం రంగుబట్టి కాకుండా వాళ్ల వ్యక్తిత్వ లక్షణాలను బట్టి అంచనా వేసే దేశంలో ఉంటారని నాకొక కల ఉంది...డా॥ మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ డా॥ కింగ్

- డా॥ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ డా॥ కింగ్ ఇచ్చిన ఈ ప్రఖ్యాత ఉపన్యాసాన్ని చదివి, అమెరికా సమాజానికి అతడు ఉంచిన ఆదర్శాల గురించి, వాటిని సాధించటానికి అతడు రూపొందించుకున్న ప్రణాళిక గురించి ఒక వ్యాసం రాయండి.

ఈ ఉద్యమం బలపడుతున్న క్రమంలో అనేక దృష్టికోణాలు ముందుకొచ్చాయి. శాంతియుత మార్గాల ద్వారా ప్రజలందరికీ సమానత్వం సాధించటం వీలవుతుందని, అందుకు అవసరమైన చట్టాలు ప్రభుత్వం చేసేలా చెయ్యవచ్చని అనేకమంది డా॥ కింగ్‌తో ఏకీభవించారు. అయితే మాల్కం ఎక్స్ వంటి ఇతరులు అనేకమంది నల్ల వాళ్లు వేరే జాతి అని శ్వేత జాతీయుల పాలననుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడాలని భావించారు. అధికారాన్ని చేజిక్కించుకోటానికి సాయుధ ఘర్షణలతో సహా అన్ని మార్గాలను వినియోగించుకోవాలని వాళ్లు భావించారు.

పౌరహక్కుల ఉద్యమంలో నల్లజాతి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయితే ఈ ఉద్యమంలోనూ పురుషుల ఆధిపత్యం ఉందని, తమని ఎవరూ పట్టించుకోవటంలేదని వాళ్లు భావించసాగారు. ప్రఖ్యాత వాషింగ్టన్ ప్రదర్శనలో ఒక్క మహిళను కూడా మాట్లాడనివ్వలేదు. మహిళల సమానత్వం కోసం మహిళలు పోరాడాలని వాళ్లు భావించసాగారు.

ఈ విభిన్న ధోరణులన్నీ కలిసి ఆధునిక అమెరికా చరిత్రను మలిచిన బలమైన సమానత్వ ఉద్యమాన్ని నిర్మించటానికి దోహదం చేశాయి.

- పౌరహక్కుల ఉద్యమ కోరికల జాబితా తయారుచేసి, వాటికి మీరు సూచించే పరిష్కారాలు ఏమిటో రాయండి.
- ప్రజాస్వామిక దేశమని అమెరికా చెప్పుకుంటుంది, కానీ గత శతాబ్దం మధ్యకాలం వరకు కొంతమంది ప్రజలను వేరుగా ఉంచింది. భారతదేశ నేపథ్యంలో ప్రజాస్వామ్య భావన అందరినీ కలుపుకునేలా ఎలా ఉండాలో చర్చించండి.
- ఒక ఉద్యమంలో భిన్న గొంతుకలు ఎందుకు వినపడుతుంటాయి? వాటిల్లోని అభిప్రాయబేధాలను గుర్తించండి.

## యుఎస్ఎస్ఆర్‌లో మానవ హక్కుల ఉద్యమం

ఆ రోజుల్లో యుఎస్ఎస్ఆర్‌లోనూ, దాని ప్రభావంలో ఉన్న తూర్పు యూరపు దేశాలలోనూ స్వేచ్ఛపూరిత బహుళ పార్టీ ఎన్నికలను, సెన్సారులేని స్వేచ్ఛాపూరిత పత్రికలు, ప్రసార సాధనాలను, చివరికి సాధారణ ప్రజల స్వేచ్ఛాపూరిత భావ ప్రకటన, కదలికలు వంటి వాటిని అనుమతించలేదు. ఈ ప్రభుత్వాలు తమను కూలదోసే కుట్రల గురించి నిత్యమూ భయపడుతూ ఉండి ప్రజల అన్ని కార్యకలాపాలపై నియంత్రణ, నిఘా ఉంచేవి. ఇటువంటి నియంత్రణల వల్ల విసిగిపోయిన ప్రజలు భావప్రకటన, కదలికలకు స్వేచ్ఛ, స్వేచ్ఛాపూరిత పత్రికలు వంటి మానవ హక్కుల కోసం యుఎస్ఎస్ఆర్‌లోని పలు ప్రాంతాల్లోనూ, తూర్పు యూరపులోనూ పలు ఉద్యమాలు చేపట్టారు. హంగరీ, చెకస్లొవేకియా, పోలాండ్ వంటి దేశాలలో ఇవి తమ దేశాలపై యుఎస్ఎస్ఆర్ పెత్తనం నుంచి స్వేచ్ఛను కూడా కోరసాగాయి. ఈ ఉద్యమాలలో కొన్నింటికి అమెరికా, ఇంగ్లాండుతో సహా కమ్యూనిస్టు వ్యతిరేక దేశాల మద్దతు కూడా లభించింది. మానవ హక్కుల కోసం సాగిన ఈ ఉద్యమంలో అనేక రకాల ధోరణులు ఉన్నాయి. కొన్ని ధోరణులు సాధారణ ప్రజలకు మరింత స్వేచ్ఛను కోరగా, కొన్ని ఈ దేశాలలోని సోషలిస్టు వ్యవస్థకు అంతం పలకాలని ప్రయత్నించాయి. ప్రఖ్యాత రచయిత అలెగ్జాండర్ సోల్జ్ నిత్సిన్, అణు శాస్త్రవేత్త ఆంద్రే సఖరోవ్ ఈ రెండవ ధోరణికి ముఖ్య నాయకులు. ఇవి, ఇతర ఉద్యమాల ఫలితంగా యుఎస్ఎస్ఆర్‌లో అధ్యక్షుడు గోర్బచేవ్ కింద కొత్త నాయకత్వం ఆవిర్భవించింది. ఆయన ప్రజలకు మరింత స్వేచ్ఛను కల్పించటానికి గ్లాస్‌నోస్త్ అన్న సంస్కరణలు ప్రక్రియను ఆరంభించాడు.

- అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లలోని రాజకీయ వ్యవస్థలో పోలికలు, తేడాలు గుర్తించండి. ప్రజల హక్కులకు అవి ఎలా స్పందించాయి?

## అణు వ్యతిరేక, యుద్ధవ్యతిరేక ఉద్యమాలు

1970లు, 1980లు ఒక కొత్త రకమైన ఉద్యమాన్ని చూశాయి. ఇది అణ్వాయుధాలు, యుద్ధాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం. 1945 ఆగస్టులో హిరోషిమా, నాగసాకిలపై వేసిన అణుబాంబుల దారుణాన్ని ప్రపంచమంతా చూసింది. అయినప్పటికీ అమెరికా, యుఎస్ఎస్ఆర్, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి అగ్ర రాజ్యాలు ఇతర దేశాలు వాటిని ఉపయోగించకుండా నిరోధిస్తుందన్న నమ్మకంతో అణ్వాయుధాల నిల్వలను పెంచుకుంటూ పోయాయి. అవి అమెరికా, యుఎస్ఎస్ఆర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధమూ, వియత్నాంతో అమెరికా యుద్ధమూ తీవ్రంగా ఉన్న రోజులు. మరొక ప్రపంచ యుద్ధం

చెలరేగుతుందేమొనన్న భయం గుప్పిట్లో ప్రపంచమంతా ఉంది. యుద్ధం చెలరేగి, అణ్వాయుధాలను ఉపయోగించినట్లయితే భూమిమీద నుంచి మానవాళి అంతా తుడిచిపెట్టుకు పోతుందని భయపడసాగారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులు, మేధావులు అణ్వాయుధాల నిరోధం కోసం ఉద్యమించసాగారు. వ్యర్థ ఆయుధ పోటీకి చరమగీతం పాడటానికి అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లు ఒక ఒప్పందానికి రావాలని కోరసాగారు.

వియత్నాం యుద్ధంలో వియత్నాంకి చెందిన 8,00,000 సైనికులు, 30,00,000 పౌరులే కాకుండా అధిక సంఖ్యలో కంబోడియన్లు, లావోషియన్లు చనిపోయారు. అమెరికాకి ఎటువంటి పౌరనష్టం జరగలేదు కానీ చాలాపెద్ద సంఖ్యలో సైనికులు చనిపోయారు, అంతకంటే అధిక సంఖ్యలో వికలాంగులయ్యారు. తమ ప్రత్యర్థులైన అమెరికా, ఫ్రాన్స్‌లతో పోలిస్తే వియత్నాం విస్తృత అడవులతోనున్న పేద దేశం. యుద్ధంలో వియత్నామీయులు గెరిల్లా యుద్ధ పంథాని అనుసరించారు. అమెరికా రసాయనిక ఆయుధాలు, నాపాళం బాంబులు వంటి కొత్త ఆయుధాలను కనిపెట్టి గ్రామాలను సమూలంగా నాశనం చెయ్యటానికి వాటిని ఉపయోగించింది.

అమెరికాకు ఏమాత్రం ప్రమాదకరంకాని అమాయకమైన ప్రజలపై బాంబులు వెయ్యడం ఎంతవరకు న్యాయం అని 1970ల ఆరంభంలో వియత్నాం నుంచి తిరిగి వస్తున్న అమెరికా సైనికులలో సందేహం పెరగసాగింది. అదే సమయంలో ఎక్కడో ఉన్న వియత్నాంలో యుద్ధానికి తమ పిల్లలని పంపించటానికి ఇష్టపడని అమెరికన్ల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చింది. దాంతో వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికా అంతటా ప్రజా నిరసనలు ఉవ్వెంగాయి. దీని వల్ల అంతిమంగా అమెరికా 1975లో యుద్ధాన్ని ఆపేసి వియత్నాం నుంచి బయటకు వచ్చేసింది. అమెరికాకు వ్యతిరేకంగా వియత్నాం

### "మేము వెళ్లం"

అమెరికాలో దృఢకాయులైన అందరూ తప్పనిసరిగా కొంతకాలం పాటు సైన్యంలో పని చెయ్యాలనే చట్టం ఉంది. వియత్నాంతో యుద్ధంలో పోరాడేందుకు సైన్యంలో చేరటానికి వేలాది పౌరులు నిరాకరించారు. ఈ తిరస్కరణ నిరశనలలో ఒకదానిని ఇక్కడ చదువుదాం. హార్వర్డ్ క్రింసన్ అన్న దిన పత్రికలో ఇది ప్రచురితమయ్యింది:

"సైన్యంలో చేరే వయసున్న యువకులమైన మమ్మల్ని ప్రభుత్వం వియత్నాంలో యుద్ధానికి పంపించవచ్చు. ఈ యుద్ధ చరిత్రని, స్వభావాన్ని మేం అధ్యయనం చేసిన మీదట ఈ యుద్ధంలో పాల్గొనటం మా అంతరాత్మలకు వ్యతిరేకంగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చాం. కాబట్టి వియత్నాంతో అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తున్నంత వరకు మేం సైనిక సేవలో చేరటానికి (చట్ట ప్రకారం అందరూ అలా చెయ్యాలి) నిరాకరించాలన్న స్థిర నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాం. ఈ ప్రకటనపై సంతకం చేయటం ద్వారా ఇవే అభిప్రాయాలు ఉండి సైన్యంలో చేరే వయసున్న ఇతర యువకులతో సంఘీభావం తెలిపి యుద్ధానికి మా వ్యక్తిగత, నైతిక తిరస్కరణను బలమైన రాజకీయ వ్యతిరేకతగా మలచాలని అనుకుంటున్నాం."

- వీళ్లు దేశభక్తిలేని వాళ్లని కొంతమంది భావించగా, అన్యాయమైన యుద్ధంలో పాల్గొనాలనుకోకపోవటం సమర్థనీయమే అని మరికొంతమంది భావించారు. ఈ రెండు దృష్టి కోణాలను తరగతిలో చర్చించి మీ దృష్టికోణంతో పాటు రెండు వైపుల వాదనలను క్లుప్తంగా రాయండి.

ప్రజలు చేపట్టిన ఉద్యమం విజయం కావటం ప్రపంచ వ్యాప్తంగా శాంతి ఉద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చింది.

వియత్నాం యుద్ధం ముగిసిన తరువాత మరిన్ని దేశాలు అణ్వాయుధాల నిల్వలలో ఒకదానితో ఒకటి పోటీ పడటంతో అణ్వాయుధ పోటీ తీవ్రరూపం దాల్చింది. ఈ ఆయుధాలను ఉత్పత్తిచేసే కంపెనీలు (వీటిని సైనిక–పారిశ్రామిక కంపెనీలంటారు), ప్రభుత్వాలు సాధారణ ప్రజలలో యుద్ధ భయాన్ని కలిగించి, అణ్వాయుధాల మీద డబ్బును మరింతగా ఖర్చు పెట్టటానికి మద్దతు పొందేవి. క్రమేపీ, ప్రత్యేకించి యూరపులో, అనేకమంది ప్రజలు యుద్ధ జపం, దాని ఫలితంగా ఆయుధ పోటీ వల్ల ప్రపంచమంతా ముప్పులో పడుతుందని, యుద్ధంలో ప్రత్యక్షంగా సంబంధంలేని దేశాలతో సహా ప్రపంచమంతా నాశనమయ్యే యుద్ధం సంభవించవచ్చని గుర్తించసాగారు. ప్రభుత్వ విధానాలపై పెద్ద ఎత్తున ప్రజా నిరసనలు చోటు చేసుకున్నాయి. ఇతర ప్రభుత్వాలతో అణ్వాయుధాల నిల్వలను తగ్గించుకోటానికి, శాంతి దిశగా కృషి చెయ్యటానికి చర్చలు ప్రారంభించ వలసిందిగా ఒత్తిడి చెయ్యసాగారు.

ఈ ఒత్తిడుల కారణంగా ఆయుధ పోటీలో ప్రధాన దేశాలైన అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లు తమ అణ్వాయుధాలను తగ్గించు కోటానికి చర్చలు మొదలు పెట్టాయి. వీటిని వ్యూహాత్మక ఆయుధాల పరిమితి చర్చలు (స్ట్రాటెజిక్ ఆర్మ్స్ లిమిటేషన్ టాక్స్–ఎస్ఎఎల్‌టి) మొదలు పెట్టారు. అయితే ఇవి ఫలవంతం కాలేదు. అంతిమంగా 1991లో వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం (స్ట్రాటెజిక్ ఆర్మ్స్ రిడక్షన్ ట్రీటీ – ఎస్‌టిఎఆర్‌టి)మీద సంతకాలు చేశారు. చరిత్రలో అత్యంత పెద్ద, సంక్లిష్టమైన ఆయుధ నియంత్రణ ఒప్పందం ఇది. 2001లో ఇది అమలు అయినప్పుడు అప్పటికున్న అన్ని వ్యూహాత్మక అణ్వాయుధాలలో 80 శాతాన్ని తొలగించారు. ఒప్పందంపై సంతకం చేసిన కొంతకాలానికే యుఎస్ఎస్ఆర్ రద్దయ్యి దాని స్థానంలో కొత్తగా రష్యా దేశం ఏర్పడింది. దీంతో సుదీర్ఘకాల ప్రచ్ఛన్న యుద్ధానికి తెర పడింది. విధ్వంసకరమైన ప్రపంచ యుద్ధం




*చిత్రం 21.3 అ. వియత్నాం యుద్ధానికి వ్యతిరేక నిరసన, ఆ. పెంటగావ్ వద్ద కాపలా ఉన్న సైనికుడికి నిరసనకారులలోని ఒక మహిళ ఒక పువ్వు ఇస్తోంది. ఈ బొమ్మలలోని భావనలను చర్చించండి.*

ఎప్పుడు సంభవిస్తుందో అన్న భయం తొలగిపోయింది. అయితే దేశాలమధ్య యుద్ధాలు, హింస అంతమైపోలేదని తూర్పు యూరపు, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ వంటి ప్రాంతాల్లో విధ్వంసకర యుద్ధాలు తెలియచేశాయి.

యుఎస్ఎస్ఆర్ చివరి దశలో చెర్నోబిల్‌లో ఉన్న అణుకర్మాగారంలో పెద్ద ప్రమాదం జరిగింది. దీనివల్ల చెర్నోబిల్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో చనిపోయారు. అంతేకాదు యూరపులోని అనేక దేశాలతో సహా చాలా విశాల ప్రాంతంలో అణు కాలుష్యానికి కారణమైంది. దీని ప్రభావం వల్ల యుద్ధం కోసమైతేనేమి, శాంతియుత ప్రయోజనాల కోసమైతేనేమి అణుశక్తిని ఉపయోగించటంలోని ప్రమాదాలు ప్రజలకు తెలిశాయి. ఫలితంగా యుద్ధ వ్యతిరేక ఆందోళనలు, పర్యావరణ పరిరక్షణ ఆందోళనలు చెలరేగాయి.

- ఆయుధీకరణకు వివిధ రకాల స్పందనలు ఏమిటి?
- పరస్పర విధానాలను ఆయా దేశాల ప్రభుత్వాలు నిర్ణయించటం మాత్రమే కాక వివిధ దేశాల ప్రజలు ఒకరినొకరు కలుస్తుంటే యుద్ధ అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో మీరు ఏకీభవిస్తారా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
- అణు కర్మాగారాలను, కాలుష్య పరిశ్రమలను ఎక్కడ పెట్టాలన్న నిర్ణయాలతో సంబంధం లేని దేశాల ప్రజలు కూడా పర్యావరణ కాలుష్య ప్రభావానికి ఎలా గురవుతారో వివరించండి. ఇటువంటి పరిస్థితులను ఎలా పరిష్కరించాలి?

## ప్రపంచీకరణ, నిర్వాసితులైన ప్రజలు, పర్యావరణ ఉద్యమాలు

1990ల నుంచి 'ప్రపంచీకరణ', 'నయా ఉదారవాదం' అన్న పేర్లతో సంభవిస్తున్న ప్రపంచవ్యాప్త ఆర్థిక, రాజకీయ మార్పుల వల్ల ఎటువంటి సదుపాయాలు లేని ప్రజల జీవితాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. గిరిజన ప్రజలు, పేదరైతులు, భూమిలేని కార్మికులు, మహిళలు, అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్న పట్టణ పేదలు, పారిశ్రామిక కార్మికులు అందరికంటే తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఇటువంటి ప్రజలలో ఎక్కువ మందికి పాఠశాల చదువు, సరైన పోషకాహారం, వైద్యం అందుబాటులో లేవు. ఈ కారణంగా కొత్త ఉద్యోగాలు కానీ, మంచి జీతాలు గల ఉద్యోగాలు కానీ, చట్టబద్ధ లేక రాజ్యాంగ బద్ధ పరిహారాలు కానీ వీళ్లకి అందుబాటులో లేవు.

గత కొద్ది దశాబ్దాలలో వాణిజ్య రైతులు, గనులతవ్వకం సంస్థలు, ఆనకట్టల పథకాల వంటి వాటినుంచి గిరిజనులు, నిర్వాసితులైన ప్రజలు ముప్పును ఎదుర్కొంటున్నారు. ఖనిజాలు, అరుదైన మొక్కలు, ప్రాణులు, నీళ్లు వంటి విలువైన వనరులను పెద్ద పెద్ద కంపెనీలు గ్రామీణ ప్రాంతాల్లో కనుక్కోవటంతో తరతరాలుగా ఉంటున్న ప్రాంతాల నుంచి గిరిజనులు, రైతులు తొలగింపబడుతున్నారు. దీంతో ప్రజలు కొత్త ప్రాంతాలలో చెల్లాచెదురై పోతున్నారు, గిరిజన సంస్కృతి విధ్వంసమవుతోంది. ఫలితంగా వాళ్లు సమాజంలో అత్యంత ప్రభావిత ప్రజానీకంగా మారిపోయారు. అంతేకాకుండా ఈ అభివృద్ధి ప్రక్రియల వల్ల ప్రకృతి వనరులకు తీవ్ర ముప్పు ఏర్పడటంతో పర్యావరణ ఉద్యమాలు చేపట్టారు. ఈ అభివృద్ధి శక్తుల విధ్వంసకర, హింసాత్మక స్వరూపంపై కోపాన్ని, నిర్వాసితులైన ప్రజల గొంతులను కలపటానికి ఈ ఉద్యమాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఉద్యమాలు భిన్నమైన భవిష్యత్తు లక్ష్యాన్ని కోరుకుంటున్నాయి.

## యూరపులో గ్రీన్‌పీస్ ఉద్యమం

అలాస్కా దగ్గర సముద్ర గర్భంలో అమెరికా 1971లో చేపట్టిన అణు పరీక్షలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం మొదలయ్యింది. నిరసన తెలియచెయ్యటానికి స్వచ్ఛంద కార్యకర్తలు చిన్న పడవలో ప్రయోగ ప్రదేశానికి బయలుదేరారు. ఈ పడవ పేరు 'గ్రీన్‌పీస్', చివరికి ఇది ఆ ఉద్యమం పేరుగా మారింది. ప్రస్తుతం ఈ ఉద్యమం నలభై దేశాలలో విస్తరించి ఉంది. దీని ప్రధాన కార్యాలయం ఆమ్‌స్టర్‌డాం (హాలండ్)లో ఉంది. ఇది ముఖ్యమైన అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలలో ఒకటి.

సూర్యుని హానికర కిరణాలను అడ్డుకునే వాతావరణంలోని ఓజోను పొర కాలుష్యం వల్ల దెబ్బ తింటోందని గత కొద్ది దశాబ్దాలలో శాస్త్రజ్ఞులు గుర్తించారు. కాలుష్యం వల్ల భూమి సగటు ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. దీని కారణంగా ధ్రువ ప్రాంతాల వద్ద ఉండే మంచు టోపీలు (పెద్ద మొత్తంలో గడ్డకట్టిన నీళ్లు) కరుగుతున్నాయి. ఈ మంచు కరిగి సముద్రాలలో చేరటం వల్ల మహా సముద్రాలు, సముద్రాల నీటిమట్టం పెరిగి ప్రపంచమంతటా తీరప్రాంతాలు ముంపునకు గురవుతాయి. సముద్ర తీరం వెంట బంగ్లాదేశ్, శ్రీలంక, మారిషస్, భారతదేశం, ఇండోనేసియా వంటి దేశాలలో అధిక సంఖ్యలో ఉంటున్న ప్రజలు వరదలు, ముంపు వంటి తీవ్ర సమస్యలతో ప్రభావితమౌతారు. ప్రపంచం వేడెక్కటం వల్ల, వర్షపాతంలో తేడాల వల్ల (అకాల వర్షాలు, అధిక వర్షాలు, కరువులు), పంటలు నష్టపోవటం వల్ల తీర ప్రాంతానికి దూరంగా ఉన్న ప్రజలు కూడా ప్రభావితమౌతారు. ఇంకో మాటల్లో చెప్పాలంటే ప్రపంచవ్యాప్త వాతావరణ మార్పు వల్ల వ్యవసాయాధారిత ప్రజలు, దేశాలు ప్రధానంగా ప్రభావితమౌతాయి.

వాతావరణ మార్పుపై పలు దేశాలలో గ్రీన్‌పీస్ ఉద్యమం చేపట్టింది. "అనంత వైవిధ్యతతో కూడిన జీవాన్ని భూమి పోషించే శక్తిని కాపాడటం" దాని ఉద్దేశం. కాలక్రమంలో ఈ ఉద్యమం 'సుస్థిర అభివృద్ధి' అన్న భావనను ముందుకు తెచ్చింది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని దేశాల ప్రజలందరికీ న్యాయంగా ఉండే, పర్యావరణ రీత్యా దీర్ఘకాలం మనగలిగే అభివృద్ధిని అది కోరుకుంటోంది.

- గ్రీన్‌పీస్ ఉద్యమం వెబ్‌సైట్ చూసి (http:/www.greenpeace.org/intrnational) అది పని చేస్తున్న అంశాల గురించి, ఎంచుకున్న పోరాట పద్ధతుల గురించి తెలుసుకోండి. ఈ ఉద్యమంపై ఉన్న చర్చలు, విమర్శల గురించి కూడా తెలుసుకోండి.

## భోపాల్ గ్యాస్ దుర్ఘటన, సంబంధిత ఉద్యమాలు

1984లో భోపాల్‌లో సంభవించిన ఈ తీవ్ర దుర్ఘటన గురించి మీరు చదివి ఉంటారు. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కంపెనీ (తరువాత దీనిని డౌ కంపెనీకి అమ్మేశారు)నుంచి ఒక రాత్రి విషవాయువు వెలువడింది. దీని వల్ల వేలాది మంది చనిపోయారు, దాని ప్రభావం వల్ల ఇప్పటికీ వేలాదిమంది బాధపడుతున్నారు. ప్రపంచంలోనే ఇది అతి పెద్ద పారిశ్రామిక దుర్ఘటన. మొదటినుంచి భోపాల్ ప్రజలు నాలుగు ముఖ్యమైన కోరికల కోసం పోరాడుతున్నారు:

ప్రభావితులైన వాళ్లకి సరైన వైద్య సౌకర్యం; ఆ కంపెనీ బహుళ జాతి కంపెనీ కాబట్టి అంతర్జాతీయ ప్రామాణికాల ఆధారంగా నష్ట పరిహారం; బహుళజాతి కంపెనీ యాజమాన్యాన్ని ఈ నేరానికి బాధ్యులుగా చెయ్యటం; చివరిగా భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా చూడటం.




చిత్రం 21.4 : భోపాల్ గ్యాస్ దుర్ఘటన సంస్మరణ

వీటిల్లో కొంతవరకు విజయం సాధించినప్పటికీ అన్ని ప్రధాన కోరికలు తీరటానికి ఇంకా ఎంతో దూరంలోనే ఉన్నారని చెప్పాలి. భోపాల్‌లో వైద్య సదుపాయాలు కల్పించటానికి పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసినప్పటికీ దుర్ఘటనకు ప్రభావితమైన వ్యక్తులు ఇంకా అనారోగ్యంతో బాధపడుతూనే ఉన్నారు. నష్టపరిహారం అంతర్జాతీయ ప్రామాణికాల ప్రకారం అందించలేదు, అందించిన కొద్ది మొత్తం కూడా ప్రభావితమైన ప్రజలందరికీ సరిగా పంపిణీ చెయ్యలేదు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని ప్రభుత్వం విచారించి, శిక్షించనే లేదు. ప్రస్తుతం మెరుగైన చట్టాలు ఉన్నమాట నిజమే కాని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడటానికి సరైన విధానాలుకానీ, తగినంత, నిష్పక్షపాత తనిఖీ వ్యవస్థకానీ లేవు. దుర్ఘటనకి కారణమైన కంపెనీ అమెరికాలో ఉండటంతో ఈ విషయంలో నిరసనలు తెలియచెయ్యటం మరింత కష్టమయ్యింది. ఈ కంపెనీ కారణంగా ఏర్పడిన కాలుష్యం వల్ల ప్రభావితమైన ఫ్యాక్టరీ కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చెయ్యటానికి అంతర్జాతీయ చట్టాలను ఉపయోగించుకోవలసి వస్తోంది. లండన్‌లో జరుగుతున్న ఒలంపిక్స్ క్రీడలకు డౌ కంపెనీ స్పోన్సరు చెయ్యటానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సంతకాలు చేస్తున్నారు. ఈ విధంగా ఈనాటికి ఈ విషయంమీద ప్రజలను సమీకరిస్తున్నారు. ఒలంపిక్ సంఘం, డౌ కంపెనీకి మధ్య అనైతిక సంబంధాన్ని ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు ఎత్తి చూపుతున్నాయి.

## పర్యావరణ ఉద్యమాలు

మన దేశంలో కూడా పర్యావరణ ఉద్యమాలు అడవుల రక్షణకోసం గ్రామ స్థాయిలో జరిగిన ఉద్యమాలతో 1970లలోనే ఆరంభమయ్యాయి. మీరు 12వ అధ్యాయంలో చదివిన చిప్కో ఆందోళన ఇటువంటి ఉద్యమాల్లో ఒకటి.

## నర్మదా నదిపై ఆనకట్టలకు వ్యతిరేకంగా ఉద్యమాలు

1950లలో భారతదేశ ప్రణాళికాబద్ధ అభివృద్ధిలో 'బహుళార్థకసాధక' పెద్ద ఆనకట్టలను కట్టటం ఒక భాగం. ఇలా కట్టిన ఆనకట్టలలో కొన్ని భాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునసాగర్. మొదట్లో ప్రజలు ఆనకట్టలను అద్భుతమైన నిర్మాణాలుగా పరిగణించారు: అవి పెద్ద మొత్తంలో నీళ్లను నిల్వచేసి, విశాల భూ భాగాలకు సాగునీరు అందించి, పెద్ద మొత్తంలో విద్యుత్తును ఉత్పత్తి చేసి, వరదలు, కరువులను



నియంత్రిస్తాయని ఆశించారు. వీటి పట్ల ఆరాధనాభావం ఎంతగా ఉండేదంటే ఈ ఆనకట్టల వల్ల ముంపునకు గురైన ప్రాంతాలలోని ప్రజలకు, చెట్లకు, పొలాలకు, జంతువులకు ఏమయ్యిందని ఎవరూ అడగలేదు. ఈ ఆనకట్టల నిర్మాణంలో కోల్పోయిన విశాలమైన సారవంత భూ భాగాల గురించి, నష్టపోయిన చెట్లు, జంతుజాలం గురించి, నిర్వాసితులైన ప్రజల గురించి ఎవరూ పట్టించుకోలేదు. నిర్వాసితులైన ప్రజలు వెళ్లటానికి ఎక్కడా చోటు లేదు, వాళ్లకి ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వలేదు, ఒకవేళ ఇచ్చినా అది నామమాత్రంగానే ఉంది. పెద్ద ఆనకట్టల వల్ల దేశ ప్రజలకు ఒనగూడే విస్తృత ప్రయోజనాల ముందు ఈ సమస్యలు చిన్నవని చాలామంది భావించారు. అయితే నష్టపోయిన అడవులు, భూములు, గ్రామాల వంటి ఖర్చులు, నష్టాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఆనకట్టల మీద పెట్టిన ఖర్చుకి అవి తగినంతగా ఫలితాలను ఇవ్వటం లేదని గ్రహించిన ప్రజలు వీటిని ప్రశ్నించసాగారు. ఆనకట్టలకు చాలా పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. నిర్మాణంలో ఆలస్యం వల్ల, ధరల పెరుగుదల వల్ల ఈ ఖర్చు ఇంకా విపరీతంగా పెరిగిపోతుంది. అంతేకాకుండా ఇవి ముందుగా ఆశించినంత విస్తీర్ణానికి సాగునీటిని అందించవు, అనుకున్నంత విద్యుత్తును ఉత్పత్తి చేయవు. ఆనకట్టలో నిల్వ చెయ్యగలిగిన నీటి మొత్తం ఇంజినీర్లు అంచనా వేసిన దానికంటే తక్కువగా ఉండటంవల్ల ఇలా జరుగుతోంది. భారతదేశ చరిత్రలోనే నర్మదా నదిపై అత్యంత పెద్దదైన నదీ లోయ పథకాల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించటంతో ఈ సమస్యలన్నీ ముందుకొచ్చాయి.

ఈ పథకం వల్ల నిర్వాసితులయ్యేప్రజలు కేవలం భూములున్న వాళ్లకే కాకుండా, అక్కడ ఉంటున్న వాళ్లందరికీ న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోరసాగారు. అంతేకాకుండా ఆనకట్ట వల్ల ముంపునకు గురైన అడవులకు బదులుగా అటవీ పెంపకాన్ని చేపట్టాలని, భూమి కోల్పోయిన వాళ్లకి బదులుగా భూమి ఇవ్వాలని, సరైన పునరావాసం కల్పించాలని కోరసాగారు. అయితే, త్వరలోనే ప్రజలు రెండు విషయాలు గుర్తించారు: కోల్పోయిన భూమికి నష్టపరిహారంగా ఇవ్వటానికి తగినంత భూమిలేదు, నిర్వాసితులైన ప్రజలందరికీ సరైన పునరావాసం కల్పించటం సాధ్యం కాదు. అంతేకాకుండా ఇది నష్టపరిహారం, పునరావాసానికి సంబంధించిన సమస్య కాక అభివృద్ధికి సంబంధించిన లోపభూయిష్ట దృక్పథమని ప్రజలు గుర్తించసాగారు. ఈ రకమైన అభివృద్ధి వ్యవసాయాన్నీ, గిరిజన ప్రజలను ప్రణంగా పెట్టి పరిశ్రమలు, వాణిజ్య వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చెయ్యటం, సహజ వనరులను సుస్థిరంకాని పద్ధతులలో వినియోగించటంపైన ఆధారపడి ఉంది. ఇది పేద రైతులు, గిరిజనుల జీవన ప్రమాణాన్ని ఏ రకంగానూ మెరుగుపరచకుండా వాళ్లని నైపుణ్యంలేని కూలీలుగా మారుస్తుంది.



*చిత్రం 21.5 : నిర్వాసితులు కావటానికి వ్యతిరేకంగా నర్మదాలోయలో నిరసన ప్రదర్శన*

ఈ ఉద్యమ నాయకులు ఈ ఆనకట్టల నిర్మాణాన్నే వ్యతిరేకించ సాగారు. 12వ అధ్యాయంలో మీరు బావా మహలియా గురించి చదివారు. నర్మదాలోయ ఆనకట్టకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రజా ఉద్యమమైన నర్మదా బచావో ఆందోళన్‌లో అతడు కూడా భాగస్వామి.

మొదట ప్రపంచబ్యాంకు నుంచి తీసుకున్న అప్పుతో సర్దార్ సరోవర్ ఆనకట్టను నిర్మించాలని అనుకున్నారు. తీవ్ర నిరసనలు, ప్రజల సమీకరణ, ప్రదర్శనలు, నిరాహార దీక్షలు,అంతర్జాతీయ ఉద్యమాల తరువాత ప్రపంచ బ్యాంకు దీనికి నిధులు సమకూర్చగూడదని నిర్ణయించుకుంది.

- రైతులను, గిరిజనులను నిర్వాసితులను చెయ్యకుండా కర్మాగారాలు కట్టడం, గనుల తవ్వకం, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను చేపట్టటం సాధ్యంకాదా? ఎటువంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి? ఈ అంశాలపై మీ ఇంటిలోనూ, తరగతిలోనూ చర్చించండి.

### భారత పర్యావరణ పరిస్థితి

1980లో విజ్ఞానశాస్త్రం, పర్యావరణ కేంద్రం (సెంటర్ ఫర్ సైన్స్ & ఎన్విరాన్‌మెంట్) అన్నదానిని అనిల్ అగర్వాల్ స్థాపించాడు. భారతదేశంలోని అభివృద్ధి, పర్యావరణ అంశాలపై అధ్యయనం చేసి వాటి పట్ల అవగాహన కలిగేలా చెయ్యటం దీని ఉద్దేశం. 'భారతదేశ పర్యావరణ స్థితిపై పౌరుల నివేదికలు 1982' అన్న ప్రఖ్యాత ప్రచురణతో అది మొదలుపెట్టింది. ఈనాడు దేశం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు సమగ్రమైన సూచికల కోసం ఈ నివేదికలు ఉపయోగపడుతున్నాయి. అది చేస్తున్న పని, అధ్యయనం చేసిన సమస్యల గురించి మరింత తెలుసుకోటానికి దాని వెబ్‌సైట్‌ను చూడండి: http://www.cseindia.org

సర్దార్ సరోవర్ ఆనకట్ట నిర్మాణాన్ని ఆపటంలో నర్మదా బచావో ఆందోళన్ విఫలమైనప్పటికీ అందరూ అభివృద్ధి స్వభావం గురించి ఆలోచించేలా చెయ్యటంలో అది విజయం సాధించింది – అది పేదవాళ్ల ప్రయోజనాల కోసమా, లేక ధనికులు, శక్తిమంతులకోసమా అని ఆలోచింపచేసింది. ప్రకృతిలో పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంటూ కట్టే పెద్ద పెద్ద కట్టడాల ప్రయోజనాల గురించి కూడా అందరూ ఆలోచించేలా అది చేసింది. ఇటువంటి 'అభివృద్ధి కారణంగా నిర్వాసితులైన' ప్రజలకు తగినంత, గౌరవప్రదమైన నష్టపరిహారం చెల్లించే దిశలో ప్రభుత్వం ఆలోచించేలా చేసింది.

'నర్మదా బచావో' ఉద్యమంలో అనేక ధోరణులు కలగలిసి ఉన్నాయి. ఇవి: మూలవాసీ ప్రజల ఉద్యమం, నయా–ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం, పట్టణీకరణకు ఆనకట్టలు, పరిశ్రమలు, గనులు వంటి వాటి కోసం భూములు లాక్కోబడుతున్న నేపథ్యంలో తమ భూములను కాపాడుకోటానికి రైతులు చేస్తున్న ఉద్యమాలు వంటివి.

### సైలెంట్ వ్యాలీ ఉద్యమం (1973–83)

కేరళలోని పశ్చిమ కనుమలలోని సైలెంట్ వ్యాలీ (నిశ్శబ్ద లోయ)లో ప్రవహిస్తున్న రెండు నదులపై ఆనకట్టలు నిర్మించాలని ప్రతిపాదించినప్పుడు, వీటివల్ల ఆ లోయలో ఉన్న అరుదైన జంతువులు, మొక్కలు అంతరించిపోతాయని విద్యావంతులైన అనేక మంది గ్రహించారు. ఈ అరుదైన జాతులలో ఒక రకమైన కోతి అయిన సింహపు తోక కోతి (లయన్ టేల్డ్ మకాక్) ఒకటి. క్రమేపీ సైలెంట్ వ్యాలీకి మద్దతుగా, ఆనకట్టలకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం ఏర్పడింది. ప్రజలలో విజ్ఞాన శాస్త్ర ప్రచారానికీ, విద్యకోసం పని చేస్తున్న కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్ (కెఎస్ఎస్‌పి) రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను సమీకరించింది. ప్రాజెక్టు ప్రాంతంలో చెట్లను నరకటానికి వ్యతిరేకంగా ఆ సంస్థ కోర్టుకి వెళ్లింది. దాంతో కేరళ హైకోర్టు చెట్లు నరకటాన్ని ఆపేసింది. తీవ్ర నిరసనల నేపథ్యంలో చివరికి ప్రభుత్వం ఆనకట్టల నిర్మాణాన్ని విరమించుకుని సైలెంట్ వ్యాలీని 1985లో జాతీయ పార్కుగా ప్రకటించింది.



*చిత్రం 21.6 : ఇక్కడ అడవిలో కీచురాళ్లు లేవు, అందుకే ఈ అడవి 'నిశ్శబ్దం'గా ఉంటుంది. సింహపు తోక కోతి ఇంకా అనేక ఇతర పురుగులు, పక్షులు ఈ లోయకి ప్రత్యేకమైనవి.*

## మేధా పాట్కర్‌తో ముఖాముఖి

నర్మదా బచావో ఆందోళన నాయకురాలైన మేధా పాట్కర్ ఒక ఇంటర్వ్యూలో ఆ సంస్థ గురించి ఇలా చెప్పారు:

*గుజరాత్ ప్రభుత్వం తను అనుకున్నదే చేస్తున్నందున ఇప్పుడు కూడా ఉద్యమాన్ని కొనసాగించటంలో ఏమైనా అర్థం ఉందా?*

"లక్ష్యాలను చేరుకునేదాకా పోరాటం ముగియదు...



*చిత్రం 21.7*

ప్రభుత్వం ప్రకటించిన విధానమూ, ప్రణాళిక ప్రగతిశీలమైనదని, వ్యవసాయ అనుకూలమైనదని ఎంతగా బాకాలు ఊదినా జీవనోపాధులు కోల్పోయిన వారికి భూమిని ఇవ్వలేకపోయిందన్నది అందరికీ విశదమవుతోంది. పర్యావరణ అంశాలను ఇంకా అమలు చెయ్యలేదు. ఆమోదాల్లో విధించిన షరతులు, విధానాల్లో చేసిన వాగ్దానాలు పూర్తిచెయ్యకుండా ఆనకట్ట ఎత్తు పెంచటమన్నది అన్యాయం.

ప్రకృతి ఆధారిత ప్రజల ఆవాసాలను ముంపునకు గురిచేసి, తీవ్ర సామాజిక, పర్యావరణ, ఆర్థిక ఖర్చుతో సాధించిన అభివృద్ధి కొంచెం కూడా కచ్ ప్రాంతంలో నిజంగా అవసరమైన ప్రజలకి కాకుండా గుజరాత్‌లోని పెద్ద పట్టణాలకు, కార్పొరేట్ సంస్థలకు వెళుతోందని ప్రపంచానికి తెలియచెయ్యటానికి కూడా ఉద్యమం కొనసాగవలసిన అవసరం ఉంది. ఇటువంటి అభివృద్ధి విధానం మారాలని నర్మదా బచావో ఆందోళన్ పోరాడుతోంది. విధ్వంసం, అసమానతలు, నిర్వాసితులు కావటానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం నర్మదాలోయలోనే కాకుండా, దేశమంతా జరుగుతున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాతో, పునః నిర్మాణ పనితోనూ కొనసాగాల్సిన అవసరం ఉంది...."

- సామాజిక ఉద్యమాలు ఉపయోగించిన వివిధ వ్యూహాలను పేర్కొనండి.
- పునరావాసాన్ని కల్పిస్తామన్న వాగ్దానాలను ఉద్యమంలోని ప్రజలు ఎలా పరిగణిస్తున్నారు?

## సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం మహిళల ఉద్యమం

మహిళలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి, సమాన హక్కులు, అవకాశాలు, వ్యక్తిగత భద్రత, న్యాయంకోసం వాళ్లు చేస్తున్న పోరాటాల గురించి ఇంతకు ముందు తరగతుల్లో చదివాం. ఇటీవల కాలంలోని అనేక ముఖ్యమైన సామాజిక ఉద్యమాల్లో సైతం మహిళలు ముందున్నారు. ఇక్కడ మనం రెండు ఉదాహరణలతో దీనిని మరింత బాగా అర్థం చేసుకుందాం: ఆంధ్రప్రదేశ్‌లో సారాకి వ్యతిరేకంగా మహిళల ఉద్యమం, ఈశాన్య ప్రజలపై దమననీతికి కారణమైన సైనిక బలాల ప్రత్యేక అధికారాలకు వ్యతిరేకంగా మణిపురి మహిళల ఉద్యమం.

## ఆడవాళ్లు ఏకమైతే

*"ఇది కథ కాదు. ఇది రాత్రి బడిలో చదువు నేర్చుకున్న మహిళల విజయగాథ. మా ఊరు దూబగుంట. మేం కూలిపని చేసుకుని బతుకుతాం. మేం మట్టినుంచి బంగారం పండిస్తాం. కానీ మేం*

*కష్టపడి సంపాదించిన సొమ్మంతా మగవాళ్లు కల్లు, సారాయి మీద ఖర్చు చేసేస్తారు. వాళ్ల దగ్గర డబ్బులు లేకపోతే బియ్యం, నెయ్యి, అమ్మి సారా కొనుక్కుంటారు. దానికోసం ఏవస్తువులనైనా అమ్మేస్తారు. వాళ్ల చేతికి దొరికిన ప్రతి వస్తువూ పట్టుకెళతారు... తాగింది కాకుండా మమ్మల్ని తిడతారు, మాతో గొడవలు పెట్టుకుంటారు, పిల్లల్ని కొడతారు. మా రోజువారీ జీవితాన్ని దుర్భరంగా చేస్తారు. మా దగ్గర ఉన్న పాఠ్యపుస్తకంలో 'సీతమ్మకథ' చదివాం. అది మమ్మల్ని ఆలోచింప చేసింది. ఆమె చావుకి ఎవరు కారణం? సారా అంగడి మూసెయ్యాలని సర్పంచ్‌కి చెప్పాం. అయితే అందులో మేం సఫలం కాలేదు.*

*"దాంతో మరునాడు వందలాది మందిమి కదిలి ఊళ్లోకి వస్తున్న సారాబండిని ఊరిబయటే ఆపేశాం. సారా పారబొయ్యమని బండి యజమానికి చెప్పాం. అతడికి జరిగిన నష్టానికి ఒక్కొక్కరం ఒక్కొక్క రూపాయి ఇస్తామని చెప్పాం. అతడు భయపడిపోయాడు. ఆ రోజునుంచి మా ఊళ్లోకి సారాబండి రాలేదు. ఒకరోజు సారాతో ఒక జీపు ఊళ్లోకి వచ్చింది. మేం దానిని చుట్టుముట్టి మెజిస్ట్రేటుకి ఫిర్యాదు చేస్తామని యజమానిని హెచ్చరించాం. అతడు వణికిపోయాడు. ఊళ్లో దుకాణాన్ని మూసేశాడు. దాంతో మా ఆత్మవిశ్వాసం పెరిగింది. విద్యవల్లనే ఈ విజయం సాధ్యమయ్యిందని మేం గుర్తించాం. ఈ సంవత్సరం సారా వేలం పాటలో పాల్గొనే సాహసం ఎవరూ చెయ్యలేకపోయారు."*

ఇది 1992లో జరిగింది. అయితే ఇది ఏకైక సంఘటన కాదు. ఈ వార్త వ్యాపించటంతో ఇతర గ్రామాల మహిళలు కూడా తమ గ్రామాల్లో సారా అమ్మకాలను నిలిపివేశారు. అంతిమంగా వాళ్లు వేలాది సంఖ్యలో నెల్లూరు కలెక్టరు కార్యాలయం వద్దకు కదం తొక్కి సంవత్సరానికి ఒకసారి జరిగే సారా కాంట్రాక్టు వేలం పాటలను ఆపేశారు. వేలంపాటను కలెక్టరు ఆరుసార్లు వాయిదా వేసి, చివరికి వాటిని రద్దు చెయ్యవలసి వచ్చింది.

ఇతర ప్రాంతాల్లో మహిళలు సారా అంగళ్లకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించారు, వాటిని పికెటింగ్ చేశారు, ఆ అంగళ్లను మూసెయ్యటానికి ప్రయత్నించారు. దుకాణాల్లో సారా పెట్టుకోనివ్వకుండా చేసి, లేదా మగవాళ్లు సారా కొనకుండా చేసి సారా అమ్మకాలను ఆపటానికి వాళ్లు ప్రయత్నించారు. దుకాణాలు మూసెయ్యటానికి యజమానులు నిరాకరిస్తే వాటిని పికెటింగ్ చేసేవాళ్లు, సారా ప్యాకెట్లు బయట పారేసేవాళ్లు, సారా తగలబెట్టేవాళ్లు. అనేక ఊళ్లలో సారా అలవాటు మానని మగవాళ్ల మీసాలను ఆడవాళ్లు కత్తిరించారు, కొన్ని సందర్భాలలో గాడిదమీద కూర్చోబెట్టి ఊరేగించారు. ఇక సారా ముట్టబోమని మగవాళ్లతో ఆలయాలలో ఒట్టు వేయించేవాళ్లు. రాష్ట్రమంతటా మహిళలు చేపట్టిన నిరసనలు, సమావేశాల ఫలితంగా చివరికి 1993 అక్టోబరులో సారాని అధికారికంగా నిషేధించారు, 1995లో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధించారు.

ఈ మహిళలు దళితులు, అత్యంత పేదలు. తమ భర్తలు, మగవాళ్లు సారాయికి బానిసలు కావటంతో తీవ్ర కష్టాలకు లోను కాసాగారు. ఈ మహిళల్లో చాలామంది అక్షరాస్యత తరగతులకు హాజరు కాసాగారు. వీళ్లు తరచు తమ సమస్యల గురించి మాట్లాడుకుంటూ ఉండేవాళ్లు. ఈ రాత్రిపూట తరగతుల వల్ల ఈ మహిళలకు తమ జీవితాల గురించి మాట్లాడుకునే అవకాశం లభించింది, కొత్త సంబంధాలను ఏర్పరిచింది. ఒకసారి ఉద్యమం మొదలైన తరువాత వీటి అనుభవాలు సాక్షరతా పుస్తకాల ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ విస్తరించాయి. ఆ విధంగా సమాజంలో అత్యంత పేదలైన వర్గానికి చెందిన మహిళలు ధనబలం, కండబలంతో పాటు రాజకీయ అండదండలున్న సారాయి తయారీదారులు, అమ్మకందారులను ఎదుర్కోగలిగారు.

ఈ రోజు పరిస్థితి మళ్లీ మారిపోయింది, సారాయి అంగళ్లు మళ్లీ నడుస్తున్నాయి. ఇటువంటి ఉద్యమాల విజయాలు చిరకాలం కొనసాగాలంటే నిరంతర నిఘా, కార్యాచరణ ఉండాలన్నది అర్థమవుతుంది.

- ఇటీవల కాలంలో పశ్చిమ బెంగాల్ (నందిగ్రాం), ఒడిశా (నియమగిరి), ఆంధ్రప్రదేశ్ (పోలవరం, సోంపేట, మొదలైనవి)లో జరిగిన ఇటువంటి పోరాటాల గురించి మరింత తెలుసుకోండి. ఈ పోరాటాల్లో ముఖ్యమైన అంశాలను వివరిస్తూ ఒక పోస్టరు తయారు చెయ్యండి.

## మానవ హక్కులపై సామాజిక సమీకరణ

తమ చర్యలపై చట్టబద్ధ సమీక్ష లేకుంటే అంటే సైనిక దళాల చర్యలను కోర్టుల్లో సవాలు చెయ్యలేం. ప్రజలను అణిచివెయ్యటానికి సాయుధ దళాలకు అధికారాలు ఇచ్చే చట్టాలకు వ్యతిరేకంగా ఈశాన్య భారతంలోని మణిపురి మహిళలు ఎట్లా పోరాడారో తెలుసుకుందాం.

మానవ హక్కులలోని కొన్ని అధికరణాలు కింద ఉన్నాయి. ఈ భాగాన్ని రెండుసార్లు చదవండి. మొదటిసారి అంతా చదివి మానవులందరికీ ఉండాల్సిన మానవ హక్కులను గుర్తించండి. తరువాత కింద ఇచ్చిన మానవ హక్కుల ఉల్లంఘన గురించి ఏ పేరా, ఏ వాక్యంలో ఉందో గుర్తించండి. (ప్రతిదానికి దొరకక పోవచ్చు, దానిని ఖాళీగా ఉంచెయ్యండి.)

**అధికరణం 3:** ప్రతి ఒక్కరికీ జీవితం, స్వేచ్ఛ, వ్యక్తిగత భద్రతలకు హక్కు ఉంది. పేరా --------- వాక్యం ---------

**అధికరణం 5:** ఎవరిని హింసకు లేదా క్రూర, అమానవీయ, అవమానకర వ్యవహారానికి లేదా శిక్షకు గురిచెయ్యకూడదు. పేరా --------- వాక్యం ----------

**అధికరణం 7:** చట్టం ముందు అందరూ సమానులే, ఎటువంటి వివక్షతకు లోనుకాకుండా అందరికి చట్టం ద్వారా సమాన రక్షణ లభించాలి. ఈ ప్రకటనకు భంగం కలిగిస్తూ వివక్షతకు గురికాకుండా అందరికీ సమాన రక్షణ లభించాలి, ఇటువంటి వివక్షతకు రెచ్చగొట్టబడటం నుంచి కూడా రక్షణ లభించాలి. పేరా ------ వాక్యం ----

**అధికరణం 9:** ఎవరినీ అకారణంగా అరెస్టు చెయ్యకూడదు, నిర్బంధించకూడదు, బహిష్కరించగూడదు. పేరా-------- వాక్యం ---------

**అధికరణం 10:** ఒక వ్యక్తిపై మోపబడిన నేరాలకు అతడు/ ఆమె హక్కులు, బాధ్యతలు నిర్ణయించటానికి స్వతంత్ర, నిష్పక్షపాత ట్రిబ్యునల్ ద్వారా బహిరంగ విచారణకు పూర్తి సమానతతోకూడిన హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. పేరా ----- వాక్యం --------

**అధికరణం 12:** అకారణంగా ఎవరి ఏకాంతానికీ, కుటుంబానికి, నివాసానికి లేదా ఉత్తర ప్రత్యుత్తరాలకు అడ్డు పడకూడదు, జోక్యం చేసుకోకూడదు, వ్యక్తి పరువు, మర్యాదలకు భంగం కలిగించకూడదు. ఈ విధమైన దాడుల, జోక్యం చేసుకోవడాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరికీ చట్టం ద్వారా రక్షణ పొందే హక్కు ఉంటుంది. పేరా ----- వాక్యం ------

**అధికరణం 13:** (1) దేశ సరిహద్దులకు లోబడి ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా సంచరించే హక్కు, నివాసం ఏర్పరుచుకునే హక్కు ఉంటాయి. పేరా ------ వాక్యం -------

(2) ప్రతి ఒక్కరికీ సొంత దేశంతో సహా ఏ దేశాన్నైనా వీడే హక్కు, తిరిగి సొంత దేశానికి చేరే హక్కు ఉంటాయి. పేరా ------ వాక్యం ------

## చారిత్రిక నేపథ్యం

మణిపూర్ ప్రస్తుతం రెండు విలక్షణ భౌగోళిక ప్రదేశాలను కలిగి ఉంది: కొండలు, లోయలు. స్వాతంత్ర్యానికి ముందు లోయ ప్రాంతాలు రాచరిక పాలనలో ఉండగా కొండ ప్రాంతాలు ప్రధానంగా గిరిజన ప్రజలతో కొంత స్వయం ప్రతిపత్తితో ఉండేవి. 1891లో బ్రిటిష్‌వాళ్లు ఈ ప్రాంతంపై తమ నియంత్రణను సాధించారు, అయినప్పటికీ రాజుని పరిపాలించనిచ్చారు. మణిపూర్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తూ రాజు 1949లో భారతదేశంతో ఒప్పందంపై సంతకం చేశాడు. ఈ ఒప్పందంతో అనేక తెగలు విభేదించాయి, తాము స్వయం ప్రతిపత్తితో జీవించామని, తాము భారతదేశంలో భాగం కావటానికి అంగీకరించబోమని వాదించసాగాయి.

భారతదేశంలో విలీనం కావటానికి వ్యతిరేకించిన వాళ్లను నియంత్రించటానికి భారత ప్రభుత్వం సైన్యాన్ని పంపించింది. శాంతి, భద్రతలను నెలకొల్పటానికి చేసిన చట్టాలలో ఒకటి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం, 1958. దేశవిద్రోహ చర్యలలో పాల్గొంటున్నారన్న అనుమానం వస్తే ఆ వ్యక్తిని అరెస్టు చెయ్యటానికి, లేదా కాల్చి చంపటానికి భద్రతా సిబ్బందికి ఈ చట్టం అధికారాన్ని ఇస్తుంది. ఈ చట్టంలోని అంశాలు దుర్వినియోగమయ్యాయని, అమాయకులైన వ్యక్తులు తరుచు వేధింపులు, హింసకి గురయ్యారని, చంపబడ్డారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సాయుధ దళాలు మహిళలను దోపిడీ, అత్యాచారాలకు గురిచేశాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దేశ విద్రోహ చర్యలలో పాల్గొంటున్నారన్న అనుమానంతో తమ కొడుకులను, భర్తలను నిర్బంధించి, హింసిస్తారన్న భయం కూడా మహిళలుగా, తల్లులుగా వీళ్లకు ఉండేది. తల్లులు, కూతుళ్లు స్వయంగా లైంగిక అత్యాచారానికి గురవుతున్నారు. ఇలా అత్యాచారానికి గురైన కొంతమంది మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తంగజం మనోరమ అనే 32 ఏళ్ల మహిళ నిర్బంధంలో చనిపోయినప్పుడు ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి.

## మైరా పైబీ ఉద్యమం

మైటై భాషలో మైరా పైబీ అంటే కాగడాలు పట్టుకున్నవాళ్లు అని అర్థం. 1970ల చివరికాలంలో తాగి బజారుల్లో గొడవ చెయ్యకుండా నివారించటానికి మైరా పైబీ ఉద్యమం మొదలయ్యింది. 1980ల ఆరంభంలో మణిపురి స్వాతంత్ర్యానికి మొదలైన సాయుధ ఉద్యమాన్ని ఎదుర్కోటానికి భారతీయ సైన్యాన్ని పెద్ద ఎత్తున పంపించటంతో మానవ హక్కుల ఉద్యమంగా అది మార్పు చెందింది. అదే సమయంలో రాష్ట్రాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం కింద భారతీయ సైన్యానికి అంతులేని అధికారాలు ఇచ్చారు. దీని ఫలితంగా తరుచు సైనిక చర్యలతో మానవ హక్కులు ఉల్లంఘింపబడేవి. దీనికి నిరసన ప్రదర్శనలతో మైరా పైబీ వెంటనే స్పందించింది. రాత్రుళ్లు బజారులలో మైరా పైబీ పహరా తిరగటం మొదలుపెట్టింది. గ్రామాలు, పట్టణాలలోని వార్డులోని మహిళలు రోజూ ఈ పహరాలో పాల్గొనేవాళ్లు. అయితే వీళ్ల చేతుల్లో ఎటువంటి ఆయుధాలు కాకుండా కర్రకు గుడ్డచుట్టి, కిరోసిన్‌తో తడిపి వెలిగించిన కాగడాలు మాత్రమే ఉండేవి. ప్రజాశాంతికి భంగం, ముప్పు కలగకుండా మహిళా బృందాలు ప్రతి రాత్రి, ప్రతి వార్డులో, ప్రతి కూడలిలో కూర్చుంటాయి. కొంత శాంతియుత సమయాల్లో కొంతమంది మహిళలే వంతుల ప్రకారం పహరా ఉంటారు. కానీ ఉద్రిక్తతలు తీవ్రంగా ఉన్న తరుణంలో పెద్ద సంఖ్యలో మహిళలు కాపలా ఉంటారు. వీళ్లు ఉద్యమకారులు కాదు, వీళ్లకి రాజకీయ ఆకాంక్షలు ఏమీ లేవు. ప్రజల భద్రత, సంక్షేమానికి బాధ్యతను తమ చేతుల్లోకి తీసుకున్న




*చిత్రం 21.8 : ప్రదర్శనలో పాల్గొంటున్న మైరా పైబీ మహిళలు*

సాధారణ మహిళలు వీళ్లంతా. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చెయ్యాలని కూడా మైరా పైబీ ఉద్యమం కోరుతోంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం క్రమేపీ బలం పుంజుకుంది. ఎన్నికలను బహిష్కరించటం నుంచి రిలే నిరాహారదీక్షల వరకు తమ వ్యతిరేకతను అనేక రూపాలలో వెల్లడించారు. వీటిల్లో ఒక ఉదాహరణ ఇరోం షర్మిలా: ఈమె గృహ నిర్బంధంలో ఉన్నప్పటికీ 10 సంవత్సరాల కంటే ఎక్కువకాలంగా నిరాహార దీక్ష చేస్తోంది.

ఈ సమస్యను పరిష్కరించటానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. మాజీ సైనికాధికారులు కొంతమంది ఈ ప్రాంతంలోని వైరుధ్యాల గురించి రాస్తూ మెరుగైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు అభివృద్ధి చేయటం ద్వారా మాత్రమే ఈ ప్రాంత ప్రజల అంగీకారాన్ని పొందగలరని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఈ చట్టాన్ని రద్దు పరచటానికి ఉన్న అవకాశాలను పరిశీలించటానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి అయిన బి.పి. జీవన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ తన నివేదికను సమర్పించినప్పటికీ ఇప్పటికీ శాశ్వత పరిష్కారాన్ని కనుగొనలేదు.

## సామాజిక ఉద్యమాలన్నింటిలోని సారూప్య అంశాలు

పర్యావరణం, మానవ హక్కులు అన్న సరిహద్దులను చెరిపేస్తూ సామాజిక ఉద్యమాలు అనేక అంశాలను లేవనెత్తాయి. వాళ్ల వాదనలు ఈ వివిధ సూత్రాల నుంచి పుట్టుకొచ్చాయి. మహిలియా, లూథర్ కింగ్‌లు మానవ హక్కుల ఆదర్శాలతోపాటు పర్యావరణం, సమానత్వాలకు సంబంధించిన అంశాలను కూడా లేవనెత్తారని మీరు గమనిస్తారు. కొన్ని సందర్భాలలో తమపై రుద్దిన మార్పులను ఈ ఉద్యమాలు ప్రతిఘటించాయి. మార్టిన్ లూథర్ కింగ్, మైరా పైబి వంటి కొన్ని ఉద్యమాలు మార్పును కోరుకున్నాయి. సామాజిక ఉద్యమాలు సాధారణంగా రాజకీయ పార్టీలకు దూరంగా ఉండి ఒక ఆశయం కోసం కలిసి పనిచేస్తాయి. దాంట్లో పాల్గొంటున్న వాళ్లు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వాళ్లు కావచ్చు. తరచు ఈ ఉద్యమాల కార్యక్రమాలను భూస్వామ్య, ప్రజాస్వామిక పద్ధతుల్లో రూపొందిస్తారు. దేశంలో వేళ్లూనుకుని ఉన్న రాజకీయ వ్యవస్థలు తమ ఆశలను పూర్తిచెయ్యనప్పుడు లేదా పోరాడే అంశమున్నప్పుడు సామాజిక ఉద్యమాలు తలెత్తుతాయి.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| పౌరహక్కులు | సహాయ నిరాకరణ | ప్రజలను వేరు చెయ్యటం | అస్థిర పరచటం |
| యుద్ధ వ్యతిరేకత | సైన్యంలో చేరే వయస్సు | సాయుధీకరణ | పునరావాసం |
| నష్టపరిహారం | సారా వ్యతిరేకత | ప్రజాస్వామిక | భాగస్వామ్యం |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. సామాజిక ఉద్యమాలపై ఒక పట్టిక తయారు చెయ్యటానికి ఇక్కడ కొన్ని అంశాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పట్టిక తయారుచేసి వివిధ ఉద్యమాల మధ్య పోలికలు, తేడాలను గుర్తించండి:

   ఉద్యమం దృష్టిపెట్టిన ప్రధాన అంశం; ఎక్కడ జరిగింది; ప్రధాన కోరికలు; నిరసన తెలియచేసిన పద్ధతులు; ముఖ్యమైన నాయకులు; ప్రభుత్వం స్పందించిన తీరు; సమాజంపై ఉండే ప్రభావం.

2. కన్నయ్య, రమ్య, సల్మా ఒక విషయాన్ని చర్చిస్తున్నారు. వాళ్ల కోరికలు వేరు. మానవ హక్కుల కోణం నుంచి మీరు ఎవరితో ఏకీభవిస్తారో పేర్కొని మీ కారణాలను తెలియచెయ్యండి.

   ప్రజలు పేదరికంలో మగ్గకుండా చూడాలి, అందుకు అవసరమైతే పత్రికా స్వేచ్ఛను కొంతవరకు నియంత్రించినా ఫర్వాలేదని రమ్య అంటుంది. ఆహారం ఒక్కటే ఉంటే చాలదని, పత్రికా స్వేచ్ఛకూడా ఉండటం ముఖ్యమని లేకపోతే దేశ వివిధ ప్రాంతాలలో మానవ హక్కులు ఎక్కడైనా ఉల్లంఘింప బడుతున్నాయేమో తెలిసే మార్గమే ఉండదన్నది సల్మా వాదన. పత్రికలు ధనికులు, శక్తిమంతుల చేతుల్లో పత్రికలు ఉన్నప్పుడు ప్రయోజనం ఏమిటి, అవి సాధారణ ప్రజలకు సంబంధించిన అంశాలను ఎందుకు ప్రచురిస్తాయని కన్నయ్య అంటాడు.




3. సామాజిక ఉద్యమాల మౌలిక అంశాలు ఏమిటి?

4. పైన ఇచ్చిన ఉదాహరణలో సాధారణ ప్రజల పాత్రను ఎలా పేర్కొన్నారు?

5. అమెరికాలోని నల్ల జాతీయులు, మైరా పైబీ ఉద్యమాల మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?

6. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక రాజకీయ వ్యవస్థలుగా ప్రజాస్వామ్యాలే ఉన్నాయి. ఇవి ప్రజల ఆకాంక్షలకు పూర్తి న్యాయం చేశాయా? ఈ అధ్యాయంలో ఇచ్చిన ఉదాహరణల ఆధారంగా 'ప్రజాస్వామ్యం – సామాజిక ఉద్యమాలు' అన్న అంశంపై చిన్న వ్యాసం రాయండి.

7. భోపాల్ గ్యాస్ దుర్ఘటన వంటి వాటి నేపధ్యంలో నిరసనలు, ఉద్యమాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఎలా సమీకరిస్తారో తెలుసుకుని, చర్చించండి.

పాఠం 22

# పౌరులు, ప్రభుత్వాలు

## భాగం - I : సమాచార హక్కు చట్టం

*గట్టు శ్వేతది కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం. ఆమె కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌సి చదువుతూ ఉండేది. సమాచార హక్కు చట్టం (సహ చట్టం)సహకారంతో ఆమె బిఎస్‌సి డిగ్రీ పూర్తిచేసింది.*



*శ్వేత బిఎస్‌సి చివరి సంవత్సరం పరీక్షలు 2011 మార్చిలో రాసింది. ఒక్క రసాయన శాస్త్రంలో 21 మార్కులు తప్పించి మిగిలిన అన్ని విషయాల్లో ఆమెకు మంచి మార్కులు వచ్చాయి. దీంట్లో తక్కువ మార్కులు ఎందుకు వచ్చాయో ఆమెకు అర్థం కాలేదు. ఆమె బాగా కష్టపడి చదివి జూన్‌లో ఇన్‌స్టెంట్ పరీక్ష రాసింది. ఈసారి ఆమెకు 9 మార్కులే వచ్చాయి. పరీక్షలలో బాగా రాసినా తనకు తక్కువ మార్కులు ఎందుకు వస్తున్నాయో ఆమెకు అర్థం కాలేదు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లి తన పరీక్ష పత్రాన్ని మళ్లీ మూల్యాంకనం చెయ్యవలసిందిగా ఆమె దరఖాస్తు పెట్టుకుంది. కానీ ఆమె విన్నపాన్ని విశ్వవిద్యాలయం తిరస్కరించింది. ఈలోగా శ్వేత ఎంఎస్‌సి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణురాలయ్యింది. అయితే బిఎస్‌సిలో రసాయన శాస్త్రం పరీక్షలో ఉత్తీర్ణురాలు అయితే తప్పించి విశ్వవిద్యాలయం ఆమెను ఎంఎస్‌సిలో చేర్చుకోనంది.*

*అప్పుడు ఆమె సమాచార హక్కు కార్యకర్తలను సంప్రదించి తన జవాబు పత్రం ఫొటోకాపీ కోరుతూ దరఖాస్తు చేసుకుంది. విశ్వవిద్యాలయ అధికారులు ఫొటోకాపీ ఇవ్వటానికి నిరాకరించారు. ఎంఎస్‌సిలో చేరే తేదీ దగ్గర పడుతుండటంతో ఆమె రాష్ట్ర సమాచార అధికారి దగ్గరకు వెళ్లి విశ్వవిద్యాలయ పౌర సమాచార అధికారి జవాబు పత్రం ఇవ్వకపోవటంపై విన్నవించుకుంది. జవాబుపత్రం నకలును ఆమెకు ఇవ్వవలసిందిగా విశ్వవిద్యాలయ అధికారులకు రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అప్పుడు తిరిగి మూల్యాంకనం చేసి ఆమెకు మార్కుల పత్రం పంపించారు. ఈసారి ఆమెకు 51 మార్కులు వచ్చి పరీక్షలో ఉత్తీర్ణురాలయ్యింది, దాంతో ఎంఎస్‌సిలో చేరగలిగింది.*

సమాచార హక్కు చట్టం వంటిది లేనట్లయితే శ్వేతకు న్యాయం జరిగి ఉండేది కాదు. అంతకు ముందు విద్యార్థులకు మార్కులు తప్పించి జవాబు పత్రం పొందే అవకాశం ఉండేది కాదు. కాబట్టి ప్రతి జవాబుకు మార్కులు సరిగ్గా వేశారో లేదో చూసుకునే వీలు విద్యార్థులకు ఉండేది కాదు.

సమాచార హక్కు చట్టం, 2005ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విషయం మీరు ఎనిమిదవ తరగతిలో చదివారు. ప్రజల ఉద్యమం కారణంగా, పౌరులకు హక్కులను కల్పిస్తున్న రాజ్యాంగంలోని అంశాల కారణంగా ఈ చట్టం రూపొందింది. సహ చట్టం ప్రయోజనాలు ప్రజలకు అందాలంటే నిర్వర్తించాల్సిన రెండు పాత్రల గురించి ఈ పాఠంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మొదటి పాత్ర ప్రభుత్వ శాఖలది, రెండవ పాత్ర పౌరులది. ఏ ప్రజాస్వామిక వ్యవస్థలోనైనా ప్రభుత్వాలు ప్రజలకు బాధ్యత వహించి వారికి జవాబుదారీగా ఉండాలి. అంతకు ముందు ప్రభుత్వ శాఖలు, వాటి సిబ్బంది జవాబుదారీతనం ప్రధానంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పరిమితమై ఉండేది. ప్రభుత్వ శాఖలో ఉత్పన్నమయ్యే సమాచారంలో ఏ పౌరుడు ఆసక్తి చూపించినా వారికి అందచేయటం ఇప్పుడు ప్రభుత్వ శాఖల బాధ్యత అవుతుంది.

## సమాచారం అంటే ఏమిటి?

ప్రతి ప్రభుత్వశాఖ కొన్ని నియమ, నిబంధనల ఆధారంగా పని చేస్తుంది. ఉదాహరణకు ఆరోగ్య శాఖలో ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సుల ఎంపిక, నియామకం, బదిలీలకు సంబంధించి లేదా మందుల కొనుగోలు, పంపిణీలకు సంబంధించి నియమ, నిబంధనలు ఉంటాయి. రెవెన్యూ శాఖలో భూమి రికార్డులకు సంబంధించిన నియమాలు ఉంటాయి, లేదా విద్యాశాఖలో పాఠశాలలు పుస్తకాలు కొనటానికి, మధ్యాహ్న భోజనాలు పెట్టటానికి, వసతిగృహ సదుపాయాలు కల్పించటానికి, ఉపాధ్యాయుల సెలవులకు, క్రీడా మైదానానికి డబ్బు పోగుచెయ్యటం వంటి వాటికి నియమాలు ఉంటాయి. ఈ పరిస్థితులన్నింటిలో కొన్ని నియమాలను పాటించాలి, కొన్ని రికార్డులను నిర్వహించాలి, తీసుకున్న నిర్ణయాల వివరణ ఉండాలి. వీటి కారణంగా వ్యవస్థలో అనేక రాత పత్రాలు రూపొందుతాయి. సమాచార హక్కు చట్టంలో పేర్కొన్నట్టు ఇవి అనేక రూపాలలో ఉండవచ్చు:

"రికార్డులు, డాక్యుమెంట్లు, మెమోలు, ఈ-మెయిల్స్, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్క్యులర్లు, ఆదేశాలు, లాగ్ పుస్తకాలు, ఒప్పందాలు, నివేదికలు, పత్రాలు, నమూనాలు, మోడల్స్ వంటి రూపాలలో ఉన్న మెటీరియల్, ఏ ఎలక్ట్రానిక్ రూపంలోనైనా ఉన్న గణాంకాలు, అమలులో ఉన్న ఇతర చట్టాల కింద ప్రభుత్వ అధికారి అనుమతి పొందిన ప్రైవేటు సంస్థకు సంబంధించిన సమాచారం,"

ఈ సమాచారంలో పౌరులు ఏం చెయ్యగలుగుతారన్నది కీలకమైనది. ఒక శాఖ పని చెయ్యటంలో అవకతవకలు జరిగాయన్న అనుమానం ఉందని అనుకుందాం, ఏ వ్యక్తులైనా సమాచారాన్ని సేకరించి అవలంబించిన విధానాన్ని సవాలు చెయ్యవచ్చు. సమాచార హక్కు చట్టం లేకముందు విద్యాశాఖ యూనిఫారంను ఎలా పంచి పెట్టిందో, లేదా ఆరోగ్య శాఖ మందులను ఎలా కొనుగోలు చేసిందో తెలుసుకునే అవకాశం లేదు. ఆ శాఖలోని పై అధికారులు, లేదా మంత్రి మాత్రమే ఆ వివరాలను తీసుకుని, తనిఖీ చెయ్యగలిగి ఉండేవాళ్లు.

సమాచార హక్కు చట్టం వల్ల ఇప్పుడు ప్రతి ప్రభుత్వ శాఖ రికార్డులను నిర్వహించి, వాటిని అడిగిన పౌరులకు అందుబాటులో ఉంచాలి. అంతేకాదు, పౌరులెవ్వరూ అడగకుండానే ప్రతి శాఖ తమకు సంబంధించిన కొన్ని వివరాలను స్వచ్ఛందంగా ప్రజలకు బహిర్గతం చెయ్యాలి. ఉదాహరణకు రోడ్లు

వేస్తుంటే, లేదా మరమ్మతు చేస్తుంటే ప్రజా పనుల శాఖ (PWD) ఆ ప్రాంతంలో ఒక బోర్డు పెట్టి ఎంత డబ్బు ఖర్చు పెట్టారు, లేదా ఎంత మంది కూలీలు పనిచేసారు, ఎన్ని రోజులలో పని పూర్తి చేశారు వంటి వివరాలను పొందు పరచాలి. దీని వల్ల మరింత పారదర్శకత ఏర్పడుతుంది.

- టీచరుకు హెడ్మాస్టారు ఇచ్చే మౌఖిక ఆదేశం సమాచారం కాకపోవటానికి కారణం ఏమిటో చర్చించండి.
- సిఫారసు చేసిన విధంగా నియమ, నిబంధనలను పాటించినట్లయితే ప్రభుత్వ శాఖలు మరింత జవాబుదారీతనాన్ని ఎలా కనబరుస్తాయో ఊహించండి.

## ఎవరు బాధ్యులు

పైన వివరించిన దానిని బట్టి ఇటువంటి చట్టాన్ని అమలు చెయ్యటానికి ఒక నిర్మాణం అవసరం అని అర్థమవుతోంది. ఎనిమిదవ తరగతిలో చదివినట్టు మీ ప్రభుత్వ పాఠశాలతో సహా ప్రతి ప్రభుత్వశాఖలో ఒక పౌర సమాచార అధికారి ఉంటారు, అదే శాఖలో ఒక అప్పీలేట్ అధికారి ఉంటారు, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారులు రాష్ట్ర పౌర సమాచార కార్యాలయానికి జవాబుదారీగా ఉంటారు, దీనికి రాష్ట్ర సమాచార కమిషనర్లు ఉంటారు. ఏదైనా ప్రభుత్వశాఖ కేంద్ర ప్రభుత్వం కిందికి వస్తే కేంద్ర సమాచార కమిషనర్లతో కూడిన కేంద్ర సమాచార కార్యాలయానికి జవాబుదారీగా ఉంటారు. ప్రధాన ఎన్నికల కమిషనరు, న్యాయవ్యవస్థ మాదిరి ఈ సమాచార కార్యాలయాలు స్వయంప్రతిపత్తి కలిగి ఉంటాయి.

ఒక ఉదాహరణ ద్వారా దీనిని అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం. మీరు ఒక గ్రామంలో ఉంటున్నారని అనుకుందాం. మీ గ్రామంలో వేసిన రోడ్డుకి ఎంత ఖర్చు అయ్యిందో తెలుసుకోవాలని మీరు అనుకున్నారు. PWD మండల లేదా జిల్లా కార్యాలయంలో సమాచారం కోసం మీరు దరఖాస్తు చేయవచ్చు. మీరు PWD జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసే మండల శాఖ ద్వారా సమాచారం పొందమని వాళ్లు బదులు ఇవ్వటానికి లేదు. ఒకవేళ మీరు PWD మండల కార్యాలయంలో దరఖాస్తు చేస్తే ఈ సమాచారాన్ని జిల్లా కార్యాలయం నుంచి తీసుకొమ్మని చెప్పటానికి లేదు. ఒకవేళ ఈ సమాచారం వాళ్ల దగ్గర లేకపోతే సమాచారం ఉన్న అధికారి నుంచి సమాచారం పొంది దానిని అందచేయటం వాళ్ల బాధ్యత.

ఒకవేళ సమాచార అధికారులు ఇద్దరూ మీ దరఖాస్తుకు జవాబు ఇవ్వలేదని అనుకుందాం. అప్పుడు ఏం చెయ్యాలి? ఇక్కడ రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్ల పాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. PWD లోని పౌర సమాచార అధికారులు వీటికి జవాబుదారీగా ఉంటారు. అవసరమైతే రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్లు సంబంధిత పౌర సమాచార అధికారికి జరిమానా విధించవచ్చు.

అయితే ఆయా శాఖల పనిలో చట్టాలను ఉల్లంఘిస్తే చర్య తీసుకునే బాధ్యత సమాచార అధికారులకు ఉండదని గుర్తుంచుకోవాలి. ఈ అధికారం దేశంలోని న్యాయస్థానాలకే ఉంటుంది. అయితే నిర్దేశిత సమయంలోపు, సరైన సమాచారం ఇచ్చేలా రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్లు చూడవచ్చు. ఒకవేళ ఎవరైనా పౌర సమాచార అధికారి సమాచారాన్ని ఇవ్వటానికి తిరస్కరిస్తే రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్ల ఆదేశాల మేరకు వాళ్లను శిక్షించవచ్చు.

సమాచార హక్కు చట్టం కిందికి వచ్చే ప్రభుత్వ సంస్థలను చట్టం ఈ కింది విధంగా గుర్తించింది: అ) రాజ్యాంగం కింద ఏర్పడిన సంస్థ; ఆ) పార్లమెంటు, లేదా రాష్ట్ర శాసన సభల ప్రకారం ఏర్పడిన సంస్థ; ఇ) సంబంధిత ప్రభుత్వ ఆదేశాలు లేదా నోటిఫికేషన్ ద్వారా ఏర్పడిన సంస్థ. ప్రభుత్వ సంస్థ, ప్రభుత్వ నియంత్రిత సంస్థ, ప్రభుత్వం నిధులు సమకూర్చిన సంస్థలు ఈ చట్టంకిందికి వస్తాయి. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గణనీయ మొత్తంలో ప్రభుత్వ నిధులు అందే స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ చట్టంకిందికి వస్తాయి.

సమాచార హక్కు చట్టం, 2005 ప్రకారం ప్రభుత్వ సంస్థలు అ) కంప్యూటరైజ్డ్ రూపంలో సమాచారాన్ని భద్రపరచాలి, ఆ) దానికి సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగానే వెల్లడి చెయ్యాలి. సమాచార హక్కు చట్టం ఇలా పేర్కొంటోంది:

(1) ప్రతి ప్రభుత్వ సంస్థ: అ) తనకు సంబంధించిన అన్ని రికార్డులను .... ఇటువంటి రికార్డులను తేలికగా బయటకు తీయటానికి వీలుగా వర్గీకరించి, సూచికలతో నిర్వహించాలి.

ఆ) ప్రతి సంస్థ ఈ దిగువ సమాచారాన్ని ప్రచురించాలి

(i) సంస్థ వివరాలు, విధులు, బాధ్యతలు;

(ii) సంస్థలోని అధికారులు, ఉద్యోగస్తుల అధికారాలు, విధులు;

(iii) నిర్ణయాలు తీసుకోవటంలో అనుసరించే విధానం, పర్యవేక్షణ, జవాబుదారీ విధానాలను కూడా పేర్కొనాలి;

(v) సంస్థకు ఉండే లేదా దాని నియంత్రణలో ఉండే లేదా తమ విధులను నిర్వర్తించటంలో ఉద్యోగస్తులు ఉపయోగించే నియమాలు, నిబంధనలు, ఆదేశాలు, మార్గదర్శకాలు, రికార్డులు.

.....

(viii) సలహా ఇవ్వటం కోసం ఏర్పాటు చేసి ... ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ సభ్యులు ఉన్న బోర్డులు, సమితులు, సంఘాలు, ఇతరాల వివరాలు;

(ix) ఆ కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగస్తుల వివరాలు;

(x) అధికారులు, ఉద్యోగస్తులకు ఇస్తున్న నెలసరి జీతం, నియమాల ప్రకారం చేసే ఇతర చెల్లింపులు;

(xi) తన ప్రతి ఒక్క ఏజెన్సీకి కేటాయించిన బడ్జెటు;

(xii) సబ్సిడీ పథకాల అమలు విధానం దానికి కేటాయించిన నిధులు....

(xiii) దాని ద్వారా రాయితీలు, పర్మిట్లు, లేదా అధీకృత పత్రాలు పొందిన వాళ్ల వివరాలు;

....

(xvi) పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు, ఇతర వివరాలు.

ఇ) ముఖ్యమైన విధానాలు రూపొందించేటప్పుడు లేదా ప్రజలను ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రకటించేటప్పుడు సంబంధిత అన్ని వాస్తవాలను వెల్లడి చేయాలి.

ఈ) ప్రభావిత వ్యక్తికి పరిపాలన సంబంధ లేదా న్యాయ స్వరూపం గల నిర్ణయాలకు కారణాలను తెలియచెయ్యాలి.

2) పై సమాచారమంతటినీ ఎవరూ అడగకుండానే ప్రభుత్వ సంస్థలు వెల్లడి చేయాలి.

3) ఇది అందరికీ తేలికగా అందుబాటులో ఉండాలి.

4) ఇది స్థానిక భాషలో ఉండాలి; దీనికి ఏదైనా డబ్బు చెల్లించాల్సి ఉంటే అది ప్రజలకు భారం కాకుండా ఉండాలి.

## సమాచారం వెల్లడి చెయ్యటానికి మినహాయింపులు

దీని అర్థం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని వ్యవహారాలపై ప్రజల నిఘా ఉండాలని కాదు. కొంత సమాచారాన్ని ప్రభుత్వం వెల్లడి చెయ్యకుండా ఉండే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది. ఇలా మినహాయించిన కొన్ని అంశాలు:

- భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రతలను ప్రభావితం చేసే సమాచారం, విదేశీ శక్తుల సందర్భంలో కీలక ఆర్థిక, శాస్త్రీయ ప్రయోజనాలు కలిగి ఉండే అంశాలు.
- పార్లమెంటు లేదా రాష్ట్ర శాసన సభల హక్కులకు భంగం కలిగించే సమాచారం.
- గోప్యంగా ఉంచుతారన్న భావనతో విదేశ ప్రభుత్వాల నుంచి అందిన సమాచారం.
- ఒక వ్యక్తి జీవితానికి లేదా భౌతిక భద్రతకు భంగం కలిగించే సమాచారం.
- (అంతిమ నిర్ణయం తీసుకోవడానికి ముందు) మంత్రుల లేదా సెక్రటరీల బృందం ముందు ఉంచే కేబినెట్ పత్రాలు లేదా రికార్డులు.

మన సైనిక దళాలు, భద్రతా సంస్థలు చాలా వరకు సమాచార కమిషన్ల పరిధిలోకి రావు.

ఈ చట్టంలో మార్పులు ఎవరు చేయవచ్చు? ఈ చట్టం చేసిన తరువాత దీనిలోని పలు అంశాలను అనేక సందర్భాలలో వివిధ శాఖలు ప్రశ్నించాయి. అవసరమనిపిస్తే ఈ చట్టానికి పార్లమెంటు సవరణలు చేయవచ్చు, అయితే రాజ్యాంగం అర్థం చేసుకుని నిర్వచించిన దానికి మద్దతుగా, సమాచారానికి ఉన్న మౌలిక హక్కుకు భంగం కలిగించేలా ఇది ఉండకూడదు.

- ఈ చట్టం ప్రకారం ఏ సమాచార అధికారి అయినా సమాచారం ఇవ్వకపోతే వాళ్లు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మీరు దీనితో ఏకీభవిస్తారా? ఎందుకని?
- ఏ రకమైన సమాచారం ప్రజలకు అందుబాటులో లేదు? దీనికి మద్దతు తెలిపిన వాదన ఏది?

## సమాచార హక్కు, ప్రజలు

సమాచార హక్కు చట్టం నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి పాత్ర ఉందో, దానిని ఎలా పోషించాలో క్లుప్తంగా తెలుసుకుందాం. ప్రస్తుతం ఏ పౌరుడైనా ప్రభుత్వానికి సంబంధించి ఏ శాఖలోనైనా రికార్డు రూపంలో ఉండే సమాచారం కావాలని అడగవచ్చు. ఆ సమాచారం తనకు ఎందుకు కావాలో వివరించాల్సిన అవసరం లేదు. సమాచారం కావాలన్న విన్నపాన్ని చేతితో రాసిన ఉత్తరం రూపంలోకానీ ఎలక్ట్రానిక్ మెయిల్ రూపంలోకానీ ఇవ్వవచ్చు. సమాచారాన్ని ఆ రాష్ట్ర అధికార భాషలోకానీ, లేదా ఇంగ్లీషులోకానీ, లేదా హిందీలోకానీ ఇవ్వవచ్చు. ఒకవేళ ఒక వ్యక్తి ఉత్తరం రాయలేకపోతే పౌర




చిత్రం 22.1 : సమాచార హక్కు చట్టం పై ప్రదర్శన

సమాచార అధికారి లేదా రాష్ట్ర పౌర సమాచార అధికారి వద్ద మౌఖికంగా చెప్పటం ద్వారా కూడా దరఖాస్తు ఇవ్వవచ్చు. సమాచారాన్ని సేకరించే వ్యక్తి తాను ఎవరో తెలియ చేయాల్సిన అవసరం లేదు. అయితే సమాచారం పంపించటానికి పోస్టల్ చిరునామా అందచేయాలి. సమాచారాన్ని పొందటానికి పౌరులు నామమాత్రమైన రుసుమును చెల్లించాల్సి ఉంటుంది, ఇది ఎక్కడి కార్యాలయం అనేదాన్ని బట్టి 5–10 రూపాయల మధ్య ఉంటుంది. సమాచారం కోరుతున్న వ్యక్తి దారిద్ర్య రేఖకు దిగువన ఉంటే అతను/ ఆమె ఈ రుసుము చెల్లించనవసరం లేదు. కాబట్టి ఈ చట్టం అనేక విధాలుగా అందరికీ సమాచారం అందుబాటులో ఉండేలా చేసింది.

*కింద ఇచ్చిన వార్తాకథనాలను చదివి సమాచార హక్కు ఉపయోగం గురించి చర్చించండి.*



ప్రజాస్వామ్యానికి అన్ని విషయాలు తెలిసిన పౌరులు కావాలి, సమాచారంలో పారదర్శకత ఉండాలి. ఇది అవినీతిని అరికట్టటానికి దోహదపడుతుంది, ప్రభుత్వాలు ప్రతిఒక్క పౌరునికి జవాబుదారీగా ఉంటాయి. ఇంతకు ముందు మాదిరి ప్రభుత్వ శాఖలు కేవలం ఎన్నికైన ప్రజాప్రతినిధులకే స్పందించటం కాకుండా ఇప్పుడు అవి సాధారణ పౌరులకు కూడా సమాధానాలు చెప్పవలసి ఉంటుంది, అంటే వాళ్లకు కూడా జవాబుదారీగా ఉండాలి.

## భాగం - II : న్యాయ సేవా ప్రాధికార సంస్థ

- కోర్టు ఫీజులు, ఇతర ఖర్చులు భరించలేని పేద ప్రజలకు మన దేశంలో ఉచిత న్యాయ సేవలకు ఎటువంటి అవకాశాలు ఉన్నాయి?
- ఉచిత న్యాయ సేవల ద్వారా ఎటువంటి కేసులు, తగాదాలను చేపట్టవచ్చు?
- కోర్టుల బయట తగాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానం ఏదైనా ఉందా?

ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించటానికి మన దేశంలో ఒక విధానం ఉంది. న్యాయ సేవల ప్రాధికార సంస్థ (సవరణ) చట్టం, 2002 ప్రకారం సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందించటానికి న్యాయ సేవా పీఠాలను ఏర్పాటు చేస్తారు. ఆర్థిక లేక ఏ ఇతర కారణాల వల్ల నైనా ఏ పౌరుడికి కూడా న్యాయం లభించకుండా ఉండకూడదన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. దీనివల్ల న్యాయ వ్యవస్థ సమాన అవకాశాల ప్రాతిపదికన అందరికీ న్యాయాన్ని అందిస్తుంది.

గ్రామాలలో ప్రజల తగాదాలను తీర్చడానికి అన్ని విషయాలను, అంశాలను గ్రామ / తెగ పెద్దల ముందు చర్చించి ప్రశాంతంగా అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించటం మన దేశంలో అనాదిగా జరుగుతోంది. తగాదాలు, వివాదాల స్వభావం, వాటి మూలాలు సాధారణంగా స్థానిక ప్రజలకు, గ్రామ పెద్దలకు తెలుస్తాయి. దీనివల్ల ఆ తగాదాలను / వివాదాలను గ్రామ ప్రజలు చర్చించటానికి వీలు కలిగి, పారదర్శక పద్ధతిలో అందరికీ ఆమోదయోగ్య పరిష్కారాన్ని కనుగొనటం సాధ్యమవుతుంది. న్యాయ సేవల పీఠాల చట్టం 1987 ని 1994లోనూ, తిరిగి 2002 లోనూ సవరించారు. దీనికింద లోక్ అదాలత్‌లను (ప్రజా న్యాయ పీఠాలను) ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పాటు చేశారు.

ఇప్పుడు వీటి ద్వారా న్యాయ కోవిదులు, అధికారులు, అనధికార ప్రముఖుల సమక్షంలో, సుహృద్భావ వాతావరణంలో, పరస్పర అంగీకారంతో తగాదాలు వివాదాలను పరిష్కారించుకోవచ్చు. ఖర్చు లేకుండా, త్వరితగతిన న్యాయం పొందటానికి ప్రజలు ఇప్పుడు లోక్ అదాలత్‌లను ఉపయోగించుకుంటున్నారు. కోర్టులలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను ఎటువంటి ఖర్చు లేకుండా వెంటనే పరిష్కరించుకోటానికి లోక్ అదాలత్ సహాయ పడుతుంది. ఒకవేళ అప్పటికే కక్షదారులు కోర్టు రుసుము చెల్లించి ఉంటే అది కూడా వెనక్కి ఇస్తారు. తగాదాలు వివాదాల పరిష్కారానికి భారతదేశంలో అనాదిగా అమలులో ఉన్న విధానమే లోక్ అదాలత్ రూపాన్ని సంతరించుకుంది, ఆధునిక కాలంలోనూ దీని అవసరం, ఉపయోగం ఉంది.

- లోక్ అదాలత్‌ని మీరు సమర్థిస్తారా?

## న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఉద్దేశాలు

- సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత, సమర్థ న్యాయ సేవలను అందించటానికి న్యాయసేవ ప్రాధికార సంస్థ చట్టాన్ని చేయడం.
- ఆర్థిక లేక ఏ ఇతర కారణాల వల్ల నైనా ఏ పౌరునికీ న్యాయం అందని పరిస్థితి లేకుండా చూడడం.
- సమాన అవకాశాల ప్రాతిపదికన న్యాయాన్ని అందించేలా న్యాయ వ్యవస్థ పనిచేసేలా చూడటానికి లోక్ అదాలత్‌లను ఏర్పాటు చెయ్యటం.
- కోర్టుల బయట సమర్థ, ప్రత్యమ్నాయ, సృజనాత్మక వివాద పరిష్కార విధానాన్ని రూపొందించటం.

## న్యాయ సేవల ఏర్పాటు

ఈ చట్టం ప్రకారం న్యాయ సహాయం అందించటానికి దేశవ్యాప్తంగా ఒక న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దేశస్థాయిలో ఏర్పాటైన జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ. ఈ చట్టంలో పొందుపరచబడిన అంశాల ప్రకారం న్యాయ సేవలు అందించటానికి విధివిధానాలను సూత్రాలను రూపొందిస్తుంది. న్యాయ సేవలకు తక్కువ వ్యయంతో సమర్థవంతమైన న్యాయ సేవలు అందించడానికి పథకాలను రూపొందిస్తుంది. న్యాయ సహాయ పథకాలు, కార్యక్రమాలను అమలు చేయటానికై స్వచ్ఛంద సంస్థలకు, రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థలకు ఈ సంస్థ నిధులను అందజేస్తుంది.

ప్రతి రాష్ట్రంలోనూ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఉంటుంది. జాతీయ స్థాయి సంస్థ రూపొందించిన విధి విధానాలను, ఆదేశాలను ఇది అమలు చేస్తుంది. రాష్ట్రంలోని ప్రజలకు న్యాయ సేవలను అందిస్తుంది. లోక్ అదాలత్‌లను నిర్వహిస్తుంది. రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థకి అధిపతిగా, ప్యాట్రన్-ఇన్-చీఫ్‌గా రాష్ట్ర హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ఉంటారు. పదవిలో ఉన్న లేదా పదవీ విరమణ చేసిన హైకోర్టు జడ్జిని దీనికి కార్యనిర్వాహక చైర్మన్‌గా నామినేట్ చేస్తారు.

న్యాయ సహాయ కార్యక్రమాలు, పథకాలను అమలు చెయ్యటానికి ప్రతి జిల్లాల్లో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేశారు. ఆ జిల్లా జడ్జి దీనికి ఎక్స్ - అఫిషియో చైర్మన్‌గా ఉంటారు, ఇతర సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.

ప్రతి మండలం లేదా కొన్ని మండలాలకు మండల లేదా తాలూకా, న్యాయ సేవల సంఘాలు ఉంటాయి. ఆ పరిధిలో లోక్ అదాలత్‌లను నిర్వహించటం, న్యాయ సేవా కార్యక్రమాలను సమన్వయం చేయటం దీని బాధ్యత. సంఘ పరిధిలో పని చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవల సంఘానికి అధిపతిగానూ, ఎక్స్-అఫిషియో చైర్మన్‌గానూ ఉంటారు.

## న్యాయ సేవల ప్రాధికార సంస్థల విధులు

**న్యాయాలు సేవల ప్రాధికార సంస్థ వివిధ స్థాయిలలో ఈ క్రింద పేర్కొన్న విధులను నిర్వర్తిస్తుంది.**

- చట్టంలో పొందుపరిచిన ప్రకారం అర్హులైన వ్యక్తులకు న్యాయ సేవలను అందించటం
- లోక్ అదాలత్‌లను నిర్వహించటం
- ముందస్తు నివారణ, వ్యూహాత్మక న్యాయ సహాయ కార్యక్రమాలను చేపట్టటం
- న్యాయ సేవల ప్రాధికార సంస్థ నిర్ణయించే ఇతర విధులను నిర్వర్తించటం.

### న్యాయ సేవల ప్రాధికార సంస్థ ద్వారా ఎటువంటి న్యాయ సహాయ సదుపాయాలు అందుతాయి?

లోక్ అదాలత్‌లద్వారా న్యాయ సేవల ప్రాధికార సంస్థ దీర్ఘకాలంగా కోర్టుల్లో ఉన్న కేసులను తక్కువ కాలంలో, ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కరిస్తుంది. వైవాహిక విభేదాలు, భరణానికి సంబంధించిన కేసులు, భర్త, అత్తవారింటి వేధింపులకు సంబంధించిన కేసులు, గృహ హింస కేసులు అన్ని రకాల సివిల్ కేసులు భూ వివాదాలు, చట్టరీత్యా రాజీకి అర్హమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు వంటి వాటిని ఇది చేపట్టవచ్చు. ఈ విధమైన కేసులను ఎటువంటి రుసుములు, ఖర్చులు లేకుండా లోక్ అదాలత్‌ల ద్వారా అందరికీ ఆమోద యోగ్యరీతిలో శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చు.

కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులలో ఇరు పార్టీలుకానీ లేదా ఏదైనా ఒక పార్టీ కానీ పరిష్కారం కోసం కేసును లోక్ అదాలత్‌కు బదిలీ చేయమని కోరుతూ కోర్టులో దరఖాస్తు చేసుకోవాలి. కేసు పరిష్కారానికి అవకాశం ఉందని సంతృప్తి చెందితే అప్పుడు సంబంధిత కోర్టు ఆ కేసును లోక్ అదాలత్‌కి పంపిస్తుంది.

వ్యాజ్యానికి వెళ్లకముందే అంటే కోర్టుకి వెళ్లటానికి ముందే వివాదాల పరిష్కారానికీ కక్షి దారులు సంబంధిత జిల్లా స్థాయి న్యాయ సేవాధికార సంస్థను గానీ లేదా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థనుగానీ సంప్రదించవచ్చు.

## న్యాయ సేవల సంస్థ ద్వారా ఎవరు ప్రయోజనం పొందవచ్చు?

కింద పేర్కొన్న వ్యక్తులు ఉచిత న్యాయసహాయానికి అర్హులు:

1. షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ జాతులకు చెందిన వ్యక్తులు
2. మానవ అక్రమ రవాణా బాధితులు, బిక్షాటకులు
3. స్త్రీలు, పిల్లలు
4. మతి స్థిమితం లేనివారు లేదా అంగ వైకల్యం ఉన్నవారు
5. పెను విపత్తు, జాత్యాహంకార హింస, కుల వైషమ్యాలు, వరదలు, కరువులు, భూకంపాలు, పారిశ్రామిక విపత్తులకు గురైనవారు.
6. పారిశ్రామిక కార్మికులు
7. వ్యభిచార వృత్తి (నివారణ) చట్టం, 1956లో సెక్షన్ 2, క్లాజు (జి) ప్రకారం రక్షణ గృహం, లేదా బాల నేరస్తుల న్యాయ చట్టం, 1986లోని సెక్షన్ 2, క్లాజు (జె) ప్రకారం బాల నేరస్తుల గృహం

లేదా మానసిక ఆరోగ్య చట్టం 1987లో సెక్షన్ 2, క్లాజు (జి) ప్రకారం మానసిక వ్యాధి చికిత్సాలయం లేదా మానసిక రోగుల సంరక్షణాలయంలో నిర్బంధంలో ఉన్న వ్యక్తులు.

8. లక్ష రూపాయలలోపు వార్షిక ఆదాయం ఉన్న వ్యక్తులు.

పైన పేర్కొన్న వారిలో ఏ వ్యక్తులైనా సహాయం పొందటానికి అర్హులని సంబందిత న్యాయ మూర్తి సంతృప్తి చెందితే వారు తగిన న్యాయ సేవలు పొందవచ్చు.

## ఎవరికి ఎలా దరఖాస్తు చెయ్యాలి?

దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న తమ వివాదాలు, తగాదాలు, కోర్టు కేసులను పరిష్కరించుకోదలచిన వ్యక్తులు తమ కేసు పూర్వపరాలు, కావలసిన పరిష్కారం, వివరిస్తూ సంబంధిత పత్రాలు మరియు తమ అర్హతను తెలియజేసే పత్రాలతో అఫిడవిట్ దాఖలు చేసి సత్వర, ఉచిత న్యాయాన్ని కోరవచ్చు.

వివిధ స్థాయిలలో ఎవరికి దరఖాస్తు చేయాలో ఇక్కడ పేర్కొన్నాం:

**జిల్లాస్థాయిలో** – కార్యదర్శి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, జిల్లా కోర్టు భవనాలు.

**రాష్ట్రస్థాయిలో** – సభ్యకార్యదర్శి, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ, న్యాయ సేవాసదన్, సిటీ సివిల్ కోర్టు భవనాలు, హైకోర్టు భవనాలు, హైదరాబాదు – 500 066 (లేదా)

హైకోర్టులో ఉన్న కేసులలో న్యాయ సహాయం కోరే వ్యక్తులు కార్యదర్శి, హైకోర్టు న్యాయ సేవల ప్రాధికార సంస్థ, హైకోర్టు భవనాలు, హైదరాబాదు – 500 066.

## లోక్ అదాలత్ వల్ల ప్రయోజనాలు, వివాదాల పరిష్కారం

1. ఎటువంటి కోర్టు రుసుము ఉండదు, ఒక వేళ కోర్టు రుసుము అప్పటికే చెల్లించి ఉంటే లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరింపబడినప్పుడు నియమాలకు లోబడి రుసుమును తిరిగి చెల్లిస్తారు.
2. వివాదాల వేగవంత విచారణ, విధానంలో వెసులుబాటు అన్నవి లోక్ అదాలత్‌లోని ముఖ్యమైన అంశాలు. వివాదాలను లోక్ అదాలత్ పరిష్కరించే క్రమంలో పౌర విచారణ స్మృతి సాక్షాల చట్టం వంటి వాటిల్లో పేర్కొన్న విధానాలను ఖచ్చితంగా పాటించాలని లేదు.
3. తమ సలహాదారు ద్వారా వివాదంలోని కక్షిదారులు నేరుగా జడ్జితో సంభాషించవచ్చు. ఇది సాధారణ న్యాయ స్థానాల్లో సాధ్యంకాదు.
4. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పును వాది, ప్రతివాదులు గౌరవించాలి. సివిల్ కోర్టు ఇచ్చే తీర్పుకి ఉండే విలువ దీనికి కూడా ఉంటుంది. వివాద అంతిమ పరిష్కారం ఆలస్యం కాకుండా ఉండటానికి దీనిపై అప్పీలును అనుమతించరు.
5. అడ్వకేట్ల ద్వారా ఉచిత న్యాయ సలహా అందిస్తారు. కోర్టులలో కేసును వాదించటానికి అడ్వకేట్లను నియమిస్తారు; ఉచిత న్యాయ సేవలు, మద్దతుకి అర్హులైన వ్యక్తులకు సంబంధించిన కోర్టు కేసులలో కోర్టు ఖర్చులను భరిస్తారు, తీర్పు నకళ్లను ఉచితంగా అందచేస్తారు.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| సమాచారం | అప్పిలేట్ అధికారి | రికార్డు ప్రభుత్వ అధికారి | పారదర్శకత |
| న్యాయసేవ | లోక్ అదాలత్ | గృహ హింస | సివిల్ కేసులు |
| బాల నేరస్తుల గృహం | ప్రభుత్వ అధికారి | | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది కథనం ఆధారంగా సమాచార హక్కు చట్టం నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల, పౌరుల పాత్రలను వివరించండి. సమాచార హక్కు చట్టం వల్ల ప్రభుత్వ పని మరింత పారదర్శకంగా ఎలా అవుతుందో రాయండి.

   *కింద పేర్కొన్న ఘటన మెదక్ జిల్లాలోని చిన్నశంకరంపేటలో జరిగింది. స్వయం సహాయక బృందాల సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ పథకాలైన అభయ హస్తం, ఆమ్ ఆద్మీలలో చేరారు. ఈ పథకం కింద 9 నుంచి 12 తరగతులు చదువుతున్న పిల్లలకు 1200 రూపాయల స్కాలర్‌షిప్ పొందడానికి అర్హత ఉంది. అయితే 2008-11 మధ్య మూడు సంవత్సరాల పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తం అందలేదు. విద్యార్థులు ఇందిరా క్రాంతి పథం (IKP) కార్యాలయానికి వెళ్లి అడిగారు. కానీ అక్కడి అధికారులు వాళ్లను పట్టించుకోలేదు.*

   *ఇది స్థానిక దినపత్రికల దృష్టికి వచ్చింది. ఆమోదించిన స్కాలర్‌షిప్పుల వివరాలు ఇవ్వమంటూ వాళ్లు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేశారు. 2008-09, 2009-10, 2010-11 సంవత్సరాలలో లబ్ధిదారుల సంఖ్య, మంజూరు చేసిన మొత్తం ఎంత అని అడిగారు. వాళ్లకు ఒక వారంలోపు సమాచారం వచ్చింది. మొత్తం ఏడు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. సమాచార హక్కు ద్వారా అందిన వివరాలను బట్టి డబ్బు మంజూరయ్యింది కానీ, దానిని పంచలేదని తెలిసింది. ఈ విషయం వార్తాపత్రికలలో ప్రచురితం కాగానే 15 రోజుల లోపు 1167 విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందచేశారు.*

2. సమాచార హక్కు చట్టం వల్ల ప్రభుత్వం పనిని మెరుగు పరచటం, పర్యవేక్షించటం ఎలా సాధ్యమవుతుంది?
3. సమాచారం అని దేనిని అంటారు? ఇది ప్రభుత్వ శాఖలలో ఎలా ఉత్పన్నమవుతుంది? పై అధికారి, కింది అధికారి మధ్య జరిగే మౌఖిక సంభాషణ సమాచారం అవుతుందా?
4. రాష్ట్ర, కేంద్ర సమాచార కార్యాలయాలకు స్వయంప్రతిపత్తి ఎందుకు ఇచ్చారు?
5. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఉన్న అసలైన స్ఫూర్తిని తెలియచేస్తుంది. దీనిని మీరు ఎలా సమర్థిస్తారు?
6. దేశంలోని వివిధ ప్రభుత్వ శాఖలనుంచి ఏ పౌరుడికైనా సమాచారం అందుబాటులో ఉండేలా చెయ్యటానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?
7. న్యాయ సహాయం ఆశించే ప్రజలకు న్యాయ సేవల ప్రాధాన్యత సంస్థ ఏ విధంగా దోహదపడుతుంది?
8. లోక్ అదాలత్ ఉద్దేశం ఏమిటి?
9. ఈ చట్టం కింద చేపట్టే కేసులు, ఉచిత న్యాయ సేవలు పొందటానికి పేర్కొన్న అర్హతలపై మీ అభిప్రాయం ఏమిటి?
10. గ్రామ పెద్దలు, కోర్టులు వివాదాలు/ తగాదాలను పరిష్కరించే విధానాలను పోల్చండి. మీరు దేనిని ఇష్టపడతారు, ఎందుకు?

## తెలుసుకోండి! అందరికీ తెలియజేయండి!

# మీ కుటుంబ కష్టార్జిత ధనాన్ని కాపాడుకోండి

నేటి విద్యార్థులే రేపటి పొదుపు దారులు మరియు డిపాజిటర్లు. అందువలన మన కష్టార్జిత ధనాన్ని కొన్ని వినూత్న స్కీములు మరియు ఆలోచనలతో మనల్ని మోసం చేసే వ్యక్తులకిచ్చి మోసపోకుండా ఎలా ఉండాలో నేర్చుకోవాలి. మీ కుటుంబ సభ్యులకు మరియు మీ స్నేహితులకు కూడా అటువంటి మోసగాళ్ళ వల్ల మోసపోకుండా మీరు తెలుసుకున్న విషయాలను వారికి కూడా తెలియపరచండి.

ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, డబ్బు అరుదైన వస్తువు మరియు సులువుగా దొరకదు. దానిని కష్టపడి సంపాదించుకోవాలి. ఎవరైనా మన డిపాజిట్లపై సాధ్యం కాని రీతిలో అధిక రాబడి అందిస్తామంటూ ఆశ చూపితే వారు మోసపూరిత ఉద్దేశ్యాలతో మనల్ని ప్రలోభ పెడుతున్నారని మనం అర్థంచేసుకోవాలి. ఎప్పుడైతే బ్యాంకులే సాధారణ వడ్డీరేటు అందిస్తున్నప్పుడు, ఇతర వ్యక్తులు లేదా సంస్థలు అధిక వడ్డీరేట్లు ఏ విధంగా ఇవ్వగలరని మనం ఆలోచించాలి. అధిక వడ్డీ రేటుకు ఆశపడి ఒక్కసారి మన డబ్బును అటువంటి వ్యక్తులకు/ సంస్థలకు ఇస్తే ఆ డబ్బు మనకు తిరిగి వచ్చే ఆస్కారం వుండక పోవచ్చని గుర్తించాలి. ఎందుకంటేమోసగాళ్ళు ప్రజల దగ్గర నుంచి డబ్బు సేకరించి మాయమవుతారు. అందువలన ఇలా అధిక వడ్డీ రేటు ఇస్తామని లేదా అధిక రాబడి పొందొచ్చని ఆశ చూపే వ్యక్తులకు మన డబ్బును ఇవ్వకూడదు.

ప్రజల దగ్గర నుండి డిపాజిట్లు సేకరించడానికి బ్యాంకులకే కాకుండా కొన్ని నాన్–బ్యాంకింగ్ సంస్థలకు కూడా భారతీయ రిజర్వు బ్యాంకు (RBI) అనుమతినిచ్చింది. ఎవరైనా తమ ధనాన్ని అటువంటి నాన్–బ్యాంకింగ్ సంస్థలో డిపాజిట్ / జమ చేసే ముందు, ఆ సంస్థ నిజంగా ఆర్.బి.ఐ. దగ్గర నమోదైయిందో లేదో మరియు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించుటకు ప్రత్యేక అనుమతి పొందిందో లేదో నిర్ధారించుకోవాలి. అలా అనుమతిపొందిన సంస్థల పేర్లు ఆర్.బి.ఐ. వారి వెబ్‌సైట్ నందు చూపబడినవి. కొంత మంది మోసగాళ్ళు ఆర్.బి.ఐ. పత్రములు నకలు చేసి ప్రజలను మోసం చేయడం కూడా జరుగుతోంది. మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

అధిక రాబడి అంటే  అధిక నష్టం కూడా కలగవచ్చని మనం గ్రహించాలి. స్పెక్యులేషన్ కార్యకలాపాలతో ఖచ్చిత లాభాలు సాధ్యం కాదు. ఏ వ్యక్తీ డబ్బును ఉచితంగా ఇవ్వడు. ఇంటర్నెట్‌లో డిపాజిట్లు కోరుతూ అధిక రాబడి లేదా బహుమతులు పొందగలరంటూ ప్రామిస్ చేసే స్కీముల మాయలో మనం పడకూడదు. మల్టీలెవల్ మార్కెటింగ్ లేదా పిరమిడ్ స్ట్రక్చర్ తరహా స్కీములు మిమ్మల్ని ముందుగా కొంత డబ్బు డిపాజిట్ చేసి సభ్యునిగా చేరమంటాయి. ఆ తరువాత మీకు అధిక రాబడి లేదా వడ్డీ కావాలంటే మరికొంత మందిని సభ్యునిగా చేర్చమని అడుగుతాయి. అటువంటి స్కీముల వల్ల మోసగింపబడకుండా జాగ్రత్తగా ఉండాలి.

మనం తెల్సుకోవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాన్–బ్యాంకింగ్ సంస్థలలో మనం జమచేసే డిపాజిట్లకు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్.బి.ఐ.) నుంచి కానీ భారత ప్రభుత్వం నుంచి కానీ ఏ విధమైన బీమా కానీ హామీ కానీ ఉండదు.

మీరు తెలుసుకున్న ఈ విషయాలను మీ కుటుంబ సభ్యులకు, మీ స్నేహితులకు, వారి కుటుంబాలకు కూడా తెలియపరచి మోసగాళ్ళ నించి అధికరాబడి/ వడ్డీ ఆశ చూపుతూ చేసే మోసాల నుంచి జాగ్రత్తగా ఉండమని వారిని కూడా చైతన్య వంతులను చేయండి. ఎందుకంటే ఈ రోజు మీరు తెలుసుకున్న ఈ విషయాలు వాళ్ళకు ఇప్పటి వరకు తెలిసి ఉండకపోవచ్చు కదా !

ప్రజాప్రయోజనం కోసం జారీ చేయబడినది.

భారతీయ రిజర్వు బ్యాంకు

RESERVE BANK OF INDIA

www.rbi.org.in




# మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్/ఎస్‌ఎంఎస్‌లకు కాల్స్ వల్ల మీరు

# మోసపోవద్దు




మీరు లాటరీ గెలుచుకున్నారనో లేదా విదేశాల నుంచి పెద్ద ఎత్తున డబ్బు వస్తుందనో మీకు తెలియజేస్తూ ఎప్పుడైనా మీకు ఇమెయిల్/ఎస్ఎంఎస్/కాల్ అందిందా?

లేదా మీ వ్యాపారానికి తక్కువ వడ్డీకే డబ్బులు ఇస్తామంటూ ఎవరైనా మీకు తెలియజేశారా?

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గవర్నరు ఫోటోతో ఉన్న లెటర్‌హెడ్ మరియు మీ కోసం ఆర్‌బిఐ వద్ద డబ్బు ఉన్నాయని, కస్టమర్ ఐడి మరియు పాస్‌వర్డ్ లాంటి మీ బ్యాంకు యొక్క ముఖ్యమైన వివరాలను అందజేస్తే లేదా కొద్దిగా డబ్బు చెల్లిస్తే ఆ మొత్తాన్ని విడుదల చేస్తామని తెలియజేస్తూ సీనియర్ ఆర్‌బిఐ అధికారి చెప్పినట్లుగా మీకు ఇమెయిల్ అందిందా?

**ఇలాంటి వాటిని నమ్మకండి. అధికారి ఎవరైనా లేదా చూడటానికి అవి ఎంత ఆకర్షణీయంగా ఉన్నాసరే, అవి నకిలీవే. ఆర్‌బిఐ ఎప్పుడూ ఇలాంటి ఇమెయిల్స్ పంపదు.**

- భారతదేశంలోని లేదా విదేశాల్లోని తెలియనివారెవ్వరికీ ప్రారంభ డిపాజిట్/కమీషన్/బదిలీ రుసుం కింద డబ్బు ఏమీ పంపవద్దు.
- మీ బ్యాంకు అకౌంట్ నంబరు/ వివరాలను లేదా మరేదైనా ఇతర సంబంధిత సమాచారాన్ని ఎవ్వరికీ ఫోన్ లేదా ఇమెయిల్ ద్వారా వెల్లడించకండి.
- ఏదైనా డబ్బు అందుతుందనే ఆశతో భారతదేశం లేదా విదేశాల్లో ఏ వ్యక్తితోనూ ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపవద్దు.
- ఏ వ్యక్తి/ సంస్థ/ ట్రస్టు యొక్క అకౌంట్‌లు లేదా ఫండ్స్ కూడా ఆర్‌బిఐ వద్ద ఉండవు.
- జాగ్రత్తగా ఉండవలసిందిగా మీ స్నేహితులకు/ కుటుంబ సభ్యులకు తెలియజేయండి.
- ఇలాంటి మోసపూరిత ఆఫర్‌ల విషయాన్ని సైబర్ సెల్/ ఇతర చట్టాలను అమలుజేసే ఏజెన్సీల దృష్టికి తీసుకురండి.
- మరిన్ని వివరాలకు దయచేసి ఆర్‌బిఐ వెబ్‌సైట్‌ని సందర్శించండి.

**గుర్తుంచుకోండి.. ఎవ్వరూ కూడా ఉచితంగా వేరొకరికి డబ్బు ఇవ్వరు.**

ప్రజాప్రయోజనం కోసం జారీ చేయబడినది.

**భారతీయ రిజర్వు బ్యాంకు**

**RESERVE BANK OF INDIA**

www.rbi.org.in